గొల్లపూడి

కాశీ మజిలీ కథలు

3 & 4 భాగములు



బ్రహ్మశ్రీ మధిర సుబ్బన్న దీక్షితులు

కాశీ మజిలీ కథలు

(AN EVERGREEN CLASSIC IN TREDITIONAL PROSE)

ఒకే సంపుటముగా

మూడు, నాలుగు భాగములు

ఇయ్యది గోదావరీ తీర స్థితంబైన
రాజమహేంద్రవరపురంబున నివశించియున్న
బ్రహ్మశ్రీ మధిర సుబ్బన్న దీక్షిత కవిచే
రచింపబడినది

(ఇది ద్వితీయ సంపుటము)

సరళ సుమధుర వచనం:

శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం
భాషా ప్రవీణ

ప్రకాశకులు

ఫోన్:2465253
గొల్లపూడి వీరాస్వామిసన్
పబ్లిషర్స్ & బుక్‌సెల్లర్స్
కోటగుమ్మం-రాజమండ్రి- 533 101

కాశీ మజిలీ కథలు-ద్వితీయ సంపుటము

కాశీ మజిలీ కథలు

3వ భాగము

19 వ మజిలీ

శ్లో॥ శ్రీమద్గౌరీ లతాశ్లిష్టం జటా వల్లవ శోభితమ్।
విబుధా భీష్టం ఫలదం శంభు కల్పద్రుమమం భజే ॥

జయభద్రుని కథ

పందొమ్మిదవ మజిలీలో, గోపాలుడు నగర విశేషాలు చూసి వచ్చి మణిసిద్ధుని పాదాల చెంతకొచ్చి కూర్చున్నాడు. గురువుగారికి తాను చూసిన విశేషాలు వివరించసాగాడు.

"మహాత్మా! ఈ నగరం మధ్యలో పెద్ద కోట ఉంది. అక్కడకు జనం గుంపులు గుంపులుగా చేరుతూండడంతో నేను కూడా ఆ ప్రదేశానికి చేరుకున్నాను. వృత్తాకారంలో ఆ కోట ముందుభాగాన మూగివున్న ప్రజలమధ్య దూరాను. అక్కడ నాకొక వింత కనిపించింది.

కణకణ మండే నిప్పులతో చిటపటలాడుతున్న చితి ఒకటి అక్కడుంది. ఆకాశం ఎత్తున మంటలు లేస్తున్నాయి. పొగలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఆ చితి అక్కడ ఎందుకున్నాదా? అని నేను ఆలోచిస్తూండగానే అగ్నిదేవునికి దోసిలితో పుష్పాంజలి సమర్పించి, చక్కగా అలంకరించుకొనివున్న ఓ స్త్రీ అతి వేగంగా ఆ చితిలో దూకేసింది. "నేను పతిభక్తిలేని దానినీ కామంతో కన్నూమిన్నూగానక చరించిన దానినీ అయితే,

ఈ అగ్నికి నేను ఆహుతైపోవుదునుగాక" అంటూ ఆమె పలికింది. ఆమె అగ్నిలోనికి దూకుతూండగా ఎవ్వరూ ఆమెను అడ్డుకోలేదు. ఆపలేదు. నాకు మాత్రం చెప్పరానంత ఏడుపు వచ్చినా, వాళ్లందరూ నారాయణ స్మరణం చేస్తూ ఉండిపోయారు.

అగ్నిదేవునికే దయకలిగి చల్లబడ్డాడా అనిపించే విధంగా ఆమె చితిలోకి అలా దూకిందో లేదో, మంటలు చప్పున నీరు జల్లినట్లు చల్లారి పోయాయి. ఇంకా చిత్రమేమిటంటే నిప్పుల్లో దూకి ఇసుమంతైనా కందిపోకుండా, ఆస్త్రీ పుటంపెట్టిన బంగారంలా మెరిసిపోతోంది. అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక యువకుడా చక్కని చుక్క చెంత చేరి "నా ప్రాణ ప్రియా! నీవు పవిత్రురాలివి నిస్సందేహంగా నీలో ఏ కళంకం లేదు" అంటూ చేతులు సాచి ఆమెను ఆహ్వానిస్తూ మంగళ వాయిద్యాలతో సహా కోటలోనికి తీసుకెళ్లాడు.

ఆశ్చర్యకరంగా ఉన్న ఆ వృత్తాంతం గురించి నేను ఎవ్వర్ని అడిగినా నాకు బదులు చెప్పేవారొక్కరూ కనిపించలేదు. 'ఆ వృత్తాంతం సంపూర్ణంగా మా అయ్యవారికి తెలుసువారినోటనే వింటాను' అనుకుంటూ మీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చేశాను. ఈ శిష్యుని మీద దయవుంచి, ఆ కథ నాకు తెలియజేయండి" అని అడిగాడు గోపాలుడు.

మణి ప్రభావం వల్ల, ఆ ఉదంతం యావత్తు, గురువునకు ఆకళింపు కావడం వల్ల, అతడు ఇలా చెప్పడం ప్రారంభించాడు.

"గోపాలా! విను! ఈ నగరంపేరు మణిప్రస్థం. కుంతి భోజుడు అనే వాడు దీనికి రాజు. అతడి భార్య సుమతి. ఆ రాజదంపతులకు సంతానం ఏడుగురు పుత్రులు. వారిలో చివరి వాడు జయభద్రుడు. దైవజ్ఞులు ఆ బాలుని జాతకం పరిశీలించి, భార్య వల్ల ఇతడు గొప్పకీర్తిని పొందగలడు. అని స్పష్టం చేశారు. అంగసాముద్రికం తెలిసిన వాళ్లు కూడా ఆ పిల్లవాని అవయవ లక్షణాలు పరిశీలించి అది ముమ్మాటికీ నిజమే అని బలపరిచారు.

కుంతిభోజుడికి ఆ పిల్లవాని మీద ప్రత్యేక దృష్టి ఏర్పడి అసాధారణంగా పెంచాలని పించింది. సరైన సమయంలో విద్యాబుద్ధులు నేర్పించడంలో తగుశ్రద్ధ కనపరచడానికి రాజు నిశ్చయించుకున్నాడు. ఆ

కుర్రవానికి యుక్తవయసు రాగానే సుమిత్రుడనే వాడిని అతడి ఈడువాడినే జతపరచి, పదిమంది వేర్వేరు శాస్త్రాలలో గొప్పవారిని ఏర్చి కూర్చి వారిద్దరికీ గురువులుగా నియమించాడు. కాలక్రమాన ఇద్దరికీ సకలశాస్త్రాలు పట్టుబడ్డాయి. అన్ని కళలలోనూ పాండిత్యం అబ్బింది.

అయితే - ఇన్ని కళలూ నేర్చినా జయభద్రునికి శృంగారశాస్త్రంలో కనీసం అభిరుచి అయినా కలగలేదు. వాత్సాయన కామసూత్రాలు, అనంగరంగం, రతిరహస్యం, రతిమంజరి, రతిరత్నాకరం, రసమంజరి వంటి శృంగార శాస్త్రగ్రంథాలన్నీ ఆ గురువు శిష్యునికి ఎంత బోధింపజూసినా, అవి జయభద్రునికి అభిరుచి కలిగించలేదు. పైగా అవన్నీ ఉపయోగం లేనివని ఆ ఉపాధ్యాయునితో వాదిస్తూండేవాడు జయభద్రుడు.

ఇతర విద్యలు నేర్పిన గురువులకు అధికంగా పారితోషికాలు అందాయి. ఆయా విద్యలలో జయభద్రుడు మొదటి వాడుగా ఉత్తీర్ణుడవుతూ వచ్చాడు. శిష్యుడికి అభిరుచి లేకపోవడం వల్ల - కేవలం ఈ శృంగార శాస్త్ర గురువు గారెంతగా ప్రయత్నించినా, జయభద్రుని ఆ విషయంలో ప్రథముడిగా చూడ లేకపోయాడు. అది ఆయనకూ బాధగానే ఉంది.

ఎన్నిసార్లు చెప్పినా రసం, స్థాయీభావం, విభావం, అనుభావం మొదలైనవి జయభద్రునికి వొంటబట్టలేదు. ఇవి తెలుసుకుంటే తప్ప రాజులు రసిక పురుషులు కాలేరని కూడ ఆ శాస్త్రం నేర్పే ఉపాధ్యాయుడు చెప్పి చూశాడు. స్త్రీలలోని జాతులు, వారి అవస్థా భేదాలు, నాయికలలక్షణాలు, వయస్సును బట్టి తత్త్వభేదాల్నిబట్టి స్త్రీల విశేషాలు, భావాలు, చేష్టలు మళ్లీ మరోసారి బోధించాడు.

అందరూ ఎంతో శ్రద్ధగా పఠించే శృంగార శాస్త్రంలో, రాజకుమారునికి తగిన ప్రజ్ఞ అలవడకపోతే తన గౌరవం నిలిచేదిలేదని గ్రహించిన ఆ గురువు ఎన్నో సార్లు ప్రయత్నించాడు. కాని జయభద్రుడికి అదంతా చెత్త వలె తోచి "చిత్త వికారానికి ఇన్ని పేర్లు పెట్టాలా? సృష్టిలో పశుపక్ష్యాదులకు కూడా ఇదే శృంగార రసం లేదంటారా? అవన్నీ పేర్లు తెలిసే ఈ క్రియ చేస్తున్నాయంటారా?" అంటూ వాదానికి దిగేవాడు.

గురుశిష్యుల మధ్య జరిగే ఈ వాదులాట ఎన్నోసార్లు విన్నాడు సుమిత్రుడు. ఇతర రసాలు వినీ- చూసీ గ్రహించవచ్చు! కాని ఈ శృంగారం అనేది అనుభవంలోకి వస్తే తప్ప బోధపడదు. ఒక్కసారైనా అది అనుభవంలోకొస్తే, చొరవచేసి అందులో అతడే ప్రథముడిగా నెగ్గుకు రాగలడని సుమిత్రుడు గ్రహించాడు. "గురుదేవా! మీరు ఎంతో శ్రమించి శ్రద్ధ తీసుకుని శాస్త్రం బోధించారు. నా మిత్రునికీ శాస్త్రంలో ఇచ్ఛ కలిగేందుకు నావంతు ప్రయత్నం నేను చేస్తాను. మీరు కొంతకాలం విశ్రాంతి తీసుకోండి" అని గుర్రపుబండీ ఎక్కించి గురుదేవుల్ని ఇంటికి పంపించేశాడు సుమిత్రుడు. తర్వాత తన స్నేహితుడిని వెంట తీసుకుని ఆ నగరపు వేశ్యావాటికవైపు నడిపించాడు.

నడిస్తేనే కందిపోయేంత సుకుమారంగా, ఏనాడూ ఎండ కన్నెరగకుండా పెరిగిన ఆ రాజకుమారుడు, సుమిత్రుడితో కూడ అలా నడిచివెళ్తుంటే వారవనితలు శృంగారపు చూపులు రువ్వుతూ, జయభద్రుని వైపు చూడసాగారు. జయభద్రుడు కూడ అంతకు ముందెన్నడూ అటువంటి స్త్రీలను చూసి ఉండని కారణం వల్ల వాళ్ల వంక ఆతృతగా వింతగా మళ్లీ మళ్లీ వెనుదిరిగి చూడసాగాడు. వారి చిరునవ్వులు విలాసాలు - వయ్యారాలు... ఒకటేమిటి? అన్నీ ఆ రాజకుమారుని హృదయాన్ని చీల్చేస్తున్న అనుభూతికి గురిచేశాయి. శృంగారపు చూపుల పదునెలా ఉంటుందో తెలియజేశాయి.

ఆ వేశ్యల విశేషాలు సుమిత్రుడు వివరిస్తూంటే వింటూ నడుస్తున్నాడా రాజపుత్రుడు. వృత్తిధర్మమే పరమధర్మంగా భావించే 'చంద్రిక' అను వారసుందరి రాజకుమారుని వైపు నుంచి చూపు తిప్పుకోలేకపోయింది. ఆమె హృదయాన్ని అంతగా దోచుకున్నాడు జయభద్రుడు. ఎలాగైనా సరే! అతడ్ని తన వశం చేసుకోవాలనుకుంది. తన చేయి దాటిపోనీయకూడదనుకుంది. అంత వేశ్యావాటికలోన తన ఇంటనే ఆ రాజపుత్రుని కట్టిపడవేయగల తన సామర్థ్యాల్ని అందచందాల్ని తలచుకొంది. ఈ పనిని నైపుణ్యంగా నెరవేర్చగల చెలికత్తెను తక్షణమే వారి దగ్గరకు పంపింది.

ఆ చెలికత్తె వారిద్దరికీ దారి సాగనీయక అడ్డుపడి "ఆర్య పుత్రులారా! మీకు నా వందనాలు. ఇంతటి సుకుమార సుందర విగ్రహాలు నేలమీద పాదాలు కందిపోయేలా నడుస్తూంటే. చూడడానికి ఎంతో బాధవేస్తున్నది ఎంతటి వారికైనా శ్రమని మరపింపజెయ్యగలదు మా చంద్రిక. ఆ పరిచర్యలు గైకొని వెళ్లవచ్చును. మా ఇంటిని పావనం చేయవలసిందిగా నా కోరిక" అని ఆప్యాయత- వినయం కలబోసి మరీ ఆహ్వానించేసరికి, ఆ మిత్రులు కాదన లేకపోయారు. చంద్రిక ఇంటివైపు దారి చూపుతుండగా వారిద్దరూ అటువైపు నడిచారు.

జాణతనంలో నేర్పరి అయిన ఆ వేశ్య, వారిని ఎదురేగి చక్కని స్వాగతం పలికింది. అపూర్వమైన మర్యాదలు చేసి వాళ్లని ఆకట్టుకుంది. మార్గాయాసం మరచిపోయేలా మృదువైన ఆసనం అమర్చి, ఉపచారాలు చేసింది. వారిద్దరి ఆకార విశేషాలు మెచ్చుకుంటూ గౌరవ ప్రదమైన వారని ప్రశంసిస్తూనే తన గురించి కూడా చమత్కారంగా చెప్పుకుంది. వారి పరిచయాన్ని కోరింది.

సుమిత్రుడు కూడ చంద్రికని మెచ్చుకుని "వయ్యారీ! పరోపకారంలోన నీవు చూపిన చొరవ చిరునవ్వులికే నీ మోము నీ సేవలతీరు ఎవరి హృదయాన్నయినా దోచుకుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే- కులానికే తప్ప గుణానికి నీవు గణికవు కావు. అంతగా మా రాజకుమారునికి నచ్చావు. ఈతడెవ్వరో తెలుసా? ఈ పుర ఏలిక అయిన కుంతిభోజుని ఏడవ పుత్రుడు. పేరు జయభద్రుడు నేను సుమిత్రుడనే ఇతని మిత్రుడిని. పట్టణంలో విశేషాలు చూడాలనుకొన్న నా మిత్రుని కోరికపై మేము పాదచారులమై రహస్యంగా ఈ వీధిలోకి అడుగుపెట్టాము. ఇతడికీ వేశ్యావాటిక పూర్తిగా కొత్త. ఎప్పుడూ రాజ మందిరం కదిలి ఎరుగడు" అని తమ పరిచయం చేసుకున్నాడు.

అతడు రాజకుమారుడని తెలియడంతోనే, ఆ గణిక తాను చూపించే మర్యాదల్లో రెట్టింపు శ్రద్ధ కన్పరచింది. మన్మథబాణాలు నాటిన చూపులతో, చిరునవ్వుల రువ్వులతో అతడ్ని పూర్తిగా వశపరుచుకుంది. వీవనవీచడం, పన్నీరు పునుగు- జవ్వాజి- అత్తరు వంటి పరిమళ ద్రవ్యాలను అతడి

శరీరానికి మర్దించడం వంటి రాజోపచారాలెన్నో చేసింది. మత్తెక్కించే సువాసనలు వెదజల్లే పుష్పమాల అతని మెడలో వేసింది. చాలా చనువుగా, రాజకుమారుని చేయి పట్టుకుని ఆ మందిరానికి వన్నె తెచ్చే పూల పాన్పుపై కూర్చోబెట్టింది.

కోమలమైన ఆ స్త్రీ స్పర్శకు, జయభద్రునికి నిజంగానే దేహం వశం తప్పింది. మదన వికారాలు మొదలయ్యాయి. ఆ చిహ్నాలు సుమిత్రుడు గ్రహించేశాడు.

ఈలోగా సాయంకాలం అయిందని సూచించేలా రాజనగారా మోగింది. ఆ ఘంటిక శబ్దం విన్న సుమిత్రుడు కొంత తత్తరపడి "చంద్రికా! రాజుగారికి తెలియకుండా ఇటు వచ్చాం! బయలుదేరి చాలా సేపైంది కనుక మేము వెళ్లాల్సిందే! మేమిక్కడ కొచ్చినట్లు ఎలా, ఎవరివల్ల తెలిసినా ప్రమాదమే! అయితే నీ ఆదరణ ఇక్కడికి మళ్లీ - మళ్లీ మమ్మల్ని రప్పించేలా ఉంది. కనుక తప్పకుండా ఇంకో సారి వస్తాం!" అని లెమ్మని మిత్రుని లేవదీసి చెయ్యి అందుకున్నాడు.

దానికా గణిక ముఖం చిన్నబోయింది. "అయ్యో! ఇలా వచ్చి అలా వెళ్లిపోతూన్నారేం? మీకిదేం న్యాయంగా ఉందా? ఎంతో అదృష్టం చేసుకుంటే తప్ప, రాజపుత్రుని దర్శనం మా వంటి వారికి సాధ్యమవుతుందా? ఈ మదన మనోహరుని రూపం ఎంత చూసినా తనివి తీరడం లేదు. ఈ దాసురాలి మీద దయ చూపి ఈ రాత్రికి ఇక్కడ ఉండవలసిందిగా వేడుకుంటున్నాను" అందామె ఆమె ఎంత చెప్పినా, కుదరదని బదులు పలికి "అమ్మాయి! రేపు తప్పకుండా వస్తాంలే" అని జయభద్రుని అక్కడ్నుంచి లాక్కుపోయాడు సుమిత్రుడు.

మిత్రుడు ముందుకు తీసుకుపోతూన్నా, వెనక్కు వెనక్కు తిరిగిచూస్తూ, అతిప్రయత్నంమీద అతడితో పాటు నడుస్తూన్నాడు రాజకుమారుడు. అతడికీ అనుభవం చాలా వింతగా - కొత్తగా ఉంది.

దారిలో జయభద్రుడు "ఇప్పుడు మనల్ని మర్యాద చేసిన స్త్రీ ఎవరు? ఇంతకు ముందెన్నడూ ఇలాంటి స్త్రీని నేను చూడనేలేదు. ఏమి అనురాగం? ఎంత ఆప్యాయం? నీ కామె వంటి వారిదివరకే తెలుసా? ఈ వీధి కింతకు

ముందెన్నడైనా వచ్చావా? మన పురంలో ఇది ఒక ముఖ్యమైన వీధి కాబోలు! నీతో ఆమె ఏమేమో మాట్లాడింది కదా! నాకా సమయంలో శరీరం వశం తప్పి ఎక్కడెక్కడో విహరించినట్లయింది. అందువల్ల మీ మాటలు నాకు బోధపడలేదు. మనం మరోసారి అక్కడికి వెళ్లవచ్చునా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించసాగాడు. అడిగిందే పదే పదే అడగసాగాడు.

అందుకు సుమిత్రుడు నవ్వుకుంటూ "మిత్రమా! మనల్ని ఇంతవరకు ఆదరించినది. వెలయాలు- అమరకోశంలో మనం చదువుకున్న వారవనిత, వారసుందరి, వేశ్య, గణిక, వారపత్ని మొ॥ పర్యాయ పదాలన్నీ ఆమెకు వర్తిస్తాయి. మనం ఎప్పుడు వెళ్లాలనుకున్నా- అక్కడకు వెళ్లగలం! అందుకు ఆటంక పరిచేవారెవ్వరూ ఉండరు. నీకు మన శృంగార శాస్త్రోపాధ్యాయులు చెప్పిన శృంగారం దాని అవస్థలు నీకు ఇప్పుడు అనుభవంలోకి వస్తున్నాయి. మన్మథుని అవస్థలు పది అని చదువుకున్నాం కదా! అందులో మొదటిది 'దృక్' అని నువ్వెరిగినదే! చూడటం వల్ల జనించిన అనురాగం ఒక అవస్థ. ఇక- సంకల్పం స్పర్శ- ఆలింగనం వగైరా తదుపరి కలిగేవి ఒక్కొక్కటే వరసగా అనుభవంలోకొస్తాయి. అయితే, ఈ శాస్త్రం ఉపదేశం కాకుండానే బోధపడుతుంది. ఇంతవరకు నీవు పరస్త్రీని చూసి ఉండకపోవడం వల్ల నీకీరసంలో సారం మొదలు కాలేదు" అని తిరిగి విద్యాశాలకు తీసుకెళ్లిపోయాడు.

జయభద్రునికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. చంద్రిక చిరునవ్వులు చూపులు మాటిమాటికీ గుర్తొచ్చి కలవర పరచసాగాయి. ఎలాగో తెల్లవారనిచ్చి కాలకృత్యాలు తీర్చుకోగానే "మిత్రమా! అక్కడికి ఎప్పుడైనా వెళ్లవచ్చునని చెప్పావు. ఇప్పుడిక్కడ మనం చేసే పనేమీ లేదు. కనుక నన్నొకసారి మళ్లీ అక్కడకు తీసుకు వెళ్లగలవా?" అని అడిగాడు.

అందుకు సుమిత్రుడు "రాజకుమారా! అక్కడికి సాయంకాలమే వెళ్లాలి. ఇది సమయం కాదు" అని చెప్పాడు. జయభద్రునికి గడియ ఒక యుగంలా గడవసాగింది. మాటిమాటికి 'పొద్దు పోతోంది. సాయంకాలంమైంది' అంటూ స్నేహితుడ్ని తొందర పెట్టడం మొదలుపెట్టాడు.

జయభద్రుని కథ

తగిన సమయం తానే చూసి సుమిత్రుడు జయభద్రుని వెంటబెట్టుకుని రహస్యంగా చంద్రిక ఇంటికి తీసుకువెళ్లాడు. ఆమె వారికి ఎదురేగి, ముందురోజు జరిపినట్లుగానే సపర్యలన్నీ జరిపింది. మంచం మీద కూర్చుండ బెట్టింది. అప్పుడు వాళ్లనిద్దరినీ ఏకాంతంగా ఉంచాలని, సుమిత్రుడు ఇప్పుడే వస్తానంటూ ఉద్యానవనానికి వెళ్లిపోయాడు.

రాజకుమారుడికి సిగ్గు, ఆశ్చర్యం, కుతూహలం అన్నీ ఒక్కసారే కమ్ముకున్నాయి అక్కడవున్నది తామిద్దరే! పరిచయం అంతగా లేని ఆమెతో ఎలా ప్రవర్తించాలో తెలీక అటూ ఇటూ చూడసాగాడు.

మిత్రుడ్ని పిలిచాడు. చంద్రిక "రాకుమారా! మీ మిత్రుని కేదో వ్యాపకం ఉండి ఉంటుంది. అయినా మీ సేవ నిమిత్తం ఈ దాసురాలని ఇక్కడ ఉంటే ఆయన్నింకా పిలవడం దేనికీ? మీకేం కావాలన్నా అందించడానికి సిద్ధం" అంటూ కల్పించుకుని తానే స్వయంగా అతనికి చందనం అద్ది, పూలహారాలు అర్పించి వీణమీటుతూ మధురంగా పాటపాడింది.

సమ్మోహనకరంగా ఆమెపాడిన పాటకు పరవశం చెందిన రాజకుమారునికి చంద్రిక స్పర్శ చొరవతో -ఏమేం చెయ్యాలో మన్మథుడే నేర్పినట్లయింది, వాళ్లకు రతి సౌఖ్యపారవశ్యంలో మధురిమలు అర్థం అవుతూన్న తరుణంలో, సుమిత్రుడు అక్కడకు వచ్చాడు. మిత్రమా! విద్యాగృహానికి పోవాలి రమ్మన్నాడు. 'ఈ రాత్రికి ఎలాగైనా ఇక్కడుండే ఏర్పాటు చేయమని మిత్రుడ్ని బ్రతిమాలుకున్నాడు.' జయభద్రుడు. తన మిత్రుడు దార్లో పడ్డాడని ఇక కామశాస్త్రం విషయమై చింతించనవసరం లేదని గుర్తించిన సుమిత్రుడు మొదట కొంచెం బెట్టు చేసి తదుపరి ఒప్పుకొని అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. గురుదేవుడడిగినపుడు ఏదో చెప్పి తప్పించుకొని తెల్లారుతూనే వెళ్లి జయభద్రునితో ఇంటికి పోదాం పదమన్నాడు.

అయితే చంద్రికతో విలాసంగా గడిపిన ఆ రాత్రి ఒక్కక్షణంలా గడిచిపోవడంతో అది గమనించని రాకుమారుడు "మిత్రమా! నామీద నీకింత నిర్దయ ఏల? రేపు ఉదయం రమ్మని చెప్పాను కదా! నువ్వు చేసిన ఉపకారం మర్చిపోను. దయచేసి రేపు పొద్దునరా" అని బ్రతిమాలసాగాడు.

జయభద్రుని కథ

అది విని నవ్వుతూ సుమిత్రుడు "రాజకుమారా! నీకు సుఖపారవశ్యంలో సమయమే తెలిసింది కాదు. ఇప్పుడు సూర్యోదయం జరిగి రెండు గడియలు అయింది అని చెప్పడంతో కిటికీ తెరిచి ఎండవైపు చూసింది. "ఔరా! ఇంతరాత్రి కూడా క్షణంలా గడిచిపోయిందే" అనుకుంటూ ఇష్టం లేకున్నా చంద్రికకు వెళ్లివస్తానని చెప్పి మిత్రునితో కూడ బయటకు నడిచాడు జయభద్రుడు.

దారిలో 'రాత్రి జరిగిన విశేషా లేమిటని' అడిగాడు సుమిత్రుడు

"రసమంటే శృంగారమే రసం. సరసం బాగా తెలిసిన వేశ్యయే గొప్ప రసికురాలు. గురువుగారి కంటే, నీకంటే కూడా ఆమె నాకు శృంగార శాస్త్రం బాగా బోధించింది.. ఇంతకాలం అయ్యవారు చెప్పిన రసస్థితి, అనుభవం లేకపోవడం తెలీలేదు కాని ఇప్పుడు నాకా రసప్రసక్తి బాగా తేటతెల్లమైంది. చంద్రిక సాక్షాత్ రతీదేవిసుమీ" అని మెచ్చుకోసాగాడా రాకుమారుడు.

విద్యామందిరంలో ప్రవేశించారిద్దరూ. "వీడి కన్నులు ఇంత ఎర్రగా ఉన్నాయేం?" అని అడిగారు గురుదేవులు. దానికి సుమిత్రుడు రెండు విధాలా సరిపోయేలా సమాధానం ఇచ్చాడు. "గురువరా! మీరీ రోజు పరీక్షిస్తారని రాత్రంతా శృంగార పాఠాలు నేర్చుకుంటూనే ఉన్నాడు" ఇదీ సుమిత్రుడి సమాధానం. అంతేగాక "మీరు ఇప్పుడు అతడిని పరీక్షించుకోవచ్చు"నని కూడా చెప్పాడు. ఉపాధ్యాయుల వారికి నిజంగా ఆశ్చర్యంగానే ఉంది. సరే! అదీ చూద్దాం! అనుకుని "నాయనా! చూడదగిన వస్తువుల్లో ఘనమైనదేది?" అని అడిగాడు.

"స్త్రీల ముఖారవిందమే" అని బదులిచ్చాడు జయభద్రుడు

"ఏది చెవులకు శ్రవణానందకరం?" అని అడిగినపుడు" ఆడువారి ముద్దు పలుకులు" అని జవాబు.

"మధురమైనదేది?"

"స్త్రీల పెదవులు".

"తనువుకు తనివి తీరా సుఖం కలిగించేది?"

"లతలా అల్లుకుపోగల స్త్రీ దేహమే గురువర్యా!"

"సరసం కోరేవారు నిత్యం ఆలోచించేది?"

"స్త్రీ శరీరంలో సుకుమారంగా మన్మథుడు దాచిన యవ్వనం" అనే సమాధానంతో పాటు" వలచి వలపించుకోగల స్త్రీతో మన్మథ సామ్రాజ్య విహారాన్ని యధేచ్ఛగా సాగించగల రసిక జనుల అదృష్టమే అదృష్టం" అని జయభద్రుడు ముక్తాయించేసరికి, భేష్ అని వెన్ను తట్టారు గురువుగారు. ఆయనకిప్పుడు మహదానందంగా ఉంది.

"బాపురే జయభద్రా! ఇంతలోనే ఎంతవాడివైనావయ్యా?.. ఇదంతా సుమిత్రుని చాతుర్యమని ఊహిస్తాను. ఆహా! నీ నోటి వెంట ఇలాంటి శృంగార ప్రసంగం వినగల్గుతానని నేను ఎన్నాళ్ళుగానో భావిస్తూన్నాను. ఈ నాటికి అది నెరవేరింది. నువ్వు ఇంకా ఈ శాస్త్రంలో పారంగతుడవు కాలేదన్న చింత దూరమైంది. "ఏదేమయితేనేం మేలు! మేలు" అంటూ పొంగిపోతూన్న గురుదేవునితో సుమిత్రుడు "గురువుగారూ! సకల శస్త్ర అస్త్ర విద్యలలోను రాజూచిత శాస్త్రాలలోను ప్రవేశం కలిగిన వానికి ఈ కళ పట్టుబడటం ఒక వింత కానేకాదు. శాస్త్రాలు చదివిన వాళ్ళకి లౌకికం ఎంతలో తెలుస్తుంది. ఇదంతా మీరు ఎన్నో సార్లు శ్రమించి బోధించినదే! మీ దయవల్లనే అతడీ శాస్త్రంలోనూ ఉత్తీర్ణుడనిపించుకున్నాడు" అని అప్పటికి తగినట్లు మాట్లాడాడు.

ఇంతలో రాజభటుడొకడు ఒక ఉత్తరం తెచ్చి గురువుగారికిచ్చాడు. దానిని ఆయన చదువుకొని, సుమిత్రుని వైపుచూసి "ఇది నిన్ను పంపవలసిందంటూ రాజుగారు ఇచ్చిన ఉత్తర్వు. ఈ భటునితో కూడ నువ్విపుడే అంతఃపురానికి వెళ్ళాల్సివుంది" అన్నారు.

సరే! అని తల ఊపి, గురువుగారు అటు దయచేయగానే జయభద్రునితో "చెలికాడా! ఇప్పుడు రాజుగారు నన్ను పిలువనంపినది నీ విషయం ముచ్చటించడానికే అయి ఉంటుంది. నేను ఇట్టే వచ్చేస్తాను నువ్వెటూ వెళ్ళకు" అని చెప్పి భటునితో కూడ బయల్దేరాడు సుమిత్రుడు

"నాయనా! నేను నిన్ను సూటిగా ఒక్కటడుగుతున్నాను. నీ మిత్రుడు నీతో ఎప్పుడైనా తన వివాహం గురించి ముచ్చటించడం జరిగిందా? వయోసహజమైన ప్రసంగం కదా! అదీ గాక అతడి రూప గుణ విద్యా-శీలాదుల చేత కూడ ఎన్నెన్నో సంబంధాలు వస్తున్నాయి" అంటూనే అక్కడే అందుబాటులో ఉన్న ఒక చిత్రపటాన్ని చూపించాడు కుంతిభోజుడు.

జయభద్రుని కథ

"ఇది ఇంద్రసేన మహారాజుగారి కూతురైన సునీతి చిత్రపటం. మంచి రూపవతి, గుణవతి, విద్యావతి, సౌశీల్యవతి. ఇటువంటి సంబంధం కాదనడం సరికాదు. ఈ సంబంధం విషయమై వాడి తల్లికి కూడా చాలా ఉత్సాహంగా ఉంది నీతో పాటు ఈ చిత్రపటాన్నిచ్చి పంపిస్తాను. అది నీ మిత్రునికి నచ్చేలా నువ్వే చెప్పాలి. నీకు ఘనమైన బహుమతి ఉంటుంది" అని కూడా చెప్పాడు.

సుమిత్రుడు ఉత్సాహ వినయాలు ఉట్టిపడేలా "ప్రభూ! మీ యాజ్ఞ ప్రకారమే చేస్తాను. మా ప్రసంగాలలో వివాహ విషయం అపుడపుడు దొర్లడం అతిసహజమే! అయితే ప్రభువులపట్ల రాజపుత్రుల కింతవరకు అటువంటి విషయాలు నేరుగా చెప్పేంత చనువరితనం పెరగలేదు. ఇక మీరు చూపిన ఈ చిత్రపటంలో సుందరి గురించి సందర్భవశాన మాకు కొంతవరకు తెలుసు. ఆమెను పెళ్లి చేసుకోగలడని అందులో ఎటువంటి సందేహం లేదని నా మిత్రుని తరఫున నేను చెప్పగలను అయినప్పటికీ చిత్రఫలకం చూపి. అతడ్ని ఒప్పించి మీకా వార్తను తక్షణంలో పంపిస్తాను" అని ప్రసంగించేసరికి రాజు మహదానందపడ్డాడు.

"సరే! ఈ చిత్రపటాన్ని మరొక్కపర్యాయం అంతఃపురంలో రాణులకు చూపించి నీ వెనుకనే దీన్ని పంపిస్తాను" అని సుమిత్రుని పంపించేశాడు. విద్యామందిరానికి తిరిగి వచ్చేశాడు సుమిత్రుడు. అక్కడెంత వెతికినా, జయభద్రుడు ఎక్కడా కనబడలేదు.

ఒక్కక్షణం ఆలోచించాడు. ఇతడిప్పుడు ఆ వారకాంత ఇంటికే పోయి ఉంటాడు. ఇక నా జోలి వీడికి అక్కర్లేకుండా, స్వతంత్రించి వెళ్లగలుగుతున్నాడు. నేను తోడు రాకుండానే వెళ్లాడంటే, వీడీ వ్యసనంలో పడుతున్నాడన్నమాట! అయ్యయ్యో! ఏమీ తెలీని వీడిని దుర్వ్యసనానికి నేనే ప్రేరేపించిన వాడినైతినే! ఇప్పుడు చేయి దాటుతున్నాడని విచారిస్తున్నాను. రాజుగారికీ సంగతి తెలిస్తే చాలా ప్రమాదం- నా మాటైనా ఇక మీద వింటాడో, వినడో నమ్మకంలేదు వెలయాళ్ల వలలో చిక్కినవారికి, ఇంకో విషయమే పట్టదు. ఇక- ఈ వేశ్యాలంపటత్వం ఇతరులకు తెలిస్తే,

అతడికున్న మంచి పేరుకు మచ్చ కూడా! ఏది దారి?" అనుకుంటూనే గురువుగారికి కూడా తెలీనివ్వక గుప్తంగా, తానే చంద్రిక మేడ దగ్గరకు వెళ్లి, మిత్రుని దొరకబుచ్చుకున్నాడు.

జయభద్రుని చేయి పట్టుకుని "నువ్వింత స్వతంత్రిస్తావనుకోలేదు సుమీ! మీ తండ్రిగారి నుంచి నీకూ పిలుపు వచ్చింది. నువ్వు కనిపించకపోవడంతో నన్ను అడిగారు. నేను తీసుకొస్తానని వారితో చెప్పి పంపించేశాను. నువ్వు ఇంకా ఆలస్యం చేస్తే మహారాజుగారే స్వయంగా మన విద్యాశాలకు విచ్చేయగలరు సునీతి అనే రాకుమారి చిత్రఫలకాన్ని తెప్పించారు. అది నువ్వుచూసి, నీ సమ్మతి తెలియచేస్తే, వివాహ ముహూర్తం నిర్ణయించి శుభలేఖ రాయవలసి ఉంది. ఆ అందగత్తె రూపం చాలా దివ్యంగా ఉంది. త్వరగా వెళ్దాం పద" అన్నాడు.

సుమిత్రుడి పట్టునుంచి తన చెయ్యి విడిపించుకుంటూ "చెలికాడా! నా భారమంతా నీదే అని ముందే చెప్పానుగా! నువ్వు బాగున్నదంటే నాకూ సమ్మతమే అనుకో! చిత్రపటం నేను చూసినట్లూ - నచ్చిందని చెప్పినట్లూ మా తండ్రిగారికి నువ్వే చెప్పు! శుభలేఖ రాయించు! నువ్వు ముందుగా వెళ్లు! నీ వెనకే నేను వచ్చేస్తున్నాననుకో!" అని త్వరపెట్టి మిత్రుని సాగనంపి, తటాలున తలుపు మూసి లోపలికి వెళ్లిపోయాడు జయభద్రుడు.

సుమిత్రుడికేం చెయ్యడానికీ పాలుబోలేదు. మిత్రుని రహస్యాన్ని కాపాడే భారం తనమీద ఉన్నందువల్ల సునీతిని పెళ్లి చేసుకోడానికి జయభద్రుడు అంగీకరించాడని మాత్రం చెప్పాడు.

వెంటనే దైవజ్ఞులకు కబురు వెళ్లింది. వారు ముహూర్తకాల గణనచేసి, రెండ్రోజుల్లోనే అతిగొప్ప సుముహూర్తం ఉన్నదని చెప్పారు. ఆ ప్రభువు అంత మంచి ముహూర్తం దాటి పోనివ్వరాదని ఎంచి, శుభలేఖతో పాటే, కులాచారం ప్రకారం మంత్రి సామంత పరివారంతో కూడ కత్తిని వరునికి మారుగా పంపి వివాహం చేసుకుని రమ్మన్నాడు. ముహూర్తం చాలా చేరువుగా ఉండడంతో అధిక ప్రయత్నాలు సైతం చేయలేదు. మిత్రుడు రహస్యంగా విద్యసాధన. చేస్తున్నందున అతడి సాధనకు ఆటంకము

కలిగించకూడదని కూడా సుమిత్రుడొక మాటగా ముందే చెప్పిఉంచాడు. ఏదేమైనా - తెల్లవారితే పెండ్లి అనగా ముందురోజు పెళ్లికొడుకును చేసే ఆచారం ఉన్నది కదా! అప్పుడు జయభద్రుడు తప్పనిసరిగా అంతఃపురంలోకి రావలసివుంది. అదే సుమిత్రునికి సమస్యే అయింది. దాదాపు చంద్రిక ఇంటనే మకాం వేసిన తన మిత్రుని ఎలా తీసుకురావడం?.... ఆ రాత్రి మళ్లీ జయభద్రుని దగ్గరకు వెళ్లి "మిత్రమా! నీ తరపున నేను ఎన్ని కార్యాలు చక్కబెట్టినా, ప్రత్యక్షంగా నీతోనే ముడిపడి ఉన్న కార్యాలు కొన్ని వివాహంలో ఉన్నాయి. పెళ్లి కొడుకును చేసే వేడుక అలాంటి వాటిలో ఒకటి. దీనికిక మారు ఉపాయంలేదు. పరువు నిలుపుకో" అని హితబోధ చేయగా, విధిలేక ఒప్పుకొంటున్నట్లుగా మర్నాడు ఉదయం వస్తానని ప్రమాణం చేశాడు.

కాని, చంద్రిక వలలో తగులుకొన్న మూఢుడైపోయి, ఆ విషయం మర్చిపోవడంతో, మళ్లీ జయభద్రుడు మిత్రుని కలుసుకుని "ఇక నా వల్ల కాదయ్యా! ఎన్నాళ్లు బొంకడం? నీ ప్రత్యక్ష అవసరం ఉన్నట్లు తెలిసీ నువ్వ ఇలా జాగుచేయడం వల్ల గుట్టు రట్టుకాగలదు. అది నీకే మానహాని" అని ఎంతో చెప్పిన మీదట, అయిష్టంగానే అక్కడినుంచి కదిలాడా రాచబిడ్డ.

వివాహపు వేడుకలు మంగళస్నానాలతో ప్రారంభమయ్యాయి ఆ కార్యక్రమాల పరంపర అతనికి పిచ్చెక్కేలా ఉంది. అయినా మిత్రుని సర్వకాల సర్వావస్థల్లోనూ కనిపెట్టుకుని ఉండి, అతని మనస్సు బైటికి తెలీనివ్వకుండా జాగ్రత్తగా కాపాడు కొచ్చాడు సుమిత్రుడు. ఇంతటి సందడిలోనూ సందుచూసుకుని రహస్యంగా చంద్రిక ఇంటికెళ్లి వచ్చేస్తూండేవాడు జయభద్రుడు.

వివాహపు వేడుకలు ఘనంగా పూర్తయిన ఐదు రోజులనాడు రాకుమార్తె సునీతి అత్తవారింట అడుగుపెట్టింది. జయభద్రుని కోసం ప్రత్యేకంగా కేటాయించి అలంకరించిన మేడలో దిగింది. ఆమె తనతోపాటు వెంట తెచ్చిన సారె వైభవం అంతా ఇంతా కాదు. ఆ సంభారాలన్నీ చూసి ఆ పురప్రజలు ఆశ్చర్యపోయి మరీ చెప్పుకున్నారు.

ఆ రోజునే కుంతి భోజుని మిత్రుడైన ఒక రాజుకు శత్రువుల వల్ల ఆపద సంభవించి సహాయానికి రావలసిందిగా కుంతిభోజునికి వర్తమానం పంపాడు. స్నేహితునికోసం ఆ ప్రభువు హుటాహుటిన తన ఆరుగురు

2

పుత్రులనూ తోడు తీసుకుని ఆ రోజే బయల్దేరి వెళ్లిపోయాడు. ఆ హడావుడిలో తననెవరూ పట్టించుకోరని, జయభద్రుడు మళ్లీ చంద్రిక చెంతకు చేరుకున్నాడు.

ఆ రోజు రాత్రికా-వస్తూండగా జయభద్రుని తల్లి సుమిత్రునితో "అబ్బాయీ! నువ్వు వేరు- మా అబ్బాయి వేరు అని నేనెన్నడూ అనుకోలేదు. వాడికి ఈ వేడుకల అంతరార్థం నువ్వే బోధపరచాలి. ఈ రాత్రి అతడిని సునీతితో కలిపి జరిగించవలసిన వినోదాలన్నీ జరిపించాలి. ప్రభువుల వారితో సహా, నీ మిత్రుని సోదరులు కూడా సహాయార్థం యుద్ధానికి వెళ్లారని నీకు తెలిసిందే కదా!" అని చెప్పింది.

సుమిత్రుడు సరే అని మిత్రునికోసం రాజభవన మంతటా గాలించాడు. ఎక్కడన్నా జయభద్రుడు కనబడితేకదా! సునీతిచిత్ర ఫలకం అంతఃపురం నుంచి తెప్పించి, అదిచ్చుకుని మిత్రుని వెదుక్కుంటూ చంద్రిక ఇంటివైపు సాగాడు.

అతడూహించినట్లుగానే జయభద్రుడు చంద్రిక ఇంటనే ఉన్నాడు. అక్కడ మిత్రుని కలుసుకున్న సుమిత్రుడు, రహస్యంగా అతడ్ని కూర్చోబెట్టి "నీ ప్రవర్తన చాలా విపరీతంగా ఉంది. ఎప్పటికప్పుడే ఏదో ఒకటి నాకు సమస్యగా తెచ్చిపెడుతున్నావు. నన్నూ మోసం చేస్తున్నావు, నీకీ వేశ్యల సంగతి తెలీదు. తన రూపంతో వశపరచుకొని, క్రమంగా మదనాగ్ని జ్వాలల్లోకి లాగగలరు. వీళ్ల చేష్టలు చిత్రాతి చిత్రాలు. కాముకత్వం కొద్దీ రసికులు వారింట చేరి ఆ అగ్నిలో పడి తను యవ్వనం ధనం హోమం చేసుకుంటారు. అందుకే వేశ్యలతో పొందు నిందించదగిందని పెద్దలమాట. అదలా ఉంచు! నువ్వు ఇంతవరకు కేవలం ఈ వేశ్య ముఖం మాత్రమే చూసి వున్నావు. ఇంకొక స్త్రీని తేరిపారజూసి ఎరుగవు. కనీసం నీకు నీ భార్య సౌందర్యమెలాంటిదో కూడ ధ్యాసలేదు. ఆమె రూపంలోని వెయ్యోవంతయినా ఈ చంద్రికకు లేదు. అంతచక్కని సుందరాంగన భార్యయై ఇంట ఉండగా, ఈ కృత్రిమ అలంకారాల బొమ్మ నీ కెట్లా నచ్చినదో నాకు తెలీడం లేదు. ఒక్కసారి ఈ చిత్రం వంక తేరిపార చూడవయ్యా మహానుభావా! ఈ రాత్రి నీ మేడలో చాలా గొప్ప ఉత్సవం కూడ ఉంది" అని చాలా అనునయంతో వివరించాడు.

జయభద్రుడా మాటలకు ఏమీ జవాబివ్వక ఆ చిత్రపటాన్ని కొద్ది క్షణాలు సాలోచనగా చూసి, తల ఊపి "మిత్రమా! ఈ చిన్నది నిజంగానే ఇలా ఉంటుందా? అలా అయితే ఈ రాత్రి తప్పకుండా రాచనగరుకు వస్తాలేవయ్యా! నువ్వు ముందుగా వెళ్లి అక్కడ ఉత్సవపు టేర్పాట్లేవో చెయ్యాలన్నావుకదా. అవి చూస్తూండు! ఈలోగా నేనీ గణికా మణిని కొంత ప్రసన్నురాలిని చేసుకుని అక్కడికి వస్తాలే! ఏదేమైనా ఈ చంద్రికను ఇతర వేశ్యలతో సమానంగా జమకట్టకు సుమీ! దానికి నాపట్ల ఉన్న మక్కువ ఇలాంటిదని చెప్పలేను. నువ్వేదో అప్పుడప్పుడొచ్చి చూసి వెళ్లేవాడివి కనుక నీకు తెలీదు" అని ఎన్నెన్నో ఒట్లు వేసి మిత్రుడ్ని సాగనంపాడు. వేశ్య మాయలలో ఆరితేరిన ఆ జాణ చెలికత్తె వారి రహస్య సంభాషణను విని, తన యజమానురాలికి అదంతా చేరవేసిందని వారికి తెలీదు.

జయభద్రుడు ఆ చిత్రఫలకాన్ని తీసుకొని లోపలికెళ్లి ఆ బోగందానికి చూపించి "చూశావా చంద్రికా! ఈ సుందరి ఎంత సొగసుగా ఉందో? దీనిలో ఏదైనా దోషాలున్నాయేమో చెప్పు! నీ బుద్ధి చాతుర్యం చూస్తాను" అన్నాడు కవ్విస్తున్నట్లుగా.

ఆ చిత్రపటాన్ని చూసిన చంద్రిక, ఒక్కక్షణంలోనే అతని భార్య రూపురేఖా విలాసాలను అంచనా కట్టి, ఆ సునీతి సౌందర్యానికి ఆశ్చర్యపడి ఈమెను ఒక్కసారి కలసినా, ఇక జయభద్రుడు తన ముఖం చూడటం కల్ల అని గ్రహించేసుకుంది.

ఏ రీతిగానైనా అందుకు అడ్డంకి ఏర్పరచాలని నిశ్చయించుకుని, పటాన్ని అటూ ఇటూ వివిధ కోణాల్లో పరిశీలిస్తున్న దానిలా నటించి, జయభద్రుడు పరాకుగా ఉన్నప్పుడు, కొనగోట తీసిన కాటుకతో ఆ చిత్ర పటానికి ఎడమ కనుపాపవద్ద మచ్చ అద్దింది.

జయభద్రుడామెవైపు తిరగ్గానే, "రాజపుత్రా! చూశావా! ఈ సౌందర్యరాశికి ఎంతో ప్రయత్నం మీద చిన్నలోపం కనిపెట్టగలిగాను. పరిశీలించి చూస్తే తప్ప తెలీదనుకో! ఎడమ కనుపాపలో చిన్నమచ్చఉంది. ముఖానికి కళ్లే అందం అంటారు కదా! అలాంటి నేత్ర సౌందర్యం లేని అందం ఎంత ఉన్నా ఏం లాభం? ఈ ఒంటికన్ను జవ్వనిని ఏదో మాయచేసి,

కప్పిపెట్టిన లోపం పెళ్లయ్యేంత వరకు కాపాడి వివాహం అయింది అనిపించ వలసిందే! అంతేగాని, ముందుగా చెప్పి ఒప్పించడం సాధ్యంకాదు. పేరున్న వాడెవడూ ఈ పిల్లదాన్ని ఒల్లడు. అదీగాక ఈ మచ్చ నిదానించి చూస్తే తప్పు కనిపించదనుకో!" అని మెల్లగా అతని మనస్సు విరిచేసింది.

రాజపుత్రుడాశ్చర్యంగా "అరె! చిత్రంగా ఉందే! ఇందాక మేము చూసినపుడు మాకీ మచ్చ కనబడలేదు. ఇప్పుడెలా వచ్చింది? బాగు-బాగు! తొందర్లో చూశామేమో!" అనుకుంటూండగా "అదేం కాదు రాజకుమారా! తమది విశాల దృష్టి. ఏదో యాధాలాపంగా చూసి ఉంటారు. మేము స్త్రీలం కదా! అన్ని అంగాలూ ఒక్కొక్కటే పట్టి చూస్తాం! అంతే! ఈ అంగన కోసమేనా మీ మిత్రుడంతగా వివాహానికి తొందర చేసింది" అని ఏమీ ఎరగని దానిలా పరిహాసం చేసిందా నంగనాచి.

దానికి సిగ్గు పడుతూ జయభద్రుడు "ఆహా! ఎంత వైపరీత్యం? నా మిత్రుడ్ని గుడ్డిగా నమ్మడంవల్లనే కదా, నాకీ ఒంటి కంటిది తటస్థించింది. అయ్యో! మా ఏడుగురు అన్నదమ్ముల్లోనూ గుడ్డిదాన్ని కట్టుకున్నది నేనే కాబోలు! ఈ అపఖ్యాతి పోయే మార్గం లేదా? నేనీ చక్కని చుక్కతో కులుకుతున్నానని ఈర్ష్యకొద్దీ నామిత్రుడీ దుష్టపన్నాగం పన్ని ఉండవచ్చు! దైవమా? ఇది ఏమి లీల? కానిమ్ము! ఇంత వరకు దాని ముఖమన్నా చూడలేదు కదా! ఇటుపైన కూడా చూడను. స్వంత విషయాలలో ఎవర్నీ నమ్మరాదని శుక్రనీతి' అనుకుంటూ ఆ పటం తన భార్యదని చెప్పక ఒక మూలకు గిరవాటు వేశాడు.

అతడు చెప్పకపోయినా, సునీతి గురించి సమస్త సమాచారాన్ని తన చేటి ద్వారా రాబట్టిన చంద్రిక, ఏకకాలంలో ఇటు జయభద్రునికి మిత్రుని మీద నమ్మకాన్ని అటు భార్య మీద మమకారాన్నీ త్రుంచి వేయడంలో విజయం సాధించినందుకు లోలోన పొంగిపోయింది.

అది మొదలు సుమిత్రునిమీద జయభద్రునికి ద్వేషం కలిగిపోయింది. గట్టిగా నిట్టూర్చి కలుషితమైపోయిన తన మనస్సును చంద్రిక చేసిన ఉపచారాలతో సాంత్వన పరచుకున్నాడు.

అక్కడ సుమిత్రుడు, జయభద్రునికోసం మేడకు రకరకాల అలంకరణలు జరిపించి, లోన కూడా తగిన ఏర్పాట్లు చేయించి మిత్రునికై ఎదురుచూడసాగాడు. ఎంత రాత్రయినా అతని జాడ లేకపోవడంతో కోపం పూని చంద్రిక ఇంటికెళ్లి తలుపు తట్టాడు. లోపల్నుంచి ఒక చీటీతో దాసి వచ్చింది. అది చదువుకొన్న సుమిత్రుడికి కళ్లవెంట గిర్రున నీళ్లు తిరిగాయి. ఆ ఉత్తరంలో ఇలా ఉంది...

"నీవు నాకు మిత్రరూపంలో ఉన్న శత్రువువి. జీవితాంతం సరిపోయేటంత అపకారం చేశావు. ఇక చాలు! నీ స్నేహానికి ఇక్కడితో చెల్లు! ఇంకోసారి ఎన్నడూ నన్ను కలుసుకొనే ప్రయత్నం చెయ్యకుపైగా నీతులు వల్లించకు" ఆ చీటీని రెండు మూడు సార్లు చదువుకున్న సుమిత్రుడు "ఆహా! వెలియాలి బోధ ముందు స్నేహితుడినైన నా అవ్యాజ మమకారం అనగా ఎంత? ఇంత పరుషంగా రాశాడంటే ఆ కులట నాపై ఎలాంటి నింద మోపిందో! అయినా నావల్ల ఇనుమంత అపకారం ఏదీ జరగలేదే! ఇంతలోనే ఎంత మార్పు? ఒక్క క్షణం నేను కనపడక పోతేనే నాకోసం అల్లల్లాడిపోయే జయభద్రుడు ఇంత ఉగ్రంగా ఎలా రాశాడబ్బా? అది....ఆ చంద్రిక ఏదో మందుజల్లి పరిపూర్ణంగా అతడ్ని వశపరచుకుంది. దాన్నేం చేసినా పాపం లేదు. అదలా ఉంచగా ఈ రాత్రి మధురమైన కలలు కంటూ, పతిదేవుని రాకకోసం కన్నులు కాయలు కాచేలా ఎదురుచూస్తూన్న సునీతికి ఏం చెప్పాలి? ఎంత దుర్విధి దాపురించింది?" అని బాధపడుతూ ఎట్టకేలకు ధైర్యం తెచ్చుకుని అంతఃపురానికొచ్చాడు. ఇది తన మిత్రునికి పుట్టిన బుద్ధికాదని అంతా ఆ వేశ్య మాయావిలాసమని గ్రహించుకొని తన మిత్రుని మీద ఎటువంటి కోపం పెట్టుకోక కర్తవ్యం ఆలోచించి, చివరకు సునీతికి ముఖం చూపడానికి సంకోచించి, ఒక లేఖ ద్వారా విషయం దాచకుండా వివరించాడు.

"అమ్మా! నీ భర్త కేవలం వేశ్య వలలో తగులుకొని, నా పట్ల అకారణంగా వైరం పూని నా మాట పాటించక ముఖం చాటు చేశాడు. కనీసం అతడ్ని కలుసుకోవాలని నేను ఎంతో ప్రయత్నిస్తున్నా, అది

సాధ్యపడటం లేదు నా ప్రయత్నాలు నెరవేరేవరకు నీ వీ గుట్టును రట్టు చేసుకోవద్దు! అల్లరిపడితే ఇహపరాలకు రెండిటికీ చెడినట్లే! కాలక్రమంలో అతడ్ని మార్చేందుకు నేను చేసే యావత్ ప్రయత్నాలు సఫలీకృతంకాగలవని నా నమ్మకం. నీవు పతివ్రతవు గనుక ఇంత రాశాను. దయచేసి నాపట్ల విశ్వాసముంచి అర్థం చేసుకోగలవు"... ఇదీ ఆ లేఖలోని సారాంశం సునీతి, ఉత్తరం చదివి తల ఊపి వితర్కించుకుంది. నిజమైన సతి, పతిని బైటపెట్టే అకార్యం తలపెడుతుందా? జయభద్రుడు భోజన సమయాల్లో తప్ప, మిగిలిన కాలమంతా ఆ గణిక ఇంట్లోనే పొద్దుపుచ్చుతున్నా ఆ మహా ఇల్లాలు, నూతన వివాహిత, లేజవ్వని అయివుండి కూడా భర్త పట్ల క్షమ - ఓర్పు వహించి కాలక్షేపం చేయసాగింది. జయభద్రుని రాకపోకల పై ఎవ్వరికీ అనుమానం కలగని రీతిలో, తన పతి తోనే లోకమన్నట్లుగా- అంతఃపురంలోనే ఉన్నాడన్నట్లుగా అభినయించసాగిందా కన్య.

సునీతి కథ

హరిశ్చంద్ర చక్రవర్తి భార్య చంద్రమతితో పోల్చదగిన పతివ్రత సునీతి. "సునీతీ! మా మరిది చాలా బుద్ధిమంతుడు. అయినా అతడ్ని ఒక్కసారి కూడ ఇవతలకు రానివ్వకుండా వశ పరచుకున్నావంటే నువ్వు చాలా చతురురాలివే చెల్లీ" అని అక్కలు ఆమెను ఆట పట్టిస్తూంటే ,సిగ్గు పడుతూనే- రాని నవ్వు తెచ్చుకునేది గుండెల్లో బడబాగ్ని దాచుకున్న ఆ పతివ్రత.

సునీతి పరిచారిక భ్రమరిక ఆమెకు తన యజమానురాలి పరిస్థితి యావత్తు తెలుసు! ఆమె భర్త ఆమెను నిరాదరణ చేస్తున్నందుకు ఎంతో విచారిస్తూ, ఆమె ఆవేదనలో నిత్యం పాలుపంచుకొనేది భ్రమరిక

ఒకనాడు ఆమె ఒక ఆకు ఎంతో భక్తిగా తీసుకొని వచ్చి, సునీతి చేతిలో ఉంచి "అమ్మా! నువ్వెంతో ఉత్తమురాలివి. నీ సాహచర్యంవల్ల నీ ప్రాణానికి ప్రాణంగా మసలుకుంటూన్న నాకు, నీ దుఃఖం- ఆవేదన నన్నూ ఎంతగానో కలచి వేస్తున్నాయి. నీ భర్త చాలా చక్కని వాడని అందరూ

చెప్పుకోగా వినడమే తప్ప నేనెంత ప్రయత్నించినా ఆయన్ను నీలాగే చూడలేకపోయాను. ఎప్పుడొస్తాడో ఎప్పుడు వెళ్తాడో కూడా తెలియడం లేదాయె. అంతఃపురంలో అందరూ నువ్వు భర్తని కొంగున కట్టేసుకున్నావని ఇవతలకో రానివ్వవని చెప్పుకుంటున్నారు తీరా చూస్తే నీకు భర్త వల్ల సౌఖ్యమే కరువు అయింది పోనీ! ఈ విషయాన్ని అతడి ఆప్తులకు చెప్పి మందలించేలా చేద్దామంటే నువ్వొప్పుకోవు. ఈ వార్త మీ తండ్రిగారికి చేరిందా -ఆయన చాలా కోపించడం ఖాయం. ఏం చెయ్యడానికీ తోచడంలేదు. నేనిట్లా చింతిస్తూనే ఇవాళ ఉదయం నేను దేవాలయానికి వెళ్లాను. అక్కడ జటాజూటంతో అపరశంకరుడిలా జపం చేసుకుంటూన్న ఒక సిద్ధుడిని చూశాను. ఆ యతీంద్రుని చూసిన వారెవ్వరికైనా అతడు మహానుభావుడని తప్పక అనిపిస్తోంది అందరూ వెళ్లేవరకు ఆగి, నేనా సిద్ధుని పాదాలంటి ఆ మహాత్ముని స్తుతించి నీ పరిస్థితి వివరించానమ్మా! సిద్ధుల వద్ద దాచకుండా విషయం చెప్తే ఫలితముంటుందని, వేశ్యాలోలుడై నీ భర్త నిన్ను నిరాదరణ చేసిన అంశం కూడా దాచకుండా చెప్పేశాను.

అప్పుడా యోగిపుంగవుడు హరినామస్మరణ చేస్తూ తన వద్ద భరిణెలో దాచిన ఈ అపురూపమైన పత్రాన్ని తీసి నా చేతికిచ్చి "అమ్మాయి! ఈ ఆకు పసరు తీసి, నీ మిత్రురాలిభర్త దేహానికి ఎక్కడ తాకించినా చాలు! ఇక అతడామెను విడిచి వెళ్లడు.ఇదొక సిద్ధౌషదం. నీవు సునీతి చెలివని చెప్పడం వల్ల సునీతి నీతి మంతురాలని నేను గ్రహించి ఉన్నందువల్ల నీకిది ఇచ్చాను. ఆలస్యమైతే పసరు ఫలితమివ్వదు కనుక త్వరగా ఇల్లుచేరి ప్రయత్నం ప్రారంభించు! అన్నారమ్మా!" అని చెప్పి ఆకును సునీతి చేత బెట్టింది.

"సఖీ! నీకు నామీద ఎంతో వాత్సల్యం వుంది గనుకనే ఇంత శ్రమపడ్డావు. దైవకృప తోడై భర్త నాకు అనుకూలుడైతే నా సంపదలన్నీ ఇచ్చినా నీ రుణం తీరదు. ఆ సిద్ధుడు కూడా ఉత్తముడే అయి ఉంటాడని పిస్తున్నది. ఎలాంటి ప్రతి ఫలాన్ని ఆశించక ఇట్టిని దయచేయడానికి, ఆయనకేం అవసరం? సరే! ఈ రాత్రే ప్రయత్నిస్తాను. కాని నాకు ఆయన

ఎలా వుంటాడో కూడ తెలియదే! ముఖమైనా చూడలేదే సఖీ! ఎలా!?" అని ఆకు అందుకుని ఆలోచించసాగింది సునీతి.

"భోజనానికి ఇంటికి వస్తారుకదా! మీ అత్తగారితో చెప్పి, ఈ రాత్రి నువ్వే స్వయంగా వండి వడ్డిస్తే సరి! పసరు పూత పని తేలికవుతుంది" అని తరుణోపాయం సూచించింది భ్రమరిక.

సునీతి అత్తగారిని నేర్పుగా ఆకట్టుకొని, ఆరాత్రి భర్త తనను తన ప్రత్యేకమైన వంటకాలు చేయమన్నారని అనుమతీ కావలసిన సామగ్రీనీ తీసుకుని రుచికరంగా పిండివంటలు చేసి, అద్భుతంగా అలంకరించుకుని భర్తకోసం ఎదురు చూడసాగింది.

జయభద్రుడు వేశ్యాగృహం నుంచి వచ్చి, కాళ్లు కడుక్కొని భోజనానికి కూర్చున్నాడు. అతడు వడ్డించ మనగానే ఆమె వడ్డించడం ప్రారంభించింది. అతడి దృష్టి పూర్తిగా చంద్రిక మీదనే లగ్నమై ఉండడంతో అతడా పదార్థాల రుచిగాని తనకు వడ్డిస్తున్న దెవరని గాని పట్టించుకోకుండానే భోజనాన్ని ముగించాడు. తన భర్త అంతటి సౌందర్యవంతుడని' ఎరుగని సునీతి ఇంతకాలం అంత చక్కని వాడిని చూడలేకపోతినే అని విచారిస్తూనే తనివితీరా భర్తని ఆరాధనతో చూడసాగింది. అలా చూడటంతోనే సమయం కాస్తా గడచిపోయింది. పసరు తగిలించే అవకాశం చేజారిపోయింది. అతడు భోజనం ముగిస్తూనే తిరిగి చంద్రిక ఇంటికి వెళ్లిపోయాడు. పసరు ఆలస్యం అయితే పనికిరాదని సిద్ధుడు చెప్పడం వల్ల, పసరు వృధా అయిపోయిందనుకుని చింతిస్తూనే తన మంగళసూత్రం చల్లగా ఉంటే అంతేచాలుననుకున్న సునీతి అంతఃపురంలోని ఒక పాముపుట్టలో ఆ పసరు పోసేసింది. అదెంతో కష్టించి తెచ్చిన భ్రమరికకు ఆ విషయం చెప్పక దాచిపెట్టి తన భర్త ఎంత అందగాడో ఆ సౌందర్యమంతా వర్ణించి చెప్పడం ప్రారంభించింది సునీతి.

ఇంతలో శయ్యాగృహం తలుపు చప్పుడైతే, భ్రమరిక వెళ్లి తలుపు తీయబోతూ "ఎవరు" అని అడిగింది.

"జయభద్రుడిని" అని అట్నుంచి సమాధానం.

తటాలున శయ్యదిగిన సునీతి, ఆశ్చర్యపోతూనే తలుపుతీసింది. తన భర్తరూపం ఆమె మనఃఫలకం మీద ప్రతిష్ఠితమై ఉండడంతో, ఆ రూపాన్ని గుర్తుపట్టి ఆతని పాదాలు కడిగి, ఆ పాదోదకం శిరస్సున దాల్చి "ఆర్యపుత్రుల కింతకాలానికి నాయందు అనుగ్రహం కలిగింది. అంతే చాలు! నా నోములన్నీ ఫలించాయి" అని సంబరపడింది.

అతడు ఎంతో సంతోషించి తాను తెచ్చిన రత్నాలను ఆమెకు కానుకగా ఇచ్చాడు. ఆ రత్నాల కాంతులు మిరమిట్లు గొలుపుతున్నాయి. అతనిది దేవతాప్రభావం అని చెప్పాడు. అవి ధరించిన సునీతి దివ్యంగా మెరుస్తోంది. అయితే, ఆ పురుషాగ్రణి రతి తప్ప, మిగిలిన శృంగార చేష్టలతో ఆమెకు తృప్తికలిగించి రాత్రంతా గడిపి, ఉదయాన్నే వెళ్ళిపోతున్నాడు. అలాగే వస్తూనే ప్రతి రోజు విలువైన మణులు ఇస్తున్నాడు.

అన్ని రత్నాలు– మణులు ఆమె మాత్రం ఏం చేసుకుంటుంది? అందుకని – ఆమె వాటిని మార్చి దేవతారాధనలు – వ్రతాలు – దానధర్మాల నిమిత్తం ఖర్చు చేయడం ప్రారంభించింది. ఇట్లా ఏ రోజు తెచ్చిన దా రోజునే వ్యయమవుతోంది. అచిరకాలంలోనే జయభద్రుడికి అన్నదమ్ములందరికంటె గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగాయి. అతడి భార్యగా సునీతికి పుణ్యాత్మురాలని కీర్తి వచ్చింది.

ఇంతవరకు విన్న గోపాలుడు రెండు చేతులూ జోడించి"అయ్యా మణిసిద్ధుల వారూ! తమరి కథకు నా జోహారులు అవునూ! నాకో సందేహం! ఏదో చెప్పిందల్లా వింటున్నాడీ వెర్రిగొల్లడు అనుకుంటున్నారా?" అని వేళా కోళం ఆడాడు. అంతలోనే వినయంగా "లేకపోతే ఇదేమిటండీ గురువరా! కారణం– సందర్భం లేకుండా తోచిందల్లా చెప్తున్నారా? జయభద్రుడుండేదెక్కడ? చంద్రిక ఇంట్లోనే రాత్రీ పగలూ గడుపుతున్నాడని– భోజనానికే ఇంటికొచ్చేవాడని ఇంతకు ముందు చెప్పారు. దాన్ని విడిచి ప్రతిరాత్రీ సునీతితో గడపడం ఎలా సాధ్యం? సరే! వచ్చాడనుకుందాం! అంత విలువైన రత్నాలు ఎలా తెస్తున్నాడు? రతిసౌఖ్యం కోసమే చంద్రికని వదలని మహానుభావుడు జయభద్రుడు సునీతితో రతి జరపకుండానే

ఎలా సంతృప్తి పడుతున్నాడు? అలా ఎందుకు చేస్తున్నాడో చెప్పనేలేదు. నాకు అర్థం కానందువల్ల అడిగాను దయచేసి వివరించండి" అని కోరాడు గోపకుమారుడు.

మణిసిద్ధుడు నవ్వుతూ "నువ్వు కథ శ్రద్ధగా వింటున్నావో లేదో అని పరీక్షించానులే! నువ్వు సందేహపడ్డావూ అంటే కథను బాగా వింటున్నావని గ్రహించాను. సరే! విను! ఏది అడగాలో అదే అడిగావు వశీకరణ పసరును సునీతి పుట్టలో పోసేసిందని చెప్పానుకదా! ఆ పసరు ఎక్కడ పడిందనుకున్నావు? పాతాళలోకంలోని నాగరాజు భూలోకానికి విహారం కోసం ఆ మార్గం ద్వారా వస్తూంటే అతని తలపైన పడిందా పసరు. దాంతో సునీతి మీద అతడికి అనురాగం కలిగింది. పసరు ప్రభావం పనిచేయకుండా ఎలా ఉంటుంది? అతడు కామరూపుడైనందువల్ల జయభద్రుని వేషంలోనే సునీతి చెంతకొచ్చాడు. కాని ఆమె పాతివ్రత్యానికి భంగం కలిగించడానికి ఇష్టపడక తన దివ్య ప్రభావం వల్ల ఆమెకు స్పర్శ తోనే తృప్తి పరస్తూవస్తున్నాడు. సందేహం తీరింది కదా! ఇక తర్వాత గాథవిను! ప్రతిరోజూ ఇదేతీరున కొంతకాలం సాగింది.

నిజమైన జయభద్రునికీ వృత్తాంతంలో అణువంతైనా తెలీదు. అతడికి చంద్రిక తోడిదేలోకమైంది. ఇది ఇలా ఉండగా ఒకరోజున చంద్రిక తన మేడద్వారం దగ్గర నిలబడి వీధిలోకి చూస్తూన్నది. ఇద్దరు బ్రాహ్మణులు సునీతి కానుకగా ఇచ్చిన మణిహారాలు చేతధరించి ఆ దారిన పోతూంటే, చంద్రిక వారికి నమస్కరించి "అవి ఎవరిచ్చారని" అడిగింది.

దానికా ఇద్దరు విప్రులూ ఆశ్చర్యపోతూ "ఏమమ్మా! ఈ నగరంలో ప్రసిద్ధి చెందిన దాతనే నువ్వెరగవా? సునీతి అనే పుణ్యాత్మురాలు ప్రయోజకుడైన ఆమె భర్త జయభద్రుడు ఇటువంటి వెలకట్టలేని సత్కారాలు చేస్తూ లోక ప్రసిద్ధి పొందుతూన్నారే!" అని ఆ దంపతులను పొగుడుతూ సాగిపోయారు.

చంద్రికకు ఇది మహదాశ్చర్యంగా తోచింది. తన ఇంటినుంచి కాలు బయట పెట్టని జయభద్రుడినే తానెరుగును. అటువంటిది అతడీ దానాదికాలు ఎప్పుడెలా నిర్వహిస్తున్నాడో! ఒక వేళ తనకు తెలీకుండా ఆమెకు సొమ్మిచ్చి వస్తున్నాడేమో!

ఈ ఊహ రాగానే, ఆమె తన చేటిని పిలిచి, చేయవలసిందేమిటో చెప్పి ఆ మర్నాడే సునీతి దగ్గరకు పంపించింది. చేటి ఒక వృద్ధ బ్రాహ్మణస్త్రీ వలె వేషం ధరించి సునీతి దగ్గరకెళ్లింది. తనది కాశ్మీరదేశమనీ, తన భర్త చిన్నతనంలోనే తననీ, ఇంటినీ వదిలి కాశీ వెళ్లాడనీ; ఎంతకూ తిరిగి రాని అతడిని వెతుక్కుంటూ తాను దేశాటనం చేస్తున్నాననీ; సునీతికి –ఆమెపతికి పేరుప్రఖ్యాతులు అంతటా విస్తరించినందువల్ల ఆమెను చూడవచ్చాననీ చెప్పింది. పనిలోపనిగా ఆమె భర్తకు ఆమెపట్లగల అనురాగం గురించీ, సంతానం గురించీ, ఈ చేస్తున్న దానధర్మాలు ఆమె పతి దేవుని సంపాదనో, పుట్టింటి నుంచి తెచ్చినవో తెలుసుకోగోరింది. "నాకు నా భర్త ప్రత్యక్షదైవం– నాకు ఈ ఐశ్వర్యం పతి సంపాదించినదే! నాకు ఇంకా సంతానం లేదు. అయితే దైవానుగ్రహంవల్ల నాకు ఏ కొరతాలేదు– నా భర్తకు కూడా ఈ దానధర్మాలు ఇష్టమేగనుక భర్త ఇష్టానికి వ్యతిరేకంగా పత్నిప్రవర్తించదు గనుక నాకీసౌభాగ్యం అబ్బింది" అని చెప్పి ఆ బ్రాహ్మణికి విందుభోజనం పెట్టి దారి ఖర్చులకు పనికొస్తుందని ఒక ముత్యాలహారం కానుకగా ఇచ్చింది సునీతి.

ఆహారాన్ని ఆనందంగా స్వీకరించిన దూతిక, సునీతిని దీవించి అక్కడ్నుంచి సరాసరి చంద్రిక దగ్గరకొచ్చి హారం చూపించి సునీతి దాతృత్వం గురించి గొప్పగా చెప్పింది. చంద్రిక ఆహారం పరిశీలించి" ఓహో! ఈ జయభద్రుడు అమాయకుడనుకున్నాను గాని, ఎంత టక్కరి? ఇలాంటి హారాన్ని ఒక్కనాడైనా ముచ్చటకోసమన్నా నాకు తెచ్చి ఇవ్వలేదతడు. దారిన పొయ్యేవారికి దానం చెయ్యమని రహస్యంగా ఆ సునీతికి ఎలా ఇస్తున్నాడో! ఇతడు రాకుమారుడుకదా! ఒక నాటికి కాకున్నా ఇంకొక నాటికైనా ఇంతకింతా తిరిగి సంపాదించలేనా అని ఇంతకాలం నా సంపద ఖర్చుచేస్తూ వచ్చాను. నేనేదైనా అడిగితే తాను తండ్రి చాటు బిడ్డనంటాడు. ఈ బొంకరిని ఏం చేసినా పాపం లేదు! ఇతడికీ రాత్రికే తగిన ప్రాయశ్చిత్తం చేసి తీరుతాను" అని నిశ్చయించుకుంది.

అంతకు పూర్వమే తనకు పరిచయం వున్న నలుగురు దొంగలను పిలువనంపింది. వాళ్లకు చెప్పాల్సినవి చెప్పి పంపించేసింది. జయభద్రుడు ఇంటిదగ్గర భోజనం చేసి, రాత్రి తిరిగి చంద్రిక చెంతకు చేరకోబోగా, ఆమె

తనకు ఒంట్లో బాగాలేదని, ఈ రోజు ఇంకొక మంచంమీద పడుకోమనీ చేటి చేత చెప్పించి, తాను వేరొక గదిలోనికి పోయి పడుకుంది.

ఇంతకాలం చంద్రిక తోడుగా హంసతూలికా తల్పం మీద పడుకొని ఉన్న జయభద్రునికి, ఆ పూట వేరొక మారు మూలగదిలో అంతశ్రేష్ఠం కానట్టి మంచమే గతైంది. దానికి తోడు తన ప్రియురాలికి దేహ స్వస్థత లేదన్న విషయమొకటి అతడ్ని నిద్రకు దూరం చెశాయి.

పరిచారికని పిలిచి, ఆమె అస్వస్థత ఏమిటో కనుక్కొని రమ్మనీ- వైద్యుల్ని పిలిపించే ఏర్పాడు చేస్తాననీ అన్నాడు జయభద్రుడు తన యజమానురాలి సంగతి తెలిసిన ఆ చేటి "అయ్యా! ఇప్పుడెవరొచ్చినా రానివ్వద్దని అమ్మగారి ఆజ్ఞ. గాఢంగా నిద్రపోతూన్నది. మీరా మంచంమీద ఎట్లో ఈ రాత్రికి శయనిస్తేరేపు ఉదయం అన్నీ విచారించవచ్చు అనేసి చక్కాపోయింది. అంత ఖచ్చితంగా లేపుటకు వీలుకాదన్నాక- జయభద్రుడు సిగ్గు విడిచి అడిగినా వలను పడదన్నాక ఇంకేం చేస్తాడు?

తప్పదను కొని, ఆ మూల మంచం మీదనే పడుకొని ఆలోచించుకోసాగాడు. దీనికేమైందీ వేళ? అంత అనారోగ్యంగా వుంటే, తాను చూడటానికే పనికి రాకపోయాడా? అది దాసీ చేత చెప్పించాలా? ఇంతకు నాకు ఇదేం కర్మ? మహారాజ పుత్రుడిని- నేనీ మన్మథ బాధ వల్ల కదా నేడు ఈ మూల, ఇట్లాంటి దుర్గంథంలో పరుండ వలసి వచ్చిందే! ఈ తుచ్ఛురాలి కెంత తెగువ? దీని వల్లనే కదా నేను ప్రాణమిత్రునికీ కట్టుకున్న భార్యకీ దూరమైనాను. అతి పరిచయం అనర్థదాయకం అని పెద్దలమాటలో ఆంతర్యం ఇప్పుడు బాగా బోధపడింది. రేపు నాకోసం పరితపించే నా భార్య దగ్గరకే పోతాను. అసలు ఆమె గుడ్డిదని కల్పించి ఈ జారిణే చెప్పిందేమో! ఇక దీని ముఖం చూడరాదు" అని నిశ్చయించుకుని ఆ రేయి ఎట్లో తెల్లవారినివ్వాలనుకున్నాడు. అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

కొంత సమయం గడిచాక అతనికి మెలకువ వచ్చింది. కళ్లు విప్పిచూస్తే పైన నక్షత్రాలు కనిపించాయి. ఇదేమిటి? నేను ఇంట్లో పడుకొంటే

ఈ చుక్కలు ఎలా కనిపిస్తున్నాయి? పైకప్పు ఏమైంది? అని ఆశ్చర్యపోతూంటే, మంచం కదుల్తూన్న అనుభూతి కలిగింది. ఓహో! తనని మంచంతో సహా మోసేసే ప్రయత్నం జరుగుతోందన్నమాట! ఏమవుతుందో చూద్దాం! అనుకుంటూండగా అతనికీ సంభాషణ వినిపించింది.

జమాజెట్టీల్లాటి నలుగురు మంచాన్ని మోస్తున్నారు. వారిలో భీముడు, మారేసు అనే వాళ్లిద్దరు మాట్లాడుకుంటున్నారు.

"ఒరే మారేసూ! ఎవడ్రా ఈయన? బోగందానికీ -ఇతడికీ పేచీ ఎలా వచ్చిందంటావ్?"

"భీమా! ఈయన మన రాజుగారి ఆఖరి కొడుకు- పాపం! వెర్రి బాగులోడుఁ ఉన్నదంతా తెచ్చి ముండ కిచ్చుకున్నట్లున్నాడు. ఇప్పుడిక ఇవ్వడానికేం లేదేమో! మంచంతో సహా తీసుకెళ్లి నూతిలో పారెయ్యమంది. బోగమోళ్లకి నీతి ఉంటుందా?"

"అరే! ఈయనకి పెళ్లయిందా? పెళ్లాముందా?"

"అయితే నీకు తెలీదన్నమాట! ఈయన పెళ్లామేకదరాభీమా! పేదలకు దాన ధర్మాలు చేస్తుంటాది. అలాటి దొడ్డ ఇల్లాల్ని ఇడిసి పెట్టినందుకీ రానోడికి తగినశాస్తి కావలసిందే!"

"ఈ బోగంది మన కేమిస్తానంది?"

"ఇప్పుడు కొత్తగా అడగక్కర్లేదులే! వెనుకటి మామూలే"

"ఇది వరకెవరినన్నా తీసుకుపోయావా ఏమిటి?"

"ఓహో! నీకు కొత్తకదూ! దీన్తల్లి నాటినుంచీ మేము ఈ పని చేసేవాళ్లం! కొన్నాళ్లు లేసుగాడు, మరికొన్నాళ్లు ధర్మడు వచ్చేవారు. ఆళ్లూరు వెళ్లిపోతే ఇప్పుడు నిన్ను పిలిసినాను. ఇలాటి రాసబిడ్డలను కనీసం పదిమందినైనా పారేసి ఉంటాం ఆ నూతిలో".

"వాళ్లనెందుకు పారేశావ్? పాపం!"

"ఎందుకేటి? ఉన్నన్నాళ్లూ తిన్నగా చూసి ఎప్పుడో కోపమొచ్చి ఈ ముండ చంపిస్తుంటది. ఎలాగైతేనేం, సాలుకి నాకో సంచీడు రూపాయలు ముట్టజెప్తుందిలే"

"నీకు మంచి అందే దొరికిందిలే! ఇక నుంచి ఇలాటి అవసరం వొస్తే నన్నే పిలుస్తాండు"

''ఒరే భీమా ఈ ఏడు మీ జట్టుకు కన్నాల వల్ల ఎంత గిట్టుబాటయిందేం?"

"ఇంకా పంచుకోలేదు. ఎలాగైనా నిరిటి కంటె తక్కువే!... ఏముంది బంట్రోతులకు, అమ్మోరికి, పంచాంగం చెప్పిన ప్రేమ్మడికి, నాయకుడికి ఇలా అందరికీ పంచగా ఏం మిగులుతుంది చెప్పు?"

"అవున్లే! నువ్వన్నదీ నిజమే! మునుపటి లాభాల్లేవు. అన్ని ఇళ్లలోనూ ఇనప్పెట్టిలే. గాజుదీపాలే అవి ఆర్పడమే తెలీదు. ఇంతకూ చవక చమురు మన కొంప తీస్తోంది"

"ఏం చేస్తాం? మనకు ప్రాప్తం ఉన్నంతవరకు వస్తుంది. వడిగా నడువ్".. ఈ దొంగల సంభాషణ విన్నాక, చంద్రిక ఎంత కౄరురాలో అర్థమైంది జయభద్రునికి, అప్పుడేం చెయ్యాలో తోచక దైవధ్యానం చేస్తూ. "అయ్యో! వార కాంతల వలపులు నమ్మొద్దని నా మిత్రుడెంతగానో చెప్పిచూశాడు. నేనే వినకపోయాను. అందుకు నాకీ శిక్ష సరైనదే! విధిరాత ఎలా వుంటే అలా జరుగుతుంది" అనుకుంటూ కదలకుండా అలాగే ఉండిపోయాడు. దొంగలు అతడ్ని మంచంతోసహా నూతిలో పడవేశారు.

ఆ నూతిలో నీరు ఎక్కువగా ఉండటంవల్ల- అతనికి ఈత రావడం వల్ల ఒక్క మునుగు మునిగి వెంటనే పైకి తేలి ఈదుకుంటూ, నూతి గోడల్లో మొలిచిన మర్రి మొక్క ఊతం చేసుకుని మెల్లగా గట్టున పడ్డాడు. అలసట తీర్చుకుంటూ, తన అవస్థలను వరసగా తల్చుకోసాగాడు.

ఈ లోగా అదే నూతిలో ఇంకేదో గుభాలుమని పడిన చప్పుడైంది. గట్టుమీద కూర్చొని నూతిలోపలివైపు కాళ్లు వ్రేలాడవేసుకొని ఉన్న జయభద్రుని కాళ్లకు, మృదువైన వ్రేళ్లు తగిలాయి. తనలాగానే ఇంకెవరికో ఆపద మూడిందనుకుని, ఆ వ్రేళ్లకు తన పాదాలు అందుకొని ఆసరా కల్పించేలా సహాయపడ్డాడు. కాస్త నిదానించి వంగి చూసేసరికి పొడవైన శిరోజాలు తగిలిఆమె స్త్రీ అని గ్రహించాడు. క్రమంగా ఆమెని పైకిలాగి కౌగిట బంధించి బెదురు తీర్చాడు. ఆమె అతడి భుజంపై వాలి అలుపు తీర్చుకున్నాక "నీకీ

అవస్థ ఎలా దాపురించింది? మెరుపు తీగను పరిహసించేలా ఉన్న నీకీ గతి పట్టించడానికి ఎవరికైతేనేమిగాని చేతులెలా వచ్చాయి?" అని ప్రశ్నించాడు. ఆమె తర్వాత చెబుతానన్నట్లు సంజ్ఞ చేయడంతో "పోనీలే! నీ ఆయువు గట్టిది. అర్ధరాత్రి ఇలాటి పాడు నూతిలో పడినా, ఆధారం దొరికి బతికి బైటపడ్డావు" అని ఓదార్చాడు. ఇద్దరూ పునర్జన్మ పొందినట్లుగా భావించుకున్నారు.

ఇంతలో సూర్యోదయమైంది. అది మహారణ్యం కావడం వల్ల జనసంచారం ఏమీలేదు. అటువంటి చోట ఉండడానికి భయపడి, ముందుకుసాగి ఏదైనా ఊరు చేరుకోవాలనుకున్నారు. రెండు గడియల పొద్దెక్కే వరకు అలా నడుస్తూనే ఉన్నారు. ఆమెకు ఆకలిగా ఉన్నదని గ్రహించిన జయభద్రుడు, అక్కడే ఉన్న వెలగచెట్టెక్కి పళ్లుకోసి ఆకలి తీర్చుకోమన్నాడు. ఎండవేడి భరించలేని ఆ సుకుమారి, ఆ అరణ్యంమధ్య దొరికినవే అమృతమని భావించి ఆ పళ్లుతిని కొంత సేపు చెట్టునీడన సేదదీరింది. అతడికి ఆ దీనురాలిగాథ వినాలని కుతూహలంగా ఉన్నప్పటికీ, తన కథ ముందుగా వివరిస్తే మంచిదనిపించింది.

"నేను మణిప్రస్థాన్నేలే కుంతిభోజుని ఏడవ కుమారుడ్ని" అంటూ ప్రారంభించి తన పేరు జయభద్రుడనీ– ఒక వారాంగనా విలాసం తననీ స్థితికి తెచ్చిందని తన చరిత్ర యావత్తు దాచకుండా ఆమెకు చెప్పాడు. "పైత్యరోగం గలవాని నాలుకమీద పంచదార పోసినా చేదుగానే ఉందంటాడు కదా! అలా నాకు చక్కని భార్య, మంచి మిత్రుడు ఉన్నా వెలయాలి తోడిదేలోకం అనుకున్నందుకు తగ్గశాస్తి జరిగింది" అని ముక్తాయించాడు. ఇక ఆమెకథ చెప్పమన్నట్లుగా చూశాడు.

–ఇంతవరకు చెప్పిన మణిసిద్ధుడు తదుపరి గాథ పై మజిలీలో గోపాలునకు చెపుతానన్నాడు.

కాశీ మజిలీ కథలు

20 వ మజిలీ

హైమవతి కథ

క్రిందటి మజిలీలో జయభద్రుని వృత్తాంత మంతా విన్న ఆ చిన్నది విచార సూచకంగా దీర్ఘంగా నిట్టూర్చింది. కళ్లలోంచి ఉబుకుతూన్న కన్నీటిని కొనగోటితో విదిల్చి, కోకిల కంఠంతో తన గాథ చెప్పడం ప్రారంభించిందిలా...

"ఆర్యా! అడవి ఉసిరికాయకు సైంధవలవణం జతచేసి నట్లు విధి చేసే విచిత్రాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్కొక్కప్పుడు దుఃఖం సుఖానికీ, సుఖం దుఃఖానికీ కారణమవుతుందంటారు పెద్దలు. అది నిజమే ననిపిస్తుంటుంది. మీ పితృదేవులు మా తండ్రిగారికి సఖులని చెప్పడం మీకు విస్మయం కలిగించవచ్చు! వినండి. మా తండ్రిగారి పేరు మంత్రపాల మహారాజు. మాది మగధ దేశం. అమరావతీ పట్టణం మాకు రాజధాని. మా తల్లి చంద్రమతి. ధర్మపరిపాలనా దక్షుడైన మా తండ్రి గారికి లేక లేక ఈశ్వరీ కటాక్షవశాన నేను జన్మించాను. అందువల్లనే నాకు హైమవతి అని పేరు పెట్టారు. పుట్టుకతోనే నేను అందాల రాశిని.

ఇక నాకు యుక్తవయసు వచ్చేసరికి గారాబాల బిడ్డనైన నాకోసం తగిన వరుని జతకూర్చడానికి దేశదేశాల రాకుమారుల చిత్రపటాలను తెప్పించారు మా తండ్రిగారు. ఆ చిత్ర పటాల్లో మీది కూడా ఉన్నట్లే నాకు గుర్తు. నాకూ సమ్మతమే అని తెలియజేసేంతలో మీకు వేరొక చోట వివాహం

నిశ్చయించినట్లు తెలిసి ఆగిపోయాము. ఆ తరువాత ఆశాభంగం చెందకుండా మిగిలిన వరులను పరిశీలించసాగారు మా తల్లిదండ్రులు. నా సమక్షంలోనే ఆయా రాజ పుత్రుల విశేషాలు ముచ్చటించు కోవడంవల్ల నాకు కూడా కొన్ని సంగతులు తెలుస్తూ వచ్చాయి. కళింగ దేశపురాజు వీరపాలుని పుత్రుడు గుణవర్మ. సకల విద్యల్లోనూ ఆరితేరాడు. తులతూగేంత సంపదలు లేవు. సాధారణ రాజ్యం. గుణవర్మ మంచి రూపసికూడా. లాటదేశపు ప్రభువు శూరపాలుడు. ఆయన పుత్రుడు ధన వర్మ. మామూలు అందగాడు. విద్య కూడా అంతంత మాత్రం. కుబేరునితో సమానమైన సంపద ఉంది. రాజ్యం ఫలవంతమైనది. ఈ ఇద్దరిలో ఎవరికివ్వాలా? అని మా తల్లిదండ్రులాలోచిస్తున్నారు.

శ్లో॥ కన్యావరయతే రూపం - మాతా విత్తం పితాశ్రుతం ।
బాంధవాః కున మిచ్ఛంతి మృష్టాన్న మితరే జనాః॥

అని నానుడి ఉండనే వుంది కదా! కన్య రూపాన్ని చూస్తుంది. తల్లి తన కూతురు సుఖపడాలని, వరుడికి సంపద ఉందో లేదో చూడడం సహజమే! ఆ ప్రకారం మా అమ్మ నన్ను ధనవర్మకే ఇవ్వమన్నది. కాని మా తండ్రి ధనం కంటే గుణాన్ని చూసి ఇవ్వాలన్నాడు. ధనం ఏ కారణం వల్ల హరించుకుపోయినా, విద్య వల్ల అభివృద్ధి చెందిన గుణం - తెలివి ఉపయోగించి ఏదో మార్గాన ధనం సంపాదించ వచ్చు గనుక గుణవర్మకే ఇవ్వాలని ఆయన ఉద్దేశం అయితే స్త్రీ సహజమైన బుద్ధితో మా అమ్మ విద్వాంసులవద్ద లక్ష్మి ఉండదని వాదం పెంచింది. దాంతో మా తండ్రి గారికి కోపం వచ్చి ఆమె మాటలు లక్ష్య పెట్టలేదు. గుణవర్మతో నాకు వివాహం నిశ్చయిస్తున్నట్లు వెనువెంటనే శుభలేఖ సైతం వ్రాయించి వీరపాలునికి పంపగా - పంతం పూనిన మా తల్లి రహస్యంగా ధనవర్మ తండ్రి అయిన శూరపాలునికి శుభవర్తమానం పంపింది.

రాకుమారులు ఇద్దరూ నా సౌందర్య వైభవాలు బాగా తెలిసిన వారే కావడంతో నన్ను వివాహం చేసుకోవడానికి ఉత్సాహ పడి నిర్ణయించబడిన ముహూర్తానికి ఎవరికి వారే వారికి కేటాయించిన భవనాలలో విడిది చేశారు. సకల ఉపచారాలతోను మా తండ్రిగారు గుణవర్మ

పరివారాన్ని అలరిస్తూంటే రహస్యపుటేర్పాట్లతో మాతల్లి అందుకు తానేమీ తీసిపోలేదని నిరూపించుకుంది.

వేకువజాము ముహూర్తం. రాత్రే ప్రారంభమైన వేడుకల్లో పల్లకీ సంబరం ఒకటి. గుణవర్మ, ధన వర్మలిద్దరూ పల్లకీలో ఊరేగి విడిది చేరుకున్నారు. ధనవర్మ పరివారం మాత్రం వధువుగా నా పేరు ఎక్కడా ప్రస్తావించకుండా జాగ్రత్తపడ్డారు.

అదలా ఉండగా–

ఓ అర్ధరాత్రి వేళ, మా అమ్మ రహస్యంగా నా మందిరానికొచ్చి "అమ్మాయీ! మీ తండ్రి నిన్నొక దరిద్రునికిచ్చి నీ గొంతు కోసేలాగున ఉన్నాడు– నువ్వు చూస్తే గారాబు బిడ్డవు. లేమిలో నువ్వుండలేవు. అందుకు నేనొక ఉపాయం ఆలోచించాను. రహస్యంగా పరివారంతో సహా ధనవర్మనీ రప్పించాను. అతని ఐశ్వర్యం సంగతి నీకు తెలిసిందే కదా! మన దాసి నిన్నొక బుట్టలో పెట్టి, పైన తమలపాకులు పేర్చి, నిన్ను ఆ వరుడున్న విడిదికి చేరుస్తుంది. అక్కడ సమస్తమైన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. నువ్వా బుట్టలో కూర్చో!" అని ప్రత్యేకంగానూ, సౌకర్యంగానూ అల్లించిన ఒక పుట్టిక (గంప)లో నన్ను కూర్చోమన్నది.

స్త్రీ సహజమైన చాపల్యంకొద్దీ నేను తల్లి పక్షమే వహించి సరేనన్నాను. నన్నాగంపలో ఇమిడికగా కూర్చోబెట్టి, గాలి వచ్చేందుకు వీలుగా ఆకులు పేర్చడం చేత నాకు శ్వాసకు కష్టం కలగకుండా చేసి దాసి ఆ గంప నెత్తుకొని రాజవీధి గుండా నిర్ణీత భవనానికి తీసుకు వెళ్లసాగింది. కోట కావలి భటులకు రాణిగారి దాసి అని తెలిసిఉన్నందున ఎలాటి ప్రశ్నలు వేయకుండా పోనిచ్చారు.

దగ్గరిదారిలో అది నన్ను విడిదికి తీసుకెళ్తుండగా ఒకచోట ఇళ్లంటుకుని పెద్దపెద్ద మంటలు రేగాయి. ప్రజలు హాహాకారాలు చేస్తూ సామాన్లు బైటకు విసిరేస్తూండడంతో అవి త్రోవ కడ్డంపడి, దాసి త్వరత్వరగా పోవడానికి ఆటంకమయ్యాయి. అది ఆగి–ఆగి అటు ఇటూ చూసుకుంటూ నడుస్తుండడంతో, ఆ ప్రాంత ప్రజల సామాను గంపకెత్తి పట్టుకు పోతోందని

భావించిన రక్షకభటులు ఆమెను ఆపి ప్రశ్నలు వేశారు. అది తత్తరపడి ఒకమాటకు బదులు ఇంకో మాట చెప్పేసరికి భటులు అనుమానంతో ఆ గంపని అక్కడే పెట్టించేశారు. తమలపాకులున్నందున అగ్ని ప్రమాద భయం లేదనుకుని, ఆ భటులు మంటలు ఆర్పేందుకు అటువైపు వెళ్లిపోయారు.

ఇటువంటి అంతరాయం వస్తుందని ఊహించని దాసి, రాజదండన భయంకొద్దీ ఆ సందట్లో ఎటో పారిపోయింది. ఆ చిత్రమంతా గంపకున్న రంధ్రాల్లోంచి నాకు కనిపిస్తోంది. రక్షకభటులు వెళ్లిపోయేంత వరకు ఆ చుట్టుప్రక్కల ఎక్కడైనా ఉండి ఆ చేటి నన్ను తీసుకెళ్తుందనుకున్నాను. అది మళ్లీ కనబడలేదు. ఈ లోగా గుర్రాల మీద సంచరిస్తూన్న కొందరు పురుషులు ఆ దారిన పోతూ, గృహస్తులు వీధిలోకి విసిరిన సామాన్లలో బరువైనవి, పెట్టెల్లాంటివి తమతోపాటు మోసుకుపోసాగారు. బరువుగా ఉండడంతో నా గంప కూడా వారి చిక్కంలోకి వెళ్లిపోయింది. వాళ్లు దొంగలని ఆ తర్వాత నాకు తెలిసింది. అయితే అగ్ని జ్వాలలు ఎక్కువై అందరూ వాటిని ఆర్పే ఆతృతలోన ఉండడంతో రక్షక భటులు వారిని పట్టించుకోలేదు. వారి సంభాషణ ఇలా సాగింది...

"మనం వచ్చిన వేళ మంచిది సుమీ! ఇళ్లు అంటుకోకపోయి ఉంటే, పెళ్లివారు అంత అశ్రద్ధగా ఉండరు. అప్పుడు వారి పెట్టెలు ఇంత సులభంగా మనకి చిక్కేవా?"

"అసలు ఇళ్లంటుకున్నది వాళ్ల వేడుకల వల్లనే కాబోలు ! ఏ చిచ్చు బుడ్డిరవ్వో తగిలిఉంటుంది. పెళ్లిసమయంలో ఇలాంటి పరధ్యానం మామూలే!"

"మనవేషాలు చూస్తే పెళ్లి వారమనే అనుకుంటారు తప్ప, దొంగలని ఎవరైనా అనుకుంటారా? రాణీగారి సత్రంలో పెళ్లివారికి విడిది ఇచ్చినట్టున్నారు. ఇంతకూ ఎవరో ఏమిటో?"

"ఈ సొత్తు అక్కడిదే! అవునుగానీ, వారిని చూస్తే భాగ్యవంతుల్లాగే ఉన్నారు. ఈ పూటో రేపో పెళ్లి కాబోలు! ఆర్భాటాలేం లేవేం?"

"అందరూ ఖర్చుదారి మనుషులే ఉంటారా ఏం? కాని, వరుడు మహాచక్కని వాడేనోయ్!"

"మనం పెళ్లికొచ్చిన రాజబంధువుల మనగానే నమ్మేశారు. ఎవరు ఎవరో ఎవరికీ తెలీనట్లుంది. ఇంతకూ మనల్ని తరుముకుని రారుకదా"

"నీకా భయం అక్కర్లేదులే! పది యోజనాల దూరం వచ్చాం. పైగా ఇది అడవి. ఈ దారి మనకు అలవాటు గనుక తేలిగ్గా రాగలిగాం!"

"సరే! అయితే తెల్లవారిపోకముందే ఈ పెట్టెలు విడగొట్టి సొమ్ములు పంచేసుకుందాం! అందర్నీ ఇక్కడ నిలువమని కేకపెట్టు"

వాళ్లు ఒకరొకరికి సంకేతాలు అందజేసుకుని అంతా అక్కడ గుమికూడి గుర్రాలు ఆపారు. పెట్టెలన్నీ ఓచోట చేర్చారు. ఒక్కొక్కటే ఊడదీసి వాటిలోని సొమ్ములు, రత్నాలు రాశులుగా పోసి పంచుకోసాగారు. బుట్టసందుల్లో నుంచి నాకు అంతా కనిపిస్తోంది. అప్పుడు నాకు ఏమనిపించిందంటే–

శ్లో॥ న దైవం ప్రజ్ఞయా జాతు న చ లోత్సాహ శక్తిభిః
న సహాయ బలైర్వాఽపి కశ్చిద ప్యతి వర్తతే ॥

లోకంలో ఎవ్వరైనా సరే! తన ప్రజ్ఞచేతగానీ, ఉత్సాహం చేత గానీ, శక్తిచేతగానీ, ఏ ఇతర సహాయసంపత్తుల చేత గానీ దైవఘటనని అతిక్రమించలేడు అని.

ఆ సమయంలో నా అవస్థ ఊహించ వలసిందే తప్ప, చెప్పనలవికాదు. ఎలాగో ధైర్యం వహించి ఒంటిప్రాణంలో ఆ బుట్టలో వొదిగి ఉండగా, నన్ను అక్కడికి గుర్రంమీద తెచ్చినరౌతు, గుర్రాన్నక్కడ కట్టివేసి బుట్టదింపి ఒకచివరన పెట్టెలప్రక్కగా చేర్చి ఎటో వెళ్లాడు. ఎంతకూ రాలేదు. రత్నాలపంపకంలో తలమున్కలై ఉన్న రౌతులకు నేనున్న ఆకుల గంప పట్టించుకోదగ్గదిగా కనిపించలేదు కాబోలు!

నేను మొండి ధైర్యంతో మెల్లగా ఆకులు అదలించి మూత పక్కకుతోసి బైటి కొచ్చాను. అటూ ఇటూ చూసుకుంటూ ఆ నిర్జనారణ్యంలో కొంత మేర నడిచాను. నన్నెక్కించుకుని వచ్చిన రౌతు సర్పంచేత కరవబడినట్లున్నాడు. ఒక చోట మరణించి పడివున్నాడు.

ఆ దొంగలేమయ్యారో– ఏ దిక్కుకు పోయారోగాని, నేను పట్టిన అడవిదారిలో కొంతదూరం సాగాక విలువైన వస్త్రాలు గల పెట్టెలు

తినుబండారాలున్న బుట్టలు కనిపించాయి దీనిని బట్టి ఆ అరణ్యం దొంగలు సొమ్ము పంచుకోడానికి వీలుగా ఉపయోగించుకుంటున్నారని నాకు అర్థమైంది. నగలూ - నాణ్యాలూ పంచుకుని, చిరిగిపోయేవీ, అశాశ్వతమైనవీ వదిలేసి పోయుంటారు. ఏమైతేనేం? నాకు ఆకలి తీర్చేందుకే అవి అక్కడ ఉన్నాయని పించింది. అవి విని కొంత సేదదీరి, కొన్ని మూటకట్టుకుని, ఎదురుగా కనిపించిన ఒకదారి వెంట వెళ్లసాగాను .

ఇంతలో...

పులి గాండ్రింపు వినిపించేసరికి భయపడ్డాను. క్రూరమృగాలు సంచరించే అడవిలోకి నేను రావడం- ఆపదల పాలబడటం ఇదంతా కలా? నిజమా? హోదైవమా? నీదేభారం అని దైవధ్యానం చేసుకుంటూ అంతవరకు వచ్చిన నాకు పులి గాండ్రు మనగానే గుండెలు జారి మూర్ఛబోయాను. మళ్లీ తెలివి వచ్చి తెప్పరిల్లేసరికి పులి బాణం దెబ్బకు వచ్చి పడివున్నది.

నన్నాక్రూరమృగం బారినుంచి రక్షించింది ఒక ఆటవికుడు. జంతువును బోలినట్లుగా వురి మిడిగ్రుడ్లు, కోరపళ్లు, నల్లని ముఖం విల్లూ-బాణాలూ ఉండడం వల్ల మనిషని గ్రహించాను. అతడు నన్ను చంపేస్తాడేమోనని భయంకూడా కలిగింది. కాని, నా ప్రాణం కాపాడినవాడు నన్నెందుకు చంపుతాడు? పైగా నాకు రక్షణ కల్పించానుకుంటున్నాడని నాకు ఆ తర్వాత అర్థమైంది.

నేను భయపడుతున్నానని అతడు గ్రహించాడు కాబోలు-రెండడుగులు వెనక్కు జరిగి, అంత స్పష్టంగా లేకున్నా మన భాషలోనే నన్ను ఏ వూరు? ఎక్కడ? అంటూ ప్రశ్నలు వేశాడు. వాడు మాట్లాడే పది మాటల్లోను ఒకటో రెండో తెలుస్తున్నాయి. అర్థమైనంతవరకు మీకు చెప్తున్నాను గాని ఆప్రాకృతపు మాటలు వికృతంగానే వున్నాయి. అందువల్ల సారాంశం మాత్రం మీకు వివరిస్తాను. వినండి!

నా ఊరూ పేరూ చెప్పినా వాడికి అర్థంకాలేదు. నాదికూడా ఒక అడవి అనే అనుకున్నాడు. మా నగరానికి చేర్చమనీ- ధనం ఇస్తాననీ

అన్నప్పుడు ధనమంటే ఏమిటని ప్రశ్నించాడు. అప్పుడు వాడొట్టి మృగతుల్యుడని గ్రహించాను. నేను మూట కట్టి తెచ్చిన మధుర పదార్థాలు కొన్ని వాడికి తినమని ఇచ్చాను. అవి నాగరీకులు చేసినవని తెలియక వాడు ఇవి ఏ చెట్టుకు పండిన పండ్లు? అంటూ ప్రశ్నించాడు. ఆ చెట్లు చూపించమన్నాడు. నా విలువైన పట్టువస్త్రాలు చూసి, ఈ ఆకులెంత మెత్తగా ఉన్నాయి? ఇలాంటివి మా అడవిలో లేవు అన్నాడు. అన్నిటికంటె ముఖ్యంగా నేనిచ్చిన ఆహారం తిన్నాక వాడి ఆనంద నాట్యం చూసి తీరాలి. వాడు వేసిన గంతులు ఏమని చెప్పను? అంత కష్టంలో కూడ నాకు ఎంత నవ్వు వచ్చిందో చెప్పలేను.

వాడికి పిల్లలు లేరని, భార్య ఉందని, అడవిలో దొరికే పండ్లు పచ్చిమాంసం తింటారనీ చెప్పాడు "మా ఊరీ ప్రాంతాల్లోనే ఉంది. తీసుకెళ్తాను. వస్తావా మా ఇంటికి?" అని అడిగాడు. అడవిలో మృగాల బాధ భరిస్తూఉండే కంటే ఏదో ఒక ఆశ్రయంలో ఉండటం క్షేమమని ఆలోచించి అలాగే వస్తానన్నాను.

దారిలో ఆ ఋష్యశృంగ సమానుడు "ఇందాక ఇచ్చినపండ్లు (భక్ష్యాలు) మరికొన్ని ఇవ్వనా?" అని అడిగాడు. నాకు వాడడిగిన తీరుకు జాలి కలిగి, నాదగ్గర మిగిలివున్న వన్నీ అతడికి ఇచ్చేశాను. నిజానికి పులివాతపడకుండా నన్నుకాపాడిన ఆ పుణ్యాత్ముని ఋణం ఏమిచ్చి తీర్చుకోగలను? కొంత దూరం వెళ్లాక "నువ్విక్కడ ఉండు! నేను కొట్టిన పులిమాంసంతో తిరిగొస్తా! ఒట్టి చేతులతో ఇంటికెళ్తే నా పెళ్లాం గయ్యాళిది. నన్ను బాదినా ఆశ్చర్యపడక్కర్లేదు. అదీగాక పులిమాంసం కంటె పులిచర్మం చలికాలంలో వెచ్చగా ఉంటుంది. అవి వదిలి వచ్చేశానని ఇప్పటికి గుర్తొచ్చింది" అంటూ వెనుదిరగబోయాడు.

నేను భయపడుతూ– అతన్ని వెళ్ళవద్దనీ; ఇక్కడ మృగాలబాధ ఎక్కువ గనుక నన్ను అతనింటికి చేర్చాక మళ్లీ వెళ్లి మాంసం తెచ్చుకోమనీ చెప్పాను. అతడి చేతిలో ఉన్న ధనుర్బాణాలు చూసి అడవి మృగాలు దరిదాపులకు రావడం లేదు.

అయితే తాను పులిని కొట్టినట్లు అతని భార్యకు చెప్పవద్దన్నాడు. నేను తలూపాను. కొంత దూరం తీసుకెళ్లి తాటాకులతో కప్పిన ఒక డొంకను చూపించి, అదే తన ఇల్లన్నాడు. అక్కడ వ్రేలాడుతున్నవీ- పరచివున్నవీ కొన్ని చర్మాలు తప్ప ఇంకేమీ లేవు. పైగా దుర్వాసన. పొలసుకంపు. నిముషమైన నిలువలేక ఇవతలకి వచ్చేశాను. కడుపులో వికారం మొదలై డోక్కోబోయాను. నాకు జబ్బుచేసిన దేమో అనుకుంటూ ఒక వెదురుబొంగులో దాచిన తేనె కొంత ఇచ్చాడు. ఆకలిగా ఉండడంవల్ల, ఆ తేనె సేవిస్తూ, కిరాతుడు చెప్తున్న వృత్తాంతాలు వింటూ ఆలోచించడం మొదలుపెట్టాను.

ఇంతలో- మృగంలాగ ఉన్న ఒక భీకర మానవాకారం అక్కడికొచ్చింది. అది అతడి భార్య. మాంసం తీసుకురాలేదేం? అని అడిగింది అతడేదో చెప్పాడు అంతలో దాని దృష్టి నామీద పడింది. నేను దాని ఆకారానికి బెదురుతుంటే, దాని మొగుడితో పాటు నేను కులకడానికి వచ్చాను కాబోలు అని అపోహపడి వాడితో గొడవ పడటమేగాక ముష్టియుద్ధం కూడా చేసింది. వాళ్లిద్దర్ని నా కారణంగా కొట్టుకుంటున్నందున వీడదీయాలని వెళ్లి నేనూ నాలుగు దెబ్బలు తిన్నాను. ఆ ప్రయత్నం మానుకున్నాను.

కొంత జగడం ముగిశాక నేను చెప్తున్నదేమీ వినిపించుకోక నేను దానికాపురం చెడగొట్టడానికే వచ్చాను కాబోలుననుకుని తన బంధువులతో చెప్పి నన్నేదో చేయిస్తానంది.

చీకటిపడింది. నాకు జంతుభయం- రక్షణకేది దారి? అని అడగ్గా, తాము తోళ్లుకప్పుకొను రీతి చూపించి- ఇట్లే పులిచర్మం కప్పుకుంటే ఏ మృగమూ నీ దరికి రాదన్నాడు. తన భార్య కల్లుతాగి అలా అరుస్తోందని- రేపు అదే వస్తుందిలే నువ్వు నిద్రపో అని ఓదార్చాడు.

దుర్గంధ పూరితంగా ఉన్న ఆ చర్మం కప్పుకొని అవస్థపడలేక అటు ఇటు కదుల్తూంటే అది పదిమంది యమకింకరుల్లాంటి వారిని వెంటబెట్టుకొచ్చింది. నన్నువారికి చూపిస్తూ "నా కాపురం పడద్రొచ్చిన రంకులాడి ఇదే" అంది.

ఆ క్రూరులు నన్ను నానా విధాల నిందిస్తూ దాని పెనిమిటితో "ఓరీ! కులం మర్యాద విడిచేసి మరో దాన్నుంచుకుని పెళ్లాన్ని చావగొడతావా? కులంలో నీకు తప్పు పెట్టిస్తాం. నువ్వు తీసుకొచ్చిన దీని సంగతి ముందు చూస్తాం!" అంటూ అరిచారు.

నన్ను అమాంతం అన్ని వైపులనుంచీ లేవనెత్తి భుజాల మీదికెత్తుకుని, వేగంగా పరుగులు తీస్తూ, ఆ నూతిలోకి విసిరేసి "చావు రండా!" అంటూ కేకలు పెట్టి అంత వేగంగానూ పోయారు. తదుపరి వృత్తాంతం మీరెరిగినదే" అని తన కథ ముగించింది.

మణిసిద్ధుడు తరువాయి కథ పై మజిలీలో ఇలా చెప్పసాగాడు.

కాశీ మజిలీ కథలు

21 వ మజిలీ

"శిష్యా! విను!...

జయభద్రుడు హైమవతి వృత్తాంతం అంతా విని చాలా ఆశ్చర్యపోయాడు. దైవసంకల్పం ఎంతో చిత్రమైనదని- మానవుల సంకల్పాలు వెర్రి ప్రయత్నాలని అనుకున్నాడు. ఆమె మీద అతనికి ప్రేమ జనించినా, మనస్సు తెలుసుకోకుండా తొందరపడరాదని నిర్ణయించుకున్నాడు.

"హైమవతీ! సూర్యప్రతాపం అంతకంతకూ ఎక్కువవుతోంది. ఇది క్రూరమృగాలు సంచరించే అరణ్యం. రాత్రి ఈ అడవుల్లో నడయాడడం ప్రమాదం. కనుక వడివడిగా నడచి చీకటి పడక ముందే ఏదో ఒక జనావాసానికి పోవలసి వుంది. సుకుమారివైన నీవు ఇప్పటికే చాలా అలసివున్నావు. ఇక నువ్వు నడవడం కష్టం! నా భుజాల మీద కూర్చో! నిన్ను తీసుకెళ్తాను" అన్నాడు.

"ఆర్యా! నేను మీకంత శ్రమ నివ్వజాలను. దేవుడిలా నన్ను ఆ పాడునూతిలో నుంచి ఉద్ధరించారు. అందుకు ప్రతిగా ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలనా! అని ఆలోచిస్తున్న దాన్ని. మరింత శ్రమ పెట్టదలచుకోలేదు. మీ అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తాను" అన్నదా చిన్నది.

సరేనని ఒక దారి పట్టారిద్దరూ. మాటలైతే గంభీరంగానే చెప్పిందిగాని, నడవలేక ఆయాసపడసాగిందామె. దారిలో అక్కడక్కడ అలుపుతీర్చుకొంటూ, చెమట తుడుచుకుంటూ సాయంత్రందాకా ఏదోలా అతని వెంట చాలా దూరం నడిచింది. ఒక్క ఊరైనా తగల్లేదు వారికి. చూస్తూండగానే పొద్దుపోయింది.

జంతువుల 'అరుపులు వింటూ, 'ఎలా తెల్లారుతుందో ఈ రాత్రి?' అని బెదరసాగింది. "భయం వద్దు! నీ ప్రాణాలకు నా ప్రాణాలడ్డం వేసి ఈ రేయంతా మేలుకుని అయినా నిన్ను కాపాడతాను" అని భరోసా ఇచ్చాడు జయభద్రుడు.

భయపడుతూన్నదానిలా ఆమె అతడ్ని కౌగలించుకుంది. అతడు కూడా, ఆమెని ఓదారుస్తూన్నట్లుగా, ఆమె వెన్ను ఎడమచేత అదిమి, ముఖానికి ముఖం దగ్గరగా చేర్చాడు. ఇద్దరి హృదయాల్లోనూ మన్మధభావ పరంపరలు చెలరేగాయి. గాని, ఒకరైనా ముందుగా తను నోటితో ఆ భావాన్ని మాటల్లో వ్యక్తపరచరైతిరి.

అక్కడే ఉన్న ఒక రాతి పలకనే తల్పంగా చేసి, తన తొడమీద తలపెట్టుకుని నిద్రపొమ్మని హేమలతతో అన్నాడు జయభద్రుడు.

అలా ఆరాత్రి త్వరగానే తెల్లవారింది. ఉదయం లేచి చూసేసరికి వారి దరిదాపుల్లోనే జీనుకట్టిన గుర్రం ఒకటి మేస్తూ కనిపించింది. అది హేమలతను గంపతోసహా ఆ అరణ్యంలోకి తీసుకురావడానికి కారణమైన గుర్రమే! దాన్ని గుర్తు పట్టిన హేమలత" అది చనిపోయిన రౌతుది. అంటే అతడి కర్మానికి అతడిని వదిలేసి దొంగలు వెళ్లిపోయారు కాబోలు! ఈ గుర్రం ఇంకా అడవిలోనే తిరుగాడుతోంది" అంది. ఇద్దరూ దాన్ని అధిరోహించారు.

అడవిలో తిరుగాడిన అనుభవం ఆ గుర్రానికి ఉండడంతో అది ముళ్లడొంకలు-అడ్డదిడ్డంగా పెరిగిన పొదలు సైతం లెక్కచేయకుండా వాయువేగంతో అడవిని దాటించి తీరైన రహదారి పట్టి అతి స్వల్ప సమయంలోనే ఒక గ్రామానికి చేర్చింది. అక్కడ ఒకచోట బసచేసి, భోజనానంతరం విశ్రాంతి తీసుకుంటూంటే, బ్రాహ్మణులు కొందరు దేశాటనం చేస్తూ, వివిధ ప్రాంతాల ముచ్చట్లు చెప్పుకోవడంతో వారికి నానా దేశాల విశేషాలు తెలిసే అవకాశం అనుకోకుండా లభించింది.

వారి మాటలప్రకారం - అమరావతి నేలే మంత్రపాలుడు తన కూతురు హైమవతిని వీరపాలుడి పుత్రుడైన గుణవర్మకిచ్చి వివాహం చేయనిశ్చయించి సుమూహూర్తంలో వైభవంగా కన్యాదానం చేసినట్లు,

అయితే చిత్రపటంలో చూపిన హైమవతి ఆమె కానేకాదని అల్లరి పుట్టినట్లూ, కొట్లాట జరిగినట్లూ తెలిసింది. తర్వాత హైమవతెక్కడున్నదో గాలించమని మంత్రపాలుడు భటుల్ని నగరం నలుమూలలకీ పంపించాడు గాని, ఆమె జాడ తెలియరాలేదు. అకారణంగా తమని వంచనకు 'గురిచేశాడని కక్షపెంచుకున్నారు వీరపాల– శూరపాలులిద్దరూ. దేశదేశాలకూ దూతలను పంపి, తన కూతురి జాడ తెలిపిన వారికి గొప్ప బహుమతి కూడా ఇస్తానని చాటింపు వేయించాడా ప్రభువు.

ఇక –ఇక్కడ కుంతి భోజుని రాజ్యంలో యథాప్రకారం సునీతి బ్రాహ్మణులకు రత్నహారాలు దానాలుగా ఇస్తూనే వుందట. అవి పొందగలిగితే ఇంకెవ్వర్నీ ఎప్పుడూ ఏదీ యాచించవలసిన గతి ఉండదని చెప్పుకోగా విని ఆ సత్రం అరుగుమీద చేరిన బ్రాహ్మణులలో కొందరు ఆ దేశానికి పయనమయ్యారు.

అప్పుడు హైమవతి ఇలా అన్నది "చూశారుగా ఆర్యపుత్రా! ఈ బ్రాహ్మణుల మాటలు వింటూంటే, నావల్ల నా తల్లిదండ్రులకు ఎన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయోకదా! ఇప్పుడు నేను ఇంటికెళ్లాలనుకున్నా, నా తల్లిదండ్రులకు ఇంకా చిక్కులు కొని తెచ్చిన దాన్నవుతాను. కక్షగట్టిన రాజులిద్దరూ నేను కంటబడితే ఊరుకుంటారా? మా తల్లిదండ్రుల్ని నిర్బంధిస్తే, వాళ్లకి అది బలవన్మరణ హేతువు కాబోదా? ఇక అప్పుడు నా పరిస్థితి తల్చుకుంటేనే నాకు భయంగా ఉంది"

ఆమెను ఓదార్చుతూ జయభద్రుడు "విచారించకు! ఆ శత్రువులను జయించి, నేను మీ తండ్రికి సంతోషం కలిగిస్తాను. మనం త్వరగా అమరావతి వెళదాం" అన్నాడు సరేనని ఆమె సమ్మతించింది.

రెండ్రోజుల తర్వాత ఇద్దరూ ఇంకొక ఊరు చేరుకున్నారు. భోజనాదికాలకు సొమ్ముకావాలి కదా! ఏం చెయ్యడమా? అని సందేహిస్తూంటే హైమవతి తన చెవికమ్మ నవరత్నాలతో చెక్కినది తీసిచ్చింది. అతడా నగతో ఒక షావుకారి చేత వంచింపబడినా భోజనానికి లోటులేని రీతిగా ఆ పూట గడిపేయగలిగాడు. ఆ సాయంత్రం ఒక దేవాలయంలో ఓ

సన్యాసి కనిపించగా అతడ్ని వరహా దక్షిణ ఇచ్చి భోజనం చేయమనడానికి బదులు, తమ బసకు పిలిచి భోజనం పెట్టించి దక్షిణగా హైమవతి చేతి రత్నకంకణం ఇచ్చారు వాళ్లు.

వారి ప్రయాణం మరికొంత ముందుకుసాగాక, వారికి కొందరు నగలవర్తకుల సంభాషణలో ఇంకొక విషయం తెలిసింది. వీరపాల-శూరపాలు లిద్దరూ ఏకమై, హైమవతి తల్లిదండ్రుల్ని ఖైదులో పెట్టి, హైమవతి జాడ కనిపెట్టమని గూఢచారుల్ని పంపించారట. వారిలో కొందరికి అక్కడకు కొన్ని యోజనాల దూరంలో ఉన్న గ్రామంలో హైమవతి కర్ణాభరణం, రత్నకంకణం ఓ నగలవర్తకుని వద్దా ఓ సన్యాసి వద్దా- దొరకాయట. వారిని విచారిస్తున్నారని తెలిసింది. ఇదీ ఆ వర్తకుల మాటల సారాంశం.

ఆ మాటలు విన్న హైమవతి చాలా వేదన చెంది, "నా తల్లిదండ్రులు ఏమన్నా చోరులా? చెరసాలలో పెట్టించారట! ఎంతకష్టం దాపురించింది వారికి? నేను త్వరగా వెళ్లి వాళ్లకి కనబడితేగాని, వారి చెరవీడదు. పదండి" అంటూ తొందర పెట్టింది.

"నువ్వు అక్కడకు చేరి కనబడినంతమాత్రాన ఏమవుతుందని నీ ఊహ? ఆ ఇద్దరిలో ఎవరిని వరిస్తావు? అది అలా ఉంచు! నువ్వు కనబడడంతోనే ధనవర్మ గుణవర్మలు కలహించుకోవడం ఖాయం" అన్నాడు జయభద్రుడు. దానికామె ఇంకా అధికంగా ఖేదపడసాగింది.

"విచారించి ప్రయోజనం లేదు. ఊరుకో! నేను నా బుద్ధిబలంతో నీ తల్లిదండ్రుల చెర విడిపిస్తాను" అని ఊరడించాడు అతడు.

ఆ రాత్రికే ఇద్దరూ అమరావతి చేరుకుని, ఒక బ్రాహ్మణునింట బసచేసి, రోజుకో రీతిగా వేషాలు మార్చి సంచరిస్తూ అక్కడి విశేషాలన్నీ తెలుసుకున్నారు. జయభద్రుడు రాజసమ్మతమైనట్టిదీ గౌరవనీయమైనదీ అయిన వేషం వేసుకుని ధనవర్మ గుణవర్మలుండే మందిరాలకు తరచుగా వెళ్తూ క్రమంగా తన విద్యాపాటవంతో వారి మైత్రి సంపాదించాడు. అతి తక్కువ కాలంలోనే తన మాట మీద వారికి గురి కుదిరేలా చేసుకున్నాడు కూడా! వారు తమ ఆంతరంగిక విషయాలు జయభద్రునితో చెప్పి సలహాలు స్వీకరించేటంత గాఢ స్నేహం కుదిరే వరకు ఓపిక పట్టాడు.

హైమవతి కథ

ఒక రోజు...

ధనమదం అధికంగా ఉండే ధనవర్మ "మిత్రమా! నీ కంటే నాకు ఆప్తులు ఎవరున్నారు? నీతో నా రహస్యాలు సైతం చెప్పుకుంటున్నాను. కులపరిపాటి అయినా పాటించక, నేను రహస్యంగా హైమవతిని వివాహమాడాలని ఇక్కడ కొచ్చాను. ఆమె దక్కలేదు. గుణవర్మ పరిస్థితీ అంతే! ఆమె తల్లితండ్రులు ఆ చిన్నదాని నెక్కడో దాచిపట్టి మా ఇద్దర్నీ అవమానించారు. ఏ విధంగా అడిగిచూసినా నిజం చెప్పడం లేదు. ఏ మారుమూల గ్రామంలోనో ఆమె అలంకరణలు ఆనవాళ్లుగా,దొరికాయి. జాడమాత్రంలేదు. నువ్వు నీ బుద్ధి కుశలతతో ఎలాగైనా ఆమె ఉనికి కనుక్కోవాలి. నన్ను అవమానించిన చంద్ర పాలుని చంపెయ్యాలను కుంటున్నాను. అయితే హైమవతి తన తల్లిదండ్రుల కోసమైనా ఏదో నాటికి రాజధాని చేరుకోదా. అంతవరకు ఓపిక పట్టమంటాడు గుణవర్మ అందులో కొంత నిజం ఉండడం చేత ఇంతకాలం ఆగాను లేకపోయినట్లయితే- తన కూతుర్ని మొదటే నాకు ఇవ్వలేదన్న ఈర్ష్యఉంది నాకు" అని తన కూతుర్ని అని తన మనసులో మాటగా చెప్పాడు.

జయభద్రుడతని దురూహలకు ఆశ్చర్యపోయి, అంతలోనే అది కన్పించ నీయక జాగ్రత్తపడుతూ "మిత్రమా! తొందరపడకు. నేను ఇదివరకే కొంత సమాచారం తెలుసుకున్నాను. నిజానిజాలు ఇంకా తేలవలసి ఉంది. నిస్సంశయంగా తెలిస్తే తప్పు చెప్పడం ధర్మం కాదు. హైమవతి విషయంలో మంత్రపాలుడు నిజంగా నిరపరాధి" అంటూ కొంత గడుపు విధించాడు. గడువు తీరగానే ధనవర్మ, తానే స్వయంగా జయభద్రుని దగ్గరకొచ్చి ఆత్రంగా విషయమేమిటో చెప్పమన్నాడు.

దైవం తనకు అనుకూలంగా మారినందుకు ఆనందిస్తూ "ధనవర్మా! లోకంలో కొందరు మిత్రుల్లా నటిస్తూ పగతీర్చుకుంటారు. అందువల్లనే ఎవర్నీ నమ్మకూడదు. హైమవతి ఎక్కడికీ వెళ్లలేదు. నీకు మిత్రునిగా నటిస్తూన్న గుణవర్మ అధీనురాలై ఉంది అతడు రహస్యంగా ఆమెతో సుఖిస్తూనే ఉన్నాడు. నువ్వు అమాయకుడివి గనుక, నీకు నిజం తెలియనివ్వక జాగ్రత్తపడుతున్నాడతడు కావాలంటే నీకు ప్రత్యక్షంగా చూపిస్తాను" అని చెప్పాడు జయభద్రుడు.

అది విని అగ్గి ఉగ్రుడైపోయిన ధనవర్మ "నువ్వు చెప్తున్నది నిజమా? ఆ సంగతి నాకు ప్రత్యక్షంగా చూపిస్తే నీకు అర్ధరాజ్యం ఇస్తాను. అయినా నా ముందు ఆ గుణవర్మ ఎంత? నేను వాళ్ల రాజ్యానికే అప్పివ్వగలిగినట్టి స్థితిమంతుడిని! ఇంతకూ ఎప్పుడూ ఆ సంగతి బుజువు పరుస్తావ్?" అని త్వరపెట్టాడు.

జయభద్రుడు నాలుగురోజులు గడువడిగాడు. సమయంచూసి గుణవర్మ దగ్గరకూడా హైమవతి విషయం ప్రస్తావించి, ధనవర్మ దగ్గర చెప్పినట్లే చెప్పి అతనికీ ఉడుకు తెప్పించాడు. ఆహా! బుద్ధికి సాధ్యంకాని పని ఉండదుకదా!

జయభద్రుడు ఒక నాటిరాత్రి తన పథకానికి అనుగుణంగా ఉండే రాజసౌధాన్ని చక్కగా అలంకరింపచేసి, ఒక హంస తూలికా తల్పం మీద హైమవతిని కూర్చుండబెట్టి, పూలదండలు కడుతూన్నట్లు- ఆకుమడుపులు చుడుతున్నట్లు ఏదో ఒక రసికత్వసూచితమైన కార్యంలో నిమగ్నమై ఉన్నట్లు అభినయించవలసిందిగా చెప్పి, బైటికి వెళ్లాడు. ధనవర్మనీ- గుణవర్మనీ విడివిడిగా కలిసి, ఒకరి తరువాత ఒకర్ని ఆ మేడలోనికి ప్రవేశింపజేశాడు. ఇద్దరినీ రెండు వేర్వేరు గదులలో ఒకరికి తెలీకుండా ఒకరిని ఉంచాడు.

మొట్టమొదటగా- ధనవర్మకి ఒక కిటికీలోంచి హైమవతి చూపించాడు. ధనవర్మ ఉప్పొంగి పోతూ జయభద్రుని వీపు తట్టి "శహభాష్ చెలికాడా! నువ్వు అన్నమాట నిలబెట్టుకున్నావు. హైమవతిని సశరీరంగా నాకు చూపించావు. ఆ అందగత్తెను చూసి ఈ కళ్ళు సార్థకమయ్యాయి. ఇలాంటి అందగత్తెని పొందని జన్మమేల? దుర్మార్గుడైన గుణవర్మ నాకు అడ్డం వస్తున్నాడు. రేపు అతడి పని పట్టేస్తాను హైమవతి సరే! గుణవర్మ ఇందులో ఎక్కడ?" అని అడిగాడు.

"నువ్వు ఈ గదిలోనే పీఠం మీద కూర్చొని తాంబూలం వేసుకుంటూండు. ఈ దారినే నీ వైరి గుణవర్మ వచ్చి ఆ గదిలోకి వెళ్తాడు. వాళ్లు తలుపులు బిగించుకుని సరససల్లాపాల్లో మునిగిపోతారు. మనోహరమైన వీణాగాన వినోదులయినందువల్ల నువ్వు ఇక్కడే కూర్చుంటే నీకా వీణానాదం కూడా విన్పిస్తుంది. అయినప్పటికీ నువ్వు తొందరపడి

బయటకు రావద్దు! వ్యవహారం చెడుతుంది. నేను వచ్చి పిలిచేదాకా బైటకు రాకుండావుంటే అన్నీ నీకే తెలుస్తాయి" అంటూ తాను మాత్రం బయటకొచ్చి ధనవర్మని లోపల ఉంచి, గొళ్లెంవేసి మెట్లదగ్గర గుణవర్మకోసం కాచుకొని కూర్చున్నాడతడు.

గుణవర్మ రాగానే, ఇంకొక మార్గం ద్వారా మేడమీదకు పంపి, ధనవర్మ ఉన్న గది వెనుక కిటికీ కన్నంలోంచి అతడ్ని చూపించాడు.

"ఈ మిత్రద్రోహి నాతో చెప్పక ఎలాటిపనిచేస్తున్నాడో! కానీ! వీడిసంగతి రేపు చూస్తా! ఇంతకూ హైమవతి ఎక్కడ?" అని అడిగాడు గుణవర్మ. ధనవర్మ ఉంటున్న గది ముందునుంచి గుణవర్మని తీసుకెళ్లాడు. బైట గొళ్లెంవేసి ఉండడం చేత అతడ్ని ఏమీ చేయలేక ఊరుకున్నాడు ధనవర్మ.

గుణవర్మని తీసుకెళ్లిన జయభద్రుడు హైమవతిని చూపించాడు. అతడికి కూడ ధనవర్మకు కలిగినట్లుగానే ఏకకాలంలో ఆమెపై వలపు, ధనవర్మ మిత్రునిలా తనతో నటిస్తున్నాడన్న భావం కలిగాయి. అనంతరం జయభద్రుడు అతడినీ ఒక గదిలో కూర్చుండ నియమించాడు. "నువ్వలా చూస్తూండు, ఇప్పుడామెగది తలుపులు మూసుకుంటాయి. లోపల్నుంచి సరససల్లాపాలు వినిపించవచ్చు! వీణానాదం కూడా వినిపించవచ్చు!" అని బయటకు వచ్చి ఆ గది తలుపులు కూడా గొళ్లెం పెట్టి తాను హైమవతి గదిలో దూరాడు. అప్పుడామె తన గది తలుపులు తానే వేసింది. లోపల్నుంచి వీణానాదం విన్పిస్తూంటే చెరో గదిలో ఉన్న ధనవర్మ - గుణ వర్మ కుతకుత ఉడికిపోసాగారు. ఒకరికి తెలియకుండా ఒకరు- ఆ తర్వాత అతడా ఇద్దర్నీ చెరో మార్గాన ఆ సౌధం వెలుపలకు తీసుకెళ్లి "చూశారా! నేను చెప్పింది ఋజువైంది కదా!" అంటూ ఇద్దరిలోనూ అగ్గి పుట్టించి వదిలివేశాడు!

ఆ తరువాత వారు ఒకరి కొకరు ఎదురైనపుడు "నన్ను మోసం చేస్తూ ఇంకోపక్క హైమని ప్రచ్ఛన్నంగా అనుభవిస్తున్నాడు. ఏమీ తెలీనట్లు ఎలా నటిస్తున్నాడో" అని ఒకరి గురించి ఒకరు అనుకోసాగారు.

సభలో ఇద్దరం కలుస్తాం కదా! అప్పుడు సౌహార్ద్ర చిహ్నంగా ఒకరినొకరం గ్రహించేవేళ ఈరోజు వాడికి చేయి మార్చి ఇంకోచేత ధరించిన కరవాలంతో మరణం ప్రసాదిస్తాను. అని పథకం వేసుకున్నాడు ధనవర్మ

-సభలో కలిసేటపుడు వాడికీ వేళ ఎడమచేయి అందించి కుడిచేత్తో ఛర్రున కత్తి లాగి ఒక్కవేటు వేసేస్తాను- అని నిశ్చయించు కున్నాడు గుణవర్మ. ఒకే లాంటి ఊహ ఇద్దరికీ కలగడం వల్ల, అది ఆ మరునాడే అమలులో పెట్టి నిండుసభలో ఒకర్నొకరు దారుణంగా నరుకున్నారు.

సభలో ఉన్న ఇరుపక్షాలవారు తమ యువరాజులీ రీతిని చిత్రంగా నరుక్కోవడంతో ముక్కున వ్రేలు వేసుకుని "హన్నన్నా! ఎంత విపరీతం?" అనుకుంటూ వారిలో వారే కొట్టుకోసాగారు. సందుజూసి జయభద్రుడీ వార్త ఆ యువరాజుల తండ్రులైన వీరపాల - శూరపాలులకు కబురంపడంతో వాళ్లూ సేనలతో వచ్చి ఘోరంగా పోరాడి, ఇద్దరూ వీరస్వర్గం పొందారు.

ఈలోగా జయభద్రుడు, అన్ని సేనలనీ వశపరచుకుని మంత్ర పాలుడిని తిరిగి సింహాసనం మీద కూర్చోబెట్టాడు. ప్రజలానందించారు. ఒకే సారి వీరపాల- శూరపాలురు మరణించడంతో ఆ రెండు రాజ్యాలు కూడా జయభద్రుడికి స్వాధీనమై అతని ఏలుబడిలోకి వచ్చాయి.

అకారణంగా తనకింత సహాయం చేసిన జయభద్రుని మీద విశ్వాసం- వినయం అధికమైన మంత్రపాలుడు, ఆతని వృత్తాంతం చెప్పమనగా- హైమవతీ సహితుడై వచ్చి నమస్కరించాడు జయభద్రుడు. మంత్రపాలుడు తన కూతుర్ని అలా అంతకాలానికి చూసినందుకు పొంగిపోయాడు.

హైమవతి కూడ తన తల్లిదండ్రులకు జరిగిన వృత్తాంత మంతా వివరించింది. జయభద్రుడే తన అల్లుడైనందుకు మంత్రపాలుడికి కలిగిన ఆనందం అంతా -ఇంతా కాదు. ఆ ఇద్దరికీ వైభవంగా పాణిగ్రహణ మహోత్సవం జరిపించి, పుత్రులు లేనందున అల్లుడినే తన రాజ్యానికి అధిపతిగా పట్టాభిషేకంచేశాడు. రామభద్రుని పోలిన రీతిన జయభద్రుని రాజ్యపాలన ప్రజారంజకంగా సాగుతోంది.

ఇలా ఉండగా సుదేవుడనే బ్రాహ్మణుడు, జయభద్రుని ఆస్థానానికి రాగా బ్రాహ్మణపక్షపాతి అయిన ఆ ప్రభువు ఆ విప్రునికి భూరిసత్కారాలు జరిపి దేశాటన విశేషాలు అడిగాడు "పాండిత్య ప్రదర్శనలో నేను చాలా దేశాలను ఎంతో మంది దాతలను చూశాను కాని, విదర్భ దేశంలో గల

సునీతి వంటి మహాదాతను మరెక్కడా చూడలేదు. ఆమె పతి అయిన జయభద్రుడెంత సంపాదనా దురంధరుడో తెలియదుగాని, అర్హులైన వారికి ఆమె నిత్యం కోటి రత్నాలు దానం చేస్తుంటుంది. అవి భూలోకపు మణులని నాకు తోచదు. నా పాండిత్యానికి మెచ్చి, ఆమె ఇచ్చిన ఈ రత్నాల పతకం చూడండి" అని మూటలోంచి హారాన్ని తీసి చూపించాడు.

ఆ పచ్చలపేరు చూసి, ఆశ్చర్యపోయాడు జయభద్రుడు. పరీక్షకులచేత దాని వెలను కట్టించబోతే, అవి అమూల్యములనీ – వాటికి ధర కట్టడం సాధ్యపడదనీ పరీక్షకులు చెప్పారు.

జయభద్రుడా విప్రుని చూసి "మీరు సునీతి భర్త అయిన జయభద్రుని చూశారా? ఎలా ఉంటాడు?" అని అడగ్గా అందుకా బ్రాహ్మణుడు "దేవర వారేమన్నా అనుకోవచ్చుగాక! ఆసాధ్వి భర్తకు తమకు – ఎట్టి తేడా కూడ లేదు. మీ ఇద్దరికీ ఏదైనా బాంధవ్యం ఉందేమో తెలియదు. మిమ్మల్ని చూశాక నాకూ కలిగిన సందేహం ఇదే! ఆమె తన భర్తతో సహా పీటపై కూర్చొని దానాదికాలు నిర్వహిస్తూండడం వల్ల నేను పొరబడే అవకాశం లేదు" అని స్పష్టం చేశాడు.

ఆ మాటలు విన్నాక జయభద్రుడా వైనానికి మరింతగా ఆశ్చర్యపోయి, అంతఃపురానికి వెళ్లి "హైమవతీ! మా దేశానికి సంబంధించిన వింతలు కొన్ని వినవస్తున్నాయి. కనుక మా దేశం పోయి అని చూసి రావలసివుంది. సునీతి ఖ్యాతి నువ్వూ వింటున్నదే! అక్కడ దానవేళ నన్నుపోలిన వాడే ఒక జయభద్రుడు పీటల మీద కూర్చుంటాడట! నేను రహస్యంగా వెళ్తాను. నువ్వు భద్రంగా ఉండు" అని చెప్పాడు. ఆ ఒప్పులకుప్ప తాను కూడా వస్తానంది. వద్దని వారించి జయభద్రుడొక్కడే తన స్వస్థలానికి బయలుదేరాడు.

అలనాటి జయభద్రునిలాగానే, అదే వేషంలో అతడాపుర వీధుల్లోంచి వెళ్తూంటే – ఎవరెవరో వచ్చి పరిచయం ఉన్నట్లే ఏవేవో వ్యవహారాలు మాట్లాడసాగారు. దానాల ఆశతో చాలా మంది విప్రులు స్తోత్ర పాఠాలు చదువుతూ అతన్ని వెన్నంటి రాసాగారు– చిత్రమేమిటంటే ఎవరూ అతన్ని కొత్తగా చూడలేదు. జయభద్రుడు వారికేమీ జవాబివ్వక నేరుగా కోటలోనికి

వెళ్లిపోయి తల్లిదండ్రులకు నమస్కరించాడు. వాళ్లూ పాత పద్ధతినే అతన్ని మన్నించారు తప్ప కొత్తగానో- అపరిచితుడన్నట్లుగానో చూడలేదు. ఇప్పుడు తనకేమీలోటు లేదనీ- మరొక రాజ్యాన్ని ఏలుతున్న విషయంగానీ వీరికి తెలిసి ఉంటే అందరూ తనను మన్నించి ఉండేవారని అతడు తలపోశాడు. అయినా- సునీతి విషయమై తాను వచ్చినందున అది జూసుకొని పోవచ్చునని, ఆమె సౌధానికి వెళ్లాడు జయభద్రుడు.

తల్లి పుత్రుని చేరబిలిచి "నాయనా! సమయంకాని సమయంలోన ఇటు వచ్చావేం? దాన ధర్మాలు ఈరోజు లేవా? సరే గానీ వంటయింది కనుక భోజనంచేసి వెళ్లు!" అన్నది. ఆమెకేమీ బదులు పలకకుండా సునీతి ఉన్న చోటుకెళ్లాడు. అక్కడ ఆమె మాయ జయభద్రునితో కూర్చొని ఒక బ్రాహ్మణుని కాళ్ళు కడుగుతోంది. జయభద్రుడు మందిరద్వారం దాటి లోపలికి ప్రవేశిస్తూనే మాయ జయభద్రుడు అంతర్ధానం చెందాడు.

సునీతికిది అర్థంకాక, భర్త ఇంతలోనే అక్కడికెలా వెళ్లాడా అని కించిత్ ఆశ్చర్యపోయి, "నాథా! త్వరగా రండి! బ్రాహ్మణునికి దానం ఇవ్వాలి" అని పూర్వ పరిచయం ఉన్నదానిలా మాట్లాడసాగింది.

ఆమె మృదువైన మాటలకు అతడు ఆశ్చర్యపోయి, "ఈ చిన్న దానికి ఎలాటి అవకరం లేదు ఈమె నా భార్య కావడం అదృష్టమే! కంట్లో మచ్చ వేశ్యచంద్రిక కల్పించిందే" అనుకుంటూండగా, అంతలోనే అతడికి మరో శంక పట్టుకుంది. 'ఒకవేళ ఈమె ఎవరినో తన వంటి వాడిని చేర్చుకుని, గుట్టు బయటపడకుండా నెట్టుకొస్తోందేమో' అనుకుని, తాను ఇంతకాలం ఆమెతో లేననీ, పెళ్లయ్యాక ఆమె మొహమే చూడలేదనీ, ఈ ఊరొదిలి చాలా కాలం అయిందనీ చెప్పాడు.

ఆ మాటలకామె ఉలికిపడి, తన భర్తకు పిచ్చిఎత్తినదని ఎలుగెత్తి అరిచింది. అంతటి పతివ్రత అలా అనేసరికి అందరూ పరిగెత్తుకొచ్చారక్కడికి. దీనికి తోడు జయభద్రుని మాటలు కూడ అందుకు తగినట్లే అందరికీ స్ఫురించాయి. అప్పుడు రాజవైద్యులు, అతనికి గాలిసోకిందనీ - అది భూతాల దెబ్బేననీ అంటూ అతడ్ని బంధించి, బెత్తాల్తో బాదుతూ తాము భూతాలను వదిలిస్తున్నామన్న భ్రమకు లోనయ్యారు.

ఆ దెబ్బల బారి కోర్వజాలక, తండ్రి కడకు వెళ్లి 'తండ్రీ ! చిర కాలానికి నేను నీ దగ్గర కొచ్చినందుకు మంచి శిక్ష వేయిస్తున్నావు. నాకే పిచ్చీ లేదు. భూతాల బెడద అంతకంటే లేదు. దీనికంతటికీ కారణం నాభార్య. నేను చెప్పేది పూర్తిగా విననైనా వినండి. లేదా నా నేస్తుడైన సుమిత్రుడిని ఇక్కడకు రప్పించండి" అని వేడుకున్నాడు. అట్టి దుస్థితిలో ఉన్న కొడుకుని చూసి శోకించి, ఆ తండ్రి, సుమిత్రుడుని రప్పించాడు.

అతడ్ని కౌగలించుకుని కన్నీళ్లతోపాటు ఆనందబాష్పాలు రాలుతూండగా జయభద్రుడు ఇలా అన్నాడు.

"వయస్యా! నేను నీ మాటలు వినకపోవడంతో అసాధారణమైన కష్టాలు ఎదుర్కొన్నాను" అంటూ మొదలుపెట్టి ఆనాటి నుంచి జరిగిన గాథనంతటినీ సంగ్రహంగా చెప్పాడు. కావాలంటే అమరావతీ పురానికి వెళ్లి ధృవపరచుకోమన్నాడు. సుమిత్రుడు అమరావతీ విశేషాలు కొన్ని విని ఉన్నా, అవి తమ జయభద్రుడు చేసిన వేనా అని సందేహిస్తూంటే రాజుగారి దగ్గరకు ఒక భటుడొచ్చి, "అమరావతిని పాలించే మంత్రపాలుని కుమార్తె హైమవతి తన భర్త ఉన్మత్తుడయ్యాడన్న వర్తమానం విని, తగు పరివారంతో వచ్చింది జయభద్రుని చూడాలని తొందరపడుతోంది" అని చెప్పాడు. కుంతి భోజుడా వనితను ప్రవేశపెట్టమన్నాడు.

జయభద్రుని స్థితికి హైమవతి ఎంతో విచారించింది. "నా భర్తకు పిచ్చిపట్టిందని మీరెలా నిర్ణయించారు? ఇట్లా బంధించడానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అక్కగారు సునీతి ఏదీ? దీనికి ఆమె ఎలా అంగీకరించింది?" అని అడిగింది.

కుంతి భోజ మహారాజు ఆమె మాటల వల్ల జరిగింది అర్థంచేసుకుని "అమ్మాయీ! నీ మాటలు వింటూంటే మాకు పిచ్చేక్కేలా ఉంది. మా జయభద్రుడు మమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్లనేలేదు. ప్రతిరోజూ అతడిని చూస్తున్నాం! చేస్తున్న దానాలూ చూస్తున్నాం! ఆ దంపతుల వల్ల దానాలు అందుకున్న బ్రాహ్మణులు చాలామంది ఉన్నారు. వాళ్లను అడిగినా తెలుస్తుంది. అతడు ఎన్నోదేశాలు తిరిగి ఎన్నెన్నో చేసినట్లు మీరు చెప్తున్నారు. నాకేమీ తోచడం లేదు. ఇదంతా ఏదో ఇంద్రజాలంలా ఉంది. నిజానిజాలు

నువ్వే తేల్చవలసింది" అన్నాడు. అంతేకాక– అతడు బ్రాహ్మణ శ్రేష్ఠులకు రాసిచ్చిన దాన పత్రాలు చూపగా, అవి ముమ్మూర్తులా జయభద్రుని దస్తూరినే పోలి ఉన్నాయి. అప్పుడు అక్కడున్న ప్రతి వాళ్లూ, మేము మిమ్మల్ని రోజూ చూస్తూనే ఉన్నాం" అన్నారు.

దాంతో జయభద్రుడికి నిజంగా మతిపోయినంత పనైంది. అతడు హైమవతివంక చూస్తూ "ఇదేమి చోద్యం?" అని అడగ్గా, తెలివైన ఆ వనిత "ఆ విషయం తెలుసుకోడానికి నాకోరోజు గడువు ఇవ్వండి. రేపు చెప్తాను" అంది. ఆ పూటకు అందరూ తమ తమ నివాసాలకు వెళ్లారు.

జయభద్రుడు హైమవతితో కలసి సునీతి మందిరానికి వెళ్లి, ఆమెవలన సత్కారాలు– మన్ననలు పొందాడు. తాను వేశ్యాగృహం వదిలింది మొదలు అంతవరకు జరిగిదంతా సునీతికి వివరంగా చెప్పాడు. అది పూర్తిగా విన్నాక సునీతి తన పాతివ్రత్యానికి భంగం కలిగిందేమోనని భయపడింది.

అప్పుడు హైమవతి "అక్కా! నీ వృత్తాంతం నాకు చెప్పు! జయభద్రుడు నీ మందిరానికి రావడం ప్రారంభించిన రోజు మొదలు నిత్యము జరిగే చర్యలన్నీ మధ్యలో జరిగిన విశేషాలతో సహా చెప్పు! ఏదీ దాచవద్దు!" అని సునీతిని కోరింది.

"సోదరీ! నా పతిదేవుని పాదపద్మాల సాక్షిగా నిజం చెబుతున్నాను. నా భర్త మొదట్లో వేశ్యాంగనా ప్రేమ వల్ల నా ముఖమే చూడలేదు. సుమిత్రుడే అందుకు సాక్షి. ఒకరోజు నా చెలికత్తె భ్రమరిక ఒక వశీకరణ పసరును తెచ్చి నా భర్త కెలాగైనా అది తగిలించమన్నది. అయితే– తొలిసారి వారిని చూసిన పరవశం వల్ల, ఆ ఓషధిని ఉపయోగించడమనే మాటే మరచిపోయాను. అది ఒక పుట్టలో పోసేశాను. ఆ రాత్రి నా భర్త చక్కనివేషంతో వచ్చి నా దగ్గరనే శయనించాడు. అది మొదలు నిత్యం రాసాగాడు. రత్నహారాలిస్తూ ఇష్టాలు తీర్చేవాడు. కొన్ని రోజులయ్యాక ఎప్పుడూ నా దగ్గరనే ఉంటూ నేను కోరినవి ఇస్తూ విప్రులను దానధర్మాలతో సంతృప్తి పరుస్తూండేవాడు. ఒకరోజున జరిగిన విశేష ఘటన చెపుతున్నాను. జాగ్రత్తగా విను. నేను నిద్రించిన కొంతసేపటికి ఒకరాత్రి వేళ హఠాత్‌గా

నాకు మెలకువొచ్చింది. కళ్లు విప్పి చూసేసరికి నా భర్త వెయ్యిపడగల శేషుడిలా నాకు కనిపించాడు. నేను భయపడి కళ్లుమూసుకుని కెవ్వున అరచాను. అతడు మేల్కొన్నాడు. మామూలు రూపంతోనే కనబడుతూ "ఏమైంది? ఎందుకలా హడలిపోయావు?" అంటూ ఊరడించాడు.

పరిశీలించి చూస్తే, అతని రూపం యథా ప్రకారంగానే ఉంది. నేను సందేహిస్తూనే "మీకు నిద్రలో అలాటి వికృత రూపం ఎందుకొచ్చింది?" అని అడిగాను అది నా వికృత రూపం కాదు నీకు కల వచ్చిఉంటుంది. స్వప్నంలో ఎన్నెన్నో రూపాలు కనిపిస్తుంటాయి. భయపడకు" అన్నాడతడు.

నేను అట్లే కాబోలనుకున్నాను. ఎప్పటిలాగానే పతిసేవచేసుకుంటున్నాను. ఇంతకంటే ఏ విశేషమూ జరిగి ఉండలేదు. మీతో నేను చెప్పినదంతా ముమ్మాటికీ నిజం! ఆపైన మీకు తోచినట్లు తలచగలరు" అని ముగించింది సునీతి.


అది విన్న హైమవతి తలవూపి "ప్రాణేశ్వరా! నిజం నిలకడపై తేలింది చూశారా! సునీతివల్ల ఎలాటి తప్పు జరగలేదు. ఆమెని నిందించపనిలేదు. ఇందులో జరిగిన ఇంద్రజాలం అంతా ఆ వశీకరణ ఔషధం మహాత్మ్యమే! సునీతి పేరుప్రతిష్ఠలకీ అదే కారణం! ఈమె పుట్టలో పసరుపోసినపుడు పాతాళలోక వాసి అయిన నాగేంద్ర దేవుని శిరస్సుపైన పడిందేమో! దాంతో అతడు ఈమెకు వశుడై కామరూపంలో వచ్చి ఈమెను సంతృప్తురాల్ని చేస్తున్నాడు కాబోలు! ఎందువల్ల నంటే సామాన్యులకు ఇటువంటి దివ్యరత్నాలంకారాలు లభించడం అసాధ్యం. ఇక- నిద్రా సమయంలో కామరూపం నిలవదు గనుక సునీతికి ఆ రాత్రి అతడి నిజరూపమే కనిపించింది. అంతేకాదు! మీరు సునీతిని ప్రత్యక్షంగా చేర వచ్చినపుడు, అతడక్కడికక్కడే పీటల పైననే అంతర్థానం చెందాడు. దేవతా సంపర్కం స్త్రీకి వ్రతభంగకారకం కాదు. కనుక సునీతి పవిత్రురాలే" అని జరిగిన కథ నంతటినీ తన బుద్ధి కుశలతతో విడమరచి చెప్పింది హైమవతి.

అప్పుడా జయభద్రుడు ఎంతో సంతోషించి, ఆమెను నిర్దోషిగానే ఎంచి, ఆసాధ్విని ఏలుకో సాగాడు.

ఆ వార్త ఆ పురంలో ఎల్లచోటులా వ్యాపించి, ప్రజలు విడ్డూరంగా చెప్పుకోవడం ప్రారంభించారు. కొందరు సునీతి పాతివ్రత్యాన్ని ప్రశంసించగా, కొందరు ఆమెయే మాయలాడి అన్నవారూ లేకపోలేదు. అందుకు విచారించిన సునీతి, తన మీద పడిన అపనిందను బాపుకోడానికి, అలనాటి సీతమ్మవారివలె అగ్నిప్రవేశం చేయ సాహసించి, భర్త అనుమతి వేడింది. తనకేమీ శంకలేదని జయభద్రుడన్నప్పటికీ, పురప్రజల మధ్య తన పావకత్వం వెల్లడి చేయడానికి ఆ సాధ్వి చితి పేర్పించి అందులోకి ప్రవేశించింది.

ఆమె పాతివ్రత్య మహిమ చేత, సిగపూవైనా వాడకుండా- మరింత మెరుగు పెట్టిన బంగారంలా ప్రకాశిస్తూ, తన నిర్మలత్వాన్ని నిరూపించుకుంటూ బయట కొచ్చింది.

గోపాలా! నువ్వు చూసిన ఆ ఇంతి సునీతియే! ఆమె చెయ్యిపుచ్చుకొని కోటలోనికి తీసుకెళ్లినవాడు ఆమె భర్త జయభద్రుడే! ఈ కథా విశేషం విన్నవారికి ఆయురారోగ్య వృద్ధియగుగాక. అని నా దీవెన" అని ముగించాడు యతీశ్వరుడు. గోపాలుడు అనేక ప్రకారములుగా ఆయన్ని స్తుతించాడు. అనంతరం - వంటచేసుకుని భుజించి, వారిద్దరూ తిరిగి ప్రయాణమై వెళ్లసాగారు.



కాశీ మజిలీ కథలు

22 వ మజిలీ

కందర్పుని కథ

ఇరవైరెండో మజిలీ ప్రదేశం ఒకపట్టణం. అక్కడ నివాసానికి వారికి ఎక్కడా చోటు దొరక లేదు. సత్రం చాలా రద్దీగా ఉంది. స్వాముల వారు శిష్యునితో "ఓరీ! ఇక్కడ మనకు ఉండటానికి జాగా సరైనదిలేదు. ఇంత జనసమ్మర్దంలో ఉండటం నాకు ఇష్టంలేదు. ఇంకొక ఊరికి వెళ్లిపోదాం" అన్నారు.

అప్పుడు గోపాలుడు "స్వామీ! ఎంతో దూరం నడచిరావడం వల్ల చాలా అలసటగా ఉంది. భోజనం కడుపులో పడితే తప్ప నేను నడవలేను. పరప్రాంతాల్లో పద్ధతులంటూ నియమాలంటూ ప్రాకులాడితే, పనులు జరుగుతాయా? ఏదో ఓ స్థలం చూసి పాకం (వంట) కానిస్తే, వెంటనే వెళ్లిపోదాం" అని బ్రతిమాలాడు. యతి వాడి మాటను కొట్టిపారేయలేక, ఒక ఆలయంలో ఉండటానికి ఏర్పాట్లు చేసుకుని- వాడిని అంగడికి పంపి, వస్తువులు వచ్చేలోగా స్నాన పానాది నిత్యానుష్ఠానాలు చేసుకోసాగాడు.

గోపాలుడు దుకాణం నుంచి సరుకులేవీ తీసుకురాకుండానే ఒట్టిచేతు లూపుకుంటూ తిరిగి రావడం చూసి గురువు నవ్వుతూ "నువ్వు ఏమీ తీసుకురాలేదు కదా! వంట ఎలా చేద్దాం?" అన్నాడు.

"ఏం చెప్పమంటారు స్వామీ? నేను చూస్తూండి పోయిన వింతనే అంగడివాడు కూడా చూస్తూ ఏ వస్తువునూ అమ్మడం లేదు. ఆ వింత

ఇదీ. ఓ నడివయసు స్త్రీని గాడిద మీద ఎక్కించి ఆ గాడిద ముందు వికృతమైన వాయిద్యాలు వాయిస్తూ ఊరేగిస్తున్నారు. ప్రజలు వేళాకోళం గానూ– ఆమెను నిందిస్తూనూ చోద్యం చూస్తున్నారు. ఏమిటని కారణ మడిగితే ఒక్కరైనా చెప్పరాయె! ఇక తిరిగిరాక ఏం చేసేది? కొంతసేపుండి మళ్లీ వెళ్లి సరుకులు తెస్తాగాని, నా మనస్సంశయం తీరేలా ఆ స్త్రీ కథేమిటో చెప్పండి" అని కుతూహలంగా కూర్చున్నాడు.

"ఆకలిగా ఉందంటివి. నడవలేనంటివి. కథకేమి? భోజనమయ్యాక కులాసాగా కబుర్లకు బదులు ఈ కథనే చెప్పుకోవచ్చు!" అని వాడిని సమాధాన పరిచి తిరిగి అంగడికి పంపించి, సరుకులు తేగానే వంటచేసి ఇద్దరూ భుజించారు. తర్వాత హాయిగా ఉన్న ఒకప్రదేశంలో కూర్చొని, మణిప్రభావంతో ఆ గోపాలుడు అడిగిన స్త్రీ వృత్తాంతపు పూర్వాపరాలన్నీ తెలుసుకొని ఇలా చెప్పసాగాడు..

"దక్షిణ దేశంలో కుంభకోణం అనే పట్టణం ఉంది. దానికి ప్రభువైన విక్రమకేతువుకు ముసలితనంలో ఒక కొడుకు పుట్టాడు. రూపలావణ్యాలను చూసి జ్యోతిష్యులు కందర్పుడని పేరుపెట్టారతనికి

చురుకైన ఆ బాలుడు యవ్వనదశలో కొచ్చేసరికి అన్ని విద్యల్లో ఆరితేరాడు. ఒకరోజు అతనికి విద్యనేర్పే గురువు భూగోళశాస్త్రాన్ని బోధిస్తూనే ఒక రంగు రంగుల పటాన్ని ఆ యువకునికి చూపించాడు. అందులో అన్ని రంగులున్నాయేమని అడిగాడు కందర్పుడు.

"రాజకుమారా! ఇది భూమి ఎక్కడ ఎంత విస్తరించివున్నదో– జలభాగ మెంత ఉన్నదో తెలుపుతుందని ముందే చెప్పానుకదా! ఇదుగో! ఈ పచ్చని రంగుగల భాగమంతటినీ భరతఖండం అంటారు. ఇందులోని 56 దేశాలకూ వేర్వేరు గుర్తులున్నాయి చూడు! ఈ సన్నని రేఖల వెంట సాగేవి నదులు. గోదావరి, కృష్ణ, కావేరి, తుంగభద్ర, గంగ, యమున ఇవన్నీ నదులన్నమాట! ఏమీ రాయక వదిలి వేసి వున్న ప్రదేశమంతా సముద్రం. ఇవి హిమవత్పర్వతాలు. ఈ మూలవున్నది పారశీకదేశం. అదిగో

– ఆ పశ్చిమోత్తర దేశాన ఉన్నది హూణులదేశం" అంటూ ఉపాధ్యాయుడు చెబుతూంటే, "ఆర్యా! ఇందులో మన దేశం ఎక్కడుందో చూపించండి" అని అడిగాడు.

"వత్సా! మనది పాండ్యదేశంలోని అంతర్భాగం! అదిగో – ఆ కపిలవర్ణంలో కనిపిస్తున్నదే మనది" అని చూపించాడాయన. దానికి కందర్పుడు ఆశ్చర్యపోయి "ఇదేనా మన రాజ్యం? ఈ మాత్రానికేనా మేము మహాచక్రవర్తుల మని మనవాళ్ళు విర్రవీగేది! గుమ్మడికాయలో ఆవగింజంతయినా లేదే! ఇది చూస్తూంటే నాకు వెర్రెత్తుతోంది. ఇంత సువిశాల భూమండలం ఉండగా, రోజూ వందిమాగధులు చేసే స్తోత్రాలు వినీ ఈ భూమి కంతటికీ నేనే ప్రభువును కదా అనుకున్నాను. ఎవరూ ప్రభువని గర్వపడక్కర్లేదు. అందరికీ ప్రభువు సర్వేశ్వరుడే! సందేహం లేదు" అన్నాడు. ఆచార్యుడతన్ని ఆశ్చర్యంగా చూశాడు.

"అయ్యా! భగవంతుని సృష్టి చాలా అద్భుతమైనది. ఒకదేశంలో ఉన్న వింతలు ఇంకొక దేశంలో ఉండవు. ఈ దేశాలన్నీ చూస్తే ఎన్నెన్ని విచిత్రాలు కనిపిస్తాయెూ!? ఎలాటి స్త్రీలుంటారో– ఎలాటి విద్వాంసులుంటారో ఎరుగనే–లేము. చెరువులోని తాబేలులా తన దేశమే గొప్పదనుకునేవాడి జన్మమొక జన్మమా? కళ్లున్నందుకు దేశాటన భాగ్యం కలిగి తీరాలి. అది ఉత్తమ పురుషుని లక్షణం కూడా! అందుకే మన పెద్దలు తీర్థయాత్రలు పెట్టారు. నా దేశమెంత? నేనెంత? తల్చుకుంటేనే నవ్వొస్తోంది. ఇంత విస్తృతమైన దేశాల్లో కొన్నయినా చూసిరావాలని ఉంది" అన్నాడు.

ఆచార్యుడు "వత్సా! దేశాటన మంటే మాటలుకాదు. ఎంతటివారికయినా పరదేశవాసం సంకటప్రదమే! అదీగాక– నీ కోరిక అసాధ్యం! కొన్నిటికి ఓడల మీద– కొన్ని దేశాలకు గుర్రాలమీద పోవచ్చు! కొన్ని దేశాలకు దారులే లేవు. గరుత్మంతుడు– ఆంజనేయుడు మొదలైన వారికి సైతం ఈ దేశాలన్నీ చూడటానికి సాధ్యంకాదు! భరతఖండంలోని దేశాలకు పోయి, తిరిగిరావచ్చు! కాని ఇతరద్వీపాలకు పోవడానికి

వీలుపడదు. ఉత్తరాన హిమాచలాలు అడ్డంగా ఉన్నాయి. దానికి ఆవలి భాగం చూడ్డానికి వశంకాదు. కేవలం భరతఖండంలోని అన్ని దేశాలూ చూడటానికే మనిషి ఆయుర్దాయం సరిపోదు. కనుక వెర్రిఊహలు మాని, నీ తండ్రి వృద్ధుడు కావడంవల్ల నువ్వే రాజ్యభారం పూని న్యాయంగా పరిపాలన సాగించు" అని బోధించాడు.

"ప్రజాపాలన విషయం పలుమార్లు నాకు చెప్పొద్దు. ఈపాటి ప్రజాపాలన ఎవరైనా చేస్తారు. దేశాటనం సంగతి చెప్పండి. యాత్రలకి పోవడం ద్వారా చూసేదేశాలు మాత్రమే చూస్తే తృప్తి ఉండదు. ద్వీపాంతర విశేషాలే చూస్తే చూడాలి. ఆ ప్రాంతాలకు వెళ్ళడానికీ ఏవో సాధనాలుండకపోవు. ప్రవరాఖ్యుని గాథ మీరు చెప్పినదే! ఓషధుల వల్లగాని, యంత్రాల వల్లగాని అటువంటివి సాధ్యపడతాయి. అటువంటి సాధనాలు సంపాదించాలి. ఇది మొదలు నేను ఈ ప్రయత్నంలో ఉంటాను. మీరూ ఉండాలి. మా తండ్రికి ఇది తెలిస్తే అనుమంతించడు. కనుక రహస్యంగా ఉంచండి సుమీ" అని కోరాడారాజపుత్రుడు.

అక్కడ నుంచి ప్రతిరోజూ కందర్పుడు ఆచార్యుని దగ్గర కొచ్చి "ఆర్యా! దేవాలయాలకు గాని మఠాలకు గాని, ఈ రోజు వెళ్లారా? ఎవరైనా సిద్ధులో పెద్దలో కనబడ్డారా? వారివల్ల ఏవైనా విశేషాలు తెలిశాయా?" అంటూ అడగడం ప్రారంభించాడు. తన వంతు ప్రయత్నంలో లోపం లేదని ఆయన చెప్తూనే వచ్చాడు. ఇలా కొంతకాలం గడిచింది.

ఒకనాడు ఆచార్యుడు సంతోషంగా తన శిష్యుని ఒక ఏకాంతప్రదేశానికి తీసుకొని వెళ్లి "వత్సా! పొట్టకూటి నిమిత్తం శ్రమించే బైరాగుల వల్ల- సన్నాసుల వల్ల ఒరిగే దేమీ ఉండదు. వాళ్లేం విశేషాలు చెప్పగలరు? మా ముత్తాత చాలా వయోవృద్ధుడు కావడం చేత ప్రస్తావన పూర్వకంగా నేనొక రోజు నీ సంగతి చెప్పాను ఆయన తన నడికారు వయస్సుతో ఎన్నో దూరదేశాలకేగి వచ్చినాడులే! నీవు అడిగిన విశేష ప్రయాణసాధనాల గురించి తెలిసిన వాడొకడు మన పురంలోనే మణివర్మ

అనే విశ్వకర్మ కులంవాడున్నాడట! అతడు కీలు జింక నొకదాన్ని తయారించి ఆకాశంలో తిరుగుతూండేవాడట! అది వాడింటనే ఏ రహస్యపు కొట్టంలోనో కట్టేసి ఉంటాడనీ తానూ వాడి తండ్రీ స్నేహితులు కనుక తనకు ఈ సంగతి తెలుసుననీ– అయితే అతడి తండ్రి చనిపోయాక, తనకు మణివర్మగురించి ఏమీ తెలీకపోయింది అనీ మా ముత్తాత చెప్పాడు.

అప్పుడు నేను చాలా ఆనందించి, పట్టణమంతా తిరిగి మణివర్మ గురించి తెలుసుకున్నాను. ఆ ఇల్లు రాజభవన మాత ఎత్తుగాను– లోపలెంతో విశాలంగాను ఉంటుందని వినికిడి. మణివర్మ బతికే ఉన్నాడని ఎన్నడూ ఇల్లు దాటి ఇటీవల బయటకు రావడం లేదని తెలిసింది. పిత్రార్జితం ఆస్తి చాలా ఉందట. తలుపు లెప్పుడూ వేసి ఉండే ఆ ఇంట్లోకి అనుమతి లేనిదే ఈగైనా ప్రవేశించలేదట! నాకు ఇంత కంటే సమాచారం దొరకలేదు. నువ్వు బుద్ధిమంతుడవు గనుక అతడ్ని కలుసుకొని ఆ జింకని సంపాదిస్తే నీ కోరిక తీరినట్లే అనుకో!" అని రహస్యం వెల్లడి చేశాడు.

సుభద్ర కథ

ఆచార్యుల వారు అందించిన సమాచారం అంతా మననంచేసుకుని, అతడ్ని కలుసుకోడం ఏమంత ఘనకార్యం కాదు లెమ్మని ఓ రెండు వారాలు ఆగిన తర్వాత ఓరోజు సామాన్యుడిలా మామూలు వస్త్రాలు ధరించి దారిలో కనిపించిన వారిని అడుగుతూ మణివర్మ ఇంటికి చేరాడు. కోట గోడల్లా దుర్భేద్యంగా ఉన్న ప్రహరీ చూసేసరికే, ఇతడ్ని డబ్బుతో సాధించలేమని అంచనా వేసుకున్నాడు కందర్పుడు. ఇంట్లోకే అడుగుపెట్టలేనపుడు ఇక జింకను సంపాదించడం ఎలా? అనుకుంటూనే, అతడా ప్రహరీవద్ద కావలి వానిని చూసి "లోపలకు వెళ్లవచ్చా? మణివర్మతో మాట్లాడాలి" అన్నాడు "అయ్యో! నువ్వెవరో తెలీని వాడిలా వున్నావు. ఈ పట్నం రాజుగారే వచ్చినా, మణివర్మ దర్శనం దొరకదు నీకీజన్మానికి అతడితో మాట్లాడటం శక్యంకాదు. పో పొమ్ము" అన్నాడు అతడు. కర్తవ్యం ఆలోచిస్తూ

అక్కడే కూర్చున్న కందర్పుడికి ఆ ఇంటి పెరటిగుమ్మంలోంచి ఒక ముసలివాడు బైటికి రావడం కనిపించింది.

రాజకుమారుడు అతడితోపాటు కొంతదూరం నడచి, అతడ్ని నెమ్మదిగా మాటల్లోకి దింపి "నీతో కొంచెం పని పడింది. నేను అడిగిన వాటికి జవాబులు చెప్తే నీకు మంచి కానుక ఇస్తాను" అంటూ ఒక బంగారు దీనారం అతని చేత బెట్టాడు. ఏడాదిపాటు కష్టించినా కనిపించినంత సొమ్ము ఒక్కసారిగా కళ్లజూసే సరికి ఆ వృద్ధుడు సంతోషించి "నువ్వెవరవోగాని, చాలా గొప్పవాడివని తోస్తోంది. నీ వేషాన్ని బట్టి అంచనా వేయలేక పోయాను. మన్నించు నా వల్ల నీకు జరిగే ప్రయోజనం, నా ఓపిక ఉన్నంతవరకు చేస్తాను. నా పేరు రామిరెడ్డి .నేనా ఇంటపని చేస్తాను. చిన్నప్పట్నుంచీ నా పోషణభారం వారిదే. నెలకు యాభైకుంచాల ధాన్యం ఇస్తారు" అని తన పరిచయం చెప్పాడు.

కందర్పుడా వృద్ధుని ఒక రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి, మణివర్మ గురించీ అతని కుటుంబం గురించీ వివరాలు అడిగాడు. వారింట అతడేమి పని–చేస్తుంటాడో చెప్పమన్నాడు.

'మణివర్మ గొప్ప కోపస్వభావి అనీ, ప్రస్తుతం పిల్లల్లేరనీ, పూర్వం ఒకప్పుడొక కూతురుండేదనీ, ఆమె చనిపోయిందనీ, ఆమెకు సుభద్ర అనే కూతురున్నదనీ, తల్లిలేని పిల్లకనుక అతడా సుభద్రను ప్రేమగా చూస్తున్నాడనీ, పెళ్లాన్ని మాత్రం ఎప్పుడూ దండిస్తూంటాడనీ, లోపల ఎక్కడో శక్తి మందిరంలో అంబపూజ చేస్తూంటాడనీ, మనవరాలు సుభద్ర పెంచుకుంటూన్న పూల తోటకు తాను నీరు పెడుతుంటాననీ' చెప్పాడా వృద్ధుడు.

"సుభద్రకు ఎన్నేళ్లు? పెళ్లైందా?" అంటూ ప్రశ్నించాడు కందర్పుడు.

"ఆమెకు పదహారేళ్ల వయసు. చక్కనిది. వివాహప్రయత్నాలు కొంత సాగాయి కాని, తగిన సంబంధాలేవీ రాని కారణం చేత ఇంకా పెళ్లి జరగలేదా పిల్లకు. ఆమె తాత మణివర్మ ఎవర్నీ లక్ష్యపెట్టడు. అతనికి గత కొంత కాలంగా రుగ్మతగా ఉండడం వల్ల వివాహప్రయత్నాలు ఆగిపోయాయి."

"అతని వ్యాధి నయమైందా?"

లేదన్నట్లు రామిరెడ్డి చెప్పడంతో "అయ్యా! నువ్వు నాకో ఉపకారం

చేయగలవా? నేను మణివర్మ ఇచ్చేదానికంటే పదిరెట్లు ఎక్కువ ఇస్తాను. నేను ధనికుడినే గాని సామాన్యుడిని కాను" అన్నాడు కందర్పుడు.

రామిరెడ్డి కళ్లు ఆశగా మెరిశాయి.

"విను! నీతో–కూడా నన్నోసారి వాళ్లింటికి తీసుకెళ్లు! వాళ్లు ఇతడెవరని అడిగితే– కూలివాడినని చెప్పు! వీడినెందుకు తీసుకొచ్చావంటే నీకు ఒంట్లోబాగులేదనీ మొక్కలు వాడిపోకూడదని వీడిని కూలికి తీసుకొచ్చి నీరు తోడిస్తున్నాననీ చెప్పు! తర్వాత సంగతి నేను చూసుకుంటాను"

"సర్లెండి బాబూ! అప్పుడప్పుడు ఇలాగపై వాళ్లని తీసుకెళ్లే వాడుక ఉంది. మీరు రేపు పొద్దెక్కకుండా ఇక్కడుండండి. నేనొచ్చి తీసుకెళ్తాను" అని చెప్పగా, ఆ నాటికి ఇద్దరూ ఇంటికెళ్లిపోయారు.

మర్నాడు కందర్పుడు కూలివాని వేషంలో రామిరెడ్డి వెంట మణివర్మ ఇంటికి వెళ్లాడు. తలుపు తెరిచిన మెరుపుతీగ లాంటి అమ్మాయి సుభద్ర అందాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. కాని కందర్పుడది దాచుకొని ఆ ముసలాడిని అనుసరించాడు. అప్పుడప్పుడు వానితో కూడ రెండో కూలివాడు రావడం వాడుక ఉన్నందువల్ల సుభద్రకూడ, ఆ కొత్తవాడిని చూసి అంతగా విమర్శ చెయ్యలేదు. చిత్రపటాలు గీయగల నైపుణ్యం ఉన్న కందర్పుడు. తాను అంగీలో రహస్యంగా దాచి తెచ్చిన సామగ్రితో ఓ చెట్టు దగ్గర కూర్చొని చిత్రపట రచనలో మునిగిపోయాడు.

సుభద్ర ఆకృతి, పూలతోట, ఆ పక్కన తన ఆకృతి అన్నీ గీసి తన దగ్గర ఉంచుకున్నాడు. సుభద్ర వాడుక మేరకు అంతా పర్యవేక్షింప వచ్చి "ఇదేమిరా! కొత్తవాడిని తీసుకొచ్చినా, నువ్వే నీళ్లు తోడుతున్నావేం" అని అడిగింది. "వాడు పాదులు కడుతున్నాడు" అన్నాడతడు.

అప్పుడామె అతనిని వెదుకుతూ వచ్చి, ఏదో నేలగీటులు గీటుతూంటే "ఏమిరో! ముసలాడు కష్టపడుతూంటే, నువ్విక్కడ ఒళ్లుదాచు కూర్చున్నావు. అంత అలసిపోయావా? కూలిలో సగం తీసుకుంటావుకాబోలు! తీరిగ్గా తేలికగా ఉన్నట్టుంది నీకు" అంది.

"ఏంచేసేది? నాకీ మోటు పని అలవాటు లేదు. ముసలాడు ముందే ఇలాటి పని అని చెప్పలేదు. బతిమాలి తీసుకొస్తే వచ్చాను. నాకు చిత్రాలు

గీసే నేర్పరితనం ఉంది. ఇదిగో నా పనితీరు. ఉద్యానవనం పటం రాశా" అంటూ అది చూపించాడు.

అది చూసి ఆమె ఆశ్చర్యపోయి "ఈ రూపం నాదిలాగ ఉందే! ఈ జంట ఎక్కడిది? నువ్వు నన్నింతకు ముందెక్కడైనా చూశావా?" అని అడిగింది. "తలుపు తియ్యడానికొచ్చినపుడు చూశాను. పోలికలు సరిపోయాయా?" అని అడిగాడు కందర్పుడు. అప్పుడామె" ఇంత ప్రజ్ఞగలవాడివి, అంత కొంచెం కూలికి ఎందుకొచ్చావు? ముసలాడు నీకేం ఇస్తానన్నాడు? నీ మాటలు చూడబోతే ప్రగల్భంగా ఉన్నాయి. నిజం చెప్పు" అంది.

"రామిరెడ్డికి నాకూ పరిచయం ఉంది కనుక, కూలి నిర్ణయించుకోలేదు. ఏమిచ్చినా తీసుకుంటాను. నీవంటి కన్యకు ఇలాటి భర్త ఉంటే బావుంటుందని పించి అతడ్ని అలా గీశాను. తప్పుకాదుగదా" అని కాస్త జడిసినట్లు అభినయించాడు.

ఆమె ఆ చిత్రపటం చూస్తూ ఏదో ఆలోచించుకొని "నాకు బొమ్మలు గీసే విద్య నేర్చుకోవాలని చాలాకాలంగా ఉత్సాహం. కాని తగినట్టి గురువే దొరకలేదు. మంచి సమయం దొరికింది. మా తాత ప్రస్తుతము అస్వస్థుడు. నువ్వు ప్రతిరోజూ ఇతడి వెంట రా! ఇక్కడే నేర్చుకుంటాను. ఎన్నాళ్లలో నేర్పగలవు? నువ్వు కోరినంత ధనం ఇస్తాను కానీ త్వరగా నేర్పాలి" అంది సుభద్ర.

"నీ సూక్ష్మబుద్ధిని బట్టి ఉంటుంది. నీ బుద్ధిని బట్టిగాని ఎన్ని రోజులు పట్టేదీ చెప్పలేను. అదీగాక రోజులో నీకు ఎంతసేపు నేర్చుకోడానికి వీలుంటుందో చెప్తే, ఇప్పుడే మొదలెడదాం" అన్నాడు కందర్పుడు.

ఆ మాటలకు ఆమె ఆనందించి, అతడు చెప్పినట్లుగా దైవగురుధ్యానాలు ఆచరించి కూర్చోగా అతడామెచేత ముందుగా సరస్వతీ దేవి బొమ్మ రాయించాడు. ఇంతలో అతని వ్రేళ్లపైన గలవస్త్రం కొంత మేరకు తొలగి ఉంగరాలు కనిపించాయి. ఆమెకు అనుమానం వచ్చి ముఖం మీదా చేతుల మీదా ఉన్న వస్త్రాలు తొలగించింది. దాంతో చంద్రబింబంలా మెరుస్తున్న అతని ముఖం కనిపించింది.

"ఇంత చక్కని రూపం దాచుకుంటా వేం? నువ్వెవరు? నీ కులం ఏమిటి? ఇలాటి ప్రచ్ఛన్న వేషంలో ఎందుకొచ్చావు? నిజం చెప్పు" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. అతడు "చల్లకొచ్చిముంత దాస్తే లాభమేమిటి? నేనీ పట్నపు రాకుమారుడినైన కందర్పుడ్ని! నీ రూపలావణ్యాలు విని, నిన్ను చూసి నీ చిత్రం రాసుకోడానికి ఇలా వచ్చాను. లేకపోతే నీ దర్శనం దొరకడం దుర్ఘటం కదా!" అన్నాడు.

"ఏమీ? నాచరిత్ర తమకు స్మరణ పాత్రమా? నేనేమన్నా అపచారాన్ని చెయ్యలేదు గద! మన్నించండి ఈ దీనురాలితో మీకేం పని పడింది?" అని ఒళ్లు అదురుతూండగా గద్గద స్వరంతో అంది.

అతడామె భయం పోగొట్టేలా సంభాషించి, స్నేహభావాన మెలగవలసిందని చెప్పి "నువ్వుకాదు. అపచారం చేసింది నేనే! నీ అంతః పుర ప్రవేశం నాదే కదా దోషం ! అది తప్పుగా గణించవుకద" అన్నాడు. ఆమె అతని అతని హస్తాన్నందుకొని ముద్దు పెట్టుకుంటూ "అదేం లేదు. ఈ చిత్రపటంలో నా ప్రక్కన మిమ్మల్ని ఏ అభిప్రాయంతో చిత్రించారో! ? అదీగాక నాకు చిత్రాలు గీయడం నేర్పిస్తానని చెప్పి, అది పూర్తి కాకుండానే మిమ్మల్ని వెళ్లనిస్తానా?" అందామె.

అంతలో "సుభద్రా!" అనే పిలుపు వినబడింది.

అదిరిపడిన ఆమె "కందర్పా! నన్నెవరో లోనుంచి పిలుస్తున్నారు. మాతాత సామాన్యుడు కాదు. మీతో చాలా మాట్లాడాలి. దయచేసి సాయంత్రం కూడా ఈ ముసలాడితో రండి" అని ఆమె లోపలి కెళ్లిపోయింది.

అతడా సాయంత్రం మళ్లీ కూలివానితో కూడ ఆ ఇంటికెళ్లాడు. సుభద్ర అతడిని పూపొదరిళ్ల చాటుకు తీసుకెళ్లి, తానిచ్చిన శ్రమకు అతని పాదాలు కందిపోయినవంటూ కాళ్లపై పడబోగా, అతడామె భుజాలు పట్టుకుని ఆపాడు. ఆమెను కౌగలించుకుని తన అభిప్రాయం విశదం చేశాడు. పరస్పర రాగోదయం జరిగింది.

చీకటి పడబోతోంటే "ఇక ఇక్కడ ఉండకూడదు. సుందరీ! ప్రొద్దుగుంకినది మీ ఇంటి విశేషాలు ఏమీ చెప్పావుకావేం? మీ తాత ఏం చేస్తుంటాడు? నీకు తల్లిలేదట! మీ తాత నిన్ను ఇష్టంగా చూస్తాడా? మీ

ఇంట్లో విచిత్ర వస్తువులు న్నాయటకదా! 'వాటిని నాకు చూపిస్తావా?" అంటూ క్రమంగా ఇంటి ప్రస్తావన తెచ్చాడు.

"సరే! అయితే మీరీ రాత్రి ఇంటికి పోవద్దు. మా తాతకు రుగ్మత వల్ల మంచం దిగి రావడం కుదరదు. అవ్వ ఆయన దగ్గరే ఉండగలదు.మా ఇంటివిశేషాలు రాత్రి చూపిస్తాను" అని కనుచీకట్లు పడుతుండగా, సుభద్ర అతడ్ని తన మేడకు రహస్య మార్గం ద్వారా తీసుకు వెళ్లి ఒకచోట కూర్చుండ బెట్టింది. వృద్ధుల సేవలు ముగించి, ఆహారంతో సహా తిరిగొచ్చింది. వస్తూ తాత తలక్రింద ఉన్న తాళం చెవులు కాజేసి మరీ వచ్చింది. కందర్పుడు ఆహారం గ్రహించాక దీపం ఒకటి పుచ్చుకొని, గదుల తాళాలు తీస్తూ ఆ భవన విశేషాలు చూపించింది. అక్కడి విశేషాలన్నీ చూశాక 'ఇది ఇంద్రుని వైజయంతి కాదు గదా' అని ఆశ్చర్యపోయాడు కందర్పుడు. చివరగా మణివర్మ పూజాగృహం కూడా చూపించింది. అక్కడ అతనికి కనిపించింది- మరజింక.

"ఇదేమిటి?" అని అడిగాడతడు. "ఇదో తోలుజింక. ఎందుకో గాని మాతాత దీన్ని ఎంతో అపురూపంగా చూస్తుంటాడు. ఈ గదిలోకి మాత్రం ఎవరినీ రానివ్వడు. నేనొక్కదాన్ని వచ్చినా నన్నేమీ అనడు. తాత మంత్ర తంత్రాల్లో మహా ఘటికుడు. ఆయనకే గనుక రోగం లేనట్లయితే మన మిట్లా తిరగలేం" అని చెప్పింది సుభద్ర.

దీపపు కాంతిలో ఆ జింకను ఎత్తిపట్టుకుని, దానిలోని లిపి చదివి, మహదానందం చెంది "నీకు నా మీద ఎంతో ప్రేమానురాగాలుండ బట్టి ఇటువంటి రహస్యాలు చూపించావు. ఇందుకు ప్రతిఫలంగా నీకు నేనేం ఇవ్వగలను?నిన్ను నా హృదయేశ్వరిగా చేసుకోవడం తప్ప. అదీ నీ కిష్టమైతేనే! నా కోరిక తీర్చడం న్యాయం గనుక, నువ్వు చూపిన వస్తువుల్లో ఈ జింక నన్ను బాగా ఆకర్షించింది. దీనికి అసాధారణ శక్తులున్నాయని దీనిపై లిపి చెపుతోంది. అది నిజమో కాదో ఓసారి పరీక్షించాలని పిస్తోంది. పని పూర్తికాగానే తిరిగిచ్చేస్తాను, ఏమంటావ్?" అని అడిగాడతడు.

ఆమె ఓ సారి ఆలోచించి "మీరు అడగాలేగాని ప్రాణాలయినా ఇవ్వడానికి సిద్ధం. ఇక ఈ జింక ఒక లెక్కా? మా తాత మహాక్రూరుడు.

ఇది కనబడకపోతే మొదట అనుమానించేది నన్నే! నేనుగాక ఇతరులకి ఇందులో ప్రవేశం ఉండదు కద! మహా అయితే నా ప్రాణాలు తీస్తాడు. అంతేకద! మీ పనికంటేనా?" అంది.

"నీ ప్రాణాలకు హాని తలపెట్టే దుర్మార్గుడిని కాను. ఈ జింకను పోలినట్టిదే ఇంకొక జింకను తయారుచేయించి. ఆ ముసలాడి చేత పంపిస్తాను. దీని స్థానంలో అది వ్రేలాడగట్టు. అదే ఇది అని మీ తాత కూడా శంకించడు" అని ఆమెని ఒప్పించి "ఎవరైనాసరే! మొదట స్వజాతి యువతిని పెండ్లాడి, తరువాత ఇతర జాతివారిని చేసుకోవచ్చు! లేకపోతే ఆమె సంతానానికి అధికారం ఉండదు. ఆ సంతానాన్ని గూఢజులని వ్యవహరిస్తారు. నేను త్వరలో యువరాజుగా పట్టాభిషేకం చేసుకుని నిన్ను రెండో భార్యగా స్వీకరిస్తాను. నా మాట నమ్ము" అని ఆమెకి నచ్చచెప్పి జింకతో సహా ఇవతలకు వచ్చాడు. ఆ జింకని ప్రయాణానికి సన్నద్ధం చేసే విధానం దీపపుకాంతిలో చదివాడు. ఆ విధానం ఇది

"ఈ జింకకు కుడిచెవికి గల బిరడాతీసి నోటితో గాలి ఊది నింపి నట్లయితే, అది గుర్రంలా నిలబడుతుంది. అప్పుడా బిరడా బిగించేసి, ఎక్కి కూర్చొని ఏ చెవిని ఎలా మెలి తిప్పితే అటు వైపున్న దిశగా అది ఎగురుతుందట! తల మీద మీటలను కుడి- ఎడమలకు తిప్పితే పైకీ కిందకీ వెళుతుందట! అక్కడే ఉన్న ఇంకొక మీట నొక్కి కావలసిన వేగాన్ని పెంచుకోవచ్చు! ఎడమచెవిలో బిరడా తీసేస్తే, అది తోలుతిత్తి అయిపోతుంది" ఆహా! ఇలాటి దివ్యమైనది తయారుచేయడం ఆ విశ్వకర్మకే సాధ్యం.... అనుకుంటూ ఆ జింకను గాలితో పూరించి ఇద్దరూ మేడమీదికి తీసుకెళ్లారు.

అప్పుడు కందర్పుడు ప్రియురాలి బుగ్గపుణికి చిటికేసి 'వెళ్లొస్తా' అంటూ జింక ఎక్కి కుడిచెవి మీటి ఆకాశంలోకి ఎగిరాడు. దాన్ని మెల్లగా నడిపించి తనమేడ మీద వాలాడు- అప్పటికి తెలతెలవారుతోంది.

అత్యంత శీఘ్రంగా అటువంటి తోలుజింకను ఒక చర్మకారుడిచే తయార్చేయించి రామిరెడ్డి దగ్గర కెళ్లి "నేను మరో పనిమీద నీకు చెప్పకుండా వెళ్లాను. నువ్వు నన్ను వెతుక్కున్నావు కాబోలు!" అంటూంటే ఆ వృద్ధుడు నవ్వేశాడు. "బాబూ! నా దగ్గర నా నీ కపటాలు? నాకేదైనా

ఇవ్వాల్సివస్తుందనా? మీ గుసగుసలు. నేను వింటున్నాను. మణిశర్మ చండశాసనుడు సుమీ! జాగ్రత్త" అని హెచ్చరించాడు ముసలివాడు.

కందర్పుడా వెంటనే అతడికి కొంత పారితోషికం ఇచ్చి "సుభద్ర నా దగ్గర చిత్ర రచన నేర్చుకుంటానన్నది. నేను నిన్న దీన్ని నాతోపాటుగా మరపు వల్ల తెచ్చేశాను. జాగ్రత్తగా అతిభద్రంగా, అత్యంత రహస్యంగా దీన్ని ఆమెకు అందజెయ్యి!" అని ఇచ్చేశాడా తోలుజింకని.

తరువాత ఉపాధ్యాయుని దగ్గరకు వెళ్లి జింక విశేషాలన్నీ చెప్పి "ఇది మీ అనుగ్రహం వల్లనే నెరవేరిన కార్యం! ముందుగా ఏ దేశం వెళ్లమంటారు? నేను వెళ్లాక మాసం లోగా తిరిగొస్తాను" అన్నాడు.

గురువు కూడా కందర్పుని సంకల్పసిద్ధికి ఆశ్చర్యపోతూ "భరత ఖండమంతా సులభంగానే చూడవచ్చును. హిమాచలానికి ఆవల ఏమి ఉన్నదీ తెలియదు. అక్కడికి భూమార్గాన వెళ్లడం అసాధ్యం! రేపే శుభముహూర్తం! ముందుగా అక్కడికి పోయి రా!" అన్నాడు. తన తల్లిదండ్రులకు చింత అధికమైనపుడు, వారిని ఓదార్చవలసిందనీ- ఇంకా ఎన్నెన్నో చెప్పి కందర్పుడు ఆ మరునాడే ఉదయాన జింకమీద ఎగిరిపోయాడు.

అదేమి చిత్రమోగాని, ఆ జింక ఎంత వేగంగా ఎగురుతున్నా త్రిప్పట కుదుపు లేకుండా సాగుతోంది. రెండు ఝాములకు అది హిమాలయాలు చేరుకుంది. మధ్యాహ్నం వేళకావడం వల్ల మంచుబాధ అతనికి లేకపోయింది. తాను తెచ్చుకున్న ఆహారం భుజించి,వెంటనే తిరిగి ఉత్తరాభిముఖుడై వెళ్లసాగాడు. చాలా దూరం వరకు పర్వతాలు- అడవులే తప్ప ఇంకేమీ లేవు.

అరణ్యాల మీదుగా జింక ప్రయాణిస్తున్నప్పుడు, దాని వడి తగ్గించి భూమికి చేరువగా పోనిస్తూ చెట్లకున్న పళ్లు కోసుకుంటూ- వింత వింత అడవి మృగాలను చూసి సింహనాదం చేసి అంతలోనే పైకి ఎగురుతూ వెళ్తూండగా కొంతసేపటికి ఒక పట్నం కనిపించింది.

ఇంకా ఝాము ప్రొద్దున్నందువల్ల, అప్పటికే తన దేశాన్ని వదలి చాలా దూరం వచ్చేసినందువల్ల, అది ఆ దేశానికి రాజధానీ నగరం

కావచ్చునని ఊహించడం వల్ల అక్కడ దిగి ఆ దేశంలో వింతలు చూడాలనుకున్నాడు.

"ఆహా! ఎంతలో ఎంత దూరం వచ్చేశాను? అన్నన్నా! ఈ యంత్రం చేసిన వాణ్ణి ఎంతయినా మెచ్చుకోవాల్సిందే!" అనుకుంటూ ఆ జింక ఎడమ చెవిలోని మీట తోనే గాలి వదిలించేసి మడిచి చంకలో పెట్టుకుని, ఆ మహాపట్నంలోని ఒక వీధిగుండా వెళ్లసాగాడు.

చండిక కథ

కొద్దిపాటి దూరం... ఓ పది అడుగులన్నా నడిచాడో లేదో, అతడ్ని విదేశీయునిగా గుర్తించేసిన పురరక్షక భటులు అడ్డుకున్నారు. "ఎవర్నువ్వు? ఈ పట్టణానికి ఎప్పుడొచ్చావు? సొమ్ము చెల్లించిన చీటీని చూపించు" అని అడిగారు. వారి భాష అతడికి అర్థం కాలేదు. భాష అర్థంకాలేదని చెప్పిన మాటలు ఆ భటులకు బోధపడలేదు. వాళ్లు తిరిగి అదే మాట అడిగినా కందర్పునికి ఏమి అర్థంకాలేదు. ఇంతలో ఒక భటుడతని చేతిని పట్టుకోగా, అది విదిలిస్తూంటే అతని చంకలోనుండి తోలు జింక జారిపడింది. దీనికీ చీటీ ఉండాలి అంటూ ఆ తోలుతిత్తిని వాళ్లు పట్టుకుని రాజసభకు పద అంటూ త్రోయసాగారు. పదిమందిని ఒక్క కందర్పుడు ఎదుర్కొనలేకపోవడంతో వారు అతడ్ని తలారి కొట్టానికి తీసుకుపోయారు.

అక్కడ- తలారి కూడా అవే ప్రశ్నలు వేశాడు. కందర్పుడు సైగల ద్వారా తన వృత్తాంతం చెప్పబోగా, వాళ్లకు అర్థం కాలేదు. ప్రజలు అతడ్ని వింతగా చూడడానికి మూగసాగారు. అతడు కూడా వాళ్లవంక వింతగా చూస్తూ, తన జింకను అన్యాయంగా రాజభటులు లాక్కున్నారని సంజ్ఞ చేశాడు.

మొత్తం మీద ఎవరికీ అతడి గురించి అర్థం కాలేదు. దాంతో ఆ రెండు నేరాల కిందా అతడ్ని అపరాధిగా కారాగృహంలో పడేశారు. అతని తోలుజింకను చౌర్యవస్తువులుంచే పెట్టిలో పడేశారు.

"విధిని తప్పించుకోవడం ఎవరితనం? విదేశీ దర్శన ఫలం ఇదే కాబోలు! ఏభయ్యారు భాషలొచ్చినా- అవన్నీ వినియోగపరిచినా, వారిదగ్గర ఏదీ పనిచేయలేదు. నా ప్రాణం లాంటి జింకను లాక్కున్నారు. ఇక- ఈ జన్మలో నా దేశాన్నీ నా వాళ్లనూ చూడగలనా? ఇంటిదగ్గర హాయిగా సుఖించి కూర్చోక నాకీ బుద్ధి ఎందుకు పుట్టాలి?" అని విచారించాడు.

అంతలోనే ధైర్యంతెచ్చుకుని "నేను ఇటువంటి ఆచారవ్యవహారాలు తెలుసుకోదలచికదా బయలుదేరాను. ఇది వీరి ఆచారమేమో! ఇక్కడి ప్రజలు నాగరీకుల లాగానే ఉన్నారు. పదిరోజుల్లోనే వీరిభాష తెలుసుకుని పై అధికారులకు అర్థమయ్యేలాగ పరిస్థితి వివరించి చెప్పుకుని న్యాయం పొందగలను"అనుకున్నాడు కందర్పుడు. తన వలెనే బంధించబడిన వారితో మాట్లాడి అక్కడి భాష తెలుసుకోవాలనుకున్నాడు.

ఇంతలో గుర్రపుబండీలో వచ్చిన ఒక అధికారి బందీలను పరిశీలిస్తూ "ఇతడెవరు?" అని అడిగాడు. కందర్పుడు అంతకు పూర్వం వలెనే సంజ్ఞలతో చెప్పుకోబోయాడు. ఆయనకు అర్థంకాక పోయినా కందర్పుడి వేషం చూసి జాలిపడి, బండిలోనున్న ఒకస్త్రీని పిలిచి "ఈ వింతమనిషిని చూశావా?" అని అడిగాడు.

ఆమె కందర్పుని చూసి విస్మయంగా "పాపం! ఏ దేశానికి చెందినవాడో- ఏమో! మనదేశం చట్టాలు తెలుసో! లేదో? ఇంతమాత్రానికే ఇతడ్ని చెరసాలలో పెట్టాలా? ఇతని ముఖవర్చస్సు చూడగా గౌరవమయిన కుటుంబంలో వాడని తోస్తోంది. ఇతడిని విడిపించడండి. మన ఇంటికి తీసుకెళ్దాం! నిజం తెలిశాక తగిన విధంగా చెయ్యవచ్చు!" అన్నది.

అధికారి, అతడ్ని పూచీ పడుతున్నట్టుగా పత్రం మీద ఏదో వారి భాషలో రాసిచ్చి కందర్పుని విడిపించాడు. సంజ్ఞ చేసి బండీ ఎక్కమన్నాడు "నాజింక వారి దగ్గర ఉండిపోయింది. అదిస్తేకాని నేను ఎక్కను" అన్నాడు సంజ్ఞలతోనే. "ప్రస్తుతం దాన్నివ్వడానికి కుదరదు" అని తలారితో సంజ్ఞచేయించగా చేసేదిలేక తప్పిన చెరసాల కంటె వేరే భాగ్యమేల అన్నట్లుగా బండీఎక్కాడు ఆమె తన ప్రక్కన చోటు చూపించినా, అతడు వారికెదురుగానే

కూర్చున్నాడు. ఏదేశంలో నైనా ధర్మాత్ములుంటారని తలపోస్తూండగా ఆ బండివాడు గుర్రాల్ని వేగంగా పరుగెత్తించడంతో అది ముహూర్త మాత్రంలో వెళ్ళి ఓ మేడ ముందు ఆగింది. వారితోపాటు అతడినీ లోపలకు తీసుకెళ్లారు. ఆ మేడలోని ఒక గదిలో కూర్చొన్నాక, అక్కడ రాతకు పనికొచ్చే పరికరాలను చూసి, రంగులతో పటం వేసి తన దేశాన్నీ తాను సింహాసనం మీద కూర్చొన్నట్లుగాను చిత్రించాడు. అంతలో సేవకుడు తెచ్చిన మద్యమాంసాలతో సహాభోజన పదార్థాలు తీసుకొచ్చాడు. తినమని సైగ చేశాడు. కాని వారిదే కులమో తెలియక స్నాన సంధ్యావందనాలు చెయ్యక ఎలా తినడం అని బాధపడి వాటిలోన పాలు మాత్రం తీసుకొని, తాను తెచ్చుకున్న ఫలాలు భుజించాడు.

కొంతసేపటికి ఆ స్త్రీ వచ్చి అతని వృత్తాంత మేమిటో చెప్పమని సంకేతభాషలో అడిగింది. కందర్పుడు తాను గీసినది చూపించి అందులో రాజును తనేనని సూచించాడు. అది చూసి ఆమె ఎంతో ఆశ్చర్యపడి చిత్రంలో అతని ప్రక్కనే తన చిత్రాన్ని గీసి అతనికి చూపించింది. అది గ్రహించిన కందర్పుడు తమ దేశస్త్రీల సాంప్రదాయానికీ ఆ స్త్రీ సాంప్రదాయానికీ భేదాలున్నాయని చూపించే చిత్రపటాలు గీసి ఆమెను పెళ్లి చేసుకోవడం కుదరదని సూచించేసరికి ఆమెకు కోపం వచ్చి “నీ కంఠానికి ఉరి బిగిస్తా” నంటూ అక్కడ్నుంచి చివాలున లేచి వెళ్లిపోయింది. ఎలాగో ఆ రాత్రి తెల్లవారింది. రాత్రి అలా కోపంగా లోపలికి వెళ్లిన ఆ జాణ “మనం పంపిన పదార్థాల్లో అతడు ఏది ఇష్టంగా పుచ్చుకున్నాడు?” ‘అని అడిగింది.

ఆ పరిచారకులకు మద్యమంటే చాలా ఇష్టం. అతిథులు ఆరగించాక వదిలేసేవన్నీ సేవకులు తీసేసుకునే సంప్రదాయం ఉన్నందువల్ల వారు తమ యజమానురాలితో ‘మద్యం’ అని అబద్ధం చెప్పారు. కందర్పుడది ఎలాగూ వదిలేస్తాడు కనుక తాము తీసుకోవచ్చునని వారి ఊహ. ఏది ఇష్టమైతే అదే ముందు తీసుకుంటాడు గనుక, సేవకులు చెప్పిన దాన్ని బట్టి ఆమె మద్యంలో విషం కలిపింది.

చండిక కథ

కందర్పుడు ముందు రోజు రాత్రి వలెనే పాలు మాత్రమే స్వీకరించి, తాను వెంట తెచ్చుకున్న ఫలాలే తిని మిగిలినవి తీసుకుపొమ్మన్నాడు. పరిచారకులు అవి తీసుకెళ్తుండగా అధికారి కూడా అయిన ఆ గృహయజమాని అక్కడ కొచ్చాడు. మద్యం ఆయన బల్లమీద పెట్టి సేవకులు అక్కడ్నుంచి వెళ్లిపోయారు. ఆ మద్యం తాగి అతడు మృతిచెందాడు. ఆమె వచ్చి నేరాన్ని కందర్పుడి మీదకు నెట్టవలసిందని పనివాళ్లకు సూచించే సరికి వాళ్లు అలాగే చేశారు. వైద్యులు ధృవీకరించిన దాని ప్రకారం మద్యంలో విషం కలియడమే అతని మరణానికి కారణమని ధృవపడింది. కృతఘ్నుడని అందరూ కందర్పుని నిందించసాగారు.

రాత్రి ఏదో సిద్ధరసం అంటూ కందర్పుడా మద్యంలో విషం కలిపాడన్నట్లుగా కల్పించి చెప్పిన పరిచారకుల సాక్ష్యం మేరకు అతనికి ఉరిశిక్ష ఖాయమైంది. రాజభటులు అతడ్ని పట్నమంతా తిప్పుతూ వధ్యభూమికి తీసుకుపోయారు. ఉరితాడు బిగించడం ఒక్కటే తరువాయి.

కందర్పుడు తనస్థితికి విచారిస్తూ, అనవసరంగా తాను దేశాటనం పెట్టుకున్నందుకు పశ్చాత్తాపపడి దైవధ్యానంలో మునిగిపోయాడు. అతడు ఇక తాను బ్రతికి ఉండడం కల్ల అనుకుంటూండగా, “వద్దొద్దు! ఉరి తీయడం ఆపండి” అంటూ రాజభటులిద్దరు. పరుగెత్తుకొచ్చి రాజముద్ర వేసిన పత్రం అందజేశారు.

ఆ శిక్షలు పర్యవేక్షిస్తున్న అధికారి “వీడికింకా ఆయుష్షున్నట్లే ఉంది. రాజసభకు తీసుకురమ్మని శాసనం. తీసుకెళ్లండి” అన్నాడు.

అక్కడి రాజు అతనికి ఉరిశిక్ష వేసి అంతఃపురానికి వెళ్లి, తన కుమార్తెతో సభలోని విశేషాలు చెప్పి, “అతనికి శిక్ష విధించినది మొదలు నా హృదయంలో ఏదో భయం ఆవహించింది. నేను చేసింది న్యాయమేనా?” అని ధర్మవిచక్షణలో నేర్పరురాలైన ఆమెని అడిగాడు.

ఆమె నేరారోపణ పత్రాలన్నీ చదివి “ఇందులో ఏదో మతలబున్నది. తనకు ఉపకారం చేయబోయే వారిని ఎవరైనా ఎందుకు విషమిచ్చి చంపుతారు. ఆ రహస్యం నేను తెలుసుకుంటాను, ముందు ఉరిని ఆపించు” అని చెప్పడం వల్ల అతని ఉరిశిక్ష ఆగింది. ఈ మాటలు రాజపత్రం తెచ్చిన

భటుల మధ్య మాటలలో అతనికి అర్థమైంది.

ఈలోగా రాజపుత్రిక, మృతుని ఇంటికి వెళ్లి శోధించింది. కందర్పుడు ఆ యింట్లోని స్త్రీ సంజ్ఞా గ్రహణ నిమిత్తం రాసుకున్న చిత్రపటాలు మాత్రమే లభ్యంకాగా, ఆమె మిగిలిన విషయాలు తెలుసుకోడానికి గూఢచారుల్ని నియమించి తిరిగి రాజసభకు వచ్చింది.

పరిశీలించిన చిత్రపటాల ప్రకారం "ఇతడే దేశానికో ప్రభువు తప్ప సామాన్యుడు కాడు, అతడు ఇటు వంటిపని చేసి ఉండడు. ఆ ఇంట ఎవరో ఈ పని చేసి నేరం అతడి మీదకు నెట్టి ఉంటారు. నిజం కొద్దిసేపట్లో తెలియగలదు" అంటూ ఆ రాకుమార్తె తనకు తెలిసిన భాషలన్నిటిలోను కందర్పుని ప్రశ్నించింది. కాని అవేవీ కందర్పునికి తెలియవు. అయితే- ఆమె మాటలలో ఒక సంస్కృత పదాన్నివిని (కస్త్వం?) ఆమెకు దేవభాష తెలిసినదే గనుక అందులో సంభాషించ వచ్చుననీ సంతోషించాడు.

"హిమాచల దక్షిణ దేశాయః కశ్చిద్రాజపుత్రోహం "(అనగా హిమాలయాలకు దక్షిణాన ఉన్న రాజ పుత్రులలో ఒకడ్ని) అన్నాడు" భవదుదంత మాద్యంత ముచ్యతాం (నీ ఉదంతం పూర్తిగా వినిపించు) అని ఆమె కోరింది. బతికితినని అతడు తన యావద్వృత్తాంతాన్నీ పూసగుచ్చినట్లుగా చెప్పాడు. దాంతో ఆమె కందర్పుడిని గౌరవ పురస్సరంగా ఒక పీఠంమీద కూర్చోబెట్టి, చిత్రపటం తెప్పించింది. అది తాను రాసినదేననీ, ఆ భవనంలో గల స్త్రీకి తన భాష తెలియనందున తానెవరైందీ తెలియజెప్పడానికి గీసిన చిత్రమనీ చెప్పాడు. అంతేగాక తాను రచించిన చిత్రభాగం ప్రక్కన ఆమె తన బొమ్మగీసి తన అభిప్రాయాన్ని తెలిపిందనీ- ఆచార సంప్రదాయాల్లో తేడాలున్నందువల్ల తాను అంగీకరించలేదనీ కూడా సంస్కృతంలో చెప్పాడు. ఈ వైనం అంతటినీ ఆమె తమ భాషలో తండ్రికి తెలిపి" సందేహంలేదు! ఆ అధికారి మరణానికి ఆమెయే కారకురాలు. నెపం ఇతడి మీద నెట్టడానికి అదే ఏదో పథకం వేసి ఉంటుంది" అని ధృవపరిచింది.

ఇంతలో- గూఢచారులలో ఒకడు ఓ ఉత్తరం తెచ్చి ఆమెకు అందించాడు. దానిప్రకారం "నేనొక శత్రువుని పరాభవించవలసివుంది. కనుక విషమిచ్చి ఈ దాసిని పంపు" అని ఉండటాన్ని చూసి, ఈ లేఖ

ఎప్పుడు రాయబడిందని ఆరాతీసింది రాజకుమార్తె. ఆ అధికారి మరణించిన నాటి ఉదయమే అది రాసినట్లుగా ఋజువు కావడంతో, ప్రభువు చండికను రప్పించి చీటీ చూపించి నిలదీశాడు. నిజం వెల్లడైంది, ఆమెకు ద్వీపాంతరవాస శిక్ష విధించి, రాకుమార్తె కందర్పుని ఎంతో గౌరవించింది- విందు చేసింది.

అప్పుడు కూడ కందర్పుడు మద్యమాంసాలు ముట్టక, తనకు చితమైన భోజనమే చేశాడు. ఆమెకు అతడ్ని పెళ్లాడాలని ఉన్నా -ఆ చండికను ఎలా త్రోసి పుచ్చాడో- అట్లాగే తనను కూడ సమ్మతించక పోవచ్చునని, అతని మనస్సు తెలిసేదాకా ఓర్పు వహించాలని అనుకొంది.

అతడక్కడ రాజభోగాలనుభవిస్తూనే పదిరోజుల్లో వారి భాషలోని మర్మాలన్నీ గ్రహించి సంభాషణకు ఉపక్రమించాడు. సూక్ష్మబుద్ధి కనుక అతడికి ఆ భాష ఇట్టే పట్టుబడింది. ఉదయసాయంకాలాల్లో కందర్పుడు ఒక అశ్వశకటాన్ని ఎక్కి పట్టణం నలుమూలలా సంచరించి వారి ఆహార విహారాలు తెలుసుకున్నాడు. ఇట్లా విహరిస్తూనే ఒక రోజున తనను మొట్టమొదట నిలిపి విచారించిన అధికారి వద్దకు వెళ్లి, తన వద్ద లాక్కున్న తోలుజింకనేం చేశారని అడిగాడు.

"అయ్యా! అది ఇంతకాలం మా దగ్గర ఉండదు- విదేశీయులనుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును ఆ మర్నాడే ఎప్పటికప్పుడు వేలం వేసేస్తాం! ఎవరు పాడుకున్నదీ తెలియదు" అని చెప్పాడు.

కందర్పుడొక రోజు ప్రాతఃకాలంలో ఒక వీధి వెంట వెళ్తూండగా కావడిలో చర్మాలుంచి, అంగట్లో అమ్ముకోడానికి తీసుకెళ్తున్న వాడొకడు ఎదురుపడ్డాడు. ఆ కావడి దింపించి, దాన్ని పరీక్షించగా తన తోలుజింక కనిపించింది. కందర్పుడు ఆనందం పట్టలేకపోయాడు. దాని మీద లిపిని ఆ దేశంలో చదవగలిగిన వాడెవడూ లేడు. కనుకదాని మహాత్మ్యం ఎవరికీ బోధపడలేదు. "ఓరీ! ఈ తోలెంతకు కొన్నావు?" అని అడగ్గా "అయ్యా! ఇది దేనికీ ఉపయోగం లేదు. ఇదిగో! ఈ తోళ్లకు కొసరుగా తీసుకున్నాను. మీకు నచ్చిన సొమ్మిచ్చి దీన్ని పుచ్చుకోండి" అన్నాడు. వెంటనే కందర్పుడు తన వ్రేలి ఉంగరాన్ని తీసిచ్చి ఆ జింకచర్మం స్వాధీన పరుచుకుని పట్టరాని సంతోషంతో తిరుగుముఖంపట్టాడు.

"ఈ దేశంలో జీవహింసకు ఎవరూ వెరిచెట్టులేరు. స్త్రీలు కూడా విద్యలచే శోభితులై సాహసాలు చేస్తుంటారు. చట్టాలు కూడా చాలానే ఉన్నాయి. అదీగాక ఆ రాజపుత్రిక నామీద మనస్సు పారేసుకున్నట్లుంది. ఆమె అభిప్రాయం నన్ను పెళ్లి చేసుకోవాలనో ఏమో! అందుకు అంగీకరించక పోతే, చండిక లాగానే ప్రవర్తిస్తేనో? ఈ దేశ ప్రజల్నెవరు నమ్మగలరు? కనుక- ఇప్పుడే ఈ దేశం విడిచి పోవడం ఉత్తమం! విదేశీ యాత్రవల్ల తృప్తిపొందుతాను" అని నిశ్చయించుకుని జింకను సిద్ధంచేసుకుని మరలు మీటి ఆకాశమార్గం పట్టాడు.

అక్కడ నుంచి పడమటి దిక్కుగా ఎగురుతూ, ఏదైనా పట్నం కనిపిస్తే పైనుండే చూస్తూ, పశ్చిమ సముద్రతీరం వరకు వెళ్లాడు. కాని అక్కడ దిగకుండా ద్వీపాలు చూద్దామని సముద్రం మీదనే జింకపైన విహరిస్తున్నాడు. ఎటు చూసినా ఎంతకూ తరగనంత సముద్రమే తప్ప ఇంకేమీ కనిపించకపోయేసరికి అతనికి విసుగు జనించింది.

ఇంతలో సూర్యుడస్తమించి చంద్రోదయమైంది. సముద్రం పై చంద్రకిరణాలు ప్రతిఫలించి వజ్రంలా మెరుస్తున్నది. అక్కడనుంచి తిరుగు ప్రయాణమై వచ్చేయాలని చంద్రబింబం గుర్తుగా గ్రహించి దక్షిణానికి బయల్దేరాడు. సూర్యోదయ సమయందాకా అలాగే ప్రయాణించినా దరి దొరికింది కాదు. సూర్యోదయం కాగానే ఏదైనా పట్నం కనిపిస్తుందేమోనని తూర్పుదిక్కుగా సూర్యుడికి అభిముఖంగా వెళ్లసాగాడు. ఏదైనా ఫలవృక్షం కనిపిస్తే, దాని పళ్లు తినవచ్చునని, భూమికి దగ్గరగా జింకని నడపసాగాడు.

ఒక చోట చక్కని ఉద్యానవనం కనిపించింది. అతడందులో దిగి, జింకను ఒక రహస్య ప్రదేశంలో దాచి, అక్కడున్న సరస్సులో హాయిగా స్నానం చేసి, అందులోని పళ్లచెట్లనుంచి పళ్లు కోసుకుని తిని ఆకలి తీరడంతో అప్పుడా తోటను పరిశీలించడం ప్రారంభించాడు.

"ఈ తోట చుట్టూ దిట్టమైన ప్రహారీ ఉన్నదే! అంటే... కాపలావారి అనుమతి లేకుండా దీనిలో ఎవరూ ప్రవేశించ లేరన్న మాట! ఈ చెట్లకొమ్మలకు ఉయ్యాలలున్నాయంటే, ఇక్కడ తరచుగా స్త్రీలు విహరిస్తుంటారేమో! క్రీడా సాధనాలు కూడా స్త్రీలకు పని కొచ్చేవే ఇక్కడ

ఎక్కువగా ఉన్నాయి. కనుక స్త్రీ విహారభూమి అని స్పష్టమవుతున్నది. ఏదైతే అదైందిగానీ ఇక్కడచెట్ల నుంచి హాయిగా వీస్తూన్న చల్లని గాలికి కొంతసేపు సేదతీరి, మార్గాయాసాన్ని మర్చిపోయి విశ్రమిస్తాను. ఆ తర్వాత పోవచ్చు" నన్ను కొని, ఒక చెట్టు నీడన కూర్చుని ఆ వనంలో వింతలు చూడసాగాడు.

మనోరమ కథ

ఇంతలో పూలు కోయడానికి అటువైపుగా వస్తున్న స్త్రీల మాటలు వినవచ్చాయి. కందర్పుడు అదిరిపడి "ఇంతవరకు వీరు ఆ వైపు ఉన్నారు కాబోలు! ఇప్పటికే రెండు చోట్ల స్త్రీమూలకంగా ప్రమాదాలు ఏర్పడి గండాలు తప్పాయి. స్త్రీల మాటలువిని, ఇది ఏ దేశమో నిర్ణయించుకోవచ్చు!" అని తిరిగి జింకని సిద్ధంచేసుకుని, దానిపైన ఎక్కి చెట్లకొమ్మల్లోనే దాక్కొని మాటలు వినసాగాడు.

మదనతాపాన్ని మరింత పెంచేలా, చెలికత్తెల ప్రశంసల మధ్య ఓ చక్కనైన స్త్రీ పూలు కోస్తోంది. వారి మాటల్నిబట్టి ఆమె మనోరమ అని బోధపడటమేగాక, అది భరతఖండ భూభాగమేనని స్పష్టపడింది కందర్పుడికి కొంత సేపటి తర్వాత వారు వలువలు విడిచి, తమ దేహసౌందర్యం మరింత ప్రస్ఫుట పరిచారు. ఆ సౌందర్యమే సౌందర్యం. వాళ్లంతా ఆ సరస్సులో జలకాలాడుతుంటే 'మదీయదేశాటనకు ఫలంబిదే!' అనుకుంటూ వారి సౌందర్యాన్ని తనివి తీరా గ్రోల సాగాడతడు. వారిలో ముఖ్యంగా రాజపుత్రి మనోరమపై మరులు గొన్న కందర్పుడు మోహపరవశుడై "ఈమెను కౌగిట చేర్చుకుంటే ముల్లోకాలకు రాజును చేస్తారన్నా వద్దనేస్తారు" అనుకుంటూండగా వారు స్నానాలు ముగించి సాయంత్రం కావడంతో గుర్రపు బండీలలో కోట మేడకు వెళ్లిపోయారు.

కందర్పుడు తన జింకమీద వారిని అనుసరించాడు. వారి నివాసాన్ని గుర్తు పెట్టుకున్నాడు. పట్టణంలో ఒక చోట దిగి, జింకను మడిచి చంకలో పెట్టుకుని, ఒక బ్రాహ్మణునింటికి చేరి భోజనం ఏర్పాటు చేయమన్నాడు.

మనోరమ కథ

అతడీ కందర్పునిలో రాచరీవి కనిపెట్టి రుచికరమైన భోజనాన్ని ఉన్నంతలోనే పెట్టాడు. అతిథుల్ని ఆదరించే స్వభావం గల బ్రాహ్మణుడు పెట్టిన భోజనం చేస్తూనే ఆ దేశ విశేషాలు అడిగి తెలుసుకున్నాడు.

అది మహారాష్ట్ర దేశమనీ, వీరసేనుడు దాని పాలకుడనీ, అతని ఏకైక పుత్రిక మనోరమ అనీ ఆమె దొక ప్రత్యేక తరహా వ్యక్తిత్వమనీ ఇటీవలనే ఆమెకు రాజు స్వయంవరం ప్రకటిస్తే ఆమె ఎవర్ని వరించనందున రాజు ఆమెపై ఆగ్రహించి వున్నాడనీ చెప్పి, బ్రాహ్మణుడా కందర్పుడి విశేషాలు అడగ్గా, సమయానుకూలంగా చెప్పవలసినంత వరకే తన గురించి చెప్పాడు. కందర్పుడు కోటలోని విశేషాలు కూడా ఆ బ్రాహ్మణుని వల్లనే తెలుసుకున్నాడు.

అంగడిలో పూలూ– గంధం కొనుక్కొని, మనోహరమైన వేషంతో ఆ రాత్రి జింక నెక్కి ఆకాశ మార్గాన ఆమె అంతఃపురానికి వెళ్లాడు. అతడు వెళ్లేసరికి మనోరమ వీణపై పాటపాడుతోంది. దాంతో కందర్పునిలో మన్మథ భావం సందడిచేసింది. మేడమీద ఒక మూల దాగి ఉండి, కొంతసేపటికి నిద్రకు ఉపక్రమించడానికి చెలికత్తెలు వెళ్లిపోగా, మనోరమ తానుకూడా పవళించింది.

అందరూ నిద్రించారని నిర్ధారించుకున్నాక కందర్పుడు మనోరమ మందిరంలోకి వెళ్లాడు. మెరుపు తీగలాంటి ఆమె సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించాడు. అక్కడే ఉన్న గంధం గిన్నె తీసుకుని తాను తెచ్చిన గంధం అందులో కలిపి, ఆమె చెక్కిళ్లకు, కంఠానికి క్రిందా సుతారంగా గంధం అద్దాడు. గాఢనిద్రా పరవశురాలై వున్నదని గమనించి, మెల్లగా రవికెముడి ఉత్తరించి, బంగారు కలశాల్లా బయటపడ్డ కుచ కుంభాలపై అతిసున్నితంగా గంధపుపూతలు పూశాడు. గంధంతోనే 'కందర్ప' అనే అక్షరాలు అక్కడ చెక్కాడు. ఈలోగా తెలతెలవారుతూండడం గమనించి, ఆ చిలిపిపనులు చాలించి జింకనెక్కి తిరిగి తన బసకు వెళ్లిపోయాడు. మరునాడు మనోరమ చెలికత్తెలతో కూడ దంతధావనం చేస్తూంటే మధురిక అనే చెలికత్తె కపోలాలమీద గంధపు ముద్రలు చూసి "అవి అలా అద్దుకున్నావేం? ద్వైతులు అద్దుకున్నట్లు" అని అడిగింది. ఆమె అద్దం తెప్పించుకొని చూసి "చిత్రంగా ఉందే! పరిహాసవతివి నువ్వే!" అంటూండగా కంఠహారం సవరిస్తూ

రవికముడివీడి ఉండటం- అక్కడ కూడా గంధమద్దబడి ఉండటం గమనించి "నిజం చెప్పు! నువ్వుకాక నా గదిలోకి ఇంకొకతె రాగలదా అయినా నిద్రలోన ఈ పరిహాసాలేమిటి?" అని అడిగేసరికి మధురిక కూడ తెల్లబోయింది. "నిజం! ఒట్టమ్మా! నీకేం తెలీదు" అంటూన్న ఆ సఖిని నమ్మలేనట్లుగా చూస్తూ ఇది ఇంద్రజాలంగా ఉందే అని ఆశ్చర్యపోయింది.

చెలికత్తెలు పరీక్షగా చూసి "ఇక్కడ కందర్ప అని పేరు కూడా లిఖించబడిఉంది. మన్మథుడే నీ రూపానికి వలచి రాలేదు కద! ఈ రచ్చ అంతా పురుషులపనే అయి ఉంటుంది. కాని ఇంత కట్టుదిట్టంగా కాపలావున్నా ఈ అంతఃపుర మందిరంలోకి ప్రవేశించడం అసాధ్యమే! అయినా ఎవరైనా ఎక్కడైనా దాగి ఉన్నారేమో చూడు!" అని పంపించింది. ఆమె అన్నీ గాలించి తిరిగొచ్చి క్రింది మేడతో సహా తలుపులన్నీ అప్పటికీ మూసి ఉన్న సంగతి రాకుమార్తెకు ఎరుక పరిచింది.

రాకుమార్తెకు తన ఎడమ కన్ను ఎడమభుజం అదరడం అదృష్ట సూచకంగా భావించి "ఇది వింతగా ఉందే! రహస్యంగా ఉంచు! ఎవరైనా వింటే నవ్వుతారు కూడ! మనం ఈ రాత్రి నిద్రమేల్కొని అతడెవరన్నదీ కనిపెట్టాలి. నిన్నవచ్చినవాడు ఈరోజు కూడా రాకమానడు" అని హెచ్చరించి చెలికత్తెలను సిద్ధపరచింది. ఆ రాత్రి తాను మనోహరంగా అలంకరించుకుని, చాలాసేపు సంగీతం సాధన చేసి, ఇక మేల్కోలేక నిద్రపోగా, చెలికత్తెలు కూడ నిద్ర కాగలేక ఆమె చెంతనే ఒక్కొక్కరొక్క అవస్థలో నిద్రలోకి జారుకున్నారు. మధురిక కూడా కునుకు పట్టేశాక కందర్పుడక్కడికి ప్రవేశించాడు.

ఆ రోజు పగలంతా మనోరమ రూపాన్ని పక్కనే తన రూపాన్ని ఒక పటంలో చిత్తరువు గీసి, మునుపటిరాత్రి చేసినట్లుగానే చిలిపి చేష్టలన్నీ చేసి, ఆమెకు నిద్రాభంగం కలిగించకుండా ఆమె వేలి ఉంగరాన్ని కాజేసి, తాను ధరించిన ఉంగరం ఆమెకు తొడిగాడు. దగ్గర్లో పురుషులు వేసుకోదగ్గ కర్పూర తాంబూలం ఉంటే అది వేసుకుని, ఆ తాంబూలరసాన్ని కొంత ఆమె బుగ్గల మీద పులిమి, తాను తెచ్చిన చిత్ర పటాన్ని ఆమె పక్కనే తల్పంమీద పెట్టి, తెల్లవారవస్తోందని మళ్లీ తన జింక మీద వెళ్లిపోయాడు.,

మనోరమ కథ

ఉదయం లేచి చూస్తే ఇంకేముందీ? మొన్నటికంటే ఎక్కువగా అతడొచ్చిన గుర్తులు కన్పించాయి. "మధురికా! నువ్వూ నిద్రపోయావా? అరె! ఇంకా చూసుకోలేదు- నా ఉంగర మేదీ? ఈ ఉంగరం నా వేలికెలా వచ్చింది" అనుకుంటూ, దాన్ని పరిశీలించి గంథంమీద నొక్కిన ఉంగరం ఇదే అని గుర్తించింది. పరీక్షించాలని పెట్టిన తాంబూలం మాయమై, దాని రసం తనబుగ్గమీద ఉండటంతో సిగ్గుపడింది. 'పోతుటీగ అయినా ప్రవేశించలేని ఈ అంతఃపురంలోకి అతడెట్లా వస్తున్నాడు? చోద్యంగా ఉంది' అనుకుంటూ, తల్పంమీద చిత్రపటం ఉండటం చూసి అందులో మిధునం వంక అబ్బురపడిచూసి, ఆ జంటలోని స్త్రీలో తనపోలికలుండటాన్ని బట్టి కందర్పుని రూపంలో వచ్చిన పురుషుడిలా ఉండొచ్చునని ఊహించింది.

"చిత్రపటంలో లాంటి సుందరులు నిజంగా ఉంటారా?" అని మధురికను అడిగింది. ఆమె కూడ చెలిని ఆట పట్టించదలచి "అబ్బే! ఉండరు ఇతడు సాక్షాత్తు ఆ మన్మధ సఖులలో ఒకరై ఉండాలి. జయంతుడో- వసంతుడో కాబోలు" అని నవ్వింది. చివరికి "ఇలాటి సుందరులు దేవతల్లో తప్ప మనుషుల్లో ఉండరు" అని తేల్చి చెప్పింది. ఆహా! ఏమి నా భాగ్యం అనుకుంటూ ఆ చిత్ర పటాన్ని కౌగలించుకుని ముద్దిడసాగింది మనోరమ.

మూడో నాటి రాత్రి మెలకువగా ఉండి తీరాలన్న పట్టుదలకొద్దీ చెలులతో సహా పగలంతా నిద్రపోయింది మనోరమ. సాయంకాలం సమీపిస్తుండగా తమ నెచ్చెలి ప్రియకాంతుని ఆగమనం కోసం వింతగా అలంకరించారు. ఆ చెలికత్తెలు. అతనిరాక కోసం ఎదురుచూస్తూ నిద్ర నటించసాగారు అందరూ.

యధాప్రకారం కందర్పుడు రానే వచ్చాడు. అంతఃపురంలో సందడి లేదే అనుకుంటూ మెల్లగా మనోరమ గదిలోకి చేరాడు. నలుమూలలా చూసి ఎవరూ లేరని నిర్ధారించుకున్నాడు. ఓరకంట గమనించిన మనోరమ అతడిని దివ్యపురుషుడనే అనుకొంది. అతడి చర్యలు కనిపెట్టాలని నటన నిద్రపోసాగింది.

మనోరమ చేసిన అలంకరణలు- ఏర్పాట్లు తన చొరబాటును అంగీకరించే విధంగానే ఉన్నాయని గ్రహించాడు కందర్పుడు. మెల్లగా ఆమె శయ్య దగ్గరచేరి, మంచంపై కూర్చొని ముఖసౌందర్యాన్ని తనివి తీరావీక్షిస్తూండగా "రా మధురికా! దొంగ దొరికాడు" అందామె. అతని

చెయ్యిపట్టుకుని. కందర్పుడు ఆమెను భుజాలదగ్గర పట్టుకుని తోసి, ఆమెతో పెనగులాడుతుండగా మధురిక వచ్చింది. చటుక్కున ఆమె కందర్పుని చేయి వదిలేసింది "మధురికా! ఇతడెవరో అంతఃపురంలోకి ఎలా వచ్చాడో కనుక్కో! ఈ సాహసం ఎందుకో తెలుసుకో! నిజం చెప్పకపోతే బంధించబడతారని కూడా చెప్పు!" అంది.

మధురిక వినయంగా అతడి చేతులు పట్టుకుని "అయ్యా! సుందరులు- సుకుమారులు అయిన మీ రూపు చూడగా అది మీ గుణశీల గౌరవాదులను తెలుపుతోంది. మీ వంటి మహనీయులు ఎదుటివారి మనస్సు గ్రహించక ఇలాగ చెయ్యవచ్చా? రెండు రాత్రులుగా ఆమె పడుతూన్న బాధ ఏమని చెప్పమంటారు? చక్కని వారు కాబట్టి ఏం చేసినా చెల్లుతుందనుకుంటున్నారా? అంతఃపురంలోకి ఎలా ప్రవేశించారు? మీ వివరాలేమిటి?" అని అడిగింది.

రాజపుత్రుడా మాటలకు కించిత్ సిగ్గుతో "నేనేం చెయ్యను? మన్మధుని ముందు ఎవరయినా ఓడిపోవలసిందే కదా! మదన శాసనం మేరకే నేనిట్లా చేశాను. మీ సఖి ఇంత అందంగా ఉండడం, నా చిత్తాన్ని హరించడం చౌర్యం కాదా? మీ దగ్గర తప్పుంచుకుని ఇతరుల్ని నిందించడం ఉచితమేనా?" అని అడిగాడు.

"ఓహో! మా సఖిలో గొప్ప తప్పునే వెతికి పట్టుకున్నారు. మా చెలి మీ హృదయాన్ని ఎప్పుడెలా హరించింది? ఆమె నెక్కడ చూశారు? మీ వృత్తాంతం దాచకుండా చెప్తే, మీ తప్పు సైరిస్తాను భయపడకండి" అని నవ్వుతూనే అభయం ఇచ్చింది మధురిక. కందర్పుడు తన కథంతా సుభద్ర మైత్రితో సహా నిజం దాచక పూర్తిగా చెప్పేశాడు. అంతా విన్న మనోరమ సిగ్గులమొగ్గయి ద్వారం దగ్గరకు వెళ్లి తలుపుచాటున నిలబడింది.

అప్పుడు మధురిక "సఖీ! దాక్కుంటావు దేనికీ? ఆయన విషయమంతా చెప్పారుకదా! ఆయన చేసిన కృత్యాల గురించి నువ్వేం అనుకుంటున్నావు? ఇప్పుడు చెయ్యవలసిందేమిటో చెప్పు" అని మనోరమని అడిగింది.

"చేసిన నేరం ఒప్పుకొన్నవారిని ఏం చేస్తారో అదే చెయ్యి! నన్ను అడగడం దేనికీ?" అందామె బింకంగా. "ఈ తప్పుచేసిన వారిని కాపాడ్డం మంచివాళ్ల ధర్మం" అన్నాడు చిలిపిగా కందర్పుడు.

"ఇది కాపాడే నేరం కాదు" అని చాటునుంచే అంది మనోరమ.

అప్పుడు మధురిక "రాజపుత్రీ! నేనొకటి చెప్తా– విను! ఎవరు ఏ పని వల్ల అపరాధి అయ్యారో, అదేపనిని వారిపట్ల ఆచరించడమే వారికి శిక్ష. కనుక నువ్విటు వచ్చి, నిన్ను అతడేం చేశాడో అవే పన్లు అతడి పట్ల నువ్వు ఆచరించు!" అంటూ మనోరమను బలవంతంగా లాక్కొచ్చి ఆ కందర్పుని ఎదుట నిలువబెట్టి, ఆమె బైటికిపోయింది.

ఆ తరువాత ఇద్దరూ మన్మథప్రేరణచే మదనక్రీడల్లో మునిగితేలి ప్రొద్దెక్కేటంత వరకు ఏకశయ్యాగతులై నిద్రపోయారు.

ఆరునెలలు ఇలా గడిచేసరికి ఆమె గర్భవతైంది. ఆ విషయం అంతఃపురమంతటా తెలిసింది. రాజపత్నికి కూడా తెలిసింది. తర్వాత ఎవరో వీరసేనుడికి పేరులేని పత్రిక రాయించి తెలిసేలా చేశారు.

అది విన్న ఆ ప్రభువు కోపంతో "హన్నా! లోకంలో స్త్రీలకంటే దుర్మార్గులు లేరు. ఎంత మాయ? ఎంత దాపరికం? నేను స్వయంవరమే చాటించి ఎక్కడెక్కడి రాజపుత్రులను రప్పించినా వరించింది కాదు. ఇప్పుడు చూడబోతే ఇలాంటి వార్త. ఇంత చలన చిత్తురాలు పెళ్లాడకుండా ఎందుకుంది? నిష్కళంకమైన నన్ను– కులాన్ని అవమాన పరచడానికా?" అని చిందులు త్రొక్కి, తాను విన్నది నిజమో కాదో తన పత్నిని పరీక్షించి రమ్మని పంపి, అది నిజం అని తెలిసి హతాశుడయ్యాడు. ఆ వార్త నిజమేనని చెప్తూ, ఆమె కొన్ని నీతి పలుకులు పలికి ఆ ప్రభువుకు కొంత కోపాన్ని పోగొట్టింది.

వీరసేనుడు తనకు అత్యంత ఇష్టుడయిన మంత్రికి ఆ రహస్యం చెప్పి, ఆ పురుషుడిని పట్టి తెమ్మన్నాడు. బుద్ధికుశలుడైన ఆ మంత్రి ఒక ఉపాయంతో కందర్పుని ఉనికి కనుక్కున్నాడు.

ఆ రాత్రి జంకుతూనే మనోరమ చెంత చేరిన కందర్పుడు "ప్రేయసీ! నా రాకపోకలు మీ వాళ్లు గ్రహించేశారు. ఈ రోజు ఉదయం నన్ను పట్టుకోవాలని కొందరు రాజభటులు వచ్చారు. కాని దైవకృపవల్ల

తప్పించుకున్నాను. రాత్రి నీవు నాకు పూసిన గంధంలో నువ్వుగింజలకంటె సన్నని సూక్ష్మమైన బంగారపురజను నీ పరిచారికల్లో ఎవరో కలిపారు. అది మనం తెలుసుకోలేకపోయాం! దాంతో మెరిసే నా దేహం చూసి భటులు గుర్తు పట్టేశారంటే అంతఃపురంలో తిరిగేవాళ్లలోనే ఎవరో గుట్టు వెల్లడి చేస్తున్నారు. సందేహం లేదు నేను ఇక్కడ ఉంటే వారికి చిక్కకపోను. నాకు అనుజ్ఞ ఇస్తే నేను వెళ్లివస్తా! నన్ను మర్చిపోకు" అన్నాడు. ఆమె ఏడుస్తూ "ఏమన్నారు? మీరు వెళ్తే నేను ఒక్కతెనే ఇక్కడ ఉంటానని ఎలా అనుకున్నారు? నేను గర్భవతినని తెలిస్తే మా వాళ్లు ఎలాగూ బతకనివ్వరు. వాళ్లచేతిలోన చావడం దేనికీ? మీరే నా ప్రాణాలు పోగొట్టి వెళ్లండి" అంది.

మనోరమ కన్నీళ్లు తుడుస్తూ "నువ్విలా దుఃఖిస్తే నేనేం చేయగలను? ఇక్కడుంటే మర్యాద నిలవదు. నిన్ను విడిచి వెళ్లడానికి నాకు కాళ్లాడటంలేదు. ఇల్లు వదలి ఇన్నాళ్లయింది. పోనీ! నిన్ను నా వెంట తీసుకెళ్లాలన్నా సందేహంగానే ఉంది. నా వృద్ధ తల్లిదండ్రులెలా ఉన్నారో? ఈ జింక మీద ఒక్కరోజులో వెళ్లి రావచ్చు! నువ్వు నాతో వస్తే ఏ లోటూ ఉండదు అని కందర్పుడు చెప్పడంతో ప్రాణేశ్వరా! నేను నా బంధువుల్ని వదిలేసి ఇదివరకే మీ ఆధీనమయ్యానుకదా! నన్నింక రమ్మనడానికి మీకు సందేహం దేనికీ? మీ దేశం పోయి హాయిగా నిర్భయంగా ఉందాం! ఈ అంతఃపురానికి మీరు రాత్రుళ్లు దొంగలా రావడం ఎందుకు? ఇక నేను గర్భవతిని అని మా వాళ్లకు చెప్పడం ఒక్కటే మిగిలింది. అయితే, అదిప్పుడు చెప్తే తప్పు పడతారు. స్త్రీలకు భర్తే కదా తల్లీ, తండ్రీ, దైవం అన్నీనూ మా వాళ్లన్న లెక్క లేదునాకు. త్వరగా వెళ్లిపోదాం పదండి! ఇన్ని నిర్బంధాల్లో ఉండడం ఎందుకు? నా కోసం విచారించేది మధురిక ఒక్కర్తే! మనం స్థిరపడ్డాక దాన్నీ అక్కడకు రప్పించుకోవచ్చు!" అని ప్రయాణానికి అతడ్ని తొందర చేయసాగింది. అప్పుడే రత్నాల రాశులున్న పెట్టెలు సర్దసాగింది.

మనోరమ కథ

కందర్పుడు సంతోషించి, చీకటింకా ఉండగానే జింకని గాలితో బాగా పూరించి, మనోరమని రమ్మన్నాడు. ఆమె వచ్చి 'ముందు కూర్చోనా? వెనుక కూర్చోనా?' అని అడిగింది. "ముందే కూర్చో" అని ఆమెని తన కౌగిటిలో ఇరికించి వెనుక తాను కూర్చొని కీలు తిప్పగానే అది ఆకాశంలో కెగిరింది.

అంతవరకు కథ చెప్పి ఆపి మణిసిద్ధుడు "వత్సా! ముందుకథ చాలా పెద్దదిగా ఉంది. మన ప్రయాణానికి వేళైంది కనుక, ఇప్పటికి చాలించి ముందటి మజిలీలో తరువాత కథ చెప్పుకుందాం!" అని బయలుదేరాడు.

గోపాలుడు కావడి మోసుకుని తనతో వస్తుంటే, మణిసిద్ధుడు ప్రణవజపం చేసుకుంటూ ఇరవైమూడో మజిలీ చేరుకుని తరువాత కథను ఇలా చెప్పసాగాడు....



కాశీ మజిలీ కథలు

23 వ మజిలీ

విద్యావతి కథ

"గోపా! విను.... కందర్పుడు ఆ సుందరితో జింకమీద కూర్చొని ఆకాశ మార్గంలో వెళ్తూంటే కొంతసేపటికి సూర్యోదయమైంది, వేగాన్ని భరించలేక మనోరమ "నాకు ఒళ్లూ-కళ్లూ తిరుగుతున్నాయి. ఎక్కడయినా కొంచెం సేపు విశ్రమించాల్సిందే! జింకను నేలమీదికి దించండి" అని కోరగా, అతడు ఒక పట్నపు వెలుపలి పరిసరాల్లో జింకను ఆపాడు. చేయి అందిచ్చి ఆమెని దింపాడు.

ఆమె "ఇది ఏ దేశం? మీ రాజధాని ఇక్కడికి ఎంతదూరం? మా పట్నం విడిచి ఎంత దూరం వచ్చాం? ఇక్కడ మనల్ని తెలిసిన వాళ్లెవరూ లేరు కదా" అని బెదురుతూంటే, "సరే! నువ్విక్కడే ఉండు! కాని ఇదే దేశమో నాకూ తెలీదు. మీ దేశం ఇక్కడికి చాలా దూరంలో ఉంటుంది. మా రాజధానికి రాత్రిలోగా చేరగలమేమో! ఇక్కడ మనని ఎరిగిన వారెవ్వరూ ఉండక పోవచ్చు! కాని మన రూపాలను బట్టి సందేహిస్తారు. నువ్వు నేనొచ్చేవరకూ ఎటూ వెళ్లవద్దు. నేను అంగడిలో ఆహార పదార్థాలేమైనా తీసుకొస్తాను?" అని జింకను మడిచి చంకలో పెట్టుకొని, ఆ పట్టణంలోకి వెళ్లాడు కందర్పుడు.

అక్కడి అంగడిలో తినదగ్గ పదార్థాలేమీ దొరకకపోవడంతో, అతడు వాళ్లనీ- వీళ్లనీ అవెక్కడ దొరుకుతాయని అడుగుతూ ఆ పట్టణ మధ్యభాగానికి వెళ్లాడు. అతధి వెళ్లిన వీదు ఒక వేశ్యలవాడ. కందర్పుడు ఆ వీధిలో విశేషాలు చూస్తూ మనోరమ సంగతే మర్చిపోయాడు. అలా వెళ్తూండగా ఒక చోట

విద్యావతి కథ

ఒక విచిత్ర భవనద్వారం దగ్గరే వేశ్యమాతతో వివాద పడుతూన్న విటుడొకడు కనిపించాడు. కందర్పుడక్కడ ఆగిపోయి ఆ కలహం వినసాగాడు.

ఆ వేశ్యమాత "ఎన్నిసార్లు తోలినా సిగ్గులేకుండా కుక్కలా గుమ్మం వదలకుండా వస్తున్నావు. దరిద్రచూడామణీ! విద్యావతి అంత సులభంగా ఉందనుకున్నావా యేం? నక్కఎక్కడ? దేవలోకం ఎక్కడ? నీ దారిన నువ్వుపో" అని అతడి ముఖం మీదే తటాలున తలుపేసేసింది.

అతడు పరుషంగా మాట్లాడుతూ దుఃఖిస్తూంటే, కందర్పుడు అతన్ని సంగతేమిటని అడిగాడు. "ఏం చెప్పమంటారు? నేను రెంటికి చెడిన రేవడినైనాను. ఈ ప్రాంతంలోని ఒక గ్రామానికి మేము అధికారులం. మా తండ్రిగారు నా చిన్నతనంలోనేపోయారు. నేను పెరిగి పెద్దయ్యాక మా తల్లిగారు సురక్షితంగా అంతవరకు కాపాడిన ఆస్తి నా అధీనంలోకి వచ్చింది. ఇక మీ దగ్గర దాపరికం ఎందుగ్గానీ అసలు సంగతి చెప్పేస్తాను. ఒకనాడు నేనొక దేవాలయానికి హరి భజనలు జరుగుతూండగా వెళ్లాను. అక్కడే విద్యావతి అనే వారాంగనా సౌందర్యానికి ముగ్ధుడినై ఆమెను నా అధీనం చేస్తే క్రమంగా నా ఆస్తి నంతట్నీ ఆమె పరం చేస్తానని దాన్తల్లి రత్నావతికి కబురంపాను. అప్పుడు రత్నావతి నన్ను తన మేడకు తీసుకువెళ్లి సకల సత్కారాలు చేసింది. కాని విద్యావతిని మాత్రం చూపించింది కాదు. రేపు చూపిస్తా -మాపు చూపిస్తా అని ఆశపెడుతూ మా ఆస్తినంతట్నీ తెప్పించుకుంది. చివరికా గ్రామాన్ని కూడా రాసిచ్చేశాను. ఇక మా ఇంట్లో ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. నన్ను పూర్తిగా సన్యాసిని చేశాక నన్ను దూషించి దరిద్ర చూడామణీ అంటూ పొమ్మంది. మీరే చూశారు కదా! దీని మూలంగా నాకు పెళ్లికాలేదు. అప్పులదగ్గవారెవరూ మిగల్లేదు. మీరు చూడబోతే మహాత్ముల వలె తోచుచున్నారు. నిష్కారణంగా దీని వల్ల దరిద్రుడినైపోయాను. దీన్ని మందలించి నాకేదో ఒక ఆధారం కల్పించండి" అని అతిదీనుడై వేడుకున్నాడు.

కందర్పుడంతా విన్నాడు. దీనుడైన అతడి మీద జాలి- రత్నావతి మీద కోపం ఒక్కసారే కలిగాయి. "వేశ్యలకు కరుణ అనేదే ఉండదు. రత్నావతిని ఎలాగైనా పరాభవించి ఇతడికి ఉపకారం చేస్తాను" అని

నిర్ణయించుకుని అతన్ని ఓదార్చి "బుద్ధిహీనుడివై భాగ్యమంతా పోగొట్టుకుని ఇప్పుడు జరిగిందానికి విచారించి ఏం లాభం? నువ్వీ ప్రాంతాల్లోనే వసిస్తూ వుండు. నీ ఆస్తి నీకు ఇప్పిస్తాను" అని కందర్పుడా వేశ్యల రహస్యాలన్నీ బాగా తెలుసుకుని, ఒక చిత్రకారుని ఇంటి కెళ్లి తన జింకను గరుడ వాహనం వలె తోచేలాగ అలంకరించి రంగు వేయించాడు.

సూర్యాస్తమయం జరిగాక మహావిష్ణువులా వేషం వేసుకుని, ఆ వారకాంత మేడ మీద వలయాకారంలో తిరగసాగాడు. అప్పటికి విద్యావతి సఖురాళ్లతో కూడి, మేడ మీద వీణవాయిస్తూ విష్ణువుపైన పాట పాడుతోంది. విద్యావతి మీదనే పడేలాగ తులసి మాల జార్చాడు కందర్పుడు.

ఆమె బెదురుతూ ఆకాశం వంక చూసింది. ఆమె చూస్తుండగా కందర్పుడొక ఉత్తరం ఆమె ముందు పడేలా విడిచాడు. గరుడుని ఎక్కిన విష్ణువులావున్న అతడ్ని ఆశ్చర్యంగా చూస్తూ, ఉత్తరం విప్పి చదివి అనేక విధాల విష్ణుస్తోత్రాలు పఠించింది. తన దాసీలను దూరంగా పంపేసింది. ఆ ఉత్తరంలో "సుందరీ! నేను కందర్ప జనకుడిని. నీ భక్తికి మెచ్చి నీకు దర్శనం ఇవ్వాలనుకుంటన్నాను" అని ఉంది. ఆ ఉత్తరం ముమ్మారు చదువుకొని, తలుపులన్నీ వేసి రమ్మని చేసైగ చేసింది. "దేవా! ఆర్తరక్షకా! రమామనోహర! నేటికి నాపై దయ కలిగిందా? స్వామీ! కరుణాంతరంగా! నన్ను కనికరింపవచ్చావా?" అంటూ దండకాలతో అతడ్ని పొగిడింది.

అప్పుడతడు మెల్లగా మేడ దిగాడు. ఆమె సాష్టాంగపడి మొక్కింది. భక్తిపార వశ్యంతో ఆమె కళ్లు మూసుకోగానే, చటుక్కున చర్మపు జింకని అక్కడ నిలిపి, ఆమెని లేవనెత్తి గదిలోకి తీసుకు వెళ్లాడు. ఆమె భయభక్తులతో మెలగడం చూసి, ఇంకొక ఉత్తరం అందించాడామెకు.

"పూర్వజన్మలో నువ్వొక గోపికవి. కృష్ణావతారంలో కామంతో తృప్తి చెందని నీవు ఇంకా సురతక్రీడ వాంఛిస్తూ నన్ను వరం అడిగావు. నీ తదుపరి జన్మలో తీరుస్తానని అప్పుడు చెప్పాను. కామాభిలాష వల్ల నువ్వీజన్మలో వారకాంతగా జన్మించావు. పూర్వజన్మ సంస్కారం వల్ల నీకు నా భక్తి కూడా ప్రాప్తించింది. నీ ఇష్టం వచ్చినన్ని రాత్రులు మాత్రం వచ్చి, నీ కోరిక తీర్చి వెళ్తుంటాను. మాకు భక్తుల కోరికలను తీర్చడం కంటే వేరే

పనేమీలేదు కదా!" అని ఆ ఉత్తరంలో ఉన్నది చదువుకొని ఆమె భక్తి గౌరవాలతో అతన్ని రంజింపచేసి ఆ రాత్రి అంతా కందర్ప (మన్మథ) క్రీడల్లో అతన్ని ముంచి తేల్చింది. ఆ సంగతినామె తల్లికైనా చెప్పనేలేదు.

ప్రతీ రాత్రి కందర్పుడామెతో సుఖిస్తూ సూర్యోదయానికి ముందే వెళ్లి పోతూండేవాడు. తన భక్తికి మెచ్చి విష్ణువే ఆ రీతి తనను కరుణిస్తున్నాడన్న భ్రమ విద్యావతికి చాలా కాలం ఉండిపోయింది. రత్నావతిని వంచించాలని వెళ్లిన కందర్పుడు విద్యావతి సౌందర్యానికి తాను వంచింపబడి, దినమంతా ఎక్కడెక్కడో గడుపుతూ రాత్రయ్యేసరికి విద్యావతిని చేరుకోసాగాడు. అతడెంతగా ఆమె మోహంలో పడిపోయాడంటే అతడు ఆమె సుఖంలో మునిగి తనని తానే మర్చిపోవడమేగాక 'ఇప్పుడే ఆహారం తెస్తా! నువ్విక్కడే ఉండు' అని చెప్పి వచ్చినతాను మనోరమ సంగతి కూడా విస్మరించాడు.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి

"అమ్మాయీ! ఇంతకాలం నేను గడించిన విత్తం వల్ల సుఖంగా గడిచింది. నువ్వు నిష్ఠ నియమం- పూజ అంటూ నీ యవ్వన మంతా నీటి పాల్చేస్తున్నావు. ఇక అవి అన్నీ కట్టిపెట్టి సంపాదనా మార్గం చూసుకో ముందు" అని హిత బోధచేసింది ఆమె తల్లి రత్నావతి.

"అమ్మా! నా వృత్తాంతం నీకు తెలియక అలా అంటున్నావు. సాక్షాత్ శ్రీహరే స్వయంగా వచ్చి రాత్రులలో నన్ను కృతార్థురాలిని చేస్తున్నాడు. కొన్ని కారణాంతరాల వల్ల నీకు చెప్పలేదులే! ఆ మహానుభావుడే నాకు విటుడైఉండగా, ఈ నీచ విటులతో ప్రయోజనం ఏమిటి?" అంది విద్యావతి.

ఆ మాటలకు రత్నావతి ఆశ్చర్యపోయి "అమ్మాయీ! ఈ రహస్యం ఇంతకాలం నాకు చెప్పలేదేం? నేను అసూయపడతాననుకున్నావా? నీ ఔన్నత్యం నాది కాదా? నాకోసారి ఆయన దర్శనం ఇప్పించకూడదా?" అని అడిగింది.

"అందుకు ఆయన్న అనుమతి ఉండాలమ్మా! ఈ రోజు సాహసించి నీకాయన విషయం చెప్పాను. మరికొంత చనువు పెరిగాక నీకు ఆయన దర్శనం తప్పకుండా లభించేలా చూస్తాను" అంది విద్యావతి.

ఒక నాటి రాత్రి, ఆమె సరైన తరుణంలో మెల్లగా "దేవా! నాదో చిన్న విన్నపం! అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడివైన నువ్వు అండగావుండి కూడా నేనిక్కడ ఉండటమేమిటి? మీ దివ్యధామమైన వైకుంఠం చూడాలని వేడుకగా ఉంది. పురాణాల్లో దాని వైభవం అద్భుతంగా వర్ణింపబడి ఉంది కదా! నన్నోసారి అక్కడకు తీసుకెళ్ళి కృతార్థురాలిని చేయండి" అని అడిగింది. "అలాగే" అన్నాడు కందర్పుడు.

"ఒకసారి వైకుంఠాన్ని చూడటం అంటూ జరిగితే, తిరిగి ఈ భూమి మీదకి రావడం కుదరనిపని. ఈ భువిపైన భోగ సంతృప్తి పూర్తి అయితేనే చెప్పు! అప్పుడు వైకుంఠానికి తీసుకెళ్తాను" అని ఇంకో అర్థం వచ్చేలా అన్నాడు.

"స్వామీ! ఉత్కృష్టమైన సుఖం లభిస్తూంటే, నాకు అల్పసుఖాల కాశపడతానా? మీ దయవల్ల ఐహికసుఖాలు పొందాలని నాకే కోరికా లేదు గాని తల్లి ఋణం ఎలా తీర్చుకోను? నేను మీతో వచ్చేస్తే ఆమెని ఎవరు చూసుకుంటారనేదే నాచింత. మా తల్లికి మిమ్మల్ని దర్శించాలని మహా కుతూహలంగా ఉంది. దయచేసి ఒక్కసారి దర్శనం ఇప్పించరా?" అని ఎంతో నైపుణ్యంగా ప్రార్థించింది.

"ఏమేమీ! మీ తల్లికా నన్ను దర్శనం ఇమ్మంటున్నావు! చాలు చాలు! అది చేసిన పాపాలు అన్నీ ఇన్నీ అనుకున్నావా యేం? దానికోసం కొన్ని కొత్త నరకాలు సృష్టించాలని చిత్రగుప్తుల వారిచేత మొన్ననే యముడు నాకు రాయించి పంపించాడు. నేను సరే అన్నాను" అంటూ తొణక్కుండా కందర్పుడు చెప్పగానే మూర్ఛపోయినంత పనైంది విద్యావతికి

"సర్వేశ్వరా! మీకే ప్రేయసినై ఉన్న నేను మాతల్లిని ఈ పాపాలనుంచి రక్షించుకోలేనా? మీ దర్శనం అయితేనేచాలు! సమస్త దురిత నివారణ కలుగుతుందంటారే! మీరు ఆ పాపాలు నిష్కృతి చెందేలా ఏదో ఒక వ్రతమో అర్చనో దానమో చెప్పకూడదా? మీరు అలా చెయ్యకపోతే నేనిప్పుడే మీ పాదాలచెంత ప్రాణాలు పోగొట్టుకుంటాను" అని చనువు, భయం, భక్తి, విశ్వాసాలు తేటపడేలా ప్రార్థిస్తే, దానికి కందర్పుడు నవ్వుకుని, తప్పదన్నట్లుగా నటిస్తూ కొంత సేపు ధ్యానం చేశాడు.

తరువాత "సరే! మీ తల్లి చేత ఒక పని చేయించు! ఆమె అన్యాయంగా ఆర్జించినదంతా ఎవరిది వారికి అప్పగించేసి, మిగిలింది ఏమన్నా ఉంటే బ్రాహ్మణులకు దానం ఇవ్వమను. ఏమీ మిగలరాదు. అప్పుడే ఆమె పవిత్రురాలౌతుంది. నేను దర్శనం ఇవ్వాలంటే ఆమె దగ్గర కేవలం కట్టు కొన్న వస్త్రాలు తప్ప అన్నీ నిశ్శేషంగా పంచబడాలి. నరకం ఆమెకు తప్పేది అప్పుడే!" అన్నాడు కందర్పుడు కరుణిస్తున్నట్లుగా.

కూతురిద్వారా రత్నావతి అది విని, ఎంతో ఆనందించి వైకుంఠ యాత్రకోసం ఉప్పొంగిపోతూ తన సొమ్ము అంతటినీ పంచిపెట్టడానికి ఒప్పుకున్నది. అందుక్కారణం... కిటికీలోంచి విద్యావతీ- కందర్పుల సంభాషణను రహస్యంగా రత్నావతి అంతకుముందే విని ఉండటమే!

రత్నావతి పట్టణంలో చాటింపు వేయించింది. ఎవరి నుంచి ఏమేమి సంగ్రహించిందో గుర్తున్నంత వరకు వారందరికీ కబురుపంపింది. ఆమె దానాలు అందుకోడానికి వచ్చిన బ్రాహ్మణుల సంఖ్య ఎంత అత్యధికంగా ఉన్నదంటే వారు తగువులాడుకుని కొట్లాటలకు సైతం దిగారు. తానార్జించిన కోటి రూపాయల ఆస్తినీ ఆమె తెలిసినంత వరకు దాని యజమానులకీ దాస దాసీ జనానికీ బ్రాహ్మణులకూ పంచేసింది.

తాను వైకుంఠానికి వెళ్తున్నట్లు కొందరు అత్యంత ఆప్తులకు మాత్రమే చెప్పింది. దాంతో విష్ణువును చూడాలని చాలామంది ఆమె ఇంటి ముందు పోగయ్యారు.

గరుడచిహ్నాల జింకమీద కందర్పుడు మేడ దగ్గరవాలాడు రత్నావతి కేదో అనుమానం తగిలినా కూతురి వల్ల బయటపడలేదు. ఆమె చేతులు జోడించి స్తోత్రంచేసి "మీరు చెప్పినట్లే మాతల్లి తన సర్వస్వం దానం చేసేసింది. వైకుంఠ యాత్రకి సిద్ధంగా ఉన్నది" అంది

"ఇప్పటికి ఆమె పునీతురాలైంది. తప్పక తీసికెళ్ల వలసిందే! కాని ఇద్దర్నీ ఒకేసారి ఈ వాహనం మీద తీసుకెళ్లడం కష్టం. నిన్ను ముందు తీసుకెళ్తాను" అన్నాడు కందర్పుడు. జింకని రహస్యంగా సిద్ధం చేశాడు. "ముందు కూర్చోనా? వెనుక కూర్చోనా? "అని అడిగింది విద్యావతి.

పూర్వం మనోరమ కూడా ఇలాగే అడిగిందని గుర్తు తెచ్చుకున్నాడు కందర్పుడు. ఆమెకు అన్యాయం చేశానన్న విషయం గుర్తొచ్చి అతడు మూర్ఛపోయాడు. కీలువదలడంతో జింక చప్పబడి తోలులా క్రిందపడిపోయింది. విద్యావతి అతనికి శీతలోపచారాలు చేసి సేదతీరుస్తూ "ఇదేం స్వామీ! ఇలా పడిపోయారేమిటి? నాపైన కరుణ లేదా" అంటూ ప్రశ్నించింది. అతడప్పటికీ ఇంకా కళ్లు తెరవకనే "అయ్యో రాజపుత్రీ! నిన్నెంత మోసం చేశాను? హాయిగా అంతఃపురంలో ఉండే దానివి. అటువంటి నిన్ను తెచ్చి అడవుల పాల్జేశాను. ఏం కష్టాలు పడుతున్నావో కదా!" అంటూ పలవరించసాగాడు.

రత్నావతి కూతురివంక చూసి "శ్రీమన్నారాయణుడన్నావు. ఇటువంటి అవస్థ ఏమిటి? నాకు అనుమానంగా ఉంది సుమీ! గరుడ వాహనం అలా తోలు తిత్తి అయి నేల మీదపడి ఉన్నదేల? ఇదంతా కపటమని నాకు తోస్తోంది. నువ్వుగ్రహించలేక నా కొంపముంచావుగదే!" అంటూ గుండెలు బాదుకోసాగింది.

తన తల్లిని వారిస్తూ "అయ్యో! అలా అనకే ఆయనకు కోపం రాగలదు. ఈ స్వామికి మన మొక్కరమేనా? ఎందరు దాసురాండ్రున్నారో? ఎవరో జ్ఞాపకం వచ్చి ఉంటారు. వారికోసం ఆయన చింతిస్తున్నారు" అంటూ "స్వామీ! పొద్దు పోయింది. ఇకనైనా లేవండి! వైకుంఠానికి పోదాం!" అంది విద్యావతి.

"ఇంకెక్కడి వైకుంఠం? నా మనోరమ ఎక్కడికిపోయింది? నువ్వెవర్తివి? కటకటా! కీలుజింకే లేకపోతే ఇంత మోసం రాకపోవునుగదా!" అని సన్నగా పలవరించసాగాడు.

విద్యావతి అతన్ని ఇంకా బ్రతిమాలబోతూంటే- రత్నావతి "ఓసి నిర్భాగ్యురాలా! నీకు ఇంకా బోధపడలేదా? ఎక్కడ శ్రీహరి? ఇంకేం వేడుకుంటావు? నాకు తెలిసింది ఇది కీలు జింక. దీనికిలా రంగులువేసి వీడెవడో మన కొంపముంచాడు. నీ మాటనమ్మి నేను గంగలో దిగాను అయ్యో! కట్టుకోవడానికి గుడ్డయినా లేదే! ఏంచేద్దును" అంటూ ఆ జింకను పట్టుకొని విప్పి చూసింది. దానికున్న మరలు పరిశీలించి అవన్నీ కూతురికి

చూపిస్తూ అప్పటికప్పుడే కత్తితో ఆ జింకను కోసి మూలపారేసి "ఇక నీ అనుమానం తీరిందా?" అంటూ గుండెలు బాదుకుని ఏడవసాగంది "ఏం జరిగిందంటూ" అక్కడంతా గుమిగూడారు.

రత్నావతి "అయ్యయ్యో! ఏం చెప్పుకుంటాం? నా కూతురే నన్ను ఏట్లో దింపింది. మహామునులకు సైతం ప్రత్యక్షం కాని భగవంతుడు దీనికీ నాకూ ప్రత్యక్షమవుతాడా? అని ఇంచుకైనా శంకించలేకపోయాను. నా ఐశ్వర్యమంతా ఒక్కరోజులో ఊడ్చుకుపోయింది. తినడానికి తిండిలేదు కట్టుకోడానికి గుడ్డలయినా ఉంచలేదు. నివశించడానికి కొంపైనా లేదు మరికొంత సేపు ఇక్కడు ఉంటే ఈ యిల్లు దానంగా పొందిన బ్రాహ్మణుడొచ్చి మమ్మల్ని వెళ్లగొడతాడు. ఇదంతా ఈ విద్యావతే తెచ్చిపెట్టిన అనర్థం" అంటూ మళ్లీ గొల్లున ఏడ్వసాగింది.

ఆ ఏడుపుకి కందర్పుడికి తెలివొచ్చింది. "మీరెవరు? నా మనోరమ ఎక్కడుంది? ఈ ఇల్లెవరిది?" అని అడిగాడు.

విద్యావతి తెల్లబోయింది. "అలా అంటావేం? అసలు నువ్వెరవు? ఆ మనోరమ ఎవతె? నిజం చెప్పు!" అని అడిగింది. తాను కందర్పుడనే రాజకుమారుడనని మరజింక నెక్కి దేశాటనం చేస్తూ దారిలో ఒక పట్టణంలో మనోరమ అనే రాజపుత్రికని తీసుకొని పయనమై ఊరిబయట తోటలో ఉంచినట్లు చెప్పి, ఫలాలు తీసుకెళ్లాలంటూ పలవరించాడు.

అప్పుడు విద్యావతి "అమ్మా! నేటితో పని తీరిపోయిందే" అంటూ తల్లిని పట్టుకొని ఏడవసాగింది. ఇంతలో లోపల్నుంచి పురోహితుడు వచ్చి "అయ్యో! ఇదేమి!? అమంగళంగా ఈ ఏడుపులేమిటి? గృహప్రవేశం పుణ్యాహ వాచనం చేసుకోవాలి. శూద్రులిక్కడ ఉండకూడదు. ఈ మేడ వదలి ఎక్కడికయినా పొండి" అన్నాడు.

ఆ మాటలు విన్న రత్నావతి "నేను వైకుంఠానికి పోతానుకుని మీకీ ఇల్లిచ్చాను. ఆ ప్రయాణం కాస్తా చెడిపోయింది. కాబట్టి మేమీ ఇంట్లోంచి పోవడానికి వీల్లేదు. మీరు మీ ఇంటికి పొండి. తనకు మాలిన ధర్మం ఉంటుందా?" అని పలగ్గా అలుకపూని ఆ బ్రాహ్మణుడు "ఓహో! నీ దానం మా గొప్పగా ఉందిలే! నిన్ను ఇవ్వమని ఎవరేడ్చారు? నీ వల్ల

గృహదానం పట్టానంటూ నన్ను కులంలోంచి వెలివేస్తే అందుకు ప్రాయశ్చిత్తంగా గురువుగారికి కొంత సొమ్ము రహస్యంగా ఇచ్చుకున్నాను. ఇప్పుడు నువ్వు దానం ఇచ్చిన వస్తువులన్నీ తిరిగి తెచ్చుకుని అప్పుడు నాకు చెప్పు! ఇదీ నేనొదిలేస్తాను" అన్నాడు.

ఈలోగా కందర్పుడికి పూర్తిగా తెలివొచ్చింది. వీళ్లని భంగపరచబోయి తనే భంగపడడం తప్పు అనుకొని, మెల్లగా లేచేసరికి ఒక మూల చిరిగిపడి ఉన్న జింక కనిపించింది. "దీన్నెవరిలా చేశారు" అని కోపంగా అడిగాడు. అప్పుడు రత్నావతి "నేనురా! నేను! ద్రోహుడా! దీని మూలంగా మా కొంప ముంచి ఇంకా సిగ్గులేక మాట్లాడతావేం? మరజింక నొకదాన్నెక్కి మాకు పంగనామాలు పెడతావా! నిన్నిప్పుడేం చేయిస్తానో చూడు!" అంటూ బెదిరించింది.

"ఓసి రండా! కారుకూతలు కూశావంటే రాజుతో చెప్పి నీ సిగ్గోయించగలను" అంటూ అక్కడున్న వారందరికీ తనమీద అనుమానం తగలనివిధంగా దీనికంతటికీ ఆ తల్లీ కూతుళ్ల స్వయంకృతాపరాధమే ఇంత చేసిందని చెప్పాడు. ఇచ్చినదానం తిరిగిపుచ్చుకొనే కంటే తామే ఎక్కడికైనాపోయి జీవించడం మంచిదని వారిద్దరూ అనుకున్నారు. కాని రత్నావతి ఆ పురాన్నేలే నాగదత్తునికి ఫిర్యాదు చేసింది.

కందర్పుడు పురోహితుని వెంటనిడుకొని దానికంటే ముందే రాజసభకు బయలుదేరాడు. రత్నావతి వాళ్లని వదలకుండా అనుసరించసాగింది. ఆమె ఫిర్యాదు విన్న నాగదత్తుడు విచారణ ప్రారంభించాడు.

"ఇతడు మమ్మల్ని మోసం చేశాడు. కనుక మా నష్టాన్ని అతడే భర్తీ-చేయాలి" అంటూ తామెలా వంచింపబడిందీ చెప్పింది.

కందర్పుడినీ ప్రశ్నించాడు రాజు. విచారణ కొచ్చిన ఫిర్యాదు చిత్రమైనది కావడంతో చాలా మంది పౌరులు రాజసభకు వచ్చారు.

కందర్పుడు "ఆమె మాటలలో కొంత అసత్యం ఉంది. నేను కందర్పజనకుడినని విద్యావతికి చెప్పాను. ఆమె పండితురాలు కనుక విష్ణువనుకున్నదేమో! కందర్ప జనకుడనడంలో నా ఉద్దేశం -మన్మధభావాలు

కలిగించేవాడని, ఆమె మరో అర్థం తీసుకున్నది. పురాణంలో అలా చెప్పబడివుంది కనుక రత్నావతి తనకున్నదంతా సర్వస్వం త్యాగం చేస్తేనే తప్ప ఆమెకు వైకుంఠం ప్రాప్తించదన్నాను. నాది తప్పయితే బ్రాహ్మణుల ఆశీర్వచనాలూ తప్పుకావాలి. ఆశీర్వచనాల ప్రకారం 'వైకుంఠ ప్రాప్తిరస్తు' అనగా వైకుంఠం ప్రాప్తించాలి కదా! ఇక– నేను ఆమె నుంచి ఒక్కకాసైనా గ్రహించానేమో విచారించండి! ఈ మాత్రానికే రత్నావతి నన్ను నానా మాటలూ ఆడిదేశాటన నిమిత్తం ఎరువుతెచ్చుకున్న నా విలువైన తోలు జింకని చించేసింది. ఆమె నా జింకను చింపేసిందనడానికి ఆమె ఇల్లు దానంగా పుచ్చుకున్న ఈ పురోహితుడే సాక్షి" అని వాదం ముగించాడు.

నాగదత్తుడు మనస్సులోనే ఏదో ధ్యానించుకున్నాడు. అతని కళ్లనుంచి ఆనంద భాష్పాలు జాలువారుతూండగా తుడుచుకొని "రేపటికి తీర్పు వాయిదా వేయడమైంది. ఇప్పుడంతా వెళ్లి రేపురండి!" అని కందర్పుడిని మాత్రం చెయ్యి పుచ్చుకుని ఆపి తన అంతఃపురానికి తీసుకెళ్లాడు.

అతనితోపాటు నడుస్తూన్న కందర్పుడు "ఆహా! ఈ రాజకుమారుడెవ్వడోగాని, నన్నింత గౌరవాదరాలతో తీసుకెళ్తున్నాడే!" అని మనసుతో అనుకున్నాడు. అతడిలో మనోరమ పోలికలు కనబడ్డాయి కందర్పునికి. రకరకాలుగా ఆలోచిస్తూ అతడితోపాటు మందిరంలోకి వెళ్లాడు.

నాగదత్తుడతనిని ఏకాంతప్రదేశానికి తీసుకెళ్లి, ఒక బంగారు ఆసనంపై కూర్చోబెట్టి "అయ్యా! తమదేదేశం? అసలు పేరేమిటి? ఆ రత్నావతిని అలా వంచించడానికి కారణమేమిటి? మీకు సంతానం ఉందా? నిజం చెప్పండి! నన్ను మీ పుత్రుడిగా భావించండి! మనోరమని తల్చుకొని విచారించారు దేనికి? ఆమె ఎవరు? మీ వృత్తాంతం విన వేడుక అవుతోంది" అంటూ మృదుమధురంగా అడిగాడు.

అతడి మాటలు విన్న కందర్పునికి ఆనందం కలిగింది. జరిగినదంతా పొల్లుపోనివ్వక దాచకుండా చెప్పాడు. అప్పుడు నాగదత్తుడొక ఉత్తరం రాసి, పరిచారిక చేతికిచ్చి లోపలకు పంపాడు.

లోపల్నుంచి ఒక స్త్రీ తడబడుతూ వచ్చింది. "నా భర్త ఎక్కడ?" అంటూనే కందర్పుడిని చూసి, అతని పాదాల మీద పడింది. కందర్పుడు

తెల్లబోయి "ఇదేంచోద్యం? ఈమె ఎవరు? నన్ను భర్తగా తలుస్తున్నదేం? సుభద్రకాదుకద! అయినా ఆమె ఇక్కడికేల వస్తుంది? ఒకవేళ మనోరమేమో! నాకు అంత భాగ్యమా? అయ్యో! నాపాదాలమీద పడిన ఈ స్త్రీ ముఖాన్ని తలవెంట్రుకలు కప్పేసి ఉన్నాయి. గుర్తుపట్టలేకపోతున్నాను" అనుకుంటూ "ఆర్యా! ఈ కాంత ఎవరో తెలియడంలేదు. గుర్తులు చెప్పు! నీకేమె ఏమవుతుంది?" అని అడిగాడు.

"అయ్యో! తండ్రీ! ఇంకా తెలియలేదా? ఈమె నీవల్ల ఆనాడిక్కడ విడువబడిన మనోరమే నేను మీ పుత్రుడనే! దైవకృపవల్ల ఆపదలన్నీ గడిచాయి" అన్నాడు నాగదత్తుడు.

"ఏమేమీ? ఇది కలకాదుకద! నిజమే అగుగాక! ముఖం ఎత్తి చూపించు ప్రేయసీ!" అంటూ ఆమెను కౌగలించుకుని "నేడెంతసుదినం? అయ్యారే! కాలమహిమ. వత్సా! ఇటురా!" అని కొడుకుని చేరపిలిచి "విధిరాత ఎన్నిరీతులో కదా! నీకీ రాజ్యం ఎలా వచ్చింది? అంటూ కొడుకునీ "మనోరమా! నేను తిరిగిరాకపోవడంతో నన్ను కృతఘ్నుడిగా భావించావా! దైవయోగం వల్ల నాకు అప్పుడలాటి బుద్ధి పుట్టింది. నిన్నలా వదిలి వెళ్లాక జరిగినదంతా చెప్పు! నాకు ఆతృతగా ఉంది" అని భార్యనూ అడిగాడు కందర్పుడు. ఆమె కన్నీళ్లు తుడుచుకొని ఇలా అంది ....

నాగదత్తుని కథ

"ప్రాణేశ్వరా! వినండి– మీరు పళ్లు తెస్తానంటూ పట్నంలో కెళ్లి ఎంతకూ తిరిగిరాక పోవడంతో నేనా చెట్టు కింద కూర్చొని పరిపరి విధాల ఆలోచిస్తూ ఎవరైనా అటు వచ్చే అలికిడి అయితే చెట్టుచాటుకు పోయి దాక్కుంటూ సాయంకాలం వరకూ ఎదురు చూశాను. అప్పటికి నిరాశ చేసుకుని మనస్సు భయంతో ఝల్లు మంటూంటే ఇలా అనుకున్నాను.

'నా భర్త ఎక్కడో ఏదో ఆపదలో చిక్కుకొని ఉండవచ్చు! లేకపోతే ఇంతసేపు నన్నిక్కడ ఒంటరిగా వదలి ఉండగలడా? ఇకరాడు. ఏం చేయాలినేను? అసలిది కలా? నిజమేనా? నేను నా అంతఃపురాన్ని దాటి

ఇక్కడి కెలా వచ్చాను? నాకెలాటి దురవస్థ సంభవించింది? ఎక్కడికి వెళ్లాలి? ఎవరితో చెప్పుకోవాలి? నన్ను రక్షించేవారెవరు?... అనుకుంటూ మీరు వెళ్లిన దారిలో ఎవరొస్తున్నా మీరేకాబోలునని, కాకపోయేసరికి నిట్టూర్చి చాలా సేపు దుఃఖించాను.

సాయంకాలమైంది. మొండిధైర్యం తెచ్చుకున్నాను. పట్టణంలోకి పోవాలని నిశ్చయించుకున్నాను. వొంటి మీది నగలన్నీ మూటకట్టాను. మీరు వెళ్లిన దారినే పది అడుగులు నడిచేసరికి ఒక ముసలిది వేశ్యమాత కనిపించింది. ఆమె రోదిస్తోంది. ఆమె దగ్గర కెళ్లి "అవ్వా! ఎవరు నువ్వు?ఎందుకేడుస్తున్నావు? చీకటి పడుతోంది. పట్టణంలోనికి రావా?" అని అడిగాను. అవ్వ నన్ను కన్నెత్తిచూసి" అయ్యో తల్లీ! నన్నోదార్చడానికి నువ్వు మళ్లీ ఇట్లావచ్చావా?" అని ఆక్రందనలు చేస్తూ నామీద పడి నన్ను కౌగలించుకుంది. నేను భయపడి" అమ్మా! నేనెవరనుకుంటున్నావో? నేను నీదాన్ని కాదు ఎవరికోసం ఏడుస్తున్నావు? నీ వృత్తాంతమేమిటో చెప్పు" అని అడిగాను.

అప్పుడామె "నేనొక బోగందాన్ని నా పేరు రుక్మవతి. నాకు కామమంజరి అనే కూతురుండేది. అది అచ్చంగా నీ పోలికే! దురదృష్టవశాత్తు కొంతకాలం క్రితం చనిపోయింది. ఇది దాని శ్మశానం. ఈ రోజు అది గుర్తుకొచ్చేసరికి ఇక్కడ కొచ్చి ఏడుస్తున్నాను. అది సరే! నిన్ను చూస్తూంటే నా కూతుర్ని చూసినట్లే ఉంది. నీది ఏ ఊరు? మా ఇంటికొకసారి వస్తావా? నీవు ఒంటరిగా ఇక్కడికి ఎందుకొచ్చావ్? నీ వృత్తాంతం ఏమిటో చెప్పు" అంది.

"అవ్వా! నేనొక రాకుమార్తెను. కొన్ని కారణాలవల్ల ఈ ఊరు చేరుకున్నాను. నా భర్త దేశాంతరం వెళ్లాడు. ఈ ఊరు చేరుకున్నాడని తెలిసి చూద్దామని వచ్చాను. నేను ఆరుమాసాల గర్భవతిని. బంధువులు దూర దేశంలో ఉన్నారు. నన్ను నీచపు పన్లకు వినియోగించనంటే నీ వెంట రాగలను" అన్నానునేను.

అవ్వ అలాగే నంటూ తన ఇంటికి తీసుకెళ్లింది. అంతకంటే గత్యంతరం లేక నేను ఆమె వెంట వెళ్లాను. ఆమె ఇల్లు చాలా వైభవంగా ఉంది. ప్రాణాలు నిలుపుకోవడం కోసమే ఆహారం గ్రహిస్తూ మిమ్మల్ని స్మరించుకుంటూ అతికష్టంమీద కాలం గడుపుతూ అప్పుడప్పుడు ఏదో ఒక సాకుతో ఊరిబైటకెళ్లి మీ జాడ కోసం చూస్తూండేదాన్ని. ప్రయోజనంలేకపోయేది. రుక్మావతి చెల్లెలు రత్నావతి అనే వేశ్య అక్కడికొచ్చి అక్కతో ఏదో గుసగుసలాడేది. వారి వ్యాపార విషయాలు కాబోలు అనుకునేదాన్ని!

నాకు నవమాసాలు నిండి ప్రసవవేదన ప్రారంభమైంది. అప్పుడు అవ్వ "అమ్మాయి! ప్రసవ సమయంలో కళ్లకి గంతలు కట్టుకోవడం ఈ దేశాచారం" అంటూ నా కళ్లకి గంతలు కట్టింది.

గంతలు విప్పేసరికి నేను రాతిగుండును కన్నానని చెప్పారు నా పక్కలో ఒక రాతి గుండుంది. గ్రహస్థితి అలా ఉంది కాబోలు అనుకుని దుఃఖం దిగమింగాను. రుక్మావతి -రత్నావతి నన్ను ఓదార్చారు. జీవితేచ్ఛ నాకు అప్పటికీ నశించలేదు.

కొన్ని నెలలయ్యాక నన్ను మంచివస్త్రాలు కట్టుకోమనీ అలంకారాలు చేసుకోమనీ వాళ్లు బోధించసాగారు. దీనంగా -శోకభారంతో నేనుండడం ఇష్టంలేకనే వాళ్లు అలా నా మీద ప్రేమ కొద్దీ బోధిస్తున్నారనుకొని, వారి మాట ప్రకారమే చెయ్యసాగాను. ఒకరోజున రత్నావతి నా దగ్గర కొచ్చింది. "ఎందుకలా ఎప్పుడూ విచారంగా ఉంటావ్? చక్కని అందం ఉంది, మంచి వయసులో ఉన్నావు. నీ యవ్వనాన్ని వృధా చేసుకుంటావేం? నిన్ను చూస్తూంటే నాకు బాధగా ఉంటోంది. వయస్సులో సుఖపడని జన్మదేనికి? మాలో కలసిపోయావు గనుక మా లాగానే ఉండాలి. నువ్వు ఊ అంటేచాలు! గొప్పగొప్ప శ్రీమంతులైన విటుల్ని కోకొల్లలుగా రప్పిస్తాను. మాకు వశీకరణోపాయాలు చాలా తెలుసు! అవి నీకు బోధిస్తాను. సుఖపడు" అంటూ చాలా బోధ చేసింది. కాని ఆవేమీ నా మీద పనిచేయలేదు. నేను అసలు వాటి గురించే ఆలోచించలేదు.

నాగదత్తుని కథ

ఒకరోజు నాగదత్తుడు పట్టాభిషిక్తుడై ఏనుగుపై ఊరేగుతూంటే, ఆ జనంలో మీరు కనిపిస్తారేమోనని ఆశగా మేడ ఎక్కి తొంగిచూశాను. అతడూ నన్నుచూశాడు. వేశ్యావాటికలో ఉన్నందున నన్ను చూసి వేశ్య అనుకున్నాడేమో! ఆ రాత్రి రుక్మకు కబురంపించాడు.

ఆ సంగతి ఆమె నాతో చెప్పి "ఇది రాజశాసనం ధిక్కరిస్తే కష్టాలపాలవుతాం" అంటూ బెదరగొట్టింది. "ఇంతకాలం నన్ను పెంచి పోషించింది కదా! నామీద వెచ్చించిన సొమ్ము రాబట్టుకోవాలనుకుంటోంది కాబోలు ఇంక ఇక్కడ ఉండకూడదు. ఆ రాకుమారుడే వస్తే అతని పాదాలమీద పడి నావృత్తాంతం చెప్పి నన్ను రక్షించమంటాను. ప్రజల్ని న్యాయంగా పరిపాలించే రాజుకు నాయందు దయరాకపోతుందా?" అనుకొని మాటాడక ఊరుకున్నాను. నా మౌనాన్ని అది అర్థాంగీకారంగా భావించింది కాబోలు! అదే రోజు రాత్రి రమ్మని నాగదత్తునికి కబురుచేసింది.

అతడు ఒక్కడే రహస్యంగా బయలుదేరాడు. దారిలో నడుస్తూ చూడకనే ఒక ఆవుదూడని తొక్కాడు. ఆ దూడ తల్లితో చెప్పుకుని బాధపడగా మాతృ సంగమం చేయనెంచిన అథముడికి నిన్ను తొక్కడం ఓ విశేషమా? అతడు కిందుమీదులు చూస్తున్నాడనుకున్నావా' అంటూ ఓదార్చింది.

వాటి భాష తెలిసివున్న నాగదత్తుడు ఆశ్చర్యపోయి నేనొచ్చింది వార కాంత ఇంటికి కదా! వారితో మాకు ఏ రీతి మాతృ పుత్ర సంబంధం? ఒక వేళ నేను వలచిన దానిని మా తండ్రి ఉంచుకున్నాడా? వారిద్దరి ప్రమేయం వల్ల నాకీ వావీవరసా వర్తిస్తున్నాయా? అలాగైనా- వేశ్యలకు వర్తించడమెన్నడైనా ఉన్నదా?" అని వితర్కించుకుంటూ, అతడామెను చేరుకోదలచాడు

నేను మాసిన చీరలో అలంకారాలు లేకుండా, ఒక మూలను కూర్చొని కన్నీరు కారుస్తూంటే. అతడు నావైఖరి గమనించి ఆశ్చర్యపోయి "వేశ్యలు సాధారణంగా విటుల్ని చూసి నవ్వుతారు. నువ్వు అందుకు భిన్నంగా ఏడుస్తున్నావు. పైగా నిన్నుచూస్తే వేశ్యవలె తోచడంలేదు. యదార్థమేమిటో నిర్భయంగా చెప్పు" అన్నాడు.

అప్పుడు నాకు అతడి మీద పుత్రవాత్సల్యం జనించి, హృదయం పులకరించింది. జరిగిందంతా నేనా కుర్రవాడికి చెప్పాను. అప్పుడ తడు- అయితే దారిలో ఆవుదూడలు ఆ విధంగా మాట్లాడుకోవడంలోని అంతర్థానం ఇదన్నమాట!' అని ఆ వైనం నాకు వివరించాడు. అంతేకాక, "నేను విస్సందేహంగా నీ పుత్రుడినే! ఈ రుక్మావతే నిన్ను మోసం చేసి నేను పుట్టగానే నన్ను వూరి బైట నూతిలో పారేసి, నీకు రాతిగుండు పుట్టిందని చెప్పిఉండాలి. ధర్మకేతుడనే ఈ పట్నపురాజు ఒక నాడు విహారం నిమిత్తం బయల్దేరి- దాహం వేసి ఒకనూతి దగ్గరకు వెళ్లాడు. నూతిలోంచి శిశువు ఏడుపు వినపడింది. తొంగిచూసి ఆశ్చర్యపోయాడు. పైన ఎండపడకుండా ఆ బాలుడిపైన ఒక సర్పం పడగనే గొడుగులా చేసి సంరక్షిస్తోందిట"

తరువాత కథను నాగదత్తుడు అందుకొని ఇలా చెప్పసాగాడు

"సంతానం లేని ఆ రాజు నన్ను బయటకు తీయించి, నా రూపానికి రాచఠీవికి అబ్బురపడి- సర్పరూపుడై భగవంతుడే తనకు పుత్రుడ్ని ప్రసాదించాడని భావించి నాగదత్తుడని పేరు పెట్టి నన్ను పెంచుకోసాగాడు.

ఇటీవలనే నాకు పట్టాభిషేకం జరిపి, ఆయన తపోవనాలకు వెళ్లిపోయాడు. ఒకసారి నాకు నా వృత్తాంతం వివరించి చెప్పడంతో నాకు గతం ఏమిటో తెలిసింది. కాలక్రమం చూసినా మా తల్లి చెప్పినదీ, రాజు చెప్పినదీ ఒక్కటే అయింది. నిజం కావాలంటే మా తండ్రిగారి చేతనే చెప్పిస్తాను" అన్నాడు నాగదత్తుడు.

"ఆనాటి నుంచీ నేను రాజమాతనై ఇక్కడ మీకోసం ఎదురు చూస్తున్నాను" అన్నది మనోరమ కందర్పుడు ఆశ్చర్యపోయాడు. ఎంత చిత్రం? నాగదత్తుడు తన కుమారుడే! మనోరమకు జన్మించినవాడు. ఆహా! కాలమెంత వేగంగా పరుగులు తీసింది? అసలు నడిచినట్టే లేదు. ఇంతలోనే ఇన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఏడాదిలోగానో ఆర్నెల్లలోపునో ఇంటికి వెళ్లిపోవాలని దేశాటనం మొదపెట్టినవాడిని. అక్కడ మాతల్లిదండ్రులెంత విచారిస్తున్నారో?! అదీ గాక సుభద్ర సంగతి నీకు చెప్పాను కదా! ఆమె నాకోసం ఎంత కుంగిపోతోందో?" అంటూ నిట్టూర్చాడు కందర్పుడు.

ఈలోగా ఇంకొక స్త్రీ అక్కడకొచ్చింది. కందర్పుడు ఆమె ఎవరా అని ఆశ్చర్యపోతూండగా "మీ ప్రథమ ప్రేయసి సుభద్ర ఈమే" నని చెప్పింది మనోరమ.

అతని ఆశ్చర్యానందాలకు హద్దులేకపోయింది. "ఈమె ఇక్కడికెలా వచ్చింది?" అంటూ ఇద్దర్నీ చెరో చేత కౌగలించుకున్నాడు. "సుభద్రా! నువ్వు ఇక్కడికొచ్చి ఎంతకాలమైంది? ఈ బంధుత్వం ఎలా తెలిసింది? ఇక్కడికెలా రా గలిగావు" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు.

సుభద్ర "మీరా మరజింకని తీసుకెళ్లిన కొన్ని రోజులకి మా తాత మణివర్మ ఆ గదిలోకి వచ్చి జింకని తీసి చూసి గుండెలు బాదుకుంటూ నన్ను పిలిచాడు. తన పూజా గృహంలోకి నాకు తప్ప ఇంకెవ్వరికీ ప్రవేశం లేనందువల్ల నన్నే పిలిచి దాని గురించి అడిగాడు. నాకు తెలీదన్నాను.

"నిజం చెప్పు! నాకు దాంతో చాలా గొప్ప పనులు జరగవలసి ఉన్నాయి. ఎన్నాళ్లనుంచో ప్రాణప్రదంగా దాచుకూంటున్నాను. నువ్వేదాన్ని తీసి ఉంటావని పిస్తుంది" అంటూ నాచేత అసలు విషయం చెప్పించడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నించాడు. అయినప్పటికీ నేను రహస్యం వెల్లడించలేదు. దాంతో అతడు చాలా కోపగించి నన్ను చేరబిలిచి ఏదో మూలిక నా తల వెంట్రుకల్లో ఉంచి "సుభద్రా! నువ్వీ జింక సంగతి తెలిసీ చెప్పకపోయావో ఇప్పుడే చిలకవైపోతావ్ ఆలోచించుకో!" అని ఆఖరి అవకాశం ఇచ్చాడు. అయినా నేను నిజం చెప్పలేదు. ఆ మూలిక ప్రభావం ఏమిటోగాని ఆ క్షణంలోనే చిలకనైపోయాను. ఎగరసాగాను. అప్పుడు మా తాత విచారిస్తూ "సుభద్రా! రా! నీ చిలకరూపం తొలగించి మళ్లీ నీరూపం నీ కొచ్చేలా చేస్తాను" అని పిలిచాడు.

కాని నాకు అలాంటి కౄరుడి దగ్గర ఉండటం ఇష్టం లేక దూరంగా పారిపోయాను. అలా ఎగురుకుంటూ వెళ్లి ఒక చిలకల గుంపులో కలవబోయాను. మొదట్లో అవి నన్ను చేరనివ్వకపోయినా, కొద్ది రోజుల్లో అవి నన్ను తమలో కలవనిచ్చాయి.

పదిరోజుల దాకా నాకు మనుష్యజాతికి చెందిన జ్ఞానం ఉంది దాంతో నేను మీ దేశం వెళ్లి మీ అంతఃపురంలో చూశాను. మీ తల్లిదండ్రులు

నిద్రాహారాలు మాని మీమీద బెంగపడ్డారు. మీరు దేశాంతరాలు పట్టి తిరుగుతున్నారని విని, నేను కొన్ని చిలకల్ని తోడు తీసుకుని చాలా దేశాలు గాలించాను. అప్పటికి నాకు జాతిజ్ఞానం పోయింది. ఏమేంచేశానో, ఎక్కడెక్కడ తిరిగానో ఏమీ తెలియని స్థితిలో పడిపోయాను.

ఒకనాడొక అరణ్యంలో తిరుగుతూంటే పొదల రాపిడికి నా తలలోని మూలిక జారి పడిపోయింది కాబోలు! నాకు పూర్వపురూపం వచ్చేసింది. మళ్లీ సుభద్రగా మారిపోయాను. పూర్వ వృత్తాంతం అంతా జ్ఞాపకం వచ్చింది. నలుమూలలా చూశాను, ఎవ్వరూ కనిపించలేదు.

దైవమే నన్నీ అరణ్యంలో పారేసి శాపవిమోచనం కలిగించినాడు. చిలకగా ఉన్నా బాగుండేది. ఇప్పుడెక్కడికి పోగలను? ఒక వైపు అడవిజంతువుల అరుపులకి గుండెలదురుతున్నాయి... అనుకుంటూ ఆ అరణ్యంలోంచి బయటపడే దారి వెతుకుతూంటే ఓ అడవిపందిని తరుముతూ, విల్లమ్ములు ధరించిన వీరుడొకడు గుర్రమ్మీద ఆ దిశగా వస్తున్నాడు.

అంతటి మహారణ్య మధ్యాన మనిషి కనిపించినందుకు నేను మహదానందపడుతూ "రక్షించండి! రక్షించండి" అంటూ దీనంగా ప్రార్థించాను. అతడు నా దగ్గరగా గుర్రాన్ని ఆపి "ఈ అరణ్యంలో ఒంటరిగా ఎందుకున్నావు? తల్లిదండ్రులెవరు? భర్త ఎవరు?" అని ప్రశ్నించాడు నేను ఏమీ దాచకుండా నా వృత్తాంతం అంతా చెప్పుకున్నాను.

అంతావిన్న అతడు "తల్లీ! భీతి చెందకు! నేను కందర్పుని కొడుకునే! నాపేరు నాగదత్తుడు. నా తల్లి మనోరమ. నేనూ ఆయన కోసమే వెతుకుతున్నాను" అంటూ తన గురించి చెప్పి, నన్ను ఇక్కడికి తీసుకొచ్చాడు. ఆనాటి నుంచీ మనోరమ నన్ను సోదరిలాగే చూసుకుంటోంది. నేను మీకోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతూన్నాను" అని ఆశ్చర్యాద్భుత దాయకమైన తన కథ వినిపించింది.

ఆ రాత్రి వాళ్లంతా ఎంతో ఆనందంగా గడిపారు.

మర్నాడు నాగదత్తుడు, తండ్రి అనుమతితో రత్నావతిని సభకు పిలిపించి, అది చేసిన దుర్మార్గాలన్నీ ప్రజలనోట చెప్పించి "ఓసీ! నీకు

వైకుంఠం కావాలా? కందర్పుడికి గల దయాదృష్టివల్ల, అది ఆయనకి సాధ్యంకాకపోయింది. నేను పంపుతాను చూడు!" అంటూ తండ్రి చేసిన ప్రతిజ్ఞ చెల్లించడానికి సిద్ధపడ్డాడు.

ఆ ప్రకారమే, నున్నగా దాని తల గొరిగించి, వికృతంగా తయారు చేయించి, గాడిదమీద ఎక్కించి "రత్నావతి వైకుంఠానికి పోతోంది. చూడండహో"... అంటూ చాటింపు వేయించి వీధులన్నీ తిప్పండి- అని భటులను ఆజ్ఞాపించాడు.

విద్యావతి గుణవంతురాలే అని కందర్పుడు చెప్పగా -ఆమెకు కొంత ధనం ఇచ్చి సాగనంపాడు. ఇదీ గోపా! గాడిదపై ఊరేగిన స్త్రీ కథ, నీ ప్రశ్నకు సమాధానం దొరికిందా?" అని ప్రశ్నించాడు మణిసిద్ధుడు.

త్రికాలవేది అయిన మీరు కథ చెప్పాక ఇంకా సందేహమా అయితే, ఒక్క ప్రశ్నకు జవాబు ఇవ్వండి! కందర్పుడు భార్యా పుత్రులతో తన దేశం వెళ్లిపోయాడా? లేక అక్కడే ఉన్నాడా?" అని అడిగాడు గోపకుమారుడు.

గురువు "శౌనకుడిలాగ నువ్వేదీ వదలవు కదా! సరే... విను! కందర్పుడు తల్లిదండ్రున్ని తలచుకుని, ఆ మర్నాడే భార్యాపుత్రులతో మహావైభవంగా బయల్దేరి కుంభకోణం వెళ్లి- తనకోసం బెంగ పెట్టుకున్న తల్లిదండ్రులకు సంతోషం కలిగించాడు. కందర్పుడి రెండో భార్య అయిన సుభద్ర కూడ సకల సుఖాలు పొందింది. కందర్పుడు పట్టాభిషిక్తుడై, కొన్నాళ్ల తర్వాత కొడుకును తన రాజ్యానికి రప్పించుకుని బాధ్యతలు అప్పగించాడు" అని సందేహం తీర్చడంతో, అప్పటికి తృప్తి చెందాడు గోపాలుడు.

కాశీ మజిలీ కథలు

24 వ మజిలీ

కం. శ్రీమదగణ్య ప్రావీణా!ము
ని మానస నివాస! నానా భువన
స్తోమా వన నిరతగిరీ
శా! ముక్తిద! భక్త పరవశా! పరమేశా!

ఆ ప్రకారం త్రిభువనసిద్ధుడైన మణిసిద్ధుడు, కాశీయాత్రార్థం ఉల్లాసంగా, శౌనకుడనే గోపకుమారునితో కూడా వెళ్తూన్నాడు. వారిద్దరూ ఒక పట్టణంలో బస చేసి, నిత్యనైమిత్తిక క్రియలు నెరవేర్చుకున్నారు. భోజనాలు చేసిన తర్వాత శిష్యుడు పట్టణంలోని వింతలూ – విశేషాలు చూడ్డానికి వెళ్లాడు. వాడు ఎంతకూ రాడేమిటి చెప్మా అని మణి సిద్ధుడు ఎదురుచూస్తుండగా, వాడొక మూలనుంచి ఊడిపడి ఆతృతతో అయ్యవారికి నమస్కరించి

"చిత్రమిది చిత్రమిది సువిచిత్రమిదియ
చిత్రమిది చిత్రమిది కడు చిత్రమిదియ"

అంటూ పద్యం చదివాడు. మణిసిద్ధుడు నవ్వుతూ 'నీకు కవిత్వం వచ్చిందా ఏమిటి? పద్యం చెప్పేస్తున్నావు? వీధిలో కెళ్లావూ అంటే ఊరకేరావు కదా! ఇంతకూ నువ్వు చూసిన చిత్రం ఏమిటి?" అని అడిగాడు.

"మీ దయఉండాలేగాని, నేను కవిని కావడంలో ఆశ్చర్యమేముంది? ఈ వూరి వింతలు చూస్తూ నేనొక దేవాలయానికి వెళ్లాను. అక్కడో శిలాశాసనం ఉంది. అది చదవాలని కొందరు బుద్ధిమంతులు ప్రయత్నిస్తున్నారు. చివరికి పసరుపూసి చదవగా చివరి రెండు పాదాలూ

మాత్రం తెలిశాయి. ఎంత ప్రయత్నించినా మొదటి రెండు పాదాలూ ఎవరూ చదవలేకపోయారు. అందులో విచిత్రమేమిటో అని వాళ్లు సందేహపడసాగారు. అవే పాదాలు నేను వల్లించుకుంటూ వచ్చి మీ ముందు చదివాను అంతే! చివరి రెండు పాదాలను బట్టి చూస్తే, మొదటి రెండు పాదాలతో ఏదో విచిత్రం చెప్పబడే వుంటుంది కదా! మీరు త్రికాలజ్ఞులు కనుక, మొదటిరెండు పాదాలనూ మీరు చదివేయగలరు..." అన్నాడు గోపాలుడు. అతడి ఉత్సాహం చూసి, గోపాలుని నిరాశపరచడం ఇష్టంలేక, మణిని ఎదుట ఉంచుకొని ధ్యానించి పద్యం పూర్తిగా తెలుసుకున్నాడు. మణిసిద్ధుడు.

అదొక సీసపద్యం చివరి పాదాలకు పైన 6 పాదాలున్నాయి. అదొక స్త్రీకి కలిగిన చిత్రమైన అనుభవాలను వివరించే పద్యం. అది పూర్తిగా విన్న గోపాలుడు మూపులెగరేసి "అయ్యవారూ! ఈ పద్యం ఎవరు రచించారు? దాని మీద ఎవరు రాశారు? నేనీరోజు మంచి వేళకే లేచినట్లున్నాను. చమత్కారమైన విషయాన్ని చూడగలిగాను, ఆ వృత్తాంతం అంతా తెలియజేసి నన్ను కృతార్థుని చేయవలసింది" అని కోరాడు. సిద్ధుడా కథ ఇలా చెప్పసాగాడు.

తెనాలి రామలింగ కవి కథ

ఆంధ్ర దేశపు రాజులలో ఎంతో విఖ్యాతి గల్గిన కృష్ణదేవరాయల చరిత్ర సంక్షిప్తంగా నీకు ఇంతకుముందే చెప్పిఉన్నాను కదా! ఆ మహారాజు ఆస్థాన కవీశ్వరులు అల్లసాని పెద్దన్న, ముక్కతిమ్మన్న, అయ్యలరాజు రామభద్రుడు, భట్టుమూర్తి, మాదయగారి మల్లన, పింగళిసూరన్న, ధూర్జటి, తెనాలి రామలింగకవి, వీరిని అష్టదిగ్గజాలంటారు. అప్పటికాలంలో వీరితో సమానులైన పండితులుగాని, శాస్త్రాలు తెలిసినవారుగాని, కవీశ్వరులుగాని లేరట! వీరిలో తెనాలిరామలింగకవి యుక్తి, సమయస్ఫూర్తి, హాస్యం, కల్పనాచాతుర్యాలలో చాలా దిట్ట. పూర్వజన్మలో ఈ తెనాలిరామలింగకవి

చాలాకాలం పరమేశ్వరిని ఆరాధించాడు. ఆ దేవి ఎంతకూ ప్రత్యక్షం కాకపోవడంతో, అతడు విసిగిపోయి, అతడు హాస్యచాటుక విత్వంతో దేవిని ఎత్తిపొడిచేలా ప్రవర్తించడంతో దేవి అతడికి వికటకవిత్వమే ప్రాప్తించేలా శపించింది.

అయితే దేవిని స్తోత్రాలతో ప్రసన్నం చేసుకున్న రామలింగునిచూసి ఆ దేవి ప్రసన్నురాలై 'నువ్వు అలాటి వాడవైనప్పటికీ రాజ సభల్లో నీకు ఎంతో సమయస్ఫూర్తి చాతుర్యం అలవడి అందరి మెప్పును పొందగల్గుతావు. నీ చర్యలవల్ల ఎవరికీ ఎక్కువకాలం కోపం నిలవదు. నీ కవిత్వం కూడా చాలా ప్రఖ్యాతి పొందుతుంది. అయితే ఇదంతా ఉత్తర జన్మలో ప్రాప్తిస్తుంది" అని దీవించింది.

అంబ కరుణించిన ప్రకారం రామలింగడు కొంటె చేష్టలు చేసినప్పటికీ అందరికీ ఇష్టుడై ప్రశంసలు పొందుతూండేవాడు. అవన్నీ చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. కనుక నువ్విప్పుడు అడిగిన ప్రశ్నకు అనుగుణంగా ఉండే కథ మాత్రం చెప్తాను. అది కూడా ఆనందం కలిగించేదే! సావధానంగా విను!

కృష్ణదేవరాయలు ఒకరోజు ప్రొద్దున్నే అష్టదిగ్గజ కవులు, ఇతర పండితులు, గాయకులు, పౌరాణికులు మొ॥వారితో కూర్చుండి పాండిత్య సభ ప్రారంభించాడు. సర్వదా విద్వాంసులతో కాలక్షేపం చేసే వాని జన్మమే జన్మం. నా భాగ్యవశ్యా మీ వంటి మహాకవులతో మైత్రి ఏర్పడింది. నా జన్మకు ఇది చాలు! నాకు పండితులు వాద - వివాదాలు చేసుకుంటూండగా వినాలని ఉంది. విలాసం కోసమే కావచ్చు! మీలో ఒకరితో ఒకరికి వాదాలు లేవదీస్తే, మీకు మాత్సర్యం ఎక్కువై దీర్ఘ విరోధం పెట్టుకుంటారని నాకు భయం కాబట్టి ఇప్పుడు మీకు బాగా నచ్చిన పండితుడెవరైనా ఉంటే చెప్పండి! అతడ్ని పిలిపిద్దాం! వాదం లేవదీద్దాం! నాకు వేడుకగా వినడానికి ఇంపుగా ఉంటుంది" అన్నాడు. అందరూ అటువంటి పండితుడెవరా అని ఆలోచిస్తూంటే భట్టుమూర్తి లేచి, ప్రభువును భోజరాజుతో పోల్చి స్తుతించి "మహాప్రభూ! అటువంటి పండితుడు మా వినికిడిలో ఎవరూ లేరు. తమకు

విన వేడుకగా ఉండేలా మాలో మేమే పాండిత్య ప్రసంగం చేస్తాం! గెలిచిన వారికి మీరు పారితోషికం ఇవ్వవచ్చు! కాని ఈ గోష్ఠికి రామలింగని మాత్రం దూరంగా ఉంచమని మా విన్నపం. అతడుంటే ఏదో మాయోపాయం చేత ఎవర్నీ గెలవనివ్వడు" అన్నాడు.

ఇంతలో ద్వారపాలకుడు "దేవా! కాశీ దేశం నుంచి నిన్న రాత్రి ఒక వేశ్య ఏనుగులు – గుర్రాలు మందీ మార్బలంతో వచ్చి నగరంలోని ఒక కుటీరంలో బసచేసిందట. దేవర వారికీ పత్రికను పంపింది" అని ఒక పత్రిక వినయంగా అందజేశాడు.

అందులో 'తనపేరు మందార వల్లి అని– వేశ్యకులంలో పుట్టినా, తన కావృత్తి గిట్టదనీ –అరవైనాలుగు కళల్లోను జ్ఞానం సంపాదించి, ఎందరో పండితులను జయించిందాన్ననీ – రాయలవారి సభలో పండితులతో వాదించవచ్చానని – తాను ఓడిపోతే ఆ పండితునికి సేవకురాలి నౌతాననీ వారోడిపోతే తాను అడిగినంత ధనం ఇవ్వాలని. కవిత్వసన్యాసం చెయ్యాలనీ– అది తాను పెట్టుకున్న వ్రత నియమమనీ ఉన్నది.

అది విన్న పండితులందరూ తలొక మాట అన్నారు.

'ఏమేమీ! వెలయాలికి ఇంత గర్వమా?, అని ఒకరు 'రాయల ఆస్థాన కవీంద్రుల మహిమ తెలియక ఇలా వ్రాసి ఉంటుంది' అని ఇంకొకరు, 'దానిని పోలిన పండితుల్ని జయించి, ఆ గర్వంతో విర్రవీగుతోంది' అని మరికొందరు, 'ఇక దీనికి పరాభవం తప్పదు' అని అందరూ అనుకోసాగారు.

ఇంతలో వారి సందేహాలు నివృత్తి కావడానికేనన్నట్లుగా ఇంకొక పరిచారకుడు ఆమె పండితులను ఓడించగా పొందిన జయపత్రికలు గల పెద్ద పెట్టెను మోసుకొచ్చాడు. భట్టుమూర్తి లేచి "దేవా! దేవరవారి ఆస్థాన పండితుల మహిమ తెలీక, ఆమె ఇంతగా రాసింది. నేనొక్కడినే చాలు! ఆమెతో వాదించి, దాసురాలిని చేసి పంపగలను. అయితే నాది ఒక్క కోరిక. మన రామలింగని కవికి నేనేదైనా పంతం పడితే దాన్ని చెడగొట్టేదాకా తోచదు. అది అతడి సహజగుణం. ఆ మహానుభావునికి ఏదో ఒక పని కల్పించి దూరంగా పంపెయ్యండి. నేనా జవరాలిని ఎలాగైనా వాదంలో జయిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను" అన్నాడు.

దానికి ధూర్జటి కొంత అలుకపూని "కవిరాజా! ఎలాంటివారికైనా మందారవల్లితో వాదం అంత సామాన్యమైనదని నాకు తోచడంలేదు. రామలింగని మీద ఈర్ష్య ఉంటే ఇంకోలాగ తీర్చుకో! అతడ్ని దూరం చేసుకుంటే, మనకే ముప్పు! ఇది అతడికే సాధ్యం అని నా అభిప్రాయం" అని చెప్పి ఊరుకున్నాడు.

దానికి భట్టుమూర్తి కోపంగా "నీకు వేశ్యమీద అభిమానం ఉంటే ఉండవచ్చు! ఇది ఇలాటి సభలోనా? నిన్నెన్నోసార్లు అవమానించినా, నీకు అతడి మీద అభిమానం పోలేదా?" అంటూ ఆక్షేపించాడు.

ధూర్జటి ఏదో చెప్పబోగా, రాయలవారు వారిస్తూ "కవిపుంగవులారా! మీలో మీరే ఇలా వ్యర్థంగా వాదనలు చేసుకుంటూ కార్యానికి ఆటంకాలు కల్పించకండి! భట్టుమూర్తి విద్యల్లో దిట్ట, వట్టి మాటల వాడేమీకాదు. మీరు అతనికి తోడ్పడాలి. అతడి ధైర్యానికిది పరీక్ష అనుకోండి. రామలింగ కవికి ఏదో ఒక రాచకార్యం అప్పగించి దూరంగా పంపేస్తాను. దీని మూలంగా అతనికి గల గర్వం కొంత అణుగుతుంది. ఈ రహస్యం మీలో ఎవరూ వెల్లడించవద్దు! మొదట ఆ వేశ్యాంగన విద్యామర్మాలు రహస్యంగా తెలుసుకోండి" అని ఆ నాటికి సభ చాలించి, అంతఃపురానికి వెళ్ళిపోయారు.

ఆ రోజు రామలింగకవి ఏలనో సభకు రాలేదు. అయితే అతనికి సుభద్రుడనే మిత్రుడున్నాడు. రూపంలో- బుద్ధిలో- చాతుర్యలో రామలింగకవి అంతటివాడు. నాటి సభలో విశేషాలన్నీ అతడు రామలింగకవికి వివరించాడు.

ఇంతలో రాజభటుడొకడు వచ్చి, రాజకార్య నిర్వహణకు సంబంధించిన ఒక శాసనం తీసుకొచ్చాడు. "మంచిది. ఇప్పుడే వెళ్తున్నా"నని చెప్పి రామలింగడు ప్రత్యుత్తరం రాశాడు. కాని ఎక్కడికీ వెళ్లకుండా అక్కడే మారువేషంలో ఉండి సుభద్రునివల్ల సభలో జరిగే విశేషాలన్నీ తెలుసుకోసాగాడు.

మరునాడు ఒక రహస్యప్రదేశంలో కూడి పండితులంతా ఇలా సంభాషించుకుంటుండగా సుభద్రుడు ఆ విశేషాలు యథాతథంగా రామలింగకవికి చెప్పేశాడు.

"మనకు మందారవల్లి వల్ల తీర్చరానంత అవమానం జరిగేలాగ ఉంది పెద్దన్నగారూ! ఏం చెయ్యాలో అర్థం కాకుండా ఉంది. ఆమెను ఏ విద్యలో జయించాలన్నా కష్టమే" అని భట్టుమూర్తి తన అవస్థ పెద్దన్నగారితో చెప్పి నీరుగారిపోయాడు.

"ఏంజరిగింది భట్టుమూర్తీ! అంత అధైర్యపడతావేం? దానితో సంభాషణ ఏమన్నా సాగిందా?" అని అడిగాడు అల్లసాని పెద్దన్న

"ఏం చెప్పను? చెప్పుకోడానికే సిగ్గు సిగ్గు! మీరంతా నెమ్మదిగా –చల్లగా ఉన్నారు. మీతోపాటు రాయలవారు కూడ ఈ భారాన్ని నా మీద పెట్టారుకదా! నిన్న సాయంత్రం నేను మారువేషంలో వెళ్లాను. ఆమె పాండిత్యం– వైభవం రెండూ పరిశీలించాను. ఎంతమంది పరిచారికలు ఎన్నిగుర్రాలు..... ఎన్ని ఏనుగులు, రోజుకు ఎంత ఖర్చవుతుందో గాని, మహావైభవంగా ఉంది.

భట్టుమూర్తి ఇంకా ఇలా చెప్పసాగాడు........

"నా హృదయంలో జనించిన ఆశ్చర్యాన్ని బైటకు కనిపించనివ్వకుండా అక్కడున్న ద్వార రక్షకులతో నేను మీ ఏలిక సానిని చూడవచ్చాను. లోపలికి వెళ్ళవచ్చా?" అని అడిగాను. నేను స్త్రీ వేషంలో వెళ్ళడం వల్ల "విద్యావంతులు కాని యువతులతో ఆమె మాట్లాడదు" అన్నారు వాళ్ళు. నేను పండితురాలినని చెప్పి ద్వారం దాటాను. అట్లా ఏడు ద్వారాలు దాటాక గాని ఆమె ఉండే అంతర్భవనం చేరుకోలేకపోయాను. ప్రతి ద్వారం దగ్గర రక్షకులు నన్ను ఇదే ప్రశ్న అడగడం జరుగుతోంది. ఇక అంతర్భవనంలో వైభవం– ఇంద్ర సభతో సమానంగా వుంది.

ఆమె శిష్యురాళ్లకు పాఠాలు బోధిస్తోంది. అందం అత్యంత అద్భుతం! మనం గ్రంథాల్లో చదివి లేదా కల్పన చాతుర్యం చూసి అటువంటి సౌందర్యవతుల్ని వర్ణించడమే తప్ప నిజం చూసి ఉండము. కాని ఆమెని చూశాక మన గ్రంథాల్లో మాటలు వ్యర్థాలు కావనిపిస్తుంది. సహజ శరీరలావణ్యమెంత ఆశ్చర్యకరంగా ఉందో చెప్పలేను. ప్రతీ అవయవాన్నీ దీక్షగా చూసే లోగానే ఆమె తన చూపులు నా మీదకి ప్రసరించింది. ఆమె అలా చూసిందో– లేదో నేను వశం తప్పిన మాట వాస్తవం. ఎందుకంటే– నేను ఏ వేషంలో వున్నానో– ఎందుకు వచ్చానో మరిచిపోతానేమోనని

కూడా భయపడ్డాను. స్త్రీ వేషంలో వెళ్లడం వల్ల -అక్కడంతా స్త్రీలే ఉండడం వల్ల ఆమె తన పైట సరిగ్గా వేసుకోకపోయేసరికి, అక్కడ స్తనాలు స్ఫుటంగా కన్పించసాగాయి. వేషం మరచి పురుష సహజ వికారం ప్రదర్శించినా- గుట్టు రట్టు అవుతుంది కదా! అదో భయం. వెంటనే ముఖం బలవంతంగా అటువైపు నుంచి మరల్చాను.

దాని సోయగాల సంగతి అలా వుంచండి! చుట్టూ వున్న స్త్రీలు మాత్రం తక్కువ వారా? మనోహర రూపలావణ్యాలలో ఆమెను పోలిన వారే! చుట్టూ కూర్చొని శాస్త్ర పాఠాలు చదువుతుంటే, అందరికీ అన్ని రూపాల్లో ఆమె సమాధానం చెబుతోందా? అనిపించసాగింది. దాన్ని బట్టి ఆమె, మనకు పత్రిక ద్వారా పంపిన సమాచారం అంతా నిజమే అని బోధపడింది. నేనెందుకు వచ్చిందీ కనుక్కోమని ఆమె దాసితో చెప్పింది. దాసి వచ్చి నన్ను అడిగింది. నేనేదోలా ధైర్యం తెచ్చుకుని "మందారవల్లి మీద పుష్పమాలికా బంధం కట్టి తెచ్చాను. కానుకగా ఇద్దామని" అన్నాను. "అలాగా! బావుంటే మా ఉపాధ్యాయిని నీకు పారితోషకం ఇవ్వగలదు. చదువు!" అన్నది. నేనా పద్యం రాగయుక్తంగా చదవాలనుకున్నాను కాని, గొంతులో ఏదో అడ్డు పడినట్లుగా తోచి, చదవలేక దాన్ని అక్కడే వున్న ఒక విద్యార్థినికి అందించాను. ఆమె తన నెచ్చెలులు వినేలా చదివి, పెదవి విరిచి ఒక స్త్రీకి అందించింది. ఆమె రివ్వున లేచి అందులో తాను పట్టిన తప్పులు శాస్త్ర దృష్టాంతాలు చూపిస్తూ మరీ ఖండించింది. వాటిపై నా ప్రతిస్పందన కోసం కొంత చూసి నా నుంచి ఏమైనా సమాధానం వస్తుందేమో అని ఆగింది. నిజం చెప్పద్దూ! నాకు నోట మాట రానే లేదు. ఆ దోషాలు మనకే తెలియవు. ఇంతలో ఆమె ఖండించిన దానిని, ఇంకొక యువతి పూర్వ పక్షం చేసి ఖండించి సిద్ధాంతాలు చూపింది. ఆ విషయమై ఆ ఇద్దరికీ పెద్ద వివాదమే ఏర్పడగా, మందార వల్లికి చేరువగా వున్న చిన్నది ఒకతె "అయ్యో! సఖీ! నువ్వీ పుష్పహారాలు అల్లే పిల్ల పద్యంలో తప్పులు ఎంచుతున్నావు. ఈ పట్టణపు రాజుగారి ఆస్థాన కవుల గ్రంథాలలో తప్పుల సంగతి ఏం చెబుతావు? పూలమ్మే పిల్లకి ఇంతకంటే ఎక్కువ పాండిత్యమెలా వుంటుంది?" అని నిర్ధారించేసింది. ఇంతకూ మందారవల్లి పన్నెత్తి ఒకపలుకైనా పలుకకనే, నా కవిత్వంలో గుణదోష చర్చ అక్కడే తేలిపోయింది.

దాంతో నేను సిగ్గుపడి, ఇంకేం మాటలాడడానికీ నోరాడక తలవంచుకుని తిరిగి వస్తున్న సమయంలో –నాకొక ముత్యాలహారాన్ని ఇస్తూ ఒక పరిచారిక ఇలా అంది–" నీ కవిత్వంతో మాకు పని లేదు. మా మందారవల్లి దీనులను రక్షించడానికి కంకణం కట్టుకుంది. ఆమె ప్రసాదంగా ఈ ముత్యాలహారం తీసుకో!" అని అందించబోగా నేను తీసుకోకుండా వచ్చేశాను... అని చెప్పాడు భట్టుమూర్తి.

"గొప్పపనే చేశావు. నిన్న రాజసభలో పలికిన డాంబికం మాటలకు అర్థమేమిటి? నిజంగా ఏదో ఊడబొడిచేసే వాడిలా రామలింగ కవిని గ్రామాంతరం పంపేశావు. అతడేగాని ఉన్నట్లయితే, దీనికి తగ్గట్టు సరైన ప్రాయశ్చిత్తం చేయకపోయేవాడా?" అని ఎత్తి పొడిచాడు. రామభద్రుడు.

"మీ వాదనలకేంగాని, రేపటి సభలో చెయ్యవలసిన వాదాల గురించి, ఆలోచించండి" అని పెద్దన గుర్తు చేశాడు.

"చిత్తము! కవులందరికీ పెద్దన్న గారైనట్టి మీ ఆజ్ఞని ఉల్లంఘిస్తామా?" అన్నాడు దూర్జటి.

ఆ మర్నాడు సాయంకాలం రామలింగ కవికి ప్రాణమిత్రుడైన సుభద్రుడు వాళ్ళ చర్చాగోష్ఠిని రామకృష్ణ కవికి యథాతథంగా విన్పించాడు– రహస్యంగా కలుసుకుని. ఆ వైనం ఇలా ఉంది.....

మందారవల్లి కథ

"కవీంద్రా! ఈ రోజు రెండు గంటలకు చిత్రశాలలో సభ జరిగింది. రాయలవారు చాలా ఉత్సాహంతో గెలుపు మనదేనన్న ధీమాతో అసమాన ప్రతిభ కలిగిన మన కవి దిగ్గజాలని ఏనుగులపై ఊరేగిస్తూ సభకు తీసుకువెళ్లారు. సభ నిండుగా వుంది. పురప్రజలు కూడా క్రిక్కిరిసి వున్నారు.

శిష్యురాళ్ళ జయజయ ధ్వానాల మధ్య పల్లకీ ఎక్కి వచ్చిన మందారవల్లి రెండో సరస్వతీదేవి వచ్చిందా? అన్నట్లుగా వుంది. ఆమెను చూస్తూనే మన పండితుల గుండెలు విభ్రాంతి చెందాయి. ఆమె రాకతో సహజంగానే సభాసదుల దృష్టి అటువైపు మళ్లింది. ఆమె తన కోసం ఏర్పాటు చేయబడిన

తెర వెనుకకు వెళ్లింది. ఆమె అందరి దృష్టిలోను పడదు. తెరలో గంట మ్రోగడం- ఆమె శిష్యురాళ్ళు, తమ ఉపాధ్యాయిని మందారవల్లి విద్యా విజయ ప్రచారగీతాలు- పద్యాలు పాడి వెళ్లడం జరిగాయి.

తరువాత కొంతసేపటికి వారే వేరే అలంకారాలతో మళ్ళీ తెర ముందుకొచ్చారు. తాము మందారవల్లి శిష్యురాళ్లమనీ- తమకు అన్ని విద్యలలోను పాండిత్యం ఉందనీ- ప్రతివాదులు ఎవరో చెప్తే, వారిని ఓడించగలమనీ- ఒక వేళ తాము ఓడిపోతే అప్పుడు మందారవల్లి వారితో వాదిస్తుందనీ పలికి తమ తమ అభిమాన విద్యలేమిటేమిటో వారు వెల్లడించారు. వారు పేర్కొన్న విద్యలే వీళ్లకి తెలియరాలేదు. ఆ విధంగా సభ అంతా కొంత సేపు నిశ్శబ్దంగా ఉండిపోవడంతో ఆ శిష్యురాళ్ళు మహారాజా!

శ్లో॥ క్షీరో దధేచ్ఛ గాంభీర్యం జానాతి మధనాద్ధరిః॥
లేహనాయ తటం ప్రాప్తః కథం విద్యాద్బిడాలకః॥

అనగా- పాల సముద్రం లోతు మధించిన వాళ్లకి తెలుస్తుంది కాని, పాలు తాగే పిల్లికేం తెలుస్తుంది? విద్యా మర్మాలన్నీ సంపూర్ణంగా తెల్సిన మా ఉపాధ్యాయిని ముందు ఉదర పోషణార్థం చదువుకున్న ఈ పండిత పుత్రులు ఒక లెక్కా? అసలు వీరిలో మాతో వాదించ దలచిన వారెవరు? వారికే విద్య వచ్చు? మాలో మీకు ఇష్టం వచ్చిన శిష్యురాలితో ప్రసంగించవచ్చు! లేదా జయ పత్రిక ఇప్పించినా సరే! వృధాగా కాలం గడపడం ఎందుకు?" అని వేళాకోళంగా అనేసరికి, రాయలవారికి సిగ్గూ-కోపం- ఆత్మాభిమానం ఒక్కుమ్మడిగా కలిగి, తమ కవి దిగ్గజాల్ని పేరు పేరునా "మందారవల్లి శిష్యురాళ్ళు విసిరిన సవాల్ వినిపించిందా?" అన్నాడు.

"తమకు తెలిసిందే కదా! భట్టుమూర్తి ప్రసగించడానికి సిద్ధపడుతున్నారు?" అంటూ అతన్ని ముందుకు తోశారు. భట్టుమూర్తి ఏదో చదవబోయాడు గాని గొంతు పెగలలేదు. దేహమంతా చెమటలు కమ్మి శరీరం వణకసాగింది. వాళ్ళు భట్టుమూర్తిని చూసి నవ్వుతూ "మీరు ప్రతివాదులుగా వచ్చారా? ఏ

శాస్త్రంలో పరిశ్రమ చేశారు? రాయలవారి పండితులలో ప్రధానులు మీరేనా?" అంటూ అడిగారు. దాంతో మన భట్టుమూర్తి ఒక మాటకు బదులు ఇంకొక మాట సమాధానంగా చెప్పేసరికి సభలోని వారంతా గొల్లున నవ్వారు.

ఆ స్త్రీలు అక్కడితో ఆగక "మీరు సంగీతంలో నిధినంటూ మీ వసుచరిత్ర కావ్యంలో చెప్పుకున్నారు. అందువల్ల శాస్త్రాల మాటకేమిగాని, సంగీతం గురించే కొంత చర్చ చేద్దాం! మీరు వాదులుగా ఉందామనుకుంటున్నారా? ప్రతి వాదులుగా వుంటారా?" అని కూడా అడిగారు. అంతేకాక వసుచరిత్రలో శబ్దదోషాలు, అర్థదోషాలు, పద్య-వాక్యదోషాలు నిరూపిస్తూ శాస్త్రాలలోంచి ఉదాహరణలు కూడా ఇవ్వసాగారు. పాపం! భట్టుమూర్తి నిరుత్తరుడయ్యాడు. దాంతో ఆ శిష్యురాళ్ళు చురుకుగా "మహారాజా! మీరు నిరూపించిన పండితుడు ఓడిపోయాడు. మరొకర్ని పంపుతారా? లేక జయపత్రిక దయచేస్తారా? కాలం వృథా చేయకండి" అనడంతో రాయల వారికి ఏం చెప్పాలో తోచక ప్రధానమంత్రి వర్యుల ముఖం వైపు "ఈ అవమానం నుంచి గట్టెక్కించండి" అన్నట్లుగా చూశారు.

అప్పుడాయన లేచి "విద్యావతులారా! మా దివాణంలో చాలామంది పండితులున్నారు. అయితే కొందరు ఊరికెళ్ళారు. వాళ్ళొచ్చేటంతవరకు ఊరక ఉండడం దేనికని చిన్న సభ చేయించాం! ఈ మాత్రానికే గెలిచారని పొంగిపోవద్దు. ఉద్దండులైన పండితులు మిగిలి వున్నారు. వాళ్ళని కూడా ఓడిస్తేనే మీకు జయ పత్రిక. మున్ముందు సభలో మీ ప్రజ్ఞ చూపించండి. ఈ పూటకు మీరు మీ నివాసానికి వెళ్ళగలరు. తిరిగి ఎప్పుడు సభ చేసేదీ మీకు తెలియజేస్తాం!" అని ప్రకటించాడు. భట్టుమూర్తి ఏ దారిన వెళ్ళాడోగాని, ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోయాడు. పరిహాసాలాడుకుంటున్న శిష్యురాళ్ల కలకలధ్వనుల మధ్య మహారీవిగా మందారవల్లి పల్లకీ నెక్కి విడిదికి పోగా, రాయలవారు- ఇతర పండితులు చిన్నబోయిన ముఖాల్తో ఇంటిదారి పట్టారు. ఇదే సభలో నేడు జరిగిన విశేషం" అని సుభద్రుడు రామలింగ కవికి చెప్పాడు.

మందారవల్లి కథ

అదంతా విన్న రామలింగకవి, కొంతసేపు కళ్ళు మూసుకుని ధ్యానం చేసి "సుభద్రుడా! ఇప్పుడు మన దివాణానికి చాలా చెడ్డ పేరు వచ్చింది. మందారవల్లి అసామాన్యురాలు అని వీరు గుర్తించకపోవడంతోనే వచ్చింది అసలు చిక్కు. మాలో మేము ఎవర్ని ఎవరు ఓడించినా అదొక క్రీడగా తీసుకోవచ్చుగాని, ఇతరుల ముందు ఓటమి పాలుకావడం చిన్నతనమనిపించదూ? భట్టుమూర్తికి నేనంటే ఈర్ష్య కనుక నన్ను దూరం జరపాలని చూశాడు. సర్లే కానియ్! దీనికేదో ఒక కపటోపాయాన్ని పన్ని నాకు చేతనైనంత పరాభవం చేస్తాను. మన ప్రధానమంత్రి చాలా బుద్ధిమంతుడు. దివాణంలో ఏమేమి ఆలోచనలు సాగుతున్నాయో కనిపెట్టి నాకు చెప్పు! వెళ్ళిరా"! అని సుభద్రుని పంపించేశాడు. ఆ రాత్రి ఇష్టదేవతా ప్రార్థనతో కొంతసేపు ధ్యాన నిమగ్నుడై తదుపరి నిద్రపోయాడు.

మర్నాడు- సుభద్రుడు వచ్చి రామలింగనితో మాట్లాడుతూంటే రాజభటుడొకడు రామలింగకవి ఇంటికొచ్చాడు. "రాయలవారి సతీమణి, రామలింగకవిగారి పత్నితో మాట్లాడడానికి రానున్నట్లు" సుభద్రునితో చెప్పాడు. ఏం మాట్లాడాలో రామలింగకవి తన భార్యతో చెప్పి తాను చాటుగా ఉండిపోయాడు.

ఆమె రాజుగారి సతీమణికి మర్యాదలన్నీ చేసింది- ఆమె కొంతసేపు ఆ మాటా- ఈ మాటా ముచ్చటించి, వచ్చిన ఆపద వివరించింది. రాయల వారి శాసనాన్ని మనసులో పెట్టుకోవద్దని - రాజ్యానికి చెడ్డపేరు రాకుండా చేసే బాధ్యత రామలింగకవిపైన తాను పెడుతున్నాననీ, ఆ విషయాన్ని కవిగారికి తెలియజేయమనీ కోరింది.

"దీనికి నన్ను ఇంతగా ప్రశంసించాలా. మహారాణీ! మీకు అవమానం కలిగితే, అది మాకు కలిగినట్లు కాదా? ఆయన వేరే ఊరెళ్ళారు. మందారవల్లిని పరాభవించడానికి ఆయనే ఉండాలా? ఆయన కూతురు ఈ మాత్రపు పని చక్కబెట్టగలదు" అని చెప్పి నమ్మించి మహారాణిని సాగనంపింది.

ఆ సాయంకాలం పుర విశేషాలు తెలుసుకుని వచ్చిన సుభద్రుడు "కవీంద్రా! నేను పూజారి వేషం వేసుకుని పూలూ- పళ్ళూ తీసుకుని

మందారవల్లికి దేవీ ప్రసాదం ఇద్దామని వారి నివాసంలోకి వెళ్ళాను. పూజారిణిని కనుక నన్నెవరూ అక్కడ విమర్శించలేదు. నాకు అడ్డు చెప్పలేదు. అక్కడ మందారవల్లి శిష్యురాళ్ళు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటల్ని బట్టి.... భట్టుమూర్తి కన్న రామలింగకవి అధికుడనీ- రానున్న సభలో ఆయననే ప్రతివాదిగా ఉంచుతారనీ కొందరనుకొంటున్నారు. కాని లవిత్ర అంటే గొడ్డలి అనే స్త్రీని వినియోగించదలచినట్టు కొందరంటున్నారు. మందారవల్లి మాత్రం "కాలహరణం కోసం వారు రెండో మార్గాన్నే అనుసరిస్తారు. లవిత్ర మందారవల్లితో తలపడటమా? ఈ ఉక్కు తీగధాటికి కొడవలే మొద్దు బారిపోతుంది" అని ఆశావహంగా ఉంది.

నేను వాళ్ళ సంభాషణ వింటుండగా, అంతలో ఎవరో వచ్చి అంతరాయం కలిగించడంతో, నేను మందారవల్లి చేతికి ప్రసాదం అందించి దీవించాను. ఆమె నాకు ఆసనం చూపించి, నా వృత్తాంతం అడిగింది. "నేను సావిత్రీ దేవి ఆలయ పూజారి కుమార్తెను. మీ అందచందాలు, పాండిత్యం దానశీలత గురించి నగరంలో అందరూ గొప్పగా చెప్పుకుంటూంటే మిమ్మల్ని చూడాలనిపించి వచ్చాను. మా సావిత్రీమాత ఎంతో సత్యమైన దేవత. ఆమె దయవల్లనే రామలింగకవి అంతటివాడైనాడు. ఆ ప్రసాదం గ్రహించి మీరు కూడా విజయం పొందాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ దీవించాను.

ఆమె చాలా ఆనందించి, నాకు పారితోషికం ఇప్పించి, మీ విద్యా బల ప్రభావాల గురించి తరచి తరచి అడిగింది. నీ వృత్తాంతం గురించి ఆమె భయపడేలా చెప్పాను. తరువాత ఆమె లవిత్ర గురించి అడిగింది. ఆమె రామలింగకవి శిష్యురాలు అని చెప్పాను. దాంతో ఆమె నిన్ను తలుచుకుని భయపడుతోంది. ఇక ముందు ఏం చెయ్యాలో ఆలోచించుకో" అని ప్రచ్ఛన్నవేషంలో తాను వెళ్ళి చక్కబెట్టిన కార్యక్రమమంతా వివరించాడు సుభద్రుడు. రామలింగడు అతడు చెప్పిన విశేషాలకు సంతోషించాడు.

ఇంతలో- ప్రభువుల వారి ఆజ్ఞానుసారం ప్రధానమంత్రి వేదపాఠశాలకు వెళ్ళి అక్కడ చదువుతున్న వారిలో వందమంది విప్రకుమారులను ఎన్నుకున్నాడు. వాళ్ళంతా సమానమైన వయస్సు కలిగినవారు. రూపం- యవ్వనం- చురుకుదనం వాదంలో పటుత్వం కలిగిన వటువులు (బ్రహ్మచారులు) వాళ్ళందరూ. వాళ్లంతా రామలింగ కవి ఇంటికి చేరేలా

ఏర్పాటు చేశాడాయన రామలింగడు. వాళ్ళందరికీ బోధించవలసిన విషయాలు బోధించి, చెయ్యాల్సిన పనుల గురించి చెప్పి, యుద్ధానికి సంసిద్ధులయ్యే శూరుల్లా తయారు చేశాడు. తర్వాత ఆయన మందారవల్లికి ఇట్లా ఉత్తరం వ్రాయించాడు.

"విదుషీ! నువ్వు విద్యలలో గొప్పదానివి కావచ్చు! కాని, కులం ప్రకారము సామాన్యురాలివే గనకు బ్రాహ్మణ, క్షత్రియులుండే సభాస్థలానికి పల్లకీ ఎక్కి రావడం అర్హతకు తగ్గ పని కాదు. తెలిసీ తప్పుచేసినా, అది మొదటి తప్పుగా ఎంచి క్షమిస్తున్నాం!" అని ఉత్తరం రాయించి, దానిపై రాజముద్ర వేయించి, దాన్ని ఆజ్ఞాపత్రికగా పంపించాడు. అది చదువుకున్న మందారవల్లి నిట్టూర్చి తన చెలికత్తెలతో "చూశారా! నేను పల్లకీ ఎక్కి సభకు వెళ్లడాన్ని తప్పు పట్టారు. వాళ్ళ దేశం కదా! సర్లే! జయపత్రిక తీసుకోనియ్! వీళ్ల అభ్యంతరాలన్నిటికీ సమాధానం చెబుదాం!" అంది.

సభ కూడకముందే పల్లకీలో రావడానికి అనుమతించమని వినయంగా ఉత్తరం రాసింది. అందరికంటే ముందుగా సభకు రావడమే అపజయ సూచకమని కొంతమంది అనుకున్నారు కూడా.

రామలింగకవి పల్లకీమీద వైభవంగా వచ్చి తన కోసం అమర్చి ఉన్న తెరవెనుక ప్రవేశించాడు. సభ చాలా గంభీర నిశ్శబ్దాన్ని సంతరించుకుంది.

ప్రధానమంత్రి లేచి వాదిప్రతివాదులు అనుసరించాల్సిన నీతి నియమాలు చెప్పాడు. అనంతరం మందారవల్లి శిష్యురాళ్ళు మెరుపు తీగల్లా వచ్చి, చక్కని పాటలు- నృత్యాలతో సభ్యులకు ఆశ్చర్యానందాలు కలిగించారు.

అప్పుడు రామలింగకవి శిష్యులలో ఒకడు లేచి "దేవా! ఇది రంగస్థలికాదు. పండిత సభ. అయినా వీరు జాతి లక్షణం కొద్దీ తమ అభినయం చూపారు. మేము వచ్చింది వీరితో పాండిత్య విషయమై వాదించడానికి. అంతేకాని ఆటపాటలు చూడ్డానికి కాదు. శృంగారలీలలతో సభ్యుల్ని మోహింపజేసి జయపత్రికలను అందుకోవడం వీరికి అలవాటు కాబోలు! లేకపోతే ఈ సంగీతం ఎందుకు?" అన్నాడు ఆక్షేపణగా.

సభాసదులకు అది సమంజసమే అనిపించింది.

మందారవల్లి కథ

అప్పుడు మందారవల్లి శిష్యురాలు ఒకతె ముందుకొచ్చి "ఈ బ్రహ్మచారి మాటలు చాలా వింతగా వున్నాయి. కాదా మరి? మధురమైన చిలకపలుకులు మార్జాలానికి ఇంపుగా వుండవుకదా! సంగీతకళ శాస్త్రాల్లోనికి రాదు కాబోలు" అంటూ ఎత్తి పొడిచింది.

"బ్రహ్మచారికి ఏం తెలుస్తుందంటూ" వంద శ్లోకాలు అధిక్షేపణగా చదివారు అతని మీద. మిగిలిన స్త్రీలు ఆ దెబ్బతో కొంత అతిశయాన్ని తగ్గించి అణకువగా మాట్లాడసాగారు.

ఏ లిపి అనేది పోల్చి చెప్పడానికి వీలుకాని లిపి 'బ్రహ్మలిపి' అని ఒక గ్రంథంలోంచి చూపించి రామలింగకవి శిష్యులు హడలగొట్టసాగారు.

అట్లాగే తమను బ్రహ్మచారులని ఎద్దేవా చేసినందువల్ల, మందారవల్లి వేశ్య కనుక ఆమె శిష్యురాళ్ళకు అంతో ఇంతో రతిరహస్యాలు తెలియకపోతాయా అని, అనంగశాస్త్రంలో ప్రశ్నలు వేసి వాళ్ళ నోళ్ళు మూయించారా వటువులు. ఎంత వేశ్య అయితే మాత్రం తన శిష్యురాళ్ళకి మన్మథ రహస్యాలు బోధిస్తుందా? పైగా ఆమె కులానికి వేశ్యగాని, గుణానికి కాదు కదా! అందువల్ల ఆ శిష్యురాళ్ళు, బ్రహ్మచారుల ప్రశ్నలకు ఇబ్బంది పడ్డారు. అప్పటికి ఆ సభ ముగిసింది.

ఆ సాయంత్రం కూడా సుభద్రుడు ప్రసాదం ఇచ్చే మిషను మీద మందార వల్లి నివాసానికి వెళ్ళి యాధాలాపంగా వింటున్నట్లు చాలా మామూలుగా వాళ్ళ మాటలు వినసాగాడు. ఆ సంభాషణ ఇలా సాగింది...

మొదట- నిన్నటి సభలో తన శిష్యురాళ్ళు అంత పిరికితనంగా మాట్లాడ్డానికీ- యుక్తికి అనుగుణంగా ప్రతియుక్తి పన్ని జవాబు చెప్పలేక పోవడానికి కారణమడిగింది.

'ఎదకొచ్చిన గిత్తల్లాగా ఆ బ్రహ్మచారులు విజృంభిస్తూ, తమని ఒక్కమాటయినా మాట్లాడనిచ్చారా? అనీ తాము ఏది చెప్తున్నా దాని ఖండిస్తూ ఏదో ఒక పుస్తకం తెచ్చి చూపించడం, అందులోనిది బ్రహ్మ లిపి వలె ఉండి తమకు అర్థం కాకపోవడం జరిగిందని- తాము విద్యలవల్ల ఓడిపోలేదనీ- మాటల్లో వాళ్ళని గెలవలేకపోయామనీ- ఆ లోటు రేపు తమ ఉపాధ్యాయినియే తీర్చాలని' ఆ శిష్యురాళ్ళంతా తలొక విధంగా తమ అభిప్రాయం చెప్పారు.

మందారవల్లి కథ

మందారవల్లి సూక్ష్మబుద్ధికి అసలు కారణం బోధపడింది..... అవన్నీ వట్టి మాటలు. ఆమె ఇదంతా రామలింగని కల్పన. అని గ్రహించేసింది. ఆ లిపి సంగతీ అంతేనని, తమని తప్పుదారి పట్టించడానికే ఒక గజిబిజిరాత సృష్టించారని అసలైన నిజం గ్రహించేసింది. అదే శిష్యురాళ్ళకు చెప్పింది. తన మనస్సెందుకో ఈసారి అపజయం తప్పదని సూచిస్తోందన్నది. అతడు 'లవిత్ర' అనే పేరు పెట్టుకుని స్త్రీ వేషంలో ఎందుకొచ్చాడో తనకు అర్థం కావడం లేదన్నది. లోకమంతా విజయపత్రికలు అందుకున్న తాము, రామలింగని గురించి తెలిసీ అక్కడకు రావడం 'కాలగతి' తప్ప మరొకటి కాదని నిరుత్సాహంతో చెప్పింది. జరగబోయేది తనకు తెలుసునని కూడా ఆమె చెప్పడం, వాళ్ళను కూడా కొంత నిరుత్సాహానికి గురిచేసింది.

వాళ్ళు అలా మాట్లాడుకుంటున్న తరుణంలో సుభద్రుడక్కడకు వెళ్ళడం- ఆమె ముఖంలో కళ లేకపోవడం- ప్రసాదం తీసుకోవలసిందని ఆమె ఓ శిష్యురాలికి చెప్పి స్త్రీ వేషంలో వెళ్ళిన సుభద్రుని ఇంటికెళ్ళమని సూచించడం జరిగాయి. ఇవన్నీ అతడు రామలింగ కవికి ఆమూలాగ్రం వివరించాడు.

మరునాడు కూడా వాద సభ జరిగింది...

మందారవల్లి శిష్యురాళ్ళు పాటలు పాడారు. లవిత్ర మారుపేరుతో రామలింగడు నియోగించిన శిష్యులు సామగానం చేసి సభ్యులని నవ్వించారు.

ప్రధానమంత్రి ఇరుపక్షాలవారినీ మందలించాడు. సభను హాస్యాస్పదం చేయవద్దని కోరాడు.

తరువాత- మందారవల్లి మాటలు విన్పించనట్లుగా నటించసాగింది లవిత్ర (రామలింగడు). ఆమె ప్రశ్నలు వేసినపుడు "నాకు ఎంత చెవుడైనప్పటికీ, ఎదుటివారి పెదవుల కదలికలను బట్టి మాటలు గ్రహించగలను. తెరచాటు వాదాలకు ఒప్పుకోను. స్త్రీలకు స్త్రీల దగ్గర తెరచాటులు అక్కర్లేదు కదా! కనుక ముఖాముఖీ వాదం చెయ్యి" అని చెప్పి సభలోని ప్రధానమంత్రిని తీర్పు కోరగా "అది సమంజసమే" నంటూ మధ్యవర్తులు కాళిదాసకవి విరచితమైన శ్లోకం ఒకటి సోదాహరణంగా సమర్థించారు.

అయితే-మందారవల్లి అందుకు ఒప్పుకోలేదు.

అలా ఒప్పుకోకుంటే ఆమె ఓడిపోయినట్లుగా నిర్ణయించబడుతుందని ప్రధానమంత్రి ప్రకటించాడు. మందారవల్లి, "మీరు నాకు ప్రతివాదుల స్థానంలో వున్నారు. మీరు ఇలా తీర్పివ్వడం ఏం నాయ్యం? మన వాదం, దీనితో ఏ సంబంధమూ లేని ఇంకొకరి చేత విచారింప జేయండి. అలా కాక బలవంతంగా అపజయం రుద్దితే నేనేమి చెయ్యగలను" అని నిజం మాట్లాడింది.

కృష్ణదేవరాయ "సరే మందారవల్లీ! ఈ మాటకు మేము అంగీకరిస్తున్నాం! ఈ విషయమంతా రాతమూలకంగా మన చక్రవర్తిగారు ఢిల్లీప్రభువులవారికి పంపిస్తాం! నువ్వు ఢిల్లీ వెళ్ళి వాదిస్తానంటే, అందుకు తగినవారినే పంపుతాం! అయితే, ఇది తేలేంతవరకు నీ ఆస్తి మా స్వాధీనంలోనే ఉంచుతాం! జయాపజయాలు తేలిన తర్వాత పత్రికాముఖంగా నువ్వు ప్రకటించినట్లే జరిపిస్తాం!" అని అప్పటికప్పుడే అటువంటి ఆజ్ఞాపత్రిక రాయించి ఆమెకు అందజేశాడు.

సభాసదులందరూ లవిత్రను అభినందనలతో ముంచెత్తారు. ఆమె పల్లకీ ఎక్కి శిష్య వర్గంతో సహా వెళ్ళిపోయింది.

రాయలు, రామలింగకవి రహస్యంగా వున్న చోటు గూఢచారుల ద్వారా తెలుసుకుని- పండిత బృందం అష్టదిగ్గజాలతో సహా వెళ్ళి అతనితో "రామలింగకవీ! ప్రజ్ఞాధురీణా! మందారవల్లిని నువ్వు తప్ప ఆ పరమేశ్వరుడైనా ఓడించలేడు. దేవీ కటాక్ష పాత్రుడివి. సంస్థానం ఖ్యాతి నిలిపావు. నీవు చేసిన మేలు ఎన్నటికీ మరువదగినది కాదు. నీకు అసాధ్యమే లేదు" అని ప్రశంసించాడు. అంతేగాక తన వెంట వచ్చిన ఆస్థాన దిగ్గజాలు తాము రామలింగని పట్ల పూనిన అకారణ వైరానికి పరితపిస్తున్నారని రాయలు చెప్పగా, భట్టుమూర్తి తదితరులు తాము పన్నిన కపటం మన్నించవలసిందిగా రామలింగని ప్రార్థించారు. అప్పుడు రామలింగడు తాను అవేమీ మనసులో ఉంచుకోలేదని అక్కడకొచ్చిన వారందరికీ ఒకేసారిగా సంతోషం- సిగ్గు తోచేలాగా మాట్లాడి అందర్నీ మన్నించాడు.

అప్పుడా ప్రభువు "ఆర్యా! పండితుల పట్ల ముల్లులా తయారైన మందారవల్లిని ఇక్కడ పరాభవించావు. చాలా బాగుంది. మిగతా కార్యం

కూడా పూర్తి కావాలి కదా! నీ ఆనతి మేరకు దాన్ని ఢిల్లీకి వెళ్ళమని ఆజ్ఞ ఇవ్వడమైతే జరిగింది కానీ, అక్కడ ఆమె తన ప్రావీణ్యత చూపించి, అక్కడి వాళ్ళని వశపరుచుకొని తీర్పు తన పక్షాన వచ్చేలా చెప్పించుకోగలదేమో! కనుక- నీకు నీ పరివారానికీ సకల సదుపాయాలూ కలిగిస్తాను. ఏది కోరితే అది క్షణాల్లో అందే ఏర్పాటు చేస్తాను. అక్కడికి వెళ్ళి కార్యసాధకులై తిరిగి రాగలరు" అని రామలింగని ఒప్పించి, వెంట వచ్చిన పండితులతో కలిసి ఇంటికి వెళ్ళాడు.


రామలింగనిచేత అవమానించబడిన మందారవల్లి చాలా విచారంగా ఎవరికీ తెలీకుండా తన నివాసానికి వెళ్లిపోయింది. ఆ రాత్రి తన శిష్యురాళ్ళతో ఆమె మాట్లాడుతుండగా, ఒక శిష్యురాలు "లవిత్ర అంతటి ప్రజ్ఞావంతురాలా?" అని అడగ్గా మందారవల్లి "హేమలతా! ఆమె అని నువ్వు అనుకుంటున్నావేమో? అతడు ఎవరో నీకు తెలియక స్త్రీ అనుకుంటున్నావు. లవిత్ర కల్పితం. రామలింగడనేది నిజం! కంఠస్వరం గుర్తించలేదా?" అని ఎదురు ప్రశ్నించింది.

"ఐతే కానీయ్! స్త్రీ- పురుష విచక్షణ మనకేల?" మనకి కావలసింది విద్యాపాటవం. అసలు ప్రసంగమే ప్రారంభం కాలేదు" అందా శిష్యురాలు. అప్పుడు మందారవల్లి అసలు రహస్యం బయటపెట్టింది. తాను ఎదుట నిలబడి ఎవరితోనూ ప్రసంగించలేదు. అదీ దేవరహస్యం. పూర్వ కాలంలో తానొక పొరపాటు చేయగా సిద్ధుడొకడు తనను శపించాడనీ- రామలింగనికి ఎలాగో తన రహస్యం తెలిసిపోయిందనీ, అందువల్లనే నిండు సభలో తనను ఇరుకున పెట్టబోయాడనీ, ఢిల్లీలో మనం చూడదగినవారినే చూసి మన వాదం గెల్చేలా నెగ్గుకు రావాలనీ, కాని ఇప్పుడో సమస్య అనుకోకుండా ఎదురైందనీ జయాపజయాలు తేలేవరకు- పోవడానికి బండి, అన్న వస్త్రాలకు తగిన ధనం మాత్రమే అనుమతిస్తారట! ఇంత వైభవంతో మనం వెళ్ళడానికి అవకాశం లేదు అంటూ మందారవల్లి చెప్పే సరికి ఆమె శిష్యురాళ్ళందరూ

హతాశులయ్యారు. ఆమె వెంట ఢిల్లీ వెళ్లడానికి ఇష్టపడక, ఏవేవో సాకులు చెప్పి తప్పించుకోసాగారు. చివరికి ప్రియంవద అనే చెలి మాత్రమే మిగిలింది. ఆమె "వాళ్ళందరినీ పోనియ్" నీతో రాక నేనెక్కడికి పోగలను? నీతో మంచి చెడ్డలు పంచుకోవడానికి నేను సర్వదా సిద్ధమే" అంది.

మణిసిద్ధుడు అంతవరకూ కథ చెప్పి, బయలుదేరవలసిన వేళ అయిందని, మిగతాకథ తరువాత మజిలీలో చెప్పుకుందామని చెప్పి, గోపాలుని బయలుదేరదీశాడు.

శౌనకుని లాంటి శిష్యుని వెంట పెట్టుకుని (గోపాలుడికి మణిసిద్ధుడు పెట్టిన పేరు) ప్రయాణమై సిద్ధుడు తర్వాత మజిలీ చేరుకున్నాడు.



కాశీ మజిలీ కథలు

25 వ మజిలీ

దుష్టవర్మ కథ

గోపా! విను. రామలింగకవి, రాయలవారి ఆజ్ఞమేరకు ఒక శుభముహూర్తాన ఢిల్లీ బయలుదేరాడు. అతని వెంట ప్రియమిత్రుడైన సుభద్రుడు కూడా వున్నాడు. కావలసినంత పరివారం ఉంది. కొంతకాలం ప్రయాణం సాగి వాళ్ళందరూ భర్గదుర్గం అనే గ్రామం చేరుకున్నారు. అక్కడొక బ్రాహ్మణుని ఇంట్లో బస చేశారు.

ఆ రాత్రి ఆ ఇంటికి దగ్గర్లో వున్న దేవాలయంలో బ్రాహ్మణులు 'స్వస్తి' (శుభకరమైన మంత్ర పారాయణ) చెబుతూంటే, శ్రావ్యంగా వినవచ్చిన ఆ వేదనాదానికి ఆకర్షితుడై అక్కడకు వెళ్ళిన రామలింగనికి- పలుదేశాలు పర్యటిస్తూ అక్కడ చేరిన బ్రాహ్మణుల మాటలు వినిపించసాగాయి. తాను ప్రచ్ఛన్న వేషంలో ఉన్నందున, ఇతరులు తనను గుర్తించే అవకాశం లేనందున రామలింగడు అక్కడ స్వేచ్ఛగా సంచరించి వాళ్ళ విశేషాలు విన్నాడు. వాటి ప్రకారం ...... మందారవల్లికి విజయనగర ప్రభువుల ఆస్థానకవి రామలింగని చేత పరాభవం జరిగిన విషయం. లవిత్ర అనే మారుపేరుతో- శిష్యగణ సహితంగా ఆమెను ఢిల్లీ దారి పట్టించిన విషయం వాళ్ళు ముచ్చటించుకున్నాక- అక్కడ స్థానికంగా ఉన్న దుష్టవర్మ చేష్టల గురించి విపరీతాల గురించి మాట్లాడుకోసాగారు.

ఈ దుష్టవర్మ గొప్ప దురహంకారి. ఆ దుర్మార్గుడు క్రొత్త అర్థాలు చెప్పమని పౌరాణికులను వేధిస్తుంటాడట! ఎవరైనా ద్రవ్యాశకొద్దీ అతని దగ్గరకెళ్తే తాను ఆసనం పై కూర్చొని, పురాణం చెప్పవచ్చిన వారిని క్రింద కూర్చోబెడతాడట.... ఈ విపరీతానికి తోడు రామాయణంలో భారతార్థం-

భారతంలో రామాయణార్థం చెప్పమని కోరతాడట!....ఇవన్నీ అనుకుంటూనే అక్కడ చేరిన బ్రాహ్మణులు ఇంకా ఇలా కూడా అనుకోసాగారు.... రామలింగకవి చర్యలు చాలా అద్భుతమైనవి వింటున్నాము. అతడు మన దుష్టవర్మకు తగినట్లుగా పురాణం చెప్పగలడు. క్రూర బుద్ధులని తెలిస్తే, పరాభవించే దాకా వదిలిపెట్టడట!....

ఇవన్నీ విన్నాక రామలింగకవికి, ఆ దుష్టవర్మ ఎవడో-అతని దురాగతాలేమిటో తెలుసుకోవాలని కుతూహలం కలిగి, తాను విన్నమాటలు సుభద్రునితో చెప్పి, తాను బసచేసిన ఇంటిలోని బ్రాహ్మణుని దుష్టవర్మ గురించి వివరాలు అడిగాడు. ఆయన ఇలా చెప్పాడు-

"అయ్యా! దుష్టవర్మకు రెండు మూడు గ్రామాలున్నాయి. అతని పూర్వీకులకు మంచి పేరే ఉంది. వాళ్ళు బ్రాహ్మణులకు భూదానాలు చాలా చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే- ఇక్కడ బ్రాహ్మణులందరికీ ఆ భూములే ఆధారం. ఆ కారణం చేత అతడు ఇక్కడున్న వారిలో రోజుకి కొందర్ని పురాణం చెప్పడానికి రమ్మంటాడు. రాని బ్రాహ్మణుల్ని భూములు సాగు చేసుకోనివ్వడు. ఈ బాధపడలేక వెళ్ళిన వాళ్ళని కొత్త అర్థాలు చెప్పమంటూ వేధిస్తాడు. ఏదో ఒకటి చెప్పబోతే, ఏవేవో సందేహాలు తీర్చమంటాడు. చెప్పకపోతే బుద్ధిహీనులని నిందిస్తాడు. ఎంతో సాధన చేసి శ్రమించి పురాణం చెప్పి ఏదైనా ఇమ్మని అడిగితే, చాల్చాలు! మా పూర్వీకులు మీకు ఇచ్చినదే ఎక్కువ అంటాడు. ఈ ఊళ్ళో బ్రాహ్మణులకు ఇదో ఆపద లాగుంది. ఇంకో చోటుకు పోయి అడిగే అవకాశాలు లేవు" అని అతని వృత్తాంతమంతా చెప్పాడు ఆ బ్రాహ్మణుడు.

అది విన్నాక దుష్టవర్మను ఎలాగైనా పరాభవించాలని రామలింగడు తీర్మానం చేసుకున్నాడు. సుభద్రునికి చెప్పవలసినవన్నీ చెప్పి- ఆ ఏర్పాట్లు చూడమన్నాడు. ప్రయాణం వాయిదా వేసుకుని, స్థానిక బ్రాహ్మణ పండితులతో సుభద్రుడొక పథకం రచించాడు. దాని ప్రకారం..... మర్నాడు పురాణ కాలక్షేపం జరిగే వేళకి, దుష్టవర్మ ఇంటికి వెళ్ళి తనది కాశీపుర కాపురమనీ, అద్భుత బ్రాహ్మణ పౌరాణికులమనీ, దుష్టవర్మ కీర్తి కాశీదాకా వ్యాపించిందనీ, అందువల్ల ప్రత్యేకంగా అతన్ని చూడ్డానికే వచ్చాననీ మొదటిగా

వినిపించి, అందులోని భాగంగా- తనకు నూట పదిరకాలుగా పురాణం వినిపించే నేర్పున్నందున తన పాండిత్య ప్రదర్శన చేయాలనుకుంటున్నట్లుగా చెప్పాడు రామలింగడు.

ఎప్పుడో జరిగిన విషయాన్ని ఇక్కడే-ఇప్పుడే జరుగుతున్నట్లు చూపించడం, రామాయణంలో భారతార్ధం- భారతంలో భాగవతార్ధం- భాగవతంలో రామాయణార్ధం వచ్చేలా పురాణం వినిపించడం;కావాలంటే మూడిటిలోనూ విపరీతార్ధాలు విస్పష్టంగా చెప్పడం తన ప్రతిభావిశేషాలుగా చెప్పుకున్నాడు. అందుకుగాను తనకు పారితోషికం కూడా అవసరం లేదని- తన ప్రజ్ఞకు గుర్తింపునిచ్చి, అందుకు అన్ని విధాలా తాను అర్హుడినని ఒప్పుకుంటే చాలునని మాత్రమే చెప్పే సరికి ఆ లుబ్ధుడు మహదానందపడి, కుతూహలం కొద్దీ పురాణ కాలక్షేపం ఎప్పుడు పెట్టుకుందామని అడిగాడు. ఏ పురాణాలు తెప్పించమంటారు? కావలసిన సామగ్రి ఏమిటో చెప్పండని కూడా ప్రశ్నించే సరికి "ఎప్పుడో దేనికి? ఈ రాత్రే మా పురాణ శ్రవణం మీరు ఆనందించెదరు గాక! మీరే పురాణాలు తెప్పించనక్కర్లేదు. అన్నీ మాకు మస్తిష్కంలోనే (బుర్ర) ఉన్నాయని- సభా భవనాన్ని మాత్రం అద్భుతంగా అలంకరించడం, కొంతదూదిని మాత్రం తెప్పిస్తే చాలుననీ" అన్నాడు రామలింగడు.

ఆ పూటకి పురాణ శ్రవణం చాలించి, అక్కడ బ్రాహ్మణులంతా రామలింగని చుట్టూ చేరారు. వాళ్ళందరికీ సుభద్రుడు రహస్యంగా బోధించవలసినవి బోధించి, రాత్రి వారిని ఆ ప్రకారంగా అక్కడ నడచుకోవలసిందిగా చెప్పి, అందరితో కలిసి వైభవంగా సభా భవనానికి వెళ్ళాడు. ఈ వార్త గ్రామంలో ప్రాకి, పౌరులు కొందరు పురాణం వినడానికి ఉత్సాహం చూపించి వాళ్ళు కూడా వచ్చారక్కడకు.

రామలింగకవిని చూసి దుష్టవర్మ కాస్త జంకాడు. సభా భవనంలో ఎక్కువగా ఆసనాలు వేయించాడు. - రామలింగనికీ-సుభద్రునికి ప్రత్యేక ఆసనాలు తెప్పించాడు. పురాణ శ్రవణ విషయమై దుష్టవర్మ కుతూహలం గమనించడం వల్లనే ఈ ఏర్పాటు సాధ్యమైంది.

దుష్టవర్మ కథ

సుభద్రుడు పురాణం చదివేలాగ- రామలింగడు కొత్త అర్థాలు చెప్పేలాగ, మొట్టమొదట భారతంలోని యుద్ధ పంచక ఘట్టం ఎత్తుకోమన్నాడు దుష్టవర్మ. పద్యం చదివాడు సుభద్రుడు. రామలింగకవి " ఆ విధముగా రామ.... కృతవర్మ ద్రోణాచార్యాది యోధులు అర్జునుడు సహాయం చేస్తుంటే, ఎంతో కోపంతో యుద్ధం చేస్తున్న దశముఖుని అనగా రావణుని, అతని పక్కనున్న భీముడిని, ఆ పక్క కర్ణునీ చావగొట్టాడు. అప్పుడు రావణుడు పాండవుల్ని సహాయానికి పిలవగా- కర్ణుడిని కోరగా కర్ణుడే రావణుని కొట్టాడు. ఇది రామాయణంలో భారతార్థం" అన్నాడు.

"ఇదేం పురాణం? ఇదేమీ అర్థం? రావణాసురుడే కాలం వాడు? పాండవులెప్పటి వారు?" అంటూ దుష్టవర్మ ప్రశ్నించబోగా "అయ్యా! మొదట పురాణమంతా వినండి! ప్రశ్నలకు జవాబులు తరువాత చెప్పబడతాయి. ఇలా ప్రారంభించగానే అలా ప్రశ్నలు వేయడం ఏమిటి? కొత్త అర్థాలు చెప్తూండగా- అవి మీ వంటి పురాణ విజ్ఞానఖనులకు వాటంతట అవే తెలుస్తుంటాయి. అప్పటికీ తెలియకపోతే, మీరు ప్రశ్నించవచ్చు!" అంటూ మొదట్లోనే నోరు మూయించేశాడు రామలింగడు.

తరువాత సుభద్రుడు మరో పద్యం అందుకున్నాడు. "ఈ విధముగా కర్ణుడు తన తమ్ముడైన భీముని కొట్టడం చూసి కోపించి, గాడ్పు కొడుకు అనగా వాయుదేవుని పుత్రుడైన ఆంజనేయులవారు ఒక్కగెంతు వేసి, దక్షిణ గోగ్రహణం చేస్తున్న సుశర్మను రెండు గుద్దులు గుద్ది ఇది తన వాలాగ్నిచే ఆతని ఇల్లు తగలబెట్టి గర్వము పోగొట్టిన వాడయ్యాడు" అని వ్యాఖ్యానించాడు.

దుష్టవర్మ ఏదో ప్రశ్నించబోగా "మీరిప్పుడేం మాట్లాడవద్దని ముందే చెప్పాను. అంతా విన్న తరువాతది అనుమానాలు తీరిపోతాయి. భారతంలో రామాయణార్థం ఇది. సుభద్రా! తరువాత చదువు" అని మిత్రునికి చెప్పగా అతడు ఇంకొక పద్యం చదివాడు.

దానికి వ్యాఖ్య చెప్తూ రామలింగడు "అట్టి సమయంలో గురుడు అనగా బృహస్పతుల వారు శుక్రాచార్యులవారితో కూడా వచ్చి రావణాసురునికి నీతి చెప్పగా వినకపోయినప్పుడు, తన రథం మీద కూర్చుండి

ధ్యానించుచుండగా, ఆంజనేయులవారు తనకు సహాయం చేసినందుకు బదులుగా దృష్టద్యుమ్నుడు వడివడిగావచ్చి కత్తిదూసి అతని వెంట్రుకలు పట్టుకుని కోసిన వాడయ్యాడు" అంటూ మరొక పద్యానికి అర్ధం చెప్పబోతూ" ఇది భారతంలో భాగవతార్థం. ఇంకా....." అన్నాడు.

దుష్టవర్మ "మేలు మేలు! భళీ! భళీ! బావుంది. సంతోషించాం! ఇక ప్రత్యక్ష పురాణం అన్నారు. అదేమిటో చెప్పండి! అదీ విని సభ చాలిద్దాం!" అన్నాడు. రామలింగడు "చిత్తం! అలాగే కానిద్దాం!" అని వెనుకటి పద్యాలే మళ్ళీ చదవమన్నాడు– సుభద్రుడా పద్యాలు చదవగా "బ్రాహ్మణులు సహాయం చేస్తుండగా కర్ణుడు రావణుని ఇలా తాకాడు" అంటూ గొప్ప కోపంతో లేచి, సింహాసనం మీద కూర్చున్న దుష్టవర్మని కింద పడేసి, "దృష్టద్యుమ్నుడు బృహస్పతిని ఇలా తలగొరిగాడు" అంటూ ఒక కత్తితో అతని జుట్టు కత్తిరించి, "సుగ్రీవుడు కంసుని ఇలా తన్నాడు" అంటూ నాలుగు తాపులు దుష్టవర్మకు ప్రసాదించి, "హనుమంతుడు సుశర్మ ఇంటిని ఇలా అంటించాడని" ముందుగానే అతడి చేత తెప్పించి ఉంచిన దూదిని అంటించాడు.

దాంతో సభాభవనం మొత్తం అంటుకుంది. నిలువెత్తు మంటలు లేచి, అంతా అగ్ని దగ్ధమైంది. అక్కడున్న పౌరులంతా హా హా కారాలు చేస్తూ వీధిలోకి పరుగెత్తారు. దుష్టవర్మ గుండెలు బాదుకుంటూ నేలమీద పడి పొర్లి పొర్లి ఏడవసాగాడు.

రామలింగకవి "పూర్వకాలమున ఆంజనేయ భగవానులవారు లంకా పట్టణం తగులబెట్టినపుడు, ఇళ్ళలోంచి బైటపడిన రాక్షసులు అమ్మో బాబో కొడుకో అంటూ ఇలాగే భయంకరంగా ఏడ్చారు" అని అర్ధం చెప్పి "ఇదే ప్రత్యక్షపురాణం" అని ముక్తాయించాడు.

ఈ విధంగా తనను పరిహాసం చేస్తూన్న రామలింగని కొట్టడానికి దుష్టవర్మ కొట్టబోగా, బ్రాహ్మణులంతా అతన్ని చుట్టుముట్టి ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఆ ఉపద్రవాన్ని నివారించడానికి గ్రామస్తులంతా అక్కడ చేరడంతో, రామలింగకవి చేసిన పని ఇది అంటూ అక్కడ వాళ్ళందరికీ వివరించిన దుష్టవర్మ ఆ పౌరాణికుని పట్టుకుని తనకు సాయం చేయమనీ వాళ్ళని కోరాడు. అయితే పౌరులు అక్కడ రామలింగనికి బ్రాహ్మణులంతా పెద్ద సంఖ్యలో అండగా నిల్చి ఉండడం గమనించి, మృదువుగా "అటువంటిపని ఎందుకు చేశారు?" ని అడిగారు.

దుష్టవర్మ కథ

అప్పుడు రామలింగకవి "అయ్యా! నేనీ పనిని అతడి అనుమతి మేరకే చేశాను. యుద్ధ పంచక ఘట్టం చదవమనీ, ఎప్పుడో జరిగిన విషయాలు ఇప్పుడు జరుగుతున్నట్లుగా చెప్పమనీ, ఒక పురాణం చదువుతూ- ఇంకొక పురాణ అర్థం చెప్పమనీ.... ఇవన్నీ అతని నోటి నుంచి వచ్చిన మాటలే! కావాలంటే ఈ బ్రాహ్మణులనే అడగండి! నా వల్ల కొంచెం కూడా తప్పులేదు" అన్నాడు.

ఈ మాటలు విన్న దుష్టవర్మ పటపట పళ్ళుకొరికి "ఓరీ దురాత్మా! అద్భుత పురాణం చెప్తానంటే ఏదో అనుకున్నాను. భారత భాతవత రామాయణార్థాలు మార్చమంటే ఇలాగా? అన్నీ అసందర్భంగా చెప్తావా? సరే! అదలావుంచు! నా జుట్టు తెగ్గోయడం, నన్ను కాల్తో తంతూనే నా భవనం కాల్చడం, ఇది అతడు సమర్థించుకుంటూ చెప్పిన మాటలు మీరు విన్నారు కదా!" అని అడిగాడు.

"అవి ఉచితానుచితాలు తెలీని వాళ్ళకి చెప్పినా అర్థం కాదులే! నేను చెప్పిన అర్థాలు ఎవరు కాదన్నా జుట్టు కోసి పంపుతా! బ్రాహ్మణులంతా క్రింద కూర్చుని ఉండగా-పైగా పురాణం చెప్తూ వుండగా, పెద్ద ఎద్దులాగ గద్దెమీద కూర్చొని కువిమర్శలు చెయ్యడం అనుకున్నావా? మా పురాణాలు అటువంటివి కావు. అవి దుష్టవర్మ వంటి వారి ఆటలు కట్టించేవి అని తెలుసుకో! నాది తప్పు అని నిరూపించడానికి ఇక్కడెవరికీ అధికారం లేదు. కావాలంటే ఢిల్లీ చక్రవర్తి దగ్గరకు రా! ఆయన చెప్పినట్లు చేస్తాను" అంటూ తనను ఉన్న అధికార పత్రం చూపించాడు.

పౌరులు అది చూసి, ఇంకొక మాట మాట్లాడ్డానికి నోరు రాక అతడ్ని మామూలు వ్యక్తి కాదని భావించి, కొంత గడువు ఇచ్చి దుష్టవర్మ ఢిల్లీలో ఫిర్యాదు చేసుకోవడానికి వచ్చేలా రాయించారు. బ్రాహ్మణులు తమ చింతలు ఆ నాటితో దూరమైనందుకు ఆనందిస్తూ, రామలింగని ఓ దేవుడిలా ఆరాధించసాగారు. గడువునాటికి తాము కూడా ఢిల్లీ రాగలమని చెప్పారు.

అయితే ఈ కార్యక్రమం అంతా తన పేరు గుట్టుగా ఉంచి నిర్వర్తించాడు. ఆ బ్రాహ్మణుల కోరిక మేరకు ఇంకో రోజు అక్కడ నివసించాడు. దుష్టవర్మ పీడ విరగడైనందుకు మళ్ళీ మళ్ళీ కృతజ్ఞతలు అర్పించారు వారందరూ.

మంగమణి కథ

సుభద్రునితో సహా బండి ఎక్కి రామలింగకవి ఆ గ్రామం నుంచి కొంత మేర ప్రయాణించేసరికి పొద్దుపోయింది. దగ్గర్లో గ్రామం ఏదీ కనిపించింది కాదు. చీకటికి భయపడుతూ బండివాడు ఎడ్లని వేగంగా తోల్తున్నాడు.

దారిలో ఒక చోట అడ్డంగా ఒక బండీ ఉండడం చూసి, తమ బండిని నిలిపి "మీరెవరు? ఇలా అడ్డంగా నిలిపితే ఎలా?" అని అరిచాడు.

"అయ్యా! మేము మార్గస్తులం! ఢిల్లీ వెళ్తున్నాం! మా బండీ ఎద్దు దేన్నో చూసి బెదిరి పారిపోయింది. వెతకడానికి వెళ్ళిన బండివాడు ఇంతవరకు తిరిగి రాలేదు. మగవాళ్ళు ముందుగా వెళ్ళడం చేత, బండిలో మేము ఆడవాళ్ళమే మిగిలాం! మా బండివాడు వచ్చేదాక ఆగితే మీకు చాలా పుణ్యం ఉంటుంది. రెండు బళ్ళూ కలిసేపోవచ్చు!" అంటూ ఒక స్త్రీ కంఠం వినిపించేసరికి, రామలింగకవి సుభద్రునికి సైగచేసి తటాలున బండి దిగి "అలాగా! పాపం! మగువలారా! భయపడవద్దు! మేం బ్రాహ్మణులం. విద్వాంసులం. ఉదర పోషణ కోసం దేశాటనం చేస్తున్నాం! ఉపకారం అవసరం పడని దెవరికి? అలాగే కానివ్వండి! మీ బండి వాడొచ్చేదాకా ఉంటాం! మేమూ వెతుకుతాం! దొరక్కపోతే. మా బండిలో ఎక్కించుకుని మీ గమ్యం చేరుస్తాం! మిమ్మల్ని ప్రాణ ప్రదంగా జూసుకొనే మీ మగాళ్లకు అప్పగిస్తాం!" అంటూ బండి ఆపించాడు.

ఎంతసేపటికీ వాళ్ళ బండివాడు తిరిగి రాలేదు. తమ కోసం వాళ్ళు ఆగిపోయారని, ఆమె కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉండగా, రామలింగకవి వాళ్ళతో పరిచయం పెంచుకున్నాడు. వాళ్ళ ఊరూ-పేరూ- వివరాలన్నీ కనుక్కున్నాడు.

ఆ బండిలోనివారు చెప్పిన మాటల్ని బట్టి 'వారు వైష్ణవులనీ, వాళ్ళ మగవారు ఢిల్లీలోని పాదుషా గారిని చూడవెళ్ళారనీ, తన పేరు మంగమణి అనీ, తోడుగా తన పినతల్లి కూతురు ప్రియంవద వస్తోందనీ తెలిసింది.

రామలింగకవికి, తన పేరు రామకవి అని- తన శిష్యుని పేరు సుభద్రుడని, తాము అన్నిటా పండితులమని, తమ జన్మభూమి ఉత్తర కురుదేశమనీ చెప్పి పరిచయం పెంచుకున్నాడు అతడు.

క్రమంగా రెండు బళ్ళూ కలిసి ప్రయాణించడం- అందరకూ ఒకే వంట కలిపి నిర్వహించడం- ప్రయాణంలో ఆ స్త్రీల బండిని ముందుగా ఉంచి, వెనుక తమ బండీ సాగేలా చూడడంతో నాల్రోజులకే ఆ యువతులకు అతని మీద గౌరవం, ప్రేమ, ఆదరం పెరిగాయి. అతని పరోపక్కార పారీణతను శ్లాఘించారు. ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు.

ఒకనాటి సాయంకాలానికి ఆ బళ్ళు విద్యానగరం చేరుకున్నాయి. అక్కడి పాలకుడు ధర్మకేతుడు.

అందరూ ఒక సత్రంలో బసచేశారు-స్నాన సంధ్యలు అన్నీ పూర్తయి భోజనం కూడా జరిగాక రామలింగకవి నగరంలోకి వెళ్ళి తిరిగొచ్చి, పదిరోజులు ప్రయాణం కలిసి చేయడం వల్ల ఏర్పడిన మైత్రితో ఆ స్త్రీల దగ్గర ఒక ప్రతిపాదన తెచ్చాడు.

తాము చిన్నప్పటి నుంచి దేశాటనం చేస్తున్నట్లు- ఎక్కడా చాలినంత ధనం లభించనట్లు- ధన చాపల్యం కొద్దీ ఆ రోజూక ఆధారం దొరికినందున, దాన్ని విడువలేక ఆ స్త్రీల వద్ద ఒక ప్రతిపాదనకు ప్రేరణగా ఒక విషయం అడగదలచినట్లు- నాందీ ప్రస్తావన ఇచ్చాడు రామలింగడు.

వాళ్ళు కృతజ్ఞతా భావం ద్యోతకం చేస్తున్నట్లుగా, అదేమిటో చెప్పమన్నారు రామలింగడు మొదట చెప్పడానికి తటపటాయిస్తున్నట్లుగా కాస్త ఆగి- ఆ స్త్రీల సౌహార్ద్రం వల్ల తాను చెప్పడానికి సాహసిస్తున్నానని, ఆ పట్నపురాజైన ధర్మకేతుడు-అతని భార్య సుశీల ప్రతి శుక్రవారం 'దంపతిపూజ' చేస్తారని, రాజు అనుగ్రహం పొందిన తామిద్దరం తమ కుటుంబాల సహితంగా వచ్చినట్లు చెప్పేసరికి, రాజదంపతులు దంపతి పూజ చేయడానికి ఉత్సాహపడ్డారని, ధనలోభం కొద్దీ ప్రభువు వద్ద తాము ఆడిన మాటలు నిజం చెయ్యడానికి వాళ్ళ సహకారం కోరుతున్నానని వివరంగా చెప్పాడు రామలింగడు. మంగమణి-ప్రియంవదలు ఒకరితో ఒకరు చర్చించుకుని "అయ్యా! మీ లాభం ఎందుకు పోగొట్టడం? అలాగే కానివ్వండి" అన్నారు.

సుభద్రుడికి రామలింగనికీ కరువు తీరేలా, వారి సహకారం వల్ల దానాలు లభించాయి. అయితే ఆ రాజ దంపతులు, దంపతి పూజను దానాలతోనే సరిపెట్టక- విందు భోజనాలు, శోభన వేడుకల వరకూ తీసుకెళ్తున్నట్లు తెలిసేసరికి వాళ్ళు బిత్తరపోయారు. రామకవి ఇదంతా తెలిసే తమను మోసం చేశాడనుకుని అపోహపడ్డారు.

అతడ్ని చూస్తూనే ప్రియంవద కళ్ళెర్ర చేసి "రామకవీ! మమ్ములను బాగానే వంచించావు. ఇంతకు ముందు కూడా మేము రామశబ్ద వాచ్యుడైన వాని చేతనే మోసం పాలయ్యాము. నువ్వు అంతకంటే మోసగాడివి" అని, గట్టిగా చెప్పి "ఇక ఈ నాటకం మేం ఆడం! నిజం చెప్పేసి నిన్ను ఆ ధర్మకేతుని చేత దండింపచేస్తాం" అన్నది.

దానికి రామకవి భయపడుతున్నట్లుగా నటిస్తూ "మొదట నాకీ గొడవలేం తెలీవు. దానం అందుకోవడమే కాబోలు ననుకున్నాను. మిమ్మల్ని ఒప్పించాను. ఇలా జరుగుతుందని తెలిస్తే మిమ్మల్ని అడగకపోదును. మీ ముఖం చూడ్డానికి నాకూ సిగ్గుగానే ఉంది. తప్పించుకునే దారి కనబడటం లేదు. ఇప్పుడు లభించిన ద్రవ్యమంతా వదులుకోమన్నా సిద్ధమే! ఏదైనా మార్గం చెప్పండి. మర్యాద నిలబడితే అంతే చాలు! ధనం ఇంకొక దారిన సంపాదించుకోవచ్చు! మీ వంటి ఉత్తముల్ని కష్టపెట్టడం న్యాయం కాదు...." అన్నాడు.

అప్పుడు మంగమణి- 'అయ్యో! రాజపత్ని ఉత్సాహాన్ని ఆపగలమా? ఇప్పుడు వేరే ఉపాయం లేదు. రోట్లో తలదూర్చాక రోకటి పోటుకు వెరవడమెందుకు? మనం ముందే ఆలోచించుకోవలసి వుంది. దేనికైనా కారణం మనస్సు. దాన్ని గట్టి పరుచుకుంటే ఏమీ ప్రమాదం లేదు. విద్వాంసులైన మీకు ఇంతకంటే ఎక్కువ చెప్పక్కర్లేదు" అంది.

"సరే! నువ్వు నాకు ఇంతగా చెప్పాలా? మీరు ఎలా అంటే అలా చేద్దాం!" అన్నాడు. ఇంతలో రాజదంపతులు పంపిన పరిచారిక అక్కడికొచ్చి, రాణీగారొస్తున్నారని చెప్పింది. రామకవి తన గదిలోకెళ్ళాడు.

ధర్మకేతువు భార్య సుశీల. ఆ రాణే స్వయంగా అన్ని ఏర్పాట్లనూ పర్యవేక్షించి, ఆ దంపతుల్ని చూడ్డం వల్ల తన కళ్ళు ధన్యమైనట్లు

ఆనందించింది. ముత్తయిదువుల చేత వాళ్ళిద్దర్ని ఒక గదిలోకి ఏకశయ్యపైకి పంపి తలుపులు మూయించింది.

అప్పుడు రామలింగకవి ఆమెను చూశాడు. ముసుగులేని ఆమె, తాను విన్నదానికంటే ఎన్నో రెట్లు అందంగా కనిపించింది. అతడు మోహపరవశుడయ్యాడు. ఒక్కసారి అయినా ఆమె చేత చూడబడితే ఇక రాజ్యమేల?" అనుకున్నాడు. ఈమెతో నేను చాలా నీతి వాక్యాలనే పలికాను. నేను తొందర పడితే, చులకనైపోతాను. ఈ చిలకలకొలికి చూపులలో కొంత చాపల్యం కనిపిస్తోంది. కాస్త ఆగితే. మన్మథుడే మనకు ఉపకారం చేయవచ్చునేమో!" అనుకొని, చప్పున మంచం దిగి, శరీరాన పూసిన గంధంపూతలు తుడి చేసుకుని, పుష్ప మాలికలు తీసేసి దగ్గర్లో ఉన్న ఒక పీఠం మీద కూర్చున్నాడు.

మంగమణి మాత్రం తన అలంకారాలేవీ తీసెయ్యక, గదిలో ఒక చోట అమర్చబడి ఉన్న వీణ శృతి చేసి అద్భుతంగా వీణ వాయించింది. ఆ రాగానికున్న సమ్మోహశక్తి ఎలాంటిదో గాని, గంధర్వాస్త్రంలాగ ఎలాంటి వాళ్ళనైనా మోహావేశితుల్ని చెయ్యకపోదు. ఆమె ప్రొద్దు పోయేవరకు అలా వీణ వాయించి, అక్కడే ఉన్న రత్న కంబళం మీద పడుకుని నిద్రపోయింది. తెల్లవారకుండానే అక్కడికి ప్రియంవద వచ్చింది. ఆమెని చూసి నవ్వుతూ "రాత్రి ఎలా గడిపావు? మనం ఎక్కడ? ఈ బీద బ్రాహ్మణులెక్కడ? ఈ దాంపత్యం ఏ పురాణంలోనైనా వర్ణించబడిందా? మనకు ఈ పత్నీ భావం ఏమిటి? మన మనస్సులు మాత్రం రాళ్ళా? రాగరంజితాలు కావా? మనం రామకవి ఏదో బీద బ్రాహ్మడను కొన్నాంగాని, నాకు అలా అన్పించడం లేదు. ఎంతో గొప్పగా ఉన్న దాతని రీవి. చెలీ! నీ దగ్గర నిజం దాచడమెందుగ్గానీ, మంచం మీద నిద్రిస్తున్న అతన్ని చూస్తుంటే నాకే వేడుకయిందంటే నమ్ము! ఎలాంటి వారినైనా లెక్క చేయని నాకు, ఇతని మీద మనసు లగ్నం కావడానికి కారణమేమిటో తెలీదు. వజ్రంలాంటి నా మనస్సు దూది పింజంత తేలికై పోయిందంటే నమ్ము! నాకు ఇతడితోపాటు తిరిపెం ఎత్తుకుంటూ దేశాటనం చెయ్యవలసిన రాత రాశాడు కాబోలునా భగవంతుడు. చెదిరిన మనస్సును అతి కష్టం మీద కూడదీసుకున్నాను. నిజం చెప్పు! నువ్వేం చేశావు?" అని అడిగింది.

ప్రియంవద సిగ్గు పడిపోతూ, "వీళ్ళని మనకోసమే బ్రహ్మ సృష్టి చేశాడేమో అనిపిస్తోంది. లేకపోతే దంపతి పూజ అనగానే వీళ్ళతో కలిసి పీటలమీద కూర్చోడానికి మనం అంగీకరించే వాళ్ళమా? విధి విచిత్రం. ఆ భగవంతుడి లాటి ఘటనలు ఎలా కూర్చునో అనిపిస్తుంది. నేను నీకంటే ప్రౌఢనా? కాను గదా! నాకు రాత్రి ఆ సుభద్రుని అకార విలాసాలు ఎంతో అపురూపంగా తోచాయి. వాట్ని అనుసరించి మదనుడు నా హృదయాన్ని మెత్తగా చీల్చాడు. నేనైతే అతనితో నా కోరిక కూడా వెల్లడించేశాను. అయితే- ఆయనే మన్నాడో తెలుసా? ఎంత ధైర్యవంతుడో-ఎంత గాంభీర్యం కలవాడో చూడు! నా గుర్వాజ్ఞ లేకుండా నేనే కార్యం చేయనుగాక చేయనని నన్నే సిగ్గుపడేలా చేశాడు. ఇందుకు నువ్వేమంటావో అని నేను భయపడుతున్నాను" అంది.

అంతలో తలుపు చప్పుడు కావడం, రాజపత్ని వచ్చిందని తెలియడం ఒక్కసారే జరిగాయి. వారు సంభాషణ ఆపి తలుపు తీశారు. ఆమె వారిని తీసుకువెళ్ళి ఇష్టాహారాలతో సంతృప్తి పరచింది. ఆమెకు అదేమి ముచ్చటోగాని, కొత్త దంపతులకు జరిపినట్లు మూడు నిద్రలు చేయించనిదే వదిలింది కాదు. అలా మూడు రాత్రులు గడిచాక నాల్గోనాటి ఉదయం మంగమణి "నిన్న రాత్రి ఎంత ఆపుకుందామనుకున్నా, సారథిని లెక్కచెయ్యని గుర్రాల్లా మనస్సనే రధాన్ని ఇంద్రియాలు అనే గుర్రాలు లాగేశాయి. ఛ! మన్మధుని లాంటి చపలుడు ఎక్కడా లేడే. చెలీ! నా నియమాలన్నీ నీట్లో కలిశాయి. అన్నన్నా! ఎంత మోసం! రామకవి లాంటి చతురుడు ఈ భూమిలో లేడంటే నమ్ము! మహానేర్పరి. గొప్ప రసికుడు. మేటి గంభీరుడుకూడ. రతి రహస్యాలు చక్కగా ఎరిగిన వాడు. ఈ విషయంలో అతడినే ముందు పేర్కొనాలి. ఈ భూమ్మీద ఇంగిత జ్ఞానంలో ఇతరుల హృదయాన్నెరిగి ప్రవర్తించడంలో అతనికంటే అధికుడింకొకడుండరు. నా ఈ ప్రౌఢత్వం అతని దగ్గర గవ్వకైనా చెల్లలేదు..." అని ఒక్కసారి ఆగి "నేనెంత ఆతృతగా ఉన్నా, అతడు తన మనస్సు చాలా గుట్టుగా దాచి, మనోనిగ్రహంలో నాకంటే అతడే అధికుడనిపించుకున్నాడు. నాకు ఈ అవకాశం చేజారిపోతే ఇక రాదని తొందర చేసిన మనస్సులో అలజడులు సుడి తిరిగాయి. వరమాలికలు

కొన్ని అతడు శయ్యపై పడేయగా 'ఆర్యా! ఇవి మీ కంఠాన్ని అలంకరిస్తేనే బాగుంటాయి. తీయడం దేనికి?' అని తిరిగి నేను ఆయన మెడలో వేస్తూ అతడెంత చతురుడో చూడు! వాట్ని అలాగే తీసి నా మెడలో వేస్తూ "పుష్పహారాలు దాల్చడానికి యువతులే అర్హులు సుమా బాలా!" అన్నాడు. నేను కావాలనే 'వద్దొద్దంటూ' పెనుగులాడబోతే, నా దేహంలో ఎక్కడ- ఏ కళాస్థానంలో స్పృశిస్తే నా శరీరం వశం తప్పుతుందో సరిగ్గా గురిచూసి అదే స్థానాన్ని ఎప్పుడు ఎలా మీటాడో?! నేను వివశురాలినైపోయాను. ఆహా! ఆ సుఖం-ఆ పారవశ్యం అనుభవించాలేగాని చెప్పడానికి సాధ్యం కానిది. రతిలోని సకల రహస్యాలు తెలిసిన గొప్ప రతి కళావేత్తకే అలాటి మర్మస్థానాలు తెలుస్తాయి. అతడంతగా నన్ను వశం తప్పించాడా! తాను మాత్రం ఏమీ ఎరగని వాడిలా ఉండిపోయాడు. ఇవన్నీ తెలిసే చేశాడని నా అనుమానం. నేనే సిగ్గుపడి నా గదిలోకి వెళ్ళిపోయాను. నువ్వేమంటావు?" అని ప్రియంవదతో అంది.

"అబ్బో! వాళ్లా ఎరుగని వాళ్ళు? అమాయకులమైనది మనమేనే! ఇది గురుశిష్యులిద్దరూ కలిసి ఆడుతున్న నాటకం. నా స్థితి కూడా నీకు లాగానే ఉంది. మొదట అతడ్ని పట్టించుకోకూడదనుకుంటాను. అదేమిటో అతడ్ని చూడ్డంతోనే అంతా మర్చిపోతాను.... ఇంతా జేసి వ్రతం చెడినా ఫలం దక్కిందా అంటే అదీ లేదు. రంభ అయినా వలచి వస్తే 'కాదు' అనే పురుష లక్షణం అలాటిది. రాత్రంతా ఎంత ప్రయత్నించినా నేను అతడికి వలపు రగిలించ లేకపోయాను. వాళ్ల ముఖాలు చూడటానికే సిగ్గుగా వుంది. మూడు రాత్రుల ముచ్చటా అయిపోయింది. గనుక ఇక మనదారిన మనం పోవడం మంచిది" అంది ప్రియంవద.

"అరరే! ఎంత మోసపోయాం? అయినా- వాళ్ళని నిందించడం దేనికీ? మనని మనమే మర్చిపోయి మోహావేశితుల మయ్యాం! ఇంకా నయం! వాళ్ళే ఉద్ధరించిన వాళ్ళయ్యారు. చాల్బాలు! పురుష సాంగత్యం వద్దులే! ఈ విషయం విన్నావా? ఢిల్లీ చక్రవర్తి దగ్గర విజయవర్మ అనే మంత్రి ఉన్నాడట! అతడు ఈ మహారాణి సుశీలకు సోదరుడట! మనం పరిచయపత్రం ఈవిడ ద్వారా సంపాదించుకుంటే, అక్కడ కొలువుకూటంలోకి మనం

9

కావలసినపుడు వెళ్లడానికి సహాయకారిగా ఉంటుంది" అని, మహారాణితో పరిచయపత్రం రాయించుకుని, రామలింగనికీ-సుభద్రునికీ తెలీకుండా, ఆ రాత్రే తమ బండిలో ప్రయాణమై పోయారు ఆ జవరాళ్ళు.

రామలింగకవి కూడా తమకు రాజపత్ని ఇచ్చిన వాటిలో ఇవ్వదగినవన్నీ ఆ ఊరిలోని బ్రాహ్మణులకు పంచిపెట్టి మళ్ళీ ప్రయాణం సాగించాడు. దారిలో ఎన్నో గ్రామాల్లో అక్కడక్కడ గర్వాంధుల్ని పరాభవిస్తూ కొన్నాళ్ళకు ఢిల్లీ చేరుకున్నాడు.

ముందుగా ఢిల్లీ వెళ్ళిన మంగమణి, ప్రియంవద మలిన వస్త్రాలు ధరించి, చూసేవారికి, రోత పుట్టే రీతి వస్త్రధారణ అది. అలాగే ఒక సత్రంలో బస చేశారు. అక్కడ కారణమేమిటో తెలియరాక, ఊరకే విచారిస్తూ కూర్చున్న ఒక ముసలిదాన్ని చూశారు. ఆ నాటి సాయంకాలం మంగమణి ఆమె చెంత చేరి "అవ్వా! పొద్దుట్నుంచీ చూస్తున్నాను. అలా దుఃఖిస్తున్నావు. నిన్ను ఓదార్చే వాళ్లెవరూ కనిపించరేం?" అని అడిగింది. అప్పుడా జరఠ (వృద్ధురాలు) ఇలా అంది......

అవ్వకథ

"అమ్మాయీ! నాదొక చిత్రమైన కథ. నన్ను భగవంతుడే ఓదార్చాలి తప్ప మనుషుల వల్ల కాదు. మా ఊరు అంబాపురం. నేనొకనాడు ఊళ్ళో తిరుగుతూ ఒక పురుషుని చూసి, అతని ఆకార గౌరవాదులను చూసి, అతడు దాత అనుకున్నాను. అతని వద్దకు వెళ్ళాను. అతడూ నన్ను పలకరించి "అవ్వా! నువ్విక్కడకు దేనికి వచ్చావు?" అని అడిగాడు.

"నేనొక పేద ముత్తయిదువని! నాకు చాలా మంది పిల్లలున్నారు. భర్త సంపాదన చేయగల సమర్థత లేనంత శతవృద్ధుడు, దారిద్ర్య బాధ అధికం. మీ వంటి పుణ్యాత్ములు ఏదైనా ఇస్తేనే రోజు గడుస్తుంది. లేకపోతే ఆ పూటకికి మాకు ఉపవాసమే!" అంటూ చాలా దీనంగా అడిగాను.

అతనికి హృదయంలో జాలి కలిగి 'శివ శివా' అని చెవులు మూసుకుని, నాకేదో ఇవ్వడానికి ఎవరినో అడిగాడు. అతడు నా గురించి పడుతున్న ఆవేదన చూసి, నాకు విరోధి అయిన బ్రాహ్మణుడొకడు "అయ్యా! ఈమె విషయమై మీరు అంతగా బాధపడక్కర్లేదు. దీనికి సంతానం లేదు. వేలకొద్దీ డబ్బు మూల్గుతోంది. నిత్యపేరంటం తిరుగుతూ క్రొత్త వాళ్ళు కనిపిస్తే చాలు! తనకేమీ లేదని అబద్ధాలు ఆడుతుంది" అంటూ నా గురించి లేనిపోనివి చెప్పాడు.

అప్పుడతడు "నీకు మంచి చీర కొనిపెడతాను. నాతో అంగడికి రా!" అన్నాడు. నేను దురాశకొద్దీ అతని వెంట వెళ్ళాను. "నీకు తెలిసిన మంచి దుకాణం ఏదైనా వుందా?" అని అతడు నన్ను అడిగాడు. నాకు పరిచయం ఉన్న ఒక బట్టల దుకాణం దగ్గరకు తీసుకెళ్ళాను. అప్పుడక్కడ అతడొక విలువగల చీరను దుకాణదారు నిమ్మన్నాడు. ఆ వర్తకుడొక చీర తీసి చూపించగా "అవ్వా! నీ కిది నచ్చిందా? లేక పోతే ఇంకొకటి ఎంచుకో? ధర గురించి సందేహించకు" అన్నాడు ఆ క్రొత్త వ్యక్తి. నేను అంతకంటే విలువైన చీరను ఎంచుకున్నాను. "ఇది నీకు చాలా?" అని మళ్ళీ అడిగాడు. నేను ఇంకో చీర ఏరుకున్నాను.

"అయ్యా! సామాన్యమైన చీరలే ఏరుకుంటున్నావు. ఈ దుకాణంలో విలువైన చీరలే లేవా? నా శక్తి నీకు తెలీదు. భయపడకు. నీ ఇష్టం వచ్చిన చీర తీసుకో! ఇస్తానని" అన్నాడు. చివరికి ఒక కాశీ జరీ పట్టు అంచుగల్గిన చీర తీసి చూపించాను. దాని వెల అడిగితే దుకాణదారు వేయి మాటలన్నాడు. అతడు పెదవి విరిచాడు. "అయ్యో! ఇంతకంటే పెద్ద చీర ఉంటే చూపించు" అన్నాడు. నాకు మంచి సమయం వచ్చింది అనుకుంటూ నేను వర్తకుని బ్రతిమిలాడినా, తన దగ్గర అంతకన్నా పెద్ద చీర లేదని స్పష్టంగా చెప్పాడు.

అందుకు నేను చాలా విచారించి "అయ్యా! నా దురదృష్టానికి మీరేం చేస్తారు? ఇంతకంటే గొప్ప చీర అతని దగ్గర లేదట! ఈ ఖరీదు గల చీర నాకు ఒక్కదానికి ఇచ్చే కంటే, ఆ వెల పెట్టి ఆ మా ఇంట్లో ఉన్న వాళ్ళందరికీ వస్త్రాలు కొనివ్వండి! మీ దయ వల్ల చాలా కాలం సుఖపడతాం!" అన్నాను.

సరేనని "ఈ చీర నా భార్యకూ నచ్చాలి కదా! ఇది కాకుండా ఇంకా ఏదైనా ఇమ్మంటుందేమో! మా బస ఇందాక నువ్వు చూసినదే! క్షణంలో వచ్చేస్తాను" అంటే "సరే! వేగంగా రండి" అన్నాను.

అప్పుడతడు ఆ వర్తకునితో "నేనీ చీరను మా ఆడాళ్ళకు చూపించొస్తాను. అంతవరకూ ఈ అవ్వ తాకట్లుగా ఉంటుంది. మా నివాసం ఇక్కడికి దగ్గరే" అన్నాడు.

వర్తకుడు నన్ను చూసి "ఏమమ్మా! నువ్వు ఇతన్ని ఎరుగుదువా?" అని అడిగాడు. "అయ్యో! ఎంత వాడనుకొన్నావు? ఈయన్ని లోకమంతా ఎరుగును. నీ సొమ్ముకేమీ భయం లేదు. నేను హామీ" అని చెప్పి నా చేతులారా ఆ దొంగని పంపించిన దాన్నయ్యాను. తర్వాత అతడు మా కుటుంబానికి ఇస్తానన్న చీరలు- జామారులు ఏరి మూట కట్టించాను. అతడికోసం ఎదురు చూస్తున్నాను. ఎక్కడ- అతని జాడేదీ? కళ్ళు చిల్లులు పడేలా సాయంకాలం దాకా చూశాను. అప్పుడు భయపడుతూనే "నేను అతడ్ని తీసుకొస్తాను. నన్ను వెళ్ళనివ్వండి" అని ఆ దుకాణదారుని అడిగాను. అయితే, వర్తకుడు నన్ను కదలనివ్వలేదు ఏం చెయ్యను?

"వాడెవడో నేనెరుగను? వీధిలో కనబడి చీరలిస్తా! రమ్మని చెప్తే వచ్చాను. ఇంత మోసగాడని తెలీదు. నన్ను నట్టేట్లో దించాడు. ఏం చేస్తాను? నన్ను పోనివ్వు! ఊరంతా వెతికి వాడ్ని తీసుకొస్తాను" అని ఎన్నో విధాలుగా వేడుకున్నాను.

"దురాశా పరురాలివి. నీకు ఇలాటి శాస్తి జరగాల్సిందే! నేను అడిగితే, అతడు జగమంతటికీ తెలిసిన వాడన్నావు. నాకు రావలసింది నీ కొంప అమ్మించి అయినా పుచ్చుకుంటాను" అని నన్ను తిడుతూ నా వెంట కొందరు మనుషుల్ని పంపాడు.

వాళ్ళూ నేనూ కలిసి ఊరంతా వెతికాం! కాని అతడు కనబడలేదు. అప్పుడు నేను ఆ వర్తకుని దగ్గరకు వెళ్ళి "తెలీక మోసపోయాను. దీనురాల్ని ముష్టిముండని, నన్ను వదిలిపెట్టు" అంటూ ఎంత బ్రతిమాలినా అతడు

దయతలచక, చక్రవర్తి దగ్గర తగువు పెట్టాడు. ఆ తగవు నిమిత్తమే నేను వచ్చాను. చక్రవర్తి పుణ్యాత్ముడు. ఏం చేస్తాడో మరి? నేను తిన్నది కాదు- కుడిచింది కాదు. వీధిలో పోతూంటే మీదను పడింది. అంటూ అవ్వ మళ్ళీ ఏడుపు ప్రారంభించింది. ఆ అవ్వ మాటలు విన్న మంగమణి, ప్రియంవద లోలోపల నవ్వుకొని, "లోభుల డబ్బు ఇలాగే పోతుంది. అతడెవడోగాని మహా చతురుడు. మన రామకవేనేమో!" అని తల్చుకొని ఆ అవ్వని మాటల్తో ఓదార్చారు.

సుప్రభ కథ

మంగమణి- ప్రియంవదలు రహస్యంగా విజయవర్మ భార్య అయిన సుప్రభకు తమ కథ వినిపించాలని అవకాశం కోసం ఎదురు చూస్తుండగానే పదిరోజులు గడిచిపోయాయి. ఒక పండుగ రోజున ఆమె దేవాలయానికి వెళ్తోందని తెలిసి, ఆమెను ప్రచ్ఛన్నంగా దైవదర్శనమైన తర్వాత కలుసుకొని సుశీల రాసిచ్చిన పరిచయ పత్రం ఆమెకు అందజేశారు. "అక్కా! ఈ కాంతలు రూప విద్యా మిసాల్లో ఉత్తమురాళ్ళు. నాకు పుత్రికల వంటివారు. కనుక వీరిని గౌరవించేలా నీ భర్తకు చెప్పవలసిందని ఈ ఉత్తరం రాశాను. ఈ ముద్దు చెల్లించగలవు" అని ఉందా ఉత్తరంలో.

ఉత్తరం ముమ్మారు చదువుకున్న సుప్రభ వారిని ఆదరించి, తనతోపాటు రాచనగరుకు తీసుకువెళ్ళింది. చూడ్డానికి సామాన్యంగానే కనిపిస్తున్న వీరిపై నా చెల్లెలికి అంత అభిమానం ఎందుకు కలిగిందో అనుకుంటూ వుండగా రెండు మూడు రోజులు గడిచిపోయాయి.

ఓ రోజు సాయంత్రం వేళ సుప్రభ, మంగమణి- ప్రియంవదలను తన అంతఃపురంలోనికి రప్పించి, కూర్చోబెట్టి వారి వివరాలు అడిగినపుడు, కొంత పరిచయమయ్యాక తాము వచ్చిన పని చెప్పడం బాగుండునని లౌక్యమెరిగిన మంగమణి నిశ్చయించుకుంది. సుప్రభను మంచి చేసుకుని, ఆమెకు సంతానం ఉన్నదీ- లేనిదీ తెలుసుకుంది. ఆమె తనకు సంతానం లేదని కన్నీరు పెట్టుకోగా, కారణమడిగింది మంగమణి. నా వంటి దురదృష్టవంతురాలు ఎక్కడా వుండదు. ఎందుకంటే.. " అంటూ తన కథ చెప్పసాగింది సుప్రభ.

సుప్రభ కథ

సుప్రభ చెప్పిన రీతి ఇది.... "నావంటి దురదృష్టవంతురాలు ఎక్కడా ఉండదు. ఇరవయ్యేళ్ళ క్రితం ఒక ఆడపిల్ల పుట్టింది. దానికి ఏడాది వయస్సుండగా మేము సకుటుంబంగా కాశీ వెళ్ళాం! ఆ సమయంలో గంగా నది ఆకాశమంత ఎత్తుగా పొంగి ప్రవహిస్తోంది. మాకు గంగ పూజ చెయ్యాలని ఉత్సాహం కలిగింది. మారేడు పత్రి, తులసీదళాలు, ఎన్నో రకాల పుష్పాలు, ఎర్రతామరలూ వేలకు వేలు పూజ నిమిత్తం తెప్పించాడు నా భర్త.

తరువాత ఒక ఓడమీద నేనూ, నా భర్త, నా బిడ్డా, నాగమణి అనే దాసి, కొందరు బ్రాహ్మణులు ఒక ఓడమీద ఎక్కాము. నావికులా ఓడని ప్రవాహానికి ఎదురుగా నడిపించసాగారు. బ్రాహ్మణులు గంగా సహస్రనామాలు చదువుతుండగా నేను- నా భర్త బంగారు పళ్ళెంలోని పుష్పాలను అత్యంత భక్తి పూర్వకంగా గంగానదీమతల్లి పూజ చెయ్యసాగారు. నాగమణి మా బిడ్డను ఎత్తుకొని మాకు దగ్గరగా నిలబడగా మేము పూజ చేస్తుండడం చూసిన మా బిడ్డ తాను కూడా బుట్టలో నుంచి పువ్వులను అందుకుని నదిలో వెయ్యసాగింది. మా పాపాయి అలా పూజ చేస్తుంటే మాకు ఎంతో ముద్దుగా అనిపించింది. మాకు ఒక వేడుకైనట్టి ఆ పని మానమని మేమూ చెప్పలేకపోయాం! ఇంతలో మా దాసి బిడ్డ చేతికి పువ్వులిచ్చి 'వేయమ్మా' అంటూ నీటి వైపు వంగేసరికి బిడ్డ ఆమె చెయ్యి జారి నీట్లో పడిపోయింది. బిడ్డను రక్షించడానికి నాగమణి నీట్లోకి ఉరికింది. ప్రవాహం వడి అధికంగా ఉండడంతో ఆ ఇద్దరూ కొట్టుకొనిపోయారు. ఇదంతా తృటిలో జరిగిపోయింది. అంతా గొల్లుమన్నాం! ఏమీ కనబడలేదు మాకు. అంతే! నాకు జీవాత్మ నశించిపోయిందప్పుడే! గంగలో పడదామని నా ప్రయత్నం. అది గుర్తించిన నా వాళ్ళు నన్ను కదలనివ్వక గట్టిగా పట్టేసుకున్నారు. తర్వాత వాళ్ల కోసం మేం చెయ్యని ప్రయత్నమంటూ లేదు. అయినా వాళ్ళ జాడైనా దొరికింది కాదు.

మా పాప అందం ఏం చెప్పమంటావు? నాది ఎంత నిర్భాగ్య జీవితం కాకపోతే, అంత ముద్దుల మూటగట్టే అంద చందాల పిల్లని పోగొట్టుకుంటాను? నా నిర్భాగ్యానికి నేను వగచకుండా ఉన్న రోజు లేదు. దాన్ని ఎంత స్మరించుకుంటేనేం లాభం? అదలా ఉంచండి! మీరు వచ్చిన పనేమిటో చెప్పండి" అంది. వాళ్ళు ఇలా మాట్లాడుకుంటూన్న తరుణంలో విజయవర్మ కొంచెం వయసు మళ్ళిన ఒక స్త్రీని వెంటబెట్టుకుని సరాసరి అంతఃపురంలోకి వచ్చేశాడు. అతడు రావడం చూసి మంగమణి-ప్రియంవదలు లోపలికి పోయారు. విజయవర్మ భార్యని చూస్తూ "ఇదెవరో తెలుసా?" అని అడిగాడు. సుభద్ర పరికించి చూసి "అయ్యో! ఇది మన నాగమణి కాదా? ఎలా వచ్చావే? బతికున్నావటే? నా ముద్దుల కూతురేదీ?" అంటూ ఆ దాసిని ఆనందంగా కౌగలించుకుంది. అది "అంతా సురక్షితంగానే ఉన్నాం! విచారించవద్దు. మీ కూతురు సజీవంగానే ఉంది. దైవ కృపవల్ల మీ దగ్గరకు రాగలదు" అని అమృత వర్షం కురిపించేలా పలికేసరికి, అక్కడ సంతోషం వెల్లివిరిసింది. పట్టరాని ఆనందంతో సుప్రభ "ఏమి? నా బిడ్డ బతికి ఉందా? నిజమా? పసిపాప ఇప్పటికి పెద్దది కావాలి గదా! నన్ను గుర్తుపడుతుందంటావా? ఎక్కడుంది? తీసుకొచ్చావు కావేం? మా దగ్గరికి రానందా? దయలేని వాళ్లమని నిందిస్తోందా? నీ వృత్తాంతమంతా సవిస్తరంగా చెప్పు! ఇన్నాళ్ళెక్కడున్నావ్? ఏ ఏ దేశాలు తిరిగావ్?" అని అడగ్గా ఆ నాగమణి ఇలా అంది....

నాగమణి కథ

"అమ్మా! నా వృత్తాంతం భారతమంత ఉంది. అందువల్ల సంక్షిప్తంగా చెప్తాను. వినండి! ఆ నాడు మీరంతా నోటమాటరాక మ్రాన్పడి చేష్టలుదక్కి చూస్తుండగా శిశువును పట్టుకోవడానికి నేను నీట్లో దుమికాను కదా! పడగానే బిడ్డ నా చేతికైతే వచ్చింది గాని అంతలోనే ఒక సుడిగుండం వచ్చి మమ్మల్నిద్దర్నీ ముంచేసి దూరంగా తేల్చింది.

అప్పుడు దైవవశాత్తూ ఒక కర్ర నా చేతికి దొరికింది. దాన్ని ఊతంగా పట్టుకుని, ఒక చేత్తో బిడ్డను మునిగిపోకుండా పట్టుకుని నీటిమీద తేలసాగాను. ఆ ప్రవాహ వేగానికి నిముషంలో మరో పట్నపు ప్రాంతానికి వెళ్ళాను.

గంగా ప్రవాహంలో కొట్టుకుని వచ్చే కట్టెల కోసం నదిలో ఈదుతున్న ఒక పల్లెవాడు మమ్మల్ని సమీపించాడు. నేను "రక్షించు" అంటూ అరిచాను. వాడు వేగంగా మా దగ్గరకు ఈదుకుంటూ వచ్చాడు. నా చేతిలోని బిడ్డను మెల్లగా తీసుకుని తెప్పలో ఉంచి, నన్ను కూడా అందులోకి ఎక్కించాలని ప్రయత్నించాడు.

అయితే- అంతలోనే ఇంకొక సుడి వచ్చి, మా ఇద్దరినీ దూరంగా తోసేసింది. అతడు నా దగ్గరకు ఈదుకు రావాలని ఎంత ప్రయత్నం చేసినా వీలుపడలేదు. ప్రవాహవేగం అధికమైంది. బిడ్డ తెప్పమీద ఉండగా దాన్ని కాపాడుతూ ఈదడం అతడికి అసాధ్యమైపోయింది. అతడు నన్ను వదిలి వేగంగా ఈదుతూ పోయి నేను చూస్తుండగానే ఒడ్డు చేరుకున్నాడు. అది చూసి నేను ఎంతో సంతోషించాను. పిల్లదాన్ని రక్షించినందుకు దేవుడికి దండాలు పెట్టుకున్నాను.

నాకు దొరికిన కర్రను ఊతంగా చేసుకుని, నేను ప్రవాహంలో కొట్టుకు పోసాగాను. సాయంకాలం అయింది. ఎవరూ కనిపించలేదు. ఆ రాత్రంతా అలా ఈదుతూనే ఉన్నాను. తెల్లవారినా తీరం దొరకలేదు. శరీరం స్వాధీనం తప్పుతోంది. దేహం అంతా నీటిలో ఉంది. తేలుతూన్న కర్ర మీద నా రెండు చేతుల భారం ఉంచి అలా కొట్టుకుపోసాగాను. అది నిద్రో- మూర్ఛో తెలియని స్థితి నన్ను ఆవహించింది.

ఆ ప్రవాహంలో అలా ఎంత దూరం కొట్టుకుపోయానన్నదీ కూడా నాకు తెలియలేదు. నేను కళ్ళు తెరిచేసరికి ఒక పట్టణంలో ఉన్నాను. అదీ ఒక బ్రాహ్మణుని ఇంట్లో, అతడు అన్నరసం నా నోట్లో పోస్తుండగా తెలివి వచ్చింది. ఆ పుణ్యాత్ముని వల్లనే నేను జీవించాను.

అన్నసారం తగలడం వల్లనే నాకు స్పృహరాగా, అతడు తన ఇంటిలో నన్ను సంరక్షిస్తూ,నాలుగు రోజుల్లో మళ్ళీ మామూలు మనిషిని చేశాడు. నా నగలన్నీ కృతజ్ఞతగా అతనికిచ్చేశాను. నా వృత్తాంతం అంతా చెప్పి నా దేశానికి నన్ను తీసుకెళ్తే మంచి పారితోషికం కూడా ఇప్పించగలనని చెప్పాను. అతడు అంగీకరించాడు.

అంతలో విధివశాన అతనికేదో రోగం వచ్చి హఠాత్తుగా ప్రాణాలు వదిలేశాడు. పుణ్యాత్ములు చిరకాలం జీవించరు కదా! తండ్రిపోయిన దానిలా నేనతని కోసం విలపించాను. నేనా ఇంట అడుగుపెట్టిన వేళ బాగుండలేదో- నా పాదం మహాత్మ్యం ఏమోగాని ఆయన భార్య నన్ను ఇంటినుంచి వెళ్ళగొట్టింది. నా గ్రహచారం బాగులేనందున నేను ఎక్కడికి వెళ్ళినా కష్టాలు రాక మానవని తలచి, నా దేశానికి నేను వెళ్లడానికి సహాయం ఏదైనా దొరుకుతుందేమో చూద్దామని పట్టణమంతా తిరగసాగాను. ఆ పట్టణం పేరు కలిఘూతా నగరమట!

అలా తిరుగుతూన్న నేను సాయంకాలానికి ఒక దేవాలయానికి పోయాను. అక్కడ కన్నుల పండుగగా దీపాలు పెట్టారు. ఒకవైపు వేద మంత్రాలు చదువుతున్న పండితులు. ఇంకొకవైపు హరిభజనలు. నాకు చెవులకు అమృతంలా సోకాయి. చాలా పొద్దు పోయేంతవరకు అక్కడ ఉత్సవంలాగే ఉంది. ద్వీపాంతరం నుంచి ఎవరో రాజకుమారుడు వచ్చి స్వామి వారికి ఆ రోజు భోగం జరిపిస్తున్నట్లు తెలిసింది. ఆ ఉత్సవాన్ని చూస్తూ నేను నా దుఃఖం మరిచిపోయాను. రాత్రి రెండు ఝాముల దాకా అక్కడ సందడిగానే ఉండడం వల్ల నేను నిర్భయంగా దేవాలయంలో కాలక్షేపం చేశాను.

క్రమంగా ప్రజలు తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. తర్వాత అర్చకులు గుడికి తాళం వేసి ఆవరణలో ఉన్న వాళ్ళందర్నీ బైటకు పొమ్మన్నారు. అప్పుడు నేను ఆ గుడిచావడి అరుగు దాపున గల ఒక నదిలో చీకటిలో

బిక్కు బిక్కు మంటూ ఆ రేయి ఎలాగోలా తెల్లవారితే చాలుననుకుంటూ ఒక మూల కూర్చున్నాను.

అంతలో అక్కడికి ఒక స్త్రీ నెమ్మదిగా అడుగులేస్తూ వచ్చి, 'రామామణీ' అని పిలిచింది. తాను కోట గోడదాటటం ఎంత కష్టమైందో చెప్పింది. నేను అన్నిటికీ ఊ కొట్టసాగాను. ఆమె మాటలను బట్టి ఆమె నన్ను తన చెలి అనుకుంటోంది. ఆమె ఒక రాజ కుమారునితో ఏదో సంకేతం ఏర్పరచుకుని, ఎక్కడో కలుసుకోవాలనుకుందో ఏమో! అతడు బండి పంపుతానన్నాడట. నన్ను వెళ్ళి బండి వచ్చిందేమో చూసి రమ్మన్నది. అప్పుడే బండి అక్కడికొచ్చి నిలిచింది.

ఆ శబ్దం కోసమే ఎదురుచూస్తున్న దానిలా, ఆమె గబగబా నా చెయ్యి పుచ్చుకుని బండి దగ్గరకు లాక్కుపోయింది. నేను అక్కడ్నించి ఏదోలా బయటపడితే చాలుననుకున్నాను. గనుక నేనేమీ మాట్లాడకుండా ఎక్కేశాను. ఆమె కూడా ఎక్కాక తలుపులు బిగించారు.

బండివాడు దాన్ని చాలా వేగంగా నడిపిస్తూ, అతి స్వల్పకాలంలో సముద్రం వద్ద ఒక రేవుకు తీసుకెళ్ళాడు. బండి నిలవగానే ఒక పరిచారిక తలుపుతీసి రండి! రండి! అని పిలిచింది. మేము బండి దిగి దాని వెంటపోగా, అందు ఒక ఓడ సిద్ధంగా ఉంది. మమ్మల్ని ఆమె దానిలోకి తీసుకొనిపోయింది.

ఆ ఓడ చాలా విశాలంగా ఉంది. నలుమూలలా మనోహరమైన వస్తువులతో- గాజు దీపాలతో అలంకరించారు. రాజభవనం కంటే సుందరంగా ఉన్న ఒక గదిలో మమ్మల్ని ప్రవేశపెట్టి ఆ పరిచారిక వెళ్ళిపోయాక, ఆ దీపాల వెలుగులో "అయ్యో! రామామణి ఏదీ? బండిలో ఉండిపోయిందా? ఓడ బయల్దేరిపోతుందేమో? నిలపమను! "అంటూ గట్టువైపు చూడసాగింది.

అప్పుడు నేను నవ్వుతూ "రామామణి ఎవరు? నీతో వచ్చిందా?" అని అడిగాను. ఆమె ఆందోళనగా "అయ్యయ్యో! మా రామామణి ఓడదాకా నాతోనే వచ్చింది. ఇక్కడే ఎక్కడో దారితెలీక ఎటో పోయి ఉంటుంది. నీకు పుణ్యం ఉంటుంది గానీ- దాన్ని కాస్త పిలిచిపెట్టు" అని బ్రతిమాలింది.

"అయితే నీకేం తెలీదన్నమాట! నేనే నిన్ను మోసం చేశాను. దేవాలయం అరుగుమీద గదిలో ఉన్నది నేనే. రామామణి కాదు. నాపేరు నాగమణి. నీకు మీ రామామణి ఏయే పనులు చేస్తుందో అంతకంటే నేను ఎక్కువగానే చేస్తాను. నా వృత్తాంతం వింటానంటే చెబుతాను" అన్నాను.

ఆమె కొంతసేపు తెల్లబోయి, నన్ను పరిశీలనగా చూసి "నువ్వు ఎవరివి? ఆ గదిలోకి ఎలా వచ్చావు? నన్ను ఇలా మోసం చేయడం ధర్మమేనా?" అని అడిగింది.

"నేను నిన్నేమీ మోసం చెయ్యలేదు. నేను ఢిల్లీ చక్రవర్తిగారి మంత్రి అయిన విజయవర్మ భార్యకి సఖురాలిని. నా పేరు నాగమణి" అంటూ నా వృత్తాంతమంతా పూసగుచ్చినట్లు ఆమెకు చెప్పి "నువ్వేమీ విచారించకు! నన్నే రామామణిగా భావించుకో! ప్రాణంపోయినా నీ మాట జవదాటను. దేవుడు నాకు విదేశీయానం నా నొసట రాయబట్టి నాకు అలాటి బుద్ధి పుట్టిందేమో! నా మాట నమ్ము! నువ్వు ఏ దేశ రాజకుమార్తెవు? నీ పేరేమిటి? నువ్వు ఇప్పుడు ఎవరిని వరించి ఇలా వెళ్తున్నావు" అని అడిగాడు.

ఆమె ఆశ్చర్యంగా చూసి "నువ్వు చెప్పింది నిజమేనా? ఏం దైవఘటన? విజయవర్మ భార్య సుప్రభ నాకు పెదతల్లి అవుతుంది. అయ్యో! ఆమెకెంత ఆపద వచ్చింది? లేక లేక కలిగిన పిల్ల గంగలో పడిందా?.... బతికి ఉన్నట్లు వారికి తెలుసో? తెలీదో! ఏదైనాగానీ విధి విలాసం అద్భుతం. కానీ నీకూ- నాకూ బాంధవ్యం ఉంది. నిన్ను నా ప్రాణసఖిగా తలచి నీకు నా వృత్తాంతం చెబుతున్నాను. విను!" అని తన కథ చెప్పసాగింది.

కల్పవల్లి కథ

"నా పేరు కల్పవల్లి. మా అమ్మ సునంద. ఈ పట్నం రాజు సింధువర్మ. నేను అతని పుత్రికను. కొన్నాళ్ళ క్రితం జరిగిన విషయంతో ప్రారంభిస్తాను. ఆ రోజు సాయంత్రం నేను జలకమాడి అలంకరించుకుని, కురులు ఆరబెట్టుకోవాలని మేడమీదకి వెళ్ళాను. మేడపై అటూ ఇటూ తిరుగుతూ ఆ చల్లగాలికి ఒళ్ళు పులకరిస్తుండగా, నాకు ఏదో చెప్పరాని ఆనందానుభూతి కల్గింది.

అప్పుడు నేనేమీ తోచక, పురవిశేషాలు చూద్దామని, వేడుకకొద్దీ ఆ మేడ మీద నుంచి క్రింద వీధిలోకి తొంగిచూశాను.

అప్పుడు- మన్మథుడో, జయంతుడో, వసంతుడో లేక వారి కంటే అందగాడో ఒక రాకుమారుడు ఆ వీధిలోంచి పోతూ నన్నాకర్షించాడు. ఇంతకు మునుపే నేను నాకు కలిగినట్లు చెప్పిన అపురూపమైన హాయి, అతడ్ని చూడగానే మదన వికారంగా మారి, విచ్చలవిడి పిచ్చిచేష్టలు చేయడానికి పురిగొల్పింది.

నేను ఏమీ తోచక ఇన్ని మల్లెలు తీసుకుని ఆ మదనుడి మీద జల్లాను. అదేం సాహసమో నాకే తెలీదు. తన పైన పూలు పడేసరికి ఆ అందగాడు తలపైకెత్తి చూశాడు. నేనూ అతడ్ని చూస్తూండడం చేత మా ఇద్దరి చూపులూ ఒక చోట కలుసుకున్నాయి. అప్పుడా వీధిలో ఇతరులెవరూ వెళ్తుండకపోవడం వల్ల మాకు ఒకరి అభిప్రాయం ఒకరు తెలుసుకోడానికి సావకాశం ఏర్పడింది. అప్పుడు నేను అతని రసికత్వం ఎలాంటిదో చూడాలని, పూలబంతిలో ఒక శ్లోకాన్ని ఇమిడ్చి, అది అతనికి అందేలా దిగవిడిచాను. అతడు దానికి జవాబుగా నేను చూస్తుండగానే ఒక చీటి రాసి, తన చేతిలోని పావురం ముక్కుకు తగిలించాడు. అది రివ్వున ఎగుర్తూ వచ్చి ఉత్తరాన్ని నా ముందు వదిలింది.

అతడు నా లేఖకు తగినట్లే జవాబు పంపాడు. దాంతో అతనికి నాపట్ల కలిగిన అభిప్రాయమేమిటో తెలిసింది. అప్పుడు నేను "అయ్యా! మీ కుల,

శీల, దేశ, నామధేయాలు తెలియవు. అయినప్పటికీ మీ రూపం చూసి పరవశురాల్ని అయ్యాను" అని అతని అభీష్టం తీర్చేదారి నాకు తెలీకుండా ఉన్నదన్న అభిప్రాయం వ్యక్తం చేశాను. మళ్ళీ పావురమే ప్రత్యుత్తరం తెచ్చింది.

"నేను సింహళ ద్వీపప్రభువైన సింహకేతుడనే రాజకుమారుడ్ని! నా పేరు మకరందుడు. నేనీ దేశం చూడ్డానికి పదిరోజుల క్రితమే వచ్చాను. నాలుగు రోజుల్లో మా దేశం తిరిగి వెళ్ళనున్నాను. నీకు ఇష్టమైతే, నా వెంట తీసుకుని వెళ్ళి నీ కోరికలు తీరుస్తాను. దీనికి చింతించనక్కర్లేదు. క్షత్రియులకు గంధర్వ వివాహం శాస్త్రం సమ్మతిస్తుంది. నీ ఆప్త బంధువులందర్ని విడనాడి నాతో రమ్మని రాయడానికి నాకు చేతులు ఆడడం లేదు. నీకు ఏది అంగీకారమో తెలిపితే, అలా చేయగలను. రేపు శుక్రవారం మాత్రం నేను ప్రయాణమై తీరవలసిందే!" అని రాసి ఉంది అందులో.

ఆ ఉత్తరం చదివి, అతని వెంట వెళ్ళడానికి నా సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాసిన లేఖ ఆ పావురానికిచ్చి పంపేశాను. నా మనస్సులో ఎటువంటి సాహసం పుట్టిందో చూడు! యవ్వనం పిశాచం లాంటిది కదా! అటువంటి ఉత్తరం రాశాక, బంధువుల్ని తల్చుకుని వారి వియోగానికి చింతించి గుండె ఝల్లుమనడంతో ఏమీ తోచక తొట్రుపాటు పడుతున్న సమయంలో నా ప్రాణసఖి రామామణి వచ్చిందక్కడికి. నేను కళ తప్పినట్లుండడానికి కారణం ఏమిటని అడిగింది. దాంతో నిజం చెప్పడానికి నేను కొంత సేపు సందేహించాను గాని, దాని లాలన వల్ల చెప్పకుండా ఉండలేకపోయాను. జరిగిన కథంతా చెప్పి ఆ ఉత్తరాలన్నీ దాని చేతికిచ్చాను. అప్పుడది ముక్కుమీద వ్రేలుంచుకుని- "ఏమిటేమిటి? నువ్వు ఇంత సాహసానికి పూనుకుంటావా? నాతో నైనా చెప్పవద్దా? నీ తల్లి అనురాగం ఎలా త్రోసివేసి వెళ్ళిపోదామనుకున్నావు? నిన్నొక్కరోజైనా చూడకుండా ఉండలేని నీ తండ్రికి ఏది దిక్కు? అయ్యో! చెలికత్తెలమైన మా మాట చెప్పడం ఎందుకులే? నువ్వు కోరాలేగాని, ఆ రాజకుమారుడ్ని ఇక్కడే ఉండేలా చెయ్యకపోదునా? కాదంటే అతన్ని మించిన గొప్పవాడిని ఇంకొకడ్ని తెస్తాం! అంతేకాని ఇలా

చేస్తావా? నీ అభిప్రాయాన్ని మార్చుకున్నట్లు ఉత్తరం రాసి ఇవ్వు! నేను స్వయంగా తీసుకెళ్ళి అతనికిస్తాను" అంటూ రకరకాలుగా చెప్పి చూసింది. నేనేమీ అనకుండా తలవంచుకుని ఏడవసాగాను.

అప్పుడు రామామణి "సఖీ! నా మాటలు రుచించలేదా?" ఏదో లోక పరిపాటిననుసరించి చెప్పాను. అందుకు విచారం దేనికీ? మంచి చెడులు నువ్వే ఆలోచించుకో! ఉత్తరం ఏమన్నా ఇస్తే తీసుకెళ్ళి అతనికిస్తాను..." అంది.

"మాటలు ఎన్నయినా చెప్పవచ్చు! కానీ ఆ రాజకుమారుడ్ని చూస్తే నువ్వు అలా అనవు. అతడు మన సిరిసంపదలకు లోబడి ఉండేవాడనుకుంటున్నావేమో! అతడొక దీవికి ప్రభువట! అన్ని అతిశయగుణాలు ఇంకొకరిలో ఉండడం మనం చూడం! కనుక దీనికి నువ్వేమీ ఎదురు చెప్పకు. ఆడపిల్లకు బాల్యం తల్లిదండ్రుల దగ్గర గడవాలి.

యవ్వనం వచ్చేసరికి వాళ్ళూ దూరస్థులే! తల్లిదండ్రుల్ని విడిచి రుక్మిణీ దేవి శ్రీ కృష్ణుని వరించి వెళ్లలేదా? నువ్వొక్కదానివి నాతో వస్తానంటే నాకు అంతే చాలు! నాకు ఎలాటి కొరత ఉండదు. లే! ప్రయాణానికి సిద్ధంగా వుండు" అంటూ దాని మనసు మార్చాను. ఆమె కూడా నా మాట కొప్పుకొని ప్రయాణ సన్నాహాలు ప్రారంభించింది. రాత్రి బాగా పొద్దుపోయేవరకు నా దగ్గర ఉంది. దేవాలయం దగ్గర ఉండమని చెప్పాను. అది ముందుగా వెళ్లి ఆనుపానులన్నీ చూసుకొని వచ్చి తాను ఎక్కడ ఉండేదీ చెప్పింది. అనుకున్న వేళకి కోటగోడకు గొలుసు వేసి నేను దిగి బైటపడ్డాను. తరువాత జరిగింది నీకు తెలుసు! రామామణికి ఏదో అంతరాయం ఎదురైంది. లేకపోతే తాను రాకుండా ఉండదు. అయినప్పటికీ మానవ సంకల్పాలు అన్ని వేళలా నెరవేరాలని లేదు కదా! అయితే నా అదృష్టవశాత్తు దాని కంటే ఎక్కువగా భగవంతుడు నిన్ను నాకు సమకూర్చాడు. నువ్వు మంచి నేర్పరివనిపిస్తున్నది. అదీగాక మా పెదతల్లికి హితురాలివి. రాజకుమారునికీ- నాకు జరిగిన ప్రసంగం నువ్వు విన్నావు కదా! ఇకమీదట ఏం చెయ్యాలో నాకు తెలీదు. అది నువ్వే ఆలోచించు! నా జీవితం నీ ఆధీనంలో ఉంచుతున్నాను. అనాధనైన నన్ను రక్షించు" అంటూ పాదాల మీద పడింది.

అప్పుడు నేను చాలా ఆదరంగా దగ్గరకు తీసుకుని, భయంలేదని-ధైర్యం కలిగించే మాటలు చెప్పి ఆమెను ఓదార్చాను. మా మాటల్తోనే తెల్లవారిపోయిందా రేయి.

ఎటు చూసినా సముద్రం తప్ప ఇంకేమీ కనబడటం లేదు. ఓడ చాలా వేగంగా నడుస్తోంది. కాస్త పొద్దెక్కేసరికి పరిచారికలు మా గదిలోనికి ఆహారపదార్థాలను తెచ్చి ఉంచారు. ఆమెకు ప్రియమైన మాటలు చెబుతూ కల్పవల్లి చేత అవి తినిపించాను. నేను కూడా తిన్న తర్వాత ఆమె తన ప్రయాణం గురించే చెప్తూ ఆ రాజకుమారుడి మనస్సెలాంటిదో తెలుసుకు రమ్మన్నది.

సమయం చూసి పరిచారికల చేత నా రాక తెలియజేసి ఆయన వద్దకు వెళ్ళాను. ఆయన నాకు ఉచిత మర్యాదలన్నీ చేశాడు. నేను నమస్కరించి అతనితో చెప్పవలసిన మాటలు చెప్పి ఒప్పించాను. అతని వాగ్ధోరణిని బట్టి అతడు గొప్ప రసికుడే అని నాకూ తోచింది. రాజకుమార్తె దగ్గరకు తిరిగొచ్చి, అతని గురించి నా అభిప్రాయాన్ని చెప్పి ఆమెకు చాలా సంతోషం కలిగించాను. ఇంతలో సూర్యాస్తమయం అయింది. అంతకుముందే ఓడలోని ఒక గదిని అలంకరించి ఉంచారు. నేను రాజపుత్రికకు విచిత్రాలంకారాలెన్నో చేశాను. అప్పుడామె అచ్చం మోహినీ దేవతలాగానే ఉంది. అలంకరణ తర్వాత ఆమెలో ఇనుమడించిన అందచందాలు చూసి నేనే ఆశ్చర్యపోయాను. అందమైన వారిద్దర్నీ ఒకచోట జతకూర్చినందుకు ఆ భగవంతుని ప్రశంసించ ఉండలేకపోయాను. ఆమె చెయ్యి పుచ్చుకుని అతడున్న గదిలోకి తీసుకెళ్లి అతని పక్కన కూర్చోబెట్టి, కొంతసేపు వాళ్లిద్దరిచేత వినోద క్రీడలు జరిపించి, మెల్లగా నేను బైటికొచ్చి వారి గది తలుపు బిగించి నేను నా గదికొచ్చి నిద్రపోయాను. ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఒకరిలో ఒకరు ఐక్యమై మన్మధ సామ్రాజ్యాన్ని ఏలారు.

పదిరోజులు గడిచాయి. ఓడ సింహళద్వీపం రేవు చేరుకుంది. రాకుమారుడు మమ్మల్ని రహస్యంగా ఒక ఉద్యానవనంలో మేడమీదకు తీసుకెళ్ళి ఉంచి ప్రతిరోజూ వచ్చి వినోదించి వెళ్తూండేవాడు. అయితే అతడికి

అంతకుముందే రోలంబ అనే ఆమెతో పెళ్ళయింది. కొత్త వింత -పాత రోత అన్నట్లు మా రాకుమార్తెను చేరవచ్చి ఆమెపై ప్రేమ సన్నగిల్లేసరికి ఆమె అనుమానించిందో ఏమో! ఒకనాడు మకరందుడు మా ఉద్యానవనానికి వస్తుంటే, ఆమె అతన్ని అనుసరిస్తూ అక్కడక్కడ ఆగుతూ, మా నివాసాన్ని గుర్తుపెట్టుకుని వెళ్ళింది. మరునాడు మాటల సందర్భంలో, ఆమె సంగతిని మకరందునితో చెప్పగా అతడు "కల్పవల్లీ! కుశద్వీపంలో కొందరు రాజులు దెబ్బలాడుకొని చివరకు సంధి చేసుకుని, రెండు తెగలవారు మా తండ్రిగారు చెప్పినట్లు ఒక్కమాటమీద నడుచుకోవడానికి ఒడంబడిక రాసుకున్నారట! ఆ తగువులో తీర్పరులుగా మా తండ్రిగారికి నేను సహాయార్థం వెళ్ళక తప్పదు. ఇటీవల రోలంబనాతో మెలుగుతున్న తీరు- ఆ చుర చుర చూపులు- ఇప్పుడు మీరు చెబుతున్న దాన్ని బట్టి ఆమె తన అనుమానం ధృవపర్చుకోడానికే అయి వుంటుంది. అయితే నేం? మీకేం భయం లేదు. నేనొచ్చేవరకు ఓపిక పట్టండి. అంతా చక్కదిద్దుతాను" అన్నాడు.

"మీరు లేకుండా మేమిక్కడ ఉండలేం! మీతోపాటు మమ్ములనీ తీసుకువెళ్ళండి! నిన్న ఎరుకలసాని చెప్పిన దాని ప్రకారం నేను నెల తప్పాను" అని కల్పవల్లి అంది. "మా తండ్రిగారుండగా, మీరెలా రాగల్గుతారు. వేగం వచ్చేస్తాను" అంటూ మమ్మల్ని అంగీకరింపచేసి వెళ్ళాడు.

అతడు వెళ్ళిన కొద్ది రోజులకు రోలంబ ఉద్యానవన విశేషాలు చూసేదానిలా కొందరు పరిచారికల్ని వెంట బెట్టుకుని మా మేడ ఉన్న ఉద్యానవనంలోనికొచ్చి. మమ్మల్ని "ఎవరి ఆజ్ఞమీద ఇందులో దిగారు? ఆజ్ఞాపత్రికేదీ చూపించండి" అని అడిగింది. మేము ఏదో బొంకి తప్పించుకో జూడగా, తన అధికార దర్పం ఉపయోగించి, మమ్మల్ని చాలా తెలివిగా ద్వీపాంతరానికి పంపించింది. మేము ఒక దీవికి చేరుకున్నాం! ఇంతలో కల్పవల్లికి ప్రసవవేదన ప్రారంభం అయింది. నేను చాలా దైన్యంతో దైవాన్ని ప్రార్థించాను. ఆమె శుభలగ్నాన ఒక కుమార్తెను కన్నది. ఇంతలో ఒక ఓడ ఆ దీవికి ప్రతికూలపవనాలవల్ల కొట్టుకొచ్చింది. తీరా చూస్తే అందులోంచి దిగింది మకరందుడు.

కల్పవల్లి కథ

మేము అతని పాదాలపై పడి ఏడ్చాం! అతడు మమ్మల్ని ఓదార్చి జరిగినదంతా తెలుసుకున్నాడు. తన వృత్తాంతం ఇలా చెప్పాడు. 'కుశద్వీపం నుంచి వస్తూనే అతడు మా గురించి అడగ్గా అంతా కూడబలుక్కొని మేము జంబూద్వీపం వెళ్లిపోయామని చెప్పారట! చివరికి గూఢచారుల మధ్య ఏవో కలహాలు రేగి రోలంబ చేసిన కుట్ర వెల్లడించేశారట! భగవంతుని దయవల్ల అతడు మమ్మల్ని వెతుకుతూ ఎక్కిన ఓడ సరిగ్గా మా దీవి ఉన్న తీరాన్నే చేర్చిందట. అప్పటికప్పుడే, ప్రతికూల పవనాలున్నాగాని మమ్మల్ని బయలుదేరదీయించాడు మకరందుడు. ఇక మరొక్క గడియలో రేవు చేరుతాం అనుకొనేలోగా ఒక సుడిగాలి వచ్చి ఓడని ముంచేసింది. ఓడ మునిగే స్థితిలో నేను కల్పవల్లి కన్న శిశువును చంకలోపెట్టుకుని, పైకి ఎత్తి ఈదసాగాను. ఇంతలో దైవికంగా వచ్చిన ఒక పడవలో కాశీపట్నం బ్రాహ్మణుడైన విష్ణుశర్మ దంపతులు ఉండగా, నిర్భాగ్యురాలినైన నేను ఆ బాలికను ఎలా పెంచుకుంటానని భీతి చెంది- ముచ్చటపడుతున్నందున వారికి పెంపకానికి ఆ బాలికను ఇచ్చేశాను.

కాని నేను ఆశవదలక కల్పవల్లి-మకరందులకై వెతుకుతూ సముద్రతీర పట్టణాలన్నీ గాలించసాగాను. ఒకనాడు నేను కలిఘాత నగరానికి వెళ్ళాను. అక్కడైనా ఆమె గురించిన జాడ తెలుస్తుందేమోనని నా ఆశ. నా దురదృష్టం కొద్దీ రాజపుత్రి కల్పవల్లి ఏదో సందర్భంలో నాకు కానుకగా ఇచ్చిన కంఠాభరణం నా వద్ద ఉంటే దారి భత్యాల కోసం దాన్ని అక్కడ అమ్మజూపగా భటులు నన్ను పట్టుకున్నారు. నిజం వెల్లడి చేస్తే కల్పవల్లి దుశ్చరిత్ర (తనకు తానుగా ఒక ద్వీప రాకుమారునితో లేచిపోవడం) లోకానికి తెలియడం కంటే ఇంకే ప్రయోజనం ఉండదని నాకు అనిపించింది. నిజం కూడా అంతే! అందుకని అబద్ధం చెప్పడం- ఆ రాజు కారాగారంలో నన్ను 14 సం॥రాలు బందీని చెయ్యడం జరిగాయి.

ఇలా ఉండగా - ఓరోజు రాజభటులు నా సంకెళ్ళు ఊడదీయించి సగౌరవంగా రాజుగారి అంతఃపురానికి తీసుకెళ్తే అక్కడ నాకు ఆశ్చర్యం కల్గిస్తూ కల్పవల్లి కనిపించింది. ఓడమునిగిపోయినప్పటి నుంచి జరిగిన

సంగతులన్నీ చెప్పి, ఇంతకాలానికి తన తండ్రిని చూడాలనిపించి ఇటు వచ్చినట్లు; ఇక్కడ తన కంఠాభరణాన్ని అమ్మజూపిన స్త్రీ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు, ఆ మాట విని తాను ఆ స్త్రీ నాగమణే అయివుంటుందనుకున్నట్లు చెప్పింది.

ఆ ప్రకారం దైవానుగ్రహం వల్ల అందరం ఒకచోట చేరుకున్నాం అని సంతోషిస్తుంటే, మకరందుడు అక్కడకు వచ్చి నన్ను చూసి ఆశ్చర్యపడ్డాడు. అప్పుడు నేను ఓడ మునిగింది మొదలు ఆనాటి వరకు జరిగిన విశేషాలు చెప్పాను. నా మాటలు విని వాళ్ళు ఆ పాపను చూడాలని అప్పటికప్పుడే కాశీకి వెళ్ళాలని సన్నాహాలు ప్రారంభించారు. అప్పుడు నేను వాళ్ళని వారించాను. "మీరు ఇలా పెద్ద సన్నాహంతో వెళ్ళి అడిగితే, ఆ బాలిక వృత్తాంతం ఎవరు చెప్తారు? అదీగాక ఆమె ఇప్పటికి పదహారేళ్ళ వయస్సుదైపోయి ఉంటుంది. అందువల్ల నేను రహస్యంగా వెళ్ళి ఆచూకీ తీసేవరకు మీరు తొందర పడవద్దు. ఇక్కడ ఉండండి. మా మంత్రి పుత్రిక కూడా ఆ ప్రాంతాల్లోనే ఉండి ఉంటుంది. ఇద్దరి చరిత్రలూ తెలిసికొని వస్తాను. నన్ను పంపండి' అనగానే అందరూ సమ్మతించారు. నేను సరిపోయేంత ధనం తీసుకొని ఒక సుముహూర్తాన బయలుదేరి గంగానదీ తీర పట్టణాలన్నీ చూస్తూ కొన్ని రోజులకు ఒక పట్నం చేరుకున్నాను.

గంగానదిలో కొట్టుకుపోతున్నప్పుడు పల్లెవాడు శిశువును గట్టు ఎక్కించిన చోట కొన్ని వృక్షాలు నాకు గుర్తున్నాయి. కనుక రేవులో అటువంటి వృక్షాలున్న ఈ పట్టణాన్ని నేను గుర్తుపట్టాను. గంగానదిలో ఈదే పల్లెవాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వాళ్ళతో స్నేహం చేసి వాళ్ళ స్త్రీలకి కానుకలు ఎరచూపి, కొన్నాళ్ళ క్రితం గంగలో కొట్టుకొచ్చిన పిల్లని తీసిన పల్లెవాళ్లవరన్నదీ ఆరాతీశాను. ఎంతో మందిని అడగ్గా- అడగ్గా ఒక వృద్ధురాలు నేను ఇవ్వజూపిన పారితోషికం ఆశకొద్దీ అసలు రహస్యం విప్పి చెప్పింది. చిత్రమేమిటంటే- ఆనాడు గంగలో కట్టెలకోసం ఈదుతూ వెళ్లి బాలికను రక్షించినవాడు ఆమె కొడుకే! ఆ బాలిక బంగారుశలాక వలె మెరుస్తున్న తీరు చూసి 'ఇది కలవారి బిడ్డలాగా ఉంది. దీన్ని మనం పెంచగలమా?

మన పొరుగున ఉన్న మనోరంజనికి సంతానం లేదు కనుక తగిన సొమ్ము ఇస్తే దాని కిచ్చేద్దాం!" అనుకున్నాం ఇద్దరం. నా కొడుకు వెళ్ళి ఆమెను తీసుకొచ్చి పాపను చూపిస్తే, ఆమెకు ఆ శిశువు బాగా నచ్చినట్లుంది- మేము కోరినంత ధనం ఇచ్చి. ఆ రహస్యం ఎవరికీ చెప్పొద్దనీ మా చేత ప్రమాణం కూడా చేయించుకుంది. కొన్నాళ్ళకు నా కొడుకు జలగండంతోనే పోయాడు. 'ఇంత కాలం తర్వాత ఇక ఆ శిశువు గురించి ఎవరికి వెల్లడించి మాత్రం ఏమీ నష్టం కలగదనీ నీకు చెప్పాను' అని చెప్పిందా పల్లెకార్ల ముసల్ది.

మరి ఆ శిశువు చాలా గారాబంగా పెరిగి ఈ సరికి యవ్వనవతి అయి వుండాలనుకుంటూ, ఆ విషయం ఆరా తీయగా మరికొంత సమాచారం అందింది. మనోరంజని వేశ్య. అది ఆ పిల్లకి మందారవల్లి అని పేరు పెట్టి నాలుగేళ్ళ వరకూ ఎవరికీ చూపించకుండా చాలా గారాబంగా పెంచింది. సంగీత సాహిత్యాల్లో నిష్ణాతులైన గురువుల దగ్గర శిక్షణ ఇప్పించింది. దానికితోడు ఆ చిన్నది సూక్ష్మ గ్రాహి కావడంతో గురువులకే తప్పులు దిద్దేంత ప్రవీణురాలైంది. అది చాలదన్నట్లు మనోరంజని ఆ పిల్లని కాశీ పంపించి అక్కడి విద్వాంసుల చేత కూడా శిక్షణ ఇప్పించేసరికి ఆమె సంగీత సాహిత్యాలలో అపార ప్రజ్ఞాధురీణురాలై, పండితుల్నే ఓడించగలిగే స్థాయికి ఎదిగింది. ఆమె దర్శనం చక్రవర్తులకు సైతం దొరకదని అక్కడ చెప్పుకుంటారు.

అప్పుడు నేను కాశీ వెళ్లగా- మందారవల్లి పదహారేళ్ళవరకు అక్కడ విద్యాభ్యాసం చేసి అన్ని విద్యల్లోనూ అసమాన్య పాండిత్యం సంపాదించుకుని, కొందరు శిష్యురాళ్ళతో దేశాటనం చేస్తున్నట్లు తెలిసింది.

ఆమె కథ అలా ఉండగా- నేను విష్ణుశర్మ గురించి ఆరాతీస్తూ కాశీలో తిరగని చోటులేదు. ఒకచోట ఆయన దాయాదులు నాకు తారసపడి చెప్పిన విషయాల ప్రకారం- అతడు భార్యాపుత్రులు లేనివాడని, హేలాపురి నుంచి ఒక వార కాంతతోను, ఒక బాలికతోను, తిరిగొచ్చాడు అతడు. చూసేవాళ్ళు ఆ వారకాంతనే అతడి భార్య అనుకుంటారుగాని అది మంజుభాషిణి అనే

వేశ్య; ఆపిల్లపేరు ప్రియంవద, ఆమెకు విద్యా బుద్ధులు చెప్పించాక, మహా విద్వాంసురాలని పేరున్న మందారవల్లితోను జతకలిసి విద్వత్సభల నిమిత్తం దేశాటనం చేస్తోంది అని తెలిసింది.

నేను వాళ్ళిద్దరి జాడ వెతుకుతూ కొన్ని రోజులు దేశాటనం చేశాను. మందారవల్లి పేరు జంబూద్వీపం అంతటా వ్యాపించిపోయింది. ఆమె కృష్ణదేవరాయల ఆస్థాన కవులతో ప్రసంగించడానికి విజయనగరం వెళ్లిందని తెలిసి, అక్కడికి వెళ్ళేలోగా– ఆస్థానకవులామెను కపటంతో ఓడించి, వస్తు, వాహనాలను స్వాధీనం చేసుకుని, ఢిల్లీలో తగవు పరిష్కరించుకొమ్మని చెప్పి పంపేశారట! ఆ విధంగా నేనిక్కడికి వచ్చాను. ఇక్కడ మీరు కనిపించారు. అయితే మీ బంధుత్వపు వరుసలు తెలీక వాళ్ళు ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటారు" అని కన్నీళ్ళు పెట్టుకుంది నాగమణి.

ఈ కథంతా నాగమణి చెప్తూంటే– సుప్రభ అప్రతిభురాలై అలా వింటూ ఉక్కిరిబిక్కిరై ఆశ్చర్యానందాలు కమ్ముకురాగా ఒక్కుమ్మడిగా ఆనందభాష్పాలు రాల్చింది. "నాగమణీ! నువ్వు చెప్పిన కథంతా నిజమేనా? ఇది కలకాదు గదా! ఏదీ..... మరోకసారి చెప్పవూ! కాశీలోవారు నీతో జీవించే ఉందని చెప్పారా? అయ్యో! క్షత్రియపుత్రిక అని తెలీక, వారకాంత వలె దేశాటనం చేస్తోందా? విధివశం ఇలా రాసి వుందా?" అని విచారించింది.

అప్పుడు విజయవర్మ ఆ వృత్తాంతమంతా విని "మందారవల్లి తగవు గురించి దక్షిణాది నుంచి మాకు వర్తమాన పత్రికలు అందుతున్నాయి. ఇంకా పరిశీలించవలసి ఉంది. నువ్వు తొందర పడకు. మాకు చేరుతున్న వార్తలను బట్టి ఆమె వార కాంతలవలె ప్రవర్తించక శీలాన్ని కాపాడుకుంటోంది. అదే కొంత ఊరట కలిగించే విషయం" అని భార్యకు వివరించి, నాగమణిని చాలా మన్నించాడు.

ఈ కథ అంతా నాగమణి సుప్రభకు వినిపిస్తున్నంతసేపు బయట మంగమణి– ప్రియంవదలు వేచివున్నారు కదా! వారు ఇలా మాట్లాడుకోసాగారు...

"మన గురించి సుప్రభతో ఎప్పుడు తీరిగ్గా చెప్పుకుందామనుకున్నా ఏదో ఒక ఆటంకం వస్తోంది. మన పాట్లు గురించి మనం చెప్పుకోబోయి,

ఆమెను సంతానం గురించి అడిగేసరికి ఆమే తన కష్టాల్ని మనతో చెప్పుకుంది. దుఃఖ బాధలేనివారు ఉండరు కదా! పుట్టిన ఒకే ఒక్క కూతురు గంగలో పడింది. ఇంతవరకూ మళ్ళీ సంతానం లేదు. సంపద అపారంగా ఉంది. ఏం చేసుకోను ఆ సంపద? దేముడెవర్నీ సుఖంగా ఉండనివ్వడే సఖీ" అంది ప్రియంవదతో మంగమణి.

తలూపిన ప్రియంవద, అంతఃపురంలోకి తొంగిచూసి వచ్చి "ఆమెను చూడవచ్చిన వారు విదేశీవార్తలేమైనా తెచ్చారేమో! భర్త ఆమెను ఓదార్చుతున్నాడు. ఆమె కళ్ళవెంట కన్నీరు కారుస్తోంది. ఏ వార్త విన్నదో ఏమో! మనం తొందర పడరాదు" అని విజయవర్మ అక్కడి నుంచి వెళ్ళేవరకు వేచి వున్నారు ఆ ఇద్దరూ. ఆయన అక్కడ్నుంచి వెళ్ళాక, సుప్రభ చెంత చేరి "అమ్మా! మీరెందుకిలా విచారంగా ఉన్నారు? విదేశవార్త లేమైనా కలవరపెడుతున్నాయా?" అని మెల్లగా అడిగారు.

సుప్రభ తలెత్తి "ఎక్కడో అణగారిపోయిన నా దుఃఖాన్ని నాగమణి చాలా ఆశ్చర్యంగా తిరిగొచ్చి మళ్ళీ పైకి తోడింది. అసలు ఆమె ఇన్ని కష్టాలు తట్టుకొని బ్రతికి ఉండటమే పరమాశ్చర్యం. మీకు ఇంతకుముందు చెప్పిన నా వృత్తాంతంలోని నాగమణి ఇదే" అని, చాలా కాలం తర్వాత తనను కలుసుకున్న నాగమణిని చూపించింది సుప్రభ.

"గంగలో పడి కొట్టుకుపోయి, ఎక్కడో తేలి ఒడ్డు చేరింది. నానా సుఖదుఃఖాలు అనుభవించి, ఇంతకాలానికి ఇక్కడికి చేరుకున్నట్లు నా బిడ్డ కూడా జీవించి ఉన్నట్లు చెప్తున్నది" అని నాగమణి తనకు వినిపించిన కథంతా సుప్రభ మంగమణికి వినిపించింది.

ఆ కథ విన్నాక మంగమణి ప్రియంవద ముఖం చూస్తూ, బయటకు తీసుకెళ్ళింది. ఆశ్చర్యం అణచుకోలేక "మన చరిత్రలు ఇలా ఉన్నాయేమిటి? ఇది కల్పితం కాదు గదా!.... అలా అనుకోడానికి ఎక్కడా ఆస్కారమే లేదు కదా! ఎక్కడికక్కడ నిదర్శనాలు కనిపిస్తున్నాయి. అందువల్ల నిజమే అని చెప్పుకోవాలి. మనం క్షత్రియ కన్యలమని తెలియక, వారకాంతల మనుకొని కులానికి అపఖ్యాతి తెచ్చాం! అయ్యో! వీళ్లు నా తల్లిదండ్రులు. నీ తల్లి

దండ్రులున్నది కలిఘాతపురంలో. మన గురించి ఈ నాగమణి ఇన్ని కష్టాలు పడింది. దాని రుణం మనం ఎన్నటికైనా తీర్చుకోగలమా? అది అలా ఉంచు! ఇప్పుడు వీళ్ళు ఎలా భావిస్తారో చూశాకగాని, మనం ఎవరిమన్నది వెల్లడించడం మంచిదేమో! ఇప్పుడు మనం చేసిన పనులలో చెడ్డవేమైనా ఉన్నాయేమో ఆలోచించు! నాకైతే ఏమీ జ్ఞాపకం లేదు. ఆహా! దైవఘటన లెంత చిత్రం?" అని మాట్లాడుకోసాగారు ప్రియంవద- మంగమణి.

ఇంతలో అక్కడికి వచ్చిన సుప్రభ "అదేమిటమ్మా! నా బిడ్డకథ విన్నాక, అక్కడ్నుంచి అలా అర్ధాంతరంగా లేచి వచ్చేశారేం? మా పిల్ల కథ మీకు నచ్చలేదు కాబోలు! దానికి నేనేం చెయ్యగలను? మీరు వచ్చి పదిరోజులు కావస్తున్నా, నాకు వినడానికే అవకాశం కుదరలేదు. ఎటువంటి పనైనా మా వార్ని ప్రార్థించి చేయిస్తాను. మీరొచ్చిన పనేమిటో చెప్పండి" అంది.

ఒక చిన్న పరీక్షతో సుప్రభ హృదయాన్ని గ్రహించింది. విద్వాంసురాలైన మందారవల్లి అంతవరకు మంగమణి నామధేయంతో, మారుపేరుతోనే తాను సంచరిస్తున్నా ఎక్కడా గుట్టు చెడకుండా కాపాడుకుంటూ వచ్చినా ఇంతకాలం తర్వాత తల్లి హృదయాన్ని గ్రహించకుండా తానెవరో తెలియజేయకూడ దనుకున్నది. అప్పుడు సుప్రభ దుఃఖార్తిని గమనించాక తన ముసుగు తొలగించింది.

"తల్లీ! నీకు ఇంత శోకం కలిగించిన దుష్టాత్మురాల్ని నేనే! ఆ ప్రియంవద ఈమెయే'' అంటూ వెల్లడించేసరికి అంతఃపుర కాంతలంతా సంభ్రమాశ్చర్యాలతో ఆ యువతుల మేలి ముసుగులు సంపూర్తిగా తొలగించి చూపగా సుప్రభ- నాగమణి వారిని కౌగలించుకుంటూ వాళ్ళ రూపలావణ్యాలకు ముగ్ధులు కాసాగారు.

అప్పటికప్పుడు మంత్రి విజయవర్మకు చేరినదా వార్త. ఆ వెంటనే అతడక్కడకు వచ్చి సంతోషం పట్టలేక, ఆనందబాష్పాలతో ఆ ఇద్దర్నీ దగ్గరకు తీసుకుని విశేషాలు మళ్ళీ మళ్ళీ విన్నాడు.

కొంతసేపటితర్వాత మందారవల్లి "తండ్రీ! మా తగవు గురించి నీవు వినే వుంటావు. రామలింగకవి 'లవిత్ర' అనే పేరుతో మమ్ముల్నిద్దర్నీ కపటంతో

ఓడించాడు. అతని కెలాగో తెలిసి ఉండొచ్చు! నా శాపకారణంగా అతనికి ఎదురునిల్చి వాదించలేను. మేము వేశ్యాసంతతికాబోలనుకుని ఇటువంటి వాదాలకు పూనుకున్నాం! ఇప్పుడు మేము ఏం చెయ్యాలి? నేడో-రేపో తగవు పాదుషావారి దగ్గర విచారణ కొచ్చినపుడు మేము ఏం మాట్లాడాలి? అదీగాక మేము ఓడితే ఎన్నెన్నో చిక్కులు రావచ్చు! ఎలాగైనా మేమే గెలిచేలా చూడు!" అని ప్రార్థించింది. ఎదిగివచ్చిన కూతురు ఇంతకాలానికి స్వగృహం చేరిందన్న ఆనందం కొద్దీ విజయవర్మ వాళ్ళని ఓదార్చి, అటువంటి వాటి గురించి తర్వాత ఆలోచిద్దాం అని చెప్పి అప్పటికి ఆ ఇద్దర్నీ కొత్త నగలతో- నూతన వస్త్రాలతో సంతోషపరచి, అంతఃపురంలో వేడుకలు జరిపి వారిని సంతోషపరిచాడు.

మర్నాడు- రామలింగకవి ఆ దారిన వెళ్తూంటే, నాగమణి చూసి "అమ్మా! దుష్టవర్మ అనే సామంతరాజుకు అద్భుత పురాణాన్ని చెప్పి అతని దుష్టబుద్ధిని అంతం చేసినందుకు గాను, పాదుషావారు మెచ్చుకుని తీర్పు ఆయన పక్షాన ఇచ్చారట!" అనగానే మందారవల్లీ- ప్రియంవదలు మేడమీదికి వెళ్ళి చూసి, వారు సుభద్రుడూ- రామలింగకవీ అని నిర్ధారించుకున్నారు. అంతలోనే అతడే అవ్వను మోసగించిన క్రొత్తవ్యక్తి అనే సంగతీ తెలిసింది. అవ్వని ఓదార్చి, వర్తకునికి ఆ సొమ్ము ఇస్తానన్నాడట" అంటూ నాగమణి ఇంకొక సమాచారం తెచ్చింది. ఆ విషయం విన్నాక "సందేహం లేదు ప్రియంవదా! రామలింగకవి పేరుతో మనకు దారిలో కలిసిందీ కవిగారే! మనం మూడు రాత్రులు గడిపినా, మనని అంటుకోక- ముట్టుకోక నిగ్రహం చూపించిందీ గురుశిష్యులే!" అంటూ ప్రియంవద నిరూపించింది.

అప్పుడు "ప్రియంవదా! మన చిక్కులు తీరిపోయేయి- నాకొక ఆలోచన స్ఫురిస్తోంది. ఎందుకోగాని మొదట్నుంచీ రామలింగకవి పేరు విన్నప్పుడల్లా నా మనసులో అదో వింత ఆనందం కలిగేది. ఈ వార్తను నా తండ్రితో చెప్పి ఆ ఇద్దర్నీ ఈ రాత్రి విందుకు పిలుద్దాం!అప్పుడు వారితో

మాట్లాడవచ్చు!" అని మందారవల్లి యోచించి, ఆ క్షణమే తండ్రి దగ్గరకెళ్ళి తన మనసులో మాట చెప్పింది.

అంతటి సంగీత సాహిత్యమూర్తి తన కూతురే రామలింగకవిని విందుకు పిలిపించమంటే ఏ తండ్రి మాత్రం కాదంటాడు? వెంటనే సుభద్రునికీ-రామలింగనికీ విజయవర్మ ఇంట విందు ఏర్పాటైంది.

అందరూ భోజనాలు చేస్తూంటే మందారవల్లి, ప్రియంవద వింతగా విశేషాలంకరణలతో అక్కడ అడుగుపెట్టి, పట్టుచీరలు గరగర శబ్దం చేస్తూంటే పంక్తుల మధ్య చురుగ్గా తిరుగుతూ కొసరి కొసరి వడ్డించసాగారు. ఆ వడ్డింపులకు తోడుగా చమత్కారపు ప్రసంగాలు అదనం. వారి సంభాషణల శైలికి రామలింగకవి విస్మయం చెందాడు.

కొంతసేపయ్యాక మందారవల్లి ఒక ప్రక్కన నిలడి, "తండ్రీ! రామలింగకవి ప్రఖ్యాతి వినడమేగాని, వారిని చూసి ఉండలేదింతవరకూ నేడెంతో సుదినం. వీరు మందారవల్లిని ఓడించారని తెలిసింది. ఏ విద్యలోనో- ఏ శాస్త్రంలోనో తెలీదు. లవిత్ర ఆనే ఆమె ఓడించిందని కొందరంటున్నారు. ఆమె ఎవరు? ఆమె మందారవల్లిని ఓడించడమే నిజమైతే ఎందులో? ఇది తెలిసి తీరాలి. కుతూహలంగా ఉంది" అని విజయవర్మ నుద్దేశించి అనగా, అతడు రామలింగనివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

అప్పుడు రామలింగకవి "ఓహో! ఈమె మందారవల్లిలా ఉందే! మంత్రి విజయవర్మని తండ్రీ అని పిలుస్తోందే! ఈ బంధుత్వం ఎలా కలిసిందో? బ్రాహ్మణులకి వేశ్యలతో బంధాలా? కాదు! కాదు!... ఈమె నిశ్చయంగా మందారవల్లే" అని ఆలోచిస్తూ మంత్రి మాటకు జవాబివ్వకుండా ఉండిపోయాడు. ఆలోచనల్లో పడి భోజనంలో కొన్ని పదార్థాల మాట మరచిపోయాడు కూడా! సుభద్రుడా ప్రశ్నకు చాకచక్యంగా ఏదో సమాధానం చెప్పి సమయానుకూలంగా ఆ పరిస్థితిని దాటించేశాడు.

మందారవల్లి రామలింగని హృదయాన్ని చదివేసింది. ఏదోలా భోజనం ముగించి విశ్రాంతిగా అందరూ కూర్చున్నాక, తాంబూలాలు వేసుకుంటున్న

తరుణంలో మందారవల్లి ఒక పన్నెండేళ్ల పిల్లకి ఒక పద్యం చెప్పి, సంగీతం పాడే నెపం మీద వారి వద్దకు వెళ్ళి చదివి రమ్మంది.

మందారవల్లి చెప్పించిన పద్యం ఇదీ.......

సీ. దాది హస్తమున దద్దయు ముద్దుగను బెంప
బడు రాజసుత పెనుజలధి బడుట
పడి మునుంగకయుండు ప్రాపున దరి చేరి
యట వారకామిని కమ్మఁబడుట
గణికయై కులవృత్తిఁ గొనక విద్యల నేర్చి
దేశ దేశంబులఁ దిరిగి తిరిగి
సిరిఁ గోలుపోయి భూసురున కిల్లాలుగా
మెలఁగి దానము లందఁ గలిసికొనుట!
తే.గీ.కొసకు దలి దండ్రులను గూడికొనుట యహహ
తలఁచి చూడంగ దైవ తంత్రంబు గాదె....?!

ఇంతవరకు వీణమీద పాడి, ఆ బాలిక పై చరణాలు రెండూ చదవడం మరచింది. ఆ పద్యం విని రామలింగకవి, తన హృదయంలో సందడి చేస్తున్న సందేహం పోగా విస్మయంతో ఆ చరిత్ర అంతా ఆ పద్యం ద్వారా గ్రహించాడు.

'చిత్రమిది చిత్రమిది సువిచిత్ర మిదియ' అని చదివాడు. ఆ వెంటనే సుభద్రుడు 'చిత్రమిది చిత్రమిది కడు చిత్ర మిదియ' అంటూ తానూ చివరిపాదం పూర్తి చేశాడు.

అది మందారవల్లి రచించిన పద్యమే! ఇందులోని చిత్రమేమిటంటే-ఆమె ఏ పదాలతో నైతే చివరి పాదాలు పూరించిందో, సరిగ్గా ఆ పదాలే వాడి రామలింగకవి-సుభద్రుడు పద్యం పూర్తి చేయడం.

దాంతో తెరచాటునున్న మందారవల్లి మనస్సులో పొంగిపోయింది. ఆనందం పట్టలేక క్షణం ఆలస్యం చెయ్యకుండా తెరవెనుక నుంచి ముందుకొచ్చి రామలింగకవి మెడలో పుష్పమాలిక వేసింది. ఆయనకు

నమస్కరిస్తూనే "అయ్యా! పూర్వం భోజరాజు తన సమస్యను పూర్తి చేసిన వారికి అక్షరలక్షలిచ్చేవాడట! నేనీ పుష్పహారాన్ని సమర్పిస్తున్నాను. ఈ హారాన్ని నా హృదయాను బంధంగా భావించండి" అని పలికి ఒక ప్రక్క నిలబడింది.

అంతలో ప్రియంవద కూడా ఇంకొక పూలహారంతో సుభద్రుని దగ్గరకొచ్చి "ఇది చివర చరణం పూరించినందుకు కానుక" అని హారం అతని మెడలో వేసి, ఆ కవి వెనుక నిలబడింది.

అప్పుడు రామలింగకవి, మంత్రి విజయవర్మతో "అయ్యా! వీరి కంఠధ్వని ఎక్కడో విన్నట్లుంది. వీరు మంగమణి- ప్రియంవద అనేవాళ్ళు కారు గదా! వాళ్ళు మాకు చేసిన మేలు ఎన్నటికీ మర్చిపోలేనిది " అన్నాడు.

మందారవల్లి నవ్వుతూ "ఔనౌను! మీ ఎత్తిపొడుపు మాటలు మాకు అర్థం కాకపోలేదు. వాళ్ళు మాకు అంతా చెప్పారు" అంటూ సరసంగా జవాబిచ్చింది. మొత్తం మీద ఈ రీతి యుక్తి- ప్రయుక్తులతో వారికి చాలాసేపు వాదం జరిగింది. ఆ వాదంలో రామలింగకవిదే పై మాటగా ఉంటూ వచ్చింది.

అప్పుడు విజయవర్మ ఎంతో సంతోషిస్తూ రామలింగకవిని చాలా గౌరవించి, వివరంగా మందారవల్లి కథ మొత్తం చెప్పాడు. "ఇది నాకు జన్మించిన పుత్రిక. జాతి స్మృతి బాల్యంలోనే కోల్పోయినందువల్ల నానాపాట్లు పడింది. అయినప్పటికీ శీలవతిగాను- విద్వన్మణిగానూ మీరెరుగుదురు! ఈమెను భార్యగా స్వీకరించండి. బ్రాహ్మణులు క్షత్రియ కన్య వివాహ మాడడం ఆచారమే!" అని కోరాడు. పాదుషా గారితో శ్రీకృష్ణ దేవరాయలకు లేఖ రాయిస్తానని- ఆయన్నే వివాహ వేళకు రప్పిస్తానని విజయవర్మ హామీ ఇవ్వడంతో రామలింగకవి అంగీకరించాడు.

మరునాడే విజయవర్మ పాదుషాగారికి పై కథ యావత్తూ చెప్పడంతో అత్యాశ్చర్యకరంగా ఉన్న ఆ గాథ పరంపర విని అతడు కూడా వారికి వివాహం జరపడమే న్యాయం అని తాఖీదు నిచ్చాడు. దగ్గర్లోనే ముహూర్తం కూడపెట్టించి స్వయంగా సామంతరాజులకు లేఖలు పంపాడు.

ఈ విజయవార్త కృష్ణదేవరాయలను చేరగానే, అతడు చాలా ఆనందించి

అష్టదిగ్గజకవులతో, మంత్రులు పరిజనంతో ఢిల్లీ వచ్చాడు. కలిఘాతపురం నుంచి ప్రియంవద తల్లిదండ్రులు కల్పవల్లి, మకరందుడు, సునంద, సింధువర్మ, మొ॥ వాళ్ళంతా వచ్చి ప్రియంవద చరిత్ర కథలు- కథలుగా విన్నారు. ఒక శుభముహూర్తాన వారికి అత్యంత వైభవంగా వివాహం జరిగింది.

రాయలవారు తిరుగు ప్రయాణంలో చంద్రగిరి దుర్గానికి వెళ్తూ ఇక్కడ ఈ పద్యాన్ని ఒక శిలపై చెక్కించి స్థాపించాడు. గోపా! నువ్వు చూసిన పద్యం చివరి చరణాల వెనుక ఇంత కథ ఉంది" అని ముగించాడు మణిసిద్ధుడు. కథ విన్న గోపాలుడు ఎంతో ఆనందించాడు.



కాశీ మజిలీ కథలు

26 వ మజిలీ

"అయ్యవారూ! మంచి కథనే చెప్పారు. ఇంత సంతోషం ఎప్పుడూ కలగలేదు. వేళ ఇంకా చాలా ఉంది కదా! రామలింగకవి ఢిల్లీ పట్నంలో ఎన్నో వింత చర్యలు చేశాడని మాటమాత్రంగా చెప్పేశారు. కొన్నిట్నిని అయినా చెప్పవచ్చు కదా! మీ పాదాలు పట్టుకుంటాను" అని గోపాలుడు అడగ్గా, "ఓహో! కర్మంచాలక నోటి వెంట ఇలా ఆ మాట వచ్చిందో- లేదో అలా పట్టుకున్నావే! ఇంకెప్పుడైనా చెప్తానులేగానీ ఇప్పుడు కాదు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవాలి" అని ఆ రోజుకు విశ్రాంతి తీసుకొని, మరునాడు తదుపరి నివాస ప్రదేశం చేరుకున్నారు.

అక్కడ మణిసిద్ధుడు జపం చేసుకుంటూ ఉంటే, వింతలను చూడ్డానికి ఊళ్ళోకి వెళ్ళిన గొల్లవాడు వేగంగా వచ్చి, ఆయన్ను చూసి "మీ జపం వేగంగా కానివ్వండి స్వామీ! ఓ మంచి వింత చూసొచ్చాను. దాని వృత్తాంతము మీరే చెప్పాలి" అని తొందర పెట్టసాగాడు. ఎట్టకేలకు ఆతడు జపం ముగించి "ఏమిరా! ఎన్నిసార్లు చెప్పినా నీకు తెలీడం లేదేం? జపం చేసుకుంటూంటే అంతరాయం కలిగించవద్దు అని చెప్పానా! ఏమి మునిగిందింతలో?" అని అడిగాడు.

అప్పుడు వాడు కొంచెం జంకి "స్వామీ! ఈ ఊళ్ళో చెరువుగట్టు దగ్గర రెండు ఇనుపస్తంభాలున్నాయి. నేను అక్కడికెళ్ళి వింతల్ని చూస్తుంటే, వయసులో వున్న ఇద్దరు యువకుల చిత్రపటాలు రెండు తీసుకొచ్చి ఆ స్తంభాలకు కట్టారు రాజభటులు. వాటిని కొరడాలతో కొట్టారు. మరొక ఆడదాని విగ్రహాన్ని అక్కడే నిలబెట్టి, పదిమందీ ఆమె ముఖం మీద ఉమ్మేశారు. ఇంతలోనే కొందరు వచ్చి, వారికోసం చింతిస్తూ వాళ్ళ కట్లు విప్పించి. తీసుకువెళ్ళిపోయారు. ఆ వృత్తాంతం మీరే చెప్పాలి. అది తెలుసుకోడానికే మిమ్ములను తొందరపెట్టాను" అన్నాడు. భోజనం అయ్యాక చెబుతానని వాడిని ఒప్పించి, భోజనాలయ్యాక మణి విశేషం వల్ల ఆ వృత్తాంతమంతా తెలుసుకొని ఆ కథను ఇలా చెప్పసాగాడు మణిసిద్ధుడు.

వీరప్రతాపుని కథ

సింధుబా అనే నగరానికి రాజు వీర ప్రతాపుడు. అతడు మొదట పద్మిని అనే స్త్రీని పెళ్ళాడి ఆమె వల్ల సంతానం పొందలేక, సంతాన కాంక్ష బలంగా ఉండడంతో వరసగా కమలిని, కుమురిని, మాలిని అనే ముగ్గుర్ని పెళ్ళాడి వారి వల్ల కూడా సంతాన లాభం పొందలేని వాడైనాడు.

అతడు దక్షిణ నాయకుడు. మన్మథ విద్యావేత్త కనుక ఏ భార్యనీ అలక్ష్యం చెయ్యకుండా అందర్నీ సమంగానే చూసుకునే వాడు. కోటలో ఆ నలుగురికీ నాలుగు దిక్కులా నాలుగు మేడలు కట్టించి– అన్ని సదుపాయాలూ సమస్త వస్తు సంభారాలు అందులో ఏర్పాటు చేశాడు. నియమితమైన రోజులలో ఒక్కొక్కరి దగ్గరకో రోజు వెళ్తుండేవాడు. మణులు, ఆభరణాలు, ఏదైనా గానీ ఒక భార్యకు ఏది ఇస్తే, మిగిలిన వారికీ అటువంటిదే ఇచ్చేవాడు. ఇలా అందర్నీ సమాన భావంతో చూస్తూ కొన్నాళ్ళు గడిపాడు. అయితే సంతానం లేదన్న చింత నుంచి అతడు దూరం కాలేకపోయాడు.

ఇలా ఉండగా– ఒక రోజు 'మంత్రసిద్ధుడు' అనే యోగి వచ్చి, ఆ రాజు విచార కారణం తెలుసుకుని, అతడితో ఒక హోమం చేయించి, హోమా వశిష్టమైన ప్రసాదాన్ని భార్యలకు ఇమ్మని చెప్పాడు. ఆ సిద్ధుని మంత్ర సిద్ధి వల్ల, ఆ పాయసం పుచ్చుకున్న కొద్ది కాలానికే ఆ నలుగురూ గర్భవతులై ఒకే రోజున నలుగురూ నలుగురు కొడుకుల్ని కన్నారు. ఒకరు కాదు– నలుగురిని సంతానంగా పొందిన ఆనందంతో వీర ప్రతాపుడు షోడశ మహాదానాలు చేసి బ్రాహ్మణుల్ని సంతృప్తుల్ని చేసి వారికి వరసగా విజయుడు, భానుడు, రాముడు, చంద్రుడు అని పిల్చుకోడానికి వీలుగా పేర్లు పెట్టాడు. కానీ అందరికీ ఏకంగా 'విజయభాను రామచంద్రుడనే పేరు నిర్ణయించాడు.

క్రమంగా వారు విద్యల్లో ఆరితేరి పెద్దవాళ్ళయ్యారు. విద్యాభ్యాస కాలంలో కూడా పుత్రులు నలుగుర్ని సమానంగా, వారి తల్లుల్ని చూసినట్లుగానే ఒకే దృష్టితో చూశాడు వీర ప్రతాపుడు. వారి వివాహాలు జరిపించడం కోసం ఉత్తమ రాచకన్యల చిత్ర పటాలు తెప్పించాలని నలువైపులా దూతలను పంపించాడు ఆ ప్రభువు..

మొత్తం భూమండలం అంతా గాలించి అన్ని విధాలా యోగ్యత కలిగిన నలుగురు రాచక్యనల చిత్ర పటాలు తెచ్చారు వారు. రాజు ఆ పటాలతో పెద్ద భార్య దగ్గరకెళ్ళి నాలుగూ చూపించి, వారి గురించి వివరించి "వీరిలో నీ కుమారునికి భార్యగా ఎవరిని తగిన వారని ఎంచుకుంటావు?" అని అడగ్గా, ఆమె పద్మగంధి అనే రాచకన్య పటం చూపించింది.

ఆ చిత్రపటం ఆమెకిచ్చేసి, రెండో భార్య దగ్గరికి మూడు చిత్రపటాలతో వెళ్ళగా, ఆమె తన భర్త పెద్ద భార్యకే విలువ ఇచ్చి ఆమె కోరుకున్న దాన్నే కోడలుగా చేస్తున్నాడు కాబోలు అనుకుని, పద్మిని కోరుకున్న పద్మగంధినే తన కొడుక్కి కోరింది. ఇక ఎంత చెప్పినా వినిపించుకోక పోయేసరికి ఏదో విధంగా పెద్ద భార్యకు నచ్చచెప్పి, మత్స్య గంధి అనే పిల్లని ఆమెకు కోడలుగా ఒప్పించాడు. పద్మగంధి చిత్రపటంతో రెండో భార్య దగ్గరికి వెళ్ళి "ఇదుగో నువ్వు కోరిన పిల్ల" అని ఆ పటం చూపించగా, ఆమె ముఖం ముడుచుకుంది. అందుక్కారణం- రాజు పెద్ద భార్యదగ్గరికి తిరిగివెళ్ళి నపుడు పద్మగంధి చిత్రపటం తిరిగి సంపాదించడం కోసం ఆమె విద్యలేనిదని అబద్ధం ఆడటమే! అది ఒక గూఢచారిణి ద్వారా తెలుసుకున్న రెండో భార్య కమలిని తనకు పద్మగంధి అక్కర్లేదంది. ఈ విధంగానే నలుగురు భార్యలూ ఒకరు కోరిన పిల్లనే కావాలంటూ మిగిలిన వారికి తిరస్కరించసాగారు.

మూడో భార్యకు ముదిని అయితే "నాలుగు చిత్ర పటాలు తెప్పించారు కదా! మీకు నచ్చిన భార్యకు మంచిదాన్ని కోడలుగా చేసి, మిగిలినవి

మాకు చూపిస్తారా? అది కూడా తెచ్చి వుంటే ఆ పిల్లనే నేను కోడలుగా చేసుకుని ఉండేదాన్ని కదా!" అనేసింది.

ఎవ్వరి మనసునూ మార్చలేక విసిగిపోయిన వీర ప్రతాపుడు "బ్రహ్మ సృష్టిలో హెచ్చుతగ్గులేకుండా ఉంటాయా? మీరు సవతులు కావడం వల్ల ఒకరిపై కొరు అసూయపడుతున్నారు. ఈ వేధింపులన్నీ దేనికి? వివాహం చేసుకుని కాపురం చెయ్యవలసినది మన పిల్లలు కనుక, వారికి నచ్చిన వాళ్ళను వాళ్ళే ఎంచుకుంటారు" అని ఆ అపార్థాలకు స్వస్తి పలికి నలుగురు పుత్రులనూ పిలిపించాడు.

"కుమారులారా! మీకు పెళ్ళిళ్ళు చేయాలని ఉత్తమ రాజపుత్రికలని అందరూ ఎంపిక చేసి ధృవపరచిన నలుగురు కన్యల చిత్రపటాలు తెప్పించాను. మీ తల్లులు ఒకరు ఎవర్ని కోరితే, మిగిలిన వారు ఆ పిల్లనే కోడలుగా కావాలనుకుంటున్నారు. వాళ్ళని ఒప్పించడం నా తరం కావడం లేదు. మీ మనస్సులకు మీకు తెలుసు! ఇంత వరకూ ఒకే లాంటివే అన్నీ సమకూర్చుతూ వచ్చాను. కానీ– మనుషుల విషయంలో నేను సమానంగా తీసుకురాగల అవకాశం లేదు. అది ఆ బ్రహ్మకే సాధ్యం కాదు. స్త్రీలలో కొంచెమైనా తేడాల్లేకుండా ఒకే లావుంటారా? అందువల్ల నేను మీ వివాహాలు చెయ్యలేను. మీకు కావలసిన ధనం, గుర్రాలు ఏర్పాటు చేస్తాను. మీరు దేశాటనం చేసి మీకు నచ్చిన కన్యని మీరే వివాహమాడి తిరిగి రండి" అన్నాడు.

ఆ మాటలకు వాళ్ళు నలుగురూ సంతోషించారు. తండ్రి ఆజ్ఞననుసరించి, తల్లుల అనుమతి తీసుకుని కావలసినంత ధనం– అవసరమైన వాహనం ఏర్పాటు చేసుకుని ఒక శుభముహూర్తాన దేశాటనానికి బయలుదేరారు. ఒకసంకేత ప్రదేశం దగ్గర నలుగురూ విడిపోయి, ఏడాదికొకసారి తిరిగి అక్కడే కలుసుకుందామని నిర్ణయించుకుని నలుగురూ నాలుగు దిక్కులకు సాగిపోయారు.

విజయుని కథ

పెద్ద కొడుకైన విజయుడు ముఖ్యమైన ఆయుధాలు ధరించి గుర్రం మీద ఎక్కి తూర్పు దిక్కుగా బయలుదేరి, పదిరోజుల వరకు ఎన్నెన్నో ప్రదేశాలు దాటుకుంటూ, పదోనాటి సాయంకాలం ఒక పట్టణాన్ని చేరుకున్నాడు.

చీకటి పడింది. పట్నంలో ఎక్కడ ఉండాలో తెలీక, గుర్రాల చావడిలో గుర్రాన్ని కట్టేసి, ఆ రాత్రి ఏదోలా అక్కడే గడిపేయతలచి అక్కడ నేలను కాస్త శుభ్రం చేసుకుని అక్కడే కూర్చున్నాడు.

కొంతసేపటి తర్వాత అతడు అటూ ఇటూ చూస్తుంటే- ఒకవైపు ఏదో వెలుగు జాడ కనిపించింది. అక్కడ మనుషులుండొచ్చనీ- వాళ్ళను ఏదో ఒకటి అడగొచ్చునని అటువైపు వెళ్ళాడు. తీరా అక్కడికెళ్ళి చూస్తే, అది ఆ పట్టణానికి చేరువగా ఉన్న స్మశానం. అక్కడొక శవం సగం కాల్తోంది. ఆ వెల్తురు జాడ అదే! అక్కడ ఎవరూ లేరు.

విజయుడు భయపడకుండా, మరికొంత కళ్ళు విప్పార్చి చూశాడు. అక్కడ వల్లకాటిలో అటువంటివే ఇంకో రెండు చోట్ల చితి మంటలు కనిపించాయి. అప్పుడు ఇలా అనుకున్నాడు. 'ఓహో! నాకు తెలీక నేను స్మశానంలో మకాం పెట్టానన్నమాట! నేను గుర్రాల చావిడిగా భావించినది నిజానికి చావడికాదు- అది ప్రేత కర్మల నిమిత్తం కట్టిన వసతి కావచ్చు! అంత మాత్రాన భయపడవలసిన పని లేదు' అని ధైర్యంగా చావడికి వచ్చి కూర్చొని నిద్రపోకుండా, ఆ రాత్రి ఎలా తెల్లారుతుందా అనుకుంటూ గడపసాగాడు.

కొంతసేపయ్యాక ఒక మూల పెద్ద చప్పుడైంది. విజయుడు తుళ్ళిపడి, అటువైపు చూసేసరికి అక్కడో పెట్టె పడి ఉంది. అతడు దాని దగ్గరగా వెళ్ళి, గుడ్డి వెల్తురులో పైకి చూసి ఎత్తయిన కట్టడాన్ని కనుగొని "ఓహో! ఇటువైపు కోటగోడహద్దు కావచ్చునేమో! దొంగలు ఈ పెట్టెను కోటగోడ మీంచి ఇటువైపు పడేసి ఉండాలి. దీన్లో ఏమున్నదీ చూద్దాం!" అనుకుంటూ కాలుతున్న చితిలోంచి ఒక కొరివితెచ్చి, ఆ పెట్టె మూత తెరిచి చూశాడు.

అందులో ఒక అద్భుత సౌందర్యరాశి మూర్ఛపోయి పడివుంది. అది చూసి అతడు ఆశ్చర్యపోయాడు. ఈమెకు ఇంకా ప్రాణం ఉన్నట్లే ఉంది. అయితే, పెట్టెలో బంధించడం వల్ల బతకడం సందేహాస్పదమే! అయినా నాకు తోచిన చికిత్స చేస్తాను" అనుకుని ఆమెను మెల్లగా పెట్టెలోంచి బయటకు లాగి నిలబెట్టాడు. కాని ఆమెకు స్పృహలేక– నిలబడలేకపోతోంది. అప్పుడతడు భుజాలకు అదిమి ఆమెను సందిటపట్టి చావడిలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి ఉపచారాలు చేయసాగాడు. అయితే, ఎంత సేపటికీ ఆమెకు స్పృహ రాకపోవడంతో, నిలబడలేక తూలిపోయే పిల్లని గుర్రం మీద వేసి, మెల్లగా గుర్రాన్ని నడిపిస్తూ ఒక బ్రాహ్మణుని ఇంటికి తీసుకెళ్ళాడు.

"పుణ్యాత్మా! మేము విదేశీయులం. ఈమె నా భార్య. రోగగ్రస్తురాలై ఉంది. రెండు రోజులు ఇక్కడ ఉంచి చికిత్స చేయించుకుంటాను. కొద్దిగా మీరు మేము ఉండడానికి అనుమతిస్తారా?" అని అడగ్గా ఆ ఇంటి యజమాని సరేనని వారికొక మూల ఒక గది చూపించాడు.

అందులో ఆ సుందరిని పడుకోబెట్టి ఉపచారాలు చేస్తూండగా, ఆనాటి సాయంకాలానికి ఆ ఇంతికి స్మృతి వచ్చింది. కళ్ళు తెరిచి భయపడుతూ "తల్లీ! ఇప్పటికి నీకు మనస్సు చల్లబడిందా! దుష్ట బుద్ధివనీ తెలిసీ నిన్ను నమ్మినందుకు మంచిపనే చేశావు" అని పలవరిస్తూ, కొంతసేపటికి తెప్పరిల్లింది. అతడి ముఖం వంక చూస్తూ "అయ్యా! మీరెవరు? నేను ఇక్కడికి ఎలా వచ్చాను?" అని అడిగింది.

విజయుడు "అంతా చెబుతాను కాని, నీలాంటి సుందరిని ఇలా బందీని చేసి కట్టగట్టి పారేసిన క్రూరులెవరు? నీకీ దుస్థితి కల్పించడానికి వాళ్ళకి చేతులెలా ఆడాయి? నేను వీరప్రతాపుని పుత్రుడ్ని. దేశాటనం చేస్తూ నిన్న రాత్రి తెలీక ఈ పట్నపు స్మశాన వాటికలో నివశించాను. అందులో నిన్ను చూసి ఇక్కడికి తీసుకొచ్చాను" అని చెప్పాడు.

అప్పుడామె అతడ్ని సావకాశంగా చూసి "ఆర్యా! నా కథ ఇది. నేను ఈ పట్టణ ప్రభువు బలవర్ధని కూతుర్ని, నా పేరు హేమ. నా చిన్నతనంలోనే నా తల్లి స్వర్గస్తురాలైంది. నా తండ్రి వినీతి అనే ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు సంతానం లేకపోవడంతో పాటు నేనంటే అసూయ. నా తండ్రి

నాకు సకల విద్యలు నేర్పించాడు. గారాబంగా చూసేవాడు. నేను యవ్వనవతి నయ్యాను. నా తండ్రి నాకు వివాహం తలపెట్టాడు. ఈ రాజ్యానికి నేను కర్తనౌతానని మత్సర బుద్ధితో మా సవతితల్లి నా పెళ్ళికి ప్రతీసారి ఏదో ఒక విఘ్నం కల్పించడం ప్రారంభించింది.

ఇలా ఉంటే, మొన్నటి రోజున నా తండ్రి వేటకు వెళ్ళాడు. అతడు వెళ్ళింది మొదలు, నా సవతి తల్లి నన్ను చూడాలంటూ పిలుపులు ప్రారంభించింది. నేను విసిగి చివరకు భయపడుతూనే ఆమె నివాసానికి నిన్న సాయంత్రం వెళ్ళాను. నన్ను చూసి ఎంతో అనురాగం ఉన్నదానిలా కౌగలించుకుంది. కూర్చోనిచ్చి మంచి మాటలు చెప్తూనే ఏదో ఫలహారం తెచ్చి తినమంది. నాకు అనుమానం వచ్చింది. ఇప్పుడు సహించదు అని చెప్పి తప్పించుకోబోగా ఆమె వదలకుండా గంధం పూయించి, పుష్పహారాన్ని నా జడలో తురిమి ' ఈ పరిమళ ద్రవ్యం ఎంత బాగుందో చూడు!' అంటూ నా ముక్కు దగ్గర ఉంచింది. అది వాసన చూడ్డంతోనే నాకు స్పృహ తప్పింది. ఇక ఆ తర్వాత ఏం జరిగిందీ నాకు తెలియదు" అని "నిన్న రాత్రే ఈ పని జరిగింది. మీ కళ్ళబడటం నా అదృష్టం. తిరిగి బ్రతికాను. మీరు కన్యాన్వేషణలోనే కదా తిరుగుతున్నారు. మీ పాదసేవ చేసుకుంటూ బ్రతుకుతాను. నన్ను భార్యగా స్వీకరించండి" అంటూ ప్రార్థించింది.

విజయుడికి చాలా ఆశ్చర్యం కలిగింది.

"ఆహా! స్త్రీ సాహసం ఎంతటిది? డబ్బు మీది ఆశ ఎలాంటి పన్లను చేయిస్తుందో కదా!" అనుకుంటూనే "కానియ్! దేవుడు నాకు ప్రయత్నం అవసరం లేకుండానే ఈ చిన్నదాన్ని సమకూర్చాడు. రూపంలో ఈమెకు దేవకన్యలైనా సాటిరావడం లేదు. ఇంతకంటే కావలసిందేమిటి?" అనుకుని ఆమెకు భయంలేదని చెప్పి రెండు మూడు రోజుల్లో ఆమెకు పూర్తి స్వస్థత కలిగేలా చేశాడు.

కొద్ది రోజులు గడిచాక- ఓ రోజు సాయంకాలం విజయుడు ఆమె గదిలోకి వచ్చి "నేను ఇందాక అంగడికి పోగా అక్కడ ప్రజలు నీ గురించి అద్భుతంగా చెప్పుకుంటున్నారు. రాజుగారు లేని సమయంలో నువ్వ

ఎవ్వరితోనే లేచిపోయావని నీ సవతి తల్లి వేట నుంచి వచ్చిన ప్రభువుతో చెప్పిందట! అప్పుడాయన చాలా కోపించి, నిన్ను వెతకవలసిందిగా నాలుగు వైపులకూ గూఢచారుల్ని పంపాడట. నిన్ను పట్టించిన వారికి పారితోషికం కూడా ఇస్తానన్నాడట. ఎలా కల్పించిందో చూడు! పట్నం అంతా ఎక్కడ చూసినా ఈ మాటలే గుప్పుమంటున్నాయి. కనుక మనం ఇక్కడుంటే ప్రమాదం రావచ్చు! పోనీ అని నిజం చెప్పినా ఇప్పుడెవరూ నమ్మరు. కనుక మనం వీలయినంత త్వరగా ఈ పరిసరాలు వదలడం మంచిది. నువ్వేమంటావ్?" అని అడిగాడు. 'అదే ఉత్తమం' అంది ఆమె కూడా!

ఆ నాటి అర్ధరాత్రి అతడామెని గుర్రం మీద ఎక్కించుకుని ఎంతో వేగంగా ప్రయాణించి, కొన్ని రోజులకు ఏదో పట్టణం చేరుకున్నాడు. అక్కడ ఒక సత్రంలో బసచేసి, ప్రయాణపు బడలిక తీరేదాకా రెండు మూడు రోజులు ఉండాలనుకున్నాడు. ఆ చీకట్లో ఆ సత్రం అరుగుమీద పడుకుని ఆలోచిస్తుంటే రాకుమార్తె "మనం ఎన్నాళ్ళు ఇలా చిక్కులు పడాలి? మనం ఎప్పటికైనా సుఖపడతామా?" అంది.

"నువ్వు విచారించకు. ఈ పట్నపురాజు మంచి సరసుడని విన్నాను. రేపు అతడ్ని దర్శిస్తాను. అది జరగ్గానే నీ దేహం అంతా బంగారంతో నింపడం- ఏడంతస్తుల మేడమీద హంసతూలికా తల్పం వేయించి అక్కడ నిన్ను కూర్చోపెట్టడం జరిగి తీరుతుంది. అప్పుడు నా ప్రభావం ఏమిటో నువ్వే చూడొచ్చు" అన్నాడు విజయుడు.

అదే సమయంలో- పట్టణంలో విశేషాలు తెలుసుకోడానికి మారు వేషంలో తిరుగుతున్న ఆ పట్టణపు రాజు భీమవర్మ ఆ మాటలు వింటూనే ఆశ్చర్యపోతూ "వీడెవడో నేర్పరి లాగానే ఉన్నాడు. కేవలం నన్ను చూడ్డంతోనే అంతధనం సంపాదిస్తానంటున్నాడు. ఏదో ఆడవాళ్ళ దగ్గర దంభాలు పలకడం అనుకుంటున్నాడు కాబోలు! అది డాంబికమో- నిజమో చూద్దాం!" అనుకుని వెళ్ళిపోయాడు. మర్నాడు ఉదయం సభ చేశాడు.

"మన పట్టణపు సత్రంలో విదేశీ దంపతులున్నారు. వారిలో పురుషుడ్ని సగౌరవంగా తీసుకుని రండి" అంటూ భటుల్ని పంపాడు. వాళ్ళు వెళ్ళి విజయుడికి ఆ వార్త చెప్పగానే అతడు చాలా సంతోషించి, రాజోచిత

వేషం ధరించి వారి వెంట కొలువు కూటానికి వెళ్ళాడు. రాజు అతడ్ని చూసి కూడా ఏమీ మాట్లాడకుండా, అతడ్ని తన దగ్గర్లో ఉన్న ఆసనం మీద కూర్చోమని చేతితో సంజ్ఞ చేశాడు. విజయుడు కూడా గంభీరంగానే ఉండిపోయి, ఎవరితోనూ మాట్లాడకుండా సభావిశేషాలు చూడసాగాడు.

మధ్యాహ్నం వరకూ సభచేసి, భీమవర్మ సింహాసనం నుంచి లేచాడు. సభలోని వారూ, విజయుడూ గౌరవసూచకంగా లేచి నిలబడ్డారు. కొందరు రాజు గారి దగ్గర సెలవు తీసుకుని ముందే వెళ్ళిపోయారు. రెండో విడతగా మరి కొందరు, మూడో విడతగా మరికొందరు వెళ్ళారు. నాలుగో తడవలో మంత్రి శెలవు తీసుకున్నాడు. అంతవరకు భీమవర్మ వెనుకనే అంటిపెట్టుకున్నట్లుగా నడిచిన విజయుడు "రాజా! అనుజ్ఞ ఇస్తే నేను కూడా శెలవు తీసుకుంటాను" అన్నాడు. "మంచిది" అన్నాడు భీమవర్మ.

రాజు అటు వెళ్ళగానే, విజయుడు మంత్రి శెలవు తీసుకున్న చోటుకు వచ్చాడు. "మంత్రి ఎవరు?" అని అడిగాడు అధికార దర్పం ఉట్టిపడే స్వరంతో. అంతవరకూ రాజు వెంట ఉన్నందున ఆయన రాజుగారికి ఎంతో ఆప్తుడయి వుంటాడు... అనుకున్నాడు మంత్రి. విజయుని గంభీర స్వరానికి వినయంగా "నేనే" అని బదులిచ్చాడు.

"ఓహో! నువ్వేనా మంత్రివి!సరే! మాకు ఇప్పుడు ఒక నూరు గజాల గొలుసును తవ్వడానికి సాధనాలతో సహా కొందరు కూలివాళ్ళను, ఓ మూడువందలమంది భటుల్ని సహాయంగాను ఏర్పాటు చెయ్యి! ఈ పట్టణంలో కొత్తవీధులు ఏర్పరచాలని రాజశాసనం. ఏ మాత్రం ఆలస్యమైనా మీ ఉద్యోగాలు నిలబడవు...." అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

మంత్రి భయపడుతూ "అలాగే! చిత్తం రెండు గడియల్లో అంతా సిద్ధం చేస్తాను" అన్నాడు. అన్నట్లుగానే అవన్నీ సమకూర్చి పంపాడు.

ఆ రాజకుమారుడు వాళ్ళందర్నీ వెంటబెట్టుకుని, ఇరుకు వీధులు చూసి మంచి మేడలున్న చోట్లకుపోయి "మేడమీదుగా గొలుసులు లాగించి "దీని మీదుగా కొత్త వీధి వెయ్యాలి. ఇందులో వున్నవాళ్ళు ఎవరు? వాళ్ళు తక్షణం ఇక్కడ నుంచి ఖాళీ చేయవలసి వుంది" అంటూ హడావుడి చేయడంతో ఆ మేడ యజమాని వెలుపలికి వచ్చి ఆ జనాన్ని అంతట్నీ చూసి తన మేడ

తవ్వడానికి వాళ్ళు సిద్ధంగా ఉన్నారని తెలుసుకుని "అయ్యో! కొత్తగా కట్టుకున్నాను. చాలా ధనం వ్యయమైంది. ఇలాటి మేడ కూలదోయిస్తాం అంటే ఏం చేస్తాను" అంటూ మొరపెట్టుకున్నాడు.

"అదంతా మాకు తెలీదు. లేచిపోతే లేచిపో! లేకపోతే ఇప్పుడే తవ్వించేస్తాను. అడ్డుకోబోతే బందిఖానాలో పెట్టిస్తాను" అంటూ తవ్వమని పనివాళ్ళని తొందర చేశాడు విజయుడు.

ఇంటి యజమాని మొర్రోమని ఏడుస్తూ అతని పాదాలపై పడితే "వట్టి మాటలకి పనులు జరగవు" అన్నాడు. ఆ సూచన గ్రహించిన ఇంటియజమాని విజయుడిని తన మేడమీదికి తీసుకువెళ్ళి గుసగుసలాడి చివరకు ఆ ఇంటి విలువలో కొంత సొమ్ము ఇవ్వడానికి అప్పటికప్పుడే సిద్ధపడ్డాడు.

విజయుడు అక్కడ్నుంచి పక్కమేడ దగ్గరకు వెళ్ళి గొలుసులను కొలతల నిమిత్తం ఆ మేడపై నుంచి లాగి పట్టించాడు. ఆ ఇంటి యజమాని కూడా అంతకుముందు మేడ యజమాని ఎలాగైతే చేశాడో, అదే రీతిగా కొంత రొక్కం తానూ విజయుడికి ధారపోసి అతడ్ని సమాధనపరిచాడు. ఆ వార్త పట్టణమంతా వ్యాపించింది. విజయుడు ఆ జనంతో తమ ఇంటి దగ్గరకు వచ్చీ రాగానే పెద్ద మేడలు గల వాళ్ళంతా, తమ తమ ఇంటి విలువలను బట్టి అతడేమీ అనకముందే ద్రవ్యం సమర్పించుకోసాగారు. అలా సాయంకాలం దాకా తిరిగేసరికి చాలా డబ్బు పోగైంది.

ఆ ధనాన్నంతా ఒక ఇంట్లో దాచి, పనివాళ్ళని పిలిచి "ఈ వూళ్ళో వాళ్ళంతా ఒకేరకం. మూర్ఖుల్లాగా కనిపిస్తున్నారు. ఎక్కడ వీధి వేద్దామన్నా, తమ ఇల్లుపోయేలావుందని ఎవరికివారే గోల. నాకు భూతదయ అధికం. ఒకరికి విచారం కలిగించే పని చెయ్యడం నాకు నచ్చదు. కనుక మీరు ఇప్పటికి వెళ్ళిపోవచ్చు! ఇంకోసారి చూద్దాం!" అని వాళ్ళందర్నీ ఉత్తచేతుల్తో పంపకుండా కానుకలిచ్చి మరీ పంపాడు. ఆ రోజున అలా సభకు రప్పించిన విజయుడిని భీమవర్మ ఆ తర్వాత పట్టించుకోలేదు.

మరునాడు ఊరిలో ఏడంతస్తుల మేడనొకదాన్ని కొని, దాన్ని అద్దాలతో, పటాలతో, బంగారంతో నింపి, ఏడో అంతస్తులో హంసతూలికాతల్పం

అమర్చి, అందులో తాను రాకుమార్తెకిచ్చిన మాట ప్రకారమే అంతా జరిపి ఆమెతో హాయిగా కాలక్షేపం చేయసాగాడు విజయుడు.

భీమవర్మ నెలకొకసారి రాత్రివేళ నగరంలో మారువేషంలో సంచరిస్తుంటాడు. అలా నగరంలో తిరుగుతూ ఒక చోట దీపాలకాంతులతో అద్భుతంగా ప్రకాశిస్తున్న విజయుని మేడ చూసి, ఆశ్చర్యపోయాడు. అది అలనాడు సత్రంలో పడుకొని తన భార్య దగ్గర బింకంగా పలికిన పురుషుడిదే అని గ్రహించాడు.

ఈ మేడ అతనిదే అయితే, అతడంతటి ఘనుడు ఈ భూమ్మీద లేడని చెప్పవచ్చు! ఇంత ద్రవ్యం అతడు ఇంత కొద్ది వ్యవధిలో ఎలా ప్రోగుచేశాడు అన్నది తల్చుకుంటేనే ఆశ్చర్యంగా ఉంది. రేపు కనుక్కోవాలి– అతడివైనం" అని ఆ మేడని గుర్తు పెట్టుకుని వెళ్ళిపోయాడు.

మర్నాడు మంత్రిని పిలిచి "ఆ దేవాలయం వీధిలో కుడి ప్రక్కగా ఉన్న ఏడంతస్తుల మేడ ఎవరిదో ఎరుగుదువా?" అని అడిగాడు భీమవర్మ "ఎరుగకనేం? దేవరవారి ప్రియమిత్రునిదే" అన్నాడు మంత్రి జవాబుగా.

"నేనే ఎరుగని ప్రియమిత్రుడెవరు?" అని ప్రభువు ప్రశ్నించగా "ఆ రోజు మీతో కూడా ఐదంతస్తులు ఎక్కి వచ్చాడే! అతడే!" అన్నాడు మంత్రి.

అతడికి ఇంత ధనం ఎలా వచ్చింది? అని ఆశ్చర్యపోతున్న రాజుకు అతడు చేసిన పనులు చెప్పాడు ఆ సచివుడు. భీమవర్మ ముక్కున వ్రేలేసుకుని "అన్నన్నా! వాడెంత నేర్పరి? వాడ్ని నేనెరుగను. నన్ను వాడెరుగడు. వాడు తన భార్యతో అన్న ఒకే ఒక్క మాట యదార్థమో– డాంబికమో చూద్దామని అలా రప్పించానంతే! వాడు చెప్పినంత చేశాడు. దీనివల్ల బుద్ధికుశలతా– నీ బుద్ధి మందం రెండూ తెలుస్తున్నాయి. 'నా ఆజ్ఞ'గా అతడేదిచెప్తే 'ఆజ్ఞాపత్రిక ఏదీ?' అని అడక్కుండానే అతడి మాట పాటించేశావు కదా! ఈ రోజు ఇదైంది. రేపు ఇంకొకటి కావచ్చు! అలా చేస్తే నీ కంటే మూఢుడు ఈ ప్రపంచం మీద ఇంకొకడుండడు. నేను ఇమ్మన్నానని చెప్తే ఏదైనా సరే ఇచ్చేస్తానన్నమాట!" అని మంత్రిని గట్టిగా మందలించాడు.

దానికా మంత్రి గడగడ వణుకుతూ "దేవా! మీరు స్వయంగా అతడికి వర్తమానం అందించి రప్పించారు. నాకంటే పై అంతస్తు వరకూ మీతో

అతడొచ్చాడు. ఎంతవాడు కాకపోతే మీతో అక్కడిదాకా వస్తాడు అనుకుని అతని మాటలు నమ్మాను. అంత మోసగాడని ఎవరికి తెలుస్తుంది? అతడు నా మీద చేసిన అధికారం- ప్రదర్శించిన దర్పం మీరైనా ఇంతవరకూ చెయ్యలేదెన్నడూ. ఏదైమైనప్పటికీ మీ ఆజ్ఞపత్రిక లేకుండా వాడికి అధికారం ఇవ్వడం మాత్రం నా తప్పే!" అని మంత్రి ఒప్పుకున్నాడు.

మర్నాడు భీమవర్మ మంత్రినీ- సామంతుల్నీ తీసుకుని విజయుడి మేడ దగ్గరకు వెళ్ళగా, విజయుడు ఇది ఊహిస్తూనే ఉన్నందున వాళ్ళందరికీ తగిన సత్కారాలు చేసి వాళ్లు వచ్చిన కారణం అడిగాడు.

అప్పుడు రాజు "అయ్యా! మీ వివరాలు తెలుసుకోవాలని మా కోరిక. మీ బుద్ధిబలంతో దేవలోకాన్నయినా సంపాదించుకోవచ్చు! మిమ్మల్ని ప్రధానమంత్రులుగా చేసుకోవాలనుకుంటున్నాం! మీ బుద్ధి చాతుర్యాన్ని ప్రశంసిస్తున్నాం! మీ మీద రాజ్యభారం వేసి కొన్నాళ్లు విశ్రాంతిగా ఉంటాను. మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు.

విజయుడు రాజుకు తన వృత్తాంతమంతా వినిపించగా, అతని చరిత్రము విని, ఆ ప్రభువు చాలా ఆనందిస్తూ అప్పుడే అతనికి ప్రధాన మంత్రిత్వం ఇచ్చి అధికార నిమిత్తం తన ముద్రికల్ని స్వాధీనం చేశాడు కూడా.

అది మొదలు విజయుడు రాజాస్థానానికి వెళ్తూ, రాజ్యపాలన చక్కగా చేస్తూ, ప్రజలను సంతోషపరచసాగాడు.

ఒకరోజు ఆ రాజకుమారుడు తన పేర కట్టించిన సత్రంలోని ఎంతమంది బ్రాహ్మణులు భుజిస్తున్నారో చూడాలనుకొని, భోజనాలవేళకు ఆ సత్రానికి చేరుకుని సంతృప్తిగా భుజిస్తున్న బ్రాహ్మణుల పంక్తుల మధ్య తిరుగుతూ- వారి-వారి కేమి కావాలో అడుగుతూ ఉండగా, అందులో అతని సోదరుడైన భానుడు కనిపించాడు. వికృతి వేషంలో వచ్చి భుజిస్తూన్న తన తమ్ముని దుస్థితికి విచారించి, భోజనం కాగానే అతడ్ని ఏకాంతంగా తన మందిరానికి తీసుకువెళ్ళి "తమ్ముడా! ఇలా ఉన్నావేం? నీవు కూడా దారిబత్తెం నిమిత్తం నాలాగే చాలా ధనం తీసుకెళ్ళావు గదా! అదంతా ఏమైంది? ఏ పిల్లనూ పెళ్ళాడలేదా? ఈ దైన్యస్థితి ఎలా దాపురించింది? పేద బ్రాహ్మడిలాగా సత్రాలు పట్టి తిరుగుతూ క్షత్రియధర్మం నీట్లో కలిపేశావు కదా! ఇంటికైనా

వెళ్లి పోలేకపోయావా? నేనెవరో గుర్తుపట్టావా? నీ అన్న విజయుడ్ని" అని తన వృత్తాంతం అంతా చెప్పాడు.

అప్పుడు భానుడు తెల్లబోయి కన్నీళ్ళుకారుస్తూ "అన్నా! నా దీనస్థితికి ఏం చెప్పమంటావు? నేను మన పట్టణాన్ని వదిలి, ఎన్నెన్నో ఊళ్ళుదాటి ఓ రోజు సాయంకాలానికి కుంభకోణం అనే పట్టణాన్ని చేరుకున్నాను. అక్కడ ఒక సత్రంలో బసచేసివున్న సమయంలో కొందరు, దూర్త శిఖామణులు, నా దగ్గరకొచ్చి, నన్ను నిలువునా పరిశీలించి, వినయంగా నా వృత్తాంతం తెలుసుకోవాలనుకుంటున్నామన్నారు. 'అతివినయం ధూర్తలక్షణం' అన్న నానుడి నా కప్పుడు గుర్తురాలేదు. "నేను పెళ్ళి చేసుకోవాలని కన్యను వెతుకుతూన్నట్లు- అక్కడ ఉత్తమ కన్యలెవరైనా ఉన్నారేమోనని చూస్తున్నట్లు" చెప్పి "కావలసినంత డబ్బు ఇస్తాను. ఉత్తమకన్యలెవరైనా ఉంటే చెప్పండి" అని చాలా నిజాయితీగా వాళ్ళను అడిగాను.

దాంతో వారికి నా దగ్గర బాగా ధనం ఉందన్న సంగతి బోధపడింది. "మంచిది! మీకు ఎలాటి కన్య నచ్చుతుందో అలాటి కన్యనే తీసుకొస్తాం! అయితే కొన్నాళ్లిక్కడ వేచి ఉండాల్సి ఉంటుంది" అన్నారు. అదిమొదలు నాకు ఎన్నెన్నో ఉపచారాలు చేయడం ప్రారంభించారు. నేను చాలా ఆనందిస్తూ, వాళ్లందర్నీ ఎంతో అయిన వాళ్ళుగా భావించసాగాను.

నాలుగు రోజులు గడిచాక, వాళ్ళొక చక్కని యువతిని నా దగ్గరకు తీసుకొచ్చారు. " ఈ పోలికతో ఉన్న స్త్రీని మీకు చూపించమంటారా?" అని అడిగారు. ఆమె నా ఎదుట ఎన్నెన్నో శృంగార చేష్టలు చేసి తన మనస్సు వ్యక్తపరచింది. ఆమె చూసిన తళుకు చూపులకే నా మనస్సు ఆమె వశం అయిపోయింది. ఆమె నా వద్ద ఉన్నంత సేపూ నాకు నోటివెంట పలుకైనా రాలేదు. మూగవాడినే అయ్యాను. వాళ్ళు ఆమెను కొంతసేపు ఉంచి, నా దగ్గర్నుంచి తీసుకెళ్ళిపోయారు.

మళ్ళీ వచ్చి "మిత్రమా! ఏమీ మాట్లాడవేం? అటువంటి కన్య అయితే ఇష్టమేనా? చెప్పు" అని అడిగారు. లోకానుభవం లేకపోవడం చేత "మిత్రులారా! ఎవరామె? ఆమెనే నేను పెళ్ళాడకూడదా ఏమిటి? ఆమెలాటిది ఇంకొకతే ఎందుకు? అని అడిగాను.

"అబ్బో! ఆమెను ఎన్ని ప్రయత్నాలు చేసి తీసుకువచ్చాం అనుకొన్నావు? సాధారణంగా స్త్రీలు వశమవుతారనుకున్నావా ఏమిటి? కోటీశ్వరులకు తప్ప వశం కారు. నువ్వు అలాటివాడివైతే చెప్పు! అప్పుడామెతో మాట్లాడదాం" అని చెప్పారు. నేను నా దగ్గర ఉన్న డబ్బంతా లెక్కచూసుకొని కోటి కంటే ఎక్కువే వుంది కదా అనుకొని, "దానికేం నేనా స్త్రీని భరించగలను" అన్నాను. అప్పుడు వాళ్ళు ఆ రొక్కమంతా తమ చేతికిమ్మన్నారు. "మీరా స్త్రీని నా వశం చేయండి ఇస్తా" నన్నాను.

ఆ మాట విని ఆ దుష్టులు ఒకనాడు నన్ను ఈ స్త్రీ ఉండే మేడమీదికి తీసుకువెళ్ళి ఒక మంచం మీద కూర్చోబెట్టారు. అంతలో ఆ స్త్రీ వచ్చి నా మెడలో ఒక పూలహారం వేసి నన్ను వరించానని చెప్పింది. అప్పుడు నేను సంతోష సముద్రంలో మునిగి నా ధనమంతా ఆమెకు స్వాధీనం చేశాను. అది మొదలు కొన్ని రోజులు హాయిగా ఇది పగలు– ఇది రాత్రి అనే తేడా తెలీనంతగా దాంతో సుఖాలు అనుభవించాను, ఎల్లకాలం అలాగే సుఖంగా గడిచిపోతుందనుకున్నాను.

మరికొన్ని రోజులు గడిచాక, దాని తల్లి అట!.... ముసలిదొకర్తె నా దగ్గరకు వచ్చింది. "అబ్బాయీ! నువ్వు చాలా రోజుల నుంచి మా ఇంట్లో నివశిస్తూ సుఖపడుతున్నావు. నువ్విచ్చిన సొమ్మంతా, మీ పక్కమీద పూలకు– నీ నోటి తాంబూలంలో వక్కలకు– పన్నీరు అత్తరులకే సరిపోయింది– ఇక మేం బ్రతకాలి? నీ దగ్గర సొమ్ము ఏమైనా ఉంటే తీసుకురా! లేకపోతే పో! మా పిల్ల ఇంకో భర్తని చూసుకుంటుందిలే" అని పలికింది.

అప్పుడు నేను "అయ్యో! ఇదినా భార్యకాదా? ఇంకొకర్ని ఎలా కోరుకుంటుంది?ఆ ధూర్తులు నాతో ఇలా చెప్పలేదే! ఇంకా నా దగ్గర సొమ్మెక్కడుంది? సొమ్మంతా మొదటే ఇచ్చేశాను" అన్నాను.

అప్పుడా ముసల్ది "మేలు మేలు!మేము వేశ్యలం! మా వృత్తి సంగతి నువ్వు ఎరగవు కాబోలు! మాకు ద్రవ్యమే భర్త. ఆ ధూర్తులుంచమన్న రోజులకన్న ఎక్కువగా నిన్ను ఉంచాం! ఇక పో" అని నన్ను వీధిలోకి త్రోసి తలుపేసేసింది.

కట్టుకున్న బట్టలు తప్ప నా దగ్గర ఏమీ మిగల్లేదు. నేనా వంచకులను వెతుకుతూ తిరుగుతూంటే, వీధుల్లో ఒక చోట వాళ్ళు నాకు కనబడ్డారు. వారితో ఆ ముసలిది నాకు చేసిన అవమానం గురించి సంపూర్ణంగా చెప్పాను. వాళ్ళు నా అమాయకత్వానికి నవ్వుతూ " అందుకు మేము ఏం చేస్తాం" అనేసి, నా మాట వినిపించుకోకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు.

అప్పుడు నేను చాలా దుఃఖపడి, ఇంటికెళ్తే అందరూ పరిహసిస్తారని భయపడి, కూడుగుడ్డలకు సైతం ముఖం వాచి ఇలా తిరుగుతున్నాను. మొన్నటి రోజున మీ ఊరు వచ్చాను! ఇదీ నా వృత్తాంతం" అని చెప్పాడు.

తమ్ముడి దురవస్థకు విజయుడు చాలా పరితపించాడు. కొత్త వస్త్రాలు-ఆభరణాలు ఇచ్చి కొన్నాళ్ళు తన దగ్గరే నిలిపాడు. ఒకరోజు-"తమ్ముడూ! మనం ఇల్లు వదలి సంవత్సరం దాటింది. మొదటి సంవత్సరం అంతం అయ్యే వేళకు ఎక్కడున్నా ఒక చోట కలుసుకోడానికి ఓ సంకేత స్థలం ఏర్పరచుకున్నాం! గుర్తుంది కదా! మన నియమం ప్రకారం మన ఇద్దరు తమ్ముళ్ళు కూడా అక్కడకు వచ్చి వుంటారు. వాళ్ళు మనకోసం వేచి ఉండొచ్చు కూడా! అందువల్ల మనం ఇప్పుడు అక్కడికి వెళ్ళాల్సి ఉంది. ఈ విషయం ఇది వరకు మర్చిపోయినా. నిన్ను చూడడంతోనే అది జ్ఞాపకం వచ్చింది" అన్నాడు. తలూపాడు భానుడు.

ఆ విషయాన్ని విజయుడు భార్యకు చెప్పగా, ఆమె ఎంతో ఆనందంగా తాను కూడా వస్తానన్నది. విజయుడు తనదేశం చూసి రావడానికి రాజు భీమవర్మ దగ్గర సెలవు పుచ్చుకున్నాడు. ముగ్గురూ కలిసి ప్రయాణ సన్నాహం అయ్యారు, అనుభవ శీలి కావడంతో విజయుడు ఎక్కువ డాంబికంతో వెళ్తే దేశ విదేశాల గురించిన విశేషాల మధ్య మధ్యలో తెలుసుకోవడం కష్టం అని, సామాన్యులవలె బయల్దేరాల్సి వుంటుందని సూచించే సరికి ఆ ప్రకారమే దారిలో అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో బస చేస్తూ, ఆ దేశ విశేషాలు తెలుసుకుంటూ కొన్నాళ్ళు ప్రయాణం సాగిస్తున్నారు వాళ్ళు ముగ్గురూ.

ఒకనాడు ఒక తోటలో బసచేసి విజయుడు భార్యతో కూడ కూర్చొని వినోదంగా మాట్లాడుకుంటూ ఉండగా, భానుడికి ఆ దృశ్యం చూసి

ఓర్వలేనితనం అధికమైంది. అతడు తనలో తాను ఇలా అనుకోసాగాడు.... ఆహా! మేము ఇద్దరం ఒక్క చక్రవర్తికే గదా జన్మించాం! వీడికి ఇలాంటి వైభవం పట్టడమేమి? నేను ఇలాంటి హీనస్థితి అనుభవించడమేమి? దేవుడెంత అన్యాయం చేశాడు. అటువంటి స్త్రీతో మాట్లాడుకుంటూ-హాయిగా కాలక్షేపం చేసే భాగ్యం నాకు లభించకపోయింది. నేను భార్యలేక ఏకాకినై దుఃఖిస్తూంటే, అది గమనించక ఇతడు భార్యతో ఎలా ఆనందిస్తూన్నాడో! కానీయ్! వీణ్ణి చంపి ఈ స్త్రీని స్వాధీనం చేసుకుంటాను. ఇంతకంటే సుఖించడానికి నాకు ఇంకొక ఉపాయమేదీ తోచడం లేదు" అని తలచి వాళ్ళు నిద్రపోయేదాకా పొంచి ఉన్నాడు.

ఆ దంపతులు ఆ రాత్రి కొంతసేపు ఇష్టాగోష్ఠిగా వినోదాలతో గడిపి, అంతలో రాత్రి చాలా సేపైందని ఇక నిద్రకు ఉపక్రమించారు. ఆ సమయంలో భానుడు మెల్లగా లేచి ఒక కత్తి తీసుకున్నాడు. ఎంతో అన్యోన్యంగా ఒకర్నొకరు కౌగలించుకుని నిద్రిస్తున్నారు దంపతులు. కత్తిని గురిచూసి అన్నగారి కంఠానికి వ్రేటు వేశాడు ఆ దుష్టుడు. ఆ వ్రేటుతో అతడొక్కసారి అమ్మో అని కేకవేసి ప్రాణాలు కోల్పోయాడు. ఆ అరుపులకు హేమ నిద్రలోంచి హడలిపోతూ లేచి నాలుగువైపులా చూసింది. భర్త మెడపైన పడిన కత్తినే చూస్తూ గుండెలు బాదుకుంటూ ఉంటే, అప్పుడు భానుడు ఆమెని తన హస్తాల్లో బిగించి పట్టుకుని "దేనికి చింతిస్తావు?" మా అన్న పరలోక గతుడయ్యాడు. ఎంత ఏడిస్తే మాత్రం తిరిగొస్తాడా? నేను నిన్ను అంతకన్నా ఎక్కువగా సుఖపెడతా. నాతో పద" అని పలికాడు.

అప్పుడా హేమ "ఓరీ దుర్మార్గా! ఎంతపని చేశావురా! భ్రాతృద్రోహీ! మీ అన్న నీకు ఏం అపకారం చేశాడురా? మీదు మిక్కిలి నీకు ఒక నీడ కూడా కల్పించి, ఇంతకాలం సాకాడే! కామాతృతచేత ఇలాంటి క్రూరమైన పని చేస్తావా? దీంతో నేను నీ వశం అయిపోగలనని ఎలా అనుకున్నావు?

నన్ను కూడా ఆ కత్తితోనే నరికేయి. నీకు పుణ్యం దక్కి భూమ్మీద చాలాకాలం బతుకు" అంటూ మూర్ఛపోయింది.

ఆ సమయంలో భానుడు, ఆ సౌందర్యరాశిని తాను చేజిక్కించుకుని గుర్రం మీద వేగంగా ఎటో తోలుకుంటూ పోయాడు.

పరిచారికలు అక్కడకు కొంత దూరంలో పరుండి ఉండడంతో రాత్రి జరిగిన ఈ దుర్ఘటన లేవీ వారికి తెలియవు. తెల్లవారి లేచి చూసి మరణించిన రీతిలో పడి ఉన్న విజయుణ్ణి చూసి, అక్కడ ఎవరూ కన్పించ కోవడంతో ఆ నేరం తమ మీద పడుతుందని భయం కొద్దీ ఎవరికీ చెప్పక తలోదారి పారిపోయారు.

దైవికంగా కొంత ప్రొద్దెక్కాక ఆ దారిన ఒక వైద్యుని రాక తటస్థించింది. కత్తి వ్రేటునైతే విజయుడు తిన్నాడు కాని, ఇంకా కొన ప్రాణాలున్నాయని ఆ రాజకుమారుని చూసి నిర్ధారించాడా వైద్యుడు. వృత్తిధర్మంతో పాటు మానవత్వం కూడా ఉన్న ఆ వైద్య శిఖామణి సమీప ప్రాంతాలన్నీ గాలించి, అనుభవజ్ఞుడైనందున మంచి మూలికలు ఏరి, ఆకులూ సేకరించి, ఆ పసర్లు పిండి- మూలికల్తో వైద్యం చేసి కుత్తుకలోంచి కత్తి తీసేశాడు. ఆ పసరు మహిమ ఎలాంటిదంటే- ఎక్కడ గాయమైందో తెలియరానంత చక్కగా కుత్తుక ఉత్తరించబడిన చోట చక్కగా అతుక్కొంది. దాంతో విజయుడు నిద్రలేచినట్లుగా లేచాడు.

అప్పుడా వైద్యుడు "నువ్వెవరు? నిన్ను ఇలా చంపిందెవరు? నీ ఆయువు గట్టిది కనుక- ఈ వైద్యం నాకొక్కనికే తెలిసి, దైవికంగా నేను ఇటు రావడం వల్ల నువ్వు బతికావు. అదీగాక కత్తివ్రేటు వేసిన వారు ఆ కత్తిని అలాగే ఉంచారు కనుక సరిపోయింది అదీ దైవికమే! అది తీసి వుంటే నువ్వు చచ్చిపోయేవాడివి. ఇంత దిక్కుమాలి వడిగ నువ్వొక్కడివిక్కడ చెట్టుకింద పడి ఎలా వున్నావు?" అని అడగ్గా పరిచారికలు ఏదో భయంకొద్దీ పారిపోయి

ఉంటారని ఆ సూక్ష్మబుద్ధి ఊహించుకున్నాడు.

విజయుడు అతనికి నమస్కరించి, "మహాత్మా! ప్రాణదాతలైన మీకు నేనేం ఇచ్చి రుణం తీర్చుకోగలను? మిమ్మల్ని నా పాలిట భాగ్యదేవతగా కొల్చుకోగలను. అంతేకాదు! జీవితాంతం స్మరించుకుంటాను. మీ వల్లనే నేను జీవించాను. నన్ను చంపినవాడు నా సోదరుడే అయి వుండాలి కాని, వాడికి నా పట్ల చంపేటంత అసూయ ఉంటుందా? అంటే అందుకు కారణం కనబడడం లేదు. ఇక ప్రాణం కంటే ప్రాణంగా నన్ను ప్రేమించే నా భార్య ఇలాటి పని చేస్తుందా? ఏమీ అనడానికి తోచడం లేదు. ముమ్ముందు నిజం దైవమే తెలుపగలడు. ఏదో ప్రస్తుతం నా దగ్గర ఉన్నదిది. దీనిని కాదనక స్వీకరించండి" అని ఎంతో విలువైన తన వ్రేలి ఉంగరాన్ని ఆ వైద్యునికి కానుకగా ఇచ్చి పంపి, మొదటే అనుకున్నట్లుగా సంకేత స్థలానికి ఓ పది రోజులు వ్యవధిలో చేరుకున్నాడు.

అక్కడ తన కోసమే ఎదురు చూస్తున్న చివరి తమ్ముడు చంద్రుడు అనేవాడు కనిపించాడు. అతడ్ని సంతోషంతో ఆలింగనం చేసుకుని "తమ్ముడూ! చంద్రా! ఇక్కడికొచ్చి ఎన్నాళ్ళయింది? రాముడు కనబడ్డాడా? ఎక్కడెక్కడ తిరిగావు? ఏమేమి వింతలు చూశావు. మా కోసం ఎదురు చూస్తున్నావు కాబోలు! పెళ్ళి చేసుకున్నావా? నేను నిన్ను చూడలేకపోయేవాడ్ని! దైవవశాత్తు బతికాను..... " అని తాను పట్టణం నుంచి బయల్దేరింది మొదలు ఆ క్షణం వరకు జరిగిన కథంతా చెప్పాడు.

ఆ కథ విని చంద్రుడు ఆశ్చర్యం, ఆనందం, శోకం ఒక్కుమ్మడిగా మనస్సుని ఆవరించగా "ఏమీ! మన భానుడెంత పన్జేశాడు? అన్నా! వాడే అని నేననుకుంటున్నా! లేకపోతే అక్కడే ఉండకపోతాడా? జ్ఞాతివైరం అంటారే! అది ఊరకే ఉండనిస్తుందా? సరే! ఇక నా వృత్తాంతాన్ని చెపుతాను! విను" అంటూ ప్రారంభించాడు.

చంద్రుడి కథ

"నేను మొదట ఉత్తర దేశం పోయి, అక్కడ ప్రసిద్ధమైనట్టి పట్టణాలలో ఉత్తమ లక్షణాలు గల రాచకన్నియల గురించి విచారిస్తూ వెళ్ళసాగాను. ఎక్కడా నా హృదయాన్ని ఆకట్టుకోగలిగినంతటి రాచకన్యల చరిత్రలు తెలియరాలేదు! అట్నుంచి పశ్చిమదేశ భూములన్నీ తిరిగాను. అక్కడా అదే పరిస్థితి. అంతగా నా మనస్సుకు నచ్చే రాచకన్యల వివరాలు అందలేదు.

ఒకరోజు కొందరు సిద్ధులు శ్రీశైలం వెళ్తూంటే, మహాశివరాత్రి నాటికి వారు అక్కడికి చేరుకోదలచారని తెలిసి, నేనూ వారిని కలుసుకొని శ్రీశైలానికి వెళ్ళాను. ఆ మహా పర్వదినం రోజున అక్కడి పాతాళగంగలో స్నానం చేసి, మల్లికార్జునునికి అభిషేకం చేసి, బిళ్వదళాలతో పూజించి, భక్తి శ్రద్ధలతో కొంతమంది ఆ పర్వత ప్రభావాన్ని గాథలుగా చదువుతుంటే సంపూర్ణంగా శ్రీశైల శిఖరాల మహాత్మ్యం విన్నాను. ఆ కథల్లో శ్రీశైలంలో గల గుహ విశేషాలు తెలిశాయి. వామన గుహ వృత్తాంతం వాటిలో బాగా గుర్తుపెట్టుకున్నాను.

ఆ మర్నాడు ఉదయం పాతాళగంగ వెంట తూర్పుగా కొంతదూరం నడిచి పురాణంలో నేను విన్న గుర్తులను సరి చూసుకుని, పైకి ఎక్కి కొంత దూరం పోయి చూడగా ఒక బిలం కనిపించింది. దాని ముఖ భాగంలోనే వామనమూర్తిని నిలిపి ఉండడం వల్ల 'ఓహో! ఇదే వామన బిలం అయి ఉండొచ్చు' అని నిశ్చయించి సాహసంతో అందులో ప్రవేశించాను. కొంత దూరం వరకు అది మనిషి నడిచిపోయేంత విశాలంగానే ఉన్నప్పటికీ- క్రమంగా చిన్నది కావడం మొదలైంది- ఇక వంగి కొంతదూరం నడవాల్సి వచ్చింది. మరికొంత దూరం చేతులు ఊతంగా ప్రాకుతూ వెళ్ళాను. ఆ గాఢాంధకారంలో ఏమీ కనిపించకపోవడంతో చేతులతో తడుముకుంటూ మరికొంతదూరం సాగాను. రాత్రీపగలూ తేడా తెలీదు. ఎన్నాళ్ళు ప్రయాణించానో తెలీదు.

పోతూన్న కొద్దీ అది మెలికలు తిరగటం ప్రారంభించింది. పైగా ఇంకా చిన్నదై మనిషి దూరేటంత ప్రదేశమే ఉండసాగింది. అతి ప్రయత్నం మీద

నేను అందులో ప్రయాణిస్తున్నాను. ఒక చోట నా పరిస్థితి ఏమని చెప్పను. అటు- ఇటు కదలబడని ఇరకాటం. మనసులో బెదురు ప్రారంభమైంది. ఇంత కష్టపడి ప్రాకి వచ్చిన ప్రయాణమంతా నిష్ఫలమేనా? నేను అక్కడక్కడ సంచరించి ఇంటికిపోక ఈ శ్రీశైలానికి రానేల? ఏదో వచ్చిన వాణ్ణి పురాణవచనం విని, ఈ గుహలో జొరబడనేల? ఇలాంటి మార్గాలు అందరికీ తెలియకనా? సరైన దారులుంటే ఇంతకాలం ఈ గుహల్లోకి ఎవరూ చొరబడి, పోకుండా ఉంటారా? వెనక్కు జరగలేకపోతున్నాను. ఊపిరాడడం లేదు. నాకీ గుహలో దిక్కులేని చావు రాసి పెట్టి ఉంది కాబోలు! ఇక రెండు మూడు ఘడియల కంటే ప్రాణాలు నిలబడవు. భగవంతుని ధ్యానించుకుంటే ఇప్పుడైనా పుణ్యం వస్తుంది.... అనుకుంటూ దైవస్మరణ చేస్తూ నా ప్రాణాలు ఎప్పుడు పోతాయా అని ఎదురుచూడసాగాను.

అత్యాశ్చర్యకరంగా, చెప్తే వినేవారికి నమ్మశక్యం కానంతగా నా చెవులకు ఎక్కడనుంచో మనోహరమైన వీణాగానం వినిపించసాగింది. ధ్యానంలోంచి కళ్ళు తెరచి చూశాను. “ఓహో! నేను ఇంకా బ్రతికే ఉన్నాను. కనుకనే గానం వినిపిస్తోంది. ఇంతకూ ఇది ఎక్కడ్నుంచి వస్తోంది? మరణావసాన సమయంలో ఇలాటి నాదాలు ఏమన్నా వినిపిస్తాయేమో!” అనుకుంటూ ఉండగా, ఆ ధ్వని ఇంకా స్పష్టంగా వినిపిస్తూ ఆ బిలంలోనుంచే వస్తోందని తెలుసుకున్నాను.

తిరిగి నాకు జీవితం మీద ఆశ చిగురించింది. చేతులు రెండూ కూడదీసుకుని, పైకి తడిమి బాగా సాచేసరికి, నా వ్రేళ్ళకు పైన ఖాళీస్థలమున్నట్లు తోచింది. వాటిని అలాగే పైకి జరపగా మొత్తం చేతుల్ని పైకి నిలువుగా ఉంచగలిగాను. ఇక నేను పైకి ప్రాకాల్సి ఉంటుందని గమనించి, శరీరాన్ని అందుకు అనువుగా నిట్టనిలువుగా కూడదీసుకుని ముందే పైకెత్తి ఉంచిన చేతులతో జై పరమేశ్వరా అంటూ కాళ్ళతో పైకి ఎగదన్నాను. అలా తన్నడం వల్ల నా దేహం ఇంకొక బారెడు ముందుకు జరిగే అవకాశం లభించింది. అందుకు సంతోషిస్తూ నిట్టనిలువుగా ఇంకో రెండు బారలు సులభంగానే డేకి, పైకి ముఖం పెట్టి చూడగా బిలం మళ్ళీ

విశాలమవుతున్నట్లు స్పర్శవల్ల గుర్తించగలిగాను. నా ఊహ ప్రకారం అది మళ్ళీ గుహ ప్రారంభం వద్ద ఎలా ఉండేదో, నడిచిపోవడానికి వీలైనంత పెద్దదిగా ఉండవలసింది. మరి కొంత ప్రయత్నంలో ఓ పదిబారల దూరం అలాగే సాగాను. నా ఊహ నిజమైంది. కూర్చొని కొంతదూరం, మోకాళ్లపై కొంతదూరం, వంగి కొంతదూరం వెళ్లాక గుహ బాగా వెడల్పుగా,నిలువుగా నడిచి వెళ్ళేంత పెద్దదై నాకు మార్గాయాసం మర్చిపోయేలా చేసే సరికి అంతా దైవ కటాక్షం అనుకున్నాను.

అప్పుడొక గొప్ప వెలుతురు నా కళ్ళకు దారి చూపించింది. ఊపిరి హాయిగా తీసుకుంటూ, ఓ నరక కుహరాన్ని దాటినంత సంతోషంగా అటువైపు అడుగులు వేశాను. అక్కడ తప్పకుండా ఏదో విశేషం ఉండి ఉంటుందని నాకు అనిపించసాగింది. గానం వినిపిస్తూన్న జాడని బట్టి అటువైపే ఆ గుహలో నడుస్తున్నాను. కాని కొంతసేపటికి వీణానాదం ఆగిపోయింది.

నేను ఆశ్చర్యపోతూ, ధైర్యమే తోడుగా కొంతదూరం నడిచే సరికి గుహ అంతమైపోయాయి. ఒక అరటితోటలోకి ప్రవేశించారు. ఆకలిగా ఉండడంతో అరటిపళ్ళుతిని, అక్కడే ఉన్న చెరువులో మధురాతిమధురంగా ఉన్న పానీయాన్ని మరిపించేలా ఉన్న నీళ్ళు తాగి, గుహలో నేను పడ్డ మార్గాయాసం తీరిపోయేలా చిత్తుగా నిద్రపోయాను. లేచిన తర్వాత ఆ అరటితోటకు ఒక వైపున కొంతదూరంలో ఒక మార్గం కనబడింది. దాని వెంట పోగా, ఒక విశాలమైన ఆవరణా– దానికొక ప్రవేశద్వారం చూశాను నేను.

అందులో నేను ప్రవేశించేసరికి, నా కళ్ళకు మిరుమిట్లు గొల్పాయి రత్నాలకాంతులు. అదొక స్ఫటిక శిలామంటపం. అందులో బిల్వదళాలతో అర్చింపబడిన ఒక స్ఫటిక శివలింగం కన్నుల పండుగ్గా కనిపిస్తోంది. పూజ సామాగ్రి, పాత్రలు చాలా వున్నాయి. అక్కడ ఒక వీణ మేళవించబడి ఉంది. తూర్పు భాగాన రత్నసోపానాలతో మెరుస్తూ ఒక తటాకం ఉంది. ఆ విశేషాలన్నీ చూశాక "ఇది దేవభూమి కాబోలు! నాకు ఇందాక వినిపించిన

వీణానాదం ఈ వీణదే అయి వుండాలి. ఎవరో స్వామిని అర్చించి, రాజోపచారాల్లో చెప్పబడిన 'గానం' వాద్యంపై పలికించారు కాబోలు!" అనుకుంటూ ఆశ్చర్యపోతూనే, 'అమానుషమైన విశేషాలు చాలా చూడగలిగాను. ఈ జన్మానికిది చాలు! నేను కూడా ఈ మహాలింగరూపుని అర్చించెదగాక' అని కూడా అనుకున్నాను.

మహాత్ములెవ్వరో ఈ లింగాన్ని పూజిస్తున్నారు. వారి వృత్తాంతాన్ని తెలుసుకుంటే ఎలా వుంటుందీ? అనిపించింది. మరికొంత ముందు కెళ్ళాను. అక్కడ కుడివైపు ఒకద్వారం – ఎడమవైపు ఒక ద్వారం వున్నాయి. కొంతసేపు తటపటాయించి ఎడమవైపు ద్వారం లోనికే వెళ్లాను. ఆ మార్గం నన్ను ఒక కొండశిఖరం మీదికి తీసుకుపోయింది. వెనక్కి తిరిగి చూడబోతే గుహద్వారం కనిపించలేదు. ఆ కొండమీద ఏదైనా క్రూరమృగం నన్ను కబళించవచ్చునేమో అని వెరపు పుట్టినా, ఓ చెట్టు క్రింద చతికిలబడ్డాను. ఇంతలో ఒక పెంపుడు ఏనుగు తొండంతో బంగారు కలశం పట్టుకుని కిందకు వెళ్తోంది. నేను దానికి కొంచెం వెనుకగా నడవసాగాను.

ఆ ఏనుగు కొండదిగి పాతాళగంగ ఒడ్డుకు వెళ్ళింది. ఆ గంగా ప్రవాహంలో అది కలశం ముంచి నీరు తీసుకుని తిరిగొస్తుండగా నేను దానికి ఎదురుగా నిలబడ్డాను. అది బెదరలేదు. నేను సాహసించి దాని తొండం తడుతూ, దాని మీదికెక్కి కూర్చున్నాను. అది నేను ప్రవేశించిన ద్వారంలోకే ప్రవేశించింది. అయితే – చిత్రం! నాకు ఇందాక ఆ ద్వారం కనిపించలేదు కదా! వేగంగా వెళ్లిన ఆ ఏనుగు స్ఫటిక శిలా మండపంలో ఆ కలశాన్ని ఉంచింది. నేనూ అక్కడే దిగి చెరువులో స్నానం చేసి, కలశంలోని జలంతో ఆ లింగానికి అభిషేకం చేసి, పూలతో పూజించి ధ్యానిస్తుండగా, ఎవరో వస్తున్నట్లు అనిపించి, ఓ మూలకి వెళ్ళి దాక్కున్నాను.

కొందరు అందగత్తెలు గుహద్వారంలోంచి వచ్చారు. వారిని చూడగానే నా శరీరం వణికింది. ఎలాగో మనస్సు దృఢపరచుకొని, వారి అకార విశేషానికి ఆశ్చర్యపోతుండగా, అంతలోనే వారి దేహాలు వస్త్ర రహితంగా మారాయి. వారు ఆ చెరువులో జలకాలాడి తిరిగి వస్త్రాలు ధరించారు. ఆ దివ్య లింగం చుట్టూ కూర్చొని పూజలు చేయడం చూశాను. దీన్నిబట్టి

వారు అక్కడికి అలవాటుగా పూజకు వస్తారని నాకు అర్థమైంది. అలాగే కొత్తవారెవరో వచ్చి పూజ చేస్తున్నారని వారు కనిపెట్టారు. ఆ కొత్తమనిషిని నేనే కదా! మర్నాడు కొత్తవారిని కనిపెట్టాల వారు నిశ్చయించుకుని ఆ వేళకు స్వామి వార్ని అర్చించి వెళ్ళిపోయారు.

అప్పుడు నేను ధైర్యంగా మంటపంలోకి వచ్చి, ఆ దివ్యాంగనల నివాసం కనుక్కొందామని ఈ సారి కుడివైపు ద్వారంలోంచి వెళ్లాను. ఇంకొకచోట మరో రెండు ద్వారాలు కనిపించాయి. కుడివైపు ద్వారంలోంచి వెళ్ళాను. ఇంతకుముందు ఏనుగు ధర్మమా అని వెళ్లగలిగాను. ఇప్పుడు ఎలా వెళ్లను?

ఆ అడవంతా బిల్వ వృక్షాలే! వాటి ఫలాలే తింటూ ఆకలి అణచుకొని, రెండు మూడు రోజులకు అది విసుగొచ్చి ఇక నా తనువు చాలించేద్దా మనుకున్నాను. బిల్వవృక్షం పుణ్యదాయకం అని ఒక వృక్షాన్నెక్కి దాని కింద వున్న పెద్ద బండరాతిపై పడి ప్రాణాలు త్యజించాలని నిశ్చయించుకుని "శివా! స్ఫటిక లింగమూర్తీ! నిన్ను నిరంతరం పూజించే ఆ దివ్య సుందరి ఎవరోగాని, ఆమెను వచ్చే జన్మలోనైనా నాకు భార్యగా దయసేయుము" అంటూ దేవుని ప్రార్థించి, దూకబోతూ క్రింద చూసేసరికి పాషాణం కన్పించలేదు.

ఆశ్చర్యంగా నాలుగు మూలలు చూసేసరికి, నన్నా వృక్షం ఎటో తీసుకుపోతున్నట్లుగా అనిపించింది. నేను ఒక కొమ్మని గట్టిగా పట్టుకుని నా హృదయంలో ఆ స్ఫటిక శిలా మండపాన్నే నిలుపుకున్నాను. కుదుపుల్లేకుండా చాలా వేగంగా ప్రయాణించింది ఆ వృక్షం. మనుషుల కోలాహలం విన్పించి కళ్ళు తెరిచి చూసేసరికి, పెద్ద పెద్ద మేడలుగల ఒక పట్నం మధ్యన ఒక దేవాలయం దగ్గర ఆ చెట్టు నిల్చి ఉంది.

అక్కడ ఆలయంలోని శివలింగానికి ఎంతోమంది అర్చనలు చేస్తున్నారు. అది ఏ దేశమో తెలుసుకోవాలనిపించి దిగబోయి కూడా ఆ వృక్షరాజం వెళ్ళిపోతుందేమో అనే అనుమానంతో చెట్టుమీంచి దిగకుండా ఆగిపోయాను. అక్కడ భక్తుల ప్రార్థనలను బట్టి అది కాశీపట్నం అని తెలిసింది. కాశీ విశ్వనాథుని చూసినందుకు నా జన్మ ధన్యమైందని తలచేటప్పటికీ ఆ గుడి అంతర్ధానమైంది. నాలుగు మూలలా పరికించి చూసేసరికి రామలింగేశ్వరుని ఆలయం కనిపించింది. ఆ తర్వాత అదీ మాయమై కేదారేశ్వరుని ఆలయం కనిపించింది.

ఆ ప్రకారంగా ఆ వృక్షరాజం ధర్మాన ఎన్నెన్నో దేవాలయాలను చూడగలిగాను. ఆ వృక్షాన్నే ప్రత్యక్షదైవంగా తల్చుకుంటూ అది ఎంత వేగంగా పోతున్నదీ చూడాలని కళ్ళు తెరిస్తే దిక్కులు అల్లుకుపోయినట్లు కన్పించాయి. తప్ప ఇంకేమీ కన్పించలేదు. శ్రీశైలంలో సంచార వృక్షాలున్నాయని పురాణాల్లో విని వున్నాను కనుక అది సంచారవృక్షమేనని అనుభవపూర్వకంగా గ్రహించాను. ఆహా! యంత్ర నిర్మితాలైన రథాలుగాని-పుష్పక విమానాలుగాని దాని గొప్పదనానికి సాటిరావు. ఆ సంచార వృక్షం ప్రతీ, శైవక్షేత్రంలోనూ తన ఆకులు విదిల్చింది. అవి ఆయా లింగాలపై పడ్డాయి.

నేను హృదయంలో ఆ స్ఫటిక శిలామండపాన్నే తలచుకోసాగాను. ఇంతలో సంచారవృక్షం కొండ ప్రక్కన ప్రవహించే పాతాళగంగ వద్ద ఆగి ఉంది. నేను అక్కడ మెట్లు గుర్తుపట్టాను. నేను చెట్టు ఎక్కిన ప్రదేశం అదే! నేను దిగగానే చెట్టు మాయమైపోయింది. ఆ చెట్టు కనపడకపోవడంతో చాలాసేపు తల్లిని ఎడబాసిన పిల్లలా మనస్సు తల్లడిల్లుతుంటూ విచారంగా వుండిపోయాను. అక్కడ ఆ చెట్టు ఆగడానికి కారణం ఏమిటై ఉంటుందా అని చూస్తుంటే, అక్కడ ఆ వృక్షం యొక్క పత్రిచేత అర్చించబడిన శివలింగం ఉంది.

ఏదో దైవ సంకల్పమా అన్నట్లుగా, మునపటి ఏనుగు మళ్ళీ అక్కడికి వచ్చింది. గతంలోలాగానే నేను దాన్నెక్కి ఆ స్ఫటిక శిలా మండపాన్ని చేరుకున్నాను. మళ్ళీ అవే దృశ్యాలు... ఆ దేవకన్యలు చెరువులో జలకాలాడి, శివలింగాన్ని భక్తితో అర్చించారు. పూజ చేసిన సుందరి, కొంత మంది చెలికత్తెలతో అరటితోటలోకి వెళ్ళింది. మంటపంలో ఇద్దరు స్త్రీలు ఇలా సంభాషిస్తుంటే, చాటుగా వింటున్నాను....

“మల్లికా! మన సఖి గొప్ప అందగత్తె అయి వుండి కూడా, వివాహానికి సమ్మతించడం లేదెందుకని? తన యవ్వన మంతా అలా అడవికాచిన వెన్నెల్లా చేయడానికి కారణం ఏమై ఉంటుంది?” అడిగింది తమాలిక.

“ఇదో రహస్యం తమాలికా! మొన్ననే చారుమతి వల్ల విన్నాను. నీకు తెలీదనుకుంటా! చెప్పనా?”

"చెప్పు! నాకు నిజంగా తెలీదు. అయినా మన మధ్యరహస్యాలెందుకులే!"

"నలకూబరుడు ఆమెను వరించాడట! దూతద్వారా ఆ సంగతి ఆమె తండ్రికి తెలిపాడు. 'నలకూబరుడికి రంభమీద నిరంతరం ఆసక్తి కదా! అందువల్ల కూతుర్నిచ్చి అతడికి కట్టబెట్టడం, మన సఖి తండ్రికిష్టం లేదు. సవతివల్ల ఆమె పరాభవం పొందుతుందేమో అని ఆయన భయం! కాని, తన కూతుర్ని అడిగినవాడు సామాన్యుడు కాడు, రాచబిడ్డ, ఏం చేయాలా? అని ఆలోచిస్తూ, ఆయన తన ఇష్టదైవాన్ని హాటకేశ్వరుని ధ్యానించి నిద్రపోయాడు. ఆయనకు కలలోన 'అరజాములో భూలోకపు దివ్య శైవక్షేత్రాలన్నీ తిరిగివచ్చిన వాడికి తప్ప ఇతరులకు నీ పుత్రికను ఇవ్వవద్దు' అని పరమేశ్వరుడు ఆనతిచ్చాడట! ఆయన ఆ వర్తమానమే నలకూబరునికి చెప్పేసరికి అంతటి అందగాడు కూడా మన సఖిని చేపట్టే మార్గం కానరాక విముఖుడయ్యాట్ట! ఎందరు యక్షకుమారులు వచ్చి అడిగినా, అందరికీ మన సఖి చారుమతి తండ్రి ఇదే చెప్తున్నారట. నాతో చారుమతి అన్నది..."

"ఎంతో ప్రతిభాశాలి తప్ప. ఇతరులెవరూ ఆ పని చేయలేరు....తీరా ఆ మహత్కార్యం నెరవేర్చగలిగేవాడు రూపవంతుడో- కాడో! సాధారణంగా ప్రతిభ- రూపం ఒక్కరిలో ఉండడం అరుదు" అంది తమాలిక.

"రూపం ఉన్న చోట ప్రతిభ తప్పక ఉంటుంది. అయినా పరమేశ్వరుని మాట వ్యర్థమవుతుందా?" మల్లిక సమాధాన పరిచింది.

అంతలో అక్కడికి చారుమతి వచ్చింది.

మాటల సందర్భంలో అన్నదామె. "నాకు రాత్రి ఒక కల వచ్చింది. ఆ కలలో నేను ఒక మానవుణ్ణి వివాహం చేసుకున్నానుట. అతనిది మన యక్షరాజపుత్రుడైన నలకూబరుని సైతం వెక్కిరించగల సౌందర్యమట!"

"దేవతలనూ- యక్షులనూ మించిపోగల సోయగం గల రాజ కుమారులు ఎందరెందరో ఉన్నారు" అంది మల్లిక. చారుమతి తలూపింది.

"నిజమే! శివరాత్రికి శ్రీశైలం వెళ్ళినప్పుడు పురాణం శ్రద్ధగా వింటూ వున్న ఒక యువకుడిని చూశాను. అంత సొగసైనవాడిని నేనెక్కడా ఇంతకాలం చూడలేదంటే నమ్ము! అతడి వివరాలు తెలుసుకుందామని చాలా సేపు అక్కడే వున్నాను. కాని వీలుపడలేదు. మన చారుమతికి

అటువంటి సుందరుడే లభించేలా శ్రీ మల్లికార్జునస్వామి వారిని ప్రార్థించాను. నువ్వు కన్న కల నిజం అవ్వాలి చెలీ!" అంది మల్లిక.

"వేళదాటి పోతోంది! వెళ్లిపోదాం పదండి" అని చారుమతి అనగానే, అందరూ గుహ మార్గం గుండా వెళ్లిపోయారు.

వాళ్ళ మాటలను బట్టి స్ఫటిక శిలా మండపంలో ఉన్నది హాటకేశ్వర లింగం అనీ– చారుమతి వివాహం నిమిత్తం ప్రతిరోజూ ఆ స్వామిని ఆరాధిస్తోందనీ– మారేడు వృక్షం నన్ను అన్ని దివ్య క్షేత్రాలనూ తిప్పడంలోని అంతర్యం బహుశా ఆమెతో నాకు జతకూర్చాలనే అయి ఉంటుందనీ నేను నిశ్చయం చేసుకున్నాను. దాంతో ఆ మంటపంలో నిర్భయంగా విహరిస్తూ, అరటిపళ్ళు తిని నీళ్ళు తాగుతూ కాలం గడపసాగాను.

అటువంటి ధైర్యం వచ్చేసరికి నాలో సంతోషం అధికమై, ఉదయాన్నే స్నానం చేసి, జపం చేసుకుని తర్వాత అక్కడ పూజ పాత్రలు తారుమారు చేసి, ముందురోజు నిర్మాల్యాన్ని చెరువులో వేసి, లింగానికి అభిషేకం చేశాను. పూలతో సహస్రనామార్చన చేశాను. ఆనందంగా వీణమీద మంగళగీతాలాలపించాను. తరువాత దేవకన్యలు మళ్లీ వచ్చారు. కొత్తవాళ్ళపనే ఇది అని నిర్ధారించి, నా కోసం అన్ని దిక్కులా– మూలమూలలా వెతకసాగారు. మల్లిక నేను ఉన్న పూలతోటలోకి వచ్చింది. నన్ను చూసి వెళ్ళింది. ఆమె చెప్పినట్లుంది. కొంతసేపటికి మరి కొందరు జవరాళ్ళు వచ్చి దూరాన నిలిచి నన్ను పరిశీలించి వెళ్లిపోయారు. అయితే నన్నెవ్వరూ మాట్లాడించలేదు.

నాకూ కుతూహలం అధికమై వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో అని చాటుగా వినసాగాను. "మీలో ఎవరైనా అతనితో మాట్లాడారా?" అని అడిగింది చారుమతి. లేదన్నారు వాళ్లు. తానే రాకుమారుడినే శ్రీశైలంలో చూసినట్లుగా చెప్పింది చారుమతి. అప్పుడా విషయం విన్న నా ఆనందానికి మేరలేకపోయింది. నా వివరాలు తెలుసుకుని రమ్మని చారుమతి మల్లికను ఆదేశించింది.

ఆమె పూలు కోసే నెపంతో నన్ను చేరవచ్చి, చారుమతిని గురించి చెప్పి, శ్రీశైలంలో నన్ను చూశానన్నది వివరాలు అడిగింది.

"అంతా శ్రీశైల మల్లికార్జునుని అనుగ్రహం" అంటూ నా వృత్తాంతం అంతా చెప్పాను. నేను అసాధారణ మానవ ప్రతిభా సంపన్నుడిని గనుకనే అక్కడికి చేరగలిగినట్లు చెప్పి, తమ సఖి చారుమతి పూజలందుకోడానికి నన్ను అంగీకరింపచేసింది.

నేను మంటపానికి వెళ్ళాను. మన్మథావస్థకు లోనౌతున్న మా ఇద్దరి మేనులకూ పరవశం కలిగించేలా, చారుమతి నా మెడలో ఒక పుష్పహారాన్ని వేసింది. నేనూ ఆమెకు పుష్పమాలిక వేశాను.

నాకు దేవేంద్రుని పట్టణమైన అలకాపురిని చూడాలని అభిలాష. అది వాళ్లు ఎలా గ్రహించేశారో! మల్లిక నా మనసులోని మాట నాకే చెప్పి "చారుమతితో కలిసి మీరు అలకాపురిలో విహరించాలంటే, ఆ పూలవనంలోని సరస్సులో శుచిగా స్నానం చేసి రండి" అన్నారు. నేను నీట నిలబడి మూడు మార్లు చేతులతో నీరు చిమ్ముతూ మునిగి లేచేసరికి నాకు స్త్రీ రూపం వచ్చేసింది. "ఓ చిన్నదానా! ఇంకా స్నానం కాలేదా? ఇలారా త్వరగా" అని నన్ను పిలుస్తుంటే అప్పుడు చూసుకున్నాను- నా దేహంవైపు. ఇంకేముందీ నా పురుషత్వంపోయి నిండైన స్తనాలు, పెద్ద పిరుదులు, కోలకళ్ళు, కచభారంతో అచ్చమైన స్త్రీత్వానికి ప్రతీకలా సిగ్గుపడుతూ ఆ కొలనులోంచి బయటకు రాలేక పోయాను. "అయ్యో! నన్నీ యక్షకాంతలు మోసం చేశారు. యక్షిణీ మాయ అంటారు. ఇదే కాబోలు! దీని వల్ల వీళ్లకు వచ్చే లాభం ఏమిటి?" అని చింతిస్తూంటే "వనితా! సిగ్గుపడకు. ఇక్కడ ఉన్న వాళ్ళందరం ఆడవాళ్ళమే! ఇందులో మునిగిన పురుషులు స్త్రీలు అవుతారు. నిన్ను ఈ రూపంలోనైతేనే అలకాపురిలో త్రిప్పడం మాకు సాధ్యం! విచారించక గట్టుమీదికిరా!" అని గట్టిగా, పలికేసరికి నేను వారితో కలిసి తిరిగి మంటపం వద్దకు స్త్రీ రూపంలో వెళ్ళాను. నన్ను చూసి వాళ్ళంతా ఒకటే నవ్వులు- పరిహాసాలు, నాకేమో సిగ్గు. వాళ్ళ మాటలకు జవాబులేం చెప్పకుండా తలవంచుకుని నిలబడ్డాను. అప్పుడు చారుమతి నిస్సంకోచంగా నా చెయ్యి పుచ్చుకుంది. తనతోపాటు వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళేముందు, ఇతరులకు చూడసాధ్యం కాని దేవేంద్రపురిని

నాకు చూపించింది. ఆడ రూపంలో చెలికత్తెల మధ్య ఉన్నందున నన్నెవరూ గుర్తుపట్టలేదు. ఇంద్రపురీ వైభవం సంగతి అలా ఉంచు! చారుమతి అంతః పురంలోని వింతలు అన్నీ ఇన్నీ కావు. అది నిజంగా ఇంద్రజాలమే! అక్కడ విశేషాలు సంక్షిప్తంగా చెప్పినా సంవత్సర కాలం పడుతుంది. భోజనం- విహార వేళలలో చారుమతి నన్ను అత్యంత గౌరవంగా- ప్రేమగా చూస్తోంది- ఇద్దరం ఒకే మంచం మీద నిద్రిస్తున్నాం! కాని ఏం లాభం? సంభోగించశక్తిలేని ఆడదాన్నయితిని. అది చారుమతికి కూడా విరహాన్ని కలిగిస్తున్నది. నా పురుషరూపం వేడుకగా చూడాలని ఆమెకూ తహతహగానే ఉంది. మల్లికతో మంతనాలు జరిపింది.

అప్పుడు చారుమతికి మల్లిక, హామీ ఇచ్చింది. నాకు పురుష రూపం కలిగించడానికీ- ఆ రహస్యం ఆమె తల్లిదండ్రులకు తెలీకుండా కాపాడటానికీ సిద్ధపడింది. నన్ను ఇంకొక తటాకంలో స్నానం చేయమని చెప్పగా, నేను ఆ విధంగా చేసినా ఎప్పటి రూపాన్ని పొందాను.

నన్నూ- చారుమతినీ లతా మంటపంలో ఒక పూలశయ్యమీదికి చేర్చి, రకరకాల వినోదాలు జరిపించి, మల్లిక మొదలైన చెలులంతా అక్కడ్నుంచి తప్పుకున్నారు. ఆ రాత్రి మన్మథ సామ్రాజ్యపు అంచులు ఇద్దరమూ తనివితీరా చూశాం! అసాధారణ సుఖానుభూతులతో తేలిపోయాం!

అలా అక్కడ కొన్నాళ్ళు చారుమతితో స్వర్గసౌఖ్యాలు అనుభవించాను. శివపూజ పేరుతో చారుమతి నాతో ఎక్కువసేపు గడిపి వెళ్తూండేది. నేను బిల్వవృక్షం మీద సమస్తశైవక్షేత్రాలనూ తిరిగినవైనం ఆమెకు చెప్పగా, ఆమె ఎంతో ఆనందించి "నేను కామాతురతవల్ల ఇలా ప్రవర్తించినా మా తండ్రికి శివుడానతిచ్చిన ప్రకారం సరైన వరునికే మనసిచ్చానన్న మాట!" అన్నది. తన తల్లిదండ్రులకు ఆ విషయం ఆమె చెప్తానంటే "నీ వివాహ ప్రయత్నాలు వాళ్ళు తలపెట్టినపుడు చెప్పవచ్చులే" అంది మల్లిక.

అంతలో ఏడాదికాలంలో పూర్తి కావస్తున్నదని. నా అంతరాత్మ

హెచ్చరించడంతో, మన సోదరుల విషయం- సంకేత ప్రదేశంలో కలుసుకోవాలన్న మన నియమం విషయం చారుమతితో చెప్పాను. అప్పటికి ఆమె గర్భవతి కూడ అయింది. పతి సంపర్కం వద్దని తెలిసి, నేను వెళ్ళడానికి ఎలాగో అంగీకరించింది. ఒక వీణ నాకు ఇచ్చి, దానిపైన అపూర్వ రాగం ఒకటి మీటి చూపించింది. ఆ వీణమీద ఆ రాగాన్ని ఏకాంతంగా పాడితేనే' ఆమె నా దగ్గరకు వస్తుంది. యక్షకాంతలు కనుక వారికి ఆ సామర్థ్యం ఉంది. కావలసినప్పుడల్లా తనను రప్పించుకోవచ్చుననీ- రహస్యం మాత్రం ఎవరికీ చెప్పవద్దని కోరింది.

"నేను ఆ గుహా మార్గంలో నానా యాతనలూ పడ్డాను" అని నా భార్య చారుమతి దగ్గర నా తొలినాటి ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాను. ఆమె వెంటనే మల్లికకు సైగ చేసింది. ఆమె ఇంకొక మార్గంలో కేవలం రెండు గడియల్లో నన్ను శ్రీశైల క్షేత్రంలో విడిచి వెళ్లిపోయింది. అది వాళ్లకు తప్ప ఇతరులకు తెలీని గొప్ప గుహ్యమైన మార్గం. నేను శ్రీశైల మల్లికార్జునుని సేవించుకుని, ఎన్నెన్నో శైవక్షేత్రాలు దర్శించుకొంటూనే ఉజ్జయిని చేరుకున్నాను.

అక్కడ మహాకాళేశ్వరుని దర్శించుకుని, విక్రమార్క చక్రవర్తి చేత స్థాపించబడిన ఒక సత్రంలోకి యాధాలాపంగా వెళ్ళాను. అక్కడొక గదిలో కనిపించాడు మన రాముడు.

అయితే, అతడేదో ఆలోచిస్తూ నన్ను గుర్తుపట్టలేదు. నేను అతడ్ని కౌగలించుకుని "నేను నీ సోదరుడిని. చంద్రుడిని. నువ్వు ఇక్కడికొచ్చి ఎన్ని రోజులైంది అన్నయ్యా! ఎక్కడెక్కడికిపోయావు? ఏమేమి వింతలు చూశావు? మన సోదరులు మిగతావారు ఎక్కడైనా కలిశారా? వివాహం చేసుకున్నావా? సొమ్ము అంతా ఏం చేశావు? నీ వృత్తాంతం చెప్పు!" అని అడిగాను. అప్పుడతడు నన్ను చూసి ఆనందిస్తూ, తన వృత్తాంతం ఇలా చెప్పసాగాడు.....

రాముని కథ

"తమ్ముడూ! మనం నలుగురం ఒక్కసారే పట్నం విడిచి బయలుదేరాం కదా! నేను ధనమంతా గుర్రాలమీద ఎక్కించుకుని పశ్చిమదేశానికి వెళ్ళాను. అరణ్య మార్గంలో నేను ప్రయాణిస్తుంటే ఒక దొంగలగుంపు నామీద దాడి చేసి వదిలి, ధనం అంతా దోచుకుపోయింది.

అప్పుడు నేనొక్కడినే ఒక మార్గంలో పోయి అడవిలోనే నడుచుకుంటూ ఎంతో దూరం పోగా అక్కడ ఒక పల్లె కనిపించింది. ఆ పల్లెలో ఓ రెడ్డి ఇల్లుండటం చూసి వెళ్ళి అన్నం పెట్టమని అడిగాను.

అతడు నా వృత్తాంతం అంతా విని. దయతో నన్ను కొన్నాళ్ళు వాళ్ళింట్లో ఉంచుకుని, నాకు ఉపచారాలు చేశాడు. అతడు ఒక దొంగలనాయకుడు. ఆ దేశంలో ఉన్నదొంగలు దోచుకున్న సొమ్ములు తెచ్చి అతని ముందు ఉంచుతారు. అతడు వారికి ఆ సొత్తు పంచుతాడు. అలాగే ఏయే దారులు కొట్టాలో, ఏ ఊళ్ళు దోచుకోవాలో, ఏ ఇంటికి కన్నాలు వేయాలో అతడు సూచిస్తుంటాడు. అలా దోచుకొచ్చిన దొంగలు ఆ వివరాలన్నీ రెడ్డికి కథలుగా చెప్తుంటారు.

పదిరోజులు వారి మాటలు వినేటప్పటికి నాకు ఆ విద్యంతా సులభంగా పట్టుబడింది. రెడ్డి కూడా నా బుద్ధి సూక్ష్మత కనిపెట్టి, తగిన వారితో నన్ను కూడా చౌర్యానికి పంపేవాడు. నేనూ నైపుణ్యంగా కన్నం వేసి బంగారం, వెండి, తస్కరించి తెచ్చి అతనికిచ్చేవాడిని. దొంగతనం లాంటి లాభకరమైన పని ఇంకొకటి లేదు కదా!

ఇలా తస్కరుడినైపోయి వాళ్ళింట్లోనే కొన్నాళ్ళున్నాను. ఆ రెడ్డికి రుచిర అనే కూతురుంది. పదహారేళ్ళ వయస్సున్న ఆ చిన్నదాన్ని తన మేనల్లుడికిచ్చి రెడ్డి పెళ్లి చెయ్యాలనుకుంటూంటే, ఆమె నా మీద అనురాగం పెంచుకుంది. తన కోరిక నాకు చెప్పింది. ఆమే నన్ను కోరుకుంది కదా అని నేనూ ఆమెతో రహస్యంగా మన్మథక్రీడల్లో మునిగితేలేవాడిని.

ఇంతలో ఆ పిల్లకు వివాహం నిమిత్తం ముహూర్తాలు పెట్టుకున్నారు. మేమిద్దరం ఆలోచించుకుని కూడబలుక్కొని ఒకనాటి అర్థరాత్రి విలువైన

రత్న-మణి- మాణిక్యాలు కొన్ని తీసుకుని అరణ్యాల్లోకి పారిపోయాం! క్రమంగా చాలా ఊళ్ళు దాటి చివరికీ ఊరు చేరాం! ఈ ఊళ్ళో కొన్నాళు రాత్రీ- పగలు తేడా తెలియరానంతగా మన్మథ క్రీడలతో కాలక్షేపం చేశాం! మేము తెచ్చిన సొమ్ము స్వేచ్ఛగా ఖర్చుపెట్టేసరికి అది ఒక నెలకి మాత్రం సరిపోయేసరికి, తర్వాత ఏం చెయ్యాలా అని ఇద్దరం ఆలోచించుకున్నాం!

"మనకిద్దరికీ చోర విద్య బాగా తెలుసు కనుక. మీరు కన్నం వేయండి. నేను లోపలికి వెళ్ళి కార్యం చక్కబెట్టగలను. ఎంత భద్రంగా దాచిన వస్తువులనైనా కన్నం వేసి తీసుకురాగలను" అంది రుచిర. స్త్రీని వెంట తీసుకెళ్ళడమా? అని నేను ఆలోచిస్తుంటే "ఈ రాత్రి అమావాస్య. ఈ పట్నం రాజుగారింటికి కన్నం వేద్దాం పదండి!" అని బోధచేసే సరికి నేను తలూపాను.

చోరకళలో ప్రవీణురాలైన రుచిర సాయంతో, నేను కోటగోడలు సైతం అతి లాఘవంగా లంఘించి, లోలోపలి గదులు కూడా దాటి ఉజ్జయినీ పురాధీశుడు అయిన విక్రమార్క మహారాజుగారి అంతఃపురానికే కన్నం వేసి, లోపల ప్రవేశించాం!

సరిగ్గా అదేసమయంలో- విక్రమార్కుడు భార్యతో మాట్లాడుతూ చౌర్య రహస్యాలు కొన్ని 'అంజనప్రభావం' వంటివి చెప్పి, "రెడ్డి అనే వాడొకడున్నాడు. వాడు చోర విద్యలో చాలా నేర్పరి అని అనుకుంటున్నారు ప్రజలు. వాడ్ని పట్టుకోవాలని చాలా ప్రయత్నిస్తున్నాను. వాడి జాడ తెలీడం లేదు- అంటూ చౌర్య విశేషాల గురించి వివరిస్తున్నాడు.

మేం వస్తువులు తగినన్ని సంగ్రహించాం! మా పని అయింది. మేం పోవచ్చు కదా! ఆ సమయంలో అక్కడొక చోట చక్కగా మేళవించబడిన వీణ ఒకటి నా కళ్ళ పడింది. అదేం చిలిపి బుద్ధి నన్ను ఆ క్షణాన ఆవేశించిందో తెలీదుగాని, అది మీట మనసైంది. చేతులూరుకోలేదు. వేళ్ళు వీణ తీగల్ని సవరించాయి. అర్ధరాత్రి వీణానాదం. అదీ విక్రమార్కుని అంతఃపురంలో! ఇంకేమన్నా ఉందా? చక్రవర్తే ముందుగా అప్రమత్తుడైలేచి ఆ గదిలోకి ప్రవేశించాడు. రుచిర దొరికిపోయింది. నేను వచ్చిన దార్లవెంట పారిపోయాను. కాని నా ప్రాణాలన్నీ రుచిర మీదనే ఉన్నాయి.

రుచిరను పట్టుకుని విక్రమార్క చక్రవర్తి "నువ్వెవరు? నీతో వచ్చిన వాడెవ్వడు? నీ వృత్తాంతం చెప్తే నిన్ను వదిలేస్తాను. నిజం చెప్పాల్సివుంటుంది" అని ఎంత అడిగినా మూగదానిలా మాట్లాడకుండా ఆకాశం వైపు వేలు చూపిస్తోందట! దీన్ని వస్త్రాపహరణంతో పరాభవిస్తే తప్ప నిజం చెప్పేలాలేదు అని భటులు అనుకుంటూనే, స్త్రీ కనుక అటువంటి పని చెయ్యొద్దు అని రాజు వారించాడట!

ఆ మర్నాడు స్త్రీ దొంగచేత మాట్లాడించినా, కన్నం వేసిన గజదొంగను పట్టిచ్చినా మంచి పారితోషకం ఇస్తానని చక్రవర్తి చాటింపు వేయించాడు. కొత్వాలు ఈ సత్రంలోకొచ్చి కొత్తవాళ్ళు ఎవరెవరో- ఎక్కడివారో పరీక్షించాడు. అయితే నా ఆకారం గౌరవ ప్రదంగా ఉండడం వల్ల నన్నేం అడగలేదు" అంటూ తన వృత్తాంతాన్ని అన్నతో చెప్పుకున్నాడు.

తన తమ్ముడయిన చంద్రుడ్ని ఆ సత్రంలో కలుసుకున్న ఆనందం కంటే, సోదరుడిని తాను ఎలా ఉపయోగించుకోవాలా?' అనుకున్నాడు రాముడు.

ఈ విషయంలో-చంద్రుడే స్వయంగా విజయానికి చెప్పిన తదుపరి వృత్తాంతం ఇలా కొనసాగింది.....

"అదీ నా కథ సోదరా! దైవంలా వచ్చావు నువ్వు. నా ప్రాణ నాయికని విడిపించుకోగల ఉపాయం చెప్పు! అలాగైతేనే నేను బ్రతికి ఉంటాను. లేదా నీ కళ్ళ ముందే ప్రాణాలు విడుస్తాను. రుచిర ఎంత చక్కనిదో! నేనంటే మహా అనురాగం. తెలివైంది.... అంటూ వాడు కన్నీరు కార్చడం చూసి, రుచిరపైనే వీడికున్న మక్కువ అలాంటిది కనుక, వీడిని ఇప్పుడు మార్చడం కష్టం! ఇక ఏదోలా రుచిరను విడిపించడమే మార్గం అనుకుని, "అన్నా! విచారించకు! నిన్ను రెండు- మూడు రోజులలో రుచిరతో జతపరుస్తాలే!" అని అతడ్ని ఓదార్చాను. నేను మరునాడు ఆ స్త్రీని చూడడానికే విక్రమార్కుని ఆస్థానానికి వెళ్ళాను.

రాజుగారి పీఠానికి దగ్గరగా నిలబెట్టబడి ఉన్న రుచిరను చూశాను. అన్న చెప్పిదాంట్లో అసత్యమేమీ లేదు. ఆమె అసాధారణ సౌందర్యవతేనన్న మాట యదార్థం అని గ్రహించాను.

ఎప్పటిలాగానే రాజభటులు "నువ్వెవరు? నువ్వు నిజం చెప్పకపోతే, నిన్ను దండించక తప్పదు" అంటూ భటులామెను బెదిరిస్తుంటే ఆమె ఏమీ మాట్లాడక ఆకాశంవైపు వేలు చూపిస్తోంది.

అప్పుడు సభలోంచి నేను లేచి "రాజా! ఈమెను మాట్లాడించిన వాళ్ళకి పారితోషకం ఇప్పిస్తానని చాటించారు. నేను మాట్లాడిస్తాను. ఆ పారితోషికమేమిటో చెప్పండి" అన్నాను. నన్ను చూసి ఆ ప్రభువులవారు నువ్వెవరివో చెప్పుముందు అన్నాడు.

"నేను ఎవరన్నదీ తర్వాత చెబుతాను. మీ చాటింపు ప్రకారం ఆమెను మాట్లాడించడమే ముఖ్యం. నా పరిచయంతో ప్రస్తుతం పనిలేదు కదా! పారితోషకం చెప్పండి" అని మెలిక పెట్టాను.

ఆయన ఇంకేమీ సంకోచించక "నువ్వేం కోరితే అది ఇస్తాను" అన్నాడు. నాక్కావలసిందీ అదే కనుక, నేను రుచిర దగ్గరకు వెళ్ళి కేవలం ఆమెకు వినిపించేటంత సన్నగా "నేను మీ బావ మరిదిని! రాముడు నాకు సోదరుడు. నిన్ను విడిపించడమే నా లక్ష్యం. నీ కొచ్చిన భయమేమీ లేదు. నీ విడుదలనే పారితోషికంగా కోరబోతున్నాను" అని చెప్పాను. ఆ తరువాత రాజుగారితో "మీరేం అడుగుతారో అడగండి" అన్నాను.

"నువ్వెవరివి?" విక్రమార్కుడడిగాడు.

"ఆడదాన్ని" రుచిర జవాబు.

ప్రశ్న : "ఎవరి కూతురివి?"–"జనకుని కూతుర్ని" అని జవాబు.

"సరే! ఎవరి భార్యవో అదైనా చెప్పు!" అన్నాడు విక్రమార్కుడు.

"జగదభిరాముని భార్యని" అంది రుచిర.

విక్రమార్కుడు సామాన్యుడు కాడు. కాళీ వరప్రసాదుడైన చక్రవర్తి. ఆమెతెలివైంది అని తెలుసుకుని, అందులో గూఢార్థాలు గ్రహించి, ఇంకా ఏదో అడగబోతూంటే, "దేవా! ఆమెని మాట్లాడించడమనే నా పనిని నేను నెరవేర్చాను. నేను వేగంగా వెళ్ళిపోవాలి. నా పారితోషకం ఇప్పించండి- అన్నాను.

"నీ కోరిక ఏమిటో చెప్పు! అది తీర్చాకనే, నా పని చూసుకుంటాను" అన్నాడు విక్రమార్కుడు.

"రాజా! ఈమెను ఇంకేం అడక్కుండా విడిచిపెట్టడమే నా కోరిక" అన్నాన్నేను.

ఆయన కూడా సత్యవాక్పరిపాలకుడు గనుక "తప్పకుండా విడిచిపెడతానుగాని, మేము నువ్వెవరని ఎన్ని సార్లడిగినా ఆమె వేలు పైకెత్తి చూపించడంలో అర్థమేమిటి? అది ఒక్కటి తెలుసుకోవాలని ఉంది" అని అడిగాడు. నేను రుచిరను అడిగి తెలుసుకుని "ఇంకేమీ కాదు మహారాజా! నేను మీ చేతిలో చిక్కిపోయాను. నన్ను రక్షించగలిగినవాడు ఆ భగవంతుడొక్కడే! అతడే నన్ను విడిపించాలి అంటూ ఆకాశం వైపు వేలు చూపించింది. అంతే!" అని చెప్పాను.

విక్రమార్కుడు ప్రశంసించి, ఆమెకు నూతన వస్త్రాభరణాలు ఇచ్చి మరీ నా వెంట పంపేశాడు. నేను ఆమెను సత్రానికి తీసుకొచ్చి మనవాడికి అప్పగించాను. ఆ రోజు వాళ్ళిద్దరూ విరహతాపం తీరిపోయేలా నానావిధ మదన శృంగార క్రీడల్లోనూ తేలిపోయారు.

మర్నాడు నేను రాముడ్ని విడిగా కలుసుకుని "సోదరా! సాహసదోషం అంటారే! నీది అటువంటి పరిస్థితి. నీచ సహవాసం వల్ల ఎంతటి వారికైనా దుర్గుణాలు అలవడకపోవు. చోర శిఖామణి పరిచయంతో నీకు చోరకళ అబ్బింది. మనం గొప్ప వంశంలో జన్మించాం కనుక నీచపు పనులు చెయ్యకూడదు. పోనీ! ఈ రుచిర సౌందర్యంలో – తెలివిలో తక్కువదా అంటే అదీ కాదు! అలాగని బుద్ధి మార్చుకోగలదా అంటే, బుర్రనిపుట్టే బుద్ధి చివర వరకూ వదలదు. అది మనకు కులోచితం కాదు. ఉత్తమ స్త్రీ వల్లనే ఉత్తమ సంతానం అని ఆర్యులమాట! అంచేత రుచిరను పుట్టింట్లో వదిలి రా! నీకు యక్ష కన్యనే ఇచ్చి పెళ్ళి చేయగలను. మల్లిక అనే యక్షకన్య నేను చెప్పినట్లుగా వింటుంది" అంటూ నేను శ్రీశైలం వెళ్ళింది మొదలు జరిగిన కథనంతా అతడితో చెప్పాను.

రాముడు అందుకు ఆనందిస్తూ "అలాగా! నీ వీణ మహాత్యాన్ని ఒక్కసారి చూపవూ!" అని వాడు అడగ్గా నేను సరేనని చారుమతిని వీణపై పిల్చాను. కాని ఆమె వాడిని చూస్తూనే మాయమైపోయింది.

వాడు రుచిరతో గుసగుసలాడి, నన్ను అంతం చెయ్యడానికి పథకం వేశాడు. నా వీణ దొంగిలించాడు. అలవాటైన బుద్ధి కదా! ఇక నేను చారుమతిని కలుసుకోగలనా? నేను వెతకని ప్రదేశం అంటూలేదు. అలా వెతుక్కుంటూ మన నియమం గుర్తొచ్చి ఇక్కడికొచ్చాను. దైవవశాత్తు నువ్వు కనిపించావు. మనమిద్దరం సోదరుల వల్ల భార్యల్లేని వాళ్ళమయ్యాం!" అంటూ విలపించాడు చంద్రుడు. విజయుడతన్ని ఓదార్చాడు.

"ఇదంతా దైవకృతం! మన ప్రయత్నం మనం చేద్దాం!" అదీగాక యక్షిణులకు దివ్యదృష్టి ఉంటుంది. నువ్వెక్కడున్నా చారుమతి నీకోసం రాగలదు" అని విచారాన్ని పోగొట్టాడు.

ఇప్పటికే చాలా కాలాతీతం కావడంతో, మణిసిద్ధుడు తదనంతర వృత్తాంతాన్ని తరువాయి మజిలీలో ఇలా చెప్పసాగాడు....



కాశీ మజిలీ కథలు

27 వ మజిలీ

"గోపా-విను!....

ఆ అన్నదమ్ములు అలా సంభాషించుకుని మర్నాడు ఉదయం, ఆ ఊరునుంచి వెళ్ళిపోయి స్వదేశం దిశగా ప్రయాణమవుతూ, ఒక రాత్రి భీమవర్మ పరిపాలించే విజయపురి చేరుకున్నారు. అక్కడ విజయునిచేత స్థాపించబడిన ధర్మ సత్రానికి వెళ్తూ "అదెవరు కట్టించారు?" అని అక్కడి అధికారిని ప్రశ్నించారు. "అది విజయుడనే మహానుభావునిచేత కట్టించబడిందనీ- అతడొకసారి స్వదేశం చూచి వద్దామని బయలుదేరి దారిలోనే అకారణ మృత్యువువాత పడ్డాడ"ని చెప్పాడతడు. సోదరునికి తానిక్కడ చేసిన మంచి పనులు రహస్యంగా వివరించాడు విజయుడు. ఆ ప్రాంతాల్లోనే భీమవర్మ అతడ్ని ప్రశంసిస్తూ రాయించిన శాసనం కూడా ఉంది. సత్రంలోనే ఒక చోట నడుస్తూంటే, వారికి ఏవో మాటలు విన్పించగా అందులో రుచిర అనే పదం విని అన్నదమ్ములు ఇద్దరూ ఆ గది దగ్గరలో ఆగారు. లోపలున్న వారి సంభాషణ వినసాగారు....

"అన్నా! వాళ్ళిద్దరికీ మనం అంటే మొదట్నుంచీ అసూయే! నేను రుచిరతో ఉండడం ఇష్టంలేక చంద్రుడు నా కెన్ని చెప్పాడనుకున్నావ్? నా ప్రియురాల్ని పుట్టింట్లో వదిలేయమన్నాడు! నాకు రుచిరే బాగుంది."

"అటువంటివాడివి ఆ వీణను ఎందుకు కాజేశావ్?"

"లాభం లేదని తెలిసి, దారిబత్తెం కోసం ఓ బ్రాహ్మడికి అమ్మేశా!"

"అయితే?!" ఆగిపోయాడు భానుడు.

"ఇంకెందుకు నాకు? దాన్ని మీటడం నాకు రాలేదు. అది సరే! నువ్వు హేమనేం చేశావు?" అన్నాడు రాముడు.

"ఆ రండ నా మాట వినకపోయేసరికి, దాన్ని నూతిలోకి తీసేశాను. ఈలోగా బ్రాహ్మడెవడో అటు వస్తుంటే పారిపోయాను."

"మంచి పనే చేశావు! ఇక మనం మనదేశం పోయి రాజ్యం ఏలుకుందాం!"

"నీకు రుచిర ఉంది. పెళ్ళి చేసుకోకుండా వెళ్తే తండ్రి ఆక్షేపిస్తాడు"

"అంతేకదా సోదరా! మన చోరవిద్య సంగతి నీకు రుచి చూపిస్తా! నీ కిష్టమైన స్త్రీని ఎంచుకో! రాత్రికా ఇంట కన్నం వేసి, ఆమెను నీ ముందుకు తెస్తా!"

విజయుడూ, చంద్రుడూ ఆ మాటలు విని ఆశ్చర్యపోయారు. 'ఔరా! వీళ్ళెంతకు తెగించారు. ఎంత నమ్మక ద్రోహులు' అనుకున్నారు.

"చూశావా! సోదరుడు కదా అని మేలు చేస్తే, నన్ను నరికి నా భార్యని నూతిలో తోసేశాడు. దుర్మార్గుడు" అంటూ కత్తి అందుకోబోయిన విజయుని ఆవేశాన్ని శాంతింపజేసి "అన్నా! వదినకు అపకారం జరిగి ఉంటుందనుకోను. ఆ బ్రాహ్మణుడెవరో వస్తున్నాడని, వీడు పారిపోయాడు కదా! ఆయన రక్షించి ఉండొచ్చు! మనం నిదానించి వ్యవహారం చక్కబెట్టుకోవాలి. వాళ్ళు మన సోదరులే కనుక- వాళ్ళని మాట్లాడించి

సరైన ప్రణాళిక వేసుకోవచ్చు!" అన్నాడు. చంద్రుని శాంతి వచనాలకు విలువ ఇచ్చి విజయుడు బలవంతంగా ఆగ్రహం అణుచుకున్నాడు.

తరువాత ఆ ఇద్దరూ, మిగతా ఇద్దరైన భానుడ్ని- రాముడ్ని కలుసుకున్నారు. అయితే అబద్దాలు చెప్పి నమ్మించజూసిన ఆ ఇద్దరి తీరుకు చంద్ర విజయులు ఆశ్చర్యపోయారు.

భానుడు- రాముడు తమ దేశానికి వెళ్ళి రాజ్యపాలన చెయ్యాలనుకున్న ఉత్సాహంలో ఉండగా, విజయుడు- చంద్రుడు తిరిగి తారసపడడం వారికి కంటగింపుగా మారింది. అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ఇద్దర్నీ ఒక నూతిలో తోసేశారు. భానుడితో కలిసి రాముడూ పారిపోయారు.

చ. తిమిర నివారణ క్రియకు దీపమువారిధి విస్తరింపబో
తము, చలిబాప వహ్నిరవి తాపు భరంబడగింప, నా తప
త్రము కలుషంబులం జెరుప, ధర్మము పాల్పడి యుండుగాని, య
క్కమలజుడున్ సుఖోద్యముడు గాడు దురాత్ముని చక్క జేయగన్.

అని కదా భర్తృహరి సుభాషితం. ఏది చక్కబరచడానికైనా ఏదో ఒకసాధనం ఉందిగాని, దుర్మార్గుల్ని చక్కదిద్దడానికి కేదీ సాధనం?

అయితే, అదృష్టవంతులకు ఆపదలు కూడా సంపదలుగానే పరిణమిస్తాయన్నట్లు, వాళ్ళు ఒక భాగ్యవంతునిచేత రక్షించబడి, తదుపరి పన్నెండేళ్ళ పుత్రునితో సహా హేమను ఆ ఊళ్లోనే కలుసుకోగలిగారు. చిత్రంగా అక్కడే చంద్రునికి చారుమతి ఇచ్చిన వీణ దొరికింది. తన వృత్తాంతంతోపాటు ఆ వీణ తన వద్దకు చేరిన విషయం కూడా హేమ తనగాథలో ఇలా చెప్పడం ప్రారంభించింది.....

హేమకథ

"మనం చెట్టు క్రింద నిద్రిస్తూంటే- మీ సోదరుడు కత్తితో మీ మెడమీద వేటు వేసి, నన్ను లేపి బలాత్కారం చేయబోయాడు. నేను నిద్ర పరాకున తొట్రుపడ్డాను. మూర్ఛపోయాను. దాంతో అతడు నన్ను అదేస్థితిలో గుర్రం మీద కాబోలు ఓ మహారణ్యానికి తీసుకుపోయి, అక్కడ తనకు భార్యగా ఉండమంటూ నిర్బంధించాడు. నేను నిరాకరించేసరికి నన్ను నూతిలో తోసి పారిపోయాడు. అంతలో ఒక బ్రాహ్మణుడు, అక్కడ స్నానం నిమిత్తం వచ్చి నన్ను కాపాడి, అప్పటికే నాకు గర్భ చిహ్నాలు దయించినందున నన్ను జాగ్రత్తగా తన ఇంటికి తీసుకెళ్ళి సంరక్షించాడు. ఈ పిల్లవాడు జన్మించాక- చిత్రంగా నేను నా పుట్టింటికి చేరుకోగలిగాను. నా సవతి తల్లిని నా తండ్రి కారాగృహంలో నిర్బంధించి, నిజం రాబట్టాలని ప్రయత్నిస్తూనే- ఇంకొకవైపు గూఢచారుల్ని పంపి నా కోసం వెతికిస్తుండగా నన్నూ ఈ పిల్లవాడిని సంరక్షిస్తూన్న బ్రాహ్మణోత్తముని వల్ల ఆయన స్వయంగా మా తండ్రికి నా వృత్తాంతం విన్పించడం వల్ల తిరిగి ఆ రాజభనవంలో అడుగు పెట్టగలిగాను. మా తండ్రి మరణానంతరం నాకీ రాజ్యం సంక్రమించింది. మీకు వైద్యం చేసిన వైద్యుడికి మీరిచ్చిన ఉంగరం వల్ల మీరు జీవించి ఉన్నారని నిర్ధారించుకున్నాను.

కొన్నాళ్ళ క్రితం ఏదో దారిబత్తెం నిమిత్తం ఎవరో ఒక వీణను తనకు తవ్వేడు గింజలకు అమ్మేశారంటూ ఒక బ్రాహ్మణుడీ వీణ తీసుకొచ్చి నాకు అప్పగించాడు. దానిపైన సన్నగా 'వీర ప్రతాపుని కుమారుడు చంద్రుడు' అని చెక్కబడి ఉంది. అదే ఎప్పటికైనా మీ సోదరులను నా దర్శనం చేయించగలదనుకున్నాను. అలాగే జరిగింది. ఇక చిన్నప్పుడే కుర్రవాడిని అడవిలోనికి ఏనుగు తీసుకెళ్ళడం- దాని వల్లనే నా తల్లి దండ్రుల ఉనికి తెలియడంతో, మా తండ్రి ఈ పిల్లవాడికి గజదత్తుడని నామకరణం జరిపించాడు" అని చెప్పింది హేమ. చంద్రుడు ఆ రాత్రి వీణపై పాటపాడి చారుమతిని రప్పించి హేమకి చూపించాడు. అందరూ ఆనందించారు.

హేమ కథ

రాజపుత్రులిద్దరూ మళ్ళీ చాలా దూరం ప్రయాణించి ఎట్టకేలకు తమ దేశం చేరుకున్నారు. అప్పటికే రాముడు-భానుడు అక్కడ రాజులుగా చెలామణీ అయిపోతున్నారు. అన్నలిద్దరూ మరణించారని చెప్పినా రాజు నమ్మలేదు.

వారికంటే రూపవంతులూ- గుణవంతులూ అయిన విజయచంద్రులు ఎప్పటికైనా తిరిగొస్తారని వృద్ధరాజు వీరప్రతాపుడు ఆశగా ఎదురుచూస్తున్నాడు.

తల్లిదండ్రులకు ఆనందం కలిగిస్తూ, చంద్ర-విజయులు వర్తమానం పంపారు. వీరప్రతాపుడు వారిని మేళతాళాలతో కోటలోనికి తీసుకొచ్చాడు.

మర్నాడు సభ ఏర్పాటు చేసి, అక్కడ అందరూ వినేలా తమ గాథల్ని అందులో తమ సోదరులు భాను-రాముల దుశ్చర్యల్నీ వివరించాడు విజయుడు. అప్పటికప్పుడే పెద్దవాడైన విజయునికి రాజ్యం ఆధీనం కావించాడు వీరప్రతాపుడు. నేరస్తులను పదే- పదే క్షమించడం కూడా నేరమేనని తీర్పిచ్చి భానుడు- రాముడులను కోటముందు ఉన్న స్తంభాలకు కట్టి వారానికోసారి పన్నెండు దెబ్బలతో-ముఖంమీద ఉమ్ములతో దండించడం- వారితోపాటు, చోరపుత్రిక రుచిరపైనా అదే విధంగా ఉమ్మేలా శిక్ష విధించాడా ఉత్తమ ప్రభువు. వారి అనంతరం వారి చిత్రపటాలకు- ప్రతిమకూ ఆ శిక్ష ఏడాదికోసారైనా అమలు చేస్తున్నారా సింధుబా పట్టణ ప్రజలు. ఇదే వీరి వృత్తాంతం" అని మణిసిద్ధుడు చెప్పగా విన్న గోపకుమారుడు, ఆ కథ విన్నందుకు చాలా ఆనందించాడు.

కాశీ మజిలీ కథలు

28 వ మజిలీ

ఇరువది ఎనిమిదో నివాసదేశం ఒక చెరువుకు సమీపంగా ఉన్నది. దానికి దగ్గర్లో ఒక మంటపం ఉంది. అందులో మూడు శిలా విగ్రహాలున్నాయి. వాటిలో ఒకదానిముఖం మీద 'మహావిచిత్రం అంతా' అనీ, రెండో విగ్రహం భుజాలపై 'దైవయత్నం' అనీ, మూడో విగ్రహం దేహం మీద, 'ఎవ్వరికెవరూ లేరు' అనీ పేర్లు చెక్కబడి ఉన్నాయి. ఆ పురుష విగ్రహాల కెదురుగా ఒక స్త్రీ విగ్రహం- దాని భుజాలపై 'విరాగిణి' అని చెక్కబడి ఉంది. అవన్నీ చదివాక గోప కుమారునికి కుతూహలం చెలరేగింది.

గురువుగారు జపం పూర్తి చేసుకొనే వరకు ఆగకపోతే కోపిస్తారని తెలిసి ఎలాగో ఉత్సాహం ఆపుకొని నిరీక్షించి, తరువాత తాను చూసిన విగ్రహాల గురించీ- వాటి మీద రాతల గురించీ గురువుగారిని అడగ్గా, భోజనాదికాలు పూర్తయ్యాక, ఆ వృత్తాంతం అంతా ఆయన ఆకళింపు చేసుకుని ఆ కథ ఈ విధంగా చెప్పసాగాడు...

దేవశర్మ కథ

ఆంధ్రప్రదేశములో మణిభద్రమనే అగ్రహారంలో దేవశర్మ అనే బ్రాహ్మణుండేవాడు. అతడికి వేదవేదాంగాలు చదివినందున- గృహస్తులకు ఉచితమైన సత్క్రియలు నిర్వర్తిస్తున్నందున ఉత్తముడని కీర్తి కలిగింది. ఎంతకాలానికీ వారికి సంతానం మాత్రం లేదు. అందువల్ల అతడు హరిభజన చేసుకుంటూ వైరాగ్యభావనలు పెంపొందించుకున్నాడు. అతని భార్య మిత్రవింద. భర్తకు ఉపచారాలన్నీ చేస్తూ ఇంటికి రాగానే కాళ్ళు కడిగి

నెత్తిన జల్లుకుంటూ, మహాప్రేమతో భోజనం పెట్టి పతివ్రత అంటే ఈమేనా? అన్నట్లు ప్రవర్తించేది. ఈ వర్తనతో అతడు చాలా సంతోషిస్తూ ఆమెని నిజంగా పతివ్రతా తిలకం అనే భావించసాగాడా బ్రాహ్మణుడు.

ఓ రోజు ఇద్దరు బ్రాహ్మణులు భోజనం కోసం ఆ ఇంటి తలుపులు తట్టి "అమ్మా! మేం పరదేశీయులం! మాకింత భోజనం పెడతావా?" అని అడగ్గా, తలుపు తీసిన మిత్రవింద ఏం మాట్లాడకుండా తలుపు వేసేసింది.

వారు అక్కడ్నుంచి వెళ్ళి, కొంతదూరంలో చెట్లకు నీళ్ళు పెడుతున్న దేవశర్మను చూసి "అయ్యా! సాటి బ్రాహ్మణులం! అన్నం కోసం- అదుగో-ఆ ఇంటికెళ్ళి అడగ్గా, ఆ పుణ్యాత్మురాలు ఏ సంగతీ చెప్పక మా ముఖం మీదనే తలుపేసేసింది. అలా సిగ్గుపడ్డానికి మేమేమన్నా విటులమా?" అని వాపోయారు.

దేవశర్మ వారు చూపిన వైపు చూసి "అయ్యో! అది మా ఇల్లే! ఆమె నా భార్యే! నేను ఇంటలేని సమయంలో పరులను చూడదు- పలకదు-పలకరించదు! ఇక్కడే సాన్నం చేసి వచ్చేయండి. మీకు భోజనం ఏర్పాట్లు చేయిస్తాను" అని తాను ముందుగా వెళ్ళాడు దేవశర్మ.

బ్రాహ్మణులిద్దరూ స్నానసంధ్యలు పూర్తి చేసుకుని, దేవశర్మ ఇంటికి వెళ్లారు. అప్పుడామె తన భర్తకు పాదాభివందనం చేస్తూ కనిపించింది.

ఆ తర్వాత భోజనాలు చేస్తున్నప్పుడు వారిలో సోమభట్టు "అయ్యా! మేము ఎన్నెన్నో దేశాలు తిరిగాం! శాస్త్రాలు కూడా చాలా చదివాం!, చాలా మంది పతివ్రతలను కూడా చూశాం! కాని ఈమె వారికంటే విలక్షణంగా ఉంది. అపూర్వమైన వ్రతం అని ఆక్షేపించగా, దేవశర్మ "పోనీండి! ఆమెకు అరుంధతిలా ప్రవర్తించాలని ఉందట! ఎవరి వ్రతంవాళ్ళది. మనకేం కొదువ?" అని వినయంగా పలికాడు.

సోమభట్టు, ఆయన వినయానికి ఇంకేం మాట్లాడలేక, రెండో బ్రాహ్మణునితో రహస్యంగా "ఈ ఇల్లాలి చర్యలు విపరీతంగా ఉన్నాయి. అంచేత దీన్ని కులటల్లో మొదటిదానిగా ఊహించవచ్చు! దీని టక్కులన్నీ ఈ అమాయక బ్రాహ్మడు నిక్కమని నమ్ముతున్నాడు. అసలైన పతివ్రతకు

ఇన్ని నియమాలుండవు. భోజనం పెట్టిన కృతజ్ఞత కొద్దీ, దీని దుండగపు వర్తనను పట్టుకొని, ఆ మగనికి అప్పగించి వెళ్దాం!" అన్నాడు.

అందుకు అతడు కూడా సరేనన్నాడు.

ఆ తర్వాత వారు ఆ ఇంట్లో భుజించక, ఆ ఊళ్ళోని ఇంకొక ఇంట్లో నివశిస్తూ, ఆ ప్రాంతాల్లోనే సంచరిస్తూ, ఆ ఇంటిగుట్టు మొత్తం గ్రహించసాగారు. ఒక రోజుఎప్పటిలాగే అతడు మొక్కలకు నీళ్ళు పెడుతూంటే దేవశర్మ దగ్గరకెళ్ళి "అయ్యా! నీటితో తీరే దాహం కాదు. గొంతు బాగా ఎండిపోతోంది. అన్యథా భావించక ఇంత మజ్జిగ ఇప్పిస్తారా?" అని ప్రార్థించాడు.

"అయ్యో! దానికేం భాగ్యం? ఇంతగా ప్రాధేయపడాలా? ఇప్పుడే తీసుకొస్తాను" అంటూ ఇంటికెళ్ళాడు దేవశర్మ. తలుపులు మూసి వున్నాయి. పెరటివైపు నుంచి వెళ్ళి పై నుంచి తీయగల్గిన గడియతీసి లోపలికెళ్ళాడు. వంటింట్లో ఒక మూల వంట అవుతూనే ఉంది. మరొకమూల మిత్రవింద పెద్దపాలెంకాపుతో రతిక్రీడలో సుఖపారవశ్యం అనుభవిస్తోంది.

"భయంలేదు. మీ దొరవచ్చే వేళ ఇంకా కాలేదు. సమయం నే జెబుతాలే! ఈ దినం పరదేశస్థులెవరూ వచ్చినట్లు లేదు. మన అదృష్టం. అది సరే! నిన్న రాలేదేం? మంచి కూరలు కూడా వండి వుంచాను సుమీ" అంటూ పలుకుతూ ఆ నీచుడితో సుఖిస్తుండగా దేవశర్మ ఆమె దుష్కృతాన్ని కళ్ళారా చూసి- చెవులారా విని అలాగే చేష్టలు దక్కి నిలబడిపోయాడు.

"ఓసీ దుష్టురాలా! నీ వల్ల ఎందరు బ్రాహ్మణులకు నేను అపవిత్రమైన అన్నం పెట్టవలసి వచ్చిందో! ఎంత పాపం మూటకట్టుకోవలసి వచ్చిందో కదా! ఛీ! ఛీ! ఇంక ఈ సంసారం దేనికి?" అనుకుంటూ ఎంత చిత్రం- ఎంత చిత్రం" అని గొణుక్కుంటూ ఎటువైపునకో వెళ్ళిపోతుండగా, ఆ బ్రాహ్మణద్వయం "ఏమయ్యా! దాహం ఇప్పిస్తానని మజ్జిగ తీసుకురావడానికి వెళ్ళావు. ఏదీ?" అని అడిగారు.

అన్నిటికీ ఒకటే జవాబు "ఎంత చిత్రం- ఎంత చిత్రం?" అతనికి పిచ్చెక్కిందని ఆ ఊరిబ్రాహ్మణులకు అర్థమై, తమ ఇళ్ళకు తీసుకెళ్ళి భోజనం

పెడుతూండేవారు. ఒకనాడు దేవశర్మ గ్రామంలో నిద్రించక, స్మశానానికి అవతలవైపు ధూపదీప నైవేద్యాలు లేని ఒక శూన్య దేవళంలో పడుకొని దేవుని ధ్యానించుకోసాగాడు. అదేమి చిత్రమోగాని, అక్కడా అతనికి భర్తని వంచించి, ఇంకొకనితో కులుకుతున్న కలికి కనిపించింది. "ఎంత చిత్రం- ఎంత చిత్రం" అనుకుంటూనే, అక్కడకొచ్చినా పాపకృత్యాలే కంటపడినందుకు విచారిస్తుండగా- ఒక బ్రాహ్మణుడు సంతర్పణ చేస్తూ, దేవశర్మ కూడా బ్రాహ్మణుడే అయినందున అతడినీ భోజనానికి పిలుచుకుపోయాడు. అక్కడందరూ చెప్పుకుంటున్న మహాపతివ్రత-తాను అంతకుముందు దేవళంలో చూసిన ఆమే "స్త్రీలలో పతివ్రతల్లేరా? అంతా నీచకృత్యాలే చేస్తున్న వాళ్ళు కంటపడటం నా కర్మమా?" అనుకుంటూ దేవశర్మ ఆ ఊరొదిలి ఇంకో ఊరు వెళ్ళిపోసాగాడు.

తమ దేశంలో కరువు రాగా, మరో దేశానికి వలసపోతూ ఒక జంట అడవిలో ఓ చెట్టు కింద బస చేశారు. అప్పటికే అక్కడ కొందరు బాటసారులున్నారు. భర్త భోజన పదార్థాల కోసం వెళ్ళగా, ఆ బాటసారుల్లో ఓ అధముడ్ని ఆకట్టుకొని, భర్తని నూతిలోకి తోసేసి వాడ్ని భుజాలమీద కెక్కించుకుని ఊళ్ళో తిరుగుతూ పతివ్రతలా నటించసాగింది. ఆమె పాతివ్రత్యాన్ని మెచ్చుకుని ఊళ్ళో వారామెకు రూకలు-కోకలు ఇవ్వసాగారు.

దేవశర్మ ఇదంతా చూసి 'ఎంత చిత్రం- ఎంత చిత్రం' అనే తన నామస్మరణ వదల్లేకపోయాడు. ఆ పాపపు స్థలంలో ఉండలేక ఇంకోఊరికి వెళ్ళాడు. అతని కర్మం చాలక, అక్కడా ఇలాంటి నీచఘటనలు అతనికి తారసపడ్డాయి. "అంతా విచిత్రమే! లోకమంతా విచిత్రమే" అని గొణుక్కుని అప్పుడే మరో ఊరికి పయనమయ్యాడు.

అక్కడ నడివీధిన దేవాలయం అరుగుమీద కొంతమంది బ్రాహ్మణులు చేరి మాట్లాడుకుంటున్నారు.

"ఇంతవరకు దైవయత్నం గాడితో ఏదోలా వేగుతూంటే అది చాలదన్నట్లు 'అంతా విచిత్రమే' గాడొకడు వచ్చి చేరాట్ట! ఇప్పటికే మన వాళ్ళు దైవయత్నం గాడి భోజనం ఎవరు ఏర్పాటు చేయాలా? అని తగవులు పడుతూంటే ఈ 'అంతా విచిత్రం' గాడికి వారానికో పూట భోజనం ఎవరు నిర్వహిస్తారు?"

"అసలు- ఈ మాటకు అర్థం ఏమిటంటావ్?"

"చాల్లే! పిచ్చివాళ్ళ మాటలకు అర్థమేమిటి?" దైవయత్నానికి ఏది అర్థం? వాడికి అది ఊతపదం. ఇతడికి ఇదీ. అంతే!"

వాళ్ళు అలా మాట్లాడుకుని వెళ్ళారు. వంతులు వేసుకుని పౌరులు వారికి భోజనాలు పెట్టసాగారు. దైవయత్నం గాడు, 'అంతా చిత్రం' అనే దేవశర్మా ఒకే ఇంట కలిసి భోజనం చేసినప్పుడైనా వాళ్ళు ఒకరితో ఒకరు మాట్లాడుకునేవారు కారు. వారికి నివాసస్థలం కాని ప్రదేశం అంటూ లేదు. స్మశానాలు, ఆలయాలు, పాడుబడ్డ ఇళ్ళూ, తుప్పలూ, డొంకలూ నిర్జన ప్రదేశాలూ, అన్నీ వాళ్ళవే! కొందరైతే వారిని అలాంటి చోట్ల చూసి జడుసుకుని పారిపోసాగారు.

ఆ ఊళ్ళోని వాళ్ళకి.... ముఖ్యంగా జారిణులకు వారి ఉనికి కంటకప్రాయమైంది. ఎక్కడ కలుసుకుందామన్నా వీరి అలికిడి ఉంటోంది.

ఊరిలోని ప్రజల్లో అక్రమసంబంధాలున్న వాళ్ళంతా, ఈ ఇద్దర్నీ 'పిచ్చి వెధవలు- ముండా కొడుకులు' అంటూ చీదరించుకుంటూ ఉండడంతో, ఆ మాటలు వినలేక- ఆ ఇద్దరూ ఎవరికి వారే విడివిడిగా ఓనాటి అర్ధరాత్రి ఎవరికీ తెలీకుండా ఊరొదిలి అరణ్య మార్గాన 'సానుమంతం' అనే నగరాన్ని నాలుగు రోజుల తర్వాత చేరుకున్నారు"....

మణిసిద్ధుడు అంతవరకు చెప్పి, కాలం అధికమైనందున అప్పటికా కథ చాలించి, తరువాత ప్రదేశంలో- తదనంతర వృత్తాంతం ఈ విధంగా చెప్పసాగాడు...

కాశీ మజిలీ కథలు

29 వ మజిలీ

"గోపా! వినుము..... ఆ సానుమంత నగరంలో, అంతకు కొన్ని రోజుల క్రిందటే 'ఎవరి కెవరూ లేరు' అంటూ తిరుగుతూండే పిచ్చివాడొకడొచ్చాడు. అతడ్ని భిక్షగాడని తలచి, 'ఎవరికెవరూ?' అంటూ పిల్లలు వెక్కిరిస్తుంటారు.

అతడు కూడా జనాల్లేని చోటనే నివశిస్తూ, ఎవరైనా ఏదైనా ఇస్తే ఆకలి తీర్చుకుంటాడు. ఎవర్నీ యాచించడు. దేవశర్మ, దైవయత్నం ఆ నగరాన్ని చేరిన మూడో రోజునే, అతడ్ని ఒక దేవళంలో కలుసుకున్నారు. ముగ్గురి చర్యలూ ఒకటే తీరు. పైగా ముగ్గురూ ఒకే చోట వసించడం. వారిని ఎవరు పలకరించినా ఆ ముగ్గురి నోటి వెంట, వారి- వారి ఊతపదాలు తప్ప ఇంకేమాట వినరాకపోవడంతో వాళ్ళు ఒక్కక్కరికి ఒక్కో రీతిగా అనుకోడానికి అవకాశం ఇచ్చినవాళ్లు అయ్యారు. అలా అనుకునే వాళ్ళని అజ్ఞానులనీ, విజ్ఞానులనీ రెండు వర్గాలుగా విభజిస్తే, అజ్ఞానులకు ఆ ముగ్గురూ పిచ్చివాళ్ళుగానూ, విజ్ఞానులకు వారు వివేకవంతులుగాను కన్పించసాగారు. వారు ఒకచోట కలిసి ఉన్నా ఒకరితో ఒకరు మాటాడుకోరు. ఒకడు వెళ్ళినట్లుగా ఇంకొకడు వెళ్ళాడు.

మాలతి కథ

వాళ్ళు ముగ్గురూ ఒకనాడు దేవాలయంలో నిద్రపోతూంటే, ఒకనాటి అర్థరాత్రి ఒక జంట పదహారేళ్ళ చక్కని చిన్నదాన్ని పురోహితుడికి కూడా వెంటబెట్టుకొచ్చి, గుడిలో నలుదిక్కులా వెతికి దైవయత్నంగాడిని లేపి, ఆ పిల్లదాని పక్కన కూర్చోబెట్టారు. పురోహితుడు మంత్రాలు చదువుతుంటే

అన్ని వివాహ విధులనూ శాస్త్రోక్తంగా జరిపించారు. అందులో భాగంగా దైవయత్నాన్ని అలంకారాలతో- నూతన వస్త్రాలతో సత్కరించారు. ఆ పిల్లకు మంగళసూత్రాన్ని కూడా కట్టించారతని చేత. ఇంతా చేసి, గుట్టుగా తెల్లారక ముందే ఆ పిల్లని తీసుకుని వాళ్లు వెళ్ళిపోయారు.

మరునాడు ఉదయం కొత్త బట్టలతో- పెళ్లి అలంకారాలతో ఉన్న దైవయత్నం గాడిని చూసి పురజనులు ఆశ్చర్యపోయారు. పిచ్చివాడుకదా! ఏం చేసుకుంటాడవి? వాటిని ఆ రోజు అతడికి భోజనానికి పిలిచిన బ్రాహ్మణునికి ఇచ్చేశాడు దైవయత్నం. చిత్రంగా ఆ సాయంత్రం ముగ్గురూ ఆ నగరాన్నొదిలి పెట్టి ఉత్తర దిశగా ప్రయాణమై కొన్ని రోజులకు మహారణ్యంలోని ఒక మర్రిచెట్టును చేరుకున్నారు.

అది చాలా పెద్దది కావడం వల్ల, దాని మీద ఒక నగరంలో ఎంత మంది నివసించవచ్చో, అంతమంది జనం నివసించవచ్చు! క్రూర జంతువులకూ- పిశాచాలకూ అది ఆవాసయోగ్యం. లోకం పట్టని పిచ్చివాళ్ళు గనుక ఈ ముగ్గురూ ఆ చెట్టు ఊడలు పట్టుకుని పైకెక్కి తలొక కొమ్మమీద పడుకుని, ఆ ప్రాంతపు విశేషాలు చూడసాగారు.

ఇంతలో దొంగలు ఇద్దరు ఒక చిన్న దాన్ని, చక్కని చుక్కవంటిదాన్ని ఒక బంగారుగంపలో ఎత్తుకొచ్చి, ఆమె కోసం పోట్లాడుకుంటూ ఉండగా, ఏదో సవారీ వస్తున్న అలికిడి విని, వెయ్యి కాగడాల వెలుగుచూసి ఆ గంపనొక తొర్రలో ఉంచి పారిపోయారు.

వేలాది కొరివి దయ్యాలు వెంటరాగా, భూతరాజు భైరవుడితో ముచ్చటిస్తూ, అక్కడికొచ్చి ఎముకల సింహాసనం మీద కూర్చున్నాడు. వారి మాటల మధ్య 'వయస్సులో వున్న పెళ్ళికాని క్షత్రియ కన్య కుత్తుక నులిమి ఆ పచ్చి నెత్తురుతో కాళికాదేవిని తృప్తి పరిచే కార్యక్రమం కోసం మాయోపాయంతో ఓ యువతిని సిద్ధంగా ఉంచినట్లుగా చెప్పబడింది.

అంతలో తెల్లవారబోతోంది. భూతాలరాజు తన బలగంతో, అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. వాళ్ళు ముగ్గురూ చెట్టుకొమ్మపై నుంచి చూస్తూండడంతో మాలతికి తెలివి వచ్చి అరవగానే వాళ్ళు ఆమెను చెట్టుతొర్రలోంచి గంపతో సహా నేలమీద దించారు.

ఆమె చాలా అందగత్తె. అక్కడకు దగ్గర్లోని సానుమంత నగరప్రభువు మందపాలుని పుత్రిక. ఆమెను ఇంద్రదత్తుడనే రాకుమారునికిచ్చి వివాహం నిశ్చయించడమేగాక, గౌరీ పూజకు కూర్చోబెట్టేరు. ఆ సమయంలో భేతాళమాయకులోనై ఆమె అక్కడకు తీసుకురాబడింది. ఆ సంగతి ఆమెకి తెలీక గౌరీ పూజ నిమిత్తం సమాయత్తం అవుతున్న తనను వాళ్ళే ఎత్తుకొచ్చారనుకుంది.

అంతలో రాజభటులు రాజుతో సహా అంతా వెతుక్కుంటూ అక్కడకు రాగా, తమ పుత్రికను అక్కడ చూడగలిగాడు. దగ్గర్లో ఉన్న ముగ్గురినీ అడిగితే, ఒకరు దైవయత్నం అనీ, ఒకరు అంతా విచిత్రం అనీ, ఒకరు ఎవరికెవరూ 'లేరు అనీ చెప్పారు. వాళ్ళు వెర్రివాళ్ళలా నటిస్తున్న తస్కరులేమో అనుకున్న మందపాలుడు, వాళ్ళని కారాగారంలో పడవేయించాడు. ఉరితీయిస్తానన్నాడు.

అయితే, మాలతికి వారిని చూస్తే జాలి అన్పించి "తండ్రీ! వారు నాకు ఏ విధమైన అపకారం చెయ్యలేదు" అన్నది.

"నీకు తెలీదమ్మా! వీళ్ళు నిన్ను తీసుకుపోవడానికి కారణం లేకపోలేదు. ఆ మధ్య ఒక కపట వివాహం జరిపించింది వీళ్ళలో ఒకడితోనే" అన్నాడు రాజు.

"అయితే, ఆ రోజు గుడిలో నేను పీటల మీద కూర్చున్నది- వీరిలో ఒకరి ప్రక్కనా? అసలు అది దేనికి?" అని అడిగింది మాలతి.

"నీ జాతకం ప్రకారం నీకు పెళ్ళిరోజున భర్త మరణిస్తాడని' రెండో పెళ్ళి తధ్యం అనీ అన్నారు. అందుకని ముందుగా నీకు మిధ్యా వివాహం జరిపించాల్సి వచ్చింది. కాని తర్వాత నీ జాతకం పరిశీలింప జేయిస్తే, అదంతా తప్పు అని తేలింది. జరిగిందానికి విచారిస్తున్నాను" అంటూ, ఆ ముగ్గుర్నీ వదిలేశాడు. కాని, తనకు ఎవరితో వివాహం జరిగిందో, అతడే తన భర్త అని మాలతి భావించింది. కాని ఆ వెర్రివాళ్ళ నోటివెంట, వారికి అలవాటైన ఊతపదాలు తప్ప ఇంకొక్క మాటయిన బయటకు రావడం లేదు.

మాలతి కథ

అప్పుడు మాలతి – 'స్త్రీకి పతియే దైవం. పతి ఎవ్వరో తెలీడం లేదు. అతడు అడవుల పాలై తిరుగుతూంటే నేను రాజభోగాలు అనుభవించనా? ఎప్పటికైనా తెలీకపోదు' అనుకుంటూ తల్లిదండ్రులు ఎంత చెపుతున్నా వినిపించుకోకుండా, నార చీర కట్టుకుని 'విరాగిణి' అనే నామధేయంతో వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళింది.

అక్కడికా కథ అలా చెప్పేంతవరకు, చాలా వేళ కావడం వల్ల– ఆ నాటికి కథ చాలించి మణిసిద్ధుడు తదనంతర వృత్తాంతం, తర్వాత మజిలీలో ఇలా చెప్పసాగాడు....



కాశీ మజిలీ కథలు

30 వ మజిలీ

"వత్సా! వినుము.... ఆ ప్రకారం భోగాలు అనిత్యమని, వాటిని విడనాడి, కాషాయ వస్త్ర ధారిణి అయి మాలతి 'విరాగిణి' అయి తిరుగుతూ, అరణ్యంలోంచి వెళ్తూండగా ఆమెకొక బ్రాహ్మణుడు ఎదురుపడ్డాడు. ఆయనకు నమస్కరించి ఆమె "అయ్యా! మీరు తరచు దేశాటన చేసే వారైతే, ఎక్కడైనా ముగ్గురు వెర్రివాళ్ళు ఒకే చోట కనిపించారా?" అని అడిగింది.

అతడు "అమ్మా! ఈ సమీపగ్రామంలో ఎవరో ముగ్గురున్నారు. మందపాల మహారాజుగారి అంతఃపురంలో ఏదో ద్రోహం చేశారని, తరువాత వారు తప్పించుకున్నారని రకరకాలుగా చెప్పుకుంటున్నారు. నువ్వు వారి గురించే అడిగి ఉండవచ్చు! అది సరే! నువ్వెందుకిలా ఇంత చిన్న వయసులోనే కాషాయవస్త్రాలు ధరించి తిరుగుతున్నావు?" అన్నాడా బ్రాహ్మణుడు.

ఆమె "నేనో జోగినిని" అనేసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. వారిని కలుసుకుని వారిని వెంబడించసాగింది. నాటి నుంచి ఆమె మౌనవ్రతం దాల్చింది.

విక్రమార్కుడు- అతని మంత్రి భట్టి వారికి తారసపడి, 'వాళ్ళమాటలకూ- మాలతి మౌనంగా వారి వెంట నడవడానికి ఏదో కారణం ఉండి ఉంటుందనీ, అది తెలుసుకోనిదే మనం రాజధానికి పోరాదని నిర్ణయించుకుని, వారితోపాటే దేశాటనం చేయసాగారు.

ఒకరోజు- "సాధ్వీ! నేను విక్రమార్క చక్రవర్తిని. వింతలు చూడాలన్న నెపంతో దేశాటనం చేస్తుంటాను. నువ్వెవరు? వీళ్ళు ఎవరు? మీ యొక్క వైరాగ్యాలకు కారణం ఏమిటి? నిజం చెప్పు!" అని ఎంతో అనునయపూర్వకంగా అడిగాడు.

"నేను ఎవరితోనూ మాట్లాడనని నియమం పెట్టుకున్నప్పటికీ, మీ పేరు విని మాట్లాడుతున్నాను...." అంటూ కథ యావత్తూ వివరంగా చెప్పి "నీ పుత్రిక వంటి దాన్ని! వారిలో నాకు పతి ఎవరో నిరూపించి, నీ ఈ కూతుర్ని ఉద్ధరించు!" అని అతని పాదాలపై పడింది. విక్రమార్కుడామెకు అభయమిచ్చి, వారి చర్యలు పరీక్షిస్తూ- రహస్యంగా పరిశీలిస్తూ కొన్నాళ్ళు వాళ్ళ వెంట తిరిగాడు.

ఆ విచ్చివాళ్ళు జయంతం అనే పట్టణంలో ఉండగా, శృంగారశేఖరుడూ-వీరభద్రుడు- మయూరుడు-విచక్షణుడు అనే నలుగురు విటులు ఒకచోట చేరి మాట్లాడుకోసాగారు. వాళ్ల మాటలను బట్టి- ఆ పట్టణాన్నేలే ప్రభువుకు సంతానం లేదు. రాజుకు అకాల మృత్యువు ప్రాప్తించింది. అందువల్ల ఆయన మంత్రి ఒక ఏనుగుకు పూలదండయిచ్చి, యాత్ర ప్రారంభించాడు. గ్రామాలతో సహా దాన్ని అంతటా తిప్పుతారు. ఆ భద్రగజం ఆ పుష్పహారాన్ని ఎవరి మెడలో వేస్తే, వారే రాజవుతారు. ఆ ఏనుగు దృష్టిలో పడటానికి ఈ నలుగురు విటపురుషులు తలొకదిక్కున నిలిచి ఉండాలని నిశ్చయించుకున్నారు. అంతేకాదు! తమ నలుగురిలో ఎవరు రాజైనా, సమానంగా రాజ్యాన్ని పంచుకోవాలనీ- వేశ్యలనూ, శృంగారాన్ని అభివృద్ధి చేయాలనీ, వితంతువులంటూ ఎవరూ ఉండకుండా చూడాలనీ- పునర్వివాహాల వంటి కార్యక్రమాలు చేపట్టాలనీ చాలా ప్రణాళికలు సైతం సిద్ధం చేసుకున్నారు. ఏనుగు బయల్దేరిందని వార్త రాగా, నలుగురూ నాల్గుదిక్కులకూ వెళ్ళిపోయారు. విక్రమార్కుడు వాళ్ళ ఆలోచనలు విని ఆశ్చర్యపోతుండగా కొద్దిసేపట్లోనే ఆ ఏనుగు 'దైవయత్నం'గాడిని వరించిందని సమాచారం.

అన్నిటికంటే ముఖ్యవర్తమానం- 'దైవయత్నం' తనను వరించిన ఏనుగు నెక్కకుండా మారాం చేస్తున్నాడు. భట్టితో సహా విక్రమార్కుడు అక్కడకు చేరుకున్నాడు. ఇంతలో విజయవర్ధన మహారాజు అక్కడికి వచ్చి, మిగిలిన

పిచ్చివాళ్లతో కలిసి తిరుగుతున్న దైవయత్నాన్ని చూసి చేతులు జోడించాడు. ఒక పద్యం చదివాడు.

సీ. పైదలుల్ దుష్ట చేష్టా దూషిత స్వాంత
ఉత్తమాంగన లోక ముద్ధరించు
నరయ దైవాయుత్తమై యొప్పు జనమెల్ల
వసుధ నెవ్వరికి నెవ్వరున్ లేరు
తలపోసిచూడనంతయు మహా చిత్రంబు
సంసార మనియెడు సాగరమున
కల్లోలముల భాంతి గలుగు నిమ్నోన్నత
గదురు లోకుల కర్మ గతులంబట్టి
గీ. పూని నిట్టూర్పు విడుచుటకైనం బురుషం
దస్వతంత్రుండు మది నిట్టు లరసి యెపుడు
ప్రజలం బాలింపు మయ్య భూపాలదేవ
సార్వభౌమ! మహాయశ శ్శౌర్య పరంధామ!

అని చదువగా విని, దైవయత్నం నిద్రలోంచి మేల్కొన్నట్లుగా తల ఎత్తి చూసి "విజయవర్ధనుడా! నిన్ను ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి చూశాను? మన ప్రజలంతా సుఖమేనా?" అని అడిగాడు.

"మీరు లేని కొరత ప్రజల్ని పీడిస్తోంది" అన్నాడు విజయవర్ధనుడు.

"ఇతడు భూపాల చక్రవర్తి సుమీ!" అన్నాడు విక్రమార్కుడు- భట్టితో "మాలతి వరించినది ఇతడినే!" అని భట్టి నిర్ధారించగా అందరూ కలిసి కోటలోనికి వెళ్ళారు.

తరువాత విక్రమార్కుడు, విజయవర్ధనునితో "భూపాల చక్రవర్తి అలా సంచరించడానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది" అన్నాడు. విజయవర్ధనుడు ఆ ప్రభువు అనుమతితో ఇలా చెప్పసాగాడు.

భూపాల దేవ మహారాజు కథ

"అనఘా! ఈతడు భూపాల దేవ చక్రవర్తి అనేది నిశ్చయం. ఇతని వెనుకటి చరిత్ర ఇది. కర్మననుసరించే బుద్ధి ఉంటుంది కదా!

ఈతడు యవ్వనంలో ఉండికూడా, వివాహానికి అంగీకరించకుండా యువతు దష్కృత్యాన్ని ఎత్తి చూపిస్తూండేవాడు. నేను ఆయనను వివాహానికి ఒప్పించాలని ఎన్నో ప్రయత్నాలు చేసి, విసిగి, దైవసంకల్పం ఉంటే మీరు ఎంత తప్పించుకుందామనుకున్నా, అది కుదరదు అన్నాను.

ఒకరోజు మా నగర దేవాలయంలోకి మహాయోగి రాగా, నేను రాజును బలవంతంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లాను. " మా మహారాజు దైవసంకల్పం నమ్మారు. ఆయన ఉద్దేశంలో పురుష సంకల్పమే బలమైనది. మన ప్రయత్నం ప్రధానం. కనుక ఆయన్ని మార్చండి" అన్నాను. ఆయన ఒక పద్యం చెప్పారు. ఆయినప్పటికీ రాజు ఆయన్ని మతిలేని వాడిగా జమకట్టారు.

ఆ మర్నాటి నుంచీ రాజు-యోగీ ఇద్దరూ కనిపించకపోయేసరికి, ఆ గుట్టుదాచి, రాజు ఉన్నట్లే రాజ్యపాలన చేయడం- ఏనుగును వెంటబెట్టుకుని దేశాటనం చేయడం అనే బాధ్యత నాపై పడింది. ఒక క్షేత్రంలో యోగి కన్పిస్తే మా రాజు గారి గురించి తెలుపమన్నాను. ఆయన "మీ రాజు వెర్రివాడై తిరుగుతున్నాడు. కొన్నాళ్లలో కనిపిస్తాడు. అతడు మీ భూపాలుడు అనిపిస్తే నేనిచ్చిన పద్యం చదువు! పూర్వ స్మృతి వస్తుంది" అన్నాడు. "అదుగో! అలా దైవికంగా ఆ పద్యం చదివి ఆయన్ను గుర్తించాను" అన్నాడా విజయవర్ధనుడు అనే మంత్రి.

భూపాల దేవుని వంక చూశాడు విక్రమార్కుడు. అప్పుడాతడు "ఆ ప్రకారం యోగితో వాదించి ఇంటికెళ్ళి, కంటిమీద కునుకురాక మా వాదంలో సత్యాసత్యాల్ని తర్కిస్తుండగా, నా మంచానికి దగ్గర్లో వీరు పురుషుడెవరో వచ్చి అట్టహాసంగా నన్ను చెయ్యి పట్టి వాయువేగంలో

అరణ్యాలు- నదులూ దాటేలా లాక్కుపోయాడు. అప్పుడు నాకు అనిపించింది- నన్ను ఇలా ఈడ్చుకురాగల శక్తి మానుషశక్తి కాదని, అది దైవశక్తికే సాధ్యమనీ, అప్పట్నుంచి పురుష సంకల్పం ఎంత? దైవయత్నమే మిన్న అని బాగా బోధపడింది. ఆనాటి నుంచి 'దైవయత్నం' అనే మాట తప్ప ఇంకేదీ అనకూడదని నిర్ణయించుకుని వెర్రివాడిలా ఎక్కడెక్కడో తిరిగాను. కొన్నాళ్లకు ఈ 'ఎవరికెవరూ లేరు' అనే పిచ్చివాడూ 'అంతా చిత్రం' అనే దేవశర్మ నాకు తగిలారు. ఒకరాత్రి ఒక చిన్నదాన్ని తెచ్చి, ఎవరో నన్నే లేపి కూర్చోబెట్టి వివాహం తంతు ముగించుకుని వెళ్లిపోయారు" అని తన వృత్తాంతం చెప్పాడు.

అప్పుడు-మిగిలిన వాడు తన గాథ నిలా వివరించాడు.....

నవ కుబేరుని కథ

"అయ్యా! నా కాపురం కాంచీపురం. నేను వైశ్యకులజుడిని. నన్ను నవకుబేరుడు అంటారు. నాకు పదిమంది కొడుకులూ- ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్ళిళ్ళు చేశాను. అల్లుళ్ళని సైతం ఇంటనే ఉంచుకుని వ్యవహారాలు నేర్పుతూ చాలా ధనం సంపాదించాను. నా సంతానం సంపద కూడా వృద్ధి చెందాయి. కాని నేను చాలా లోభిని. దానధర్మాలకు కాసు వెచ్చించడానికైనా మనసొప్పేదికాదు.

ఒకరోజున ఒక యోగి వచ్చి స్వయంపాకం ఇమ్మని అడగ్గా నేను గెంటించాను. అతడు పంతం పట్టి అలాగే మా ఇంటి దగ్గనే కూర్చున్నాడు. అతడు శపిస్తాడేమో అని మా వాళ్ళు భయపెట్టారు నన్ను. కాని నేను లొంగలేదు. చివరికి అతడే విసిగి వెళ్ళిపోయాడు. నేనే జయించాననుకుని వీధి తలుపులు తెరిచాను. కాని అతడు మళ్లీ తెల్లారేసరికల్లా వచ్చి కూర్చున్నాడు. తర్వాత- అతడు నా కళ్ళు తెరిపించాలని, నేను నా వాళ్ళనుకుంటున్న వాళ్లెవరూ నా వాళ్ళు కాదని నాకు స్పష్టంగా అర్థమయ్యే

రీతిలో ఒక దృష్టాంతంతో సహా తెలియజేశాడు. అప్పట్నుంచీ వెర్రివాడినై "ఎవరికి ఎవరూ లేరు" అనే ఒక్కమాట తప్ప ఇంకేమీ పలకక వెర్రిగా తిరగసాగాను. తర్వాత కథ మీకు తెలిసిందే!" అన్నాడు.

అవన్నీ విన్న విక్రమార్క చక్రవర్తి "ఆ మహాయోగి సామాన్యుడు కాడు" అని చెప్పాడు. అప్పుడు భూపాల చక్రవర్తి "దేవశర్మకు రాజ్యపట్టాభిషేకం చేసి, నవకుబేరుని అతనికి మంత్రిగా నిలపమన్నాడు. తాను మాలతిని తిరిగి వైభవంగా వివాహం చేసుకున్నాడు.

విక్రమార్కుడు, భట్టి ఉజ్జయినికి పోతూ, ఒకనాడక్కడ ఆగి, తటాకం సమీపంలో ఆ పుణ్యాత్ముల విగ్రహాలు స్థాపించి, ఆయా జాతుల్ని బట్టి దేహంలో వివిధ భాగాలపై పేర్లు రాయించాడు. ఇదీ ఆ విగ్రహాల వృత్తాంతం" అని మణిసిద్ధుడు చెప్పి, గోపకుమారునితో కూడా తదుపరి మజిలీకి ప్రయాణం సాగించాడు.

మూడవ భాగం సంపూర్ణం

కాశీ మజిలీ కథలు

4వ భాగము

కాశీ మజిలీ కథలు

4వ భాగము

31 వ మజిలీ

క. శ్రీమణి సిద్ధ యతీంద్ర
స్వామి సమీహిత మనీష చాత్ర సమేతుం
డై ముప్పది యొక్కటి మజి
లీ ముదమున జేరిc యట జలింపని భక్తిన్

ప్రణవ మంత్ర పరాయణ పారాయణుడైన మణిసిద్ధుడు, జపాన్ని పూర్తిచేసుకుని, ఆ రోజు ఉపవాస దినం కావడం వల్ల, తీరిగ్గా కూర్చున్నాడు. అంతకు ముందే - వింతలు చూడ్డానికి వెళ్లిన గోప కుమారుని రాక కోసంఎదురు చూడసాగాడు.

అంతలో, ఆ గోపాలుడు ఆ గ్రామం నలుమూలలా తిరిగాడు. తనకు వింతలేవీ కనిపించనందుకు పరితపిస్తూ గురువుగారి సముఖానికి వచ్చి నమస్కరించి "స్వామీ! మనం యాత్ర ప్రారంభించాక ఇంత పాడు మజిలీ ఎక్కడా చెయ్యలేదు. ఈ గ్రామం కంటే అడవి మేలు. గ్రామమంతా పదిసార్లు తిరిగాను. మిమ్మల్ని అడగడానికి ఎక్కడా ఏ విశేషం కనబడలేదు.

పోనివ్వండి! ఇవాళ ఎంతో పుణ్యదినం. పర్వం రోజు. ఊరకే పొద్దుపుచ్చడం దేనికి? కాశీవిశేషాలు చెప్పండి" అని ప్రార్థించాడు.

మణిసిద్ధుడు ఆ ప్రశ్నకు ఆనందించి, ఆ గోపాలునికి విశ్వేశ్వర మహాత్మ్యం, పూజా మహిమ, అభిషేక ప్రభావం మొదలైన విశేషాలన్నీ ఇతిహాసాలతో సహా చెప్పాడు. ఫలితాలు ఏమేమి కలుగుతాయన్నది కూడా చెప్పాడు. అవన్నీ విన్నాక వాడు "స్వామీ! నేను ఉత్తమకులంలో జన్మించనప్పటికీ, మీ వంటి మహానుభావునికి తోడుగా రాగల్గడం చేత నాకు ఈ కాశీ యాత్ర చేసే భాగ్యం లభించింది. కాని, చేతులారా విశ్వేశ్వరుని అర్చించే అవకాశం నాకీ జన్మకి దొరకదు గదా! కాశీయాత్ర వల్ల మీరు చెప్పిన ఫలితం నాకు ఎలా అందుతుంది?" అని అడిగాడు.

అప్పుడా యతీంద్రుడు "గోపా! నువ్వు అందుకు విచారించనక్కర్లేదు. కేవలం పంచములు తప్ప అన్ని జాతుల వారు, అంతా కూడా విశ్వేశ్వర మహాలింగానికి స్వయంగా అర్చనలు - అభిషేకాలు చేసుకోవచ్చు! ఆ అభిషేకపు పుణ్యం నీకూ తప్పకుండా వస్తుంది" అని చెప్పాడు.

అప్పుడా గోపకుమారుడు "అయ్యా! నాకొక సందేహం! వినండి! మా గ్రామంలో నేనూ, మరి కొందరు గోపాలకులతో కూడి పశువుల్ని మేపుతూంటే - ఓ సాయంకాలం వేళ పెద్ద గాలి వాన వచ్చింది. రాళ్లంత వడగళ్లుపడ్డాయి. గాలి వేగం ఇంతింత అని చెప్పలేను. ఇక వర్షం అంటారా! కడవలతో గుమ్మరించినట్లే! మాకు ఏం చెయ్యాలో తెలీక పశువుల్ని అక్కడే అలాగే వదిలేసి ఊళ్లోకి పరుగులు పెట్టాం! అయితే ఆ వానలో ఎక్కువదూరం పరుగెత్త లేక, ఊరిబయట శివాలయంలోనికి మేమే తలుపులు తెరుచుకుని,

దూరి కూర్చున్నాం! ఆ రోజు మా పుణ్యవశాన పూజారిగారు గుడికి తాళం వేయడం మర్చిపోయారట!

ఆ గుళ్లో పెద్దదీపం - అఖండం.... కాబోలు వెలుగుతోంది. లింగం దగ్గర అరటి పళ్లు- టెంకాయలు మొ॥ పదార్థాలున్నాయి. గాలి దూరే సందు అయినా అందులో లేనందున వెచ్చగా ఉంది. మేం ఎంతో ఆనందపడి, తడిగోచీలు ఊడదీసుకుని, ఆపళ్లన్నీ తిని ఆకలి అణచుకొని, ఆ స్వామి దయవల్ల హాయిగా నిద్రపోయాం!

అంతలో అర్చకుడు తాళం గుర్తొచ్చి, తెల్లవారక ముందే అక్కడి కొచ్చాడు. మేము అందులో నిద్రపోతూన్నాం. మమ్మల్ని దొంగలు కాబోలను కుని, వేగంగా వెళ్లి గ్రామస్తుల్ని తీసుకొచ్చాడు. వాళ్లంతా కలిసి మమ్మల్ని లేపి, మా వల్ల సంగతి తెలుసుకుని కోప్పడి మమ్మల్ని వదిలారు.

మేము ఆ గుడిలో దూరి లింగాన్ని తాకినందుకే, నాల్గురోజులపాటు నైవేద్యం మానిపించారు. ఆ పిదప ఆ ప్రాంతంలోని పెద్దపెద్ద బాపనయ్యల్ని రప్పించి మూడురోజుల పాటు మంత్రాలు చదువుతూ, సంప్రోక్షణలు, సంతర్పణలు చేశారు.

"అయ్యా! పల్లెటూరి గుడిలోని లింగానికే అంతటి నియమాలు అమలు జరిపినపుడు, ముల్లోకాలలోను ప్రసిద్ధి పొందిన విశ్వేశ్వర లింగానికి అట్టి నియమాలు ఎందుకు లేవు? దీని కేదో కారణం ఉండకపోదు. ఆ వృత్తాంతాన్ని నాకు తెలుపవలసింది" అని అడగ్గా, ఆ యతీంద్రుడు మణిని తన ముందు ఉంచుకొని, కళ్లు మూసుకుని ధ్యానం చేసి ఆ వృత్తాంత మంతా మనసులోకి ఆకళింపునకురాగా, చిర్నవ్వుతో "గోపా! నీ పుణ్యం మంచిది. దీని వల్ల మంచి కథ వినే భాగ్యం నీకు లభించింది. నీ ప్రశ్న ఊరకేపోలేదులే" అని ఆ కథ చెప్పసాగాడు.

పండిత రాయల కథ

"**కా**శీపురంలో పండిత భట్టు అనే బ్రాహ్మణుడున్నాడు. అతడు సకల విద్యల్లోను గొప్ప పాండిత్యం సంపాదించి, చాలా విద్వత్సభల్లో విజయాలుపొంది 'మహా మహోపాధ్యాయుడు' అనే బిరుదును పొందాడు. అంతేకాక – కాశీ పట్నంలోని పండితులలో కెల్లా ముఖ్యమైనవాడై, ఇతర దేశాల్నుంచి వచ్చి చదివే విద్యార్థులకి పరీక్షాధికారిగా ఉండి చాలా కీర్తి సంపాదించాడు. దీనితో అతనికి కాశీసభాపతి అనే పేరు కూడా సార్థకమైంది. అందువల్ల నిత్యం కాశీ వచ్చే యాత్రికులు, ధనవంతులు, రాజులూ ఆయన్ను తప్పకుండా దర్శించుకొని – సన్మానించుకొని మరీ వెళ్తుండేవారు. అందువల్ల ఆ పండితుడు చాలా కొద్ది కాలంలోనే గొప్ప ధనవంతుడయ్యాడు.

బాగా డబ్బున్న చోట సంతానం లేకపోవడం సాధారణమే! కాని, ఆ పండితునికి అలా కాక, సరైన వయసులోనే పుత్రుడు జన్మించాడు. తండ్రి ఎంతో సంతోషంతో చాలా ధనం వ్యయంచేసి, ఆ పిల్లవాడికి బాల్యంలో జరిపించాల్సిన ఉత్సవాలన్నీ వేడుగ్గా జరిపించి, అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు.

పండిత భట్టు ఇంట–నిత్యం సంస్కృతంలో మాట్లాడటం వల్ల ఆ పిల్లవాడికి చిన్నతనంలోనే ఆ భాషమీద పట్టు ఏర్పడింది. దీనికి తోడు ఆ బాలుడు ఏక సంథాగ్రాహి. కేవలం ఒక్కసారి వినడంతోనే, పట్టుకోగల్గిన నేర్పు అలవడ్డంతో – చదువవేసిన రెండేళ్లకే తర్క వ్యాకరణాల్లో దిట్ట అనిపించుకోగలిగాడు. మనోహరమైన రూపంతోపాటు బాల్యం నుంచీ శాస్త్ర పరిశ్రమలోనూ ఆరితేరుతూన్న ఆ పిల్లవాడ్ని మెచ్చుకోని వారు లేరు.

పండిత భట్టు, తన కుమారునికి చాలా వైభవంగా ఉపనయన కార్యక్రమం జరిపించాలని తలపెట్టాడు. అంతలోనే ఆ పిల్లవాడ్ని చూసి యముడు కూడా ముచ్చట పడ్డాడా అన్నట్లు, ఆ బాలుడ్ని తీసుకెళ్ళిపోయేసరికి ఆ దుఃఖం నుంచి తేరుకోవడం ఎంతకూ పండితులవారి వల్లకాలేదు. అందరికీ ఇష్టుడైన ఆ బాలుడి మరణవార్త విని, కాశీ పట్నంలో విచారించని వారు లేరు. ఎట్టకేలకు ఆ దుఃఖాన్నణచుకొని, పండిత భట్టు తిరిగి తన దైనందిన వ్యవహారాల్లో పడ్డాడు.

కొంతకాలానికి అతని భార్య తిరిగి గర్భవతై మరొక పుత్రుడిని కన్నది. ఆ బాలుడు రూపంలో అచ్చుగుద్దినట్లు ఆ మొదటి శిశువునే పోలిఉండటం వల్ల-తల్లిదండ్రుల శోకం తీర్చడానికే అతడట్లా జన్మించాడని అందరూ చెప్పుకున్నారు. దాంతో పండితభట్టుకూడా, ఆ బాలునికి వెనుకటి పిల్లవాని పేరే 'విశ్వనాధుడు' అని పెట్టి వైభవంగా అన్ని వేడుకలు జరిపించాడు. చిత్రంగా- ఆ బాలుడు రూపంలోనే కాక, విద్యల్ని గ్రహించే నేర్పులో సైతం సోదరుని పోలిఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఆ పిల్లవాడి ముద్దు మాటలకు తల్లిదండ్రులు సంతోషిస్తూ వెనుకటి శోకం క్రమంగా మర్చిపోసాగారు. ఉపనయన ముహూర్తం సమీపిస్తుండగా, అంతే చిత్రంగా ఆ బాలుడు సైతం అకాల మృత్యువు బారిన పడ్డాడు ఇక ఆ దంపతుల శోకం ఇంతింత అని చెప్పలేం!

అందరూ ఎంతో విచారించి, దుఃఖోపశమనం కలిగించే విధంగా ఊరడించి - సానుభూతి చూపసాగారు. పండిత భట్టుకీ దెబ్బ మీద దెబ్బ వల్ల గంభీరమైన వైరాగ్యం అలవడింది. ఇలా ఉండగా దేవుడు అద్భుత కల్పనలు చేసి, లోకులను ఈ సంసార సాగరంలో ముంచితేలుస్తూంటాడు కదా! మరొక సారి పండిత భట్టు భార్య గర్భందాల్చి, ఈసారి కూడ పుత్రుడినే కన్నది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఆనందించడానికి బదులుగా ఏడ్వసాగారు. చుట్ట ప్రక్కల వాళ్లంతా వచ్చి "అన్నీ తెలిసిన వారు-పెద్దలు-సంతోష సమయంలో ఇట్లా ఏడ్వడం సబబా? చెట్టున పుట్టిన కాయలన్నీ నిలుస్తాయా? ఇతడు చిరకాలం బ్రతగ్గలడు" అంటూ ఆ దంపతులకు దుఃఖం నుంచి ఉపశాంతి కలిగించాడు.

అందరూ అదేరీతిగా ఊరడించే సరికి, ఆ దంపతులు తెప్పరిల్లి, మళ్లీ పూర్వపు శిశువులకు జరిపినట్లుగానే అన్ని వేడుకలు ఘనంగా జరిపించారు. ఎనిమిదో ఏడు ప్రవేశిస్తుండగా ఆ బాలుడికీ నూరేళ్లూ నిండిపోయాయి. ఇది చిత్రమేనని అందరూ సానుభూతి పడుతూండగా, అది తమకు పరిపాటి అయిపోయిందన్న చందంగా వారు బాధకు గురికాలేదు. తాను నిరాశ చేసుకుని, భార్యకూ వైరాగ్యం బోధించి ఎట్లో కాలం గడుపుతూంటే, మళ్లీ ఇంకొక పుత్ర రత్నం ఉదయించాడా దంపతులకు.

గత అనుభవాల దృష్ట్యా, దంపతులు ముందే ఆ పిల్లవాడిని మృతప్రాయునిగా తలచారు. జాతకర్మాది వేడుకలు - విధులు ఏవీ జరపలేదు. అయినప్పటికీ ఆ పిల్లవాడు కూడా ఏడేళ్ల ప్రాయాన్ని ఈ భూమ్మీదపూర్తి చేసుకుంటూనే పరలోకగతుడైనాడు. తాము నిమిత్త మాత్రులమే అని ఎంచి, పోయిన బాలునికై ఒక్క ఏడ్పు ఏడ్చి ఊరుకున్నారు.

ఈ ప్రకారం - పండిత భట్టుకు ఏడుగురు పుత్రులు జన్మించారు. అందరూ రూపంలోను, కళల్లోను ఒకే తీరుగా మనోహరంగా ఉండి, ఒకే వయస్సులో- ఉపనయనం చేసే ముందే కాలధర్మం చెందారు. పుట్టిన కొడుకులంతా ఇలా గిట్టడం చూసిన పండిత భట్టు దానాలు- జపాలు- హోమాలు- తర్పణాలు ఎన్నో చేశాడు. కాని ఉపయోగం లేకపోయింది.

ఎనిమిదో గర్భం వచ్చినపుడు, ఆ సంగతి తెలిసీ తెలియగానే పండిత భట్టు భార్య గోలుగోలున ఏడుస్తూ-భర్త భుజంమీద తల ఆన్చి "ఏమండీ! ఈ ప్రసూతి దుఃఖం ఇన్నిసార్లు నిర్దయగా నాకే రాయాలా ఆ భగవంతుడు? ఇది నేను భరించలేక పోతూన్నాను. పైగా ఈ గర్భాలన్నీ నాకు శరీరాయాసాన్నీ - ఎంతకూ తగ్గని దుఃఖాన్నీ కలిగిస్తున్నాయి. ఏడ్గురు ముద్దుల మూట గట్టే పిల్లల్ని కని, పెంచి వారి ఔన్నత్యం చూడకముందే నాకు గర్భశోకం మిగిలేలా వాళ్లు పైలోకాలకు తరలిపోతూన్నారు. వీళ్లు ఇలా పుట్టడం - చావడం దేనికి? ఈ కడుపేదో ఇప్పుడే పోయేలా నాకు ఏదైనా ఉపాయం చెప్పండి! మీకూ - నాకూ కూడా సుఖం" అంది ఆ వేదనతో

"ఏమే! నీ కష్టం పగవాళ్లకుకూడా వద్దు. కాని పూర్వ జన్మలోని కర్మం ఎలాటి వారికైనా అనుభవించక తప్పదు. పశువులు, గృహాలు, పొలాలు, పుత్రులు ఇవి ఋణానుబంధ రూపంలో ప్రాప్తిస్తూంటాయి. గతజన్మల్లో ఏ ఘోర పాపాలు చేశామో ఇప్పుడనుభవిస్తున్నాం! ఇది ఇంతటితో పోనివ్వక ముందు రాబోయే జన్మలకు కూడా వాయిదా వేయిద్దామా? నువ్వు చెప్పినట్లు చేశామే అనుకో! భ్రూణహత్యఅనే పాపానికి శిక్ష అనుభవించాల్సి వస్తుంది. కనుక తటస్థులమై. దుఃఖం అనుభవించవలసిందే! ప్రారబ్ధ కర్మానికి ఇంతకంటె ప్రాయశ్చిత్తం లేదు. అని బోధించి పెళ్లాన్ని ఊరడించసాగాడు.

భర్త ఎన్ని చెప్పినప్పటికీ, గర్భాన్ని తొమ్మిది నెలలూ మోసి, నొప్పులు పడి, మృత్యువుతో పోరాడుతూ కనడం - తీరా ఇంత బాధపడి కాన్నక వాళ్లు దక్కకపోవడం తల్చుకొని బెంబలెత్తిపోయిన ఆ నిర్భాగ్యురాలు ఏదోలా గర్భాన్ని చెడగొట్టుకోడానికే మార్గాలు వెతకసాగింది. ఇలా ఉండగా ఒక రోజు ఉదయాన ఒక ముస్లిము ఫకీరు, యవన భాషలో దీవనలు చదువుతూ భిక్షాటనం చేస్తూ అటువైపుగా వచ్చాడు.

రకరకాల రంగుల పూసల పేరులు మెడలో వేలాడుతూంటే, నల్లలుంగీ - నీలం అంగరఖాతో చకచకా సాగుతూన్న ఆ ఫకీరును చూసిన వారికి, అతడి దగ్గర ఏదో ఒక సిద్ధి ఉన్నట్లు అన్పించక మానదు. తన దాసీ దాన్ని అతడి దగ్గరకు పంపి, గర్భస్రావం చెయ్యగల ఏదైనా ఔషధ మూలికను ఇప్పించమని అడిగింది.

ఆ మాట విన్న ఫకీరు అరచేత్తో నోటిమీద కొట్టుకుంటూ "అయ్యో! మేము ద్రోహం తలపెట్టే పనులు చేసే వాళ్లం కాము తల్లీ! అయినా- మీ యజమానురాలికి అటువంటి అగత్యం ఎందుకొచ్చింది? ఆమె భర్తతో కూడివున్న స్త్రీయే కదా!" అని అడిగాడు. అప్పుడా పరిచారిక వారి వృత్తాంతమంతా చెప్పింది. అప్పుడా ఫకీరు జాలిపడి "మరి ఆ మాట చెప్పవేం? మీ యజమానురాలిని ఇక్కడికి తీసుకొనిరా! పరీక్షించి రక్షరేకు ఇస్తాను. ఈ సారి జన్మించే పుత్రుడు తప్పకుండా జీవిస్తాడు" అని చెప్పాడు. దానికి ఆ దాసి చాలా ఆనందించి, ఆ వైనం పండితభట్టు భార్యకు చెప్పి ఆమెను అతడి దగ్గరకు తీసుకుపోయింది.

అప్పుడా ఫకీరు ఆమెను చూసి, యవన మంత్రాలతో దీవిస్తూ -

"అమ్మా! నేను దైవం తోడుగా చెప్తున్నాను. నేను ఇచ్చే పూసల పేరును నిత్యం నడుముకి కట్టుకో! నీకు పుత్రుడు జన్మించాక, అది ఆ బాలునికి మెడలో వేయి. ఆ పిల్లవాడికి ఫకీరు అని పేరు పెట్టు! రెండు పూటలా మసీదుకు తీసుకెళ్లి, అక్కడ దైవ ప్రార్థన చేస్తూన్న (నమాజ్) యవన వృద్ధులచేత దీవెనలు ఇప్పించు! ఖురాన్ చెప్పించు! అలా చేస్తే మీ పుత్రుడు తప్పకుండా జీవిస్తాడు. సందేహంలేదు. ఇవి బిచ్చగాని మాటలు అనుకుంటూ

తీసిపారేయవద్దు. శకునం చూసి చెప్తున్నా! నా మాట నమ్మి అలా చేయండి!" అంటూ ఎన్నో ఒట్లూ- ప్రమాణాలూ చేశాడు.

ఆ మాటలు విన్న ఇల్లాలు చాలా సంతోషపడి "ఫకీరూ! మాకు అంతటి అదృష్టం పట్టేనా? అయ్యో! ఏదైతేనేం! చల్లని మాట చెప్పావు. అలాగే కానియ్యి! నీ మాట ప్రకారమే చేసి చూద్దాం! నీ పుణ్యం వల్లనైనా పుట్టబోయేవాడు జీవిస్తే, నీ శరీరమంతా బంగారపు పూసల పేర్లు వేయించకపోదునా? అయినా ఇప్పుడు చెప్పడం దేనికీ? నువ్వుకూడా దైవాన్ని ప్రార్థించి మాకు మేలు కలిగేలా చూడు!" అంటూండగా వీధిలోంచి పండిత భట్టు ఇంటికొచ్చాడు.

అప్పుడామె తన భర్తతో "ఏమండీ! మనం ఈ సారి ఇలా చేసి చూద్దామండీ" అంది- ఫకీరు చెప్పిన మాటలన్నీ చెప్పి. అతడు నవ్వుతూ "చాల్చాలు! మనం ఇది వరకు చేసిన వ్రతాలు-నియమాలు ఎంత ఉపయోగపడ్డాయని, ఇదొక్కటి మిగిలిపోయిందా ఏం? వారేదో బిచ్చం కోసం చెప్తుంటారు! అవన్నీ నిజాలే అని నమ్మేస్తామా?" అని తేలికగా తీసేశాడాయన.

అప్పుడామె "అలాకాదండీ! ఈ ఫకీరు బిచ్చంకోసం చెప్పిన మాటలు కావివి. అతడిప్పుడు ఏమీ మనల్ని ఇమ్మని కోరలేదు. పరోపకారం నిమిత్తం చెప్పాడు. లోకంలో నష్టజాతకులను అలా సన్యాసుల పేరిట పేరు పెట్టడం అనే ఆచారం ఉంది కదా! ఈతని మాటల మీద నాక్కొంచెం ఆశగా ఉంది" అంది "అయితే, నీకు తోచినట్లు చెయ్యి" అన్నాడా బ్రాహ్మడు.

తరువాత- ఆమె ఫకీరిచ్చిన పూసలపేరును భక్తితో పుచ్చుకొని అతడు వద్దంటూన్నా దోసెడు బంగారు నాణాలు అతని ఒళ్లోపోసి పంపించి, ధూపం వేసి ఆ పూసల పేరును నిష్ఠగా నడుముకు ధరించింది.

కాలక్రమాన పండితభట్టు భార్య వాడుకప్రకారం మంచిలగ్నాన ఒక కుమారుని కన్నది. ఆ బాలుని రూపం, తేజస్సు, లగ్నం, లక్షణాలు అన్నీ పరిశీలించిన పండితభట్టుకు ఆ కుర్రవాడు జీవించే అవకాశాలు న్నాయని కొంచెం ఆశ కలిగింది. అయినా ఏ మూలనో కొంచెం

సంశయచ్ఛాయలు ఉండి, గత అనుభవ శోకం వల్ల కాబోలు సమంత్రకంగా ఏ విధమైన జాతకర్మలు చేయించలేదు. ఫకీరు చెప్పినట్లే ఆ బాలుని చిన్నఫకీరుగా పిలవసాగాడు.

పండితభట్టు భార్యం ఫకీరిచ్చిన పూసల పేరు తన కుమారుని మెళ్లో వేయడం మాత్రమేగాక, తురక పిల్లలకు పెట్టే విధంగా నగలూ-దుస్తులూ అలంకరించి అబ్బురంగా పెంచసాగింది. బాల ఫకీరు బాల చంద్రుడిలా రోజురోజుకి పెరిగి పెద్దవుతూ, తన రూపం గుణం ప్రజ్ఞల వల్ల అందరికీ ఇష్టుడయ్యాడు.

ఫకీరు చెప్పిన ప్రకారం - ఆ కుర్రవాడికి సంవత్సరం దాటిన తర్వాత ప్రతిరోజూ రెండుపూటలా, కాశీ శివార్లలో ఉన్న మసీదుకు తీసుకెళ్లి అక్కడ నమాజ్ చేసే తురకలతో దీవెనలిప్పించసాగారా దంపతులు. అంతేగాక, మసీదులోని ఆ జాతివారికి మంచి కానుకలు కూడా ఇస్తూండడంతో వాళ్లంతా ఆ పిల్లవాడ్ని ఎంతో సేపు లాలనగా చూసేవారు. అక్కడితో ఆగక - పిల్లవాడికి ఐదో ఏడు రాగానే విద్యాభ్యాసం నిమిత్తం మసీదులోనే యవన భాషలో చదువవేశాడు. ఒక దాది ప్రతిరోజూ ఆ పిల్లవాడ్ని మసీదుకు తీసుకెళ్లి విద్యపూర్తి కాగానే ఇంటికి తీసుకొస్తూండేది. ఆ బిడ్డడు బుద్ధిమంతుడు కావడం వల్ల అతి స్వల్పకాలంలోనే యవనవిద్యలు అతనికి పట్టుబడ్డాయి.

ప్రతిరోజు రాత్రి పండిత భట్టుగారింట, ఇతర శిష్యుల కోసం కావ్య నాటక తర్క శాస్త్రాల పాఠాలు జరుగుతూంటాయి. అందువల్ల వాటిని కేవలం వినికిడి మీదనే వొంటబట్టించుకున్న ఆ సూక్ష్మగ్రహి ఇటు సంస్కృత భాషలో కూడా అసామాన్యమైన ప్రజ్ఞగలవాడయ్యాడు. ఆ బాలునికి ఏడుసంవత్సరాల వయస్సు వచ్చినది మొదలు, అక్కడి మసీదులోనే ఉంచి యవన దేవతలను ఆరాధింప జేస్తూ-ఫకీర్ల చేత ప్రార్థనలు చేయిస్తూ, మసీదు అంతా అలంకరించి యవనులకు సంతర్పణలు కూడా చేయించసాగాడు.

రెండు-మూడు రోజుల్లో ఏడేళ్లు పూర్తవుతాయి అనగా-దంపతుల గుండెలనిండా గుబులు ఆవరించింది. క్షణం ఒక యుగంలా గడపసాగారు.

అప్పటికి ఏడుగురు పుత్రుల చావులను తన కళ్లతో చూసిన పండితభట్టు, ఆ పుత్రుని మరణాన్ని తల్చుకుంటూ, అది చూడజాలక కళ్లు మూసుకుని పరమేశ్వరుని ధ్యానించసాగాడు.

కళ్లు తెరవకుండానే "పుణ్యాత్ములారా! నా పుత్రుడు ఈ నిముషంలో ఎలా ఉన్నాడు? బ్రతికే ఉన్నాడా? నాకు అటువంటి అదృష్టం పట్టిందా?" అంటూ ఆత్రపడుతూంటే, అతడి ఆవేదనను సరిగ్గానే అర్థం చేసుకున్నారు ఫకీరులు. "అయ్యా! దైవం అందరికీ ఒక్కడే! ఆయన చల్లగా చూడడానికి అవసరమైనవన్నీ చేస్తున్నాం కద! మీ పిల్లవాడికి వచ్చిన భయమేమీలేదు. గండం గడిచింది. నూరేళ్లూ బతుకుతాడు" అని స్పష్టంచేశారు.

ఆ మాటలన్నీ వింటున్న పండితభట్టుగారి చిన్నవాడు "నాయనా! మీరు నా విషయమై ఇంతగా భయపడుతున్నారేం? నేను బ్రతికే ఉన్నాను. సంతోషంగా ఉన్నాను" అంటూంటే, ఆ పిల్లవాని పలుకులు మళ్లీ మళ్లీ విని ఆనందిస్తూ "నాన్నా! నీ అన్నలు ఒకరుకాదు.... ఇద్దరుకాదు- వరుసగా ఏడుగురు ఇదే ఎనిమిదో ఏట ఒక్కనిముషమైనా జీవించలేదు. అందరూ ఒకే రీతిన మృతి చెందడం చేత నేను ఇంతగా జడిసిపోతున్నాను. భగవంతుడు నిన్ను కనికరించి నాకు వదిలేసినట్లుగా తలుస్తున్నాను. ఆ దయా మూర్తి ఫకీరు రూపంలో వచ్చి నన్ను ఓదార్చాడా? అనే అనుకుంటున్నాను. ఇదుగో! ఈ మసీదులో ఉన్నవాళ్లందరి దీవనలే నిన్ను నాకు దక్కించాయి" అని తురకలందరికీ విశేషంగా దాన ధర్మాలు చేసి, భార్యతో సహా ఆనంద సాగరంలో తేలిపోతూన్నాడా రోజు.

కొద్ది రోజులవరకు ఆనంద - విచారాల మధ్య ఊగిసలాడినా, ఎనిమిదో ఏడు ప్రవేశించిన తరువాత కొన్నాళ్ల వరకు పిల్లవాడిని కంటికి రెప్పలా కాచుకున్నారు ఆ దంపతులు. భయం తీరగానే, ఆ బాలునికి ఉపనయనం శాస్త్రోక్త విధిగా నిర్వర్తించి, అతడ్ని ఒక పట్టభద్రునిగా చేసినంత ఆనందాన్ని పొందాడా తండ్రి. అయితే లోలోన కమ్ముకున్న భయం అంత త్వరగా తీరుతుందా? అతడికి కలిగిన అనుభవాలేం సామాన్యమైనవా? అందువల్ల ఈ పుత్రుని దక్కించుకోవడానికి, కులమత ధర్మ సంబంధమైన

ఆచారాలను పక్కకు పెట్టడానికి సైతం సాహసించాడు పండితభట్టు. కొడుక్కి వడుగు చేసినా మసీదుకు పంపడాన్ని మానలేదు. అట్లాగని అదే నిరంతర ధ్యానంగా భావించకుండా, ఫకీరు నామధేయుడైన తన పుత్రునికి సంప్రదాయం ప్రకారం వేదవిద్యలోనే ప్రవేశింపజేశాడు. అన్నల్లాగే ఏకసంథాగ్రాహి కనుక ఆడుకుంటూన్నంత తేలిగ్గా ఆ బాలుడు వేదాల్ని పట్టుకున్నాడు.

యవన సాహస ప్రభావం వల్ల కాబోలు - గుర్రం ఎక్కడం, కత్తి తిప్పడం, సాముచేయడం వంటివీ అలవడ్డాయి. పుత్రునికి వాటి మీద అభిరుచి కలగడం చేత, అల్లారుముద్దుగా పెంచుతూన్న తన కొడుక్కి ఇష్టం కలిగించే పనులే చెయ్యాలని నిర్ణయించుకోవడం చేత ఆ తండ్రి అటువంటి కళల్లో నిష్ణాతులైన క్షత్రియ వృద్ధుల చేత ఆ విద్యలు కూడా నేర్పించసాగాడు. ఏ విద్యనైనా అద్దం ప్రతిబింబాన్ని ఏర్పరచే చందంగా, ఇటు చెప్పగానే అటు గ్రహించేయసాగాడా పిల్లవాడు. పగలంతా ఈ ఆయుధ పరిశ్రమ-రాత్రులలో వేదశాస్త్ర పరిశ్రమ చేస్తూన్నందున ఆ కుర్రవాడికి పదహారేళ్లు వచ్చేసరికి అన్నిట్లోను అసామాన్య ప్రావీణ్యం అలవడింది.

ఫకీరనే పేరు అతనికి తగినట్లుగా లేదని, కాశీపురంలోని పండితభట్టును ఎఱిఁగిన ప్రతివారూ అతడ్ని మహావీరుడనీ-పండితరాయలు అనీ పిలవసాగారు. కాశీక్షేత్ర విశ్వేశ్వరుని పేరిట విశ్వమంటే జగత్తు కనుక జగన్నాథ పండితరాయలని నిర్ధారిస్తూ అలా పిలిచేవాళ్లూ లేకపోలేదు. ఎవరెలా పిలిచినా ఆ యువకుడు తరచు యవనుల దుస్తులతో తిరుగాడుతూ 'యవనప్రభువా' అన్నట్లు కన్పిస్తూండేవాడు.

యుక్తమైన వయస్సు వచ్చినందున, పండిత భట్టు అతడికి వివాహం చెయ్యాలని ప్రయత్నించాడు. అయితే - ఆ యువకునికి వీరరసం మీద ఉన్న అభిలాష శృంగారరసంమీద కలగకపోవడం చేత పెళ్లికి ఒప్పుకొనేవాడుకాడు. ఇదొక్కటే పండితభట్టుకు అసంతృప్తి.

ఒకరోజు - ఆ మహావీరుడు, మసీదులో కూర్చొని హిందూ-మహమ్మదీయ మతాల మధ్య గల తేడాని తులనాత్మకంగా పరిశీలిస్తూ చక్కని ఉపన్యాసం చేశాడు. అది పూర్తిగా విన్న యవన మతపెద్ద 'ముల్లా'

ఆ యువకుడి విద్యాపాటవానికి ఆశ్చర్యపోయి "అప్పా! నీకు ఉన్న ఈ పాండిత్యం, వీరత్వం, గాంభీర్యం ఇవి సామాన్యమైనవి కావు. నీ వంటివారు ఇక్కడ ఉండడం కంటె ఢిల్లీకి వెళ్లడం ఉత్తమం! అక్కడ పాదుషాగారు నిన్ను చూడడం జరిగితే మాత్రం, అల్లునికి జరిపేటంత గౌరవం జరుపుతారు. ప్రతిఏటా ఈ మసీదు నిర్వహణకు పాదుషాగారు పంపే సొమ్మును ఇక్కడకు తీసుకు వచ్చే భటులు నేడో-రేపో వస్తారు. వాళ్లతోపాటు నువ్వు ఢిల్లీ వెళ్లగల ఏర్పాటు చేస్తాను" అని చెప్తూండగానే, ఢిల్లీ వజీరు వద్ద నుంచి ఇద్దరు భటులు ధనంతో పాటు ఒక లేఖని పెద్దఫకీరు చేతిలో పెట్టారు.

ఆ ఫకీరు, పండితరాయలు వింటూండగా ఆ లేఖను ఇలా చదివి విన్పించాడు.... "కాశీ పట్నంలో గల మసీదు నిర్వాహకులుగారికి,

అనేక నలాములతో ఢిల్లీ పాదుషాగారి వజీరు విన్నవించేగాదేమిటంటే - మన పాదుషాగారికి 'లవంగి' అనే కూతురుంది. పదహారేళ్ల ఆ కన్యకు బాల్యం నుంచి హిందూ మతాభిమానం అధికంగా ఉండటం వల్ల ఆ విద్యల్లో ఎక్కువ పరిశ్రమ చేసింది. ఈ మధ్య ఆమె 'కాశీఖండం' అనే గ్రంథాన్ని చదివిందట! అప్పట్నుంచీ కాశీయాత్ర చేయాలనీ - విశ్వనాధుని సేవించాలనీ వేడుక పడుతోంది. రేపు రాబోయే శివరాత్రికి అక్కడికొచ్చి విశ్వేశ్వరునికి స్వయంగా అభిషేకం చేస్తుందిట! తన కోరికని ఆమె తండ్రితో చెప్పగా, ఆయన మీకు ఈ విధంగా రాయమని నన్ను ఆదేశించారు. ఇంతవరకు మన పాదుషావారికి ఏడుగురు పుత్రికలు పుట్టి ఏడేళ్లపాటు పెరిగి కాలంచేశారు. ఇప్పుడు ఈమె ఎనిమిదో సంతానం. ఒక్కర్తే మిగిలింది. అందువల్ల పాదుషావారు ఈమెని గారాబంగా చూస్తూ ఏమి కోరినా కాదనకుండా తీరుస్తారు. కాబట్టి అక్కడ హిందువుల అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకొని మాకు వ్రాయవలసింది. బలవంతంగా నైనా ఆ పని చేయిస్తాం"...

ఆ పూటకు ఉపవాసం ఉన్నందువల్ల మణిసిద్ధుడు, అంతకంటె అధికంగా కథ కొన సాగించక, తదుపరి మజిలీలో ఆ కథ చెప్తానని గోపాలునికి భోజనం పెట్టి, తాను ఫలహారం చేసి విశ్రమించాడు.

కాశీ మజిలీ కథలు

32 వ మజిలీ

తదుపరి ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఉత్కంఠని ఇక భరించలేక భోజనం పూర్తికాగానే "అయ్యా! గత మజిలీలో తాము ఢిల్లీ పాదుషా వారి ఫర్మానా ఫకీరు చదివి విన్పించడం వరకు చెప్పి ఆపేశారు. తరువాత ఏం జరిగింది? హిందువులు అందుకు ఒప్పుకున్నారా? బలవంతంగా పాదుషా ఆ పనికి పాల్పడ్డాడా?... చెప్పవలసింది" అని కోరగా, మణిసిద్ధుడు గొంతు సవరించుకున్నాడు.

"గోపా – వినుము! ఆ విధంగా వచ్చిన లేఖని రెండుసార్లు చదివిన ఆ మసీదు పెద్ద, వీరుడైన పండితరాయల్ని చూస్తూ "అప్పా! ఈ ఉత్తరం నువ్వు కూడా విన్నావు కదా! మీ తండ్రిగార్ని ఈ నగరంలో అందరూ మన్నిస్తారు. మాకు కూడా వారంటే గొప్ప గౌరవం – గురి అని నువ్వెరుగుదువు. ఈ ఉత్తరంలో ఉన్న సంగతులు ఆయనకు చెప్పి, ఏం వ్రాయించమంటారో త్వరగా తెల్సుకునిరా! ఇందులోని చివరి వాక్యానికి అర్థం గ్రహించావుకదా! పాదుషాగారి శాసనాన్ని అడ్డుకొనే వాళ్లున్నారా?" అన్నాడు.

అప్పుడా వీరుడు "ఏమేమీ? హిందూ దేవాలయంలోకి ఒక యవన పుత్రిక వచ్చి అభిషేకం చెయ్యడమా? చాల్చాలు! ఈ సంగతి చెప్పడానికి మా తండ్రిగారే అవసరం లేదు. హిందూ మతస్తులెవరూ ఒప్పుకోరు. మీ మతంలో అన్ని ఇతర మతాల వారినీ చేర్చుకొంటారేమో! మేం ఎవ్వర్నీ కలుపుకోడానికి మా శాస్త్రాలు అంగీకరించవు. ఇక-బలాత్కారంగా అలా చేయిస్తానంటే, ఆయనేమన్నా అంత వీరుడా ఏం? ఇక్కడ ఆ మాత్రం బలవంతులే లేకనా?" అని స్పష్టంచేశాడు.

"అప్పా! పాదుషాగారి వృత్తాంతం నీకు తెలియక అలా అంటున్నావేమో! ఈ భూమండలం అంతా అతనిదే సుమా! ఈ రాజులందరూ ఆయనకు కప్పములు చెల్లిస్తున్నవారే! ఆ చక్రవర్తి తల్చుకుంటే, సాగనిది ఏది? అతనితో పగసాధించడం రుద్రుని వశం కూడా కాదు. మీ తండ్రిగారికి చెప్పి త్వరగా రా! ప్రత్యుత్తరం రాయాలి మరి?" అన్నాడు మసీదు నిర్వాహకుడు.

"అతడు ఎంతటివాడైనా, మత విరుద్ధమైన పనులు చేయడానికి ప్రజలు ఒప్పుకుంటారనా? చక్రవర్తి అయినందుకు ఇదా ఫలితం? సరే!నాకు ఇంత చెప్పడం దేనికి? మా వాళ్లను అందర్నీ కనుక్కొని రేపు జవాబు ఇస్తా!" అని అప్పటికప్పుడే తండ్రి దగ్గరకు వెళ్లి ఆ వృత్తాంతమంతా చెప్పాడు.

యువకుడు కనుక, పండితరాయలు నిర్భీతిగా వ్యవహరించినా- అతని తండ్రి అయిన పండితభట్టు మాత్రం భయపడుతూనే, కాశీలో పేరు పొందిన తన బోటి హిందూ ప్రముఖులందరికీ కబురంపి మరునాడు కాశీరాజుగారి పండితసభలో కలుసుకోవలసిందని సూచించాడు.

కాశీరాజు విశ్వేశ్వరుని సన్నిధిలోనే విశ్వనాథాలయమంటపం మీద సభ జరుపగా, కాశీలోని ప్రసిద్ధ హిందూ పండితులంతా వచ్చారు.

ఆ సభలో పండితభట్టు 'పాదుషాగారి కూతురు శివరాత్రి పర్వదినాన స్వయంగా స్వామికి అభిషేకం చేస్తుందట అనీ - అడ్డుకోదలచినా బలాత్కారంగానైనా ఆ పని చేయిస్తారట' అనీ చెప్పి, అందరి అభిప్రాయాలూ కోరాడు.

అప్పుడు కొందరు "పాదుషా గారితో వైరం -మనకే అపకారం కాబట్టి అడ్డు చెప్పుట మంచిదికాదు" అన్నారు. "వినయంగా ఇలాటి మత విరుద్ధమైన పనులు చేయవద్దు అంటూ ప్రార్థన పత్రికలు పంపాలి" అన్నారు. మరి కొందరు. "కాశీప్రభువుల అభిప్రాయం ప్రకారం ఎలా ఉంటే, అలా చెయ్యవచ్చునన్నారు" తటస్థులు. "ప్రాణాలు పోయినా సరే! హిందూ మానాభిమానాలను కాపాడాలి" అన్నారు ఇంకొందరు. అందరి అభిప్రాయాలు విన్నాక "మనకందరకు ఆతడు చక్రవర్తి. అట్టివారి శాసనం తిరస్కరించడం మనకు శక్యమని నేను అనుకోను. మన దగ్గర కేవలం రెండు లక్షల సైన్యమే ఉన్నది. ఆయన అధీనంలో అనేక లక్షలసైన్యం ఉంది. అందువల్ల పగబూని నిలవడానికి నా తరం కాదు" అన్నాడు కాశీరాజు.

అప్పుడు పండితరాయలు సభలో లేచినిలబడి, నాలుగుదిక్కులా ఉన్న సభ్యులను చూస్తూ "పాదుషాను చక్రవర్తి అంటూ మీరంతా ఎందుకిలా భయపడుతున్నారో నాకు అర్థం కావడంలేదు. మనలోని ఒక సామాన్యునికి ఉన్నంత బలం కూడా అతనికి స్వయంగా లేదన్న నా మాటను మీరందరూ మన్నించండి! అల్పమైనట్టి గడ్డిపరకలన్నీ కూడుకొని ఒక మోకు తాడుగా ఏర్పడినప్పుడు ఏనుగునైనా బంధించడం మనం నిత్యం మనకళ్లముందు చూస్తున్నదే! మన దేశమంతా ఏకమైతే ఇటువంటి పాదుషాలు పదిమందికాదు.... వందమంది వచ్చినా ఏమీ చెయ్యలేరు. దేశం దాకా ఎందుకు? ఈ పట్టణం అంతా ఒక్కమాట మీద నిలబడినాచాలు! విశ్వేశ్వర

లింగం హిందూమతస్థులకు ప్రాణం లాంటిది. ఆ లింగరూపుని పవిత్రత కాపాడటం మనకేకాక దేశానికంతటికీ అత్యంత ముఖ్యం! మనరాజుగారు పాదుషాకు అకారణంగా భయపడుతున్నారు ఆయన విషయం నాకు వదిలెయ్యండి. రెండులక్షల సైన్యం ఉందంటున్నారు కనుక - ఆ రెండు లక్షల సైన్యాన్ని నా అధీనంలోకి రాకుండా తరిమికొట్టగలను. అతడు వినతి పత్రాలకు లొంగే రకంకాడు. అది అక్కడినుంచి అందిన ఉత్తరంలోనే తెలుస్తోంది" అంటూ అందరి మనస్సుల్లోను వీరరసాన్ని ఉప్పొంగేలా చేశాడు.

అప్పుడా పౌరులంతా, ఆ యువవీరుని మాటలు మెచ్చుకుని వీరావేశంతో "పాదుషాగారి కూతురు గుడిలో ప్రవేశించడానికి మేము ఒప్పుకోం! బలవంతంగా రాబోతే ప్రాణాలకు తెగించి పిల్లలు - వృద్ధుల్తో సహా అంతా పోరాడుతాం! ఈ మహావీరుడే మాకు సేనాధిపతిగా ఉండాలి! ఇతడు చెప్పినట్లుగా రెండు లక్షలసైన్యం అతడి అధీనంలోకి తీసుకురావడమే ఉత్తమం!" అని ముక్తకంఠంతో ఒకేమాట అన్నారు.

అప్పుడా కాశీరాజుకి రోషం వచ్చి "ఓహో! మీరంతా వీరాధివీరులు -నేను పిరికి వాడిని అని మీరంతా అనుకుంటున్నారా! ఈ వీరుని ధైర్యస్థైర్యాలు మాకు ముచ్చటగా ఉన్నాయి. అందువల్ల ఈ వీరునికి సర్వసైన్యాధిపత్యం ఈ క్షణము ధారాదత్తం చేస్తున్నాను. దీనితో అతడు తనకు కావలసిన విధంగా చేయవచ్చు! యుద్ధమే ప్రాప్తం అనుకుంటే నేను నేనూ రంగంలోకి దిగుతాను" అన్నాడు. అంతేగాక అప్పటికప్పుడే అతడ్ని సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించి ఆ నాటికి సభ చాలించాడు.

మర్నాడు పండితరాయలు మసీదుకు వెళ్లి, పెద్దఫకీరుతో "మా మతస్తులు, పాదుషాగారి కూతురు గుడిలో ప్రవేశించడానికి ఒప్పుకోవడం లేదు. మతవిరుద్ధలైన పనులు మానుకోవలసిందిగా మందలిస్తూ మీరే పాదుషాగారికి ఉత్తరం రాయండి" అని పలికాడు.

ఆ మాటలు విన్న మసీదుపెద్ద "కానివ్వండి! మాకేం - మీ మేలు కోరి చెప్పాం! మీకు రాబోయే ముప్పు మానిపించడం మా తరమా?" అని అప్పటికప్పుడే వజీరుకు ఆ విషయమే రాసి పంపేశాడు. మరికొన్నాళ్లకి ఢిల్లీనుంచి మసీదుకు ఒక ఉత్తరం వచ్చింది. ఆ సమయంలో వీరుడు అక్కడే ఉన్నాడు. అందువల్ల దానిలో అంశాలు అతడికీ తెలిశాయి.

"కాశీ పట్నానికి నాలుగు క్రోసులు దూరంలో హుస్సేనాబాద్ అనే కోట ఉంది. అది పాదుషా వారి అధీనంలో ఉంది. శివరాత్రికి పూర్వమే లవంగా ఆ కోటలోనికి ప్రవేశిస్తుంది. శివరాత్రినాడు ఆమె గంగాస్నానం చేసి లింగానికి అభిషేకం చేస్తుంది. అడ్డం వచ్చిన వాళ్లందరినీ ఖతం చేయడానికి అనుజ్ఞ ఇవ్వడమైనది. మీరు కూడా అందుకు తగిన సహాయాన్ని అందజేస్తూండాలి" ఇదీ ఆ వజీరుగారు పంపిన ఫర్మానా.

వజీరు రాసిన ఉత్తరంలో విషయాలు రహస్యాలు అయినప్పటికీ ఫకీర్లు వీరునిపట్ల అభిమానం చేత మెల్లగా వెల్లడించేశారు. యుద్ధం పట్ల ఉత్సాహంగా ఉన్న పండితరాయలు, తమవాళ్ళందరికీ ఆ రహస్యాల్ని చెప్పేసి, కేవలం ఒక లక్షసైన్యాన్ని మాత్రమే తెప్పించాడు.

శివరాత్రికి ముందే పట్నం చుట్టూ - వీధుల కూడళ్లలో - దేవాలయద్వారాల దగ్గర వాళ్లను కాపలాగా నిలబెట్టి, యుద్ధ తంత్ర నిపుణుడైనందున చక్రవ్యూహాన్ని రచించాడు. తాను గుర్రం మీద స్వారీ చేస్తూ, స్వయంగా అన్ని చోట్లా పర్యవేక్షిస్తూ, ఎటు చూసినా తానే అయి వ్యూహాన్ని కాపాడసాగాడు. యువకుడు- వీరాధివీరుడు అయిన పండితరాయల ఆధ్వర్యంలో హిందూధర్మపరిరక్షణనిమిత్తం ఉద్యమించడానికి వీరులు అనేకులు ఉత్సాహంగా ఉన్నారు. ఇది వజీరుకు సంపూర్ణంగా తెలీక, కేవలం పదివేల సైన్యంతో లవంగిని హుస్సేనాబాద్ కోటకు పంపాడు.

లవంగి కథ

యవన సేనా నాయకుడు తన సైన్యాన్నంతట్నీ హుస్సేనాబాద్‌కు చుట్టూ నిలబెట్టి, కాశీ విశేషాలు తెలుసుకోడానికి వేగులను పంపించాడు. హిందువులు చేస్తున్న ఈ ప్రయత్నాలు విని ఆశ్చర్యపోతూ, యజమానురాలైన లవంగికి ఒక లేఖ నిలాబ్రాశాడు.

"రాజపుత్రీ! మన రాక తెలుసుకుని హిందువులు కాశీపట్టణం చుట్టూ కాపు పెట్టుకున్నారు. మన బలగం కంటే వారి బలం అధికంగా ఉంది. ఈ విషయం తెలీక మనం సామాన్యమైన సన్నాహంతో మాత్రమే వచ్చాం! ఇది నేను గ్రహించాక, ఇప్పుడే మరి కొంత సేన పంపవలసిందిగా వజీరు గారికి ఉత్తరము వ్రాయడమైనది. ఆ సేన వచ్చేసరికి శివరాత్రి దాటి పోతుందేమోనని సందేహంగా ఉంది. ప్రస్తుతం మన దగ్గర ఉన్న బలంతో వారిని త్రోసుకొని పోలేమన్నది నిజం. కనుక ఈ సంగతి తమకు విశదం చేస్తున్నాను. ఈసేవకునికి కర్తవ్యం ఏమిటో ఆజ్ఞాపించవలసింది"

ఆ ఉత్తరం చదువుకున్న లవంగికి ఏంచెయ్యాలో కొంతసేపటివరకు తోచలేదు. దగ్గర్లోనే సంగీత చంద్రిక అనే చెలికత్తె ఉంటే, "సఖీ! ఇలారా! ఈ ఉత్తరం చూడు! అభాగ్యురాలిని. గంగాస్నానం – విశ్వనాథ దర్శనాన్ని కోరి వచ్చిన మనకు, ఈ పాడుకులంలో పుట్టినందున అంత సుకృతం ఎలా అబ్బుతుంది? మా తండ్రిగారి దగ్గర సేనలే లేనట్లు మరీ ఇంత తక్కువగా పంపించాలా? అదీ నా దురదృష్టమే! ఇప్పుడేం చేద్దాం? మన ప్రాణసఖి– కుందతిలక ఎక్కడ ఉంది?" అంటూ వేదన చెందుతూంటే సంగీత చంద్రిక ఆమెని ఊరడించింది.

"అమ్మా! మాకీ సంగతి నిన్ననే తెలిసింది. నువ్వు బాధపడతావని నీకు చెప్పలేదు. మేము వేరే దారులు వెతుకుతున్నాం! నిన్ను ఎలాగైనా గంగా స్నానం చేయించడానికీ – విశ్వేశ్వర దర్శనం చేయించడానికీ మేము గట్టి ఆలోచనలే చేస్తున్నాం! నేటి ఉదయాన్నే కుందతిలక కాశీలోకి వెళ్లింది. అక్కడి రహస్యాలు తెలుసుకుని వస్తుంది. వచ్చాక ఏ పథకం రచించి

కాశీలో నీకు దర్శనానికి ఏర్పాట్లు ఎలా చెయ్యాలో చూద్దామనుకుంటున్నాం" అని తన యజమానురాలి దుఃఖం తీరేలా చెప్పింది.

అప్పుడు లవంగి ముఖంలో ఆనందం కనిపించింది. ఇంతలో కుందతిలక కూడ అక్కడికి వచ్చి ఆమెకు మరింత ఆనందం కలిగించింది.

"అమ్మాయీ! నేను మారువేషంలో కాశీ వెళ్లాను. కాపలా భటుల ఆజ్ఞలేకుండా - ఆ పట్టణంలో చీమదూరడానికైనా అవకాశం లేదు. పట్టణంచుట్టూ వీధి వీధినా రాజభటులున్నారు. యాత్రల నిమిత్తం హిందువులు ఎవరు వెళ్లినా నిరాటంకంగా వెళ్లవచ్చు! దారుల్లో అక్కడక్కడ పరీక్షిస్తారు. నేను చూస్తుండగానే పలువురు సవారీల్లో ఆ పట్నంలోకి వెళ్లారు. అంతా హిందువులే! బలందర్పం అధికారం చూపించి ఇప్పుడు లోపలికి వెళ్లడం అసాధ్యం. నీ వేషం-భాష హిందువుల్ని పోలి ఉన్నాయి కాబట్టి, మేము ఎలాగూ హిందువులమే కనుక మనం పురుష వేషాలు వేసుకుని ఆ పురంలోనికి వెళ్దాం! ఇంకో విధంగా అక్కడ అడుగుపెట్టడం కుదరనిపని" అంది కుందతిలక. రాజపుత్రికకు అది బాగానే ఉందనిపించింది. అయినప్పటికీ ఇంకేమైనా ఉపాయాలు అన్వేషించాలని కూడా సూచించింది. తాము హుసేనాబాదు కోటలోంచి బయలుదేరడమే రహస్యంగా జరిగేలా ఉండాలన్నది ఆమె అభిమతం.

శత్రువులు కోటను ముట్టడించినప్పుడు తప్పించుకు పోవడానికి రహస్య మార్గాలు ఏర్పాటు చేయడం అనేది ప్రతి కోటలోనూ సహజంగానే ఉండేదే! కోటలోనుంచి కాశీపట్టణానికి చేరువగాగల ఒక చిన్న మెట్టమీదికి ఒక సొరంగ మార్గాన్ని, కోటంతా పరీక్షించిన చెలులిద్దరు కనుగొన్నారు. అది లవంగికి చెప్పి, మహదానందం కలిగించారు.

లవంగికి పురుషవేషం వేయించి, వేకువ ఝామున తాము కూడా పురుష పరిచారకుల వేషంతో తయారై, మెల్లగా కోటలోంచి రహస్య మార్గంలోంచి బైటపడి, కాశీపట్నానికి చేరువుగా ఉన్న ఉన్నతమైనట్టి ఒక మిట్టమీదకి చేరుకున్నారు.

అప్పటికి అరుణవర్ణంతో సూర్యుడు ఉదయిస్తున్నాడు. లేత ఎండలో విశ్వనాధాలయ ప్రాకారాలు - మంటపాలు చక్కగా కనిపిస్తుంటే భక్తిభావం ఉప్పొంగిన లవంగి అక్కడినుంచే ఆ దిశగా నమస్కరించింది.

లవంగి కథ

శా. అంశుప్రథిత ప్రభావ యుత దివ్య ప్రహాదినీ సత్తటా
భ్యాశాంచత్ప్రృథు సౌధ మధ్యగత దేవాగార సందీప్త వి
శ్వేశాఖ్యాక మహేశ లింగ మది నీవె కావె? యైక్యస్థితిన్
గాశీ పట్టణ రాజమా! ఇదె నమస్కారంబు నీ కిమ్మెయిన్!

అంటూ పద్యం చదివి, తాను కాశీఖండంలో చదువుకున్న విశ్వనాథ మందిర విశేషాలు చెలులతో ముచ్చటిస్తూ ఆ పట్టణం వైపుగా నడక సాగించింది. దారిలో వారికి మరికొందరు యాత్రికులు కూడా కలిశారు. చిన్నతనం నుంచీ గుఱ్ఱ మెక్కడం, సాముగరిడీల్లో- యుద్ధ విద్యల్లో శిక్షణ పొందడం చేత, మార్గాయాసం అనే మాట లేకుండా లవంగి వారితో కలసి నడవగలిగింది. సూర్యుని కిరణాల్లో క్రమంగా తీక్షణత అధికమైంది.

బారెడు పొద్దెక్కేసరికి వాళ్లు కాశీపట్టణ ప్రధాన ద్వారం చేరుకున్నారు. అక్కడ రక్షక భటులతో 'గంగాస్నానానికి వేళ మించి పోతున్నందున నడకను ఆశ్రయించి వడివడిగా వచ్చిన రాజకుమారుడి'గా పరిచయం చేసుకుని, పట్టణంలోకి ప్రవేశించింది లవంగి. వెంట తన పరిచారక బృందం వస్తోందని నమ్మబలికింది. అక్కడక్కడ పరీక్షగా చూస్తున్న రాజభటుల చూపుల నుంచి తప్పించుకోడానికి జనసమ్మర్దంలో దూరుతూ, రాజమార్గాలలో త్వర త్వరగా నడుస్తూ ఎట్టకేలకు గంగానదిలోకి దిగారు. గంగకు నమస్కరించి, పద్యస్తుతులు చేస్తూ పైపై మెరుగు దుస్తుల్ని విప్పి గట్టు మీద పెట్టి, ఇతరుల కంట పడకుండా చకచక స్నానం చేసి వెన్వెంటనే చెలుల సహాయంతో పురుషోచితమైన పట్టు అంగీలనే తొడుక్కుంది. తల ఆర బెట్టుకుంటూ కొద్ది సేపు గంగానది ఒడ్డునే కూర్చొని అక్కడి వింతలను – విశేషాలను చూడసాగింది లవంగి.

అయితే, ఆమె శిరస్సున పట్టించిన తైలాల పరిమళం, ఆ పూల తావి ఘుమఘుమలకు ఎక్కడెక్కడి యాత్రికులూ ఆకర్షింపబడి ఆ ప్రాంతానికే రాసాగారు. ఆమెని పరీక్షగా చూసిన స్త్రీలు – 'పురుషుడిలా ఉన్నాడే' అనుకుంటూండగా, పురుషులు – 'స్త్రీ సహజమైన లావణ్యాం కనిపిస్తున్నదీతడిలో' అనుకోసాగారు. ఇంకా పరీక్షగా వారిని చూడనివ్వక, వెంట్రుకలు ముడివేసి, శిరస్త్రాణం ధరించి వడివడిగా నడుస్తూ విశ్వనాథాలయాన్ని చేరుకొనే ఒక వీధిలో నడిచివెళ్లసాగారు లవంగి, ఆమె చెలులు.

లవంగి కథ

"గత సంవత్సరం శివరాత్రికి ఇన్ని పరీక్షలు - ఇంత అలజడి - ఈ భటుల కోలాహలాలు ఇవేవీ లేవ"ని కొందరు చెప్పుకుంటూంటే, "మహమ్మదీయ మతస్తురాలైన పాదుషా కూతురు ఆలయంలో ప్రవేశించకుండా నిరోధించడానికే ఇన్ని ఏర్పాట్లు. ఆ చాటింపులు వినలేదా!?" అని కొందరూ సంభాషించుకుంటున్నారు. అవన్నీ వింటూనే, యాత్రికుల్లో కలిసిపోయి లవంగి తన సఖురాళ్లతో కలసి విశ్వేశ్వరాలయం దగ్గరకి చేరుకుంది.

అక్కడ చాలామంది రాజభటులు లోపలికి వెళ్లేవారిని పరీక్షగా చూసి మరీ కొంతమంది చొప్పున వదుల్తూన్నారు. లోపల జన సమ్మర్దం అధికమై అలజడి జరగకుండా చూడటానికే ఆ ఏర్పాటు.

అక్కడ లవంగి సఖులు ముందు ముందు నడుస్తూ "ఇతడొక రాజపుత్రుడు. ఎక్కువ జనం ఉంటే సహించలేడు. స్వామివారిని సేవించి వచ్చేవరకు ఎక్కువమంది యాత్రికుల్ని లోపలికి వదలకండి. దర్శనం అయింతర్వాత మీకు చక్కని పారితోషికం అందించే ఏర్పాటు చేస్తాం!" అంటూ ఆ ద్వారపాలకుల్ని ఒప్పించి, లవంగినా పురుషవేషంలో లోపలికి తీసుకెళ్లగలిగారు ఆహా! తల్చుకుంటే, స్త్రీ ఎంతకైనా తెగించగల్గుకదా! లవంగి మహదానంద పరవశురాలై, విశ్వవిఖ్యాత విశ్వనాధాలయంలో తాను అడుగు పెట్టగలిగినందుకు ఆనందిస్తూనే ప్రదక్షిణలు చేయసాగింది.

కుందతిలక మెల్లగా "అమ్మా! ఆలయం లోనికి ఎలాగో ప్రవేశించ గలిగాం! కాని, గర్భాలయంలోనికి వెళ్లి అక్కడ అభిషేకం జరిపించ గలగడం ఎలాగా? అని ఆలోచిస్తున్నాను. అటు చూడు! ఆ ద్వారానికి చెయ్యి అడ్డుగా ఉంచి ప్రతి వార్నీ విమర్శనగా చూస్తున్న వీరపురుషుడొకడున్నాడు" అంది

ఆ రోజున పండితరాయలు అన్నిదిక్కుల ద్వారాల దగ్గరా మహావీరాధివీరుల్ని కాపలాగా నియమించి, తానే స్వయంగా మహాదేవుని గర్భగుడిద్వారాన్ని కాపుకాస్తున్నాడు.

ఆ యవ్వనులు ముగ్గురూ ప్రదక్షిణలు పూర్తి చేసి, గర్భాలయంలోనికి పోతూంటే, పండితరాయలు లవంగి చెయ్యిపట్టుకుని "ఏమయ్యో! నిలబడు! తురకలాగ ఆ టోపీ ఏమిటి? ఇక్కడ తలపైన ఏదీ ధరించక విశ్వనాధుని

దర్శించాలని తెలీదా?" అంటూ గద్దించాడు. చటుక్కున పురుష పరిచారికలుగా ఉన్న చెలులిద్దరూ ముందుకొచ్చి "అయ్యా! ఇతడు నేపాళ దేశపు రాజకుమారుడు ఇది టోపీకాదు. మా దేశపు శిరస్త్రాణం. ఇది తీసి ఎక్కడకు వెళ్లజాలం! మాకు అది అపచారం. ఇది ఇలా ఉండాల్సిందే!" అన్నారు.

ఆ వీరుడు ఆమె పాణిగ్రహణం చేసేసరికి, పైకి పురుషవేషం ధరించినా – స్త్రీ సహజమైన వివశత్వం, ఏదో తెలియని హాయి ఆమె దేహాన్ని కమ్ముకుంది. ఆ పురుషునివైపే ఆరాధనగా చూస్తోంది లవంగి. అదేమీ పట్టించుకోని పండితరాయలు ఆమె చెయ్యి వదలకుండానే "మీ దేశాచారాలతో మాకేం సంబంధం? అవి ఇక్కడ పనికిరావు. గర్భగుడిలోకి ప్రవేశించాలంటే ఈ తలపాగాలేకాదు. ఇలాటి అంగరఖాలు కూడా మేం అనుమతించం! ఇతరుల్ని చూడటం లేదా మీరు? ఇష్టమైతే, లోపలికెళ్లాలనుకుంటే, పై వస్త్రాలు – తలపాగా తీసి వెళ్లండి. లేదా ఇక్కడే నిలబడి ఓ నమస్కారం పెట్టి దయచేయండి" అన్నాడు.

అప్పుడు లవంగి చెయ్యి విదిలించుకుని, కొద్దిగా వెనక్కెళ్లి సూటిగా అతడి కళ్లలో కళ్లు పెట్టి చూస్తూ "అయ్యా! నా వేషం తురక వేషంలా ఉందన్నారు. మరి మీరు నిండు అంగరఖాతో నిల్చి ఉన్నారే!" అంది.

"నేను ఈ ఆలయం కాచే భటుడ్ని. బ్రాహ్మణకుమారుడ్ని. అదీగాక. ఈ వేషంతో నేను లోపలికి వెళ్లను. దేవుని దర్శనమో – అభిషేకమో నేను ఆచరించబోవుట లేదుకదా!" అన్నాడు పండితరాయలు.

అప్పుడు లవంగి తన పాండిత్యం ప్రదర్శించదలచి, సంస్కృతంలో "అహో! భవదీయ విప్రత్వం, శాస్త్రాభ్యాసం వా వేదపఠనం వాచత యజ్ఞకరణం వా విశిష్యతే కిం తేభ్యోత విప్రాణాం సేవకావృత్తిః" (మీ బ్రాహ్మణత్వ మెంత మెచ్చుకోవచ్చునో? ఇదేమన్నా శాస్త్రాలు చదవడమా? వేదం వల్లించడమా? యజ్ఞాలు చెయ్యడమా? వాటికంటే ఇక్కడి బ్రాహ్మలకు సేవకా వృత్తే బాగున్నట్లుంది) అని ఆక్షేపించింది.

పండితరాయులు కూడ అందుకు దీటుగా సంస్కృతంలోనే సమాధానమిచ్చాడు. "శాస్త్రేషు వా నే దేషువా పరిచ యోస్తి కిం భవతో

యస్మిన్ కస్మిన్మాం పృచ్ఛం నా హం సేవకః। వీరోహం యవనపుత్రికా ప్రవేశభయా దేవతాలయ ద్వారం రక్షామి॥" (మీకు శాస్త్రాల్లోగాని - వేదమంత్రాల్లోగాని ప్రవేశం ఉంటే మీ ఇష్టం వచ్చిన దాంట్లో తడగండి. నేను సేవకావృత్తి చెయ్యడం లేదు. స్వచ్ఛందంగానే ఈ ఆలయాన్ని ఒక యవనపుత్రిక బలాత్కారంగా ప్రవేశించకుండా అడ్డుకుందామని ఉన్నానిక్కడ. జీతభత్యాలు తీసుకొని ఈ వృత్తి నిర్వహించడంలేదు - కనుక మీ మాటలు నాకు వర్తించవు,

అప్పుడు లవంగి ఇంకొక కోణంలోంచి అతడ్ని వాదనతో ఎదుర్కోవాలని చూసింది. "దయా హృదయులంటారే - అట్టి బ్రాహ్మణులకి ఇంత రోషం తగునా?" అని అడిగింది. "పరశురాముడెవరు? బ్రాహ్మణుడే కదా! అతడు వీరుడైనప్పుడు, నేనూ అదే దారిన నడుస్తున్నానని మీరు గ్రహించాలి" అన్నాడు.

ఇలా ఇద్దరికీ మధ్య సంస్కృతంలో చాలాసేపు పురాణాలు, శాస్త్రాలలో గొప్పప్రసంగం జరిగింది. ప్రతిసారీ పండితరాయలదే పై చేయిగా ఉంటోంది. అప్పుడావీరుడు "అయ్యా! ఇది పర్వదినం. యాత్రాపరులు ఎంతోమంది వస్తుంటారు. మనవాదం వల్ల అక్కడ చాలామంది నిలబడిపోయారు. ఇది సమయం కాదు. మళ్లీ మనం కలుసుకోగలిగితే, ఈ చర్చ అప్పుడు చేద్దాం! మీతో మాట్లాడుతూంటే ముచ్చటగా ఉంది. మీ ముద్దు మోము చాలా మనోహరంగా ఉంది" అని పొగిడాడు. దాంతో లవంగికి అప్పుడే కొంత సందేహం మొదలైంది. వెంటనే ప్రసంగం విరమించుకుంది.

చేతులు జోడించి విశ్వేశ్వరుని స్తుతించింది - సంస్కృతంలో ఆ స్తోత్రాలలో 'పతితా' వంటి స్త్రీ విశేషణార్థకం స్ఫురించగానే, నిశితపరిశీలనలో నిపుణుడైన పండితరాయలు "అదేమిటి? నీవు పురుషుడవై వుండి, స్త్రీవాచక శబ్దాన్ని ప్రయోగిస్తూన్నావు?" అని అడిగేశాడు. కాని- అప్పటికే 'స్తుతి' తన ముఖం నుంచి స్త్రీ పరంగా సాగిపోయిందన్న వైనం ఎలా సమర్థించుకోవాలో అనుకుంటూ "అయ్యా! ఇది స్త్రీచే రచించబడినదని -

నా చేత చదవబడినదని మీరెందుకు భావించకూడదు?'' అని సమయోచితంగా మాట్లాడి, ఇక అక్కడ అట్టే సేపు ఉండటం క్షేమం కాదని, వడివడిగా అక్కడ్నుంచి వచ్చినదారినే వెళ్లిపోయింది – తన సుఖురాంద్రువెంటరాగా.

తన అంతఃపురానికొచ్చి, ఆహార పానీయాలు పుచ్చుకున్నాక, తన చెలికత్తెల్ని కూర్చోబెట్టుకుని ముచ్చట్లు మొదలెట్టిన లవంగి "కుందతిలకా! ఈ రోజున మీ ఇద్దరి సహాయం – దయ లేకపోతే, నాకు విశ్వేశ్వర దర్శనం దుర్లభమయ్యేది" అని ప్రశంసించింది. అందుకు సమాధానంగా "అది అంత చెప్పుకోదగినదికాదు. నీచేత విశ్వేశ్వరునికి అభిషేకం చేయించలేకపోయాము కదా అని విచారిస్తున్నాం! ఆ గర్భగుడి ద్వారాన్ని కావలికాస్తున్న ఆ బ్రాహ్మణ వీరుడు అసాధ్యుడిలా ఉన్నాడు. ఏం చేయగలం?" అంది కుందతిలక "అసాధ్యుడని మెల్లగా అంటావేమిటి? అతడు నా చెయ్యి పట్టుకున్నప్పుడు నేనైతే వణికిపోయాను సుమా! మనం ఆడవాళ్లమని అతనికి అనుమానం తగలినట్టుంది" లవంగి ఉదయం సంఘటనలు గుర్తు తెచ్చుకుని అంది. "అవునవును! నీ ముద్దుమోము చాలా మనోహరంగా ఉంది అని కదా అతడన్నాడు. అది లింగభేదం లేక ఎవరికైనా వర్తిస్తుంది. కాని అతడు ఆ సందర్భంలో అది ప్రయోగించాడంటే – పసిగట్టాడన్నమాటే!" అని తన యజమానురాలిని బలపరిచింది.

"అదీగాక, నేను మర్చిపోయి స్తుతి శ్లోకాలల్లోవాడిన 'పతితా' అనే విశ్లేషణాన్ని ఇట్టే పట్టేశాడు చూశావా!" అంది లవంగి.

"నవ్వుముఖం, మనోహర రూపం ఉన్న ఆ విప్రవీరునితో ప్రసంగించినపుడు విద్యలలో ఏపాటి వాడు అనుకుంటున్నావు?" అని ప్రశ్నించింది సంగీత చంద్రిక అనే ఇంకొక సఖి.

"విద్యల్లో బృహస్పతితో పోల్చదగ్గవాడే సుమా! అంతేనా యువతులకు అతడు మన్మథుడే అని చెప్పవచ్చు!" అంది లవంగి.

"అతడు విశ్వేశ్వరుని సాక్షిగా నీ పాణిగ్రహణం చేశాడు.... అంటే – ఏది జరగాలో అదే జరిగింది" అంటూ ఆట పట్టించిందో సఖి..

"పరిహాసమా?" చిరుకోపం ప్రదర్శించింది లవంగి.

లవంగి కథ

"కాదే సఖీ! నీ మనసులో కోరిక మా దగ్గర కూడా దాచాలా ఏమిటి? నీ కోరిక ఏమిటో మాకు చెప్తే మేం అది నెరవేర్చలేకపోతామా? మా దగ్గర కూడా ముఖమాటమేనా?"

"లేదే చెలీ! అతడ్ని చూసిన దగ్గర్నుంచీ నా మనసు ఏమేమో అయిపోతోంది. ఒక్కసారికే ఆ అపరిచితుడ్ని నా మనసులో ప్రతిష్ఠించిన ఆ మన్మథుడ్ని అనాలి. ఏదో తెలీని తీయని బాధ..." లవంగి పారవశ్యం అది

"ఇక ఇప్పట్నుంచీ అలాగే ఉంటుందిలే! ఇకపై అతడ్ని గురించి వివరాలు తెలుసుకుందాం! ఇప్పటికే చాలా పొద్దు పోయింది" అన్నారు చెలులు.

కాశీపట్నంలో - పండితరాయలమీద గల అవ్యాజమైన అనురాగం కొద్దీ, మసీదులోని పకీర్లు, యవనసేన విడిసిన శిబిరాలకు వెళ్లి అక్కడి విశేషాలు ఏరోజు సాయంత్రాని కారోజే అక్కడి విశేషాలు తెలుసుకొని అతడికి చెప్తున్నారు. శివరాత్రి నాటి సాయంకాలం లవంగి, గుడికి రాదనీ - రెండు మూడు రోజుల్లో రాజధాని నుంచి వచ్చే సేనలు పట్నాన్ని ముట్టడిస్తాయనీ వాళ్లకు అందిన సమాచారం. యుద్ధాన్ని ఎదుర్కోవడానికి సన్నాహాలు చేసుకుంటూనే దొరికిన స్వల్ప విరామ సమయంలో అతడిలా అనుకోసాగాడు.

'లవంగి రాకుండా అడ్డుకున్నాననుకున్నాను. అయినా ఆమె రావడం - తన పని తాను చేసుకుపోవడం జరిగిపోయాయి. నేనే మోసపోయాను. నేపాళ రాజకుమారుడినంటూ వచ్చిన ఆ నవయవ్వనుల్లో నాతో వాదించిన దెవ్వరో ఇప్పుడు ఆలోచిస్తే అర్థం అవుతోంది. ఆ చెయ్యి అంత కోమలంగా ఉన్నప్పుడే అనుకున్నాను. చూపుల్నిబట్టికానీ - కాటుక కళ్ల ఆనవాళ్లని బట్టికానీ అసలు గుర్తించనేనే లేకపోయాను. అయితే కావచ్చుగాక! ఆమె స్తుతిశ్లోకాలు అద్భుతంగా గానం చేసింది. హిందూమతాభిమాని గనుక, గుడిలో ప్రవేశించినా తప్పులేదు. స్వామి వారికి అభిషేకం చేసినా తప్పులేదు. ఆమెను తల్చుకుంటూంటే, నా హృదయం ఎందుకో పులకరిస్తోంది. ఎందుకోగాని ఆమె చూపుల్లో నాపట్ల అనురాగం ఉట్టిపడుతూన్నట్లు తోస్తోంది'....

అంతలోనే– అతడికి కర్తవ్యం గుర్తుకొచ్చింది. రాజుగారికి పత్రంరాసి, మరికొంత సైన్యాన్ని రప్పించి కీలకస్థానాలలో ఉంచి, తాను అన్ని చోటలా పర్యవేక్షిస్తూ పట్టణాన్ని కాపాడసాగాడు.

మరునాడు – మారువేషంతో వెళ్లివచ్చిన కుందతిలక, పండితరాయల యావత్ వృత్తాంతం అతని జన్మ మొదలు గత దినమున అతడు చేసిన సన్నాహాలతో సహా వివరించింది. అది వినేసరికి లవంగికి ఆనందంతోపాటు, రాబోయే యుద్ధం తలంపులోకి వచ్చి విషాదం కూడా కలిగింది. వెంటనే వజీరు నుంచి వచ్చిన కబురు తెల్సుకు రమ్మని పంపింది.

కుందతిలక తెచ్చిన సమాచారం విని, రానున్న రెండ్రోజులలో వజీరే స్వయంగా మరికొంత సైన్యంతో హుసేనాబాద్ వస్తున్నాడనీ– ఆ మర్నాడే కాశీపట్నం మీదికి యుద్ధానికి వెళ్తారని తెలిసిన లవంగి, పండితరాయలకు ఏ ఆపదా రాకూడదని దైవాన్ని ప్రార్థించింది.

వజీరురావడం – హుసేనాబాద్‌లో దిగడం జరిగాయి. కాశీపురం మసీదులోని పెద్దలు ఆయనను చూడడానికి వెళ్లగా "ఇక్కడి హిందువులింత ఆషామాషీగా తీసుకున్నారా పాదుషా వారి శాసనాన్ని? వీళ్లు ఎవర్ని చూసుకుని ఇంత మిడిసిపడుతున్నారు?" అని అడిగాడు.

అప్పుడా మసీదు పెద్దలు "మీరంటే కాశీరాజుకు భయం లేకపోలేదు. కాని, దేశానికంతటికీ అది సంస్కృతి చిహ్నం. విశ్వేశ్వర లింగం వారికి ప్రాణం. కాశీరాజు అంగీకారంతో నిమిత్తం లేకుండానే హిందువులంతా ఏకమయ్యారు. సైన్యం పట్నాన్ని రక్షించ బూనుకున్నది. దీనికి ఒకరి ప్రేరణతో నిమిత్తమేమున్నది. ఆ బాల స్త్రీ వృద్ధులంతా యుద్ధ సన్నద్ధులవుతున్నారంటే – అది వారికి పుట్టిన బుద్ధేనని మా ఊహ" అని తామెంతో అభిమానించే పండితరాయల పేరు బైటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు.

వజీరు "అలాగా! అదీ చూద్దాం!" అన్నాడు మీసాలు దువ్వుతూ. మసీదుకు రాగానే, పండిత రాయలకు కబురంపారు. అతడు రాగానే ఎంతో ఆత్మీయంగా "అప్పా! పాదుషా తరఫున ఎవర్నో పంపకుండా వజీరే స్వయంగా వచ్చాడు. సైన్యం కూడా చాలా ఉంది. ఎల్లుండి దాడి చేద్దామనుకుంటున్నారు. రేపు పొద్దున్న లవంగిని ఢిల్లీ పంపేస్తున్నారట!

ఆమె వెళ్లడానికి ఇష్టపడటం లేదట కానీ, స్త్రీలు ఇటువంటి పోరాట సమయాన ఇటువంటి చోట ఉండడం క్షేమం కాదని, ఏదోలా ప్రయాణానికి ఒప్పించారట! కొద్దిపాటి సైన్యంతో ఆమె పల్లకీ మీద ఢిల్లీ వెళ్తుందట!" అక్కడ తాము సేకరించిన సమాచారమంతా తెలియజేశారు.

పండితరాయలు మరునాడు కొద్దిమంది రాజభటుల్ని సహాయంగా తీసుకుని, లవంగి ఏ మార్గం గుండా వెళ్తుందో ఆరా తీసి, ఒకచోట కాచుకొని ఉన్నాడు. లవంగి ఎక్కివస్తూన్న పల్లకీ బోయీల 'హైహై' ధ్వనులు వినగానే బెబ్బులిలా ఆ సైన్యం మీదకు ఉరికి, వారిని చెల్లాచెదురు చేసి, చెలికత్తెలతో సహా ఆ పల్లకీని దారి మళ్లించి కాశీపురానికి తీసుకుపోయాడు. అయితే - వారిని చెర పట్టడం అతడి ఉద్దేశం కానందువల్ల, అంతకు ముందే వారికోసం సకల సదుపాయాలతోనూ ఏర్పాటుచేసిన అంతఃపురంలోనికి వారిని రాజోచిత గౌరవ మర్యాదలతో ప్రవేశపెట్టాడు. తన ఆజ్ఞలేకుండా ఎవర్నీ అక్కడ అడుగు పెట్టనీయకుండా ఎంతో రహస్యంగా వారిని కాపాడసాగాడు. అదంతా, పండిత రాయలపనేనని తెలిశాక, లవంగి అది తమకు అతడిచ్చిన ఆతిథ్యంలాగానే భావించుకుంది. కాని - తన తండ్రి వల్ల అతనికేం ముప్పు వాటిల్లుతుందో అని భయపడటం ప్రారంభించింది.

మహావీరుడైన పండితరాయలు తానే ముందుగా వీరశంఖం పూరించాడు. హిందూసేనలు మహోత్సాహంగా కదనుత్రొక్కుతూన్నాయి. తమక్కూడా ఆజ్ఞ ఇమ్మని యవనసైనికులు వజీరుకు చెప్పగా అతడు రణభేరి మోగించవలసిందిగా ఆజ్ఞ జారీ చేసేటంతలో, అతనికి లవంగిని శత్రువులు అపహరించారన్న వార్త తెలిసింది. సైనికుల ఉత్సాహమంతా నీరు కారిపోగా, వజీరుకు ఏకంగా మతిపోయినంత పనైంది" ఇప్పుడేది దారి? పాదుషాగారికి వర్తమానమైనా అందించకుండా, స్వంతంగా తన నిర్ణయం మేరకే లవంగిని ఢిల్లీ పంపడం తాను చేసిన పెద్ద తప్పిదం, అనుకుంటూ చింతించసాగాడు. ఏంచేసి అయినా సరే రాజపుత్రికను తిరిగి ఆయన కళ్లజూపకపోతే, తనకు శిరచ్ఛేదం ఖాయం అని కూడ అతనికి తెలుసు! దాంతో అతడు యుద్ధానికి స్వస్తి చెప్పి శత్రువులను సామోపాయంతో లొంగదీసుకోవడం ద్వారా రాజపుత్రికకు ఆపద రాకుండా జాగ్రత్తపడవచ్చునని ఆలోచించాడు

రహస్యంగా కాశీపట్నంలోకి తన వేగుల వార్ని ప్రవేశపెట్టి– మొదట ఆమె జాడ తెలుసుకొని రమ్మన్నాడు. ఆమెను వాళ్లేస్థావరంలో దాచిందీ కనుగొన్నవారికి గొప్ప నజరానా లుంటాయని కూడా ప్రకటించాడు.

ఇక్కడ – పండితరాయల గూఢచారులు హుసేనాబాద్ వర్తమానం ఎప్పటికప్పుడు చేరవేస్తూ "కీలక ప్రాంతాలు మాత్రం రక్షణలో ఉంచండి! యవనులు తాత్కాలికంగా యుద్ధం ఆపుజేశారు" అని తెలియజేశారు. ఇది 'లవంగిని తాము అధీనంలోకి తెచ్చుకున్నందువల్ల ఏర్పడిన పరణామం' అని తెలిసిన పండితవీరుడు నవ్వుకున్నాడు.

మరునాడు తాను, స్త్రీ వేషంలో పండితరాయలు పంపాడనిచెప్పి ద్వారపాలకుల్ని పరిచయం చేసుకుని, లవంగి సుముఖానికి వెళ్లాడు. ఆమె పురుషవేషంలో కంటె స్త్రీ సహజరూపంలో ముట్టుకుంటే పాలుగారేంత అందంగా ఉంది. పండితుని చెల్లెలు మల్లికనని పరిచయం చేసుకుని "యవనకులాంగనవు. నీకీ హైందవ మెందుకు నచ్చింది? ఈ విశ్వనాథారాధన నిమిత్తం వచ్చావేం?" అని అడగ్గా, లవంగి తన వృత్తాంతం సంక్షిప్తంగా వినిపించింది.

సరిగ్గా ఇక్కడ పండిత భట్టుకు ఏడుగురు పుత్రులు పుట్టి పోయినట్లే, – అక్కడ పాదుషా వారికీ ఏడు సంతానాలు నష్టం జరగ్గా, ఎనిమిదో గర్భం నిలవడానికి ఒక బ్రాహ్మణుని మంత్రాక్షతలు కారణమయ్యాయట! ఎలాగైనా సంతానం దక్కితే చాలుననుకున్న పాదుషా హైందవ ధర్మాన్ని మన్నించి, బ్రాహ్మణ విద్యలూ – పూజలూ – మంత్రాలూ – శాస్త్రాలూ – పురాణాలూ చెప్పించాడట! ఇలా వివరంగా తన గాథంతా చెప్పి "ఇటీవల కాశీ ఖండం చదివి, ఆ విశ్వేశ్వరుని మహిమ తెలిసి ఈ ప్రయాణం నేనే కల్పించుకున్నాను" అని లవంగి చెప్పింది.

"ఈ కథ అచ్చంగా మా అన్న కథలాగే ఉందని" మల్లిక వేషధారియైన పండితవీరుడు పలికి ఇద్దరికీ పూర్వజన్మబంధం ఉందేమో అంది. మాటల సందర్భంలో అతడు లవంగిని ఇష్టపడుతున్నాడనీ చెవిన వేసింది. కాని, ఆ వేషంలో వచ్చింది పండిత వీరుడేనని గ్రహించేసిన లవంగి, తన మనసుని విప్పిచెప్పడానికి సంకోచించలేదు. "ఇవి చెరపట్టడంతో భయపడి చెప్తున్న

మాటలుగా భావించవద్దు! స్నేహపూర్వకంగా ఈ ఆపద ఏదోలా గట్టెక్కితే, మా తండ్రిగారితో చెప్పి ఆస్థాన పండితునిగా గౌరవించగలమని మీఅన్నగారికి చెప్పు!" అంటూ తమ మతాచారం ప్రకారం చెక్కిళ్లు ముద్దు పెట్టుకుంది లవంగి. ఆమె వెళ్లిపోయాక "అయ్యో! అతడే అని తెలిసికూడా, నా మనస్సును సరిగ్గా విప్పి చెప్పలేకపోయా" అని దిగులుపడుతూంటే "మరేం విచారించకు! ఇకపైన అన్నికార్యాలనూ ఆ మదనుడే అదనుచూసి చక్కబెడతాడు" అని పరిహాసమాడేరు చెలులు.

ఆ మార్నాడు ఫకీరులు, యవనసేనా విశేషాలు తెల్సుకొని వచ్చి "అప్పా! నీ శౌర్యం నిజంగా మెచ్చుకోవాలి. రాజపుత్రికనే ఏమార్చి తెచ్చావట! వజీరు ఇప్పుడెంత వగచుచున్నాడనుకొన్నావు? అసలు సంగతి – ఆ పాదుషాగారికి తెలియదట! లవంగిని పంపే విషయంలో నిర్ణయం వజీరు చేసిన చర్య! రాజపుత్రిక కనిపించకపోతే, అతనికి శిరచ్ఛేదమే! ఇటువంటి తరుణంలో అతడు మన నిబంధనలకు సమ్మతిస్తాడేమో! సంధికి దారి సుగమంగా ఉంది. నువ్వు మాకు పరిచితుడవని అతడికి తెలీదు. మేం అడిగి చూడమా?" అన్నారు.

అప్పుడు పండిత వీరుడు "సాములారా! మీరు పలుమార్లు చెప్తున్నప్పుడు వినకపోవడం కృతఘ్నత అనిపించుకుంటుంది. నాకు పాదుషా గురించి అసలు భయమేలేదు. మీ మాట ప్రకారం చేస్తాను. హిందూ దైవాల్ని నిందించక – కాశీపురంమీద ఎన్నడూ దండెత్తక మాటకు కట్టుబడి ఉంటానని ప్రమాణ పూర్వకంగా పత్రిక రాసి ఇస్తే, ఈ తప్పు మన్నించమని కోరుకుంటే, లవంగిని అలాగే సగౌరవంగా పంపేస్తామని నా మాటగా చెప్పండి! అలా జరగకపోతే – ఆపైన ఏం జరుగుతుందన్నది ఇంకా తేల్చలేదనీ తెలుపగలరు" అన్నాడు వీర వినయాలు కలబోసి.

అప్పుడు కాశీపుర మసీదు ఫకీరులు, వజీరు దగ్గరకెళ్లి పండితరాయల ఆచూకీగాని ప్రస్తావన అయినాగాని కించిత్తయినా చెప్పక "అయ్యా! మేమా హిందువుల దగ్గర కెళ్లి మంచి మాటలు చెప్పి సంధికి ఒడబడి ఉండవలసిందిగా కోరాం! అక్కడొకరా? ఇద్దరా? అందరూ

అధిపతులే! అందరికీ అధికారం ఉంది. అందర్నీ బ్రతిమాలుకోగా, లవంగిని వదలడానికి మీరీ రీతిగా ప్రమాణ పత్రం రాయవలసిఉంటుంది" అని చెప్పగా, "అదే చాలు! లవంగిని క్షేమంగా కళ్లచూడాలి" అనుకుంటూ వారు చెప్పిన రీతిగా పత్రం రాసిచ్చాడు వజీరు.

ఫకీరులు ఆ పత్రిక తీసుకెళ్లి, పౌరులందర్నీ పిలిచి సభచేసి, వజీరు ప్రమాణపూర్వకంగా రాసిచ్చిన పత్రిక చదివారు. తమకు అంతకన్న కావలసిందేమీలేదని, కాశీపట్టణ రక్షణమే తమకర్తవ్యమని మరొక్క పర్యాయం నిండుసభలో ప్రకటించి, పండితవీరుడు లవంగిని పల్లకీలో ఎక్కించి మేళతాళాలతో సగౌరవంగా హుసేనా బాద్ కోటకు పంపివేశాడు.

ఆమె రాకనుచూసి "హమ్మ! బ్రతికాను దైవమా! ఇకచాలు" అనుకుంటూ ఢిల్లీ తిరుగు ప్రయాణానికి సేనల్ని సన్నద్ధం చేస్తూండగా పాదుషా దగ్గర్నుంచి పిడుగులాంటి లేఖ ఒకటి వచ్చింది.

అందులో "నువ్వు మా ఆజ్ఞలేకుండా మా ప్రాణసమానురాలైన లవంగిని పంపించబోవడం మొదటి తప్పు. పంపేవాడివి తగినంత సైన్యంతో పంపకపోవడం రెండో తప్పు, హిందువులు ఆమెను తీసుకుపోయాక ఏం జరిగిందీ మాకు తెలుపక పోవడం మూడో తప్పు. ఈ మూడు తప్పులకూ నిన్ను ఉద్యోగంలోంచి తొలిగిస్తున్నట్లు ఈ తప్పులకు నీ సంజాయిషీ తెలిశాక, అందుకు అనుగుణమైన శిక్ష విధించనున్నట్లు పాదుషాగారి ఆజ్ఞ" అని ఉంది.

'మేము ఏ కోరిక తీర్చడానికి ఇంత సన్నాహం చేశామో అట్టి మా ప్రియపుత్రికనే చెరపడతారా? సమస్త సైన్యంతో మేమే అక్కడికొచ్చి, ఆ కాశీపురాన్ని నీటిలో కలిపేదాకా నిద్రపోం' అని కూడా ఉంది అందులో".....

మణిసిద్ధుడు అంతవరకు కథ చెప్పి తదుపరి కథ పై మజిలీయందు ఈ విధంగా చెప్పసాగాడు.

కాశీ మజిలీ కథలు

33 వ మజిలీ

గోపా! విను!....

ఆ ఉత్తరం చూడటంతోనే, వజీరుకు ముచ్చెమటలూ పట్టాయి. మంత్రి దుఃఖిస్తూ, ఆ లేఖను అలాగే రాజపుత్రికకు పంపి, తనకు ఉపకారం చెయ్యవలసిందిగా వేడుకున్నాడు. అది చదివిన లవంగి, మంత్రి మీద జాలిపడి, తన వల్ల జరిగేటంత ఉపకారం జరగ్గలదని అతడ్ని ఊరడించింది. ఆ మర్నాటి ఉదయానికే పాదుషాగారి సేనావాహిని హుసేనాబాద్ కోటకు ప్రభు సహితంగా చేరుకుంది.

వజీరు ఒక పక్క గడగడ వణుకుతూనే, ప్రభువుకు ఎదురేగి స్వాగతించి, లవంగి ప్రస్తుతం తమ దగ్గరే క్షేమంగా ఉందని విన్నవించుకున్నాడు. దాంతో కొంత వరకు అలుక అణచుకొని, గుండెలు చిక్కబట్టుకుని పుత్రికతో మాట్లాడాలని కబురు చేశాడు. వారి ఆచారం ప్రకారం తెరచాటునుంచే తండ్రితో ఆ బాల మాట్లాడి, అతని ఆరాటాన్ని కొంత వరకు పోగొట్టగలిగింది. కాని - తన సంభాషణలో ఎక్కడా పండితరాయల ప్రసక్తి ఎత్తకుండా జాగ్రత్త పడింది. అలాగే తాను ఆ వీరునివల్ల చెరపట్టబడినట్లుగానో - లేక అతడు తనకు అపూర్వాతిథ్యం ఇచ్చినట్లుగానో మాట మాత్రంగానైనా చెప్పలేదామె. పాదుషా కూతుర్ని పలకరించాక, కొంత నిమ్మళంగా ఉన్నప్పటికీ, యుద్ధం విషయంలో మాత్రం తన పట్టుదల ఉపసంహరించుకోలేదు తెల్లవారేసరికి యుద్ధం ప్రారంభించాలంటూ ఆజ్ఞ ఇచ్చేశాడు.

మసీదు ఫకీరుల వల్ల ముందుగానే విషయం తెలుసుకున్న పండితరాయలు తన బలమైన వ్యూహంతో చక్రవర్తి సేనల్ని హుసేనాబాద్

వరకు తరిమికొట్టాడు. తనసైన్యంతో తిరిగి కాశీపట్నం చేరుకున్నాడా సాయంకాలానికే!

పాదుషా తన సేనాధిపతుల చేతగాని తనానికి నొచ్చుకున్నాడు. మర్నాటి యుద్ధంలో కొత్త సైన్యాన్ని వినియోగించ వలసిందిగా చెప్పి, ఆ పూటకి అవిశ్రాంతంగా – అసహనంగా ఉండిపోయాడు.

కొత్తగా సేనాధిపత్యం వహించిన అరబ్బులు ఆ రెండోరోజు తమ సైన్యాన్ని రెండు భాగాలుగా చేసుకుని కాశీ పట్టణాన్ని ఉత్తర – దక్షిణ దిక్కులు రెండు వైపుల్నుంచీ ఒకేసారిగా ముట్టడించాడు. అది గ్రహిస్తూనే పండితరాయలు తన సైన్యాన్ని మొత్తం ఉత్తరం వైపున మోహరించి, అక్కడ్నించి తానొక్కడే దక్షిణం వైపు వెళ్లి, ఆసేనలతో చిత్రయుద్ధం చేసి, వారి బలగాన్ని పీనుగుల పెంటల్లా మార్చిపారేశాడు.

తురక సైన్యాన్ని నిలువరించడంలో ఉత్తర దిశన సరైన నాయకత్వం లేకపోయే సరికి, ఆ దిశగా కొన్ని వందల అడుగులమేర యవనసైన్యం ముందంజ వేసింది. పట్నానికి చేరువగా అట్నుంచి చొచ్చుకు వస్తున్నారన్న విషయం తెలిశాక, పండితరాయలు తన సేనలకు ఉత్సాహం కలిగించడానికి, తానొకసారి అక్కడ హాజరు వేయించుకుని, అందర్నీ తిరిగి పోరాటానికి సన్నద్ధులుగా చేశాడు. అంతలోనే తిరిగి దక్షిణం వైపునకు ప్రత్యక్షమై ఎటుచూసినా తానే అయి ప్రళయకాల రుద్రతాండవమా అన్నట్లుగా యవనసేనలను తిరిగి తరిమేశాడు.

ఆ రోజు రాత్రి తురక మూకలన్నీ ఒకచోట సమావేశమై "ఆ వీరుడు గుర్రం ఎక్కి యుద్ధం చేస్తున్నంతకాలం విజయం మనకు దక్కదు. అతడ్ని గుర్రం మీంచి దించగలగాలి. ఆ పని 'రోహిల్లా' తెగవారికి సాధ్యం. వారిదొక చిత్రమైన విద్య. వాళ్లు ఉచ్చుతాళ్లు పన్ని (వల) యుద్ధం చేస్తారు. అవి రణభూమిలో అక్కడక్కడ ఏర్పాటు చేస్తారు వాటిలో తగులుకొన్న గుర్రాలకాళ్లు ఎంత ప్రయత్నించినా, అవి ఆ ఉచ్చునుంచి తప్పించుకోలేవు. ఈ లోగా గుర్రం మీద ఎంతటి బలశాలి గల అశ్వికుడైనా శత్రువుల బారి నుంచి తప్పించుకోలేడు. కనుక ఆ పద్ధతిని అవలంబించాలి" అని

నిశ్చయించుకున్నారు. రోహిల్లా తెగవారు రాత్రికి రాత్రే ఉచ్చుతాళ్లు కట్టి, వాటిని భూమిలో పాతిన శంకులకు చుట్టి తమ వ్యూహాన్ని సిద్ధపరిచారు. అయితే, ఆ రోజు యవన ఫకీరులకు ఆ సమాచారం తెలియలేదు. తురకసేనల లక్ష్యం ఒక్కసారిగా కాశీనగరపు నట్టనడిభాగం మీద దాడి చేయడం. అది మాత్రమే గ్రహించిన పండితవీరుడు, వారిని నిలువరించే ప్రయత్నంలో చెలరేగి పోయినప్పటికీ, ఒకచోట మాత్రం అతని గుర్రం పాదానికి త్రాళ్లు తగులుకున్నాయి. ఆ ఉచ్చులోంచి అది తప్పుకోలేక, గాల్లోకి ముందు రెండు కాళ్లు ఎత్తి భీకరంగా సకిలించి వెనుక కాళ్లమీద నిల్చి ఎగ్గరాలని ప్రయత్నించి విసురుగా పక్కకి పడిపోయింది. పదిబారల దూరానికి విసిరేయబడి పండిత వీరుడు నేల మీద పడ్డాడు. అంతలోనే నిలదొక్కుకుని ఛర్రున కత్తిదూసి తనను చుట్టు ముట్టిన యవన సేనల్ని ఒంటి చేత్తో ఎదుర్కొన్నాడు.

కాని, అప్పటికే సమయం మించిపోయింది. ఒక పెనుగుంపువలె యవన సైనికులు అతని మీద పడి, చేతిలోని ఆయుధాలు లాక్కున్నారు. గొలుసులతో బంధించగా, వాటిని సైతం నుజ్జు చేయడానికి ప్రయత్నిస్తూ వీరాలాపాలు చేస్తూన్న పండిత వీరుని హుసేనాబాద్ కోటకు తీసుకుపోయారు. నాయకుడు లేని హిందూ సేనావాహిని కకావికలు కావడంతో, కాశీ పట్నాన్ని తురక మూకలు బలిమిన ఆక్రమించుకున్నాయి. విషయం గ్రహించిన హైందవ ధర్మవీరులు దేవాలయాలను మూసివేశారు. ధనం దాచుకున్నవారూ ఇళ్లకు తాళాలు పెట్టి వెళ్లిపోయినవారూ, గంగానదీ స్నానఫలం దక్కించుకుని, గంగకు అడ్డంగా ఈది ఆవలి ఒడ్డుకు చేరుకున్నారు. పండిత భట్టు తన పుత్రుడు శత్రువులకు పట్టుబడ్డాడని తెలిసి ఎటు వెళ్లడానికీ మనసొప్పక అక్కడక్కడే తిరుగుతూ, తన కొడుకును శత్రువులు ఎటు తీసుకుపోయారో తెలుసుకోడానికి ప్రయత్నించసాగాడు. ఆ రోజుకు చీకటి పడడంతో నగరంలోని విలువైన ఆస్తులను దోపిడీ చేయడానికి నిర్ణయించుకుని, శిబిరాలకు మరలిపోయారు యవన సైనికులు.

లవంగికి యుద్ధవార్తలన్నీ ఎప్పటి కప్పుడు తెలుస్తున్నాయి. పండితవీరుడు బందీ గృహంలో పెట్టబడ్డాడని తెలిసి ఎంతో పరితపించింది.

తాము కొద్ది రోజులక్రిందట అతడికి చేజిక్కినపుడు, తమను అతడెంత గౌరవాదరాలతో చూసినదీ గుర్తుకు తెచ్చుకుంది. తాను అతనంత స్వతంత్రురాలు కాకపోయినా, తనకు చేతనైనంతలో అందుకు ప్రత్యుపకారం చేయాలనుకుంది. కారాగృహం ఎక్కడుందో తెలుసుకుని, అవకాశం ఉంటే అతడ్ని అక్కడ్నుంచి దాటించాలి అని కూడా ఆలోచించింది. కుందలతికలతో చెప్పి, అతడి నెక్కడ దాచారో తెలుసుకు రమ్మంది. అదృష్టవశాత్తు వారి మేడ కిందగదిలోనే ఆ వీరుడ్ని దాచిన వైనం కనుగొంది కుందతిలక. గదికి తాళం మాత్రం వేశారని. ఎక్కడో సింహద్వారం దగ్గర మాత్రమే భటులున్నారని, తాళం విడగొట్టి తీసుకురావడానికి లవంగి అనుమతిస్తే, చిటికెలో తాను ఆ పని చేసుకొస్తానని అంది కుందలతిలక.

ఈ వార్తవిని, లవంగి హృదయం ఇంకా పరితపించిపోయింది. "అయ్యో! ఆ పుణ్యాత్ముడెంత బాధ అనుభవస్తున్నాడో - ఆ చీకటి గదిలో" అని ఆ ఇద్దరు చెలికత్తెల్ని పంపింది. ఉపచారాలు - సపర్యలకు తగిన ఏర్పాట్లు చేసింది.

వాళ్లిద్దరూ తగిన సాధనాలతో వెళ్లి, అతడ్ని ఆ చీకటి కొట్టునుంచి బంధవిముక్తుని చేసి, తాము లవంగి చెలికత్తెలమని, ఆమె తన అంతఃపురానికి అతడ్ని తీసుకురమ్మని చెప్పిందని వినయంగా పలికి అతడ్ని లవంగి సముఖానికి చేర్చారు. తదుపరి ఇద్దరూ ఏకాతంగా మిగిలారు. ఆ తరువాత అతడు అపార మోహా వేశంతో లవంగిని కామ శాస్త్ర కళా ప్రసంగంలో చర్యల రీత్యా ఓడించాడు. ఇద్దరూ మదనకేళిలో తేలి అపూర్వ సుఖ సంభోగంలో ఓలలాడారు.

ఆ కేళిలో అలసి సొలసి లవంగి, ఆ బ్రాహ్మణ యువకుని వక్షంమీద శిరస్సు ఆన్చి సుఖనిద్రా పరవశురాలుకాగా, అతడికి మాత్రం కంటి మీద కునుకురాలేదు. అతని ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.... 'అయ్యో! ఎంతపని చేశాను? తురకపిల్ల శివలింగాన్ని తాకకుండా కట్టడి చేస్తానని శపథం పూని, అందర్నీ అందుకు సమాయత్తపరచి చివరకు వారితో పాదుషాకు శాశ్వతవైరాన్ని కల్పించిన వాడినయ్యాను. వాళ్లని అలా వదిలేసి

నేనూ కులం చెడగొట్టుకున్న వాణ్ణయ్యాను. నన్ను నమ్ముకొని ఎన్ని కష్టాలు పడతున్నారో కదా! నేను ఇక్కడ పెళ్లికొడుకునై సుఖాలనుభవిస్తున్నాను. ద్రోహిని! ఈ మన్మధుని బారి నుంచి మహనీయులే తప్పించుకోలేకపోయారంటే నేనెంత? అసలీ అనురాగం నాపైన అంకురించబట్టేకదా లవంగి నాకీ కోటలోని రహస్యాలన్నీ తేట తెల్లంగా చెప్పింది. ఇదీ ఒకందుకు మంచిదైంది" అనుకుంటూ మెల్లగాలేచి, ఆమె చెప్పిన మత్తుద్రావకాన్ని పట్టుకొని ఇతరు లెరుగని విధంగా పాదుషా మందిరంలో ప్రవేశించి, అతని ముక్కుదగ్గర అది ఉంచి అతడు స్పృహ కోల్పోగా, ఎత్తుకొని రహస్యమార్గాన అతి వేగంగా కాశీ పట్నంలోకి వెళ్లిపోయాడు.

ఉదయం నిద్రలేచిన లవంగికి తన పక్కన వీరుడు కనిపించకపోయే సరికి, ఆశ్చర్యపోయి, అదంతా ఓ కల కాబోలు ననుకొని మళ్లీ నిద్రపోయింది. అంతలో చెలికత్తెలు వచ్చి లేపడంతో అదంతా కల కాదని - నిజంగానే జరిగిందని చెప్పేసరికి వీరుడిని వెతకవలసిందిగా చెప్పిందామె.

చెలికత్తెలు వెలికి వచ్చి "అతడెక్కడా కనబడటంలేదు. రహస్యమార్గం గాని నువ్వు అతనికి తెలియజేశావా ఏం? అది అలా ఉంచు! మన పాదుషా వారు అంతఃపురంలో లేక - కోట బయటకూ వెళ్లక ఎవరికీ కనబడక ఎక్కడున్నారా? అని వజీర్లంతా కంగారు పడుతున్నారట! మన అంతఃపురానికి గాని వచ్చారా!? అంటూ వాళ్లు మనల్ని అడుగుతున్నారు. ఇదేం చిత్రం?" అన్నారు.

అప్పుడు లవంగి "కొంప మునిగింది. శివరాత్రి నాడు నేను వచ్చిన గుప్తమార్గం (సొరంగం) గురించి మాటల మధ్యలో నా ప్రియుడికి వివరించేశాను. నా తండ్రి ఈ కోటలో విడిది చేసిన ప్రదేశం వంటి వివరాలూ నేర్పుగా అతడు నానుంచి రాబట్టాడు. ఇలా మెత్తగా మాట్లాడుతూ, అతడీ కోట రహస్యాలు యావత్తు కనుక్కున్నాడు. అయ్యో! నా తండ్రిని అతడుగాని ఎత్తుకుపోలేదు కద!" అంది ఆతృతపడుతూ.

సఖులిద్దరూ నిట్టూర్చి "అమ్మాయిగారి తెలివి తేటలు ఇంతలోనే ఏ గమ్మత్తులో మునిగిపోయాయో! రహస్యాలు ఎవరైనా వెల్లడించుకుంటారా?

అదల ఉంచు! అతడెంత బలశాలి అయితే మాత్రం రాజుకి మెలకువ రాకుండా ఎత్తుకుపోగలడా?" అంది కుందల తిలక.

"అయ్యయ్యో! నేనూహించినంతా అయింది. ఆ బల్లమీద మత్తువాసన కల్గించే ద్రావకం ఉండాలి కదా! ఇప్పుడు కనిపించడంలేదు గతరాత్రి ప్రసంగమధ్యంలో దాని గురించీ యాధాలాపంగా అడిగాడు నేను అదెలా ఉపయోగ పడుతుందో చెప్పాను" అంది లవంగి తన కంగారు మరింత పెరిగిపోగా. దీనితో పండితరాయలు చక్రవర్తికి మత్తు కల్గించి ఎత్తుకు పోగలిగాడని అందరికీ స్పష్టమైందక్కడ.

ఆ రోజు కాశీపురాన్ని దోచుకోడానికి చక్రవర్తి అనుమతిని వేడుకుందామని, పాదుషావారి దర్శనార్థం సేనలన్నీ హుసేనాబాద్‌కు వచ్చాయి. తీరా చూస్తే జరిగిందిది.

'అతడికి దైవబలం ఉంది. మనవాళ్లు ఏమీ చెయ్యలేరు. ఇదంతా తల్చుకుంటూంటే నాకు నవ్వొస్తోంది. సాయెబులకి మంచి ప్రాయశ్చిత్తమే జరిగింది" అంటూ నవ్వసాగింది లవంగి.

"అమ్మా! నీకు ఇదంతా విలాసంగా ఉంటుంది మరి! ఎంత కఠినాత్మురాలివే తల్లీ! నీకు భర్త మీద అంత మక్కువాయె! తండ్రిని చెరపట్టి తీసుకుపోయాడన్న బాధ లేశమైనా లేకపోయె" అని చెలులు ఆమెను వేళాకోళం పట్టించారు.

కుందల తిలక కర్తవ్యం ఏమిటో ఆలోచించమంది. ఇప్పుడిక పాదుషా గారి తరఫున తాము ఏది ప్రకటిస్తే ఆ ఆజ్ఞనే శిరసావహిస్తారు రాజపురుషులు తనకేమీ తోచడం లేదన్నది లవంగి.

అప్పుడా చెలులిద్దరూ "అమ్మా! కాశీపురి కొల్లగొట్టడానికి సేనలు మహోత్సాహపడుతున్నాయి. అదే జరిగితే తెలిసి- తెలిసి మనం విశ్వనాధుని పట్ల అపచారం చేసిన వాళ్లమవుతాం! భటులకు అటువంటి ఆజ్ఞలివ్వరాదు. పాదుషాగారిక్కడ లేరన్నది తెలిసినా అరాచకం ప్రబలుతుంది. కనుక ఈ

రహస్యం దాచిపెట్టి తీరాల్సిందే! ఇలా చెపుదాం! చక్రవర్తిగారు శరీరంలో ఏదో ఆకస్మిక అస్వస్థత వల్ల కూతురి నివాసంలో ఆమె పరిచర్యలు చేస్తుండగా విశ్రాంతి తీసుకుంటున్నారు. హిందూ దేవతలను పరాభవించబోయినందున ఈ సంకటం కలిగినట్టుగా భావిస్తున్నారు. అందువల్ల మళ్లీ ఆ ఆజ్ఞజారీ చేసేంతవరకు ఎటువంటి యుద్ధ సంబంధ కార్యక్రమాలు తలపెట్ట వద్దు! హిందువుల్నిగాని - వారి దైవాల్నిగాని ముట్టుకోవద్దు! చక్రవర్తిగారు ఇప్పుడెవరికీ దర్శనం ఇచ్చే స్థితిలో లేరు! అని రాకుమార్తె లవంగి చెప్పినట్లుగా వెల్లడిద్దాం! ఆ తర్వాత తీరిగ్గా కర్తవ్యాన్ని ఆలోచించుకోవచ్చు!" అని లవంగికి బోధించారు.

బాగా తరచి చూడగా, వారు చెప్పిందే మేలుగా తోచింది ఆమెకు. వాళ్ల బుద్ధిబలానికి లవంగి ఆశ్చర్యానందాలు వ్యక్తం చేస్తూ, సేనాధిపతిని రప్పించి తెర చాటునుండే పై విధంగా ఫర్మానా జారీచేసింది.

చక్రవర్తిని ఎత్తుకుపోయిన పండితరాయలు కాశీపురంలో శత్రుదుర్భేద్యమైన ఒక గుహలో ఆయనను విడిది చేయించాడు. కాని అందులో సకల రాజోచిత మర్యాదలూ ఏర్పాటు చేశాడు. చుట్టూ తన భటవర్గాన్ని కాపలా ఉంచాడు. చెల్లా చెదురైన తన బలాలన్నిటినీ తిరిగి కూడగట్టాడు. అందరిలోను ఉత్సాహాన్ని రేకెత్తించి, మన పట్టణాన్ని మనం కాక ఎవరు రక్షిస్తారని బోధించి ఒక్క త్రాటి మీదికి తీసుకొచ్చాడు. పారిపోయిన పౌరులందరూ, తిరిగొచ్చి పండితరాయలు తమకు అండగా ఉన్నందుకు ఆనందిస్తూ తిరిగి ఆయన సారథ్యంలో ఏ యుద్ధానికైనా సిద్ధమన్నారు. ఇళ్లకు తాళాలు పెట్టేసి ఎక్కడో తలదాచుకున్న వాళ్లంతా తిరిగి ఊళ్లోకొచ్చి కాశీ పట్నం కళకళలాడేలా చేశారు.

కుందల తిలక - సంగీత చంద్రిక ఇద్దరూ మారువేషాల్లో కాశీపురంలో రహస్యంగా తిరగడానికి తమ సైన్యాధిపతికి చెప్పి బయలుదేరారు. వారికి లవంగి అనుజ్ఞ ఇచ్చింది.

ఢిల్లీ పాదుషా కథ

ఝాము పొద్దెక్కేసరికి, గుహలో ఉన్న చక్రవర్తికి మత్తు ప్రభావం క్రమక్రమంగా వదలసాగింది. అయితే - పండితరాయలు నియోగించిన పరిచారకులు అతడికి రాజోపచారాలు చేస్తూన్నారు. ఆ ఉపచారాలను స్వీకరిస్తూ, అది ఇంకా తన స్వంతనివాసమే అనుకొని, ఆకలి వేస్తున్నది - త్వరగా ఆహారం తీసుకురండి అన్నారు తక్షణమే అతడికి బంగారు పాత్రలలో మధుర పదార్థాలు వడ్డించారు. అతడు తృప్తిగా భుజించి ఆకలి తీరాక అప్పుడు నాలుగు మూలలా చూసి, "ఓహో! ఇది నా నివాసంలా లేదే" అనుకుని, "అయ్యో! నేనీ చీకటి గృహంలో కెలా వచ్చాను? యుద్ధం జరుగుతోందా? మా వాళ్లేరీ? అసలు నేను మా సౌధం నుంచి ఇక్కడికి ఎలా వచ్చాను?" అని అడగ్గా ఒక్కరూ ఏమీ మాట్లాడలేదు.

"ఏం? నా మాటలు వినబడలేదా? ఇంత కావరమేమిటి? జవాబివ్వకుండా నిర్లక్ష్యంగా చూస్తూన్న మిమ్మల్ని దండిస్తా" అంటూ కళ్లెర్రజేసేసరికి, "మేము భటవర్గమో - భృత్యులమో అనుకుంటున్నావా? స్వామి పరిచారకులం! విశ్వనాథ భక్తులైన హిందువుల్ని నువ్వు పీడించావు కనుక, ఆ దైవమే నిన్ను ఈ చెరసాలలో పెట్టించాడు. ఇక నీకు రాజ్యమెక్కడుంది? అధికార మెక్కడ? చచ్చినట్లు పడున్నావా-మంచిదే! లేదా నీ పెడరెక్కలు విరిచి కట్టిస్తాం! ఏదో కనికరించి భోజనం పెట్టించామని సంతోషించు! హిందూ దేవతలు, మీ తురక దేవతల వంటి వాళ్లుకారని తెలుసుకుని అణకువ కలిగి మెలగుతూ ఉండు" అని చెప్పారు.

ఆ మాటలు వినేసరికి అతడికి భయం పట్టుకుంది. తనలోతాను వితర్కించుకున్నాడు. "అయ్యో! భూమండలమంతా పరిపాలించే అధికారాలు కలిగిన నేను- న్యాయాన్యాయాలు విచారిస్తూ ప్రజలను పాలిస్తున్న నేను ఇలా ఎందుకు ప్రవర్తించాను? నిరపరాధులైన హిందువులను - వారి దేవాలయాలను భగ్నం చేయాలన్న బుద్ధి నాకెందుకు పుట్టింది? ఇదంతా నా కూతురు మూలాన జరిగింది కదా! ఆ నిర్భాగ్యురాలు ఈ అనవసరపు

కోరిక కోరడం దేనికీ? కోరినంతనే, నేనింత ప్రయత్నంచేసి పంపడం దేనికీ? మతాంతర దేవుళ్లని ఆరాధించాలనుకున్నప్పుడే నేను దండించి ఉండాల్సింది. పొరపాటే! ఇప్పుడేం చెయ్యడం? ఇది ఏ దేశమోతెలీదు. విధి ఎంత విచిత్రమైంది? నా ఐశ్వర్యమంతా కోల్పోయానే" అని రకరకాలుగా ఆలోచిస్తూ "దూతలారా! ఇదే దేశం? మీ ఉద్దేశం ఏమిటి? మీరు నన్నిప్పుడేం చేస్తారు? నా మీద దయ వుంచి చెప్పరూ?" అని అడిగాడు.

"ఇది నరకం. నీలాంటి పాపాత్ముల్ని భగవంతుడు ఇటువంటి నరకాల్లో పడేసి కొంతకాలం వేధిస్తాడు. ఆయనకు దయకలిగితే నీకు మళ్లీ వెనుకటి సంపదలిచ్చి ఆదుకుంటాడు. లేదా ఫకీరునిగా మార్చేయగల సమర్థుడు. దేవుడి అభిప్రాయం ఎవరికీ తెలీదు. నువ్వు కొంతకాలం మా దేవుడ్ని ఇకపై ప్రతిరోజూ ప్రార్థిస్తూండు. నీ కష్టాలు తీరుతాయి. ఆయన సెలవు ప్రకారమే మేమిక్కడున్నాం! ఇందుకు ప్రతిగా ఆలోచిస్తే నీకు కూడూ-నీళ్లూ అందక మేం మాయమైపోగలం! ఆ పైన నీయిష్టం"

అది మొదలు చక్రవర్తి విశ్వనాథుని ఆరాధిస్తూ - తనను విడిచిపెట్టమని దూతలను ప్రార్థిస్తూ, వారి ఉపచారాలు పొందుతూ ఒక నెల్లాళ్లు వారికి అతిథిగా గడిపాడు.

కుందలతిలక - సంగీత చంద్రికలు, పండితరాయలు ఎక్కడదొరుకుతాడా అని కళ్లింతలు చేసుకువెదకసాగారు. అతడు చక్రవర్తిని బందీగా తెచ్చిన రోజునే మసీదు ఫకీరులు వచ్చి హుసేనాబాద్ కోటలోని లవంగి సైనికులకు ఇచ్చిన ఫర్మానా గురించి తెలిపారు. వీరుడైన రాయలు ఎంతో ముందు చూపు కలిగినవాడై, వారికి సంతోషం కలిగించే మాటలు చెప్పి పంపించేశాడు.

కుందల తిలక- సంగీత చంద్రికలు వీరుడ్ని ఎట్టకేలకు ఒకచోట కనుగొన్నారు. కాని అతడు పదిమంది మధ్యలో ఉండటం వల్ల మాట్లాడే అవకాశం వారికి దొరకలేదు. అతడు కూడా వాళ్లెవరో తనకు తెలియని వారిలాగే తప్పించుకుని వెళ్లిపోయాడు. అది సరైన సమయం-సందర్భంకాదని ఇద్దరికీ తెలుసు! ఇక ఇలా జరగదని చతురబుద్ధి గల్గిన

కుందల తిలక, ఒకనాడు పురుషవేషంలో వచ్చి పండిత వీరుడ్ని కలుసుకున్నది. గుర్రం మీద ఎటో పయనమై వెళ్తున్న వీరుని గుర్రానికి అడ్డంపడి, కళ్లెంపడ్డి ఆపి "స్వామీ! మా ఆప్తుని ఒకరు మాయచేసి చెరపట్టి తీసుకుపోయారు. ఆ ఆపద మీ వల్లనే తీరాలి. మిమ్మల్ని ఆశ్రయించాలని నాలుగురోజులుగా శ్రమిస్తున్నాం!" అని పలికింది.

పండితరాయలకు మాత్రం ఆమె వైఖరి తెలీనిది కాదు కదా! అయినా ఏమీ ఎరగనివాడిలా "మీ ఆప్తులా? వారెవరు? ఏమిటి కథ?" అని అడిగాడు. రహస్యంగా చెప్పాల్సివుందని ఆ పురుష వేషధారిణి పల్కగా అతడు గుర్రం దిగి ఆమెని దగ్గర్లోని ఓ ఇంట్లోకి తీసుకెళ్లాడు.

అప్పుడు కుందల తిలక నవ్వుతూ "ఆర్యా! మమ్మల్ని మరిచి పోయారన్నమాట! నేను లవంగి చెలికత్తెను. మిమ్మల్ని బందిఖానా నుంచి విడిపించి లవంగి చెంత చేర్చి మీ ఇద్దరికీ ఏకాంతం కల్పించిన కుందల తిలకను. మీరు మా రాకుమార్తెకు. మన్మథసామ్రాజ్యం అంతా చూపించి, ఆమెని విరహాన పడద్రోసి వదిలేశారు. ఆమె తన తండ్రి మాట కూడ మర్చిపోయి మిమ్మల్నే స్మరించుకుంటోంది. మీరు ఒక్కసారైనా వచ్చిచూడకపోతే ఆమె ప్రాణాలు నిలిచేలాలేవు. మా చక్రవర్తిని ఏం చేశారు? ఎప్పటికైనా వదుల్తారా? ఈ రహస్యం ఎన్నాళ్లని దాచగలం? మాకు ఏదైనా ఉపాయం చెప్పండి" అని లవంగి రాసిన ఉత్తరం అందించింది.

అది చదివి, ఆమె హృదయాన్ని అర్థం చేసుకున్న పండిత వీరుడు "రాచకార్యాలవల్ల రాలేకపోయాను. ఈ రాత్రే వచ్చి మాట్లాడతానని చెప్పు" అంటూ లవంగికి తానొక ఉత్తరం రాసి ఇచ్చాడు. ఆమెకు ఆ ఉత్తరంలో- ఆమె రాసిన శ్లోకానికి దీటైన సమాధానంగా ఈ శ్లోకాన్ని రాశాడతడు...

శ్లో॥ నిషీద తుశిరీషకే చరతు వా కరం బేచిరం
సముత్పతతు పంకజే కురవకే కరోతు స్థితిం
దినం నయంతు కుందకే నను రసాల కాలక్రమా
న్న విస్మరతి కేవలం తవ గుణాన సౌ షట్పదః॥

ఆమె తాను రాసిన శ్లోకంలో 'అతడు ఇతరపుష్పాల మీద వాలే తుమ్మెదయి ఉంటాడనీ - అందుకే తనని మరచిపోయాడనీ' ఆమె

ఆరోపించింది. "ఓ తరుణీ! నీ వ్యాజ్యం ప్రకారం అలాగే జరిగినా, నీ గుణాన్నెన్నటికీ మర్చిపోదుసుమా!" అని అర్థం వచ్చేలా రాశాడు వీరుడు.

ఆమె వెళ్లాక "అయ్యో! ఇదేం కర్మం? పరమ పవిత్రమైన బ్రాహ్మణకులంలో పుట్టి, ఎంతో ప్రఖ్యాతి పొందిన నాకు ఈ నీచకులంలోని స్త్రీసాంగత్యం తటస్థిస్తున్నదేం? మొదట ప్రమాదవశాత్తు అలా జరిగినా- ఈ ఇంద్రియచాంచల్యం నన్ను నిలువరించుకోనివ్వడం లేదు. కులభ్రష్టత్వం ఆ భగవంతుడే నాకు విధించాడు కాబోలు!" అనుకుంటూ, అతడారాత్రి అదేరహస్య మార్గాన లవంగి మందిరానికి వెళ్లాడు. అక్కడ తనకోసం సకల ఏర్పాట్లతోను ఎదురుచూస్తున్న ఆ పాదుషా పుత్రికకు సంతోషం కల్గించాడు.

కాని ఆమెను వదిలించుకోవాలనుకున్న రీతిలో అతడామెతో సంభాషణ ప్రారంభించగా, ఆమె అతడ్ని అన్ని విధాలా కోరుకుంటున్న విషయాన్ని స్పష్టం చేసి, ఇంకొకమారు తాను అతని పట్ల బద్ధానురాగ అయిఉన్నట్లు తేటతెల్లం చేసి, తనివితీరా తన తనువు అప్పగించి సుఖింపజేసింది.

తెల్లవారకముందే పండిత వీరుడు, పాదుషాను దాచి ఉంచిన గుహలో కొచ్చి, అక్కడి పరిస్థితిని క్షుణ్ణంగా సమీక్షించాడు. చక్రవర్తి పశ్చాత్తాపపడుతున్నట్లు - అతడిక హిందువులను, హిందూదేవతలను హింసించ సాహసించడనీ, పైగా విశ్వనాధునికి కొన్నిగ్రామాలు దేవుని మాన్యాలుగా ప్రకటిస్తానని అంటున్నట్లు తన ఆంతరంగికులు చెప్పగా విని, సంతృప్తిగా తల ఊపి తిరిగి వెళ్లి, ఏకాంతంగా కూర్చొని తదుపరి కార్యక్రమం ఆలోచించాడు

ఒకనాటి అర్థరాత్రి....

మంచి సమయం చూసి, పండితరాయలు మునుపటి ద్రావకాన్ని ఉపయోగించి, చక్రవర్తికి మత్తు కలిగించి పూర్వంలాగే రహస్యంగా ఎవరికీ తెలియకుండా రహస్యమార్గంలో తీసుకెళ్లి లవంగి ఉంటున్న అంతఃపురానికి చేర్చి, ఆమెతో కొంతసేపు మంతనాలు జరిపి తిరిగి కాశీ పట్నం వచ్చేశాడు.

పాదుషా మర్నాడు ఉదయాన లేచి కళ్లు తెరిచి, నాలుగుదిక్కులా పరికిస్తూ "ఓహో! ఇది మునుపటి గుహకానట్లుందే! స్వామిభక్తులకు నేను

నిన్నదాన పత్రిక రాసి ఇచ్చాను కద! బంధవిముక్తుడనయ్యానన్న మాట! "అనుకుని "ఎవరక్కడ?" అని బిగ్గరగా పిల్చాడు. లవంగిచెలులిద్దరూ "జీహుజూర్" అంటూ అక్కడ హాజరయ్యారు.

"మీరెవరు? ఎవరి పరిచారికలు? నేను ఇక్కడికి ఎలా వచ్చాను? ఇంతకు ముందెక్కడున్నాను?" అని అడిగాను.

వాళ్లు చేతులు జోడించి "స్వామీ! మీరు నెలక్రిందట ఓ రోజు బాగా పలవరిస్తూంటే, రాజకుమార్తె లవంగి మిమ్మల్నీ మందిరంలోనికి రప్పించి ఈ తల్పంమీద మీకు విశ్రాంతి కల్పించింది. ఆ నాటి తదుపరి నేడే తమకి మెలకువ వచ్చింది. రాకుమార్తె ఇన్నాళ్లు నిద్రాహారాలుమాని మీకోసం చింతిస్తోంది - ఇదుగో! ఈ పక్కనే నిలబడి ఉంది" అన్నారు వినయంతో

చక్రవర్తి చాలా ఆశ్చర్యపోతూ "ఏం విచిత్రం? నా దేహం ఇక్కడే ఉందని చెబుతున్నారు మీరు. అంటే- జరిగినదంతా కలా? ... కాని అప్పుడది కలలా అనిపించడం లేదే! ఇప్పటికీ ఏది కలో - ఏది మెలకువో తెలుసుకోలేక పోతున్నాను. నేను ఇంత విపరీతమైన కలలెన్నడూ ఎరుగను" అన్నాడు.

"అయ్యో! అలా అంటున్నారేం? ఇదిగో మీ ముద్దుల తనయ- లవంగి. ఇది కలకాదు. 'అదే నిజం' అంటున్నారు... అదేమిటి?" అని అడిగారు సఖులు ఆశ్చర్యం నటిస్తూ. స్వామి భక్తులకు తాను దానశాసనం వ్రాయించి ఇచ్చిన, ఆ రహస్యం చెప్తే తాను పల్చనైపోతానని భావించిన పాదుషా "అది అంతే! ఇదే నిజం! సరే! యుద్ధం, దోపిడీ వంటివి అన్నీ కట్టిపెట్టించి మేం తక్షణం ఢిల్లీ బయల్దేరి పోతున్నాం!" అని ఆ రాత్రికే ప్రయాణమై వెళ్లిపోయాడు.

తర్వాత పండితరాయలను అభినందిస్తూ కాశీరాజు గొప్ప సభ జరిపి, పాదుషావల్ల పుచ్చుకున్న దాన పత్రికను సభలో చదివి వినిపించారు.

"కాశీవిశ్వేశ్వర మహాలింగాన్ని పంచములు తప్ప ఇంకెవరు ముట్టుకున్నా తప్పులేని రీతిగా, ఆ లింగానికి 'మహాదీక్షా తంత్రం' చేసి యజ్ఞం చేశారు. నాటినుంచి ఆ మహాలింగానికి అందరూ స్వయంగా అర్చనలు - అభిషేకాలు చేయసాగారు. కనుక ఆ భక్తి నువ్వూ పాటించవచ్చు!" అని కథ ముగించాడు మణిసిద్ధుడు. తర్వాత కథ గోపాలుడు చెప్పమని అడగ్గా "చెప్పవలసిన కథ పెద్దదిగా ఉన్నందున - ఆనాటికి పొద్దుపోయినందున పై మజిలీలో చెబుతానన్నాడు" మణిసిద్ధుడు.

కాశీ మజిలీ కథలు

34 వ మజిలీ

గోపా! విను! ఆ విధంగా విశ్వేశ్వర మహాలింగానికి మహాదీక్ష గావించిన పండిత రాయలకు మహావీరుడనే బిరుదు ప్రదానం చేశాడు - కాశీ రాజు. పండితభట్టు తన పుత్రుని శౌర్య ధైర్య ధీ విశేషాలకు చాలా సంతోషించి, ఇక వివాహపు ముచ్చట కూడ అయిందనిపిస్తే, తనకు బాధ్యత తీరుతుందని భావించి పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించాడు.

కాని, అతడెంత ప్రయత్నించినా పండితరాయలకు లవంగి మీద బద్ధానురాగం ఉండడంతో అతడు పెళ్లికి అంగీకరించాడు కాడు.

ఒక రోజున అతడు లవంగితో జరిపిన శృంగార క్రీడా విశేషాలను తలుచుకొని, విరహంతో ఉన్న సమయంలో కుందల తిలక వచ్చి, అతనికి నమస్కరించింది. అతడామెరాకకు ఆనందిస్తూ "లవంగి విశేషాలేమిటి? ఆమె కుశలమేనా?" అని ప్రశ్నించాడు.

"రాచకార్యాలు చక్కబెట్టుకుని వస్తానన్నారు. ఇంతవరకూ రాకుండా ఉండిపోయారేం?" అని ప్రశ్నించింది ఆమె. తర్వాత తన సఖి విరహతాపాన్ని వివరిస్తూ "ఆమె క్షేమం ఏం చెప్పను? ప్రతిరోజూ మీరు వస్తారని కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తోంది. మీరు వచ్చి చూస్తే తెలుస్తుంది. అది అలా ఉండగా మరో ఉపద్రవం వచ్చిపడింది." అందామె. అదేమిటో చెప్పమని ఆత్రంగా అడిగాడు పండితరాయలు.

"పాదుషాగారు ఇక్కడ్నుంచి కోటకు వచ్చింది మొదలు లవంగి మీద ఇష్టంలేక నిర్లిప్తంగా ఉంటున్నాడు. ఆమెగురించి తల్చుకోవడమే లేదు మన రహస్య మార్గం గురించి శత్రువులో - కిట్టనివారో ఎవరో తెలియజేశారనిపిస్తోంది. అదీగాక మా సఖులలోనే కలతలు పుట్టాయి.

అంతఃపుర రహస్యాలు దాగేలా లేవు. మీరు త్వరగా వచ్చి లవంగిని కాపాడుకోండి" అంది కుందల తిలక.

పండితరాయలు తలూపి "సరే! నేను ఢిల్లీ వచ్చి అన్నీ స్వయంగా చూసుకుంటానని మీ సఖికి చెప్పు" అని ఆమెను ఊరడించి పంపాడు.

ఆమె వచ్చి వెళ్లిన మరునాడు, తల్లిదండ్రులకైనా తెలియకుండా పండితరాయలు ఢిల్లీ వెళ్లాలనుకున్నాడు. కాని అదేరోజున ప్రారంభమై పదిరోజుల పాటు కాశీ దశాశ్వమేధ ఘాట్‌లో విద్వత్సభకు ఆయన్నే పరీక్షకుడుగా ఎన్నుకోవడంతో అది తప్పించుకోవడానికి వీలుకాలేదు. అది అయిన వెంటనే అతడు ఢిల్లీకి పయనమయ్యాడు.

సామాన్య బాటసారి వేషంలో ఢిల్లీ వెళ్లిన రాయలు కుందలతిలక గుర్తు చెప్పిన ఉద్యానవనానికి చేరుకున్నాడు. అప్పటికి కొంచెం చీకటి పడుతోంది. ఎవర్ని ఏది అడిగితే ఏ ముప్పు వస్తుందో అని అతడు అక్కడే తిరగసాగాడు. అలా తిరిగి -తిరిగి కాళ్లు నొప్పి పుట్టగా, ఆ ప్రాంతంలోని ఒక గృహస్తు అరుగుమీద కూర్చొని, లవంగి జాడ ఎలా తెలుస్తుందా? అని రకరకాలుగా చింతించసాగాడు. అతడు కూర్చున్న ఇంట్లోంచి మాటలు ఇలా విన్పించసాగాయి. ఓ భార్య భర్త మాట్లాడుకుంటున్నారు.

"చక్రవర్తి మిమ్మల్నివాళ పిలిపించాడట! దేనికీ? అమ్మాయికి వివాహ ప్రయత్నంగాని చేస్తున్నారా? నేను ఊళ్లో లేకపోతిని. విషయం వివరంగా చెప్పండి" భార్య అడిగింది.

"ఏం చెప్పమంటావు? నీకు చెప్పకూడదని కాస్సేపు చెప్పాలని కాస్సేపు అనిపిస్తోంది. దయలేని చక్రవర్తి అమ్మాయిని బలవంతంగా చంపించేశాడు. అందుకే నా హృదయం రాయి చేసుకున్నాను పెంచిన ప్రేమే మనల్నింత బాధిస్తోందే" అన్నాడా భర్త

'అయ్యోపుత్రికా" అనుకుంటూ భార్య మూర్ఛపోయింది.

తదుపరి వారి సంభాషణ వల్ల- 'లవంగిపట్ల చక్రవర్తికి ద్వేషం కలగడానికి కారణం - ఆమె కాశీ ప్రయాణంతో పాటు, కాశీలోనే ఎవర్నో వరించి గర్భాన్ని కొని తెచ్చుకోవడం - తండ్రిని చెరపట్టించడానికి సహకరించడం

ఇవన్నీ ఎవరో ఆకాశరామన్న ఉత్తరం రాశార్ట! పాదుషా హుస్సేనాబాద్ కోటలో వెతికించగా లవంగి తన వీరపురుషునికి రాసిన ప్రణయలేఖ దొరికింది. ప్రియుడికి వార్త పంపినా అతడు రాలేదట. లవంగిని చంపి, రాజు కందకంలో పారేయించారట... అదీ వీరునికి అర్థమైంది.

వీటితోపాటు ఇంకొక రహస్యం కూడ పండితవీరునికి బోధపడింది. లవంగిని పెంచినది ఆ ఇంట్లోని భార్యాభర్తలే! ఆమెను పుట్టుకతోనే పెంపకానికి ఆ బాలికను బ్రాహ్మణ దంపతులకు ఇచ్చారు. వారి కుమార్తె కూడా అదే పోలికలో ఉండటం - తన కుమార్తె సామ్రాజ్ఞి అయితే బాగుండునన్న దురాశతో ఆ జంటలోని భార్య వారిని తారు మారు చేసిపెంచడం జరిగాయి. పాదుషావారు పత్రికను పంపమన్నప్పుడు. తన పుత్రికనే రాచకన్నెలా ముస్తాబు చేసి పంపేది. ఒకనాడు అసలైన పాదుషా కూతురు నిజంగానే నూతిలో పడి చనిపోగా, ఆమె తన కూతురే అలా మరణించిందని లోకానికి నమ్మబలికింది. ఇద్దరు పిల్లలూ బాల్యంలో ఒకే రీతిగా ఉండడం వల్ల ఎవరికీ అనుమానం రాలేదు.

అయితే - ఇప్పుడీ దుర్వార్త వినగానే తన స్వంత పుత్రికని కోల్పోయిన శోకం ఆమె తట్టుకోలేక అసలు రహస్యం అన్నాళ్లకు భర్తకు చెప్పేసరికి, ఆయనా నిశ్చేష్టుడైపోయాడు.

అంతకంటే ఎక్కువగా బయట అరుగు మీద కూర్చొని ఆ సంభాషణ విన్న పండితరాయలు అప్రతిభుడై దుఃఖించాడు. "అయ్యో లవంగీ! నా వల్ల నువ్వు బలవన్మరణం చెందావా? నేనెంత కఠినుడిని నీవార్త విని కూడా వెంటనే వచ్చి రక్షించుకోలేకపోయాను. నాకోసం ఎన్నికష్టాలు పడ్డావు? ఎన్ని ఉపాయాలు ఆలోచించావు? ఇప్పుడు వీరివల్ల నీ జాతి గురించి ఎటువంటి శంక పెట్టుకోవలసిన అవసరం లేదని బోధపడింది. కాని నేనే నిన్ను దక్కించుకోలేకపోయాను"..... అని శోకభారంతో, విరక్తితో ఆ రాత్రికి రాత్రే ఊరొదిలి అరణ్య మార్గాన పడి, ఏదో తెలీని గమ్యం వైపు వెళ్లిపోసాగాడు. అలా తిరిగి-తిరిగి అరణ్యాలలో కనబడ్డ పక్షుల గురించి ఎన్నెన్నో శ్లోకాలు రాశాడు. ఈ కవిత్వం నిజంగా మధురాతి మధురమే! అది పండితరాయశతకంగా ప్రసిద్ధి సరే! ఆ తరువాత కథ విను!

భల్లూక దత్తుని కథ

పండితరాయలు అరణ్యంలో తిరుగుతూంటే, ఒక పెద్ద పర్వతం కనిపించింది. ఎండ ఎక్కువగా ఉండడంతో ఆ కొండల మధ్య కోనల్లో చల్లగా ఉంటుందని – అటు వెళ్లాడతడు. పళ్లు తిని ఆకలిని తీర్చుకొని - సెలయేటి నీళ్లు తాగి దాహం తీర్చుకుని – విశ్రమించడానికి స్థలం కోసం వెతుకుతూండగా ఒక గుహ కనిపించింది.

పండితరాయలు అందులోనికి ప్రవేశించి, కొంత మేరలోపలికి వెళ్లి ఒక రాతి మీద కూర్చున్నాడు. గుహ ద్వారం వైపుచూస్తూ ఏదో ఆలోచిస్తుండగా అక్కడికి ఒక ఎలుగుబంటి చేతులో తేనె పట్టుపట్టుకొని, నోటితో ఈగల్ని తొలగిస్తూ అక్కడికి వచ్చింది. పండితరాయలు దానికేమీ భయపడలేదు. అది తన దగ్గర కొస్తే దాన్ని మోదడానికి ఒక రాతి గదని సిద్ధం చేసుకున్నాడు. కాని అది ఆ చీకట్లో అతడిని చూడలేదు. ఒక గోడ దగ్గరగా వెళ్లింది భల్లూకం. ఆ గోడకున్న ఒక గూటిలో లేత చిగుళ్లతో అమర్చబడిన ఒక శయ్యమీద ఒక శిశువు నిద్రపోతోంది. ఆ భల్లూకం ఆ గూటి దగ్గరకు వెళ్లి శిశువుని తన ముట్టెతో స్పర్శించింది. అప్పుడా శిశువు రోదిస్తుంటే, తాను తెచ్చిన తేనెపట్టు పిండి, ఆ శిశువు నోట్లో తేనె పడేలాగ చేసేసరికి శిశువా తేనె చప్పరించి నవ్వసాగింది. భల్లూకం ఆ శిశువును ఎత్తుకొని అటూ–ఇటూ కొంతసేపు లాలించి ముద్దాడి, మళ్లీ ఆ గూట్లోనే పడుకోబెట్టి ఎక్కడికో పోయింది. ఇదంతా ప్రత్యక్షంగా చూసిన పండితరాయలు మహాశ్చర్యపోయాడు. జంతువులు కూడా పిల్లల్నింత బాగా సాకగలవా అని ఆశ్చర్యపోయాడు. "ఈ భల్లూక శిశువు మానవ శిశువులాగ రోదించాడే మిటబ్బా! చూద్దాం" అనుకొని ఆ గూటి దగ్గరకెళ్లాడు.

తీరా అక్కడి కెళ్లి చూస్తే అక్కడున్నది మానవ శిశువే! ఆ పిల్లవాడు ముద్దుల మూట కడుతున్నాడు. ఆరు మాసాల వయస్సున్న ఆపిల్ల వాడిలో రాచలక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే ఆశ్చర్యపోయాడు.

భల్లూక దత్తుని కథ

ఎలుగుబంటి వీడిని పెంచుతోందన్న మాట! అదే వీడ్నికని ఉంటుందా? లేక ఎక్కడినుంచైనా ఎత్తుకొచ్చి ఉంటుందా? ఇక్కడికి అతడెలా తీసుకురాబడ్డాడో?" అనుకుంటూ ఆ పిల్లవాడ్ని బాగా పరిశీలించి మానవ శిశువే అని నిర్ధారించుకున్నాడు.

ఈ ముద్దుల పాపడిని ఏ తల్లి కన్నదో – ఆమె ఎంత విచారిస్తున్నదో?! ఈ పిల్లవాడు ఇప్పుడు ముద్దుగా ఉన్నాడు. రేపెప్పుడైనా ఎలుగుబంటి కడతేర్చేస్తే!? క్రూరమృగం మానవశిశువుకు ఉపచారాలు చేయడమన్నది దైవికమే తప్ప సాధారణంగా లేదు. వీడ్ని ఇక్కడ్నించి తీసుకెళ్లిపోవడమే మంచిది..." అని నిశ్చయించుకుని ఆ పిల్లవాడిని ఎత్తుకొని అక్కడ్నుంచి వేగంగా కొండదిగి, ఆ అరణ్యాన్ని దాటి సాయంకాలానికి ఒక పల్లెకు చేరుకున్నాడు.

ఆ రాత్రి పల్లెలో యాచించి తెచ్చిన పాలు పట్టించి, ఆ బాలుడిని ముద్దాడుతూ "భగవంతుడు నాకు ఇలాటి కొడుకు నివ్వక సన్యాసిని చేశాడుకదా! లవంగి జీవించి ఉన్నట్లయితే– ఆమె కన్న శిశువు ఈ పాటికి ఇదే వయసులో ఉండేవాడు..." అనుకుంటూ ఆ పిల్లవాడ్ని పక్కలో వేసుకుని నిద్రించాడు.

క్రమంగా పండిత రాయలుకు ఆ పిల్లవాడిపై అనురాగం అధికమై ప్రాణంతో సమానంగా చూసుకోసాగాడు. వాడిని ఆడించడం – లాలించడం – నవ్వించడం – పలకరించడం... ఆ పిల్లవాడి పెంపకమే తన లక్ష్యమైనట్లుగా తిరగసాగాడు. అరణ్యాలలో తాను సంచరిస్తే, పిల్లవాడికి ఎక్కడ ఆపద వాటిల్లుతుందోనని అడవుల్లో తిరగడం మానేసి, గ్రామాలలోనే సంచరించసాగాడతడు.

ఇలా తిరుగుతూనే ఒకరోజు, ఆ బాలుడితో కూడ ఒక ఊరు చేరుకున్నాడు. అక్కడున్న మసీదులోనికి వెళ్లాడు పండితరాయలు. అక్కడ చాలా మంది ఫకీర్‌లున్నారు. వారిలో వృద్ధ ఫకీరు రాయలను చూసి "ఉత్తమమైన ఆశ్రమ ధర్మం స్వీకరించావు కదా బేటా! ఇంకా ఈ సాంసారిక

జీవితం మీద అనురక్తి ఉందా? ఈ పిల్లవాడ్ని ఎందుకు వెంటబెట్టుకు తిప్పుతున్నావు? నీకు ఏ మవుతాడీ బాలుడు?" అంటూ ప్రశ్నించాడు.

అందుకు పండితరాయలు "నా వృత్తాంతం దేనికి అడుగు తార్లెండి? అదో విషాద గాథ. ఇక – ఈ బాలుడంటారా! నాకొక కొండగుహలో దొరికాడు. నాకేమీ కాడు, ఎవరో తెలీదు కూడా! ఎలుగుబంటి చేత పెంచబడుతూంటే, అది వీడికి అపకారం చేస్తుందేమోననిపించి తీసుకొచ్చేశాను. భల్లూక దత్తుడని పిలుస్తున్నాను" అన్నాడు. దానికా వృద్ధఫకీరు "చాలా ఆశ్చర్యంగా ఉన్నదయ్యా! నువ్వుఫకీరువైఉండి కూడా హిందూమత విషయం చర్చిస్తున్నావే! భల్లూక దత్తుడనే పదం సంస్కృత భాషకదా! నీకాపురం ఏది? నీ తల్లిదండ్రులెక్కడ?" అని అడిగాడా ఫకీరు.

"బాబా! నువ్వు వృద్ధుడివి. నీవంటి వారితో అబద్ధాలు చెప్పకూడదు" అంటూ తన వృత్తాంత మంతా చెప్పిన పండితరాయలును కౌగలించుకుని "నీ తల్లికి పూసలపేరు ఇచ్చిన ఫకీరును నేనే! మళ్లీ ఆమెను చూడటం తటస్థించలేదు. నువ్వు వారికి మిగిలిన ఏకైక సంతానానివై ఉండీ దుఃఖమే మిగుల్చుకుంటున్నావు. జరిగిందానికి విచారించకు. చక్రవర్తి లవంగిని చంపించడం నువ్వు కళ్లారా చూశావా? లేక విన్నావా? నీ ముఖంలో శుభలక్షణాలే కన్పిస్తున్నాయి. నీకు మంచే జరుగుతుంది" అన్నాడు దీవిస్తూ.

అప్పుడా మాటలకు పండితరాయలు ఆశ్చర్యపడి, పిల్లవాడితో కూడ కొన్నాళ్లక్కడ ఉండి, తర్వాత ఎన్నెన్నో ఊళ్లు తిరుగుతూ హరిద్వారం చేరుకున్నాడు. అప్పటికా బాలునికి ఏడాది వయసొచ్చింది. ఒకనాడు పండితరాయలు పిల్లవాడ్ని ఆడిస్తూంటే, కుందలతిలక అక్కడికొచ్చి ఆశ్చర్యపోయింది.

ఆమె అతడ్ని గుర్తుపట్టింది. విచారంగా ఉన్న రాయలు తాను వెంటనే ఆనాడు బయల్దేరకపోవడం దగ్గర్నుంచి జరిగిన కథంతా వివరించగా, లవంగి సుఖంగా ఉందన్న సంగతి రాయలచెవిన వేసి, అతడికి ఆనందం కలిగించి తన వృత్తాంతం వివరించసాగింది.

కుందల తిలక కథ

నేను మీ దగ్గర్నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లి లవంగి ఉన్న ఉద్యానవనం చేరాను. కాని అక్కడ నాకు లవంగి కాని, సంగీత చంద్రిక కాని కనిపించలేదు. అక్కడివాళ్లు చెప్పిన మాటలు నన్ను అయోమయంలో పడేశాయి. గర్భవతి అనైనా చూడకుండా లవంగిని పాదుషా చంపించాడట. అది విని నేను హడలెత్తి అక్కడ్నుంచి ఉడాయించాను. మళ్లీ మీ కాశీపురం వచ్చి మీకోసం వెతకసాగాను. మీరు తల్లిదండ్రులకైనా చెప్పక ఇల్లువిడిచి వెళ్లారని - అందుకు వారు విచారిస్తున్నారనీ తెలిసింది. బహుశా మీరు లవంగి కోసమే బయల్దేరి ఉంటారని ఊహించాను. నాకు ఏం చేయాలో - ఎటు పోవాలో తెలియలేదు. అగమ్యంగా దేశాటనం ప్రారంభించాను. కొన్ని నెలల తర్వాత సంగీత చంద్రిక నీళ్లు తెస్తూండగా చూశాను. ఇక్కడ ఈ హరిద్వారం ఎలా చేరుకున్నదీ మె? లవంగితోపాటు ఈమెకూడా మరణించిందని నా ఊహ. అది తెలుసుకోడానికే నేను రహస్యంగా ఆమెను అనుసరించాను ఆమె సరాసరి ఒక బ్రాహ్మణుని ఇంట్లోకెళ్లింది. అక్కడివార్ని ఆమె గురించి అడిగాను. వాళ్లకామె తెలిపిన మాటల ప్రకారం ఒక బాటసారి ఆమెతోపాటు ఒక చిన్నది. ముందుగా మగవారు వెళ్లి పోయారట! ఆ చిన్నదానికి మగశిశువు కలిగి రెండు నెలల క్రితం జారిపోయాడట. అందుకే కాబోలు ఆమె ఎప్పుడూ విచారంగా ఉంటుందన్నారు. నేను మెల్లగా లోపలికెళ్లాను. లవంగి నన్ను గుర్తుపట్టి వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడు నేను "మీరు మరణించారన్న వర్తమానం ఢిల్లీలో నేనొచ్చేసరికే వ్యాపించి ఉంది. మీరు ఇక్కడికి ఎలా వచ్చారు? మీ కథ చెప్పండి" అని అడిగాను. సంగీత చంద్రిక ఇలా చెప్పసాగింది.

"లవంగిని చంపించడానికే పాదుషా నిర్ణయించుకున్నాడని ఒక బ్రాహ్మణుడు మాకొచ్చి చెప్పాడు. మేము అది పట్టించుకోనట్లు నటించాం! అయినప్పటికీ ఒక కృత్రిమస్త్రీని శయ్యమీద పొందుపరచి, మేము రహస్యంగా ఉండి గమనించసాగాము. అర్ధరాత్రి కావస్తుండగా భటులు వచ్చి ఆ కృత్రిమ స్త్రీ విగ్రహాన్ని ముక్కలుగా నరికి పరుపుతో సహా చుట్టబెట్టి మోసుకుపోయి, కందకంలో తొక్కేశారు.

'ఇక ఇక్కడుంటే మనకి ప్రాణహాని తప్పదు. మెల్లగా కాశీపురి చేరుకుని నీ భర్తను కలుసుకుందాం' అని చెప్పి ఆమెను తీసుకొని బయల్దేరాను. నాలుగు మాసాల గర్భం... కటిక చీకటి... ఆమెనాచేతిని ఊతంగా – ముసుగులో ముఖం దాచుకుని అతికష్టం మీద అడుగులు వేయసాగింది. తెల్లవారేసరికి ఒక పల్లె చేరుకున్నాం! ఆమె నడవడం కష్టమౌతోంది. ఆ తోవలో బళ్లూ ఏం లేవు. గర్భం ఎదిగేకొద్దీ ఆయాసభారంతో ఆగిపోయేది. ఒక్కోచోట పదేసి రోజులు కూడ ఉండిపోవలసి వచ్చేది.

ఒకనాడొక అగ్రహారం చేరాం! అప్పటికి లవంగికి నెలలునిండాయి. మేము ఒక బ్రాహ్మణుని వేడుకోగా, వాళ్లింట్లో పురుడు పోసుకోడానికి అంగీకరించాడు. మేమూ బ్రాహ్మణులమేననీ – మా మగ వాళ్లు కాశీలో ఉన్నారనీ – ఆమె నా సోదరని చెప్పాను. లవంగి అతి చక్కని శిశువుని ప్రసవించింది. రెండు నెలలు అక్కడ సుఖంగానే ఉన్నాం! వేగంగా కాశీ వెళ్లిపోవాలని మాకు ఉన్నప్పటికీ, ఆమె నడవలేదు కదా! చివరికి లవంగి పోరు పడలేక, ఆ బ్రాహ్మణకుటుంబానికి కృతజ్ఞతలు చెప్పి బయలుదేరాము.

అక్కడ అంతటా అడవుల మయం. సరైన దారుల్లేవు. ఎంతో దూరం నడిస్తే తప్ప గ్రామం కనిపించదు. ఆమె నాకు ఎప్పుడూ వంద గజాల వెనుకగా ఉండేది. పిల్లవాడిని ఎత్తుకొని నేను ముందు నడుస్తుండగా, ఒకనాటి మధ్యాహ్నం ఒక ఎలుగుబంటి బొబ్బలు పెడుతూ నాపై పడటానికి వచ్చింది. నేను కేకలేస్తూ ఏం చెయ్యాలో తెలీక పిల్లవాడ్ని ఒక పొదచాటుగా నేల మీద పరుండ బెట్టి నేనొక మూలకు పారిపోయాను.

అప్పుడా భల్లూకం పిల్లవాడిని ఎత్తుకొని పక్కనున్న అరణ్యంలోకి పోయింది. నేను ఏడుస్తూ నిలబడిపోయాను. అంతలోన లవంగి వచ్చి జరిగింది తెలుసుకుని తానూ ఘొల్లున ఏడ్వసాగింది. నేనే ఎలాగో ఆమెను ఊరడించాను. ఒక పల్లెచేరి కొన్నాళ్లున్నాం! ఇదుగో! ఇప్పుడీ హరిద్వారానికి కొన్నాళ్ల క్రితం చేరుకున్నాం! లవంగి ఆరోగ్యం బాగులేక ఇక్కడే ఉంటున్నాం!" అని చెప్పింది.

కుందల తిలక కథ

"కుందల తిలకా! నువ్వెలా మమ్మల్ని కలిశావు. పండిత వీరుని కలవగలిగావా? అతడేమన్నాడు?" అని అడిగింది. అప్పుడు తాను ఆయన్ని కాశీలో మొదటిసారి ఎలా కలిసిందీ చెప్పిందామె. ముగ్గురం-అప్పట్నుంచి మేమే మిమ్మల్ని వెతుక్కుంటూ తిరుగుతూన్నాం. మీరు ఏ మసీదులో వృద్ధ ఫకీరును దర్శించి మీ వృత్తాంతం వినిపించారో ఆయన దగ్గరకు చేరుకున్నాం! అప్పటికి మీరు వైరాగ్యంతో, బాలు నెత్తుకుని తీర్థయాత్రలు చేస్తున్నట్లు-ఆయన వల్ల మాకు తెలిసింది. లవంగిని, సంగీత చంద్రికను ఆయన వద్ద వదలి, నేను మీకోసం తిరుగుతూండగా మీరిక్కడ కనిపించారు. ఆమెకు కృతజ్ఞతలు చెప్పి, లవంగిని కలుసుకోడానికి తిరిగి వృద్ధఫకీరున్న మసీదుకు బాలునితో సహా ఆమె వెంట వెళ్లాడు పండితరాయలు.

తీరా వెళ్లాక - ఆ గ్రామ శివార్లలోనే పండితరాయల్ని నిలిపి, తానొక్కతే లవంగిని ఆశ్చర్యపరచాలని వెళ్లింది తిలక. కానీ ఆమెనే ఆశ్చర్యపరిచేలా ముసలి ఫకీరు శిష్యుడొకడు అక్కడ కనిపించి, ఆమెయే కుందలతిలక అని రూఢి పరుచుకున్న తర్వాత, "అమ్మా! మీరొస్తారనే, మా గురువుగారు నన్నిక్కడ ఉంచారు. పదండి! ఆయన్ని తీసుకొద్దాం!" అంటూ పండిత రాయల్ని పిల్లవాడితో సహా మసీదుకు తీసుకొచ్చి మర్యాదచేశాడు.

తదుపరి కథను మణిసిద్ధుడు తరువాత మజిలీలో ఇలా చెప్పసాగాడు.......



కాశీ మజిలీ కథలు

35 వ మజిలీ

ముసలి ఫకీరు కథ

ముసలి ఫకీరు చేత నియమించబడి, పండితవీరుని - పిల్ల వానితో సహా మసీదుకు రప్పించాక, తగిన గౌరవాదరాలు చూపి ఆ శిష్యుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు....

"అయ్యా! ఈమె, మా గురువుగారి వద్ద నుంచి వెళ్లాక లవంగి ఆకార విద్యావిశేషాలు స్వయంగా పరిశీలించినందున ఆమె వృత్తాంతాన్ని తరచి తరచి అడిగారు. ఆమె అంతా చెప్పి "బాబా! నేను శాస్త్రం నిషేధించిన దేమన్నా చేశానా? నా తండ్రికి నామీద ఈ అకారణ క్రోధం ఏల" అని జాలిగా అడిగింది.

మా ఫకీరు సాహెబ్ ఆమె కథకు జాలిపడి 'చింతించకు! నీ కష్టాలు నేను తొలగించగలను. నీ ప్రియ మనోహరుడు నాకు పరమ ఆప్తుడు అతడు ముల్లోకాలను ఏలగల సమర్థుడనీ నాకు తెల్సు! నీ చరిత్రంతా అతడి ద్వారా విన్నాను. ఇప్పుడు స్వయంగా చూశాను కూడా! అయితే, నువ్వు చనిపోయావని విని, విరక్తితో అతడలా తయారైనాడు.

అలాగాకుండా ఆనాడే నిన్నుకలుసుకొని ఉంటే, అతడు మీ తండ్రిని ఓడించి ఢిల్లీ రాజ్యం వశపరచుకోకపోవునా?.... ఇంత కష్టగాథ నడిచి వుండేందుకు అవకాశమే లేకపోవును. సరే! జరిగిందేదో జరిగింది. అయినా నేను మంచిగానే కార్యం సాధిస్తాను. నేనొచ్చేవరకు నువ్విక్కడే నీ సఖురాల్తో సహా సుఖంగా ఉండు. మా శిష్యులు నిన్ను సంరక్షిస్తారు" అని చెప్పి లవంగిని మా శిష్యబృందం సంరక్షణలో ఉంచి, ఆయన నన్ను వెంటబెట్టుకుని ఢిల్లీకి వెళ్లారు.

ముసలి ఫకీరు కథ

అక్కడ ఢిల్లీ మసీదులో ముల్లాలు, మా గురువుగారికి చాలా మర్యాదచేసి, వచ్చిన పనేమిటో తెలుసుకోదలచారు. ఆయన వివరాలేం చెప్పకుండా – నేను పాదుషాని దీవించదలుచుకున్నానని మాత్రం చెప్పాడు. అయితే ఆయన ఎవరికీ దర్శనమివ్వడంలేదనీ ఫకీరులను దర్శనానికి అనుమతించినా సరిగ్గా మాట్లాడటం లేదని–ఏదో మనోవ్యాథి అతడ్ని పీడిస్తోందని – ఆయన్ని సంతోష పరిచిన వారికి అసాధారణ గౌరవం లభిస్తుందని వారి మాటల వల్ల తెలిసింది. తాను అందుకే వచ్చానన్నారు మా గురువుగారు.

మర్నాడు నన్ను వెంట బెట్టుకుని కోటలోనికి పోయారు. అట్టే శ్రమపడక్కర్లేకుండానే పాదుషా మమ్మల్ని అనుమతించారు. ఆయన ఒక్కసారి సలాములు చెప్పి ఊరుకున్నాడు. అప్పుడు మా గురువుగారు "అన్యాయ కార్యాలు చేస్తే, మిగిలేది దుఃఖమే! నువ్వు విచారించకు! నీ శోకాన్ని తీర్చడానికే నే వచ్చాను. నీ మనసులో పశ్చాత్తాపం కార్చిచ్చులా ఆరకుండా వెలుగుతోంది. నిరపరాధి అయిన కూతుర్ని చంపిచేశానని విచారిస్తున్నావుకదూ! నిజంగా ఆమె ఏ నేరం చేయలేదని– విచక్షణ పరుడివైన నీకూ తెలుసు! సర్వోత్తముడైన వ్యక్తినే తన పతిగా ఆమె వరించింది. ఇంకా విను! పతివ్రతా ధర్మమే ఆమెను సైతం బ్రతికించి ఉంచింది. ఇది అంతకంటే చిత్రమైన సత్యం నువ్వు తీసుకురమ్మంటే ఆమెని సజీవంగా రప్పించగలను" అన్నారు.

వెంటనే పాదుషా 'మహాత్మా! రక్షించండి' అంటూ మా గురువుగారి పాదాలు పట్టుకొని 'ఏదో కోపంలో కూతురి ప్రాణాల్నే బలిగొన్న దుర్మార్గుణ్ణి! కౄరుడ్ని! తాము అల్లా అని నమ్ముతున్నాను. నా కూతుర్ని నాకు దయ చేయించండి' అంటూ వేడుకున్నాడు.

మా గురువుగారు లవంగిని తీసుకు రావడానికి సేనలతోపాటు నన్ను ఇక్కడకు పంపించారు. నేను ఇక్కడికొస్తూనే లవంగిని–ఆమె చెలికత్తెను వారి వెంట పంపించాను. మీరు వస్తే తీసుకు రమ్మని నన్నిక్కడ ఉంచారు. నేను మీరాక కోసం ఎదురు చూస్తున్నాను ఢిల్లీ వెళ్దాం రండి" అన్నాడా శిష్యుడు. పండితరాయలు కోపంగా "తాను అక్కడికి రాను" అనీ –తన ప్రతాపమేమిటో పాదుషా రుచి చూస్తాడనీ చెప్పి కుందలతిలకను మాత్రం ఢిల్లీ పొమ్మన్నాడు. అప్పుడు ఆమె తన సఖురాలి చెంతకైనా వెళ్లక ఇలా అంది......

పండిత పుత్రుని కథ

అప్పుడా పడతి, ఆ పండితపుత్రునితో "అయ్యా! నేను మీ పాద సేవకురాలినై మీతోనే తిరుగుతుంటాను. మా సఖి చేసినట్టి తప్పులు ఏవి వున్నా అవి మన్నించండి. అపరాధి అయినా, తండ్రి పిల్చేసరికి వెళ్లిపోయింది ఆమె. అది మీకు కోపం తెప్పించిందని నేను అర్థం చేసుకున్నాను. ఎంతయినప్పటికీ స్త్రీకి పుట్టింటి మీద చాంచల్యం నేను వెళ్లి తీసుకొస్తాను. అనుజ్ఞఇవ్వండి!" అంటూ బ్రతిమాలసాగింది

ఆమె అలా పరిపరి విధాల చెప్పేసరికి "ఇప్పుడొద్దు! అటువంటి రోజు వస్తుందిలే! నువ్వే చూస్తావుగా!" అన్నాడు రాయలు.

యథాతథంగా వారిద్దరి సంభాషణను రాసి ఫకీరు శిష్యుడు తన గురువుగారికి పంపించాడు. ఫకీరు అది తెలుసుకొని లవంగి వద్దకు వెళ్లి "అమ్మాయీ! నీవెంతో ఆతృత పడుతూ తన కోసం ఎదురుచూస్తూ అక్కడ మన మసీదులో వున్నావని కుందలతిలక చెప్పగా, తానూ అంతే ఆతృతతో నిన్ను చేరుకోవాలని వచ్చాడట-నీ భర్త- కాని నువ్వు సమయానికి అక్కడ లేక, నా పిలుపున ఇక్కడికి వచ్చేసరికి ఆశాభంగంచెంది, ఆ కోపంలో తిరిగి చక్రవర్తి మీద కత్తికడుతున్నాడట! అతడు తలుచుకుంటే ఎంతపనైనా చేయగలవాడని నేనెరుగుదును. అతని సామర్థ్యాన్ని నీకు వేరే వివరించక్కర్లేదు. నువ్వూ చూసే ఉన్నావు. ఇప్పుడు మనం అతని కోపాన్ని నివారింప జెయ్యాలి. చక్రవర్తి స్వయంగా అతని వద్దకు వెళ్లి "అపరాధం జరిగింది - క్షమించు" అని ప్రార్థిస్తే కార్యం చక్కబడ్తుంది లేకపోతే చిక్కులు రావచ్చు! నువ్వే ఆలోచించుకో" అన్నాడు.

తండ్రికి తన మీద మునుపటికన్న ప్రేమానురాగాలు అధికమయ్యాయని గ్రహించిన లవంగి తండ్రి దగ్గరకు చేరి, ఆయన్ను ముద్దుగా ఒక కోరిక కోరింది.

"తండ్రీ! నీ అల్లుడి సామర్థ్యం నీ వెరిగినదే! అతడికై ప్రాణం పెట్టగల వీరులున్నారు. ప్రేమానురాగాలు కురిపించే మిత్రులూ-

అనుచరులూ లక్షలాదిమంది ఉన్నారు. వేయేల? నా పునర్జన్మ వంటి బ్రతుకుకు కారణమై, నన్ను సజీవంగా నిలబెట్టిన మన ఫకీరు బాబా లందరికీ అంతడంటే ఆప్యాయత ఉంది. ఇంత మంది అభిమానాన్ని చూరగొన్న అతడి మీద నీవు కత్తిగట్టడం - కక్షగట్టడం భావ్యంకాదు. అటువంటి వాడు నీకు అల్లుడు కావడమే గొప్ప. ఇక-నీకు మనవడు కూడా లభించాడు. నువ్వు నాకు ద్రోహం చేసినా, నువ్వు పిలవగానే నేను కాదనక వచ్చాను. నేనైతే అలా రాగలిగానుగాని అల్లుడు అలా రమ్మనగానే వచ్చేసి సరిపుచ్చుకుంటాడా? నా పుట్టింటి చాంచల్యాన్ని ఆక్షేపిస్తూ నీ మీద యుద్ధసన్నాహాలు చేస్తున్నాడట! ఎటువైపునుంచి ఆపద ఎదురైనా బాధపడేది నేనే కద! ఇంతవరకు పడిన బాధలు చాలవా? కనుక నువ్వే ఆయనను, మన మర్యాదకు భగ్నం లేకుండా, సగౌరవంగా ఎదుర్కొని స్వాగతించాలి. అల్లుడు అలుగుట - మామ అలుక తీర్చుట అనేది లోకాచారమే" అని చక్కగా ఒప్పించింది.

అది విన్నాక పాదుషా బాగా ఆలోచించుకున్నాడు. ఇంత జరిగాక, ఇంకా కక్ష పట్టడం - బిగిసి కూర్చోవడం వృథా అనుకున్నాడు. తన చతురంగ బలాలను, మంత్రి సామంతులను, ముసలి ఫకీరును వెంటబెట్టుకుని పండిత రాయలున్న గ్రామానికి వెళ్లాడు. అల్లంత దూరాన రథందిగి నడుచుకుంటూ వెళ్లి "అపరాధాలు మన్నించి మా ఇంటికి విచ్చేయి" అని ప్రార్థించాడు. అందర్నీ ఢిల్లీ తీసుకెళ్లడానికి సిద్ధమయ్యాడు. సంగీత చంద్రిక కుందలతిలక సహాయాన్ని ప్రశంసించిన పండితరాయలు, ఢిల్లీలో లవంగిని కలుసుకుని ఇంకా ఆనందంగా ఉన్నాడు.

అంతలోనే కాశీపుర వాస్తవ్యుడైన పండిత భట్టుగారి పుత్రుడు పాదుషాకూతురైన లవంగిని పెళ్లాడి ఆమె వల్ల సంతానాన్ని కని-కులాన్ని చెరుపుకున్నాడన్న వార్త దేశమంతటా వ్యాపించింది. అందుకు విచారిస్తూ పండిత భట్టు కాశీలో పండితులకు ముఖం చూపలేక, తన భార్యతో సహా ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

అయితే- స్థానిక పండితులు, అతని ప్రయాణాన్ని అడ్డుకొని "పుత్రుడు కులం చెరిపేపని చేస్తాడని ఏ తండ్రీ ముందుగా ఊహించి

సంతానాన్ని కనడుకద! అతడికి నచ్చిన రీతిని అతడు ప్రవర్తించాడు అందుకు నువ్వేం చేస్తావు? నువ్వు వెళ్లి అతడితో కలిసి కులానికి అప్రతిష్ఠ తీసుకురావడం దేనికి? ఇక్కడే ఉండు" అన్నారు.

పండిత భట్టు ఏదోరీతిన గుండె చిక్కబట్టుకొని ఆగిపోయినప్పటికీ అతని భార్య అలా ఉండలేకపోయింది. కొడుకును చూడాలని ఉందంటూ ఆమె ఢిల్లీకి వర్తమానం పంపింది. అప్పుడు పండితరాయలు భల్లూకదత్తుడ్ని పాదుషా దగ్గర వదలి పరివారంతో సహా తిరిగి హుస్సేనాబాద్ కోటకు లవంగిని వెంటబెట్టుకుని చేరాడు. అక్కడినుంచే కాశీ పండితులకు ఆహ్వానాలు పంపాడు. కాని అతడు సంభాషణార్హుడు కూడా కాదని ఎవ్వరూ రాలేదు. పండితభట్టు భార్య మాత్రం భర్తకు తెలియకుండా పుత్రుని దగ్గరకు మమకారం కొద్దీ వెళ్లగా, పండితరాయలు భార్యాసమేతుడై ఎదురెళ్లి తల్లిని గౌరవించాడు.

ఆమె వాళ్లని దీవించి "నాయనా! నిన్ను కని ఇంత వాడిని చేసినా నాకు దుఃఖం తప్పలేదు. విద్యా గుణశీల సంపన్నుడివై కులానికి ఖ్యాతి తెస్తావనుకుంటే, నీ మూలంగా మేం తల ఎత్తుకో లేకపోతున్నాం! బ్రాహ్మణుల్లో కన్యలు లేకపోయారా? ఈ తురక పడతి నెలా వరించావు? ఆలయంలో ప్రవేశించడానికే ఒప్పుకోని వాడివి- అంత హడావుడి చేసిన వాడివి- నువ్వేనా? ఆ నియమనిష్ఠలన్నీ చెరివేసుకుని ఈ పిల్లని చేరదీశావు! మీ తండ్రికిన్ని తలవంపులు తెస్తావా?" అంటూ కన్నీరు పెట్టుకుంది.

అప్పుడతడు తన తల్లిని లోపలకు తీసుకెళ్లి, కూర్చోబెట్టి "ఈమె అచ్చమైన బ్రాహ్మణ పుత్రిక. కారణాంతరాలవల్ల ఈమె యవనుల ఇంట పెరిగింది. నేను అన్నిటికీ విరక్తుడినై ఉన్నాను. ఏది నాచే చేయబడవలసి ఉందో అది చేశాను తప్ప. ఈ కర్మల పట్ల కెలాటి కర్తృత్వమూలేదు".... అంటూ చెప్పాడు. భార్యను వెతుక్కుంటూ పండిత భట్టు కూడా అక్కడకు వచ్చాడు. తల్లితో మాట్లాడుతున్న ఆ తనయుడు, తండ్రి వచ్చిన వార్త తెలియగానే తక్షణం ఎదురేగి సకలోపచారాలూ చేసి తల్లిచెంతకు తీసుకొచ్చాడు. "నాయనా! ఒకే ఒక్క పుత్రుడివి. నిన్ను దూరం చేసుకోలేక నేనే ఇంత దూరం వచ్చాను. నీతో సంభాషిస్తేనే నన్ను వెలేస్తామన్నారు

కాశీ పండితులు నువ్వు సంపదలకు ఆశించి, తురక పడతిని పెండ్లాడావని ఒక అపవాదు బయల్దేరింది. నువ్వు సంపదలోనే పుట్టి పెరిగిన వాడివనీ – తుచ్ఛమైన ఈ ద్రవ్య సంపదలకు ఆశపడే వాడివి కావనీ నాకు తెలుసు! ఈ లోకానికి తెలీదు కద! నానాపుకార్లు చెలరేగాయి. గుణ సంపదా దండిగా ఉన్న నీవు ఇలాటి పని చేయదగిందేనా?" అని బాధపడ్డాడు.

తల్లికి చెప్పినట్లే, తండ్రికి కూడా చెప్పి, "తండ్రీ! ఈమె జన్మరీత్యా బ్రాహ్మణ పుత్రికే" అని వివరించాడు. అప్పటికీ తండ్రి, కులానికంతటికీ నేను జవాబుదారీ. వాళ్లనెలా సమాధాన పరచాలని ప్రశ్నించడంతో? రేపు అందర్నీ కాశీలో మణికర్ణికా ఘట్టం దగ్గర సమావేశ పరిస్తే, నా పవిత్రత నిరూపించుకుంటా" అన్నాడు.

పండితరాయలు లవంగితో సహా విశ్వేశ్వర దర్శనానికి వెళ్లి, స్వామిని దర్శించి స్తుతించి, అక్కడ్నుంచి ఘట్టానికి వెళ్లి "గంగాదేవీ! నీ అండ చూసుకొని నేను వీరందర్నీ ఇక్కడకు రప్పించాను. నేను పవిత్రుడినే అయితే, నన్ను నీలో ఐక్యం చేసుకో!" అంటూ అప్పటికప్పుడే ఆశువుగా అరవై స్తోత్రాలు రచించాడు. అదే 'గంగాలహరి'గా సుప్రసిద్ధం ఒక్కోస్తోత్రానికి ఒక్కో మెట్టెక్కి గంగ ఆ దంపతుల మీద పూలవానలా వర్షించి తనలో లీనం చేసుకుంది" అతడు ఈ పార్థవ దేహం వదిలి దివ్యదేహం పొందాడు.

గోపా! ఇదీ. వారికథ. మనకు ప్రయాణానికి వేళవుతూన్నది. కావడి భుజానికి ఎత్తుకో" అన్నాడు మణిసిద్ధుడు. "కథ చాలా బాగుంది కానీ, వారు కారణజన్ములా? వారి పూర్వగాథ ఏమిటి?" అని ప్రశ్నించాడు గోపకుడు. "ఇప్పుడు కాదు. ముందు శివాలయం వద్ద జ్ఞాపకం చెయ్యి" అని శిష్యునితో కూడ తర్వాత మజిలీ చేరుకున్నాడు.

కాశీ మజిలీ కథలు

36 వ మజిలీ

రాతి మందసం కథ

సాధారణమైన ఒక గ్రామం అది. ఊళ్లో నలుమూలలా తిరిగి, ఏ విశేషమూ కనబడక, గురువుగారి జపం పూర్తయేలోగా దగ్గర్లో ఉన్న అడవిని కూడా చూసి వచ్చెయ్యవచ్చు ననుకుని, గోపాలుడు అడవిలోకి వెళ్లాడు. అక్కడ ఒక వింత కనిపించేసరికి, మహదానందంగా మరొక కథ వినవచ్చునని అయ్యవారి దగ్గర కొచ్చాడు. అతడి కోసమే చూస్తున్న యతీంద్రుడు "రా!రా! భోజనం చేశాక అడుగు! నీ ముఖంచూస్తేనే తెలుస్తోంది- ఏదో విశేషాన్ని చూసి వచ్చావని!" అన్నాడు మందహాసం చేస్తూ.

"ఆలస్యమైతే చెప్పడం మర్చిపోతాను. ఈ ఊరికి దగ్గర్లో ఓ అడవి ఉంది. అందులో ఒక అద్భుతమైన రాతి పెట్టెఉంది. తెల్లని పాల రాతితో చేయబడిన ఆ పెట్టె నూరుగజాల పొడవు, ఏభైగజాల వెడల్పు, నలభై గజాల ఎత్తు ఉంది. దానిమీదికి ఎక్కడానికి ఎవరో వింతగా రాతి మెట్లు కూడా కట్టించారు. నేను పైకెక్కిచూశాను. దాని మూత వేయబడి ఉంది. కాని ఒక చోట కన్నంపడి ఉంది. దాన్లోకి చూస్తే పాతాళ బిలంలా కన్పించింది. వెయ్యిమంది అయినా దానిమూత తియ్యలేరు. అది పెట్టెలాగానే కనిపిస్తోంది. దాన్నెవరు వాడతారో? వాళ్లెంత శరీరం కలవారో! ఎవర్ని అడిగినా దానిసంగతి తమకేమీ తెలీదంటున్నారు. అది అక్కడ చాలాకాలం నుంచి ఉందని చెపుతున్నారు. ఆ పెట్టె సంగతి మీరే చెబుతారని వచ్చేశాను" అన్నాడు గోపాలుడు.

తన మణి విశేషం వల్ల ఆ పెట్టెకు సంబంధించిన వృత్తాంతమంతా ఆకళింపు చేసుకుని గోపాలుడు కూడ భుజించిన తర్వాత సావకాశంగా కూర్చొని, ఆ కథ ఇలా చెప్పసాగాడు.

మహామాయ కథ

దేవదుర్గం అనే పట్టణానికి బుధవర్మరాజు. అతనికి కీర్తిమతి అనే భార్య ఉంది. దయాధర్మ సత్య గుణాలు ఆభరణాలుగా - ప్రజాబలం అపారంగా ఉన్న బుధ వర్మ ప్రజల్ని కన్నబిడ్డల్లా పరిపాలించసాగాడు. అతనికి చాలాకాలం వరకు సంతానం లేదు. సాధారణంగా సంతానం లేనివారు తమకు సత్సంతానాన్ని ప్రసాదించమని కోరుకోవడం పరిపాటి! కాని, ఆ పట్టణ ప్రభువు పట్ల ప్రజలకున్న అవ్యాజానురాగం వల్ల, రాజుగారికి సంతానం కలగాలని ప్రజలే పూజలు- వ్రతాలు చేయసాగారు.

ప్రజాభీష్టం బలంగా ఉండి, దైవకృపవల్ల ఆ రాజుకి ఒకరుకాదు! ఇద్దరుకాదు! ముగ్గురు సంతానం కలిగారు. ఇద్దరుపుత్రులు, ఒక పుత్రిక కావడంతో బుధవర్మ వారికి వరసగా బలభద్రుడు, కృష్ణుడు, సుభద్ర అని నామకరణం జరిపాడు. ముగ్గురికీ ఒక్కొక్క ఏడాది తేడా ఉన్నా, చూసేవారికి వాళ్లు ఒకేసారి జన్మించిన వారా? అనిపించేలా ఉండేవారు ఎవరెవరో పోల్చుకోవడం కష్టం అనిపించేలా కవలలు వలె కూడా ఉండేవారా ముగ్గురూ.

కేవలం వారి నిమిత్తం రాజు ఒక విద్యామందిరం కట్టించి, వివిధ శాస్త్ర నిపుణుల్ని ఉపాధ్యాయులుగా చేశాడు. అయితే వారికి కేవలం విద్య తప్ప ఇతర విషయాలేవీ నేర్ప వద్దని శాసించడంతో గణితం, చిత్ర లేఖనం, యుద్ధవిద్యలు, సంగీత, సాహిత్యాదుల్లో వారికి శాస్త్రజ్ఞానం బాగానే బోధపడిందికాని లోకానుభవం అలవడింది కాదు. పండితులు వారిని పరీక్షించినపుడు -లోకానుభవం లేని లోటు తీర్చవలసిందేననీ" సెలవిచ్చారు.

అప్పుడు రాజు వారిని విద్యావిషయ సంబంధ జ్ఞానం నుంచి కొంతకాలం విరమింపజేసి, ప్రతిరోజు సాయంత్రం గుర్రబ్బండి మీద పట్నంలోని వీధుల వెంట షికారుగా తిప్పమని ఆదేశించాడు. అలా తిరుగుతూన్నప్పుడు అక్కడి విశేషాలు వివరించడానికి సమర్థులైన వారిని లోకానుభవ శిక్షకులుగా వారి వెంట పంపాడు. అంతవరకు లోకం పోకడ తెలీని, ఆ శాస్త్రజ్ఞాన వేత్తలకు అన్నీ వింతగానే కన్పించసాగాయి

వారు వర్తకుల వీధుల గుండా వెళ్తున్నప్పుడు రకరకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని చూసి "వీళ్లు చాలా పుణ్యాత్ముల్లా ఉన్నారే! అన్ని వస్తువులను అందరికీ ఇస్తున్నారు. ఎవరు వీళ్లు?" అని అడిగారు. వారి వెంట ఉన్న శిక్షకులు "పిల్లల్లారా! వీళ్లని వ్యాపారులు అంటారు. రకరకాల సరకుల్ని ఎక్కడెక్కడి దేశాలనుంచో సేకరించి, ఇక్కడ అధిక ధరకు అమ్ముతూంటారు. అందువల్ల విశేష లాభాలొస్తాయి.దాంతో వాళ్లు ధనికులై విశేషంగా ధన కనక, వస్తు వాహనాలు సమృద్ధిగా సంపాదించి సుఖిస్తుంటారు. ఇదే వీరి వృత్తాంతం" అని చెప్పారు.

ఆ మాటలు విన్న రాజసంతతికి, వారి చర్యలు స్వలాభాపేక్షా పూరితంగా కనిపించాయి. ఇది సద్వ్యాపారం కానేకాదన్నారు. అక్కడ్నుంచి మరి కొంత దూరం వెళ్లేసరికి, ఒక వైష్ణవాలయం కనిపించింది. అక్కడ గోపురం- మంటపం - ప్రాకారం ఇవన్నీ చూసేసరికి బండిని ఆపించి ఆ గృహవిశేషాలు చెప్పమన్నారు. శిక్షకులు ఒక్కొక్కటీ చూపించి వివరిస్తూంటే, వాళ్లు ముగ్గురు ఆలయంలోనికి భక్తిగా వెళ్లారు. అక్కడున్న వైష్ణవ పూజారులు "విష్ణువు సర్వలోక వ్యాపకుడని, ఆయన్ని సేవించిన వారికి సిద్ధించని కోరికలంటూ ఉండవని" పల్కి వాటిని సమర్థించే శ్లోకాలు చదివారు. భక్తితో నమస్కరించి ఆ పూటకు సాయంకాలం కావడంతో, మిగిలిన విశేషాలు మర్నాడు చూడాలనుకుని వెళ్లిపోయారు.

తదుపరి దినాన వారిని శిక్షకులు శివాలయానికి తీసుకు వెళ్లి అక్కడ ధ్వజస్తంభం, లింగాకృతి, పానవట్టం మొదలైన వాటి గురించి చెప్పసాగారు. ఆలయపూజారులు శివుడే ప్రాచీనదైవం అన్నారు. రాజ సంతతి ముగ్గురికీ ఆ మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. రెండు నిజాలుండవు కనుక, ముందురోజు తమకు విష్ణువే దేవుడని చెప్పిన పూజారుల్ని తమతో అబద్ధం ఎందుకు కనుక్కుంటామని - వారినీ రమ్మని చెప్పి అక్కడ్నించి కదిలారు. దారిలో వారికొక దుర్గాలయం కినిపించింది. అక్కడ అమ్మవారి విశేషాలు వివరిస్తుండగా శాక్తేయులనబడే ఆ ఆలయపూజారులు, అందరికీ అన్నిటికీ మూలం ఆదిశక్తి అని, శివుడైనా -

విష్ణువైనా ఆమె మాయకు అధీనులై వర్తించేవారేనని చెప్పి, వారిని గందరగోళంలో పడవేశారు. ఏది సత్యమో – ఏది అసత్యమో తెల్చుకోపోయారా చిన్నవాళ్లు.

ఆ రాత్రి బుధవర్మ తన పిల్లల్ని లోకజ్ఞాన పరంగా ఏయే విశేషాలు చూశారని అడిగారు . వాళ్లు మూడు దేవతల ఆలయాలనూ తాము దర్శించిన వైనాన్ని చెప్పి "మనుషుల్లోలాగానే దేవతల్లోనూ పరస్పర భేదాలున్నాయా? వాళ్లలో ఎవరు చెప్పింది నిజం?" అని అడిగారు. పిల్లలైనా పిడుగులాంటి పెను సందేహమే వెలిబుచ్చారని రాజు సంతసించి "ప్రశ్నలే కదా తెల్సుకోవడం అనే జ్ఞాన సముపార్జనకు మూలం" అనుకుంటూ "బాలల్లారా! ఈ తగవులు చిరకాలం నుంచీ ఉన్నాయి. దైవమాయ అనబడే మోహం అటువంటిది. మహర్షులే దీన్ని తెల్చలేకపోయారు. ఎవరికి ఇష్టమైన దేవుని వారు కొలవడమే!" అని వివరించాడా తండ్రి.

అందుకా యువకిశోరాలు "అలాగా! అది తేల్చడం అంత జటిలమైనదా? అయితే అదేదో, దాని సంగతి చూడాల్సిందే! ఎవరికీశక్యం కాని ఆ పనిని మేంచేస్తాం! పట్టుదల ఉంటే సాధించలేని పని ఉండదుకదా! మతబోధకుల్ని రప్పించి నిగ్గు తేలుస్తాం!" అన్నారు ఉత్సాహంగా సరే! పిల్లవాండ్ర ముచ్చట నెందుకు కాదనాలి? అనుకొని , రాజు కూడా అందుకంగీకరించాడు

మర్నాడు వారు పట్టణంలో ఉన్న మత బోధకులనందరినీ అక్కడకు రప్పించి సభచేశారు. విష్ణువు, శివుడు, దుర్గలను అందరికంటె అధికంగా ఆ యా మతబోధకులు చెప్పడానికి వేదాలు – శాస్త్రాలు తప్ప ప్రత్యక్షంగా ప్రమాణమేదీ చూపించలేకపోయారు. ఆ పనిని తామే సాధించుకొనివస్తే అధిక ప్రజ్ఞావంతులమవుతాం అనుకొని మూడు మతాల వారూ చెప్పిన దివ్యక్షేత్రాలకు పోయి, అక్కడి మహాత్మ్యాలు చూసి, ఏ మతం గొప్పదనేది అప్పుడు తేల్చుకుందామనుకున్నారు.

"తండ్రికి చెప్తే వెళ్లనివ్వడు. కనుక మనం దేశాంతరాలు వెళ్లి ఒక ఏడాదిలో తిరిగొద్దాం! నువ్వు శివ క్షేత్రాలు చూసిరా! నేను వైష్ణవక్షేత్రాలను దర్శిస్తాను. ఒకరు చెప్పింది నమ్మకూడదు. మనకై మనం గ్రహించుకోవాలి. నీకు ఇష్టమేనా?" అని అడిగాడు బలభద్రుడు.

"నీ కేది ఇష్టమో, నాకూ అది ఇష్టమే! సరే కాని, ఈ రహస్యం మన చెల్లెలు సుభద్రకి మాత్రం చెప్పి పోవాల్సిందే! ఎందుకంటే ఇంతవరకు అది ఎన్నడూ మనల్ని వదిలి ఉండలేదు! మనం కనిపించకపోతే, ఏమైపోయామో అని విచారిస్తుంది" అన్నాడు కృష్ణుడు.

"ఔను!" అని అతడొప్పుకుని, చెల్లెలి దగ్గరకెళ్లి చెప్పగా ఆమె "ఇక్కడ మిమ్మల్ని విడిచి నేను ఒంటరిగా ఉంటానా? అమ్మా -నాన్నల దగ్గరకంటే మీదగ్గరే నాకు ముద్దు ఎక్కువ చెల్లుతుంది. అదీగాక నా జన్మను నేనూ సార్థకం చేసుకోదల్చాను. దేశాటనానికి నేనూ వెళ్లగలను. అంతగా అయితే మగ వేషం వేసుకు తిరుగుతాను" అని పట్టుపట్టింది సుభద్ర "సరే! నువ్వు శక్తి మహిమని స్వయంగా తెలుసుకొనే పనిలో ఉండు" అని ముగ్గురూ కావలసినంత ధనం రత్నాలు సిద్ధంచేసుకుని తల్లిదండ్రులకు తెలియకుండా మరునాడే బయల్దేరి వెళ్లిపోయారు. కొంతదూరం వరకు ముగ్గురూ కలిసివెళ్లి అక్కడ మూడు దారులు చీలి ఉండగా ముగ్గురూ మూడు దిక్కులకూ వెళ్లిపోయారు.

బలభద్రుడు మొట్టమొదట వేంకటగిరికి వెళ్లి అక్కడ పాపనాశనం, గోవర్ణం మొ॥ తీర్థాలలో స్నానం చేసి శ్రీవేంకటేశ్వరుని కొలిచి, ఆ క్షేత్రంలో అద్భుతాలన్నీ చూశాడు ఎక్కడా దైవశక్తి అతని ప్రత్యక్షానుభవంలోకి రాలేదు. అక్కడినుంచి కంచి తీర్థానికి వచ్చాడు. అక్కడి పుణ్యతీర్థాలలో స్నానం చేసి వరదరాజస్వామిని అర్చించి వైష్ణవులతో పలు ప్రసంగాలు జరిపాడు. నమ్మకం చిక్కలేదు అక్కడినుంచి శ్రీరంగం వెళ్లి భూలోక వైకుంఠంగా ప్రసిద్ధికెక్కిన ఆ దివ్యక్షేత్రంలో ఒక నెల రోజులు నివశించాడు. కావేరీ నదీ స్నానం - శ్రీరంగ నాయకుల సేవను నిత్యకృత్యంగా చేసుకున్నాడు. వైష్ణవులతో చర్చిస్తూ, మహిమలకోసం చూడసాగాడు. అలా ఎన్నెన్నో విష్ణుక్షేత్రాలు తిరిగినా, అతడికి హృదయానికి హత్తుకోగల ప్రత్యక్ష నిదర్శనమేదీ దొరకలేదు.

దాంతో అతడు విష్ణుభక్తుల్ని వేళాకోళం పట్టిస్తూ, ద్వారక వచ్చాడు. ఆ క్షేత్ర విశేషాలు చూస్తుండగా ఎవరో "అక్కడ చనిపోయిన వారి ఎముకల మీద శంఖుచక్ర గదల గుర్తులుంటాయి" అన్నారు. ఆ మాటల్లో నిజమెంతో

18

తెలుసుకుందామని, అతడు స్మశానానికి వెళ్లి ఎముకల్ని పరీక్షిస్తుండగా, సోదరుడైన కృష్ణుడు అదే దారిన గుర్రమెక్కి వస్తున్నాడు.

తమ్ముడ్ని చూసిన సంతోషంతో బలభద్రుడతనిని పిలిచాడు. ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అప్పుడు కృష్ణుడు "ఎక్కడెక్కడ తిరిగావు సోదరా? ఈ స్మశానంలో కూర్చొని ఏం చేస్తున్నావు? ఊళ్లోకి పోదాంపద! మన సుభద్ర కూడా రాత్రికి ఇక్కడికే రానున్నది" అన్నాడు.

"విష్ణుక్షేత్రాలు అన్నీ తిరిగాను. దైవశక్తి ప్రత్యక్షంగా నాకేమీ కనిపించలేదు. ఇక్కడ మరణించిన వారి ఎముకల మీద శంఖు చక్ర గదల గుర్తులుంటాయంటేనూ చూద్దామని ఇక్కడ తిరుగాడుతూన్నాను. ఇదిగో! ఈ గీతలు చూడు! ఇవి మామూలు ఎముకలు మీద ఉండే గీతల్లాగానే కనిపిస్తూన్నాయి తప్ప, విశేష చిహ్నాలేవీ కనిపించడం లేదు కదా!" అని వాటిని సోదరునికీ చూపించాడు. అతడూ పరిశీలనగా చూసి "నిజమా! ఇవి మామూలు గీతలే తప్ప ఇంకేం కావు" అన్నాడు.

ఇద్దరూ ఊళ్లోకి వెళ్లి, ఒక చోట బసచేశారు. తన సోదరుని విశేషాలు చెప్పమని అడిగాడు బలభద్రుడు – "తమ్ముడూ! ఇంత విస్తారమైన దేశంలో నీకేమన్నా మహిమలు తోచాయా?" అని.

అందుకు జవాబుగా కృష్ణుడు "అన్నయ్యా! నేను దేశమంతా ఉన్న శైవక్షేత్రాలు తిరిగిచూశాను. చివరికి అమోఘ పుణ్యస్థలిగా వాసికెక్కిన కాశీలో కూడా రెండు నెలలున్నాను. అక్కడ మరణించేవారికి తారకేశ్వరుడు చెవుల్లో తారకమంత్రం ఉపదేశిస్తాడని ప్రతీతి కదా! అందువల్ల కుడి చెవి పైకి వస్తుంది అని చెప్పగా పరీక్షించి చూశాను. జంతువుల కట్లా వస్తోంది. తర్వాత ఒక చార్వాకుడు కనిపిస్తే ఆయన్ను అడిగాను. అతడా మాటలకు 'అయ్యా! అది దైవమహిమకాదు. ఇక్కడ భూమిలోపల ఉండే ఉష్ణప్రభావం వల్ల మరణకాలంలో అవయవాలను అలా బిగిస్తుంది అంతే!" అన్నాడు తర్వాత హరిద్వారం వెళ్లాను. ఆ ప్రదేశం బాగానే ఉందిగానీ, దైవశక్తి ఏదీ గోచరించలేదు. అటు తర్వాత నేను గంగోత్రి వెళ్లాను. మన సుభద్ర నాకు అక్కడే కనిపించింది. శక్తి క్షేత్రాలన్నీ తిరిగానన్నది. దానికీ ఏ దైవశక్తీ ద్యోతకం

కాలేదు. మేము నీ జాడ తెలుసుకుని ఇంటికి పోదాం అని నిర్ణయించుకున్నాం! ఇది విష్ణుక్షేత్రం కదా! నీవిక్కడ దొరకవచ్చుననుకుంటూ తిరుగుతున్నాం! ఈ దగ్గర్లో ఏదో శక్తి క్షేత్రం ఉందంటే, చూసి రావడానికి వెళ్లింది మన చెల్లెలు" అన్నాడు.

అది విని బలభద్రుడు "తమ్ముడూ! అసలు ఏదీ లేని దాని కోసం వెతికి మనం వృధాగా శ్రమ పడ్డాం! గొప్పపని చేసి పేరు సంపాదిద్దామనుకున్నాం! కాని అంతా అబద్ధం! దేవుడనేవాడు లేనేలేడు. స్వభావం చేతనే ఈ ప్రపంచం సృష్టి - స్థితి - లయ వరుసగా పొందుతోంది. దీపం ఆరినట్లుగానే మనిషి మరణిస్తుంటాడు. పునర్జన్మలనేవి లేవు 'సుఖమన్నదే స్వర్గం. దుఃఖమన్నదే నరకం. ఆనందమన్నదే ముక్తి' అని సూక్ష్మంగా ఒక చార్వాకుడు చెప్పాడు. అదే నిజంలా ఉంది. ఈ క్షేత్రాలన్నీ దేవుడి పేరు చెప్పి డబ్బులాగడానికి పన్నే ఉపాయాలలాగ కనిపిస్తున్నాయి. నిజంగా దైవం మహిమ- అనేవి నాస్తి. అన్నీ కల్పితాలే!" అన్నాడు.

అంతలో సుభద్ర వచ్చి వాళ్లను కలుసుకుంది. ఆ రాత్రి వాళ్లు వివిధ ప్రాంతాలలో తమకు కలిగిన అనుభవాలు ఒకరితో ఒకరు ముచ్చటించుకుంటూ గడిపేశారు.

మరునాడు ఇంకా చీకట్లుంటూండగానే గుర్రాలెక్కి ఆ ముగ్గురూ తూర్పు ముఖంగా బయలుదేరారు. తెల్లవారుఝాము కావడం వల్ల నక్షత్రాల గుర్తుల్ని చూసుకుంటూ నడిపించసాగారు. ఎంతసేపు ప్రయాణించినా తెల్లవారడం లేదు. రాన్రానూ చీకటి మరింత చిక్కబడసాగింది తప్ప వెలుగుకానరావడం లేదు. ఇక త్రోవ కనిపించక గుర్రాలొక చోట ఆగిపోయాయి. దిగి నడుద్దామంటే - అంతా పొదలూ, తుప్పలూ, డొంకలమయంగా ఉంది. ఆకాశం వైపు ఎంత చూసినా వెలుగు జాడన్నదే కనిపించింది కాదు

బలభద్రుడు సందేహిస్తూ" తమ్ముడా! ఇదేమి ప్రళయం? మనం బయల్దేరి ఏడెనిమిది ఝాములకు పైనే అయిందని నా ఊహ. కాని తెల్లవారడమంటూ కనపడదేం?! ఇదేం స్వప్నం?" అన్నాడు.

"అన్నా! ఇది స్వప్నం అని ఎలా అనుకున్నావో నాకు అర్థం కావడం లేదు. ఇంతసేపు తెల్లవారకపోవడం అంటే ఇది ఇంద్రజాలం అయి ఉండాలేగాని యదార్థమై ఉండదు. అయితే ఇదేమిటో తెలుసుకుని తీరాలి" అన్నాడు కృష్ణుడు.

"ఇది మీరిద్దరూ చెప్పుకుంటున్నట్లు స్వప్నమో - ఇంద్రజాలమో కాదని నా ఊహ. దైవ మాయ అంటే ఇదే కాబోలు! మనం గతరాత్రే దేవుడు లేడనీ - వేద శాస్త్ర పురాణాలు అబద్ధాలనీ - పుణ్యతీర్థాలన్నీ కల్పనలనీ నిర్ధారణ కొచ్చాం! అంటే నాస్తికత్వాన్ని అవలంబించాం! దాంతో భగవంతుడు తన మాయ ఏమిటో చూపించడానికే మనల్ని ఇలాంటి చీకట్లోకి లాక్కొచ్చాడని నా అనుమానం. లేకుంటే - ఇంతసేపు ఎప్పుడన్నా చీకటిని చూడటమన్నది మన అనుభవంలో తటస్థించిందా? ఇప్పుడా మహానుభావుని ప్రార్థించడం కంటే గత్యంతరం లేదు" - అంది సుభద్ర.

అంత వరకు తాము భగవంతుని నిందించినందుకు పశ్చాత్తాపపడుతూ దేవుడ్ని స్తుతిస్తూ శ్లోకాలూ, ధ్యానస్తోత్రాలూ పఠించారు, వాళ్లు అలా చేతులెత్తి మొక్కుతూంటే, ఆకాశంలో ఒక మెరుపులాంటిది మెరిసింది. దాని కాంతిలో అక్కడకు దగ్గర్లోనే ఒక ఆలయం ఉన్నట్లు గుర్తించారు.

బలభద్రుడు లేచి "తమ్ముడా! దగ్గరలో ఒక దేవాలయం కనిపిస్తోంది చూశావా! నేను వెళ్లి అది ఏ దేవతదో తెలుసుకొని వస్తాను. వెలుతు రొచ్చేంత వరకు మనం అక్కడ విశ్రమిద్దాం!..." అని ఆ చీకట్లో తడుముకొంటూ నెమ్మదిగా ఆలయంవైపు పది అడుగులు వేశాడోలేదో.... అతడొక గొప్ప బిలంలోనికి జారిపోయాడు.

ఆ గోతిలో పడిపోతూ "హా కృష్ణుడా! హా సుభద్రా! చెల్లెలా! నేనీగోతిలో పడి జారిపోతూన్నా! ఇక నేను మీకంటికి కనిపించనేమో!" అంటూ కేకవేశాడు.

చటుక్కున తాము ఉన్నచోటు నుంచి కృష్ణుడూ - సుభద్రా లేచి అన్నకు చేయూత ఇద్దామని అటువైపు వెళ్లి వారు కూడా అదేగోతిలో పడిపోయారు. కాని వాళ్లు అన్నను కలుసుకోలేకపోయారు.

పాతాళ బిలం కథ

బలభద్రుడు పాతాళబిలంలోనికి స్మృతి లేని స్థితిలో పదిరోజులపాటు జారి–జారి చివరికొక కొండశిఖరం మీద పడ్డాడు. అప్రయత్న శ్రమవల్ల అతడికి పూర్తిగాకాక, కొంతవరకే తెలివి వచ్చింది. అక్కడ మెరిసే సోపానాలూ, నేలా ఎటు చూసినా రత్నాల కాంతులూ, నిర్మలమైన నదీ జలాలూ, చక్కని ఫలాల నందించే తరువులూ అన్నీ సగం తెలివిలోనే దర్శించాడు. పూర్తి తెలివొచ్చాక, ఆకలీ – దప్పికా తెలిశాయి. బడలిక తీరేలా ఆ చెట్ల పళ్లు తిని, దాహం తీరేలా నదీజలం తాగి ఓపిక తెచ్చుకున్నాడు.

అప్పుడతడికి తన సోదరుడూ – సోదరీ గుర్తుకొచ్చారు. భగవంతుడ్ని అలా నిందించడం వల్లనే కాబోలు... తమను దేవుడా గాడాంధకారం లోనికి నడిపించాడు. పోనీ! తాను ఈ బిలంలో పడిపోయినా, వాళ్లిద్దరూ అయినా ఇల్లు చేరి సుఖపడితే అంతే చాలు అనుకున్నాడు బలభద్రుడు.

ఇక ఇప్పుడు ఈ కొండమీది విశేషాలు చూడడం కన్న గత్యంతరం ఏముంది? అనుకుంటూ నడవసాగాడు. ఉన్నట్టుండి పెను ప్రభంజనం ఒకటి వీచింది. ఆ గాలివేగానికి, త్రిశూలధారులూ – రుద్రాక్షమాల ధారులూ విభూతిధారులూ లెక్కలేనంతమంది. తాటాకుల్లా కొట్టుకుపోసాగారు. వారు అలా ఎగిరిపోవడం చూసి "ఈ గాలికి పర్వతాలే ఎగిరిపోయేలా ఉన్నాయి. అదృష్టవశాన గాలి కొండ పక్కనుంచి పోతోంది. అదే ఇటువైపు వచ్చి ఉంటే నేనూ– ఈ కొండా కూడా దూదిపింజల్లా ఎగిరిపోయే వాళ్లం కదా!" అనుకొని ఆగాలి మరోవైపు వెళ్లిపోతూంటే, ఆపద తొలగిందనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. ఇంకొకవైపు వెళ్లి అక్కడి విశేషాలు చూడసాగాడు. అక్కడ ఒక చోట రాతిపలకల్తో ఏర్పాటైన ద్వారం గల గుహ కన్పించగా, సాహసించి అందులోనికి ప్రవేశించాడు. లోపల అంతులేనన్ని వింతలు. ఎవరూ లేని ఆ ప్రదేశంలో ఎన్నో అలంకరణలు. ఓ కల్యాణ మంటపం, రత్నస్తంభాలు, మంటపం మధ్యలో పెళ్లిపీట, ఎదురుగా పెళ్లికి తగ్గ సామగ్రీ, ఎటువైపు నుంచో మంగళవాద్యాలు వినిపిస్తూన్న శబ్దం... ఇవన్నీ అతడ్ని ఆశ్చర్యంలో ముంచేశాయి.

అక్కడ భూలోకంలో ఉన్న సంపదంతా కుప్పబోసినా, ఒక్క రత్నానికి తులతూగదు. అంత విలువైన రత్నాలు అక్కడున్నాయి. పెళ్లి వారెవరో... వాళ్లు గనుక తనను చూస్తే శపిస్తారేమో! ఎటుపోవడానికీ తోచక, ఏంజరిగితే అది జరగనీ అని సిద్ధపడిపోయాడు.

మంగళ వాయిద్యాలతో పల్లకీలోంచి దిగిన పెళ్లికూతుర్ని చూసి బలభద్రుడు కళ్లు తిప్పుకోలేకపోయాడు. అనంతమైన మోహాన్ని కలిగించేంత సౌందర్యం ఆమె స్వంతం. అంతటి అందగత్తెని పెళ్లాడే వరునిదే కదా భాగ్యం అనుకుంటూ– అతడెవరో చూద్దామని, కుతూహలంగా అటు వైపే చూడసాగాడు. ఇంతలో ఇద్దరు స్త్రీలు వచ్చి, పెళ్లికొడుకుగా అతడినే తీసుకువెళ్లి, మంగళస్నానాలు చేయించి ఆ పిల్ల పక్కన కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా పెళ్లి జరిపించేసి, వధూవరుల్ని ఏకాంతంగా వదిలేసి అంతా తప్పుకున్నారు. తన ప్రమేయమే లేకుండా అలా ఒక దాని వెంట ఒకటిగా జరిగిపోతూన్న ఆ సంఘటనలతో – అతడామెని ఎలా పలకరించాలో తెలీక "నీ పేరేంటి? ఎవరమ్మాయివి? ఈ లోకం ఏమిటి?" అని అడిగితే, ఆ సుందరి సిగ్గుతో కళ్లు వాల్చుకుందే తప్ప బదులు చెప్పదే! ఇంతలో ఒక సుడిగాలి మళ్లీ వచ్చింది. ఆమెను ముద్దు పెట్టుకోబోతూన్నవాడు చటుక్కున ఆమెను ఆ గాలి నుంచి రక్షించడానికి ఇంకో వైపు లాక్కుపోయానను కున్నాడుగాని, అది దూదిపింజలా అతడ్నెగర గొట్టి ఆకాశంలో గిరికీలు తిప్పించి చివరకోచోట దభీమని కుదేసింది. తీరా తెలివొచ్చి చూస్తే, అదంతా స్వప్నంలాంటి భ్రమ, తాను అక్కడే ఉన్నాడు. గుర్రాలూ అక్కడే ఉన్నాయి. సూర్యోదయం మెల్ల మెల్లగా అప్పుడే అవుతోంది.

'మహామాయలాంటి స్వప్నం' అనుకుంటూ "కృష్ణా!" అని పిల్చి నాలుగడుగులు వేయగా, కృష్ణుడు కనిపించాడు – ఓ చెట్టక్రింద నిద్రిస్తూన్న భంగిమలో. బలభద్రుడు లేపేసరికి "హా ప్రేయసీ" అంటూ పలవరించసాగాడు. "ఏమిటిది సోదరా? కళ్లు విప్పు! సుభద్రేదీ?" అని బలభద్రుడు అడగ్గా "ఎంతమోసం? అలాటి సుందరి నాకు దక్కునా?" అని ఇంకా రీతిగా పలవరిస్తూంటే గట్టిగా కుదిపివేసాడు బలభద్రుడు. తెలివిపూర్తిగా వచ్చాక, కృష్ణుడు తానెప్పుడూ అలాంటి వింత చూడలేదన్నాడు.

అదేమిటో చెప్పమని బలభద్రుడు అడగ్గా "రాత్రి చీకట్లో నువ్వు పాతాళబిలంలో పడిపోయేసరికి, నీ కేకలు విని నేనూ – సుభద్రా అక్కడికి పరుగెత్తుకొచ్చాం! మేం కూడా అందులోనే పడ్డాం! నువ్వేమైపోయావో మాకు తెలీదు. ఆ తర్వాతేం జరిగిందో చెప్తాను! విను!

అలా బిలంలోనికి ఎన్నాళ్లు, జారానో తెలీదు తెలివొచ్చి చూసేసరికి స్వర్గాన్ని తలపించే పట్టణంలో పడి ఉన్నాను. కర్ర ఎక్కడా కనిపించని రీతిగా మణి మాణిక్యాలతో కట్టిన మేడలే అన్నీ. ఆ పట్టణంలోని వారంతా సౌందర్యవంతులే! నేను పట్నంలో అన్ని మూలలూ తిరుగుతూన్నాను. ఇంతలో ఒక గొప్ప ప్రవాహం నా కళ్ల బడింది. అందులో తులసీమాలధారులు తిరుచూర్ణధారులు లెక్కలేనంత మంది వైష్ణవులు కొట్టుకుపోతూన్నారు. అడో తుదీ మొదలూ లేని ప్రవాహంలా తోచి, అది పొంగుతుందేమో అన్పించేసరికి నేనో వైపు తప్పుకొన్నాను.

ఒక వీధిలోంచి పోతూంటే, ఒక మేడలోంచి మంగళవాద్యాలు విన్పించాయి. లోపలికి తొంగిచూశాను. పెళ్లివేడుకలు. బంగారు బొమ్మలాంటికన్య. నన్నే పట్టుకుని ఆమె చెంత కూర్చోబెట్టి నాకు ఆమె ఉంగరం బహుకరించింది పెళ్లి జరిపించారు. ఇంతలో ఊరేగింపు కోసం తెచ్చిన ఏనుగు నన్నూ – ఆ పిల్లనీ ఎక్కించుకుని నాల్గు వీధులు తిప్పి తిరిగి ఆ ప్రవాహం దగ్గరకే లాక్కుపోయింది. తొండంతో అది ఘీంకరిస్తూంటే, జలప్రళయం వచ్చింది. మమ్మల్ని ముంచేసింది. ఒక చేప తనతోకతో నన్ను విసిరి కొట్టేసరికి నేనిక్కడున్నాను. ఆ అదిరిపాటుకు కళ్లు మూసుకొని ఉండగా నువ్వు పిల్చావు" అన్నాడు కృష్ణుడు.

"కొద్దిపాటి తేడాతో నాకు కలిగిన అనుభవం కూడా ఇలాంటిదే" అని, చిత్రాల్లోకం కథల్లో వున్నట్లే మనకు అనుభవం కావడం చిత్రం అన్నాడు బలభద్రుడు. చెల్లెలి కోసం ఆ పరిసరాల్లో వెతగ్గా, ఒక పొదలో ఆమె కన్పించింది. నీకు ఎలాటి అనుభవం ఎదురైంది అని అడగ్గా, ఆమె కూడా తాను అద్భుతలోకం చూశాననీ – ఒక అందగాడ్ని దరిచేరాననీ – తర్వాత చెప్పలేననీ సిగ్గుపడిపోయింది.

వాళ్లు ఆమెను సేద తీర్చి "నువ్వు చెప్పక్కర్లేదులే సోదరీ! మాకు కలిగిన అనుభవమే అటుఇటుగా నీకూ కలిగింది. ఇది యదార్థం కాదని మనం గ్రహించాలి. అలాగని భ్రమపడ్డామా అంటే అదీ కాదు... అదొక మహామాయా విలాసం! అది భగవంతునికి తప్ప అనితర సాధ్యం" అని సుభద్ర చెప్పలేక వదిలేసిన వృత్తాంతాన్ని తమ అనుభవాల దృష్ట్యా ఇద్దరూ పూరించి చెప్పేశారు.

అప్పుడు సుభద్ర తలూపుతూ "నిజంగా ఇది దైవమాయ తప్ప అన్యమైనదికాదు. దేవతలకే అర్థంకాని ఈ మాయా విలాసనం మనం తెల్సుకోగలమని బయల్దేరడమే మన అజ్ఞానానికి నిదర్శనం! సందేహాలు తీరాయి కనుక బుద్ధిగా ఇంటికిపోవడమే మంచిది" అనుకుని గుర్రాలెక్కి తమ పట్టణానికి బయల్దేరారు. సాయంకాలం వేళకు ఒక పల్లెకు చేరుకున్నారు.

తాము చూసిన విశేషాలు, స్వప్నమో - మాయో తెలీక ఆ అనుభవాలు పదిల పరుచుకోదలచి ఒక్కొక్కరూ పాతాళ బిలంలో తాము పడిన దగ్గర్నుంచి తమకు కలిగిన అనుభవాలను చిత్ర పటాలుగా చిత్రించారు. బలభద్రుడు తాను చూసిన పర్వత శిఖరం, గుహ, కల్యాణమండపం, తాను పెళ్లాడినకన్య, క్రీడాభూమి చిత్రించి కృష్ణునికీ - సుభద్రకూ చూపించగా కృష్ణుడు బంగారు మేడలూ, మదగజం, తాను పెళ్లాడిన కన్య బొమ్మగీసి అన్నకూ - చెల్లికీ చూపించాడు.

సుభద్ర ఒక అగ్ని జ్వాలా ప్రవాహాన్ని, ఒక ఉద్యానవనాన్ని తాను కలసిన సుందరాకారుడైన పురుషునీ పటంలో చూపించింది అన్నదమ్ములిద్దరికీ. అవి చూసుకుంటూ, మోహావేశంతో - విస్మయంతో ఆ పటాలు ఆయా ఘటనల్ని గుర్తు చేస్తూంటే అవే సంగతులు పిచ్చివాళ్లలా తల్చుకుంటూ కొంతదూరం ప్రయాణాలు సాగించారు.

కథ అంత వరకు చెప్పిన మణిసిద్ధుడు, అప్పటికే కాలాతీతం అయిందంటూ కథను ఆపి, తదుపరి కథ పై మజిలీలో ఇలా చెప్పడం మొదలెట్టాడు.

కాశీ మజిలీ కథలు

37 వ మజిలీ

గోపా–విను!...

ఆ ప్రకారం వాళ్ళు గుర్రాల మీద, తమ స్వదేశానికి ప్రయాణమై పోతూండగా, ఒకనాటి సాయంకాలానికి ఒక పట్టణానికి చేరుకున్నారు. దాని పేరు మధుమంతము. అక్కడొక సత్రంలో బసచేసి, ఆ సత్రం అరుగు మీద కూర్చున్నారు ముగ్గురూ. భోజనాలైనాక అక్కడ చేరిన కొందరు విద్యార్థులు తమలోతాము వారి గురించి మాట్లాడుకొంటూ 'ముగ్గురూ ఒకే లాగ ఉన్నారని– వాళ్లలో పెద్ద ఎవరో తల్లిదండ్రులే పోల్చుకోవడం కష్టమనీ– వారిలో రత్నహారం ధరించినవాడు పెద్దవాడై ఉంటాడనీ – అతడా హారం ధరించడం వల్ల హారానికే విలువ అబ్బిందనీ' చెప్పుకున్నారు. బలభద్రుడది అంతావిన్నాడు.

ఎప్పటిలాగానే తెల్లారుఝామున బయల్దేరబోయి, బలభద్రుని గానక ఎటుపోయాడనుకుంటూ కృష్ణుడూ – సుభద్రా కంగారు పడ్డారు. ఎంతగా ఆ చుట్టుప్రక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. బలభద్రునికోసం వెతుక్కుంటూ పదిరోజులు అక్కడే గడిపినా ప్రయోజనం లేకపోయింది. ఇక అక్కడ ఉండే కంటే వెతుక్కుంటూ వెళ్లడం మంచిదని ఆలోచించి, దారిలో కనబడ్డవాళ్లందర్నీ అడుగుతూ, ఒక రోజున చంద్రకాంతమనే రాజధానీ నగరానికి చేరుకున్నారాయిద్దరూ. అక్కడొక అవ్వ ఇంట్లో బసచేశారు.

ఆ సాయంత్రం వీధిలో చాటింపు వినబడింది. మర్నాడు దివాణంలో జరగబోయే సభ గురించిన చాటింపు అది. దాని గురించిన విశేషాలు

అవ్వను అడగ్గా "మా పట్నపురాజు కనకాంగదునికి లేకలేక కలిగిన పుత్రిక సువర్ణరేఖ. ఆమె అందం వర్ణనాతీతం. రాజామెకు స్వయంవరాన్ని ప్రకటించాడు. ఆమె అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన వారికి రాజ్యాన్నీ - తన పుత్రికనూ ఇస్తాడట! రేపు సభలో ఆ స్వయంవరం జరగవచ్చు!" అని చెప్పిందా అవ్వ.

మరునాడు సుభద్రకు సైతం చెప్పక, కృష్ణుడు ఆ సభకు వెళ్లాడు. దేశ దేశాల రాజకుమారులు ఆ సభకు వచ్చి కూర్చున్నారు. రాజపుత్రిక ఎటువంటి ప్రశ్న వేస్తుందో అనుకుంటూ ఎదురుచూడసాగారు.

రాజు అందర్నీ చూసి, రాకుమార్తె వేసే ప్రశ్న "నిన్ను తెలిసినవారు ఎందరు?" అని తెలిపాడు. "ఈ ప్రశ్నకు ఋజువుతో సహా సమాధానం రాసి ఇవ్వవచ్చు! మాకు ఆ జవాబు తృప్తి కలిగిస్తే, అది దృఢపరచుకోడానికి వాక్ రూపంగా సమాధానం చెప్పవచ్చు!" అని కూడా వివరించాడు.

రాజకుమార్తె అది తమ బుద్ధి బలాన్ని తెలుసుకోడానికి సంధించిన ప్రశ్న అని గ్రహించలేక, 'ఓహో! ఖ్యాతిగలవారికి చాలా మంది తెలుసు కనుక, వీరిలో ఎవరిని ఎక్కువ మంది ఎరుగుదురో వారికే తన కూతుర్నిచ్చి పెళ్లిచేస్తాడు కాబోలు' అనుకుంటూ - ఎవరికి వారే తమను ఎరిగిన వారు నాలుగు కోట్లు అనీ, ఐదుకోట్లు అనీ ఒకర్నిమించి ఒకరు రాసుకొనసాగారు. అందరికంటె తమ సంఖ్యపైన ఉండాలని 'పాతికకోట్లు నన్నెరిగిన వారే' అంటూ రాసుకొన్న వారూ ఉన్నారు. అయితే కృష్ణుడు ఇది బుద్ధిబలానికి చెందిన ప్రశ్న అని మొదటే గ్రహించేశాడు. ఇక్కడ నన్ను అనగా ఈ శరీరం అనికాదు అర్థం! మనస్సు అని నా మనస్సును నేను తప్ప ఎరిగివుండే వారెవరు? అందువల్ల "నన్ను నేను తప్ప ఇంకెవరూ ఎరగరు" అని రాశాడు.

కనకాంగదుడు, అందరి దగ్గర్నుంచీ సమాధానాలు రాసిన పత్రాలు అందుకుని పెదవి విరుస్తూ కృష్ణుడు రాసిన పత్రిక చదివి సంతోషించాడు. అది పుత్రికకు అంద జేశాడు. ఆమె కూడా ఆ జవాబు చూసి చాలా ఆనందించింది. "రాజపుత్రులారా! అమ్మాయి రాసి ముందే ఉంచిన సమాధానం అదుగో! ఆ పెట్టెలో ఉంది చూడండి! సరిగ్గా దాంతో

సరిపోయింది ఈ జవాబు. తనహృది తనకే సాక్షి. తనను బాగా ఎరిగినది తన హృదయమే! ఇతరులు తెలుసుకోజాలరు. మీలో ఎవరికీ ఈ ఊహ రానందుకు చింతిస్తున్నాను. మా రాజకుమారి ఈ కృష్ణుని వరించిందని చెప్పడానికి ఆనందిస్తూ, అతడ్ని అల్లుడిగా చేసుకుంటున్నాను" అని నిండుసభలో ప్రకటించాడు. అందరూ అతడ్ని ప్రశంసించారు.

కృష్ణుడా మాటలు విని "ప్రభూ! మీరు నన్ను అందర్లోన బుద్ధిమంతునిగా ప్రకటించి ప్రశంసించడమే నాకు గొప్ప సత్కారం, నాకీ వివాహ కాంక్ష లేదు. నేను ఆ కోరికతో సమాధానం రాయలేదు కూడ ఏదో దైవవశాన ఇక్కడి కొచ్చానంతే!" అన్నాడు.

ఆ మాటలు రాజేమీ పట్టించుకోకుండా "అవన్నీ రేపు ఆలోచిద్దాం!" అని అతడ్ని సగౌరవంగా విడిదికి పంపాడు. కృష్ణుడానాడు సభలో జరిగిన వృత్తాంతమంతా సోదరికి చెప్పి "నాకు రోజపుత్రికతో వివాహమట! కానీ నా మనసులో ఉన్న ప్రియురాల్ని కాక వేరే వాళ్లనెలా వివాహం చేసుకోను? నాకు అది ఇష్టంలేదు - మనదారిన మనం పోదాం పద! మన అన్న కూడా లేడిక్కడ" అన్నాడు.

"వద్దంటే బలవంతంగా కట్టబెట్టలేరుకద! రెండు రోజులు ఆగి చూసి వెళ్లిపోదాం" అందామె.

అక్కడ - రాజభవనంలో సువర్ణరేఖ తన ప్రాణ సఖి సునందగీసి ఇచ్చిన కృష్ణుని చిత్రపటాన్ని చూసి "ఇతడు అందగాడే! కాని ఏం చేయను? నేను కలలో వరించిన రాకుమారుడ్ని తప్ప ఇతడినెలా వరించేది?" అని దిగులు పడసాగింది. ఆ సాయంత్రం సునంద కృష్ణుడు చిత్రించిన సువర్ణరేఖ చిత్రపటాన్ని సంగ్రహించుకొచ్చి "అమ్మాయీ! నీ పంట పండింది. నీ చిత్ర పటం ఆయన దగ్గర ఉంది. అతడే స్వయంగా చిత్రించాడు. అదీగాక అతని వ్రేలికి నీ ఉంగరం ఉంది" అన్నది.

సువర్ణరేఖ ఆనందం పట్టలేక విరహంతో వేగిపోసాగింది. ఆమె విరహ వేదన చూడలేక, సునంద ధైర్యం చేసి మత్తు మందు సహాయంతో అతడ్ని సువర్ణ రేఖ రాజభవనంలోకి తెప్పించింది. కళ్లు తెరిచిన కృష్ణుడు

ఆశ్చర్యపోతూ, "పాతాళ బిలంలో నువ్వాప్రవాహంలో కొట్టుకుపోయి ఎటు చేరావు?" అని అడిగాడు.

"నాకు మాత్రం ఏం తెలుసు? దైవం ఏది తల్చుకుంటే, అది చెయ్యవలసిన వాళ్లమే కదా! మనం మళ్లీ కలుసుకున్నందుకు సంతోషించాలి" అన్నదామె. ఆ తర్వాత వాళ్ళిద్దరూ మదన క్రీడల్లో తేలి అలసిపోయారు. అతడు గాఢ నిద్రలో మునిగి ఉండగా, సునంద అతడ్ని మళ్లీ అతని నివాసానికి చేర్చింది. అయితే, అతడు రాత్రి నిద్రలో ఉండగా ఈ కలయిక జరిగినందున 'అదంతాకల' అనుకున్నాడు. వొంటిమీద చందన పుపూతలనూ – శ్రీగంధపు సువాసనలనూ చూసి అయోమయంలో పడ్డాడు.

సుభద్రను పిలిచి "చెల్లీ! వింతల మీద వింతలు కనబడుతూన్నాయి. మనం ఇక్కడుంటే రాజు పెళ్లిచెయ్యక మానడు. మనం రహస్యంగా పారిపోవాలి!" అన్నాడు. వాళ్లు ఆ రాత్రి ఎవరికీ తెలీకుండా అరణ్య మార్గాన నడిచిపోసాగారు. "అన్నా! మన మనసులు పూర్వం వలె మన అధీనంలో ఉండడంలేదు. ఎక్కడ్నుంచి ఎటు వెళ్తున్నామో తెలీడం లేదు. మర్చిపోయిన వస్తువును వెతుక్కుంటున్నట్లుగా తిరుగుతూన్నాం! నీ కేమైనా గుర్తు ఉన్నదా?" అని అడిగింది సుభద్ర.

"చెల్లీ! పాతాళబిలంలో పడింది మొదలు మన మతులు గతి తప్పాయి. ఒక్కొక్కప్పుడు అంతా జ్ఞాపకం వస్తుంది. అప్పుడు నీతో చెప్పాలనుకున్నవి అంతలోనే మరిచిపోతుంటాను" అన్నాడు కృష్ణుడు.

వాళ్లు ఆ అడవిలో మర్నాడు సాయంకాలం వరకు నడిచారు. ఏ వూరూ కనబడలేదు. చీకటి పడుతోందని కృష్ణుడు వేగంగా నడవడంతో, సుభద్ర వెనుకబడిపోయింది. ఒక చోట రెండు దార్లు కనిపించాయి. అన్న ఏ దారిన వెళ్లాడో తెలీక ఆమె అక్కడ ఆగి "అన్నా! అన్నా!" అని గట్టిగా పిలిచింది. కాని... కేవలం రాత్రి జరిగిన విషయాలే తల్చుకుని నడుస్తున్న కృష్ణుడికి ఆ పిలుపు వినబడలేదు. చాలా దూరం వెళ్లేవరకు చెల్లెలు వస్తోందో – లేదో కూడ గమనించలేదతడు.

అన్న ఏ దారిన వెళ్లాడో తెలుసుకోలేక సుభద్ర దేవుని తల్చుకొని ఒక దారి ఎన్నుకుంది. అది ఆమెను ఓ పెద్దరావి చెట్టు దగ్గరకు చేర్చింది. చీకటి పడటంతో, ఆమె దాని చెంతనే నడుం వాల్చింది. "మహారాజుల ఇంట జన్మించిన నేను దైవమాయ తెల్సుకుంటానంటూ బయల్దేరడం దేనికి? నన్ను ఈ అరణ్యంలో ఒంటరిగా పడేసిన ఆ పరమేశ్వరుడే నన్ను కాపాడుగాక!" అని బడలిక వల్ల నిద్రలోకి జారిపోయింది సుభద్ర.

బ్రహ్మరాక్షసుడి కథ

ఆ రావి చెట్టుమీద చాలా కాలం నుంచీ అయోముఖుడు అనే బ్రహ్మరాక్షసుడు నివశిస్తున్నాడు. అతనికి శివరాక్షసుడు - విష్ణురాక్షసుడు అని ఇద్దరు దూతలున్నారు. వాళ్లతో కలసి అతడా అరణ్యంలోని జంతువులన్నిటినీ స్వాహా చేసేస్తుండడంతో ఆ అడవిలో జంతువులు - పశుపక్ష్యాదులేవీ పేరుకైనా మిగల్లేదు. ఆ దారిన సాధారణంగా మానవ మాత్రులెవరూ వెళ్లరు. ఆ రావి చెట్టుకు మూడు యోజనాల మేరవరకూ జనావాసాలు లేవు. ఆ వేళ బ్రహ్మరాక్షసుడి కంటె ముందొచ్చిన శివ రాక్షస - విష్ణురాక్షసులు ఇలా మాట్లాడుకుంటున్నారు.

"అన్నా! మనయజమానుడింకా రాలేదు. ఆహార పదార్థాలు సిద్ధం చేశావా!"

"ఇదిగో! ఈ రాతి మందసాన్ని జంతువుల కళేబరాలతోనింపాను. నేను లేచిన వేళ బాగుండ బట్టి నరమాంసం కూడా దొరికింది"

"రోజూ ఈ రాతిపెట్టిని జంతువుల మాంసంతో నింపడమేకాక కనీసం ఒక్క నరమాంసం అయినా జతచేయాలట! అడవి అంతా ఖాళీ అయిపోయింది. వాటితో నింపడానికే కష్టంగా ఉంటే ఇంక నర మాంసమెక్కడ్నుంచి తేను? మనుషులీదారిని రావడం ఎన్నడో మానేశారు. ఏవి లేకున్నా నాకు దెబ్బలే కదా! అన్నా! నాకొకటి చెప్పు! వాడు బ్రహ్మ రాక్షసుడు. సరే! మనం శివ - విష్ణువులం కదా! అతడి కంటె మనమే ఎక్కువ మనం వీడికి సేవలు చేయడం ఏమిటీ?"

"త్రిమూర్తులలో బ్రహ్మ సంగతి కాదు మనం చూడవలసింది- రాక్షసుల్లో బ్రహ్మరాక్షసుడే అధికుడన్నది భేతాళుడి శాసనం. దాని క్కారణం అతడు భూత ప్రేతాది గణాలన్నిటికీ సార్వభౌముడు. ఎవరు ఎవర్ని సేవించాలి. అనే విషయమై ఆదిలో తగవులు చెలరేగినపుడే ఆ శాసనం చెయ్యబడింది. అసలు సేవకా వృత్తి అంటేనే కష్టం! వీడికి ఎక్కడెక్కడి వార్తలూ సేకరించి చెప్పే పని నామీద పడింది. నువ్వేనయం"

ఇంతలో అయోముఖుడు రావడంతో, ఇద్దరూ తమ సంభాషణ ఆపేసి, మర్యాదలు చెయ్యడంలో పడ్డారు. ఆ రాక్షసుడి ధాటికి రాతి పెట్టెతో సహా రావిచెట్టు కొమ్మలు విరిగి సుభద్ర పక్కనే పడ్డాయి. రాక్షసుడామెను చూస్తూ "నువ్వెవరు? ఈ కారడవికి ఎలా వచ్చావు? నీకు నా నివాసం ఇది అని తెలీదుకాబోలు" అన్నాడు.

తనకు ఎలాగూ చావు తథ్యం అని తెలిసి "మహాత్మా! నీకు నా దేహం ఆహారంగా చేసి కృతార్థుడిని కాదల్చుకున్నాను. నన్ను భుజించి నీ కోరిక తీర్చుకో" అంది ధైర్యంగా.

అందుకు బ్రహ్మరాక్షసుడు "నీ మాటలు చిత్రంగా ఉన్నాయి. నీ రూపం కూడా! పురుషవేషం దాల్చిన స్త్రీవా? నీ వృత్తాంతం వినాలని మాకు సరదాగా ఉంది" అన్నాడు. సుభద్ర తన కథ మొత్తం చెప్పి "స్త్రీగా దేశాటన చేయడం కష్టమని పురుషవేషం ధరించాను. పరోపకారార్థమే కదా మానవ జీవితం పరమార్థం చెందేది. నన్ను మీరు త్వరగా తినేసి స్వర్గానికి పంపండి" అని ప్రార్థించింది.

బ్రహ్మ రాక్షసుడు నవ్వుతూ "మేమెంత క్రూరాత్ములమైనా, మాకు మాత్రం హృదయం లేదనుకున్నావా? నిన్ను చూస్తే ఎందుకో జాలి వేస్తుంది. నాకోసం ప్రాణాలకు తెగించిన నీకు అభయం ఇస్తున్నాను. నీకేం కావాలో కోరుకో!" అంటూ ఆమెకు ఆలోచించుకోవడానికి సమయం ఇచ్చి చెట్టు మీదికి వెళ్లిపోయాడు అతడు.

అతడి దూత లిద్దరూ క్రిందికి దిగి వచ్చి "మా బ్రహ్మరాక్షసుడికి దయ కలగడం అనేదే చాలా అరుదైనదీ - నమ్మశక్యం కానిదీ అయిన విషయం. అతని బుద్ధి మారే లోపు ఏదో ఒకటి చప్పున కోరుకో!" అన్నారు.

"అయితే, నన్నీ అరణ్యం దాటించి, ఏదో ఒక దేశానికి చేర్చండి" అని వాళ్లతో అంది సుభద్ర - "ఈ మాత్రం కోరిక అతడ్ని కోరడం వృథా! నిన్ను క్షణంలో అలాగే మేం దింపుతాం! నువ్వు మాకో ఉపకారం చేసిపెట్టు! నీకేం కావాలీ అని అతడు అడిగినపుడు, నువ్వీరాతి పెట్టె కావాలని కోరుకో! దీన్ని రోజూ నింపే పీడ మాకు విరగడవుతుంది" అన్నారు వాళ్లు. సరే! అని బ్రహ్మరాక్షసుని అదే కోరిక కోరిందా పిల్ల

"అన్నన్నా! ఈమె అసాధ్యమైన కోరిక కోరిందే! ఇది అలనాటి హిరణ్యకశిపుని ఆహార పేటిక. ఎంతో శ్రమించి దీన్ని సంపాదించాను. ఎన్నో తరాల తరబడి అచ్చి వచ్చింది. దీనిలో వేసిన మాంసం ఎన్నాళ్లయినా తాజాగానే ఉంటుంది. అయినా మాట ఇచ్చాను కనుక తప్పను" అని తన దూతల్ని తోడిచ్చి పంపాడు ఆ రాతి మందసంతో సహా వాళ్లు ఆ పిల్లని అరణ్యానికి అవతల ఉన్న పల్లెలో దింపేసి "ఇక నీ దారిన నువ్వుపో" అనగా "అన్నలారా! ఇందులో ఏముందో చూడొచ్చా?" అనగా వాళ్లు మూతతీసి చూపించారు. అందులో ఒక పురుషుడు స్పృహతప్పి పడి ఉండగా, తనకోసం అతడి నొక్కడ్ని వదిలి పెట్టమని కోరిందామె.

రాతి పెట్టె పీడ విరగడ చేసినందుకు కృతజ్ఞతగా, వాళ్లు ఆమెకోసం ఆ చక్కని యువకుడ్ని వదిలేసి మిగిలిన జంతు కళేబరాలు శుభ్రంగా ఆరగించి, దాన్నోచోట పారేసిపోయారు.

సుభద్ర ఊళ్లోకి పోయి నలుగుర్ని ప్రార్థించి, వైద్యుని కూడ వెంట బెట్టుకొచ్చి అతనికి ఉపచారాలు చేయగా, అతడు లేచి కూర్చున్నాడు. అంతలో ఆమె అతడి ఉంగరం గుర్తుపట్టి ఆనాడు పాతాళబిలంలో నన్ను లాలించిన నా మానసచోరుడితడు కదా! దైవ ఘటన లెంత చిత్రంగా ఉంటాయి? అయ్యో! ఇతడికి ఇటువంటి అవస్థ ఎలా కలిగిందో! ఆ బ్రహ్మ రాక్షసదూతలు నన్ను ఆ రాతి పెట్టె కోరుకో మనకపోతే ఇతడు బ్రతికేవాడా?" అనుకుంది.

"అయ్యా! మీదే దేశం మీరెవరు? బ్రహ్మరాక్షస దూతలకు ఎలా చిక్కారు? మీ గాథ సవిస్తరంగా వినిపించండి" అని సుభద్ర కోరగా, తనకామె పరిచర్యలు చేసినందుకు కృతజ్ఞతలు చెప్తూ తన వృత్తాంతాన్ని వినిపించసాగాడు.

తదుపరి గాథను పై మజిలీలో మణిసిద్ధుడు చెప్పాడు.

కాశీ మజిలీ కథలు

38 వ మజిలీ

సుగుణసాగరుని కథ

గోపా! విను.... రాతి మందసంలోకి ఆ యువకుడెలా వచ్చినదీ సుభద్రకు ఇలా వినిపించసాగాడు– "నా జన్మభూమి కాశ్మీర రాజధాని విక్రమనగరం, మా తండ్రి పేరు విక్రమసేనుడు. నాపేరు సుగుణ సాగరుడు. చిత్ర కళతో సహా వేదశాస్త్ర పురాణ నానాభాషలూ నాకు తెలుసు! అవి చాలక ఇంకా కొత్త విద్యలు కూడా నేర్చుకోవాలన్న అభిలాష నాది! అయితే ఈ విద్యాసముపార్జనలో పడి, వివాహం పట్ల విముఖుడినైన నాకు, శృంగారం పట్ల మోజు కలిగించాలని మా తండ్రి ఆ దిశగా ఎన్ని ప్రయత్నాలు చెయ్యాలో అన్నీ చేశాడు.

ఒకనాడు నాకో చిత్రమైన కల వచ్చింది. ఒక సుందరి నా దగ్గరకొచ్చి నిలబడింది. నేనామెను శయ్యమీద చేర్చి ముద్దాడి అధరామృత పానం చెయ్యబోతూంటే, ఓ గొప్ప అగ్నిజ్వాల మమ్మల్నిద్దర్నీ ఎగరేసేసింది. ఆ తర్వాత ఆమె ఏమైందో తెలియలేదు. అది 'కల' అనుకుందామా అంటే, మేం మార్చుకున్న ఉంగరం నా చేతికి ఉంది. నేను అప్పట్నుంచీ మదన గ్రహ పీడితుడినైనాను.

పోనీ! దాన్ని కల అనుకుందామంటే, నా హృదయం ఎంతకూ అంగీకరించడం లేదు. ఆమెను వెతుక్కుంటూ ఓ రోజు వేకువ ఝామున ఎవ్వరికీ చెప్పకుండా, ఒక దారంట వెళ్లిపోసాగాను. నా సంకల్ప మేమిటో నాకు తెలీదు. అంతలో సాయంకాలమైంది. కన్నుగానని అందుడిలా నేనొక అడవిలో సంచరిస్తున్నాను. అంతలో భయంకరమైన రూపం - కొండంత ఆకారం కలిగిన భూతం ఒకటి నా దగ్గరకొచ్చి లేడిపిల్లని పులి ఒడిసి పట్టుకున్న చందంగా నన్ను పట్టుకుంది. నాకు భయంవల్ల స్పృహ తప్పింది. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నీ వల్లనే నాకా ఆపద తప్పింది అనుకుంటున్నాను. నాకు ఇంత ఉపకారం చేసిన నీ గురించి తెలుసుకోవడం నా కర్తవ్యం కదా!" అని తన వృత్తాంతం వినిపించాడా సుగుణ సాగరుడు.

ఆ కథ విని సుభద్ర మహదానందం చెందింది. అంతలో తేరుకుని అప్పుడే ఏమీ మాట్లాడకుండా తన మనోహరుడు అతడేనని ధృవపరచుకుని, స్నేహభావంతో దగ్గరకు తీసుకుని మృదువుగా కౌగలించుకుంది. అయితే ఆమె పురుషవేషంలో ఉన్నందున తన కథను అతనికి చెప్పకుండా, తాను ఆ అరణ్యంలో ప్రవేశించడం - బ్రహ్మ రాక్షసుడు తనని చంపబోగా, తాను ప్రదర్శించిన ధైర్యానికి అతడు వరమివ్వడం - తాను ఆ రాతిభోషాణాన్ని కోరుకోవడం వగైరా విషయాలన్నీ చెప్పింది.

సుగుణసాగరుడు 'అంత కథ నడిచిందా' అని ఆశ్చర్యపోతూ మృత్యుముఖం నుంచి తనను తప్పించిన అతడ్ని తన దేశం తీసుకెళ్లి ఇంకా ఎక్కువగా గౌరవించదలచాడు. అన్నల తోడు లేకుండా ఆ గ్రామాలలో - అడవులలో సంచరించే కంటే, అతడితో వెళ్లడమే క్షేమమని భావించుకున్న సుభద్ర అతనితో కలిసి, అక్కడకు వెళ్లడానికి సిద్ధపడింది.

కృష్ణుని కథ

అది అట్లుండగా, సుభద్రను వదలిపెట్టి, తాను ఏదో ఆలోచించుకుంటూ ముందు సాగిపోయిన కృష్ణుడికి, కొంత సేపటికి చెల్లెలి మాట జ్ఞాపకం వచ్చింది. అతడెంతో విచారిస్తూ అడవి అంతా ప్రతిధ్వనించేలా అరచి, ప్రతి సమాధానం రాక, అక్కడే ఒకచోట కూర్చున్నాడు.

ఇంతలో చీకటి పడింది. ఎటు వెళ్లాలో తోచక, తాను అక్కడే ఆ రాత్రి విశ్రమించి, తమ చరిత్రంతా తలుచుకుని ఆ రాత్రి భారంగా గడిపాడు. తమ అన్న మధుమంతంలోనే ఉన్నాడని బయల్దేరి కొన్నాళ్లకు అక్కడకు చేరుకున్నాడు.

అతడా పట్నపు వీధుల్లో సంచరిస్తూంటే, రాజ భటులు అతన్ని చూసి వంగి సలామ్‌లు చెయ్యసాగారు. సామంతులు కుశల మడిగారు. పౌరులు తనను వెన్నంటి తిరగసాగారు. అది అతనికి వింతగా అన్పించసాగింది.

అంతలో – ముఖ్యమంత్రికీ వర్తమానం తెలిసినట్లుంది....... అతడు హుటాహుటిగా వచ్చి "మీరు పరదేశస్తుల్లా తిరుగుతున్నారేమిటి? మీరాక విని మీ మామగారు చాలా సంతోషంతో మిమ్ములను ఏనుగు మీద ఎక్కించి తీసుకురమ్మని నన్ను పంపారు. మమ్ముల్ని మర్చిపోయారా?" అంటూ ప్రశ్నించాడు.

దాంతో అతడు తెల్లబోయి "మామగారెవరు? మీ మాటలు నాకేం కావడం లేదు" అన్నాడు. అప్పుడా మంత్రి "అయ్యా! ఇది మధుమంతమనే పట్నం. ఈ పట్నం రాజుగారు మీ మామగారు. వారి కుమార్తె రత్నమాలని మీరు వివాహమాడారు. నేను ఆయన మంత్రిని. మీకూ – మాకూ ఉన్న బంధుత్వం ఇదే! త్వరగా పోదాం పదండి" అన్నాడు.

"మీరు నన్నె వరిని భావిస్తున్నారో నాకు తెలీదు. నాకీ వైభవంతో పనిలేదు. వెళ్లండి!" అన్నాడు కృష్ణుడు. మంత్రి, రాజుగారి దగ్గరకెళ్లాడు. "దేవా! అల్లుడుగార్ని ప్రార్థించాను. ఆయన కెందుకు కోపం వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఎన్నడూ ముఖమే ఎరుగని వారిలా మాట్లాడారు తాము వెళ్లి పిలిస్తే వస్తారేమో!" అన్నే సరికి రాజుగారే బయలుదేరారు.

కృష్ణుడు ఒక మఠంలో ఉండటం చూసి "అయ్యా! మేమేమి తప్పుచేశాం? మా ఇంటికి దయచెయ్యక ఈ మఠాల వెంట తిరగడం ఏమిటి? పదండి" అనేసరికి, వారు భ్రాంతి పడుతున్నారని - తాను వారి అల్లుడ్ని కాననీ చెప్పాడు కృష్ణుడు. దాంతో రాజు తమ కులాన్ని అతడు శంకిస్తున్నాడని - శత్రువు వెవరో అతనికి ఏవేవో నూరిపోసి వుంటారు' అని భావించి, ఆయన మళ్లీ కృష్ణుడ్ని ప్రాధేయపడ్డాడు.

కృష్ణుడు చిరాకుపడుతూ, అక్కడ నుంచి పోబోతే, అతని చేతులు పట్టుకొని "నువ్వు కోపిస్తే మాత్రం నిన్ను పోనిస్తామా? మా తప్పులు మన్నించు" అంటూ ఒక పల్లకి ఎక్కించి బలవంతంగా కోటలోకి తీసుకు వెళ్లిపోయాడు.

ఆనాటి సాయంకాలం రత్నమాల ఉండే అంతఃపురానికి అతడ్ని తీసుకెళ్లారు. ఆమె చక్కగా అలంకరించుకొని, అతనికి ఎదురు వచ్చి కాళ్లు కడగబోతే, అతడు వారించాడు. ఆమె అతడ్ని పరిశీలనగా చూసి "నామీద మీకెందుకు కోపం వచ్చింది? నేనేం తప్పు చేశాను? మా తండ్రికి ఇంకొక అల్లుడున్నట్లుగా సూచించారట! మీ వంటి వారే అలా అంటే అది నాకు హృదయంలో శూలం గుచ్చినట్లుకాదా!? మీరు వెళ్లింది మొదలు నిద్రాహారాలు మానేసి, మీ కోసమే చింతిస్తున్నాం! మావల్ల తప్పు ఉంటే అదేమిటో చెప్పి దండించాలి. అంతేగాని ఊరకే కోపగిస్తే నేనేం చెయ్యగలను?" అని అడిగింది.

"సాధ్వీ! నీ పతి భక్తి అమోఘమే! కాని నన్ను మును పెక్కడ చూశావు? నన్నెప్పుడు పెళ్ళాడావు? నువ్వూ- మీ తండ్రీ - మంత్రి అంటున్న మాటలు నన్ను పిచ్చివాడిని చేస్తున్నాయి. నువ్వు నన్నెరిగిన గుర్తులేమైనా ఉంటే చెప్పు!" అన్నాడు కృష్ణుడు.

"ఈ ఊరి సత్రంలో ఉన్నప్పుడు, నాచిత్రం మీదగ్గర ఉండగా మీరు చేసిన చర్యలు గుర్తున్నాయా? అప్పుడు పిచ్చివాడిలా పలవరించిన మీరే ఇలా అంటున్నారా?.....' అంటూ మొదలుపెట్టి వివాహం దాకా గుర్తు చేసిందామె. అయినా తాను అవేవీ ఎరుగననడంతో, రతిక్రీడానంతరం అతడు చదివిన పద్యం గుర్తుచేసిందిలా...

చ. అమరులు దానవు ల్గలసి అంబుధి న్మథియించి కన్నయ
య్యమృతముకన్న చాల రుచి యౌజుమీ నీ యధరామృతంబయో
రమణి యొకింత గ్రోలిన భరంబగు తాపము బాసె మేనితా
పము హరియించె బుద్ధి పరిపాటి వహించె గుణంబహో సఖీ!

అని మెచ్చుకుంటూ పద్యం చదివారే!" అని కూడా చెప్పింది.

అతడు చెవులు మూసుకొని "శివశివా! నాకేం జ్ఞాపకం లేదు. నువ్వెవరో ఎరుగను. నన్ను వదిలి నీ శీలం కాపాడుకో" అని పలికేసరికి ఆ చిన్నది ఏడుస్తూ అతని పాదాలమీద వాలిపోయింది.

అప్పుడతడు "పరస్త్రీ సంగమపాపానికి నేను ఒడిగట్టను" అంటూ అతడామె పాదాల మీద పడేసరికి, చెలికత్తెలు అది చూసి, "ఇతనికి మతి చలించింది. కనుకనే ఇలా అంటున్నాడు. చికిత్స చేయించాల్సిందే. నెమ్మదిగా ఆయనకే తెలుస్తుంది" అంటూ రాజుకు అప్పగించారు. వైద్యులు కొందరు అతడ్ని పరీక్షించి, పిచ్చి అనీ - పైత్యవికారం అనీ - పైశాచిక లక్షణమనీ రకరకాల చికిత్సలు చేయసాగారు.

బలభద్రుని కథ

గోపా! ఆ కథ అలా ఉండనీ!...

మధుమంతం అనే నగరంలో ఆ వేళ రాత్రి సత్రంలో బసచేసి ఉండగా కొందరు విద్యార్థులు పలికిన మాటలకు స్పందించిన బలభద్రుడు, కృష్ణ – సుభద్రలకు తెలీకుండా వారి వెంట వెళ్లి "రత్నమాల గురించి మీరు అనుకున్న సాంకేతికం ఏమిటో చెప్పండి" అని అడిగాడు. "రాజుగారి సత్రానికి వెళ్తే తెలుస్తుంది" అన్నారు వాళ్లు.

అతడా సత్రానికి వెళ్లగా అక్కడ కలలో తాను పెళ్లాడిన స్త్రీ చిత్రపటం ఉంది. కావలివారు అతడ్ని రాజుగారి దగ్గరకు తీసుకెళ్లగా – అక్కడనుంచి ఆయన తన కూతురు రత్నమాల దగ్గరకు పంపాడు. ఆ చిన్నది అతడ్ని గుర్తించింది. ఇద్దరికీ వివాహం జరిగింది.

ఆమెతో కొన్నాళ్లు సుఖంగా గడిపాక, తనవాళ్ల సంగతి గుర్తు కొచ్చి బలభద్రుడు ఎవరికీ చెప్పకుండా వారిని వెతుక్కుంటూ వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు అతడు చంద్ర కాంతపురం చేరుకోగా, అక్కడి వారు అతడ్ని కృష్ణుడనుకోసాగారు.

మధుమంతంలో కృష్ణుడికి ఎటువంటి అనుభవాలు కలిగాయో, అటువంటి అనుభవాలే ఇక్కడ బలభద్రునికీ కలిగాయి. పైగా పెళ్లి కాకుండానే తల్లిని చేసి, ఎటో వెళ్లి పోయాడన్న అపప్రధ ఒకటి అక్కడ వ్యాపించి ఉంది. అక్కడ రాజుగారి కూతురు సువర్ణరేఖ ప్రశ్నకు జవాబు చెప్పినది తన సోదరుడు కృష్ణుడే అయి ఉంటాడని పోలిక ఒకేలా ఉండడం వల్ల వారు అపోహపడటంలో తప్పు లేదనీ సువర్ణ రేఖకు పుత్రుడుదయించే నాటికి గ్రహించుకున్నాడు. బలభద్రుడు బహుశా తన లాగానే తమకోసం వెతకడానికి వెళ్లి ఉంటాడను కొని, ఆ రాజుకు సంగతంతా విశదంగా చెప్పి తీసుకొస్తానని శపథంచేశాడు.

తీరా బలభద్రుడు మధుమంతం వెళ్లేసరికి, అక్కడ రాజభటులు అతన్ని పట్టుకొని కారాగారంలో వేశారు. "నీకు పిచ్చి తగ్గేదాకా ఇంతే!"

అన్నారు వాళ్లు "నాకు పిచ్చేమిటి? రత్నమాలకు కబురు చెయ్యండి" అనే సరికి, ఆమె వచ్చింది. అప్పటికే కృష్ణుడి చర్యలు అక్కడ కథలుగా చెప్పుకుంటున్నారు. అంటే – 'అంతకు ముందే వచ్చిన తన సోదరుని చూసి వాళ్లు ఆ విధంగా పొరబడ్డారన్నమాట! అనుకొని, రాజుగారి దగ్గర కెళ్లి తానూ – తన సోదరుడూ ఒకే పోలికలో ఉండటం వల్ల జరిగిన పొర బాటు ఇది అని విశదంగా వివరించాడు. కృష్ణుడు పిచ్చికుదిర్చే వైద్యులనుంచి తప్పించుకుపోయాడు.

కొన్ని రోజుల తర్వాత విక్రమ నగరానికి చేరుకున్న బలభద్రునికి, కృష్ణుడు కనిపించాడు. అది సుగుణసాగరుని నగరం. సుభద్ర వరించిన వాడు అతడే! అక్కడ వారు ఆమెను కూడా కలుసుకోగలిగారు.

ఆమె తన మామగారికి అన్నదమ్ములిద్దర్నీ పరిచయం చేసింది. సుభద్రవల్లనే తమ వంశం నిలిచిందని చెప్పి, బలభద్ర – కృష్ణుల భార్యలను కూడా అక్కడకు రప్పించి కొన్నాళ్లపాటు అందర్నీ తనకు అతిథుల్ని చేసుకున్నాడా రాజు.

బుధవర్మ, తన సంతానం జాడ తెలియక, చాలా కాలం చింతపడి, వైరాగ్యంతో తత్త్వోపదేశంపొంది కాలక్షేపం చేస్తుండగా తన సంతానం తిరిగి తన కళ్లపడేసరికి మహదానందం చెందాడు. దైవమాయనెవరూ అతిక్రమించలేరని అందరికీ అర్థమైంది.

గోపా! నువ్వు చూసిన పాషాణ పేటిక సుభద్రచే రాక్షసుని దగ్గర్నుంచి పారవేయించబడిన భోజన పేటిక. ఆ నాడు శివ – విష్ణు రాక్షసులు ఇక్కడ విసిరేసినప్పుడు పడింది. దీని వృత్తాంతం ఇదే! నువ్వెప్పటికైనా కథ సాంతం చెప్పందే నన్ను వదలవని నాకు తెలుసు! పద" అని మణిసిద్ధుడు శిష్యునితో కూడా మరో మజిలీ చేరుకున్నాడు.

కాశీ మజిలీ కథలు

39 వ మజిలీ

ముప్పై తొమ్మిదో మజిలీలో, గోపాలుడు వింతల్ని చూసేందుకు అరణ్యంలోకి వెళ్లి, తిరుగుతుండగా ఒకచోట రెండు బారల పొడుగున్న ఒక దంతం కనిపించింది. అది అతడికి ఆశ్చర్యం కలిగించగా వాడు దాన్ని కావడి కఱ్ఱలా భుజాన వేసుకుని వచ్చి, గురువుగారి ముందు పెట్టి నమస్కరించాడు.

"గురువర్యా! ఇది రాతిదీ కాదు, లోహపుదీ కాదు. కఱ్ఱదంతం అంత కంటేకాదు చూడబోతే ఇదేదో పంటిదనిపిస్తోంది ఇంత దంతం కలిగిన ఆ జంతు వెంత ఉండాలి? దీని కథేమిటన్నది తెలుసుకోవాలని నాకేకాదు! మీకూ కుతూహలంగా ఉండకపోదు. మీ మణిని అడిగి నాకు దీని ఉదంతం సెలవివ్వండి అనగా సిద్ధుడు కూడా అంత దంతాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. భోజనం అయ్యాక ఒక చోట కూర్చొని మణిని పూజించి. దాని వెనుక దాగిన కథ ఇలా చెప్పసాగాడు...

కీర్తికేతుని కథ

ఈ భూమండలం మీద సకల సంపదలు కలిగిన ఉజ్జయినీ నగరం ఎంతో ప్రసిద్ధమైనది. విక్రమార్కుడు పరిపాలించిన రెండు వేల సంవత్సరాలలోను ప్రజలు ఎంతో సుఖజీవనం సాగించారు. అటువంటి ఉజ్జయినిని అతని తరువాత అతని పుత్రుడైన కీర్తికేతుడు పరిపాలించసాగాడు.

కాని అతనికి తండ్రి గుణగణాలుగాని, ఔదార్య శౌర్యాలు గాని రాలేదు. పూర్వాచారాలను ఆక్షేపించేవాడు. అందువల్ల అతడు సార్ధక నామధేయుడు కాదని - అపకీర్తికేతుడనీ కూడా అన్పించుకున్నాడు.

సింహాసనం అధిష్ఠించిన కొంత కాలానికి అతడు తన మంత్రులను సమావేశ పరచి "మన రాజ్యం వైశాల్యం ఎంత? ఆదాయ - వ్యయాలెంత? ఖజానాలో ధనం ఎంత ఉన్నది? మనం చెయ్యవలసిన కార్యక్రమాలేమిటి?" వివరంగా చెప్పమన్నాడు.

వాళ్లు ఒకర్నొకరు సంప్రదించుకుని "రాజా! ఇదిగో ఇదీ మన రాజ్యపటం. చాలా చిన్నది. ఈ దేశంలో సగం దేవాలయాలకూ - అగ్రహారాలకూ - సత్రాలకూ మాన్యాల రూపంలో చెంది ఉన్నది. మిగిలిన భూమి మీద వచ్చే ఆదాయం చాలా కొద్ది మొత్తం. ఖర్చుకి పరిమితి లేదు. ఐతే తమ తండ్రిగారు, కోట్ల కొద్దీ ధనాన్ని ఘడియలో ఆర్జించి ఇట్టే పంచి పెట్టేసేవారు" అంటూ విక్రమార్కుడి దానం, గుణగణాలు మరొక్కమారు ప్రస్తుతించారు. "మనం స్థాపించిన సత్రాలు ఇతర దేశాల్లో కూడా ఉన్నాయి. వాటిక్కూడా ధనం పంపుతూండాలి! దాన శాసనాలు ఇవిగో. వివరాలు ఉన్నాయి" అన్నారు.

"మా తండ్రి అలా రాజ్యం చేశాడా? ప్రభుత్వం నడిచేదే డబ్బుతో కదా! అంత విచ్చలవిడిగా ఖర్చుచేయడానికి కారణం మీరే అయిఉంటారు. పరిపాలన అంటే ధాన ధర్మాలేనా? ఎవరైనా సరేస్తుతి మొదలెడితే డబ్బు వెదజల్లేయడమేనా? నేను మా తండ్రిలా స్తోత్రాలకు ఉబ్బిపోయి అడగని

వాడిదే పాపం అన్నట్లుగా ఖర్చు చేయలేను. ఐహిక సుఖాలు త్యాగం చేయలేను. మా తండ్రి చాలా వెర్రి వాడిలా ఉన్నాడు. కోశాగారమంతా ఖాళీ చేశాడు. బ్రాహ్మణులకేం? ఏవేవో యజ్ఞాలంటారు యాగాలంటారు. అగ్రహారాలు దానంగా పొంది సుఖిస్తారు. ఇక మీదట అవేం చెల్లవు. అగ్రహార మాన్యాలకూ పన్నులు వసూలు చేయండి. ఏ విధంగానూ కొరగాని పండిత సత్కారాలు ఆపేయండి! ఖజానా నింపే మార్గం చూడండి! ఈ కొత్త శాసనాలు రేపట్నించే అమలు జరపండి" అని ఆజ్ఞాపించి కీర్తికేతుడు అంతఃపురానికి వెళ్లిపోయాడు

అవి తమకు ఎంతమాత్రం అంగీకారం కాకున్నా, ప్రభువు ఆజ్ఞకనుక అవి అమలు జరపవలసిందని తమ క్రింది స్థాయి అధికారుల్ని ఆదేశించారు. క్రమంగా ఆ వార్త కీర్తికేతుని పట్టపురాణి చారుమతి చెవిని చేరాయి. ఆమె చాలా పరితపించి "అయ్యో! బ్రాహ్మణ్ములు సుఖించలేని రాజ్యం ఒక రాజ్యమా? గో బ్రాహ్మణేభ్య శుభమస్తు నిత్యం –లోకా స్యమస్తా సుఖినో భవన్తు' అని కదా శాస్త్ర వచనం. అటువంటి భూలోక దేవతలుండే అగ్రహారాలకు పన్నులా? మా మామగారెంత ఉత్తములు? అటువంటి మహానుభావుడికి నా భర్త ఎలా జన్మించాడా? ఈ నికృష్టగుణాలీతనికి ఎలా వచ్చాయో!" అనుకుంటూ చాలా బాధపడింది. భర్తను ఈ విషయమై ప్రశ్నించి "మీరొక్కరే రాజ్యం చేస్తున్నారా? ఈ నీచపుబుద్ధి మానుకోండి! ధర్మకార్యాలు పూర్వంలా జరిగేలా చూడండి" అని ప్రార్థించింది.

దానికి అతడు అంగీకరించక "నువ్వు నాకేం చెప్పవద్దు. ధనం లేనిదే ఏ పనీ జరగదు" అంటూ విసుక్కున్నాడు. "పెరటిలో దేవతా వృక్షం ఉండనే ఉంది. మూడు తరాల వరకూ తరగనంత ఇచ్చే ఏర్పాటు ఆ మహానుభావుడే చేసి పోయాడు. ఇంకా దిగులేలా? ఈ దేవతా పూజలు మాన్పించనేల?" అంటూ ఇంకా సాగదీసిందామె. కీర్తి కేతుడు చిరాకు పడి "అన్నిట్లోనూ సలహాలు ఇస్తూండ వద్దు. ఆడ వాళ్లకీ రాజ్య వ్యవహారాలేమిటి?" అంటూ ఈసడించగా, ఆమె తనను తాను నిందించుకుంటూ అంతఃపురానికి వెళ్లిపోయింది. కీర్తి కేతుడు అక్కడ్నుంచి తన నివాసానికి వెళ్లిపోయాడు.

విజయభాస్కరుని కథ

చారుమతి చాలా ఉదాసీనంగా ఉండిపోయింది. ప్రతిరోజు పాఠశాల నుంచి ఇంటికొచ్చేసరికి ఎంతో ఆప్యాయంగా చేతులు చాచి ఎత్తుకొని ముద్దుపెట్టుకొనే తన తల్లి ఎందుకో ఆ రోజు పరధ్యానంగా ఉండడంతో, పదహారేళ్ల కిశోరప్రాయంలో ఉన్న ఆ బాలుడు, అదే విషయాన్ని తల్లి నడిగితే, ఆమె నిట్టూర్చింది.

కొడుకుని దగ్గరగా తీసుకుని "ఏం చెప్పేది నాయనా! మీ తాత గొప్ప ప్రసిద్ధుడు. అంతటి మహనీయునికి పుత్రునిగా జన్మించిన మీ తండ్రికి ఆ గుణాలేమీ రాకపోగా, పైగా ప్రజాపీడన అనే దుర్గుణం ఒకటి కొత్తగా మొదలైంది. అందుకే నా విచారం" అంది చారుమతి.

తండ్రి కీర్తికేతుని ధనకాంక్ష గురించి ఆ నూనూగు మీసాల నూత్నయవ్వనునికి తల్లి వల్ల తెలిసి "అమ్మా! నేను కొంచెం పెద్ద వాడినై, తాతగారిలా పేరు సంపాదించి నీకు సంతోషం కలిగిస్తానులే" అన్నాడు. తల్లి ఆ మాటలకు చాలా సంతోషించింది. ధర్మశీలి కాగలడని ఆమె ఆనందపడింది.

ఒక పక్క కీర్తి కేతుడు కల్పవృక్షంలాంటి దేవతా వృక్షాన్ని ప్రార్థిస్తూ ఖజానా నింపుతూంటే, చారుమతి పుత్రుని సహాయంతో ఖజానా నుంచి ధనం రహస్యంగా తెప్పించి పేదవారికి దానం చేయసాగింది.

పాఠశాలకు వెళ్లే పుత్రుని చేత ఆమె అలా దానం చేయించడాన్ని కీర్తికేతుని గూఢచారులు అతడి చెవిన వేశారు. దానికి తోడు బొక్కసంలో ద్రవ్యం తగ్గుతూండడం గమనించిన కీర్తికేతుడు, గట్టి నిఘా ఏర్పాటుచేసి తన పుత్రుడు ధనం పంచుతూండగా పట్టుకున్నాడు. తనకే స్వయంగా పట్టుబడిన కొడుకుకు తల్లి ప్రోద్బలం ఉందని గ్రహించిన కీర్తికేతుడు "ఇంత సొమ్ము ప్రతిరోజూ యాచకులపాలు చేస్తున్న వీళ్లు నాకు శత్రువులు కాక

ఇంకేమవుతారు? వీళ్లని శిక్షించాలి" అనుకుంటూ కొలువుకు వచ్చి మంత్రులతో సమాలోచనలు జరిపాడు.

ఇంతలో కొందరు భటులు ప్రభువు దగ్గరకు వచ్చి "స్వామీ! నమస్కారం! మేము దేవతా వృక్షానికి కాపలా వాళ్లం! ఇంతకు ముందు యువరాజుగా రొచ్చి, కల్పవృక్షానికి నమస్కరిస్తూ–

"అమర తరూత్తమంబ! నిను మన్మద భీష్టము దీర్ప నీకు స

త్వము గలదేని నా వలన దానములందిన యర్థులిప్పుడ

క్రమముగా శిక్ష నొందిరను కంప ద లిర్పగ వారి బ్రోచి కా

మ్యము లొనగూర్చి స్వేచ్ఛ జనుమా! కృపణత్వుల గొల్వ నేటికిన్"

అనే పద్యం చదివేసరికి ఆ వృక్షం రివ్వున ఆకాశానికి ఎగిరి మాయమైపోయింది. దాని స్థానంలో గొయ్యి తప్ప ఇంకేం లేదు" అన్నారు.

ఆ మాటతో కీర్తికేతుడు నిర్ఘాంతపోయి "క్రూరుడా! వంశనాశకుడా! ఎంత పని చేశావురా?" అంటూ, ఎన్నెన్నో ప్రణాళికలు రచించుకున్నందున అవన్నీ ఈ దెబ్బతో భగ్నమయ్యాయని శోకించాడు.

కొంతసేపటికి, ఆ కోపంలో "నాకు ఇంత అపకారం తలపెట్టి నా కలలు కల్లలు చేసిన ఆ తల్లీ కొడుకుల్ని అరణ్యాల్లోకి తీసుకెళ్లి చంపి పాతరెయ్యండి" అని ఆజ్ఞాపించాడు.

భటులు అంతఃపురానికి వెళ్లి, కొడుకుతో ముచ్చటలాడుతూ ఆనందంగా గడుపుతూన్న చారుమతితో, ప్రభువు విధించిన శిక్ష గురించి చెప్పలేక - చెప్పలేక చెప్పారు. వాళ్లందరికీ రాణీగారన్నా - యువరాజు విజయ భాస్కరుడన్నా అపారమైన గౌరవాదరాభిమానాలు "మంత్రులూ - పురోహితులు సైతం ప్రభువుకు అడ్డు చెప్తే ఏం ముంచుకొస్తుందోనని మిన్న కుండిపోయారమ్మా!" అని చెప్పి తలవంచుకున్నారు.

ఆ మాటలు వింటూనే మూర్ఛపోయిన తల్లిని సేదతీర్చి, వైరాగ్యం కలిగించే పలుకులు కొన్ని పలికి, ఆమెను ఊరడించాడు. రాజు క్రూరుడైనందున , శాసనం అమలు జరపక తప్పదని, శోకిస్తూనే భటులు ఆ తల్లీ – కొడుకుల్ని అరణ్యంలోకి తీసుకుపోయారు.

"నా ముద్దులకొడుకు మరణం నేను కళ్లజూడగలనా? నన్నే ముందు వధించండి" అని చారుమతి వాళ్లతో అంది. ఇంతలో గాండ్రుమంటూ బెబ్బులి వచ్చి, ఆ తల్లీకొడుకుల్ని వధించబోయిన భటుల్ని చంపి శవాల్ని పొదల్లోకి ఈడ్చుకుపోయింది. ఈ చిత్రం చూసిన విజయ భాస్కరుడు తల్లితో "అమ్మా! ఆయుఃశేషం ఉంటే. ఎవరూ ఏమీ చేయలేరనడానికి ఇంత కంటే ఉదాహరణ ఏది?" అన్నాడు.

అడవిలో క్రూరమృగాల బారి నుంచి రక్షించుకోడానికి, మరణించిన భటుడి దగ్గర్నుంచి ఓ కత్తి తీసుకుని, అడవిలో నడవసాగారా తల్లీ కొడుకులు. ఆ అరణ్యంలో ఎంత దూరం నడిచినా, ఒక చిన్న కోయగూడెమైనా కన్పించలేదు. చీకటి పడబోతుంటే కొన్ని పళ్లు తిని, ఒక పొదరిల్లు బాగు చేసుకున్నారు తల్లి నిద్రిస్తుండగా తాను కాపలా కాయసాగాడు. విజయభాస్కరుడు.

పాతాళగృహం కథ

అప్పుడు కొందరు మనుషులు వస్తున్న అలికిడి వినిపించింది. విజయభాస్కరుడు కదలకుండా అక్కడే నేలకు కరుచుకుని పడుకొని, ఎవరొస్తున్నదీ గమనించసాగాడు. పది మంది గల గుంపు ఒకటి ధనం సంచులతోను, పన్నెండేళ్ల పిల్లతోను అక్కడికొచ్చారు. ఆ చెట్టు దగ్గరగా వచ్చి "ఇదే! ఇదే!" అన్నారు – మూటల్ని దింపుతూ. ఆ చెట్టు మొదట్లో ఉన్న

తలుపు లాగారు. ఆ పిల్లనూ– మూటలనూ అందులోకి తీసుకుపోయారు. విజయభాస్కరుడు ఆలోచిస్తున్నాడు.

"వీళ్లు దొంగలు కావచ్చు! ఎవరిల్లు దోచారో?! ఆ గృహస్తుడెంత విచారిస్తున్నాడో – పాపం! ఆ పిల్ల ఎవరో! వీళ్ల గుట్టు తెలుసుకుందాం!" అనుకుంటూ లోపలికి తానూ దిగాడు మెట్లు కనిపించాయి. ఏముందో చూద్దాం అనుకుంటూంటే వాళ్ల మాటలు వినిపించాయి. పైకి వచ్చేసి దాక్కుని వాళ్ల మాటలు వినసాగాడు.

అందులోని కజ్జల ముఖుడితో నాయకుడు మాట్లాడిన దాన్ని బట్టి, లోపల శక్తి దేవత ఉందనీ, వాళ్లు దొంగలనీ, ఆమెను ఆ రాత్రికి బలి ఇద్దామనుకుంటున్నారని విజయ భాస్కరుడికి తెలిసింది. దొంగలు అందులోంచి బయట కొచ్చేసి వెళ్లిపోయాక, ఆ బాలికను కాపాడాలని నిశ్చయించుకుని లోపలకు వెళ్లాడు. అమ్మవారి విగ్రహం ముందున్న బాలికను కాపాడి బైటకు తీసుకొచ్చాడు. అప్పటికి తెల్లవారగా, మేలుకున్న తల్లికి ఆ బాలికను చూపించి, ఆమె కూడా రాజకుమార్తేనని చెప్పాడు.

ఆమె బాలికను ప్రశ్నించగా "అమ్మా! నాపేరు కలభాషిణి మహారాష్ట్ర దేశాధిపతి చంద్రగుప్త – సౌగంధికల పుత్రికని మీ మాటలను బట్టి మీరూ రాజులేనని తెలిసింది" అంది ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించడానికి నిర్ణయించుకుని, కొన్ని రోజులు ప్రయాణించి చంద్ర గుప్తుని నగరానికి చేరుకున్నారు. చాలా దూరం నడచి రావడం వల్ల ఓపిక లేక చీకటి పడుతూండగా ఒక బ్రాహ్మణుని ఇంటి అరుగు మీద నిద్రించడానికి ఉపక్రమించారు. ఆ ఇంట్లో వాళ్లు మాట్లాడుకుంటూంటే వింటున్నాడు విజయ భాస్కరుడు.

నిగమశర్మ కథ

ఆ ఇంట్లో వాళ్ల మాటలను బట్టి, తన తాతకు ఇతర దేశాలలోనూ ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయని అర్థమైంది - విజయభాస్కరుడికి. అలాగే ఆ ఇంటివాళ్ల దారిద్ర్యానికి ఎంతో విచారించాడు. నేను ఈ విప్రకుంటుంబానికి ఏం సాయం చేయాలా అని ఆలోచించసాగాడు. కలభాషిణి ఎలాగూ తన దగ్గరే ఉందికదా! తాను అప్పగించేబదులు, ఆ బ్రాహ్మణుడే అప్పగిస్తే వారికేదో బహుమానం రాజుగారివ్వకపోతారా? ఆ విధంగా ఆదుకోవచ్చునని గ్రహించిన విజయభాస్కరుడు, ఆ ఇంటి తలుపు తట్టి, ఆ బ్రాహ్మణునికి విషయం చెప్పి, కలభాషిణిని తీసుకొని రాజుగారి దగ్గరకు వెళ్లమని బహుమతి పొందమని చెప్పాడు.

బ్రాహ్మణుడు తన కొడుకును తోడిచ్చి కలభాషిణిని రాజుగారి దగ్గరికి పంపాడు. అయితే క్షత్రియోచితమైన మాటలేవీ ఆ కుర్రవాడి దగ్గర్నుంచి విన్పించకపోయేసరికి, తన కూతుర్ని తిరిగి తన దరిచేర్చాడన్న ఆనందం వల్ల కొంత పారితోషికం ఇచ్చి పంపేశాడు రాజు.

నిజానికి దొంగల బారినుంచి ఆ బ్రాహ్మణ యువకుడు తన కూతుర్ని కాపాడి ఉండడని, అసలు వారెవరో తెలుసుకోవాలని ఆయన ఉద్దేశం. ఆ ఉద్దేశం గ్రహించేసిన ఆ బ్రాహ్మణయువకుడు మాయమాటల్తో, విక్రమార్కమనుమడినీ - అతని తల్లి చారుమతినీ తన తల్లి సహాయంతో నూతిలోకి తోసేశాడు.

ఈలోగా కూతురివల్ల అసలు నిజం రాబట్టిన రాజు, బ్రాహ్మణునికేదో సాయందలచి బహుశా అలా చెప్పించి ఉంటాడని గ్రహించాడు. తీరా అతడొచ్చేసరికి ఆ తల్లీ -కొడుకూ నూతిలో తేల్తూ కనిపించారు. రాజు గబగబా వారిని పైకి తీయించి "మిమ్మల్ని ఇలా నూతిలోకి తోసిందెవరు?" అని అడిగాడు. అందుకు వారు ప్రమాదవశాన పడినట్లు చెప్పారేగాని, తాము ఏ బ్రాహ్మణునికైతే సహాయంచేసి దారిద్ర్య బాధ నుంచి

రక్షించదలచారో అతని పుత్రుని వల్లనే తమకీ ముప్పు వాటిల్లిందని మాత్రం చెప్పలేదు. ఆహా! ఔదార్యంలో విక్రమార్కునికి అన్ని విధాలా దీటైన మనుమడనిపించుకున్నాడు విజయభాస్కరుడు.

రాజు ఎన్నిసార్లు అడిగినా, విజయభాస్కరుడు ఒకే విధమైన సమాధానం చెప్పడం - కలభాషిణి వృత్తాంతం తనకు తెలీదనడంతో, బ్రాహ్మణ యువకుడు నిగమశర్మ పంట పండిందనుకున్నాడు. వారికి ఉపకారం జరగాలని మనసారా కోరుకున్న విజయ భాస్కరుడు, ఇక అక్కడ ఉండకుండా ఇంకో ఊరికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్లాగి నిగమశర్మ రాజు దగ్గరకు వెళ్లి "దేవా! తాము ఏమన్నారో, ఆ ప్రకారం జరిపించాలి. పుత్రికను అప్పగిస్తే ఆమె నిచ్చి పెళ్ళిచేస్తానన్నారు. అటువంటిది ప్రభువులు మీరే మాట తప్పితే ప్రజలేం చెయ్యగలరు?" అంటూ పాత పాటే పాడటం ప్రారంభించాడు.

ఆయనకు తెలుసు- నిగమశర్మ ఏమీ రక్షించలేదని. కేవలం బ్రాహ్మణాభిమానం వల్ల అతడు ఉపేక్షించాడు. అప్పటికీ ఆయన శాంతంగా "నీ మాటలు అసందర్భంగా ఉన్నాయి. నేను మా కలభాషిణిని అడిగితే- తనను రక్షించిన వాడివి నువ్వు కావని చెప్తోంది" అన్నాడు.

"నేను బ్రాహ్మణ కుమారుడిని కదా! నన్ను పెళ్లాడ్డం ఇష్టంలేక, ఆమె అలా అంటోందేమో! సరే! మీరే అడిగారు కదా- ఆమెని రక్షించాడంటున్న కుర్రవాడు మా ఇంటి వద్దే ఉన్నప్పుడు విచారించారు. ఆ కుర్రవాడు తనకేం తెలీదని ఊరొదిలిపోయి కూడా చాలా రోజులైంది..." అని కూడా నిగమశర్మ తనను తాను సమర్థించుకున్నాడు.

అప్పుడా రాజు ఇంకోసారి కూతురి దగ్గర కెళ్లి "అమ్మాయీ! ఈ నిగమశర్మ ఇట్లా అంటున్నాడు. నిజం చెప్పు" అని అడగ్గా "తండ్రీ! నేను నీతో అబద్ధమాడతానా? ఆ తల్లీకొడుకులతో కలిసి నాలుగురోజులు ప్రయాణం చేసి వచ్చినదానిని. ఆరోజు రాత్రి సత్రం అరుగు మీద పడుకొని, బ్రాహ్మణుల పంచన ఉండడం- వాళ్ల దారిద్ర్యం కళ్లారా చూడటం వల్ల,

అది తీర్చాలని - అందుకు ఏదైనా చేయాలని ఆ కొడుకు తల్లితో చెబుతుండగా నేను విన్నాను. ఆ తర్వాత నన్నీ నిగమశర్మ నీకు అప్పగించి ఏం చెప్పాడో-తర్వాత పరిణామాలేమిటో నేనేమీ ఎరగను" అంది కలభాషిణి.

రాజుకు కొంత అర్థమయి కొంత అర్థంకాక సందేహాస్పదంగా ఉండటంతో నిజం రాబట్టాలని రాజు గూఢచారుల్ని పెట్టాడు. ఆ సమయంలో నిగమశర్మ "నేను ఆమెకు తగని వాడినని రాజే, ఆ పిల్లచేత అబద్ధాలాడిస్తున్నాడు" అంటూ ప్రచారం చేయసాగాడు.

అది అలా ఉండగా-

ఆనాటి రాత్రి దొంగలు తమ గమ్యస్థానానికి వెళ్లి, తిరిగివచ్చి బాలికని బలి ఇవ్వజూశారు. ఆమె జాడ లేకపోయేసరికి, అక్కడ కనబడ్డ గుర్తుల్ని బట్టి "మన రహస్యస్థావరం సంగతి ఎవరికో తెలిసిపోయింది. ధనం ముట్టకుండా కేవలం బాలికనే తీసుకుపోయారంటే, వాళ్లకు సంబంధించిన బంధువులే ఎవరో అయి ఉండాలి. అందువల్ల వాళ్లెవరన్నదీ మనం కనుగొని, అంతం చెయ్యాల్సిందే! లేకుంటే మన రహస్యం బైటపడిపోగలదు" అనుకున్నారు.

వాళ్లు బిచ్చగాళ్ల వేషంలో బయల్దేరి, రాజధాని వీధులలో తిరగసాగారు. 'రాజుగారి కూతుర్ని దొంగల బారినుంచి తప్పించి అప్పగించినా, నిగమశర్మకి రాజు తాను ఆడిన మాట ప్రకారం ఏదీ చెల్లించలేకపోయాడు' అనే సంగతి ప్రచారంలో ఉన్నందున అదే తెలిసిందా దొంగలకు. అప్పుడు వాళ్లు మళ్లీ వేషం మార్చి, శ్రేయోభిలాషులైన పౌరుల్లా అతడి దగ్గరకెళ్లారు.

"నువ్వు వీరుడివి, శూరుడివి, ధైర్యవంతుడివి. రాజుగారి కూతుర్ని దొంగల బారినుంచి కాపాడిన ధీరుడివి, ధీశాలివి" అని పొగిడి "అవును గానీ - నువ్వంతటి సాహసాన్ని చెయ్యగా, రాజుమాట తప్పితే ఊరుకున్నావేం? నీ వీరత్వం ప్రదర్శించలేకపోయావా?" అంటూ మెల్లగా మాటల్లోకి దింపారు.

నిగమశర్మ కథ

"నేను ఊరుకుంటాననుకున్నారా ఏం? కొన్ని రోజులపాటు చూస్తానంతే!" అన్నాడు నిగమశర్మ బింకంగా. "ఆ దొంగల నివాస స్థానం ఏది? ఎక్కడ కనిపించారు నీకు?" అని వాళ్లు అడగ్గా "అబ్బో! అది చాలా పెద్ద కథ, ఇప్పుడు చెప్పడానికి నాకు తీరుబడి లేదు" అంటూ అక్కడ్నుంచి మహాధీరుడిలాగా వెళ్లిపోయాడు.

దాంతో తమ గుట్టు తెల్సుకున్నది వాడేనని దొంగలు అపోహపడి, వాడ్నే అమ్మవారి ముందు బలి ఇద్దామని నిశ్చయించుకున్నారు. ఆ రాత్రికే వాళ్లు సకుటుంబంగా అతడ్ని అపహరించి, తమ స్థావరంలోని మహాశక్తి మాత విగ్రహం ఎదుట కట్టి పారేశారు.

"ఓరీ! మా గుట్టు తెలుసుకుని, మా ఇంటనున్న బాలికను ఇక్కడ్నుంచి తప్పించావు. అమ్మవారికి నైవేద్యంగా తెచ్చినదాన్ని కాకుండా చేశావు. ఆ దేవత ఆహారం చెడగొట్టిన పాపం ఊరకేపోతుందా? మిమ్మల్నందరినీ బలిచ్చేస్తాం! మీ ఇష్టదైవాల్ని తల్చుకోండి!" అని కత్తులు ఎత్తేసరికి నిగమశర్మ గడగడ వణుకుతూ "బాబులారా! నేను నిజంగా ఏమీ ఎరుగను. ఒక చిన్నవాడు ఆమెను మా ఇంటికి తీసుకొచ్చి రాజుగారికి అప్పగించమన్నాడు. ధనాశ కొద్దీ నేనే ఆ పిల్లను తీసుకొచ్చినట్లు బొంకాను. అయితే ఆ రాచవారి చిన్నది, తన తండ్రితో నిజం చెప్పేసింది. అందువల్లనే కాబోలు ప్రభువుకు మా మాటలమీద నమ్మకం కలగలేదు. ఇది ముమ్మాటికీ నిజం, మేము నిరపరాధులం. మమ్మల్ని చంపకండి. రక్షించండి" అంటూ దీనాతిదీనంగా ప్రార్థించాడు.

ఇంతలో "వద్దు!వద్దు! వీరిని చంపకండి! నేను ఇక నుంచి మాంసం తినను. కందమూలాలే భుజిస్తాను. నా ఎదుట జీవహింస చేయకండి!" అని మహాశక్తి కూడా పలికింది.

దొంగలు కత్తులు అక్కడ పడేసి "మా తల్లి దయవల్ల మీరు బతికిపోయారు. మిమ్మల్నిక్కడ నుంచి కదలనివ్వక పశువుల్లా కట్టేసి మేపుతూంటాం" అని చెప్పి, అలాగే చేయసాగారు.

అంత వరకు చెప్పి - తరువాత కథను తదుపరి మజిలీలో చెప్తానన్నాడు మణిసిద్ధుడు.

40 వ మజిలీ

గోపా! వినుము......

అట్లా విజయభాస్కరుడు తల్లితో కూడ చంద్రప్రస్థనగరాన్ని విడిచి అడవి దారుల్లో పడి నడచి నడచి కొన్నాళ్ల తర్వాత చిత్రకూటం అనే అగ్రహారాన్ని చేరుకున్నాడు. ఆ అగ్రహారంలో అన్నివిద్యలూ శాస్త్రాలూ తెలిసిన బ్రాహ్మణ పండితులే ఉన్నారు. ఎంతో అలసిన విజయభాస్కరుడు ఒక ఇంటి వారిని ఆ పూట ఆతిథ్యానికి అర్థించాడు. ఆ ఇంటి ఇల్లాలు వారిని సాదరంగా ఆహ్వానించి, వంటకాలు ముగించి, స్నానార్థం చెరువు చూపించమంటూ విజయభాస్కరుని వెంట తన పుత్రుడు గుణసాగరుడనే వాడిని పంపించింది.

విజయభాస్కరుని తల్లి చారుమతిని, లోపలకు తీసుకెళ్లి అర్ఘ్యపాద్యాలు ఇచ్చి కూర్చోబెట్టింది. మాటల మధ్యలో తనకు ఎనిమిది మంది పిల్లలనీ, భర్త వేరే ఊరు వెళ్లాడనీ, ఆ అగ్రహారంలోని కెల్లా తామే పేద వాళ్లమనీ, పూర్వం ఎప్పుడో విక్రమార్క ప్రభువు దేశాటనం చేస్తూ ఒక విప్రుని ఇంట భోంచేశాడనీ, వారి ఆతిథ్యానికి సంతోషించి ఈ అగ్రహారం దానం చేశారనీ, ఆ పుణ్యాత్ముడిచ్చిన వేళావిశేషం వల్ల ఊరు పెరిగిందనీ, దీన్ని చిత్రకూటం అంటారనీ, తమకు భిక్షుకవృత్తి తప్ప ఏమీ రాదనీ చెప్పిందామె.

స్నానం చేసి వచ్చాక విజయభాస్కరుడు భోజనం కూడ ముగించి, విశ్రమిస్తూన్నవేళ తల్లితో రహస్యంగా "అమ్మా! ఈ అగ్రహారం తాతగారు ఇచ్చినదేనట! వీరి కుటుంబమే పేదదట! నన్ను చెరువుకు తీసుకెళ్లిన గుణసాగరునికి ఏడుగురు అన్నలుట!" అంటూ తనకు తెలిసిన సంగతులే చెప్పాడు. అవన్నీ తనకీ తెలుసన్నట్లుగా ఆమె తల ఊపింది. "ఉన్నంతలోనే పెట్టాలనుకొనే వీరి బుద్ధిని నిజంగా ప్రశంసించాలి. డబ్బులేనివాడ్ని, ఏమివ్వగలను వీళ్లకి" అని విచారిస్తున్న కొడుకును చూసి ఆ తల్లి "కాలమెన్నడూ ఒకే తీరుగా ఉండిపోదులే నాయనా! నీకు మంచి రోజులు రాగానే వీరిని జ్ఞాపకం ఉంచుకుని, ఉపకారం చేసి కృతజ్ఞత చెల్లించెదవు గాని" అని ఊరడించింది.

ఆ రాత్రి ఆ గృహయజమాని వచ్చి అతిథులెవరని అడిగాడు. పరదేశీయులు. పాపం! చాలా దూరాన్నుంచొస్తున్నట్టున్నారు అని చెప్పిందా ఇల్లాలు. "కావచ్చుగానీ, ఊళ్లో ఇంత మంది భాగ్యవంతులున్నారే! వాళ్ల ఇళ్లకు వెళ్లక మనలాంటి దరిద్రుల ఇల్లే వెతుక్కొని రావాలా? సరైన మర్యాదలేం జరుగుతాయి?" అని చింతించాడు. "పోనివ్వండి! ఇదీ ఆ భగవంతుడి పరీక్షే! వీళ్లు చాలా సజ్జనులు. సజ్జనులకు పెట్టగలిగిన భాగ్యం అందరికీ కలగొద్దా? అది సరే! మీరు మధ్యాహ్నానికే వస్తానన్నారు కదా! రాలేదేమి?" అని అడిగిందామె.

"కొండవీటిలోనే ఉన్నాను. నేను బయల్దేర బోతూంటే కొంతమంది రాజభటులు బంగారు విగ్రహాన్నొకదాన్ని వాయిద్యాలతో సహా ఊరేగిస్తున్నారు. ఆ విగ్రహానికి నవరత్నాలు పొదగబడి ఉన్నాయి! ఆ వింత చూస్తూ ఆగిపోయాను" అన్నాడా యజమాని

"ఆ విగ్రహం కథేమిటో తెలిస్తే చెప్పవచ్చుగా" అందా ఇల్లాలు. "తెలుసుకున్నాను. విను" అంటూ చెప్పసాగాడు గృహస్థు.

చంద్రావలోకుని కథ

ఇక్కడకు దగ్గర్లోనే రత్నకూటమనే నగరం ఉంది. ఆ నగరానికి రాజు చంద్రావలోకుడు. విద్యారూప, బల, యశస్సుల్లో అతనికెవరూ సాటిరారు. అతనికి చాలామంది భార్యలే ఉన్నప్పటికీ, చక్కదనంలోగాని - గుణ గణాల్లోగాని ఈడు-జోడు అన దగ్గ భార్య ఒక్కతె కూడా లేదు. అదొక్కటే అతని చింత.

ఆ మహారాజు ఒక రోజు వేటకు వెళ్లాడు. సింహ శార్దూలాది మృగాలు కొన్ని వేటాడాక, గుర్రమెక్కి దాన్ని అదిలించేసరికి, అది ఎక్కడా ఆగకుండా వాయువేగంతో పరుగులు తీసి మరో అడవిలోకి చేర్చింది. అంత వడిగా గుర్రం ఎన్నడూ తనను తీసుకెళ్లలేదు. ఆ వేగానికి అతడు కళ్లుమూసుకుని, గుర్రం ఆగాక కళ్లు తెరిచి చూడగా తాను ఒక సరస్సు తీరాన ఉన్నట్లు తెలుసుకున్నాడు.

చంద్రావలోకుడు గుర్రం దిగి, దానికి నీళ్లు తాగించి, తాను కూడా వేట అలసట తీరేలా స్నానం చేసి విశ్రాంతిగా అటూ-ఇటూ అక్కడే తిరుగుతూంటే, ఒక అందమైన స్త్రీ కనిపించింది. వికసించిన పువ్వులా, ఆభరణాలు ధరించి నిండుయవ్వనంతో ఉన్న ఆసుందరి అతనికి అమితమైన మోహాన్ని కలిగించింది. అతడామెను సమీపించి మధురంగా పలకరించి "ఈ అరణ్యంలో ఒంటరిగా సంచరిస్తూన్న నీవు ఎవరివి?" అంటూ ప్రశ్నించాడు, ఆమెకూడా అతని సౌందర్యానికి ఆకర్షితులైనప్పటికీ, నెమ్మదిగా అక్కడ్నుంచి తప్పుకోబోయింది. కాని చంద్రావలోకుడు ఆమె సఖి ద్వారా వివరాలన్నీ తెలుసుకున్నాడు.

ఆమె మేనక అనే అప్సరస కూతురు. పేరు ఇందీవరప్రభ. ఆ దేవకాంత ఆమెని కని అడవిలో వదిలేసి వెళ్లగా దేవవ్రతుడనే సిద్ధుడు ఆ పిల్లని చూసి జాలిపడి తన ఆశ్రమానికి తీసుకువెళ్లి పెంచాడు. ఆమె ఆ సరస్సులో స్నానం చేయడానికి వచ్చింది. ఆమెను పెంచిన సిద్ధుడి ఆశ్రమం అక్కడికి దగ్గరే!

చంద్రావలోకుని కథ

ఇందీవరప్రభ తనను ఇష్టపడుతోందని గ్రహించుకున్న చంద్రావలోకుడు ఆమెను ఎలాగైనా పొందాలని సంకల్పించుకున్నాడు. అందుకే ఆమె వెంట వెళ్లాడు. ఆమెను పెంచిన దేవవ్రతునికి నమస్కరించాడు. అతడు చంద్రావలోకుని క్షేమమడిగి "రాజా! మృత్యువంటే ప్రతి ప్రాణికీ భయమే కదా! నీ శౌర్యాన్ని ఆర్తజనుల రక్షణకోసం ఉపయోగించాలిగాని, నోరులేని జీవాల ఉసురుతీయడానికి వినియోగించడం ఎంతవరకు న్యాయమో నువ్వే ఆలోచించు! వేటవల్లనే కదా– పాండురాజు ఎన్నో కష్టాల పాలయ్యాడు. కనుక ఈ వ్యసనాన్ని మానుకో! ప్రజలు సుఖించేలా రాజ్యాన్ని పాలించు!" అని హితవు పలికాడు– సిద్ధుడు చెప్పినట్లే నడుచుకోగలనని - ఇక మీదట హింస చెయ్యనని చంద్రావలోకుడు ప్రమాణం చేశాడు.

"నువ్వు ప్రాణులకు అభయమిచ్చావు కనుక, నీమీద నాకు అనుగ్రహం ఏర్పడింది. నువ్వేం కావాలన్నా ఇస్తాను. కోరుకో" అని పలికిన ఆ సిద్ధ పురుషునితో "మహాత్మా! తాము పెంచి పెద్దజేసినప్పటికీ ఆడపిల్లని ఎప్పటికైనా ఒక అయ్యచేతిలో పెట్టవలసిందేకదా! మీకు ఆనందం కలిగించిన వాడినే అయితే నాకు ఈ ఇందీవరప్రభ నిచ్చి పెళ్లి చెయ్యండి! నాకు ఇంతకంటే ఏ కోరికా లేదు" అన్నాడు రాజు. సిద్ధుడు అందుకు అంగీకరించాడు. ఆమెని అతడి అధీనం చేశాడు.

చంద్రావలోకుడు గాంధర్వ విధిన ఇందీవరప్రభను వివాహమాడి, భార్యను గుర్రం మీద ఎక్కించుకుని తన రాజధానికి ప్రయాణమై– దారిలో చీకటి పడటంతో ఒక రావి చెట్టు దగ్గర విశ్రమించడానికి నిర్ణయించుకున్నాడు. పండు వెన్నెల రేయి కావడంతో, ఇద్దరి మనసుల్లోను మన్మథుడు సందడి చేశాడు. ఆ అడవిలో దొరికిన రకరకాల పూలు తెచ్చి పడక ఏర్పాటు చేసుకుని కొత్తభార్యతో తనివితీరా రతిసుఖం అనుభవించాడా రాజు.

తెల్లవారి, ప్రయాణమై వెళ్లబోతూంటే, ఆ రావిచెట్టు దగ్గర్నుంచి ఒక కంచుకంఠం "ఓరీ దురాత్మా! నేను భేతాళుని ప్రధానకింకరుడిని. జ్వాలా ముఖుడనే బ్రహ్మరాక్షసుడ్ని. ఈ రావిచెట్టు నా చిరకాల నివాసం, ఇక్కడకు రావడానికి దేవతలే సంకోచిస్తారు. అటువంటిది నీవు ఎలాంటి వెరపు లేకుండా ఇక్కడికి రావడమేగాక, నీ భార్యతో హాయిగా సంగమసుఖం

అనుభవించావు. ఇంతకంటే అపరాధం ఇంకొకటిలేదు, నువ్వు నా పట్లచూపిన అవిధేయతకుగాను –కామంతో కళ్లు కప్పుడిపోయి. అపచారం చేసినందుకుగాను నీ గుండెలు చీల్చి రక్తం తాగుతాను" అంటూ హుంకరించాడు.

చంద్రావలోకుడు గజగజ వణుకుతూ "మహాత్మా! ఇది నేను తెలీక చేసిన అపరాధమే తప్ప తెలిసి చేసినది కాదని ముందుగా మనవి చేస్తున్నాను. నాకు సాయంకాలపు చిరుచీకట్లలో ఈ ప్రాంతాన్ని పరిశీలించే అవకాశం కలగలేదు. నన్ను మన్నించు! నేను నీ అతిథినే అనుకో! నీ అతిథి చేసే అపచారాన్ని క్షమించి, అభయం ప్రసాదించు! నువ్వేం కోరితే అది చేస్తాను" అన్నాడు.

అప్పుడు బ్రహ్మరాక్షసుడు కొంచెం శాంతించి "రాజా! నీ వినయవిధేయతలు నన్ను ఆకట్టుకున్నాయి. వివేకవంతుడై ఉండి పదహారేళ్ల వయస్సున్న బ్రాహ్మణకుమారుడొకడిని పట్టుకొనిరా! వాని తల్లితండ్రులు అతడి కాళ్లు చేతులు పట్టుకొని ఉండగా, అతని శరీరం నరికి నాకు అర్పించు! అప్పుడు శాంతిస్తాను. గడుపు కేవలం 20 రోజులేనని గుర్తించు! ఇది తప్పితే నీకు నా వల్ల హాని తప్పదు. నిన్ను సకుటుంబంగా నాశనం చేస్తాను" అనేసి అంతర్ధానమైపోయాడు.

అప్పుడు చంద్రా లోకుడు "అయ్యో! ఈ వేట వ్యసనానికి లోబడి నేనెందుకు రావాలి? వచ్చిన వాడ్ని నా పని చూసుకోక, ఈ సుందరాంగిని ఎందుకు చూడాలి? చూసినా, ఈమెను నేనేల కోరాలి? కోరినవాడిని – ఇల్లు చేరేలోగా ఎందుకు తొందరపడాలి? ఇదంతా నా మరణానికే దారి తీసేలా ఉంది. రాక్షసుడు కోరిన రీతిలో బలికావడానికి ఏ పుత్రుడైనా – ఏ తల్లిదండ్రులైనా సమ్మతిస్తారా?" అంటూ రకరకాలుగా విచారిస్తూ ఇంటి దారి పట్టాడు.

ప్రభువు నూతన వధువుతో వస్తున్నాడని విని, ప్రజలు సామంతులు, మంత్రులు ఎంతో సంతోషంతో స్వాగత సంబరాలు జరిపారు. కాని అవేవీ అతనికి ఆనందాన్నివ్వలేదు. తమప్రభువు ఇంత విచారంగా ఉండడం ఎన్నడూ ఎరుగని మంత్రులు ఆశ్చర్యపోయి, విషయం చెప్పమన్నారు. అంతా విన్న మంత్రులలో సుమతి అనే ప్రధాని రాజుని ఓదార్చాడు.

హేమ విగ్రహం కథ

సుమతి రాజుతో ఇలా అన్నాడు....

"దేవా! ధనానికీ సాధ్యం కానిదంటూ ఏదీలేదు. తగినసొమ్ము వ్యయం చేస్తే, అటువంటి బ్రాహ్మణపుత్రుల్ని వందమందిని తీసుకొని రావచ్చు!" అంటూ, చంద్రావలోకుని ఒప్పించాడుట.

బంగారపు పని చేసేవారిని రప్పించి, నూరు కిలోల బరువు గల బంగారంతో ఒక విగ్రహం చేయించారు. దానికి నవరత్నాలు పొదిగేలా చేశారు. ఆ విగ్రహం కళ్లు మిరుమిట్లు గొల్పేలా ఉంది. దాని కుడిచేతిలో ఒకదానపట్టా రాసి ఉంచారు. "ఎవరైనాసరే – తమ కుమారుడ్ని తమ సమక్షంలోనే బ్రహ్మరాక్షసుడికి బలి ఇచ్చేవారికి నూరుగ్రామాల మాన్యంతోబాటు ఈ విగ్రహం కూడా అందజేయబడుతుంది" అని ఆ పట్టాలో రాసి ఉంచారు. సుమతి ఆ పసిడి విగ్రహాన్ని అగ్రహారాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అక్కడమాత్రమే ఊరేగించమని ఉత్తర్వుఇచ్చాడు.

ఆ మాటలనే అక్కడ డప్పు వాయిస్తూ చెపుతున్నారు. నేను నిన్న అక్కడ–అక్కడ అగ్రహారాల్లో అది తిరగడం చూశాను. కొండవీటి కూడా ఆ విగ్రహం ఊరేగించినప్పటికీ అక్కడెవరూ తమ కొడుకుని బలివ్వడానికి ముందుకురాలేదు. మన వూళ్లో కూడా ఆ స్వర్ణ విగ్రహం ఊరేగించవలసిందని భటులకు చెప్పాను. నేడో – రేపో వాళ్లూ ఇక్కడికొచ్చి విగ్రహాన్ని ఊరేగిస్తే నువ్వూ చూడొచ్చు! నవరత్నాలు పొదిగిన ఆ బంగారు విగ్రహం, ద్రవ్యంలో కొన్ని లక్షల విలువ చేస్తుంది. అదిగాక వందగ్రామాల మాన్యం అంటే.... తరతరాలు కూర్చొని తిన్నా తరగనంత! ఓ మాటంటాను. వింటావా? మన గుణసాగరుడు ఎందుకూ పనికిరానివాడిగా తయారయ్యాడు. పుత్రులంటే పూర్వజన్మ శత్రువులని శాస్త్రవచనం. కొరగానికొడుకు కన్న ఊరకుక్కమిన్న అన్నారు. అటువంటి వాడిని, ఈ విధంగా సాగనంపేశామనుకో!" డబ్బు ఆశకు గాల్లో తేలిపోతూ, ఆ బ్రాహ్మణుడు భార్యతో తన ఆలోచన చెప్పాడు.

హేమ విగ్రహం కథ

"అయ్యో! అలా మన పిల్లవాడ్ని సాగనంపడానికి సిద్ధపడుతున్నా రన్నమాట! అసలా మాట అనడానికి మీకు నోరెలా వచ్చిందండీ? చెట్టుకు కాయలు బరువా? ఎవరైనా నిలువెత్తు ధనం పోసినా కొడుకుని బలి ఇచ్చుకుంటారా?" అని శోకించసాగింది.

"అదికాదే! పుట్టిబుద్ధెరిగాక సుఖపడ్డామా? డబ్బుతోనే సుఖాలన్నీ! బాగా ఆలోచించు" దారిద్ర్యం మూర్తీభవించిన భర్త అన్నాడు.

ఎలాగైనా తండ్రి మాటే చెల్లుతుందని - తనను బలి ఇవ్వడం తథ్యమని, వాళ్ల మాటల్ని బట్టి అర్థం చేసుకున్న గుణసాగరుడు ఏడ్వసాగాడు. కారణం తెలుసుకున్న విజయభాస్కరుడు, ఆ పిల్లవాడికి అభయం ఇచ్చి, అతడి తండ్రిని ఒప్పించి, తననే అతడి కొడుకుగా చూపేటట్లు అంగీకరింపచేశాడు. 'రాజభటులు చెప్పినట్లు వెళ్లడానికి' దేవభట్టు అనే ఆ బీదబ్రాహ్మణుడు విజయభాస్కరుని తన కొడుకుగా చూపుతూ ఒడంబడిక పత్రిక రాసిచ్చాడు.

ఆ ఇంటి ఇల్లాలు చారుమతిని తన ఇంట్లోనే సకలమర్యాదలతో చూడసాగింది. అయితే - ఆమెకు ఈ విషయాలేవీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు అందరూ. పిల్లలు హేమకూట నగరానికి బయలు దేరుతున్నారని - రాజధానిలో వింతలు చూసి వస్తారని మాత్రమే చెప్పారు ఆమెకు.

బలికి ఒక బ్రాహ్మణ బాలుడు సిద్ధమయ్యాడన్న వార్త రాజధానికి చేరింది. తనకు ప్రాణ గండం తప్పినందుకు, చంద్రావలోకుడు నెమ్మదించిన మనస్సుతో ఆ ఇద్దరినీ జాగ్రత్తగా కాపాడుకుంటూ, బలి ఇచ్చే రోజున సకల ఉపచారాలూ చేసి, ఏనుగుమీద రాక్షసుని దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ రావి చెట్టు మొదట్లో మంత్రాగ్ని - యజ్ఞవాటిక ఏర్పాట్లు అంతకు ముందే చేయించాడు.

బ్రహ్మ రాక్షసునికి ఆ బాలుడిని చూపుతూ "మహాత్మా! మీరు సెలవిచ్చిన ప్రకారం ఈ బాలుడ్ని బలి తీసుకుని, నన్ను కృతార్థుడ్ని

చేయవలసింది" అంటూ చంద్రావలోకుడు జ్వాలాముఖి రాక్షసునికి వంగి నమస్కరించాడు. అంగీకరిస్తున్నట్లు తల ఊపాడు జ్వాలాముఖి.

బీద తండ్రి ఆ పిల్లవాడ్ని కదలకుండా పట్టుకోగా, రాజు కత్తితో నరకబోతూంటే "ఆగాగు!" అంటూ అరిచాడు రాక్షసుడు.

ఎత్తిన కత్తి దించేశాడు చంద్రావలోకుడు - ఆశ్చర్యంగా "ఈ పిల్లాడి తండ్రి ఇతడు కాడేమోనని నాకు అనుమానంగా ఉంది. కొడుకే అయితే ఇతడి ముఖంలో కొంచెమైనా విచారం కనిపించదేం?" అని అడిగాడు.

"మా కుమారుడే" అనడంలో ఆ బీద బ్రాహ్మణుని తడబాటు గుర్తించిన జ్వాలాముఖి "అబ్బాయి! నువ్వు చెప్పు! మరణ సమయాన నిజమే చెప్పాలి కదా! లేకుంటే ఉత్తమలోకాలు ప్రాప్తించవంటారు. నువ్వు ఎవరి కొడుకువి? మీ వాళ్లెవరు?" అని అడిగాడు.

"అబద్ధం చెప్పను. నేను కీర్తి కేతుడనే రాజు కొడుకుని. విక్రమార్క చక్రవర్తికి మనుమడిని. మాది ఉజ్జయినీ నగరం. వీరు నన్నేమీ బలవంతం చెయ్యలేదు. బుద్ధి పూర్వకంగా నేనే అంగీకరించి, వారినీ ఒప్పించాను" అన్నాడు విజయభాస్కరుడు.

"ఏమేమీ? నువ్వు విక్రమార్క చక్రవర్తి వంశాంకురానివా? నేడెంతసుదినం? మా ప్రభువు భేతాళుడు మీ తాతకు కింకరుడే! ఆ విధంగా నేను నీకు దాసుడిని. అసలు వీళ్లకి నువ్వెలా తారసపడ్డావు? అబద్ధం చెప్పినందుకు చంద్రావలోకుని ఇప్పుడే అంతం చేస్తా" అంటూ నాలుక చప్పరించడంతో, అతడ్ని వారించాడు రాజపుత్రుడు.

"ఈ కపటంలో చంద్రావలోకునికి ఏ పాపం తెలీదు. ఈబీద బ్రాహ్మణునికి, వారింట భోజనం చేసిన విశ్వాసం కొద్దీ ఏదైనా మేలుచేయదలచి నేనే బోధించాను. ఇందులో ఎవ్వరి తప్పులేదు. మాకు పరమాప్తులైన భేతాళుని సేవకులు మీరు. మీ కోసం దేహం అర్పించడానికి మాకెంత మాత్రం సంకోచం అవసరం లేదు. సంతోషంగా అర్పిస్తాను" అన్నాడు విజయభాస్కరుడు.

"వద్దు నాయనా! నా దగ్గర అలాంటి మాటలనరాదు. సాహసం - వితరణ గుణాల్లో నువ్వు మీ తాతనే మించిపోయావు. భూతదయాపరత్వంలో ప్రాణాల్ని తృణప్రాయంగా ఎంచిన నీ గొప్ప బుద్ధికి ఏదీ సాటిరాదు. నీవంటివారు కలకాలం బతికి ప్రజల్ని పాలించాలి. నీ గుణగుణాలను మెచ్చి, నేనే నా కోరికను ఉపసంహరించుకుంటున్నాను. నీకేం కావాలో చెప్పు! చేసి తీరుతాను" అన్నాడా జ్వాలాముఖి భక్తి వినయాలతో.

"అయ్యా! నాకే కోరికా లేదు. భూతదయను మించిన వ్రతం లేదని నేనెరుగుదును. అది మీరూ పాటిస్తే చూడాలని ఉంది. కనుక ఇక నుంచి అయినా మీరు జీవహింస చెయ్యకుండా ఉండాలని నా అభిమతం" అన్నాడు. విజయభాస్కరుడు - ఈ మాటలతో జ్వాలాముఖికి పూర్వజన్మజ్ఞానం అలవడింది.

"పుత్రా! నువ్వు మహానుభావుడివి. నీ దర్శనంతోనే నా పాపాలన్నీ పటాపంచలయ్యాయి. ఇక పై ఏప్రాణినీ హింసించనని నీకు మాట ఇస్తున్నాను. నీ పాదధూళి నా శిరస్సున ధరిస్తే నాకు శాపవిముక్తి కలుగుతుంది" అంటూ, ఆ రాజపుత్రుని పాదరేణువులు శిరస్సున దాల్చి శాపవిముక్తుడై అంతర్ధానమైపోయాడు జ్వాలాముఖి.

చంద్రావలోకుడు విజయభాస్కరుని కౌగలించుకుని "నువ్వు విక్రమార్క చక్రవర్తి మనవడివా? నీ రూపం చూడగానే నాకు ఏదో అనుమానం కలగకపోలేదు. ఈ బీద బ్రాహ్మణుడెంత వంచన చేశాడు? నీ వల్ల నాకు బ్రహ్మహత్యాపాతకం తప్పింది" అంటూ ప్రశంసించి, ఏనుగు పై నెక్కించుకుని తన రాజధానికి తీసుకెళ్లి గొప్ప ఉత్సవం జరిపాడు.

తాను పునర్జన్మ ఎత్తినట్లే భావించాడు చంద్రావలోకుడు. విజయభాస్కరుని కోరికమేరకు, బీదబ్రాహ్మణుని ఘనంగా సత్కరించి, వాళ్ల పంచవటికి పంపేశాడు, అర్థరాజ్యం ఇస్తానని విజయభాస్కరునితో చంద్రావలోకుడు చెప్పినా, వద్దని వారించి తన తల్లిని చూడటానికి తాను కూడా అగ్రహారానికే వెళ్లాడు.

హేమ విగ్రహం కథ

విజయభాస్కరుడు రాజధాని కెళ్లాక ఇరుగుపొరుగువారు, అతని తల్లి అయిన చారుమతి దగ్గరకొచ్చి, "ఆ ఇంట్లో వాళ్లు ధనాశకొద్దీ, ఆమె కొడుకుని బలివ్వడానికి బదులు నీ కొడుకుని తీసుకెళ్లిపోయారు" అంటూ ఆమెకు భయంకరంగా నూరిపోశారు. దాంతో ఆమె మూర్ఛపోయింది. తెలివి వచ్చాక శోకించసాగింది. అంతలో 'అమ్మా' అంటూ వచ్చాడు పుత్రుడు.

ఆమె కొడుకును చూడగానే ఆనందంగా అతడి నుదిట ముద్దిడి "నాయనా! నేను విన్నదంతా నిజమేనా?" అంటూ ఇరుగుపొరుగు వారు తనతో చెప్పిన మాటలను కొడుక్కు చెప్పింది. "నువ్వు విన్నదాంట్లో కొంతవరకే నిజం! పాపం! ఈ ఇంటి బీదబ్రాహ్మణులను ఒప్పించింది నేనే! వారికి ఏదో మేలు చెయ్యాలని నా ఊహ! సరే! అయిందేదో అయింది. నేను క్షేమంగా బతికి బయట పడ్డానుకదా! మన వృత్తాంతం ఇక్కడ అందరికీ తెలిసిపోయింది, కనుక మనం ఇక్కడ ఉండకూడదిక" అంటూ ఆ తల్లీ – కొడుకూ పయనమై వెళ్లిపోయారు– పంచవటి నుంచి.

దారిలో ఆమె "ఎన్నికష్టాలైనా పడవచ్చుగాని, ఈ నడవడం మాత్రం నావల్ల కావడం లేదు కుమారా! మనం ఎక్కడైనా ఒకచోట నివశిస్తూ ఏదో కొలువులో పొట్ట పోసుకోలేమా?" అంది. అందుకు తాను సిద్ధమేనన్నాడు కొడుకు. పరిచారకుల చేత సేవలందుకున్న నువ్వు చాలా కష్టమైన సేవకవృత్తి చెయ్యడమా? అని విచారించిందామె.

కొన్నాళ్లు ప్రయాణం చేసి, వాళ్లు శోభావతి అనే పట్టణంచేరారు. ఆ పట్నపురాజు ఉత్తముడని తెలుసుకుని, రాజుని దర్శించదగ్గ వేషంతో వెళ్లి తన వివరాలు మాత్రమే చెప్పి, నెలకు నూరు మాడలు ఇస్తే ఆ ప్రభువు చెప్పిన కార్యాలు చక్క బెడతానన్నాడు.

సాటి క్షత్రియుడన్న అభిమానం కొద్దీ, అప్పటికప్పుడే అధికారపత్రం ఇచ్చి, చెయ్యవలసిన పనులు మర్నాడు చెప్తానన్నాడు. కాని విజయ భాస్కరుడికి చెప్పడానికి పనులేమీ కనబడక, కొన్నిరోజులు ఊరకే వచ్చి ఆస్థానంలో కూర్చోమన్నాడు. అలా కొంతకాలం గడిచింది.

మంజువాణి కథ

ఆ రాజు అతని ముఖలక్షణాలు పరీక్షిస్తూ, నమ్మకస్తుడు సత్యసందుడు అని నిశ్చయించి అతడ్ని అంతఃపురానికి కావలిగా ఉండమన్నాడు. రాజుచెప్పినట్లే - విజయభాస్కరుడు ఆ కొలువులో కుదురుకున్నాడు. అతడి ఆజ్ఞలేకుండా చీమైనా అంతఃపురంలో చొరబడ్డానికి లేదు.

ఆ రాజుగారి మూడోభార్య మంజువాణి, సుముఖుడనే మంత్రిని వరించింది. రాజుగారు ఒక్కొక్క భార్యదగ్గరికీ మూడ్రోజుల కొకసారి మాత్రమే వెళ్తుంటారు. రాజుగారు రాని రాత్రులలో సుముఖుడు మంజువాణి అనే ఆ మూడో రాణిని మరిగాడు. అతడలా చొరవగా అంతఃపురాల్లోకి వెళ్లడం అంతకుముందు సాధ్యమయ్యేది కాని విజయభాస్కరుడొచ్చాక అది వీలు పడటంలేదు. ఎప్పుడు చూసినా కత్తిపట్టుకొని అతడటూ - ఇటూ తిరుగుతూనే ఉండడంతో మంత్రికి సంకటస్థితి ఎదురైంది.

ఇక... ఇలాక్కాదని, ఒకనాడు మంత్రి దాసీ వేషం వేసుకుని, మొదటి ఝాము రాత్రిలోనే "నేను మంజువాణి స్నేహితురాల్ని ఆమె పుట్టింటికి వెళ్లి వచ్చాను. ఆమెతో కొన్ని వార్తలు చెప్పాల్సిఉంది. లోపలికి పోనివ్వండి" అంటూ వేడ్డుకొని నిదర్శనంగా కొన్ని పత్రికలు చూపింది. అతడామెను నమ్మి లోపలికి పోనిచ్చాడు.

మంత్రి ఆనందిస్తూ లోపలికి వెళ్లి విరహవేదన చెందుతున్న మంజువాణికి తాను పడిన కష్టాలన్నీ చెప్తూ రాత్రి గడిపాడు. అయితే, తెల్లవారకుండా బైటికి పోవడానికి తిరిగి అదే దాసి వేషంలో బైటకొస్తున్న మంత్రిని అడ్డుకున్నాడు. "సూర్యోదయం అయితేనేగాని నిన్ను బైటికి పోనివ్వను" అన్నాడు.

మంజువాణి కథ

అప్పుడు లోపల్నుంచి వచ్చిన మంజువాణి ప్రమేయంతో ఎలాగో బయటపడగలిగాడు. కాని, మంజువాణి విజయభాస్కరుని చూస్తూనే "ఇంతటి రూపవంతుడ్ని సేవకుడిగా చేసిన దేవుడు నిందాపాత్రుడే! ఇతడ్ని చూసి ఏ స్త్రీ వ్యామోహితురాలు కాకుండా ఉంటుంది? పాలకుండకు పిల్లిని కాపలా పెట్టినట్లు, ఇంతటి అందగాడ్ని అంతఃపురానికి కాపు పెట్టిన రాజు మూర్ఖుడని" అనుకుంది. మెల్లగా అతడిని ముగ్గులోకి లాగాలని చూసింది. తాను రాజుగారి మూడో భార్యననీ, అతడిలా యవ్వనాన్ని వృధాచేయడం న్యాయం కాదనీ, అందుబాటులో ఉన్న తనని అనుభవించమనీ సిగ్గువిడిచి అడిగింది.

అప్పటికీ లొంగని అతడిని జతకూర్చమని అతడ్ని "సఖీ! ఇంతటి అందగాడ్ని నాకు ఎలాగైనా సమకూర్చవే!" అంటూ చెలిని వేడుకుంది.

మర్నాడురాత్రి మంజువాణి చక్కగా అలంకరించుకొని, అతడ్ని కౌగిట్లోకి ఆహ్వానించింది. విజయభాస్కరుడు దిమ్మెరపోయి "స్త్రీలకు శీలం లేకపోతే శిక్షార్హులే! రాజు భార్యవైఉండి, ఇంత నీచకృత్యం తలపెడతావా?" అంటూ తటాలున కత్తిదూయబోయి "ఛీ! ఈ రాజు నన్ను తగని చోట నియమించాడు" అంటూ ఎత్తినకత్తిని అక్కడే పారేశాడు 'ఇక ఇక్కడుండరాదు' అనుకుని పోబోతూండగా కోరిక తీరని కసికొద్దీ, కిందపడ్డ కత్తిని అందుకుని మంజువాణి విజయభాస్కరుని మీదకు విసరబోయింది. అది అదృష్టవశాన అతడికి కాకుండా, మంజులత కోసం ఆ పక్క పొదల్లో పొంచి ఉన్న మంత్రికి తగిలి అతడు మరణించాడు.

అది తెలీని విజయభాస్కరుడు ఆ రాత్రి తిన్నగా తన ఇంటికెళ్లిపోయాడు. జరిగింది దాసీవల్ల తెల్సుకున్న మంజులత భయపడి, కపట నాటకం మొదలెట్టింది.

రాజొచ్చే వేళకు జుట్టు విరబోసుకుని శోకం నటించి "పడుచువాళ్లని

అంతఃపురంలో కాపుపెట్టారు. ఇప్పుడు చూడండి ఏం జరిగిందో! అతడికి నామీద కన్నుపడింది. నన్ను బలాత్కరించబోయి, దాసీలు లేవడంతో పారిపోయాడు" అంటూ గోడపేర్చిన చందంగా అబద్ధాల మీద అబద్ధాలు చెప్పింది.

అదృష్టవశాన పరిస్థితులన్నీ ఆమెకు అనుకూలంగానే ఉన్నాయి. రాజకుమారుడు మంజువాణిని బలాత్కరించబోగా అడ్డుకున్న మంత్రిని చంపి కందకంలో పడేశాడన్నది అతడి మీది అభియోగం.

రాజు "దీనికి నీ సమాధానమేమిటి?" అని అడిగితే, "యదార్థం చెప్పినా రాజు నమ్మడు. అన్నీ ఋజువయ్యాయంటే అది మంజువాణి ప్రాణాలకే ప్రమాదం" అనుకుంటూ మౌనంగా ఉండిపోయాడు.

"ఈ హత్య నువ్వే చేశావా?" అని రాజు నిలదీసేసరికి, ఇంకో జవాబు చెప్పకుండా "నేనే" అని తేల్చేశాడు. "ఇతడ్ని నరికి ఉప్పు పాతర వెయ్యాలి" అని న్యాయాధీశులు తీర్పు చదివి వినిపించినా, అతడి ముఖాన ఉలికిపాటు లేక పోయేసరికి 'ఇతడు దోషికాడేమో' అని కూడా తోచింది ప్రభువుకు. న్యాయాధీశుల తీర్పును మార్పించి, ద్వీపాంతర వాస శిక్షను తీర్పుగా చదివి వినిపించాడు.

"ఇలాంటి అపవాదెందుకు వచ్చింది?" అని కొడుకు సంగతి బాగా తెలిసిన చారుమతి శోకిస్తూ అడిగింది. "అమ్మా! పూర్వజన్మ కృతం తప్ప ఇంకేదీకాదు. నాకు అనుజ్ఞ ఇవ్వు" అన్నాడతడు.

రాజభటులు అతడికి సంకెళ్లు వేసి తీసుకెళ్తుంటే, ప్రజలూ అతని వల్ల నిత్యం సహాయం పొందే పేదలూ ఎంతో దుఃఖించారు. ఆ అపరాధం అతడు చేసి ఉండడనీ - స్త్రీలు ఎంతకైనా తగుదురనీ ఆ నాడు ఆ పట్టణంలో చెప్పుకోనివారులేరు.

యశస్కరుడి కథ

రాజపుత్రుడికి అటువంటి శిక్ష విధించినా, యశస్కరునికి హృదయంలో విచారం అలాగే ఉండిపోయింది. తాను సరైన నిర్ణయం చెయ్యలేదేమో అనే అనుమానం అతడ్ని తొలిచేయసాగింది. ప్రజలు తన గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనిపించి యశస్కరుడు మారువేషంలో తిరగసాగాడు. అప్పుడు ఒక గృహంనుంచి వినిపించిన మాటలు అతడ్ని కట్టిపడేశాయి. అతడక్కడే నిలబడి వారి సంభాషణ వినసాగాడు. ఆ మాటల సారాంశం ఇదీ......

'ద్వీపాంతరవాస శిక్ష పడిన ఆ చిన్నవాడు నిజానికి ఆ నేరంలో ఏ పాపం ఎరుగడని, మంత్రికీ - మంజు వాణికీ ఉన్న అక్రమ సంబంధం అక్కడక్కడ చాలామందికి తెలుసునని, బహుశా ఆ కుర్రవాడికి ఈ సంగతి తెలిసినదని ఇద్దరూ ఏదో కుతంత్రంపన్ని అతడి మీదకి నెట్టేసి ఉంటారని, ఎక్కడో అంతఃపురంలో అపరాధం జరిగితే మంత్రికి కబురు చేయటమేమిటి - అది నిజమా లేక కట్టుకథా కదా అని రాజు ఆలోచించక శిక్ష విధించాడని ఆ పిల్లవాడు గుణవంతుడు, దయాధర్మపరుడూ అని, బహుశా మంజువాణి ఆ కుర్రవాడ్ని మోహించి ఉంటుందని, అతడు సమ్మతించకపోవడంతో ఏదో కుతంత్రం పన్ని ఉంటుందని' ఆ మాటల సారాంశం.

రాజు ఆ ఇల్లు గుర్తు పెట్టుకుని, ఇంకో వీధికి వెళ్లాడు. కొడుకునకు ద్వీపాంతర వాస శిక్ష పడి, అతడు వెళ్లాక, ఆమె దైన్యంగా విచారంలో తనలో తానే ఏదో మాట్లాడుకో సాగింది. నిత్యం ఆ మాటలే స్మరించుకుంటోంది. అవీ యశస్కరుని చెవులపడ్డాయి.....

'ఇతరుల్ని రక్షించడానికి తన ప్రాణాలే విడిచే నా పుత్రుడు మంత్రిని చంపడమా? పరస్త్రీలను కన్న తల్లుల్లా చూసేవాడు, రాజపత్నిని కోరడమా? కలలోకూడా అబద్ధమాడి ఎరుగడే! దీనుల పట్ల ఎంతో దయగా ఉండేవాడే.... విధి ఇంత చిన్న చూపు నా కొడుకునే ఎందుకు చూసిందో!? రాజు విచారణ సరిగ్గా చెయ్యలేక కఠిన శిక్షకు గురిచేశాడు! ఆహా! కర్మకాక ఇంకేమి?'

మర్నాడు యశస్కరుడు, విజయభాస్కరుని ఇంటి యజమానిని సకుటుంబంగా పిలిపించి ఆ కుర్రవాడి గుణగణాలను సవివరంగా చెప్పమన్నాడు. "అయ్యా! ఆ చిన్నవాడు రాచబిడ్డ అని మాకు అన్పిస్తోంది. అతడు పరస్త్రీలను కన్నెత్తయినా చూడడనడానికి నిదర్శనం మా కూతుళ్లూ, కోడళ్లూ అతడ్ని అంధుడని పరిహాసం చేస్తూండడమే! తన కొచ్చే వేతనంలో అధిక భాగం దాన ధర్మాలకు వెచ్చించడమే తప్ప, ఎన్నడూ స్వంత సుఖాలకు వినియోగించేవాడు కాడు! భూతదయాపరుడు, ఏడాదిగా అతడ్ని చూస్తున్నాం" అని చెప్పారు వాళ్లు.

యశస్కరుడు నిజాన్ని మంజువాణి చేత కక్కించడానికి, తాను అంతకుముందు రోజు రాత్రి మారువేషంలో వెళ్లినపుడు ఏ ఇంట్లోంచి భార్యాభర్తల సంభాషణ విన్నాడో ఆ ఇంటి ఇల్లాలి సహాయం తీసుకున్నాడు. ఆమె అద్భుతంగా తర్కించి, సాక్ష్యాలు ప్రవేశపెట్టించి మంజువాణి నేరం ఆమె నోటనే చెప్పించింది. ఆ దెబ్బతో యశస్కరుడు నేలను దొర్లి విలపించి

"అయ్యో! మాణిక్యంలాంటి వానికి ద్రోహం చేశాను మూఢుడిని! ద్రోహిని! ఆ వంచకి శిక్షార్హురాలైన మంజువాణినేం శిక్షకు ఎర చెయ్యాలి?" అని అడిగాడు.

అప్పుడు సామంత రాజులంతా అతన్ని ఓదార్చి "జరిగిందేదో జరిగింది. ముందు విజయభాస్కరుని వెతికించు!" అన్నారు. మంజువాణిని చంపి ఉప్పుపాతర వేయించమన్నారు. ఆ రెండూ తక్షణం అమలు జరిపించాడు యశస్కరుడు. చారుమతిని గౌరవించాడు.

యశస్కరుడి కథ

కొడుకు రాకకోసం చారుమతి దీనంగా రోదిస్తూ ఎదురు చూడసాగింది.

యశస్కరుడు కూడా, తన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా– రాజ్యాన్ని మంత్రుల అధీనంలో ఉంచి విరక్తుడై "అంత మంచి వాడిని అలా శిక్షించిన నా పాపానికి నిష్కృతిలేదు" అనుకుంటూండగా మహారాష్ట్ర దేశ రాజధాని చంద్రప్రస్థం నుంచి చంద్రగుప్త మహారాజు పంపిన దూతలు ఒక పత్రిక తెచ్చిచ్చారు. అందులో ఆ దేశాధీశుని కూతురు కలభాషిణిని దొంగల బారి నుంచి రక్షించి తనకు అప్పగించి మేలు చేసిన విజయభాస్కరుని ప్రస్తావన ఉంది. అతడ్ని సగౌరవంగా పంపితే, తన పుత్రిక నిచ్చి పెళ్లి చేయాల్సిఉందనీ– తన పుత్రిక అతడ్ని తప్ప ఎవరినీ పెళ్లాడ బోదనీ, అతడిక్కడ కొలువు చేస్తున్నట్లు తెలిసినందున ఈలేఖ రాయడమైనదనీ కూడా అందులో ఉంది. ఏం జవాబు రాయించాలా అని మథనపడిన యశస్కరుడు, ముఖంచెల్లక తీర్థయాత్రల నిమిత్తం వెళ్లాడు.

తదుపరి కథ తర్వాత మజిలీలో చెప్పాడు మణిసిద్ధుడు.



కాశీ మజిలీ కథలు

41 వ మజిలీ

హేమప్రభ కథ

గోపా విను!... యశస్కరుడు విధించిన ద్వీపాంతర వాస శిక్షను అమలు చేయడానికి, విజయభాస్కరుని ఓడ ఎక్కించి తీసుకువెళ్తుండగా, సముద్రంలో ఒకచోట లోహధ్వజం బైటికి వచ్చింది. దాన్ని చూసి నావికులు 'ఇప్పుడు గాలివాన రాబోతున్నది. పడవ లోహధ్వజానికి కొట్టుకొని మునిగిపోయేలా ఉంది ఎవరో ఒకరు సముద్రానికి బలిఅయితే, మిగిలినవారు ప్రాణాలతో ఉంటారు' అని హెచ్చరించారు. పరోపకార పరాయణులెవరైనా ఉంటే ముందుకు రమ్మన్నారు. అది విన్న విజయభాస్కరుడు అందరికీ నమస్కరించి తాను సముద్రంలో దూకి మునిగిపోయాడు.

అలా మునిగిన భాస్కరుడు, కొంతసేపటికి మణిమయ ప్రకాశితమైన ఒక మందిరంలో కూరల బుట్టలో, తేలాడు. కళ్లు తెరిచి చూసి "ఇది ఇంద్రజాలమా? నేను మరణించి స్వర్గానికొచ్చానా?" అనుకుంటూ, తాను సశరీరుడిగానే ఉన్నట్టు గ్రహించి, అక్కడి విశేషాలు చూడాలని కొంతదూరం ఆ ప్రాంతాలలో తిరగసాగాడు.

కొంతదూరం అలా వెళ్లేసరికి, ఏవరో భయంకరా కారంతో అటురావడం కనిపించింది. పురాణాల్లో వర్ణించే రాక్షస స్త్రీలా ఉంది. గుహలా తెరుచుకుని ఉన్నదాని నోట్లోకి తానొక ఆహారపు ముద్దగా మారిపోతానని గ్రహించుకున్న భాస్కరుడు ఒక మూల నక్కికూర్చున్నాడు.

ఆ రాక్షసి నిప్పులు కక్కుతూ అక్కడికొచ్చి, అక్కడో పీఠం మీద కూర్చొని "ఆహారం సిద్ధం చేశావా? లోహధ్వజాన్ని పైకి వదిలావా? ఎప్పుడూ కూరలబుట్టలో వేలాది శవాలు పడేవి. నేడేమైంది? మనుష్య మాంస మేదీ?" అంటూ చిందులు తొక్కసాగింది.

భాస్కరుడు అక్కడి నుంచి తప్పించుకున్నందువల్ల, ఆ రోజువేళ దాటి పోకుండా భోజనం చేయసాగిందా రాక్షసి.

ఇంతలో "నా మనవరాలు హేమప్రభ ఏం చేస్తోందని" అడిగి తెలుసుకుని, దాని పెట్టెలో తన జాతకం ఉన్న పుస్తకం తెమ్మని ఒక సఖురాలికి పురమాయించింది. ఇంకొక సఖితో ఆ రాక్షసి మాట్లాడిన దాన్ని బట్టి-

'హేమప్రభ అనే ఆ చిన్నదానికి పెళ్లీడొచ్చింది. ఉద్యానవనంలో పెళ్లిళ్లాట ఆడుకుంటోంది. ఆ పిల్ల దేవతలనో -మనుషులనో పెళ్లాడుతుందట. ఎప్పుడూ రాక్షస జాతిని నిందిస్తుంది. దానిక్కారణం జ్వాలాముఖి అనబడే ఆ రాక్షసి కూతురు ఒక విద్యాధరుడ్ని వరించి ఆ పిల్లని కన్నది. అందువల్ల హేమప్రభక్తి దేవతల పోలిక వచ్చింది'. ఇదీ ఆమె మనవరాలి వృత్తాంతం.

ఆ పిల్లదాన్ని బ్రతిమాలి ఆమె పెట్టెలోంచి తెప్పించుకున్న జాతకచక్రం సఖురాలు చదివి వినిపిస్తుంటే వింటోందా రాక్షసి. లోహధ్వజం వల్ల మరణించక ఎవరైనా మానవుడు సజీవంగా కనుపించినపుడు ఆమెకు మరణం రాసి పెట్టి ఉంది.

రహస్యస్థలంలో ఉండి ఇదంతా వింటున్న భాస్కరుడికి అది స్వర్గంకాదనీ, రాక్షస శిల్పి అయిన మయుడు ఎందువల్లనో ఈ రాక్షసికి సముద్ర మధ్యంలో గృహం కట్టించి ఇచ్చాడనీ గ్రహించుకున్నాడు భాస్కరుడు. ఎన్నోకోట్ల మందిని ఈ పాటికి అది పొట్టనబెట్టుకుని ఉంటుంది అనీ, దాన్ని చంపినా పాపం రాదని ఆలోచించి, వంటశాలలోనికి వెళ్లి కత్తితెచ్చి, ఆమె ముందు నిలబడ్డాడు. మనుష్యుని చూస్తేనే మరణం సంభవించే ఆ రాక్షసికి పై ప్రాణాలు పైనే పోగా, అలవోకగా ఆమె శిరస్సు ఖండించాడు విజయభాస్కరుడు.

ఆమెను ఆ మందిరంలోనే వదిలి, ఓ పక్కకు వెళ్లిచూడగా పార్వతీదేవి మందిరం కనిపించింది. లోపలికెళ్లి పరిశీలిస్తుండగా ఏదో అలికిడైన శబ్దం

విని అక్కడే దాగున్నాడు. హేమప్రభ అక్కడికొచ్చి సంగీతం మేళవించి అమ్మవారికీర్తన చక్కగా పాడింది. ఆమె మీద వలపు కుదిరింది విజయభాస్కరునికి. మోహపర వశుడైనాడామె అందానికి. అంతలో ముసలి రాక్షసి చచ్చిందని తెలిసి వెళ్లి చూసొచ్చి ఆమెను ఎవరో చంపారంటే మానవుడే సజీవుడై వచ్చి ఉండాలని అర్థం చేసుకున్నారు. ఆ మానవుని కోసం వెతకసాగారు. అతడొక ఉద్యానవనంలో కనిపించాడు.

పరస్పర వృత్తాంతాలు చెప్పుకుని, ఒకరి పై ఒకరు అనురాగం వృద్ధి చేసుకున్నారు - అతడు విక్రమార్కుని మనుమడని తెలిసి ఆమె మహదానందం చెందింది. వారి పద్ధతిలో వివాహం చేసుకుని ఆమెతో సుఖించాడు. వచ్చి చాలా రోజులైందనీ - తన లోకానికి వెళ్లే మార్గం చెప్పవలసిందనీ ఆమెని కోరాడు.

ఒకరోజు అతడికొక రత్న కంకణాన్నిచ్చి ఓ సరస్సు దగ్గరకు తీసుకెళ్లి "ఎక్కడి కెళ్లాలో తల్చుకుంటూ ఇందులో మునుగు! అక్కడికి వెళ్తావు. అలాగే ఈ కంకణం చేతిలో ఉంచుకుని, ఇక్కడకు రావాలని ఏ చెరువులో మునిగినా నువ్వు ఇక్కడి కొస్తావు. ఈ కంకణం ఎల్లవేళలా భద్రంగా ఉంచుకో! నన్ను మర్చిపోకుమా! తల్లిని చూసి వస్తానంటున్నావు కనుక నిన్ను విడుస్తున్నాను. నువ్వు రాకపోతే నేను విరహంతో వేగిపోతాను" అని ముద్దుపెట్టుకుని భాస్కరుని సాగనంపింది.

అతడు ఆ లోకంలోని రత్నాలు కొన్ని మూటకట్టుకొని శోభావతీపురానికి వెళ్లాలని తల్చుకున్నాడు. సరస్సులో మునిగిలేచేసరికి, ఆ పట్టణ శివార్లలో తేలాడు. ఆ పట్టణ ప్రభువు యశస్కరుని గురించి అడగ్గా, అతడు తన గురించే పశ్చాత్తాప పడుతూ విరక్తితో తీర్థయాత్రా సందర్శనానికి వెళ్లినట్లు తెలిసింది. తల్లికోసం వెళ్లేసరికి పుత్రునిమీద దిగులుతో మనస్సు చెదిరి, ఎటో వెళ్లిపోయిందని చుట్టుప్రక్కలవారు చెప్పారు.

రాజకుమారుడు చాలా విచారిస్తూ, వారిద్దరి జాడ తెలుసుకోవాలని ఊళ్లు తిరిగి-తిరిగి ఒకనాటి సాయంకాలానికి కలభాషిణి ఉన్న చంద్రప్రస్థపురం చేరుకున్నాడు.

అక్కడ - ఒక దేవాలయంలో పడుకొని దీర్ఘంగా, ఏంచెయ్యాలా?' అని ఆలోచించసాగాడు.

కలభాషిణి కథ

అంతలో అక్కడి కొచ్చిన ఒకస్త్రీ, ఆ చిరుచీకట్లలో అతడెవరన్నదీ పోల్చుకోలేక, అతని భుజం తడుతూ "మదన కేతనా!లే!లే! రాజపుత్రికని గోడదాటించడం అయింది. మేం శ్రీశైలం పోవాలి. కలభాషిణి ఒక్కతెనే నిలబెట్టాను" అంది వెళ్లిపోతూ. ఆమె ఎవరో కానుకులివ్వజూపిన కానుకలకు ఆశించి ఆమెనక్కడికి తెచ్చింది. విజయభాస్కరుడు ఆశ్చర్యంతో అక్కడే పడుకున్నాడు. కలభాషిణి అంటే, ఆనాడు తాను దొంగల బారినుంచి రక్షించిన బాలికే అని అర్థమైంది. ఆమె అంతవరకూ వేరేవారిని వరించలేదనీ - శ్రీశైలం ఎందుకు వెళ్తూన్నదనీ ఊహ వచ్చిన భాస్కరుడు, శ్రీశైలం దారి పట్టి నాలుగురోజుల తర్వాత, తనను గుడిలో మదన కేతనుడనుకొని తట్టిలేపిన స్త్రీని కలుసుకున్నాడు. ఆమె పారితోషికానికి ఆశించి, తమ వెంట మదన కేతనుడనే వాడ్ని శ్రీశైలం వరకు తోడుగా తీసుకెళ్లసాగింది. దారిలో అతడు కలభాషిణిని బలాత్కరించ బోగా, సరిగ్గా అప్పుడే అక్కడకు చేరుకున్న భాస్కరుడు కత్తిదూసి అతడ్ని పారద్రోలాడు. కాని తాను ఎవరైందీ చెప్పకూడదనుకున్నాడు. ఈలోగా ఒక చోట పరోపకారార్థం నెమ్మదిగా నడవవలని రావడంతో భాస్కరుడు వారిని శ్రీశైలం వరకూ అనుసరించలేకపోయాడు. వారు ముందు వెళ్లిపోయారు - శివరాత్రి సమీపిస్తోందని.

మహాశివరాత్రి పర్వదినం. పాతాళ గంగలో స్నానం చేసి శ్రీమల్లికార్జునుని సేవించాడు. రత్నాలు అర్హులైన స్వాములకు పంచిపెట్టాడు. ఇంతలో ఒక తీర్థంలోని నూతిలో ఒక వృద్ధురాలు పడిందని తెలిసి పైకి తీశాడు. ఆమె అతని తల్లి చారుమతి.

ఆమె రోదనం విన్ని, ఒక విరాగి ముందుకొచ్చి "అమ్మా! నువ్వు భాస్కరుని తల్లివని గుర్తించాను. ఆ పుణ్యాత్మునికి ద్వీపాంతర వాసశిక్ష విధించి చంపించింది నేనే! నా పాపానికి నిష్కృతి లేదు" అన్నాడు. అతడిని యశస్కరునిగా గుర్తించిన భాస్కరుడు, అత్యాశ్చర్యంగా వారిద్దరి కోసమే

తాను వెతుకుతూన్నట్లు చెప్పి, విజయభాస్కరుడు వారిద్దరికీ ఆనందం కలిగించాడు. సముద్రంలో తాను పడింది మొదలు అంతవరకు జరిగిన గాథ అంతటినీ వారికి వివరించాడు.

మాటల మధ్యలో కలభాషిణి వృత్తాంతం వచ్చింది. శ్రీశైలం వచ్చేదారిలో కలభాషిణి తనను కలిసిందని – తామిద్దరం కలిసే వచ్చామని తల్లి చారుమతి చెప్పేసరికి భాస్కరునికి ఆనందమైంది. ఆమె కూడ అంతలోనే అక్కడికొచ్చి భాస్కరుని కలుసుకుని తన సంతోషాన్ని ప్రకటించింది. ఆ జంటకు యశస్కరుడే పెళ్లి పెద్దగా నిల్చి వివాహం జరిపించాడు. శ్రీశైల మల్లికార్జునుడి సాక్షిగా ఆ వివాహం జరిగింది.

కృతజ్ఞతతోను పాప పరిహారంగాను యశస్కరుడు తన రాజ్యాన్ని ఏలుకొమ్మని విజయ భాస్కరుని కోరాడు. విజయభాస్కరుడు వద్దని చెప్పి, భగవంతుని కరుణ ఉంటే, నేను మా తాత పీఠమే అధిష్ఠిస్తాను. అదీ గాక కలభాషిణి తమ రాజ్యానికి రమ్మని – ఆమె తండ్రిరాజ్యం ఆమెకే చెందుతుందని చెప్తున్నది" అంటూ కొన్నాళ్లకి చంద్రప్రస్థవనగరానికి వెళ్లాడు. అక్కడ అతనికి – సత్రంలో ఇద్దరు బాట సారుల మధ్య జరిగిన ఒక సంభాషణ వల్ల ఆ యుద్ధంలో తన తండ్రిని చంద్రగుప్తునికీ యుద్ధం జరిగినట్లు ఆ యుద్ధంలో తన తండ్రికి చంద్రగుప్తుడు బందీగా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ సందడిలో అతడికి హేమప్రభ గుర్తు కొచ్చింది.

ఊరంతా తిరిగి, ఆనాడు తాను నిద్రించిన పాడుబడ్డ శివాలయం దగ్గరకు వెళ్లాడు. అక్కడ అతని కోసమే వెతుక్కుంటూ వచ్చిన హేమప్రభని ఎవరో బలాత్కరిస్తూంటే అడ్డుకున్నాడు. ఆమెకు తాను రత్న కంకణం పోగొట్టుకున్నానని చెప్పి, అందువల్ల ఆమెను కలవలేక పోయినందుకు చింతించాడు. హేమప్రభ ఎలాగూ దక్కింది కనుక ఆమెను తీసుకెళ్లి తల్లికి పరిచయంచేసి "సముద్రం అట్టడుగున నేను వివాహ మాడింది ఈమెనే" అని చెప్పాడు.

కలభాషిణి –హేమప్రభలు ఒకరి సౌందర్యానికి ఒకరు ఆశ్చర్యపోయారు. చారుమతి హేమప్రభని చూసి ఎంతో ఆనందించింది.

మరునాడు విజయభాస్కరుడు "హేమప్రభా! ఈ చంద్రగుప్తుడు మా తండ్రిని చెరబట్టాడు" అని చెప్పగా ఆమె సముద్ర మందిరం నుంచి గిరిమస్తక అనే రాక్షసిని రప్పించింది. ఆ రాక్షసిని చూసిన వారెవ్వరయినా భయపడాల్సిందే! దానికి తలమాత్రం చాలా పెద్దది. దాంతో కడితే పర్వతాలైనా పగిలిపోవాల్సిందే!

"ఏమి ఆజ్ఞ" అంటూ విజయభాస్కరుని చెంతనిలిచిన గిరిమస్తకను చూస్తూ "నీ ఆకారం చూస్తే ఎటువంటి వారికైనా భయం వేస్తుంది. నువ్వు ప్రజలు భటుల జోలికెళ్లకు, కేవలం చంద్రగుప్తుడ్ని బంధించి తీసుకురా!" అన్నాడు. సరేనని ఆమె నవ్వేసరికి, ఆ అతిసుకుమారపు నవ్వుకి ప్రజలు మూర్ఛపోయారు. దాంతో "నువ్వు నోరు కూడా విప్పకు! కేవలం చెప్పిన పనులు చేసుకొచ్చెయ్యి!"అని అనుజ్ఞ ఇచ్చాడు.

ఆమె మౌనంగా తలాడించి, అవలీలగా చంద్రగుప్తుని కోటకు వెళ్లి, చెరసాలలో ఉన్న కీర్తికేతుడి సంకెళ్లు త్రెంచి, విడిపించింది. రాజమందిరంలో ఉన్న రాజును ఒక పిడికిలిలో పట్టుకుని, అడ్డొచ్చినవారిని కాలిగోటితో ఆవలకు తోసివేసింది.

ఆ ఇద్దర్నీ తెచ్చి విజయభాస్కరుని ఎదుట నిలిపింది. కలభాషిణి గతంలో జరిగిన సంఘటనలన్నీ చెప్పి తామిద్దరూ ఎలా కలుసుకున్నదీ వివరించింది. తన అల్లుడే ఈ కీర్తికేతుడికి కొడుకు అని తెలిసి చంద్రగుప్తుడు ఆనందించాడు.

అందరూ కలుసుకున్నందున కథసుఖాంతమైంది. అదిగో! ఆ గిరిమస్తక దంతమే నువ్వు చూసిన దంతం. అది అప్పుడపుడు వచ్చి విక్రమార్కుని మనుమడికి కావలసిన పనులుచేసి పెడుతూండేది. విజయభాస్కరుడు కూడ తాతగారి పేరు నిలిచేలా చిరకాలం ధర్మపరిపాలన చేసి ప్రజలకు సుఖశాంతులు అందించాడు.

గోపా! ఇదీ దీని వృత్తాంతము. కథా ప్రాచుర్యంలేని వస్తువు గురించి నువ్వు అడగవు కదా!" అని కథ ముగించి తరువాత మజిలీ చేరుకున్నాడు.

కాశీ మజిలీ కథలు

42వ మజిలీ

గీ. ఏటబడి కొట్టికొనుచుఁ బోయినను- గడలి
నడుమఁ బడినను- మరి మతాంతరులం గలిసి
నను- దేశములకుఁ బోయినను- బురాకృ
తంబు వెన్నంటి కుడుపు సౌఖ్యంబు జనుని

"మహాత్మా! అది మంచమో- విమానమో- కీలుథమో తెలీడం లేదు వినండి! ఈ ఊరికి అవతల భూమి అంతా ఎడారిలా ఉన్నది. ఆ ఇసుకనేల మీద సూర్యకిరణాలు పడి ప్రతిఫలించి వజ్రంలాగ తళుకుమని మెరుస్తూంటే అది చూసి ఆశ్చర్యపోయి అక్కడక్కడే తిరుగుతున్నాను. అప్పుడొక నీడ నాకు దగ్గర్నుంచి పాకుతూ అవతలికి వెళ్ళింది. ఆ ఛాయ పోలిక చూస్తే ఒక మణిషెవరో మంచాన్ని తలమీద పెట్టుకుని ఆకాశాన పోతున్నట్లు కనిపించింది. నాకు ఆ వృత్తాంతం వినిపించి ఆనందం కలిగించండి" అని ప్రార్థించగా మణిసిద్ధుడు తన మణిప్రభావంచేత ఆ ఉదంతాన్ని అంతటినీ ఆకళింపు చేసుకొని ఇలా చెప్పసాగాడు....

పుష్పహాసుని కథ

గోపాలా! వినుము.... గంగాతీరంలో సింధువారం అనే నగరాన్ని ధనంజయుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతనికి సుందరకుడనే కొడుకూ – లలిత అనే కూతురూ జన్మించారు. ధనుంజయుడు ఒకనాడు సభలో ఉండగా, ఒక దూత వచ్చి "దేవా! గుహుడు అనే పల్లెవాడు తన పదేళ్ల కొడుకును వెంటబెట్టుకుని వచ్చి తమ దర్శనం కోరి, ద్వారం దగ్గర ఎదురుచూస్తూ ఉన్నాడు" అని చెప్పగా ప్రవేశ పెట్టమన్నాడా ప్రభువు

గుహుడొచ్చి, చంకలో ఉన్న కొడుకును దింపాడు. ఆ బాలుడి అందం రాజును ఎంతో ఆశ్చర్యపరచింది. ఆ పిల్లవాడి చక్కదనాన్ని చూస్తూ "ఇటువంటి బాలుని, మావంటి చక్రవర్తులకులంలో పట్టించక, ఇలాటి నికృష్ట కులంలో పుట్టించిన ఆ బ్రహ్మని తిట్టినా తప్పులేదు" అని మనసులో అనుకుంటూనే, అప్పటికీ అనుమానం తీరక "వీడు నీ పుత్రుడేనా?" అని అడిగాడు "అవును! వాడు నా కొడుకే!" అన్నాడు గుహుడు.

ఆ పిల్లవాడ్ని దగ్గరకు రప్పించుకుని, వాడిబుగ్గల్ని మెల్లగా పుణికి "నీ పేరేమిటి?" అని అడిగాడు వాడు చిన్నగా నవ్వుతూ "పుష్పహాసుడు" అని ముద్దుగా అన్నాడు.

"మంచిపేరే పెట్టావు. వీడి నవ్వే వీడి పేరు చెప్తున్నది. ఆ! ఏం పనిమీద వచ్చావు?" అని రాజు అడగ్గా తన తలపాగా మడత లోంచి ఒక రత్న కంకణాన్ని బయటకు తీసి "దేవా! గాలం వేస్తే మంచి చేప ఒకటి చిక్కింది. దాన్ని కోసే సరికి దాని పొట్టలో నుంచి ఈ కంకణం బయటపడింది. ఇది మా బోటివాళ్ల దగ్గరుండ దగినది కాదని, తమరికి కానుకగా ఇద్దామని తీసుకొచ్చాను"అన్నాడు.

ధనుంజయుడు ఆ కంకణాన్ని అటూ–ఇటూ పరిశీలించగా ఏదో గుర్తొచ్చినవాడిలా శోకిస్తూ "అయ్యో సోదరీ! గంధర్వదత్తా! నిన్నుచూసి

ఎన్నాళ్లయిందో కదా! అయ్యయ్యో! నీ సౌందర్యమంతా నీటిపాలైంది కాబోలు! అక్కటా! నీ కాపురం ఎంతలోనే మాయమయిపోయిందే" అంటూ కళ్లు వొత్తుకున్నాడు.

అక్కడికి సమీపంలో ఉన్న ఆయన స్నేహితుడు, దేవముఖుడనే విప్రుడు "రాజా! ఎందుకలా శోకిస్తున్నారు?" అని అడగ్గా "స్నేహితుడా! ఇది గంధర్వుడిచ్చిన కంకణం! దీన్ని బట్టి మావాళ్లు గంగానదిలో పడి చనిపోయారనిపిస్తున్నది. అతి తక్కువకాలంలో విధి పగబట్టి మూడు ప్రాణాల్ని బలితీసుకుంది. మన లలిత జనించినప్పుడు తనకు కోడలు కలిగిందని బ్రహ్మానందపడింది. ఏ ముచ్చటా తీరిందికాదు "అని దీన్ని లలితకు ఇచ్చిరా!. అని తన స్నేహితుని చేత, ఆ కంకణాన్ని అంతఃపురంలోకి పంపించాడు.

"గుహుడా! నువ్వీ వస్తువు దాచుకోకుండా తెచ్చిచ్చినందుకు సంతోషిస్తున్నాను. నీకేదైనా కోరిక ఉంటే చెప్పు!" అన్నాడు

"కోరికతోనే మీ దర్శనానికి వచ్చాను. కాని, నేనిచ్చిన ఈ వస్తువు మీకు విచారాన్ని కలిగించింది. కనుక ఇంకోసారి తమ దర్శనానికొస్తాను" అన్నాడతడు.

కాని రాజు "లేదు! లేదు! ఇది మాకెంతో సంతోషం కలిగించింది. నీ కోరిక ఏమిటో చెప్పు!" అని బలవంతం చేయగా "దొరా! నాకీ పిల్లవాడు లేకలేక కలిగాడు. చాలా గారాబంగా పెంచుకుంటున్నాను. ఏదడిగినా కాదనకుండా చేస్తూ వచ్చాను. ఇప్పుడు వీడు అలవిమాలిన కోరికలు కోరుతున్నాడు. గొప్పచదువులు దేవరవారి పాఠశాలలో చదువుకుంటాడట" అనగానే, ముచ్చటపడిన ఆ రాజు కూడా అందుకు సరేనన్నాడు. యువరాజుతో సమానంగా అదే పాఠశాలలో అదే గురువుల దగ్గర విద్యకు అనుమతి పత్రం ఇచ్చాడు.

పుష్పహాసుని కథ

గురువులే పుష్పహాసుడి గ్రహణశక్తికి ఆశ్చర్యపోయేలా అతడన్నిటిలోనూ అఖండ పాండిత్యం సంపాదించాడు. సుందరకుని కంటే ఎన్నోరెట్లు మెరుగ్గా అన్నిటిలోనూ విద్యలు నేర్చాడు.

ధనుంజయ మహారాజు కొంతకాలం తర్వాత, తన కొడుకు ప్రతిభ పరీక్షించాలనుకుని "కుమారా! నేను రాచకార్యాలలో మునిగి నీ చదువుపట్ల అంతగా పట్టించుకోలేదు. ఏ ఏ విద్యలు చదివి, దేనిలో ప్రావీణ్యం గడించావు?" అడిగాడు.

రాజకుమారుడు ముందుగా గురువుల మీద నెపం నెట్టాలని చూశాడు. "మేం ఇద్దరికీ సమానంగానే బోధిస్తాం! ఒకరికెక్కువా ఒకరికి తక్కువా చెప్తామా ప్రభూ?" అన్నారు వారు.

తర్కంలో పాండిత్యం చూడదలచినా గుర్రపుస్వారీలో ప్రతిభ చూపించమని అడిగినా , తన కొడుకు ఏదో ఒక కుంటిసాకు చెప్పడం గమనించాక, లోపం తన కొడుకులోనే ఉన్నదని గ్రహించుకున్నాడు. పుష్పహాసుడి మీద ఈర్ష్యకూడా ఉందని తెలిసి తన కొడుకునే మందలించాడు. లోకజ్ఞానం వల్ల గుహుడు ఈ సంగతి పసిగట్టి, పుష్పహాసుడ్ని ఇక పాఠశాలకు పోవద్దన్నాడు.

ఓ రోజు దైవవశాన గుహుడికి ఇంకో చేప కడుపులో రెండో కంకణం కూడా దొరికింది. విద్య నేర్పించినందుకు కృతజ్ఞతగా ఆ కంకణం రాజుకిచ్చిరమ్మని కొడుకుని పంపగా, రాజుగారు వేటకెళ్లినట్లు తెలిసి పోబోతూంటే పుష్పహాసుడు రాజపుత్రిక లలిత చేత బలవంతంగా ఆమె అంతఃపురానికి రప్పించబడ్డాడు.

అప్పటికి చెలికత్తెలంతా తలోక పనిమీదా వెళ్లారు.

లలిత కథ

పుష్పహాసుడ్ని తిలక అనే అంతఃపురదాసి లలిత దగ్గరకు తీసుకెళ్లింది. అప్పుడామె వీణవాయిస్తూ మనోహరంగా పాడుతోంది. పాట పూర్తయ్యాక 'కంకణం తెచ్చింది ఇతడే' అని తిలక పరిచయం చేసి ఇద్దరూ ఒకర్నొకరు చూసుకోనేలా చేయడమేగాక, ఆ పిల్లకి కంకణం అతని చేతనే తొడిగించింది. విద్య వినయం - వాటికి మించి సౌందర్యం గల పుష్పహాసుడ్ని తొలిచూపుల తోనే లలిత వలచింది. తాను ప్రమాదంలో పడ్డట్టు గ్రహించుకున్న ఆ పల్లెవాడు, వెళ్లివస్తానని ఇక అక్కడ ఉండకుండా బైటకు వస్తూంటే రాజుకొడుకు సుందరకుడు అడ్డుకున్నాడు.

అంతఃపురంలోకి అనుమతి లేకుండా ప్రవేశించావంటూ అసూయకొద్దీ అతడ్ని నేరారోపణమీద శిక్షించాలనుకున్నాడు. అల్పబుద్ధులుగల వారికి మెల్లగా చెప్తే అర్థం కాదని, ఒక్క పిడికిటి పోటుతో రాజకుమారుడ్ని అవతలకు నెట్టి 'కంకణం అందజేయడం' అనే పని దిగ్విజయంగా పూర్తిచేసుకుని తన ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు పుష్పహాసుడు.

సందర్భం దొరికింది కదా అని సుందరకుడు ఎలాగైనా తన ప్రత్యర్థిని చెరసాలలో పెట్టించదలచి, "పుష్పహాసుడు తనని చచ్చిపోయేంతగా కొట్టాడని అంతఃపురస్త్రీల దగ్గర సానుభూతి పొందేలా చికిత్సలు అనీ- రాజవైద్యులు అనీ హడావుడి ప్రారంభించాడు. బాధనటిస్తూ, మూలుగుతూ అతడెంతో హింసించాడన్నట్టుగా నటించాడు.

లలిత కూడా దీనికి కంగారు పడుతూ "తిలకా! ఇందువల్ల మనకేమీ ముప్పు రాదు కదా!" అని అడిగింది ఆమె అభయమిచ్చింది.

సుందరకుడిది నటన అని తెలీక "అమ్మో! రాజపుత్రుణ్ణి పుష్పహాసుడు పొట్టనపెట్టుకోజూశాడు. కేవలం లోపలి కెందుకెళ్లావని

అడిగినందుకే ఇలా చావబాదిన దుర్మార్గుడికి విశ్వాసం ఏం ఉంటుంది? రాజుగారు చదువు చెప్పించినది ఇందుకా? స్వామిద్రోహి" అంటూ అసలు జరిగిందేమిటో తెలుసుకోకుండానే, పుష్పహాసుడ్ని అంతఃపురస్త్రీలు నిందించసాగారు. ఆహా! ఈ లోకం ఎంత గుడ్డిదో కదా– ప్రభుపక్షపాత దృష్టి అంతఃపురంలో ఆడవాళ్లకుంటుందనే కదా ఆ ఈర్ష్యాగ్రస్తుడు అంతగా నటించాడు.

ఆ వార్తకు చిలవలు పలవలు చేరి, ఒకరి నోటి నుంచి ఒకరి చెవికి, వారినుంచి మరొకరి చెవికి చేరేసరికి దాని అసలు స్వరూపమే మారిపోయింది. ఆవార్త అంతఃపురం దాటి పట్నంలో కొచ్చేసరికి ఎన్నెన్ని రంగులు పులుముకుందో విన్నప్పుడు దానికి కారకుడైన పుష్పహాసుడికే మతిపోయింది. గుహుడు కొడుకుని మందలించబోగా "తండ్రీ! నీ కొడుకు అటువంటి వాడని ఎలా అనుకుంటున్నావు?" అని ప్రశ్నించాడు పుష్పహాసుడు.

లోకం పోకడ – రాజుల వైఖరి బాగా తెలిసినందున గుహుడు "ఈవార్త రాజుకు కోపం కలిగించక మానదు. నువ్వు నా మాటకు అడ్డు చెప్పకుండా మన ఓడలు ద్వీపాంతరాలకు వెళ్తూంటాయి గనుక – ఓడ ఎక్కి అమరావతి పట్టణానికి పో! కొన్నాళ్లకీ రాజు కోపం చల్లారాక వద్దువులే" అనేసి పుష్పహాసుని ఆ రాత్రే నగరం దాటించాడు.

రాజు వస్తూనే విచారణ లేకుండా, జరిగింది పూర్తిగా తెల్సుకోకుండా, పుష్పహాసుణ్ణి బంధించమన్నాడు. భటులు వెళ్లి అతడెక్కడా కనిపించకపోవడంతో, గుహుడిని బంధించి తెచ్చారు. ధనుంజయుడు అతడిని "ఓరీ బెస్తవాడా! నీ కొడుకు పోతరించి చేసిందేమిటో నీకు తెలుసా? విద్యలు నేర్పించినందుకు ఇదా ఫలితం? వాడినెక్కడ దాచావో చెప్పు! లేకుంటే – నీ వంశాన్నంతటినీ నాశనం చేస్తాను..." అంటూ గద్దించేసరికి,

గుహుడు గజగజ వణుకుతూ ఇలా అన్నాడు.

"స్వామీ! దేవరవారి ఎదుట నిజమే చెబుతున్నాను. వాడు నాకు కడుపున పుట్టిన కొడుకుకాడు. చాలా కాలం క్రితం నాకు చేపలు పట్టేవలలో చిక్కుకుని దొరికాడు. గంగపుత్రుడని – గంగదత్తుడని మా కులం వాళ్ల కందరికీ తెలుసు! పిల్లలు లేరని నేను పెంచుకుంటున్నాను.

మళ్లీ ఇన్నాళ్లకు రెండో కంకణం దొరికింది. దాన్ని మీకు ఇచ్చి రమ్మని పంపాను. వాడు తమ సభ కొచ్చినపుడు, అక్కడెవరూ లేకపోవడంతో ఒక పరిచారిక వచ్చి, అతడ్ని అంతఃపురానికి తీసుకెళ్లిందట.

అంతలోనే యువరాజుగారొచ్చి లోపలి కెళ్లిన కారణం అడిగారట! వారు చెప్పలేనంత కోప్పడి నిలబడమని ఆపారట! మావాడు ఆగకుండా తోసుకుని వచ్చేశాడట! అందువల్ల ఏం పోయింది? నిలబడలేకపోయావా? అని నేను తిట్టిన తిట్లు సాధారణమైనవికావు దేవరా! దాంతో వాడు అలిగి నాతో చెప్పక ఎటో వెళ్లిపోయాడు. నేను మీ పాదసేవకుడిని రక్షించండి!" అంటూ పాదాల పైపడ్డాడు.

అంతా శాంతంగా విన్న ధనుంజయుడు "ఓరీ! నువ్వు చెప్పిందాన్ని బట్టి వాడు నీ కొడుకు కాడని తేలిపోయింది. రెండో కంకణం కూడా నీటిలోనే దొరికిందన్నమాట" అంటూంటే, పక్కనున్న సుందరకుడు తండ్రికి రోషం పుట్టించే మాటలు అని రెచ్చగొట్టసాగాడు .

"అలిగి వెళ్లినవాడు ఎప్పుడో రోజురాకపోడులే! అప్పుడు చూద్దాం! ఈ పల్లెకారుడికి ఏ పాపం తెలీదు. వీడ్నేం చేస్తాం? పోరా ఫో! వాడొచ్చాక కనబడు" అంటూ, గుహుడ్ని పంపేశాడు.

తిలక ఈ సంభాషణంతా విన్నది. ఆమెకి మహదానందమైంది. అతడు పల్లెకారుడి కొడుకు కాడని వెంటనే లలితకు చెప్పేసింది.

ఉత్తమకులంలో పుట్టినందున అన్నీ మంచిలక్షణాలు వచ్చి ఉంటాయని ఇద్దరూ అనుకున్నారు. లలిత విరహిణి అయింది.

అందువల్ల మరిన్ని విశేషాలు తెలుసుకు రావడానికి, తిలక యత్నించి గుహుడి ఇంటి పరిసరాల్లో తిరగసాగింది. పుష్పహాసుడి స్నేహతుడొకడు ఆమెకు ఒక పత్రం ఇచ్చాడు. అందులో పుష్పహాసుడు 'తాను వటపాద పారణ్యంలో ఐదురోజులు తర్వాత దేవానగరంలో ఆర్రోజులు ఉంటానని' సూచించాడు.

తిలక సహాయంతో లలిత విరహాన్నోపలేక అక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకున్నది. ఓ అర్ధరాత్రి లలిత రత్నాలు – మణులు అమర్చుకుని, గుర్రంమీద తిలకతో సహా కోటదాట డానికి – పుష్పహాసుణ్ణి ఈ రెండు ప్రాంతాల్లో ఏదో చోట కలుసుకోడానికీ నిర్ణయించుకుంది.

రాచకన్యలకు గుర్రపుస్వారీ అలవాటే గనుక లలిత ఓ గుర్రాన్ని స్వారీకి ఎంచుకుంది. లలిత గుర్రం తోల్తుంటే, తిలక వెనుక కూర్చున్నది. అయితే తిలకకు ఎప్పుడూ గుర్రం మీద ప్రయాణం అలవాటు లేకపోయేసరికి ఆమె దారిలో ఎక్కడో జారిపోయింది. తృటిలో కేకకు కూడా అందనంత దూరం వెళ్లిపోయింది లలిత.

కొంతసేపటి తర్వాతగాని, ఆమెకు తానొక్కతే గుర్రం పై ఉన్నట్టు తెలియరాలేదు. రాత్రి చీకట్లో ఎక్కడ జారిపోయిందో? వెనక్కు వెళ్లడం క్షేమంకాదు. పుష్పహాసుని కోసం ముందు కెళ్లడమే ఉత్తమం అనుకొంది.

సఖి జారిపోయినందుకు చింతిస్తూండగా ఆమెకు ఆకలి మొదలైంది. తినడానికేం దొరుకుతాయా అని ఆలోచిస్తూనే ఒక మర్రి చెట్టు నీడన గుర్రాన్ని ఆపింది. చుట్టూ చూడసాగింది.

గోవిందుడనే బ్రహ్మచారి కథ

ఆ మర్రిచెట్టు ఉన్న ప్రాంతానికి దగ్గర్లోనే తామ్రపురం అనే ఊరుంది. అక్కడందరూ కాపులే. వారికి పౌరోహిత్యం చేస్తూ గోవిందుడనే బ్రహ్మచారి ఆ ఊళ్లోనే ఉంటున్నాడు. అతనికి దక్షతగా తల్లి ఒక్కతే! విద్యాగంధం లేకపోవడం వల్ల అతనికి చాలా కాలంగా పెండ్లికాలేదు. "నాకు పౌరోహిత్యం ద్వారా లభించే వన్నీ అనుభవించగల పెళ్లాం లేకపోయాక ఎన్ని ఉండి ఏం లాభం?" అని కొడుకు పెళ్లికి తొందరపడుతూంటే,. "ఇరవయ్యేళ్ల వాడివి - అంత తొందర దేనికి" అని తల్లి ఓదార్చసాగింది. అయినా గోవిందుని గోల గోవిందుడిదే!

ఒకనాడు ఝాము పొద్దెక్కాక - ఆకులు కోసుకోడానికి గోవిందుడు అడవికి వెళ్లాడు. ఆ మర్రి చెట్టు దగ్గర కొచ్చేసిరికి అటూ ఇటూ చూస్తూ కనిపించింది. లలిత. గ్రామం దాపున ఉన్న ఆ అడవికి దగ్గరగా అంత సుందరాంగి ఒంటరిగా కనిపించేసరికి, తానూ బ్రహ్మచారి కావడంతో ఆమె దగ్గర కెళ్లి వివరాలు అడిగాడు.

ఆమె ఏమీ చెప్పక పోయేసరికి, తానే తన పరిచయం చేసుకుని "ఆకలిగా ఉన్నట్టున్నావు. మా ఇంట భోజన సదుపాయం చేస్తాను. రా" అన్నాడు.

ఆమెకు చాలా ఆకలిగా ఉండడంతో, వేరే దారిలేక "సరే! పద!" అంది. చాలా ఆనందించి అతడు ఆమెను తన ఇంటికి తీసుకెళ్లాడు "అమ్మా! ఈమెకు ఎవరూ ఉన్నట్టులేరు. వివరాలు అడిగితే ముభావంగా ఊరుకుంది. ముందు చక్కని భోజనం పెట్టి, తర్వాత మెల్లగా నచ్చజెప్పు! నేనాపిల్లని చేసుకుంటాను" అని ఆశపడ్డాడు. తల్లి ఆ పిల్లకు స్నాన - భోజనాదులకు అన్ని ఏర్పాట్లు చక్కగా చేసి, కమ్మగా భోజనం పెట్టి "అమ్మాయీ! మావాడు గొప్ప పురోహితుడు. ఈ చుట్టు ప్రక్కల మూడూళ్లు మనవే! దేనికీ లోటుండదు" అని పెళ్లి కొప్పించాలని నాందీ ప్రస్తావనలు చేసింది. మరోవైపు

పంచాంగం తీసి చూసి, మూడు నెలల వరకూ పెళ్లికి సరైన ముహూర్తాలు లేనందుకు, గోవిందుడు దిగులుపడసాగాడు.

రెండ్రోజులు తిరిగేసరికి, ఊళ్లోని పడుచుకుర్రాళ్ల తాకిడి ఏదో ఒక సాకుతో ఆ ఇంటికి అధికమైంది. అంతఃపురంలో ఉండాల్సిన అందగత్తె, ఆరుబైట పూరికొంపలో ఉంటే అలాగే ఉంటుంది మరి!

రెండ్రోజులు తిరిగేసరికి, సొమ్ములేదని కనిపెట్టేసిన లలిత "ఓ బ్రాహ్మణుడా! ఈ కంకణం పుచ్చుకొని అమ్మ తీసుకొచ్చేవంటే చాలా డబ్బొస్తుంది. లోటు లేకుండా జరిపించవచ్చు!" అనేసరికి అంత వెలగల నగను మహదానందంగా పుచ్చుకుని సమీపానగల పట్నానికి పయనమయ్యాడు గోవిందుడు.

అక్కడ ఆ కడియాన్ని అమ్ముతూండగా, గొప్ప వెల కలిగిన ఆ కడియాన్ని తక్కువ వెలకు అమ్మడం చూసిన రాజభటులు అతన్ని పట్టుకుని, నగరాధ్యక్షుని దగ్గరకు తీసుకెళ్లారు.

అయితే రాకుమార్తెని తప్పించడానికి, తిలక పన్నిన ఉపాయం వల్ల దొంగలు కోటగోడకు గొలుసువేసి లోపలికి దూరి రాకుమార్తెను ఎత్తుకుపోయినట్లుగా భావించడం జరిగింది. అందువల్ల అటువంటి దొంగలను పట్టుకోవడానికి రాజు ఎందరో భటులను పంపాడు.

రాజభటులు అతడ్ని కడియంతో సహా, ప్రభువు ముందర హాజరుపరిచారు. కడియాన్ని చూస్తూనే రాజు గుర్తుపట్టి దుఃఖంతో లలితని తల్చుకుంటూ, "నీకీ కడియం ఎలా వచ్చింది.?" అని గోవిందుని అడగ్గా "నాభార్యదే" అన్నాడు అతడు.

"పెళ్లేకాని బ్రహ్మచారివి నీకు పెళ్లామేదీ?" అన్నప్పుడు "పిల్లను ఇంటికి తెచ్చుకున్నాను. ఇంకా పెళ్లి చేసుకోలేదు" అనేసరికి, ఇతడూ ఆ ముఠాలోని వాడు కాడు గదా! ఏమో పరీక్షించి చూడాలనుకొని, కొందరు భటుల్ని తక్షణమే అతని ఇంటికి పంపించాడు. వారు కనుగొని తిరిగివచ్చి

"దేవా! ఇతడి ఇంట్లో ఓ ముసలిది తప్ప మరెవరూలేరు. వారం రోజులక్రితం ఓ చిన్నదాన్ని తెచ్చి ఇంట ఉంచాడట! ఇప్పుడేమైందో తెలీదని గ్రామస్తులు అంటున్నారు. ఆ ముసల్దాన్ని అడిగితే కొడుకు ఇంటలేని సమయం చూసి, అదెక్కడికో పారిపోయిందంటోంది" అన్నారు.

ఈలోగా మరికొన్ని ఆభరణాలు లలిత ధరించినవి దొరకడంతో బాటు, కొందరు దొంగలు కూడా పట్టుపడ్డారు 'లలిత ఎక్కడ' అని రాజువారిని గద్దించాడు.

వాళ్లు భయంతో వణుకుతూ "దేవరా! మేము నిజమే చెబుతున్నాం! వినండి! తూర్పు సముద్రప్రాంతపు అరణ్యంలో మేం సంచరిస్తుండగా పదహారేళ్ల చిన్నదొకర్తె గుర్రం మీద చాలా వేగంగా ఎక్కడికో పోతోంది. మేము కర్రలు అడ్డంగా విసిరి, గుర్రాన్ని ఆపేసి ఆమె దగ్గర సొమ్ములు దోచుకున్నాం! ఇంతలో మాలో ఒకడికి ఆ చిన్నదాన్ని పెళ్లాడాలని బుద్ధిపుట్టింది. "మీలో తెలివి ఎంతో చూడాలి" అంటూ ఈ చిన్నది బారెడు కర్రనొకదాన్ని తీసుకొని. నూరుబారల దూరం విసిరి, ఆ కర్ర ఎవరు ముందు తీసుకొస్తే వారిని పెళ్లాడతానంది. మేము కాలిసత్తువ కొద్దీ పరుగెత్తాం! ఈలోగా ఆమె గుర్రం మీద ఉడాయించింది"... అన్నారు.

'నిజానిజాలు తేలేవరకు మీకు ద్వీపాంతర శిక్షే గతి' అని వారికా శిక్ష విధించాడు. లలితకోసం సమీప అరణ్యాల్లో వెతకమని భటుల కాజ్ఞాపించాడు.

అంతవరకూ కథ చెప్పిన మణిసిద్ధుడు " మన ప్రయాణానికి వేళయింది. అనంతర ఉదంతాన్ని పై మజిలీలో చెప్పుకుందాము" అని ఇలా చెప్పసాగాడు.

కాశీ మజిలీ కథలు

43 వ మజిలీ

గోపా! వినుము........

అట్లా లలిత సఖి గుర్రం మీంచి పడినా– అది ఇసుక నేల గనుక కొంచెం దెబ్బ తగిలినా, చాలా సేపు ఒళ్లెరగక కొంతసేపటికి స్పృహ తెచ్చుకుని చుట్టూ చూడసాగింది. కళ్లు తెరిచి చూసేసరికి తెల్లవారుతోంది. మెల్లగా నాలుగువైపులా వెతికింది. లలిత కనిపించలేదు.

"నేను పడిపోవడం గమనించి ఉండదు. పోనీ! అది భర్తను కలుసుకుంటే అంతేచాలు!" అని దారిన పడి నడవసాగింది. అలా వెళ్లగా కొంతసేపటికి కనిపించిన ఓ గృహస్తుని ఇంట భోజనం చేసి, తానెవరో ఎవరికీ చెప్పకుండా రేవానగరానికి దారి అడిగి తెల్సుకున్నది. అది ఒక సముద్రపు రేవు పట్టణమనీ– ఇతర దేశాలకు వెళ్లేవారు అక్కడ ఓడలు ఎక్కి వెళ్తారనీ తెలిసి, ఎలాగో ఆ పట్నాన్ని చేరుకుందామె. ఆమె ఆ ఊరొచ్చేసరికి సూర్యాస్తమయం అయింది. పుష్పహాసుడు అక్కడ కొన్నాళ్లు బసచేస్తానని ఉత్తరంలో రాశాడు కదా! అందువల్ల ఆమె అక్కడకు చేరుకున్నది.

పోలిశెట్టి కథ

పట్టణంలో జన సంచారం అధికంగా ఉన్నందున. ఆమె తన ప్రయాణాన్ని మర్నాటికి వాయిదా వేసుకున్నది. ఊరిబయట గ్రామదేవత గుడి ఉంటే, దాని ఎదురుగాఉన్న రావి చెట్టు తొర్రలో చీకట్లోనే విశ్రమించి ఆకలిగా ఉండటంతో నిద్రపట్టక అటూ ఇటూ కదలసాగింది. ఏ జంతువైనా అడవివైపు నుంచి బాధిస్తుందేమో అని ఆమె మెలకువగానే ఉంది.

ఇంతలో అక్కడికి ఒక పురుషుడు వచ్చి, అగ్గిపుల్ల వెల్గించి చూశాడు. ఆ వెలుగులో, చెట్టు తొర్రలో ముడుచుకు పడుకున్న తిలక అతడ్ని స్పష్టంగా చూసింది.

చెవులకి రవ్వల దుద్దులు, వ్రేళ్లకి రంగురాళ్ల ఉంగరాలు, చేతులకి బంగారు మురుగులు- ఛాయ నలుపైనా నిగారింపు మెరుపుతో ఉన్న అతడు బానపొట్టతో భాగ్యవంతుడని చెప్పకనే చెప్తున్నాయి. అంతలో అతని సేవకుడు నర్సిగాడనేవాడు అక్కడికొచ్చాడు. వాళ్లమాటలనుబట్టి శెట్టిగారెక్కడో 'అప్పి' అనే దాని సహాయంతో రామాబాయి అనే ఆవిడ దగ్గరున్న ఓ రాచబిడ్డ పోలికగలదాన్ని మోహించాడనీ, సంకేత స్థలంలో అక్కడ కలుసుకోమన్నాడనీ మొదట అర్థమైంధి తిలకకు.

అయితే, అక్కడ శెట్టికి తేలు కుట్టడం, ఆ అతితెలివి సేవకుడు ఇంటి కెళ్లి తేలుమందుతో బాటు శెట్టి పెళ్లాన్నీ తీసుకు రావడం. ఈలోగా అప్పి తీసుకొచ్చిన అందాల భరిణెను అతడు చూడటం, శెట్టి భార్య శెట్టిని తిట్టి ఇంటికి తీసుకుపోవడం చకచకా జరిగిపోయాయి. ఆ చిన్నదాని ముఖాన్ని బట్టి ఆమె ఖచ్చితంగా జారిణికాదని – గొప్పింటి బిడ్డేనని తిలక అర్థం చేసుకుంది.

మర్నాడా పెద్దపట్నంలో బ్రాహ్మణవీధిని వెతికిపట్టుకుని, అక్కడ అటూ–ఇటూ తిరుగుతూండగా ఒక బ్రాహ్మణుడామెను పలకరించి "ఎందుకమ్మా! ఈ వీధిలో అటూ – ఇటూ తిరుగుతూన్నావు" అని అడిగాడు.

ఆమె తనకు దూరదేశ ప్రయాణమున్నదని చెప్పి ఆకలిగా ఉందంది. ఆ బ్రాహ్మణుడామెకు అన్నం పెట్టమని అప్పి అనే దాసీదాన్ని కేకేశాడు. ఆమె తిలకను పెరటివైపు తీసుకుపోగా, అక్కడ గతరాత్రి ఆమెకు కనబడిన రాచపడుచులాంటి పిల్ల భోజనం పెట్టింది.

ఆ ఇంటి ఇల్లాలే రామాబాయి. బాగానే ఉంది. కాని ఆ పిల్లవారి పిల్లకాదు. కాని రామాబాయికి పూనకాల వాళ్లపిచ్చి అధికం. ఎవరైనా పూనకం (శివాలు) తో ఏది చెప్పినా భక్తిగా చేస్తుంది. అది కనిపెట్టిన అప్పి, సుబ్బిశెట్టితో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. తానే శివాలాడి, అమ్మవారికి నైవేద్యం పంపే పేరిట ఆ పిల్లని కలుసుకోడానికి ఆమెని అక్కడికి రప్పించడానికి పథకం సిద్ధం చేసి గతరాత్రి తిలక పడుకున్న రావిచెట్టు దగ్గర సంకేతం ఏర్పరచింది.

ఆ రోజు రాత్రి కూడా తిరిగి అదే ప్రదేశానికి చేరుకుని పడుకున్నది తిలక. రాత్రి ఓ ఝాము గడిచాక ఆ ఊళ్లో వీరుడనే సాలెవాడు కొడుక్కు జబ్బుచేయగా అమ్మవారిగుడికి వస్తానని భార్యతో సహా వచ్చాడక్కడికి. అప్పివల్ల మునుపటి రాత్రిలాగానే సంకేతం అందుకున్న సుబ్బిశెట్టి ఆ పిల్లని వలచి ఆమెతో సంగమకోసం ఉవ్విళ్లూరిపోతూ, చీకట్లో తెలీక సాలెవాడిభార్యని ఆ చిన్నదానిగా అపోహపడి చెయ్యిపట్టుకున్నాడు. ఆమె అరిచేసరికి వీరుడొచ్చి సుబ్బిశెట్టిని తన్నగా, ఆ దెబ్బ ఆయువుపట్ల మీద తగిలి శెట్టి మరణించాడు. వీరుడా శవాన్ని గ్రామదేవత అమ్మవారి గుళ్లోకి చేరవేశాడు.

తిలక ఇదంతా గమనిస్తూనే ఉంది...

ఇంతలో ఆ చిన్నదాన్ని వెంటబెట్టుకుని నైవేద్యాల అర్పణపేరుతో గుడి దగ్గరకు తీసు కొచ్చింది అప్పి. "నువ్వు నైవేద్యం చేస్తూండు! నేను ఇప్పుడే వస్తా"నంటూ అప్పి అవతల కెళ్లింది. ఆ చిన్నది గుడికి దగ్గరగా కూర్చొంది.

ఈ లోగా ముందు రోజు రాత్రి లాగానే శెట్టి భార్య అనుమానంతో అక్కడికి వచ్చింది. గుడిలోపల గోడకు ఆన్చిపెట్టిన శెట్టి శవం కూర్చొని

నిద్రపోతున్నట్లు ఉంది. అది చూసి ఇద్దరినీ తలారుల కప్పగించి శిక్షింపచేద్దాం! ఆ పిల్లవల్లనే తన భర్త రోజూ ఇక్కడికొస్తున్నాడు' అని అపోహపడిన శెట్టి భార్య ఆ చిన్నదాన్ని బరబరా లాక్కెళ్లి గుళ్లోకి తోసేసి, తలుపుగడియ పెట్టి ద్వారం దగ్గర కాపలా కూర్చుంది.

తెల్లారాక భటుల్ని చూసి "నా భర్త ఓ స్త్రీతో తిరుగుబోతై కూర్చున్నాడు. ఇద్దర్నీ పట్టుకున్నా! శిక్షింప చెయ్యండి" అంటూ గుడి తలుపులు తీసింది శెట్టి భార్య గర్భగుడి చిరుచీకట్లలో ఆస్త్రీ ధ్యానం చేస్తూ కూర్చుంది. శెట్టి తెలివిలేనివాడిలా తలపక్కకు వాల్చాడు కాబోలు ననుకున్న తలారులు, కొంచెం మర్యాదగా "చాలు! శెట్టివారూ! లేవండి" అంటూన్నా అతడిలో చలనం లేకపోయేసరికి బైటికి రావడానికి సిగ్గు పడుతూన్నాడనుకున్నారంతా 'ఇదంతా ఆ స్త్రీ వల్లనే వచ్చింది' అంటూ ఆమెను పట్టుకొని తిడుతూంటే, అంత వరకూ జరిగిన సంఘటనలన్నిటికీ ప్రత్యక్ష సాక్షి అయిన తిలక, ఇక ఆగలేక ఆ నిర్దోషిని రక్షించాలనుకుంది. సమయం కోసం చూడసాగింది.

ఈ లోగా ఎంతకూ బైటికిరాని శెట్టిని పరీక్షించిన తలారులు అతడు మరణించాడని ధృవపరచి గుడి వాకిట్లోకి లాగేశారు. రాజభటులకు గ్రామాధికార్లకు కబురువెళ్లింది. శెట్టిభార్య వాంజ్మాలాన్ని బట్టి ఆస్త్రీయే శెట్టిని చంపేసిందని అంతా అనుకోసాగారు.

ఆ స్త్రీకి అంతకాలంగా ఆతిధ్యమిచ్చిన రమాబాయి – ఆర్యభట్టుల దగ్గరికి వెళ్లింది తిలక. "అయ్యా! మీరు అన్నం పెట్టించిన విశ్వాసంతో చెప్తున్నాను. మీ ఇంట్లో ఉండే చిన్నది ఏ పాపమూ ఎరుగదు. కాని, ఆమె పోలిశెట్టిని చంపేసిందని రాజభటులు నిర్బంధించి తీసుకున్నారు. ఏది అడిగినా ఆమె మౌనంగా వుంటోంది. అందువల్ల తప్పు ఆమెదే కాబోలు అనుకుంటూన్నారు. అందరూ, వేగంగా వెళ్లి ఆమెను కాపాడుకోండి" అని చెప్పింది. ఆర్యభట్టు" ఏదో మా అన్న నాకు అప్పగించ బట్టి ఆమెకి ఆతిధ్యమిచ్చాను. కూతుర్లా చూసుకుంటున్నాను. ఇంతలో ఈ అఘాయిత్యం చేస్తుందనుకోలేదు" అంటూండగా, ఆర్యభట్టు ఇంటికి రాజభటుడొచ్చి అతడిని ఆస్థానానికి పదమన్నాడు. ఏం చెప్తే ఏం వస్తుందో అని భయపడుతూ వున్న ఆ బ్రాహ్మణుడ్ని రక్షించడానికి తిలక తానూ బయల్దేరింది.

అయితే- దురదృష్టం కొద్దీ, ఆమె ఎంత చెప్పినా ఆమె కూడా ఆ నేరంలోనే ఇరుక్కుంది. ఆమెనీ- ఆర్యభట్టుని కూడా చెరసాలలో పెట్టవలసిందంటూ దండనాయకుడు ఆజ్ఞాపిస్తుండగా, ఒక వైపునుంచి కోలాహలం వినిపించింది.

"పుష్పహాసుడనే వాడు, చక్రవర్తిగారి కొడుకును కొట్టాడట! శిక్షకు భయపడి ద్వీపాంతరాలకు పారిపోతూంటే పట్టుకున్నాం! వాడొక గుడిలో దూరి తలుపులు వేసుకున్నాడు" అని వార్త తీసుకురాగా, ఆ విచారణను తాత్కాలికంగా వాయిదా వేసి అటువైపు వెళ్లిపోయాడు దండనాయకుడు. తీరా అతడు వెళ్లే వేళకి, అతడు ఆలయం వెనుకవైపు ప్రహరీ ఎక్కి అవతలకు దూకి పారిపోయాడు.

మళ్లీ శెట్టి హత్యోదంతం విచారించి, ఇందులో ఆర్యభట్టు నిర్దోషి అని అతడికేమీ తెలీదని అతడ్ని విడిచిపుచ్చి ఇంటికి పొమ్మన్నాడు దండనాయకుడు. సాక్షినంటోంది కనుక తిలకనూ - నేరారోపణ చేయబడింది కనుక ఆ స్త్రీనీ ఆ నాటికి బందిఖానాలో పెట్టాడు. మర్నాడు మళ్లీ విచారణ కొనసాగిస్తుంటే, పుష్పహాసుడు పట్టుబడ్డాడని ఒకడ్ని తీసుకొచ్చి దండనాధునికి అతడ్ని చూపించగా అతడు తాను పుష్పహాసుడ్ని కాననీ మకరందుడిని అనీ చెప్పి భటులు తనని అన్యాయంగా పట్టుకున్నారన్నాడు. అతడ్ని చెరసాలలో పెట్టమన్నాడు. పోలిశెట్టిని ఆ స్త్రీ చంపినట్లూ తిలక ఆమెకు సహకరించినట్లూ ధృవపరిచి, పై అధికారి దగ్గర్నుంచి ఆజ్ఞ వచ్చేదాకా వారినీ బందిఖానాలో ఉంచమన్నాడు.

వారిని ఉంచిన బంధ్రిఖానాలో పురుషుల గదికీ, స్త్రీల గదికీ మధ్య ఇనుపకిటికీ ఉంది. తిలక అందులోనుంచి అతడ్ని చూస్తూ "అందగాడా! నీవు ఇక్కడికి ఎప్పుడొచ్చావు? సింధువారనగర వాస్తవ్యులెవరినన్నా చూశావా"? అనగానే, అతడు తిలకకి తెలిసేలా మెల్లగా ఏదో గొణిగాడు. "నా కథ చాలా పెద్దది. నీతో ఉన్న స్త్రీ ఎవరు? నువ్వెందుకిలా చెరసాలపాలయ్యావు? నీ మొదటి వృత్తాంతం చెప్పక్కర్లేదు. తర్వాతది చెప్తేచాలు!" అనేసరికి ఆమె త్రుళ్లిపడి, "ఇంకా ఆమె నాకేమీ చెప్పనక్కర్లేదనుకున్నదేమో! ఎంత అడిగినా ఆమె ఏం చెప్పడం లేదు. ఇక - నా గురించి సమాచారం ఇది" అని తాను ఆ గ్రామం వచ్చింది. మొదలు అంతవరకు జరిగిన కథంతా చెప్పింది.

అది విన్న మకరందుడు- ఆ చిన్నదాని శీలాన్ని మెచ్చుకుంటూ దండనాయకుడి అన్యాయం గురించి చాలా చింతించాడు.

గంధర్వదత్త కథ

ఆ స్త్రీ వృత్తాంతం తెలుసుకోగోరిన తిలకకు, ఎట్టకేలకు సమాధానం లభించింది. గోడకటూ ఇటూ నిలబడి వారిద్దరూ మాట్లాడుకుంటూన్న మాటలు విన్నతర్వాతనే, ఆమెకు తన వృత్తాంతం తిలకతో చెప్పాలనిపించి ఇలా ప్రారంభించింది...

"పుత్రీ! నువ్వు ఉపకారం చెయ్యడానికొచ్చి ప్రాణాలను పోగొట్టుకుంటున్నావు. నీ వంటి పరోపకారికి గాక ఇంకెవరికి చెప్తాను?

నా జన్మభూమి కూడా సింధువారపురమే! మాతండ్రి పేరు సృంజయుడు. నా సోదరుని పేరు ధనుంజయుడు. నాపేరు గంధర్వదత్త. నన్ను మాతండ్రి వింధ్యకూట నగరాన్ని పాలించే మణికుండలునికి ఇచ్చి పెళ్లిచేశాడు. నేను అత్తవారింటి కెళ్లాక నాకొక బిడ్డ జన్మించాడు. వాడి జాతకం, ముఖలక్షణాలు చూసిన దైవజ్ఞులు అతడు చక్రవర్తి కాగలడని చెప్పారు. తర్వాత నాలుగేళ్లు ఆ పిల్లవాడితో మాకు రోజులు క్షణాల్లా దొర్లిపోయి ఆనందంగా గడిచిపోయాయి. ఒకనాటి రాత్రి మేం ఆనందంగా వెన్నెలలో మేడమీద పడుకొని నిద్రపోయాం!

తెల్లవారి లేచి చూసేసరికి నేను మాత్రం ఈప్రాంతంలోని ఒక అగ్రహారంలోని సూర్యభట్టు అనే బ్రాహ్మణునికి వరికుప్పలో స్పృహ తప్పిపడి ఉండగా దొరికాను. కాని ఆయనకు నేను నా కథేమీ చెప్పలేదు. మూగదానిలా - వెర్రిదానిలా ప్రవర్తించసాగాను 'నా గతమంతా ఒక కల' అనుకుంటూ వైరాగ్యంతో కాలక్షేపం చేయసాగాను. కొన్నాళ్లకు నా దురదృష్టం కొద్దీ అతడు మరణించాడు. ప్రాణాలు పోయేముందు, తన తమ్ముడైన ఆర్యభట్టును పిలిపించి తన ఆస్తితోపాటు అంతకాలం పుత్రికలా చూసుకున్న నన్ను కూడా ఆయనకు అప్పగించాడు. వాగ్దానం తీసుకుని దేవుడిచ్చిన కూతురిగా భావించమన్నాడు. ఆ పుణ్యాత్మునికి నామీద కలిగిన వాత్సల్యానికి చాలాకాలం పాటు దుఃఖం నన్ను వెంటాడింది. ఎన్ని సార్లు ఏడ్చి ఉంటానో లెక్కలేదు.

ఆర్యభట్టు నన్ను ఊరడించి, అన్నకిచ్చిన మాటప్రకారం నన్ను ప్రేమ - దయ - వాత్సల్యాలతో చూసుకోసాగాడు. అతడి భార్య రమాబాయీ కూడా, భర్త అంటే భయం వల్లనో - ఎందుచేతనోగాని నన్ను ఆదరంగానే చూసేది. మా అబ్బాయికి పుష్పదంతుడని పేరు. మీ మధ్య పుష్పహాస ప్రసంగం రాగానే వాడు గుర్తొచ్చాడు. ఇక ఆ తర్వాత రమాబాయితో శెట్టికి ఏం ఒప్పందం కుదిరింతో ఏం కానుకలు ఆశించిందో అప్పిచేత నన్ను గ్రామదేవత ఆలయానికి వరుసగా రెండురోజులు తిప్పించింది. నైవేద్యాలపేరుతో. నేను వారింట పడివున్న దిక్కులేని దాన్నని బంధువునని లోకం గుర్తించింది కాబోలు! తర్వాత కథ నీకు తెలిసిందే! అదీ నా వృత్తాంతం" అని చెప్పిందామె.

అప్పుడు తిలక ఆశ్చర్యపోతూ "గంధర్వదత్తా! నీ భర్తా పుత్రుడూ ఏమయ్యారో నీకు తెలీదు. నీకోసం మీ సోదరుడు విచారించని రోజులేదు" అంది. "నీకెలా తెలుసు? అలాగే నాభర్త గురించి పుత్రుని గురించీ నీకు ఏమన్నా తెలుసా?" అని అడిగిందామె ఆశ్చర్యపోతూ.

అప్పుడు తిలక "అమ్మా! నేను మీ సోదరుని పుత్రిక సఖురాలిని. అందువల్ల మీరు తెలుసు! ఒక రోజు ఒక పల్లెకారుడు కంకణాలు చేప కడుపులో దొరికాయంటూ తెచ్చిస్తే, వాటి మీద నీ పేరుండటంతో, నీకై వెతికించసాగారు" అన్నాక "అవును! ఆ రాత్రి కంకణాలజత దిండుక్రింద నేనే ఉంచాను. అవి చేపకడుపులోకి ఎలా వెళ్లాయో?" అని ఇంకా ఆశ్చర్యపోయింది గంధర్వదత్త. తర్వాత ఆమె తన వాళ్లందరి గురించీ పేరుపేరునా అడిగింది. అంతా క్షేమమే కానీ, లలిత మాత్రం అక్కడలేదు 'కన్యావరయతే రూపం' అన్నట్లు ఓ సుందరుని వలచింది అంటూ ఉండగా రాజభట్టులొచ్చి "పుష్పహాసుడవో - మకరందుడవో - నీవు ఎవరైనా అగుగాక! నీకు ద్వీపాంతర వాసశిక్ష విధించారు ప్రభువులు" అని స్త్రీల వైపు తిరిగి మీరూ అదృష్టవంతులే! మీకు ఉరిశిక్ష విధించక, కనికరించి మీక్కూడా ద్వీపాంతరం విధించారు" అని వాళ్లు చెరసాలలో ఉన్నవారికి తెలియజేశాడు.

అంతవరకు కథ చెప్పిన మణిసిద్ధుడు ఆ నాటికి వేళ మించి పోయినందున, కథ ఆపి తర్వాత మజిలీలో - ఇలా ఆ కథను కొనసాగించాడు.....

కాశీ మజిలీ కథలు

44 వ మజిలీ

గోపా! వినుము....

అట్లా ఆరోజు పుష్పహాసుడు, దేవాలయం ప్రాకారం ఆవలినుండి దూకి ఒక దట్టమైన మల్లెపందిరి మీద పడ్డాడు. త్రాళ్లతో నేసిన ఆ పందిరిమీద ఒత్తుగా మల్లెపొద పరుచుకుని ఉండడం వల్ల, ఎత్తు నుంచి అతడు పడినప్పటికీ అతడి కేమీకాలేదు. పూలపాన్పుమీద పడినంత సుఖంగా ఉన్న దతనికి, అప్పుడు అక్కడో పదహారేళ్ల చిన్నది మల్లెపూలుకోస్తోంది. ఆమె పేరు వజ్రమాల వజ్రదత్తుడనే వర్తకుని కూతురు.

వజ్రమాల కథ

ఆకాశం నుంచి మెరుపులా జారి పడిన అతడ్ని చూసి, బెదిరిపోయింది. కాస్త పక్కకు తొలగి, నిలబడి చూడసాగింది. అతడా మల్లెపందిరి మీద నుంచి దిగి, ఆమె దగ్గరకు వెళ్లాడు. "ఈ ఇల్లెవరిది? నీపేరేమిటి? నీ ముఖం చూస్తే మంచి దానిలా కనిపిస్తున్నావు. నువ్వు నాకో ఉపకారం చేసిపెట్టాలి" అన్నాడు మెల్లగా. ఆమె అతడ్ని రెప్పలార్పకుండా చూస్తూ మోహావేశంతో మన్మథావస్థచెంది, కొద్దిగా తలవంచి "నువ్వుదివి నుంచి దిగి వచ్చిన జయంతుడివి కాబోలు! తప్పకుండా నీ కోరిక తీరుస్తాను. నీ అభీష్టమేమిటి?" అని అడిగింది.

అడుగుదామని అతడు అనుకొనేలోగా, వజ్రమాల అనే ఆ చిన్నది తన తండ్రి రత్నాల వ్యాపారం గురించీ, ద్వీపాంతరాలలో అతడు చేసే రకరకాల విలువైన రాళ్ల వ్యాపారాల గురించీ చెప్పి తన తండ్రి, అమరావతి వెళ్లినట్లు, తామైనా ఎందుకు ఆగవలసి వచ్చిందంటే, ఆ మధ్య పోలిశెట్టి అనే తమ బంధువుకు బలవన్మరణం ప్రాప్తించడం వల్ల అలా జరిగినట్లు, అయితే నేమి? ఈ సుందరాకారుని సందర్శన భాగ్యం లభించినట్లు చెప్పింది. ఆమె భర్తకూడ మామవెంట అమరావతి వెళ్లాడని కూడ చెప్పింది.

అప్పుడా పుష్పహాసుడు, "ఈమె ఒకనికి ఇల్లాలై ఉండికూడా, ఇటువంటి మదన వికారం పొందడం ధర్మ విరుద్ధమని ఎరుగదో ఏమో!? ఆహా! స్త్రీల చేష్టలు ఎంత విపరీతమైనవి ! కానిమ్ము! నేనిప్పుడు విరసానికి దిగితే, కార్యం అనుకూలించదు. పరిచయం పెరిగాక, నెమ్మదిగా చెప్పి చూడవచ్చు!" అనుకొని "తరుణీ! నేనో బాటసారిని! నన్ను అన్యాయంగా రాజభటులు తరుముతూంటే, తప్పించుకు పారిపోయి వస్తున్నాను. నా వృత్తాంత మంతా తర్వాత చెప్తాను. ఇప్పుడు నన్ను మీరు అమరావతి వెళ్లేవరకు మీ ఇంటదాచి, మీతో పాటు నన్ను కూడా ఆ పురానికి చేర్చండి" అన్నాడు.

అప్పుడా జవ్వని "భళీ! నా నోములు ఇప్పటికి ఫలించాయి. నా యవ్వనం ఇంత కాలానికి సార్థకత చెందనున్నది. ఈసొగసుకాడ్ని కౌగిట్లో బంధించలేకపోతే, ఇక స్వర్గం దేనికీ?" అనుకొని "ఓయీ! స్త్రీలపాలిటి మన్మథా! దీనికి సన్నింతగా అడగాలా? నిన్ను నాహృదయంలో దాచుకొని కాపాడుకోనా? మా ఇంట్లో ఉంటే నిన్ను ఈశ్వరుడైనా పట్టుకోగలడా? అదుగో! ఆ మేడలన్నీ మావేసుమా! పరిచారకులైనా చూడకుండా, లోపలికి పోదాం పద!" అంటూ తొందరచేసి మరీ ఆహ్వానించింది. అలా అంటూ

అతడి చేయి పట్టుకుని ఒక మారు మూల మేడమీదకు వేరే దారి ద్వారా అతడ్ని చేర్చి, ఒక గొప్ప దివ్యమందిరంలో అతన్ని కూర్చోబెట్టింది.

ఇంతలో రాజభటులు వచ్చి తలుపులు తట్టారు. ఆ రొద విని, వజ్రమాల ఆ మేడ దిగి తల్లి దగ్గరకు వచ్చింది. అప్పుడు పరిచారకులు వచ్చి "రాజ భటులు మన ఇల్లు సోదాచేయాలట! ఎవరో దొంగ ఇటువైపు వచ్చాడట!" అని చెప్పగా రత్నమాల, ఆ భటులకు కొంత లంచమిచ్చి "ఇందు ఆడువారు తప్ప ఇంకెవ్వరూ లేరు. మేము అంతా చూసి వచ్చాము.... అని మీ అధికారులకు చెప్పండి" అని చెప్పి పంపేసింది. భటులు వెళ్లిపోయాక వజ్రమాల మహదానందంగా ఆభరణాలు వేసుకుని, బాగా సింగారించుకొని అప్సర కన్యలా వెలిగిపోతూంటే, కన్నతల్లికే కళ్లు చెదిరాయి.

ఆమె బుగ్గలు నొక్కుకుంటూ "హవ్వ! ఇదేం చోద్యమే?! నీ మగడు ఊళ్లోలేడు. ఈ అలంకారాలేమిటి? ఈ సింగారాలేమిటి?" అని అడగ్గా బుడిబుడి దుఃఖం అభినయిస్తూ "అమ్మా! నీతోగాక ఇంకెవరితో చెప్పుకోను నాబాధ? నేను రాత్రి నా పెనిమిటితో రతిసుఖం అనుభవిస్తున్నట్లుగా కల వచ్చింది. మధ్యలో మెలకువవచ్చేసింది. అప్పట్నుంచి నాకు ఏదోలా ఉంది.

ఈరోజు కూడా నేను రాత్రి కలలో ఉన్న అలంకారాలన్నీ ధరించి పడుకొంటే, నా మనోహరుడు కలలో కొస్తాడేమో! భ్రాంతి అనుకో! అమాయకం అనుకో! నేను వెళ్లి ఆ మూల సౌధంలో పడుకొంటాను. నన్ను మాటి మాటికీ పిలవకు. కల తరువాయి భాగం ఇవాళ వస్తుందేమో!" అని మేడలోకి పోగా "ఓహో! అల్లుడు వెళ్లి చాలా రోజులైంది కదా! ఈ పిల్లకి రతిమీదకు మనసు మళ్లింది కాబోలు" అని ముసిముసి నవ్వులతో తానే కూతుర్ని ఆ మేడలోకి సాగనంపింది.

నిర్భీతిగా ఆ జవ్వని, తిరిగి ఫలహారపు పళ్లెరాలతో, పుష్పహాసుని దాచిన మందిరంలోకి అడుగు పెట్టింది. అతడా కోమలి తన కోసం ఇంత ప్రయత్నం చేసినందుకు నొచ్చుకుని “నాకు కొన్నాళ్లుగా శరీరంలో ఏదో వ్యాధి బయలుదేరింది. పాలు పథ్యం అంటారు కనుక, అవి మాత్రం పుచ్చుకుంటాను” అని చెప్పగా, ఆమె బలవంతం చేసి కొన్ని భక్ష్యాలు తినిపించింది. పుష్పహాసుడు ఇబ్బందిపడ్డాడు. ఆ తర్వాత తప్పించుకోవడానికి అతడామెను సంగీతం పాడమని, హాయిగా నిద్రపోయాడు.

ఎంతో కోరికతో వేగిపోయిన వజ్రమాలకు నిరాశే ఎదురైంది. అతడ్ని మేల్కొల్పడానికి ఆమె నానా అపస్వరాలూ ఆలపించింది. కపట నిద్రపోయే వాళ్లని ఎవరు లేపగలరు?

అప్పుడామె తనలో తాను ఇలా అనుకోసాగింది....

“అయ్యయ్యో! ఎంతో ఆశపడ్డాను. ఇతడికి రసికత్వం లేదనుకోనా? అనంగరహస్యం కొక్కోకం వంటి రతిగ్రంథాల ప్రస్తావన చేశాడు. నాలాంటి వన్నెలాడి, ఏకాంతంగా కోరి వరించి దొరకగా – శ్రీశుకుడైనా చేరి మేరమీరి సుఖిస్తాడు కదా! అందువల్ల ఇతడు రసికుడు కాదనరాదు. వ్యాధి ఏదో ఉందన్నాడు... అదే కారణమేమో! లేకపోతే ఇలా నిద్రపోతాడా? అయ్యో! ఈరాత్రి నాపాలిట కాళరాత్రి అయిపోయిందే” అని చింతిస్తూండగా కోడికూసింది.

అప్పుడా వజ్రమాల ఆ మందిరం తలుపులుమూసి, తల్లి దగ్గరకు వెళ్లి పండుకొన్నది. తల్లినవ్వుతూ “పిచ్చిదానా! కలవచ్చిందా? కలలో నీ మనోహరుడు కనబడ్డాడా? ఎంత బేలవోకదా! అంత బాధపడతావు దేనికీ? మీ నాన్నా – మీ ఆయనా కూడా మనిద్దర్నీ ఓడ ఎక్కి అక్కడికొచ్చేయ

మన్నారుకదా! రేపే మన ఓడ నౌకదాన్ని ప్రయాణానికి సిద్ధం చెయ్యవలసిందిగా నావికులకు చెప్తాను" అంది ఓదార్పుగా.

మర్నాడు మధ్యాహ్నం ఫలహారాలతో, మళ్లీ మేడమీదకు వెళ్లింది వజ్రమాల రాత్రి అతడలా నిద్రపోయినందుకు నిష్ఠూర మాడింది. "సాధ్వీ! నాకు పది రోజుల నుంచి నిద్రలేదు. అదీగాక - దుఃఖంలో ఉన్నవాడికి దేనిమీదనయినా విరక్తే! నన్ను అమరావతికి తీసుకెళ్లే, అక్కడ నా చాతుర్యాన్ని చూద్దువుగాని! ఒకవైపు వ్యాధి బాధిస్తుంటే, నాకు సంగీతంలో రుచి ఏం తెలుస్తుంది?" అన్నాడు.

"అంతేకదా! ప్రయాణానికి అంతా సిద్ధంగానే ఉంది" అందామె "ఈసారి నేను స్త్రీగా వేషం వేసుకుంటే నీకు తప్పుండదు. నాకూ బాధుండదు" అన్నాడతడు.

ఆమె అంగీకరించింది. తల్లికి ఏదో అబద్ధం చెప్పి పుష్పహాసుని కూడ తమతో ఆ వేషంలో ఓడలోనికి తీసుకుపోయింది. కొంత ప్రయాణం బాగానే జరిగింది.

అంతలో గాలివాన ప్రారంభమైంది. మరో రెండ్రోజుల్లో ఓడ తీరం చేరుతుందనగా - తుఫాను విసురుకు ఓడ పల్టీలు కొట్టి, ముక్కలైంది. ఓడలోని వారు ఏదోలా ప్రాణాలతో బైటపడ్డారు. కాని వారు ఒక పర్వతం చేరుకుని, అది దిగుతూ దొంగల దోపిడికి గురై కట్టుబట్టల్తో మిగిలారు. ఆ పర్వతం దిగి, అది యవన ద్వీపం అని తెలుసుకొని "మనం చాలా ప్రాణ సంకటమైన చోటుకొచ్చాం! తప్పుచేసిన వాళ్లని, ఇక్కడకు తీసుకొచ్చి వదిలేస్తారు" అన్నాడు పుష్పహాసుడు.

వరుణ దత్తుని కథ

"ఇక్కడున్న యవనులు అతి క్రూరులు. హిందువుల్ని పనిగట్టుకుని బాధిస్తుంటారు. సరే! ఇప్పుడేం చెయ్యడం?" అనుకుంటూ స్త్రీ వేషంలోని హాసుడు, వజ్రమాలనూ - ఆమె తల్లినీ తీసుకొని యవనావతి అనే ఒక పట్టణ సరిహద్దులకు చేరుకున్నాడు.

అప్పుడొక గొప్ప ఉద్యోగి, రెండు గుర్రాల బండి మీద ప్రయాణిస్తూ, వారిని సమీపించి, ఎవరో ఏమిటో కనుక్కున్నాడు. తన బండిలో వారు కూర్చోడానికి చోటిచ్చి, ఆ అధికారి వాళ్లని తన ఇంటికి తీసుకుపోయాడు. అక్కడ వారి వైభవం చూశాక, అతడొక చక్రవర్తి కాబోలు అనుకున్నారు. ఆ అధికారిభార్య వివరాలన్నీ విని, వారిని చాలా మర్యాదగా చూసేసరికి వాళ్లు పొంగిపోయారు. పరోపకారపారీణులు అంతటా ఉన్నారని గుర్తించారు.

ఆ యింట్లో ఉండగా వజ్రమాల, పుష్పహాసుని దగ్గర మదన వికారాలు ఒలక బోసి తన కోరిక తీర్చమని, ఏకాంతంగా దొరికినపుడు ఆశపడింది. తప్పించుకొని తిరుగుతూ, ఒకనాటి సాయంత్రం ఆ ఇంటి యజమానురాలితో పరిచయం పెంచుకుంటూ పుష్పహాసుడు కాలం గడిపాడు. కొంత పరిచయం తర్వాత వారిని హిందువులుగానే గుర్తించి "మీరీ యవన దేశంలో ఎన్నాళ్లుగా ఉంటున్నారు? దేనికీ?" అని అడగ్గా ఆమె ఎంతో ఆనందిస్తూ ఇలా అన్నది.

వసంత సేన కథ

"మా తండ్రి హిందూదేశ వాస్తవ్యుడే! శూరసేనుడనే సామంతరాజు. అప్పటి చక్రవర్తికి, మా తండ్రిపై ఎందుకో కోపం వచ్చి ఏలుకొమ్మని ఇచ్చిన రాజ్యాన్ని లాక్కున్నాడట! అప్పుడు మాతండ్రి 'పూలమ్మినచోట కట్టెలమ్మడం' చందంగా ఇక అక్కడ ఉండలేక భార్యతో కలిసి విదేశాలకు బయల్దేరి కొన్నాళ్లకు మక్కా అనే పట్టణం చేరాడట!

అప్పుడు దైవవశాన ఈ పట్నపు సుల్తాను గారి పెద్దభార్య యాత్రకోసం అక్కడికి రాగా, మాతండ్రి ఎలాగో ఆమెతో పరిచయం సంపాదించి, తన కుటుంబం గురించి ఆమెతో చెప్పుకోగా, వారు తమతో పాటు ఇక్కడికి తీసుకొచ్చి ఉద్యోగం ఇప్పించారట! మా తండ్రి బుద్ధిమంతుడు కావడం వల్ల క్రమంగా సుల్తానుగారి అనుగ్రహానికి పాత్రులై చాలా ధనం సంపాదించారట!

మా తండ్రి ఇక్కడకొచ్చి నలభై ఏళ్లు గడిచాయి. వారిక్కడికి వచ్చిన పదేళ్లకు నేను పుట్టానట! లేక లేక కలిగిన దాన్నని నాకు గారాబం అధికంగా చేశారు. నాకు యవ్వనం రాగా, నన్ను ఎవరికిచ్చి పెళ్లి చేయాలా అని నా తల్లిదండ్రులకు చింత మొదలైంది.

ఒకనాటి సాయంకాలం ఒక పురుషుడీ ఊరివీధుల్లో తిరుగుతూంటే, యవనులు అతడ్ని పరిహాసం పట్టించారట! కొట్టి వినోదించారట! దెబ్బలతో రక్తంతో మా తండ్రికి అతడు కనిపించేసరికి జాలిపడి, యవన యువమూకను సమాధానపరచి పంపేసి, ఆ యువకుని వివరాలు అడిగారట! అతడు హిందువని తెలిసి, మాతండ్రి అతడ్ని ఆదుకున్నాడు. వరుణదత్తుడని పేరు పెట్టుకుని పోషించసాగాడు. అతడి స్థితి ఏమిటో అతడికి తెలీదు. అతడు క్షత్రియుడే! పూర్వచరిత్ర తెలిసినట్లే ఉంటుంది. గుర్తుకురాదు. చెప్పాలంటే నోటికిరాదు. ఏమి శాపమో! సముద్రంలో పడ్డాను. మునగలేదు. ఈదుతూ ఇలా చేరానన్నాడు.

ఆ వరుణదత్తుడే మీకు కనిపించిన నాభర్త. హిందూదేశంలో ద్వీపాంతర శిక్ష విధించబడిన వారు ఇక్కడకు వస్తే, వారిచేత పనులు చేయించడం సుల్తానుగారికి అవి నివేదించడం ఆయన అధికారాలు, అయితే ప్రమాదవశాన ఇక్కడికి చేరినా అన్యాయంగా శిక్షించబడినా అటువంటివార్ని విడిచే అధికారం కూడా ఆయనకున్నది. అదృష్టవశాన మీరు మొదటే

ఆయన కంట పడబట్టి సరిపోయింది గాని, లేకుంటే శీలభంగం జరిగేదీ యవనుల వల్ల" అని చెప్పిందామె.

ఆమెను ఉత్తమ ఇల్లాలు అని పొగిడి, నగరం చూసి రావాలని ఉన్నదన్న తన కోరిక చెప్పాడు. పుష్పహాసుడు తనకీ స్త్రీ వేషంనుంచి పురుషునిగా మారే ఉపాయం ఏమిటా అనీ ఆలోచించసాగాడు.

ద్వీపాంతర వాస శిక్షకు గురైన వారెవరైనా ఉన్నారేమో చూడటానికి తన భర్త సముద్రానికి వెళ్లినపుడు, ఒక బండిలో నగరం చూపించమని ఒక సేవకుని తోడిచ్చి ఆ ముగ్గుర్నీ పంపింది. వజ్రమాల, వజ్రమాల తల్లిమధ్య, నవమన్మధాకారంతో స్త్రీ వేషంలో ఉన్న పుష్పహాసుడు బండిలో కూర్చున్నాడు. బండి రాజవీధిగుండా పోతోంది. హిందువులకు బురఖా వేసుకొనే అలవాటు లేనందున, స్త్రీ పుష్పహాస సౌందర్యం చిన్న సుల్తాన్‌గారి కంటబడింది.

సముద్రతీరానికి వెళ్లి తిరిగివచ్చిన వరుణదత్తుడు "ఎక్కడ చూసినా స్త్రీ సాహసమే అధికంగా కనిపిస్తోంది. ద్వీపాంతర వాస శిక్షకు లోనైన ఇద్దరు స్త్రీలు ఈ తీరానికి చేరారు. వాళ్లతోపాటు ఒక యువకుడూ ఉన్నాడనుకో! అతడి నేరమేమిటో తెలీలేదుకాని, ఆ ఇద్దరూ మాత్రం ఒక వర్తకుడిని చంపేశారట" అన్నాడు.

"ఆ స్త్రీలకు పెళ్లయిందా? భర్తలున్నారా? వీళ్లని వెతుక్కుంటూ వాళ్లెపుడైనా వస్తే రానిస్తారా?" అంటూ వసంత సేన ప్రశ్నిస్తూంటే "నీకు స్త్రీజాతి అభిమానం అధికం. నేరం చేసి శిక్షించబడ్డాక వివాహితులా? అవివాహితులా? అని ఇక్కడ చూడరాదు. వారి భర్తలను ఇక్కడ ఎలా అనుమతిస్తారు?" అనేశాడు వరుణదత్తుడు. "అయినప్పటికీ నేరంచేసిన స్త్రీల నిమిత్తం వారి భర్తలు వచ్చారే అనుకో! మా ఇష్టం ప్రకారం చేసే అధికారం మాకుంది. కాని నిరపరాధులైన అటువంటి భర్తలను శిక్షించం" అని కూడా ముక్తాయింపుగా అన్నాడు.

"ప్రమాదవశాన అపరాధం చేస్తేనో?" అని సంశయపడిందా వసంతసేన. రేపు ఆ స్త్రీలను తనకు చూపించమని భర్తను కోరింది. సరేనన్నాడు వరుణదత్తుడు. మర్నాడు సుల్తాను గారి వద్ద ఏదో పని తగిలి, వరుణ దత్తుడటుపోగా, వజ్రమాలను, ఆమె తల్లిని వెంటబెట్టుకొని వసంతసేన నేరం చేశారని చెప్పబడుతున్న స్త్రీలను చూడ్డానికి వారుండే ప్రాంతానికి వెళ్లింది. వారు తమ కథ చెప్పుకున్నారు. వారు నిరపరాధులని తెలిసి, వీలైనంత త్వరలో వారిని, తన భర్తకు చెప్పి తమ ఇంటికి రప్పించగలనని మాట ఇచ్చి ఇంటికి వచ్చింది వసంతసేన

వరుణదత్తుడు ఆస్థానం నుంచి ఇంటికి చిరాగ్గా తిరిగొచ్చి, వసంత సేనను పిలిచి "మనింట్లో ఉన్న ఆడవాళ్లు ముగ్గురూ నిన్న పట్నంలో బండెక్కి తిరిగారట. నిజమా?" అని కోపంగా అడిగాడు. ఆమె గజ గజ వణికి "నిజమే! పట్నం చూసొస్తామంటూ పదిరోజులుగా నన్ను అడుగుతూంటే, ఎంతకాలం కాదనగలను? వాళ్లని బండిలో పంపించాను. అది సుల్తానుగారికి కోప కారణమైందా?" అని ఆత్రంగా అడిగింది.

"ఇది పాడు పట్టణమని, నీకు నేనెన్నిసార్లు చెప్పలేదు? ఆడవాళ్లు ఊరకే వీధుల్లో తిరగడానికి ఇదేం హిందూదేశమా? ఇక్కడలా తిరిగితే, ఈ యవను లూరకపోనిస్తారా?" అని ఒక్క క్షణం ఆగి "గోవుల్ని చంపితినే వాళ్లకి కనికరం ఎలా ఉంటుంది? సుల్తాను కుర్రవాడు ఆ ముగ్గురిలో ఎర్రదాన్ని చూసి మోహించాడట! రాత్రంతా విరహంతో నిద్ర పట్టలేదట! దాన్ని తన కిచ్చి పెళ్లి చెయ్యమన్నాడు.

అప్పటికీ 'అది ఒకరికి భార్య' అని చెప్పాను. దాని మగడు ఎంత సొమ్ము అడిగితే అంతా ఇస్తాను. అందుకు ఒప్పుకోకుంటే బలవంతంగానైనా దాన్ని చెరపడతాను" అన్నాడు సుల్తాను నేనేం జవాబు చెప్పేది?" అని తల కొట్టుకుంటూ ఒక్కక్షణం ఆగాడు.

సుల్తాను గారి కథ

"వీడు పాత సుల్తాను కాదు. యువసుల్తాను కదా! యవ్వన మదంతో ఉన్నాడు. ఏం చెప్తే ఏం తంటా వొస్తుందో అని, అప్పటికేది మాట్లాడాలో అలా మాట్లాడి ఇలా వచ్చాను. వాళ్లలో మనకున్నట్లు నియమాలేవీ లేవు. పెళ్లయిందన్నా వారికి పట్టదు. అంతగా అయితే, వాళ్ల మోజుపడ్డ స్త్రీ యొక్క భర్తకు డబ్బుపారేసి కొనేస్తారు. ఇప్పుడేది దారి?" అని భోజనానికైనా రాకుండా ఆలోచించసాగాడు. వసంతసేన కూడ విచారించసాగింది.

తాను భర్తకు తెలీకుండా చేసిన ఈ పని ఇన్ని తంటాలు తెస్తుందని, వసంత సేన కేం తెలుసు పాపం!? పుష్పహాసుడు మెల్లగా వారి గది లోకి వచ్చి, వారి ఆందోళనకు కారణం తెలుసుకుని, "మమ్మల్ని ఇంత ప్రాణప్రదంగా చూస్తూ, కన్నతల్లిదండ్రుల కన్న మిన్నగా దేశంగాని దేశంలో ఆదరించిన మీకు కృతజ్ఞులమై ఉంటాం! ఈ విషయమై మీరు సంశయించకండి! సుల్తానుతో వైరం, కొరివితో తల గోక్కున్నట్లే! మీకు ఏ మాటా రాకుండా చేస్తాను. శీలం చెడకుండా, అతని చేతనే వద్దని పించుకుని వస్తాను. అంగీకరిస్తున్నట్లు జవాబు పంపండి! అయితే ఆ జవాబులో ఈ ఒక్కముక్క రాయించండి... 'దాని మగడెప్పుడూ దాన్ని అంటి పెట్టుకు తిరుగుతుంటాడు కనుక ఆ ఒక్క విషయంలో జాగ్రత్తగా ఉండండి' అని ఉంటే చాలు! నేను కార్యం సాధించుకొస్తాను" అని ఉత్సాహంగా చెప్పేసరికి, దిగులుగా ఉన్న ఆ దంపతుల ముఖాలు అప్పటికి వికసించాయి. వరుణదత్తుడు సంతోషంగాలేచి "ఆ చిన్న దాన్ని ఈ రాత్రికే పంపుతున్నాను. కాని, దాని భర్తతో జాగ్రత్త" అని చీటీరాసి, భోజనానికి కూర్చున్నాడు. భర్త భోంచేసేటప్పుడు, వడ్డనతోపాటు సపర్యలను కూడా చేస్తూ "నిన్న మీరు ద్వీపాంతర శిక్ష నిమిత్తం వచ్చారని చెప్పిన స్త్రీలని చూశాను. వారిది అన్యాయమే కాదు! శిక్షించిన వారిదే తప్పు! మహా పతివ్రత కనుక మాట్లాడని ఒకామెను, నిజం చెప్పిందని ఇంకొక ఆమెను శిక్షించారట! వాళ్లు గత పది

రోజులుగా నిద్రాహారాల్లేక కృశిస్తున్నారు. మీరు అనుమతిస్తే మనింటికి పిల్చి వాళ్లకి భోజనం పెట్టి రక్షిస్తాను" అంది వసంతసేన. అతడు అంగీకరించడంతో వారిని తన ఇంటికి రమ్మని కబురు చేసిందామె భోజనమయ్యాక – తన భార్య వసంతసేనతో సహా వెళ్లి నిన్న తాను చూసిన నేరస్తులలో – ద్వీపాంతర వాస శిక్ష విధించబడి, అక్కడకొచ్చిన వాడొకడిని విచారించాడు వరుణదత్తుడు.

అతడు "అయ్యా! నేను పౌరోహిత్యపుబ్రాహ్మడిని – పెళ్లిమీదున్న మోజుకొద్దీ, ఒకరోజు ఊరిబైట కనిపించిన చిన్నదాన్ని తెచ్చి నాయింట పెట్టుకున్నాను. జరుగుబాటులేని నా దైన్యం చూసి, ఆమె తన కంకణం తీసి ఇచ్చి, అది అమ్మమని చెప్పింది. నేనా కంకణం అమ్మజూపుతూ రాజభటులకు దొరికాను. అది ఎవరిదో– ఏమిటో కూడా నాకు తెలీదు. నన్ను అన్యాయంగా పట్టుకెళ్లడమేగాక, నాకీ ద్వీపాంతర శిక్ష విధించారు. ఇందు ఇసుమంతైనా అబద్ధం లేదు" అని భోరుభోరున ఏడ్వసాగాడు.

కంకణం విషయం వినేసరికి, వరుణదత్తుడి కేదో మెరుపు మెరిసినట్లయింది. దానిక్కారణం – పూర్వాశ్రమంలో తన పేరేమిటో – తానెవరో సరిగ్గా గుర్తులేకపోవడంతో వరుణదత్తుడిగా ఇక్కడ వసంతసేనతో సుఖిస్తున్న తనకు గత వృత్తాంతం అంతా గుర్తు కొచ్చింది. తాను మణికుండలుడనీ తన నాలుగేళ్లపుత్రుడు పుష్పదంతుడనీ తన భార్య గంధర్వదత్త అనీ జ్ఞాపకం వచ్చి, భార్యా పుత్రుల కోసం పరితపించసాగాడు. ఆ వేదనలో అతడు "గంధర్వదత్త నా అర్ధశరీరం – నా ముద్దుల కొడుకు పుష్పదంతుడేడీ? నేనిక్కడి కెలా వచ్చాను? నా రాజ్యమేమైంది?" అనీ కలవరించసాగాడు.

స్త్రీ వేషంలో పుష్ప హాసుడ్ని తీసుకెళ్లడానికి సుల్తాను ఏడుగుర్రాల పల్లకీ పంపగా, వజ్రమాల పరిహాస – మాడుతుండగా సుల్తాను మందిరానికి వెళ్లి, అతడి ప్రత్యేక కేళీమందిరంలో కూర్చున్నాడు.

సుల్తాను అత్యంత మోహావేశంలో కౌగలించుకోబోగా, ఒక్కక్షణంలోనే, తాను వదులుగా ధరించిన స్త్రీ దుస్తుల్ని విడిచి, పురుషుడిగా

అతడికి కన్పించి పీకనొక్కి మూర్ఛ పోగొట్టాడు. అప్పుడాసుల్తాను "సలామ్ బాబూ! నీ భార్య మొదటే ఉత్తరంలోనే హెచ్చరించింది. నువ్వు ఆమెని నిత్యం ఆవహించి ఉంటావని, నేనే బుద్ధి తక్కువై ఆమెని కోరాను. నువ్వూ ఆమె ఏకశరీరులుగా జీవిస్తున్నారని నాకేం తెలుసు? నిన్ను సగౌరవంగా నువ్వు వచ్చిన చోటుకే సాగనంపుతాను. ఎన్నో కానుకలిస్తాను" అంటూ స్పృహలోకిరాగా, మరోసారి కణత దగ్గర మెల్లగా అదిమి, కొద్ది సేపు స్పృహ కోల్పోయేలా చేసి, తిరిగి అతడికి తెలివి వచ్చే వేళకు యధా స్ధానంలో స్త్రీ వేషధారిగా కూర్చున్నాడు.

స్పృహలో కొచ్చిన సుల్తాను, ఆమెను చూస్తూ "నువ్వు చెప్తూనే ఉన్నా వినక నిన్ను కోరినందుకు, నీ భర్తవల్ల నాకు చచ్చేంత పనైంది. నీకు కానుకలిచ్చి పంపుతా" అని అప్పటికప్పుడే ఆ ఏర్పాట్లుచేసి "అమ్మో! ఇది ఆడదికాదు సైతాను. అది ఎరుగక రప్పించుకున్నాను. దీన్ని నువ్వే భరించు" అని ఉత్తరం రాసి వరుణదత్తునింటికి కంటే ఆమెను తిరిగి పంపేశాడు.

ఆ సమయానికి వరుణదత్తుడు అలాగే పలవరిస్తున్నాడు. అది విన్న పుష్పహాసుడు "ఇదిగో గంధర్వదత్త వచ్చింది చూడు!" అని చెప్పి, అతడికి పూర్తిగా తెలివిరాగానే" తండ్రీ! నీ గతంలో నువ్వు ఒక్కసారి ఎవరివో గుర్తు తెచ్చుకో! నీవు మణికుండలుడివే కదా! వింధ్యకూట నగరాన్నుంచి నువ్విక్కడికెలా చేరుకున్నావు?" అని అడిగాడు.

ఆశ్చర్యంగా చూస్తూ వసంతసేన, ఆనాడు అతడీ ద్వీపానికి గతం విస్మరించిన స్థితితో గాయాల్తో చేరి, తన తండ్రి చేత రక్షించబడిన వైనం గుర్తుకు తెచ్చుకున్నది. ఆమెను చూస్తూ "అమ్మా! ఇతని గాథనాకు తెలుసు! నేనొకనాడు ఒక కడియం ధనుంజయ రాజు వద్దకు తీసుకెళ్లగా ఆయన చెప్పినదాన్ని బట్టి - 'ఓ రోజు రాత్రి ఇతడు భార్యాపుత్రులతో మేడమీద ఆరుబయట వెన్నెల్లో నిద్రిస్తున్నాడట! తెల్లారేసరికి ఒక్కరూ కనిపించలేదని' వాపోయాడా మహారాజు. ఆనాటి గాథ ఇతడికి గుర్తొచ్చి భార్యాపిల్లల కోసం కలవరిస్తున్నాడు ఇంకేం భయంలేదు. ఇది గాలీ - ధూళీసోకడం కాదు" అని ఓదార్చాడు పుష్పహాసుడు - అదే స్త్రీవేషంలో ఉండి.

ధనుంజయుడు మా బావమరిదేనన్నాడు – కలవరిస్తున్న వసంతసేన భర్త.

ఇంతలో – వసంతసేన వల్ల కబురు అంది, ఆమె ఇంటికి భోజనానికి వచ్చిన స్త్రీలిద్దరికీ పరిచారకులు చక్కని వసతి – భోజనం ఏర్పాటు చేశారు. భోజనం కాగానే, వారు కృతజ్ఞతలు చెప్పడానికి వసంత సేన దగ్గరకొచ్చేసరికి, ఆమె భర్త గంధర్వదత్త అంటూ కలవరిస్తున్నాడని విని అతడ్ని చూడాలని ఆ స్త్రీలిద్దరూ లోపలికొచ్చారు. మీరు మణికుండలులే అయితే, మీ గంధర్వదత్త ఇదుగో" అంటూ తిలక, తనతోపాటు వచ్చిన నడివయస్సామెను అతనికి చూపించింది. పుష్పహాసుడు తిలకని గుర్తుపట్టేశాడు. వసంతసేనకి ఇదంతా అర్థంగాక తెల్లబోయి చూడసాగింది.

కొద్దిక్షణాలు వాళ్లంతా ఆనందానుభూతుల్లో మునిగి తేలడం గమనించి దామె. వరుణదత్తుడు "వసంతసేనా! నేనానాడు సముద్రంలో పడి, మీ ద్వీపంలో తేలి, గాయాల్తో చేరడం – మీ తండ్రి నాకు చేయూతనిచ్చి నీకు కట్టబెట్టడం నీకు తెలిసిందే! గత చరిత్ర గుర్తులేని స్థితిలో కదా నేనిక్కడచేరాను. పదహారు సంవత్సరాలు దాటిన తర్వాత ఇన్నాళ్లకు వీరు రాబట్టి తెలిసింది నాకు లేకుంటే ఆ గతం ఎక్కడో మనస్సు పొరల్లోనే సమాధి అయిపోయేది..." అని వివరించాడు.

గంధర్వదత్త ఎన్నికష్టాలు పడిందో, ప్రత్యక్షంగా తాను చూసివున్నందున తిలక చెప్పింది. అలాగే తాను ఎన్నెన్ని కష్టాలుపడి, ఓ జంటని కలపడానికి ఎలా తిరిగిందీ చెప్పింది. ఆ ఇద్దరి వృత్తాంతం విన్నాక, వసంతసేన "ఆహా! దైవఘటన లెంతచిత్రం?" అనుకుంది.

అప్పుడు తిలక "మణికుండల మహారాజుగారైన మీకు లలిత అనే మేనకోడలుంది కదా! ఆమె కూడా ఇక్కడే ఉంది! మకరందుడనే పేరిట మాతోపాటు ద్వీపాంతర వాస శిక్షకు గురిచేయబడినందున ఆమె పురుషవేషంలో ఉన్నది" అని చెప్పి ఆశ్చర్యపరిచింది.

సుల్తాను గారి కథ

పుష్పహాసునిలో గంధర్వదత్త పోలికలు స్పష్టంగా చూసిన తిలక, ఇద్దర్నీ పక్కపక్కన నిలబెట్టి "ఇక చాలు! ఆడవేషం వదిలేసి పుష్పహాసుడిగా మారిపో అందగాడా! నువ్వూ నన్ను గుర్తించావని నేనూ ఇందాకే కనిపెట్టాను" నవ్వుతూ అంది తిలక.

అప్పుడు – "విధి ఎంత చిత్రంగా విడదీసి, వేర్వేరు చోట్లకి విసిరేసినా, అంతే చిత్రంగా అందర్నీ స్వదేశంలోగాక ద్వీపాంతరంలో కలపడం ఇంకా చిత్రంగా లేదూ" అంది వసంతసేన.

"నిజమే! ఏనాటి మనికుండలుడు? ఎంతటి కష్టాలపాలైన గంధర్వదత్త? తల్లీ – తండ్రీ ఎలావుంటారో తెలీని పుష్పహాసుడక్కడ? తన బావనే వరించానని తేలీని లలిత స్థితీ – ఆమెనుంచి విడిపోయినా, ఆమె పురుషవేషంలో మకరందుడిగా ఉండగా తిరిగి కల్సుకున్న తిలక అద్భుతగాథ ఎంత చిత్రం?....ఇవన్నీ కలలో తప్ప ఇలలో జరిగేవేనా? ఇప్పుడి క్కడ జరిగాయి...." అని ఒకరికి తెలియకుండా ఒకరికి గతంలో జరిగిపోయిన సంఘటనలన్నీ గుర్తుకుతెచ్చుకోసాగారు.

అంతలో.... ఆకాశం నుంచి ఒక దేవదూత మంచంతో సహా దిగాడక్కడకు

"ఈ చిత్రాలన్నీ జరగడానికి విధి ఎంత కారణమో నాకు తెలీదుకాని, మిమ్మల్ని విడదీసిన దుర్మార్గుణ్ణి మాత్రం నేనే!" అన్నాడు ఆ దేవదూత

తమకేమీ సంబంధం లేని ఈ కొత్త పాత్ర ఎవరా? అని వాళ్లందరూ ఆశ్చర్యపోతూండగా, ఆ దేవదూత చేతిలో ఉన్న మంచాన్ని గుర్తు పట్టేశాడు మణికుండలుడనే వరుణదత్తుడు.

ఆతడా దేవదూతకు నమస్కరిస్తూ "ఆర్యా!నీవెవ్వరవు? ఈ మంచం మేము ఆనాడు మేడమీద ఆరుబయట వెన్నెల్లో నిద్రించింది కదూ! ఇది నీ దగ్గర ఎలా ఉంది? మా వియోగానికి మీరు కారణమంటున్నారు. ఎలాగో చెప్పగలరు" అన్నాడు.

అప్పుడా దేవదూత తన కథ చెప్పసాగాడు....

దేవదూత కథ

అలకాపురి కుబేరుని నగరం. అక్కడ నూరేళ్ల కొకసారి 'నిధిపూజా మహోత్సవం' జరుగుతూ ఉంటుంది. అక్కడికి యక్ష, గంధర్వ, కిన్నెర కింపురుషాది దేవజాతుల వాళ్లంతా చేరుతారు. మహర్షులు కూడా ఆ ఉత్సవానికి వస్తారు. అప్సరసలనాట్యం - నారద తుంబురుల గానం - ప్రముఖ మునుల ప్రసంగాలు ఉంటాయి. పదిరోజులపాటు జరిగే ఉత్సవాల్లో భార్యాసహితుడై కుబేరుడు పూజలు నిర్వహిస్తాడు. దేవలోకాల్లోని ముచ్చటైన జంటలెన్నో అక్కడ కనువిందు చేస్తాయి.

అప్పుడు కుబేర పుత్రుడైన నలకూబరుడు, వివిధలోకాల్నుంచి వచ్చిన వారిలో అతి చక్కని జంటల్ని వేర్వేరుగా కూర్చోబెట్టి- వాళ్ల సౌందర్యం, గుణగణాలు, ప్రవర్తన వంటి వాటిని బట్టి ఉత్తమస్థానాన్ని నిర్ణయించమని కోరడం - సభ్యులు అటువంటి జంటను ఎన్నుకోవడం జరుగుతుంది. మునుపటి ఉత్సావాల్లో నలకూబరుడు, చంద్రుడు, అశ్వనీ దేవతలు వగైరా ఇలా ఎన్నుకోబడినవారే! రూపం లేనందువల్ల మన్మథునికి ఆ అవకాశం తప్పిపోయింది గాని, చూడచక్కని వారి జాబితాలో అతడిదే అగ్రస్థానం అని వాదించిన వాళ్లూ లేకపోలేదు.

ఇటీవలి కాలంలో జరిగిన ఉత్సవానికి కొంతకాలం ముందు, మా ప్రభువైన కుబేరుడు "అన్నిలోకాల్నుంచి అందరూ వస్తున్నారు. భూలోకంనుంచి ఎవరూ రావడంలేదు. అక్కడ కూడా చక్కని వారెందరో ఉండి ఉంటారు. వాళ్లని కూడా పిలిస్తే బావుంటుంది" అని ఆలోచించి నన్ను పిల్చి నాకో పని అప్పగించారు.

భూగోళమంతా సంచరించి చక్కదనంలో మిన్న అయిన జంటను ఉత్సవానికి తీసుకురమ్మని - వాళ్లకు అందమైన పుత్రుడు తప్పక ఉండాలని చెప్పి నన్ను పంపించారు.

నేను అటువంటి జంటకై అన్వేషిస్తున్నాను. జంటలో పురుషుడు అందంగా ఉంటే భార్య బాగుండేదికాదు. భార్య అందగత్తె అయితే భర్త అంత ఆకర్షణీయంగా ఉండేవాడుకాడు. ఇద్దరూ బాగా ఉన్న అరుదైన జంటలకి పుత్రసంతాన భాగ్యం ఉండేదికాదు. ఇక తిరిగి – తిరిగి విసిగివేసారిపోయి అలకాపురికి తిరిగిపోతూండగా నారదమహర్షి కనిపించారు. నేను ఆయనకు నమస్కరించగా, ఆయన దీవించి విశేషాలు అడిగారు. నేను నాకెదురైన సమస్య వారికి విన్నవించాను. ఆయన ఇచ్చిన సమాచారం వల్లనే, నాకు మీ గురించి తెలిసింది. మేడమీద వెన్నెల్లో మీ ముగ్గురూ నిద్రపోతున్నారు. అంతే!

మీకు నిద్రాభంగం కలిగించకూడదని, మీ మంచాన్ని ఇలాగే నా శక్తితో అమాంతం తలపైకి తెచ్చుకుని అలకాపురి వైపు ఎగరసాగాను. ఈలోగా ఒక చండప్రచండమైన ఝంఝామారుతం వీచింది. దాంతో మీరు ఒకరి వెంట ఒకరు ఎక్కడెక్కడ భూమి మీదనో – సముద్రంలోనో పడ్డారు కాబోలు! నేను అది గమనించక మంచంతో సహా మా దివ్యప్రభువు కుబేరుల వారి సన్నిధిన నిలబడి "ప్రభూ! భూలోకమంతా గాలిస్తే, ఒకే ఒక్క జంటని మీరు కోరినట్లు తీసుకురాగలిగాను" అన్నాను.

"ఏదీ చూపించు!" అని ఆయన అడగ్గా, తీరా మంచంమీదకి చూస్తే, మీరు ఎవరూ లేరు. "వొట్టి మంచం తెచ్చావన్నమాట!" అని ఆయన కోపగించి " క్రీడిస్తున్న దంపతుల్ని – అదీ నిద్రలో ఉండగా తెచ్చి ఆపదలపాలు చేస్తావా? వాళ్లు చనిపోయారో ఏమిటో! ఎక్కడ ఎలా ఉన్నారో! అమృతం జల్లి బ్రతికిస్తాను. వాళ్లని తీసుకొనిరా! విడిపోయిన వాళ్లని కలిపి – రా! ఏ సంగతీ తెల్సుకోకుండా వస్తే నిన్ను శిక్షిస్తాను" అన్నాడు.

అదేచాలు! అనుకొని నేను మిమ్మల్ని వెతుకుతూ తిరుగుతూంటే, మళ్లీ నారద మహర్షులు కనిపించారు. ఆయనకు మ్రొక్కి నా కష్టాన్ని విన్నవించుకున్నాను. ఆయన దివ్యదృష్టితో చూసి "పావురాల జంట యొక్క మాంసం తినాలన్న ఆపేక్షతో – బిడ్డలతో సహా గూట్లో ఆనందంగా గడుపుతూన్న ఒక జంటను కొట్టిన మణికుండలుడు దాని శాపం పూర్తిగా

అనుభవించి ఇప్పుడే యవన దేశంలో కలుసుకుంటున్నారు” అని చెప్పగా, ఈ మంచంతో సహా నేనిక్కడికి కలుసుకొని. మీరంతా, మీ –మీ బంధుత్వాలు చెప్పుకుంటూ – ఒకర్నొకరు కలుసుకొని ఆనందిస్తున్నారు. ఈ విధంగా మీ చరిత్ర దేవలోకానికి కూడా ప్రాకింది” అని తన వృత్తాంతం వివరించాడా దేవదూత.

తరువాత ఆ దేవదూత “అయ్యా! మీరీ మంచం మీద కూర్చోండి! మీ పట్టణానికి మిమ్మల్ని చేరవేస్తాను. ఇది కుబేరుని ఆజ్ఞ” అనడంతో మణికుండలుడు, సుల్తాను వారికి ఈ వృత్తాంత మంతా సవిస్తరంగా వినిపించాడు. వజ్రామాల ఆమె తల్లి ఆ ద్వీపాంతరాలకు రావలసిన వారు కారనీ – ఓడ పెనుతుపానుకు గురై ఆ తీరం చేరడంతో గత్యంతరం లేక అక్కడ చిక్కిపోయారనీ – వారు నిరపరాధులనీ విన్నవించి అమరావతిలో వాళ్ల వ్యాపారాలున్నందున వారి మగవాళ్లు అక్కడున్నందున వారిని ఓడ ఎక్కించి అక్కడకు పంపాడు పుష్పహాసుడు.

అప్పుడు గోవిందుడనే పెళ్లి ఆత్రపు బ్రహ్మచారి లలితను వేడుకోగా, వారింటభోజనం చేసిన విశ్వాసం వల్ల లలిత అతడ్ని కూడ మంచంపై తమ రాజ్యానికి అనుమతించమని కోరింది. ‘సరే’ అన్నాడు మణికుండలుడు.

ఆ ప్రకారం వాళ్లంతా కూర్చొని మాట్లాడుకుంటూండగా దేవదూత ఆ మంచాన్ని నెత్తిన పెట్టుకుని హనుమంతుడిలా అతివేగంగా వింధ్యకూట నగరం చేరుకున్నాడు.


“అతడలా ఎగురుతూండగా నీకు కనిపించిందే ఆ మంచంనీడ. అర్థమైందా?” అన్నాడు మణి సిద్ధుడు.

“మీ దయ ఉండాలేగాని, తెలియనిది ఏముంటుంది? నిజానికి, నా ప్రశ్నకు సమాధానం దొరికింది. గాని త్రికాల వేత్తలు మీరు. తదుపరి కాలంలోనైనా వారంతా సుఖంగా ఉన్నారా? ఈ దేవదూత పుణ్యమా అని ఇంకా ఏవైనా ఇక్కట్లు పడ్డారా? తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది” అన్నాడు గోపాలుడు.

దేవదూత కథ

నవ్వుతూ మణిసిద్ధుడు "అయితే విను! ఈసారి జాగ్రత్తగా ఎగురుతూ, దేవదూత వాళ్లందరినీ వింధ్య కూట నగరానికి చేర్చి, వాళ్ల అంతఃపురం మేడమీద మంచంతో సహా భద్రంగా దింపడమేగాక ఆ వర్తమానం తానే స్వయంగా అక్కడి పరిపాలకునికి తెలియజేశాడు. అతడావెంటనే రాజ్యాన్ని తమప్రభువైన మణికుండలునికి అప్పగించడమేగాక, వారి బావమరిది అయిన ధనుంజయప్రభువుకూ ఆ సంగతిని వార్త పంపాడు. దేవదూతను రెండు మూడు రోజులు తమ ఇంట అతిథిగా ఉండమని కోరిన మణికుండలుడు, తన బావమరిది ధనుంజయుడు తమను చూడటానికి రాగానే యావత్ వృత్తాంతాలు అందరూ వివరించగా దేవదూత చేతుల మీదుగా లలిత - పుష్పహాసులకు వివాహం జరిపించాడు.

తనకు కట్టబెట్టిన ఈ పెద్దరికానికి దేవదూత కూడా ఎంతో మురిసిపోయి - వీళ్లందరూ కలుసుకున్న సంగతి కుబేరునికి వర్తమానం పంపగా, ఆయన దివ్యాశీస్సులతోపాటు, అపూర్వమైన ఒకరత్నాల మాలికను కానుకగా పంపాడు. అది ధరిస్తే దాని ప్రభావం వల్ల వెయ్యేళ్లు జీవిస్తారని తెలిపి పుష్పహాసుని రాజ్యపట్టాభిషేకం కూడా చూసి దేవదూత తిరిగి వెళ్లాడు.... ఇవీ తదుపరి పరిణామాలు" అంటూ జరగబోయేదీ శిష్యునికి చెప్పిన మణిసిద్ధుడు బయలుదేరి తరువాత మజిలీ చేరుకున్నాడు.



కాశీ మజిలీ కథలు

45 వ మజిలీ

క. శ్రీకర ప్రళయస్థితిస
ర్గైక నిదాన ప్రధాన హరిహరచతురా
స్యాకార వినుత త్రిగుణ ని
రకార ప్రపూర్ణ సచ్చిదానంద మయా!

దేవా! అవధరించు! ఆ గోపాలుడు అప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా చావడి అరుగుమీదే కూర్చొని ఏదో ధ్యానిస్తున్నాడు. ఇంతలో అయ్యవారు అనుష్ఠానాలు తీర్చుకొని వచ్చి వాడ్ని చూశారు.

"వత్సా! ఈరోజు ఇదేం విచిత్రం? ఎక్కడికీ పోకుండా ఇక్కడే ఉన్నావేం? విశేషాలేమిటి?" అని అడగ్గా, వాడు లేచి నమస్కరిస్తూ "స్వామీ! ఇది చాలా చిన్నగ్రామం. దగ్గర్లో అడవి అయినాలేదు. ఇక్కడ వింతలేమి కనబడవని తలచి, మీరు ఇంతకు ముందు చెప్పిన కథలు జ్ఞాపకం చేసుకుంటున్నాను. వాటిలో కొన్ని సందేహాలు తోచాయి. మిమ్మల్ని అడుగుదామనుకుంటున్నాను. ఇక ఇప్పుడు తీరిగ్గా కూర్చొని చెప్తారా?" అని అడిగాడు.

అప్పుడా మణిసిద్ధుడు "ముందు భోజనం చెయ్యి! ఆ తరువాత చెప్పుకుందాం! అనడంతో వాడు గబగబా తినేసి వచ్చి సిద్ధుని దగ్గర కూర్చొని "తండ్రీ! కృష్ణదేవరాయల భార్య కళానిలయ, రామలింగ కవి భార్య మందారవల్లి గొప్ప విద్వాంసురాళ్లనీ మీరు గతంలో చెప్పిన కథల వల్ల

తెలిసింది. అయితే వాళ్లిద్దరిలో మళ్లీ ఎవరెక్కువ? అనే సందేహం నాకొచ్చింది. మందారవల్లి అన్ని రాజసంస్థానాలూ తిరిగి - తిరిగి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానానికి వచ్చిందన్నారు. అప్పుడు కళానిలయ సంగతి ఎత్తలేదేం? అప్పుడు ఆమె రాజధానిలో లేదా? పోనీ! తరువాత ఎప్పుడైనా వారి మధ్య ప్రసంగాలు జరిగాయా? ఇద్దరికీ గల తారతమ్యం తెలుసుకోవాలని ఎవరూ ప్రయత్నించలేదా? ఎవరు అధికులన్నది నిరూపించాలని ఎవరూ ప్రయత్నం చెయ్యలేదా? ఈ వృత్తాంతం మీరు గ్రహించి నాకు చెప్పగలరు! వినాలని కుతూహలంగా ఉంది"... అని వేడుకున్నాడు.

అప్పుడా పండితుడు సంతోషించి, మణిని ఎదురుగా పెట్టుకొని ఆ ఉదంతం అంతా తెలుసుకుని తలూపి "ఓరీ! నీలో ఏదో అద్భుత శక్తి ఉంది సుమీ! నువ్వు అడిగిన విషయం ఊరికే పోదు. అది చాలా పెద్ద వృత్తాంతమే కలిగింది. ఇప్పుడు నువ్వడిగిన ప్రశ్న వల్ల మంచి కథ తెలుస్తుంది. విను!" అంటూ ఇలా చెప్పసాగాడు.

కళానిలయ కథ

మందారవల్లి రాయలవారి ఆస్థానకవుల్లో ప్రసంగించేటపుడు కళానిలయ పుట్టినింటికి వెళ్లింది. అందువల్ల కనీసం ఆమెని ప్రస్తావించవలసిన అవసరం అయినా లేకపోయింది.

మందార వల్లి రామలింగకవిని పెళ్లాడి, రాయలవారి రాచనగరిలోనే ఒక ఉద్యానవనాన కట్టించబడిన ఒక గొప్ప మేడలో నివసిస్తూ విద్యాసంబంధ ప్రసంగాలు చేస్తూండేది. ఆమెకు కావలసిన ధనం ఢిల్లీ నుంచి తండ్రిగారే పంపిస్తున్నారు.

కళానిలయ పుట్టినింటి నుంచి వచ్చిన తర్వాత మందారవల్లి వృత్తాంతమంతా విని, ఒకరోజు రాయలవారితో "ఏమండీ! నేనిక్కడ

లేనప్పుడు, మన ఆస్థానానికి మందార వల్లి అనే వేశ్య వచ్చిందనీ - మన పండితులందర్నీ పరాభవించిందనీ- రామలింగకవి కపటం అవలంబించి ఆమెను వంచాడనీ విన్నాను. ఆమె ఇప్పుడు మననగరంలోనే ఒక తోటలో ఇల్లుకట్టుకుని ఉన్నదట కదా! దాన్ని ఒక సారి నా దగ్గరికి రప్పించరాదా? దాని పాండిత్యం ఏపాటిదో చూద్దాం!" అని తీరిగ్గా పలికింది. అందుకు రాయల వారు నవ్వుతూ "మానినీ! ఆ చిన్నది వేశ్యకులానికి చెందినదికాదు. రాజపుత్రిక. రామలింగకవిని వలచి మరీ పెండ్లాడింది. ఆమె గురించి చులకనగా పలుకుట తగదు. సరస్వతే దిగివచ్చినా ఆమెతో ప్రసంగించడం కష్టం! మన రామలింగకవి ఆమెను కపటంతోనే ఓడించాడన్నమాట మాత్రం నిజమే! అయితే ఆ పిల్లతండ్రి మనందరికీ ఏలిక అయిన పాదుషా దగ్గర ప్రధానమంత్రిగా ఉన్నవాడు కనుక మనం ఆమెను మన ఇంటికి రప్పించుకోరాదు. ఆమెను చూడాలనుకుంటే నువ్వే ఆమె ఇంటికి వెళ్లి చూడు!" అని చెప్తూ, మందారవల్లి వృత్తాంతమంతా చెప్పాడు.

అప్పుడు ఆమె నవ్వుతూ "నాధా! ఈ కథ నేను ఇంతకు ముందే విన్నాను. అది క్షత్రియ పుత్రిక అనే మాట అలా వుంచండి! నిజమైన వేశ్యకూడా కాదు! అది పల్లెటూరిది. చదువుకొన్నదని తెచ్చి మెచ్చుకొంటూ మీరంతా నెత్తిన పెట్టుకుంటున్నారు. దాన్ని వలచి రామలింగకవే ఈ వ్యూహంపన్నాడు. ఇప్పుడది మన ఇంటికి రమ్మంటే మాత్రం వస్తుందా?" అని పలికింది.

అప్పుడు రాయలు "చాలు!చాలు! నీ బుద్ధి బలం అంతా చూపిస్తున్నట్లున్నావే! ఆమె తల్లిదండ్రులు ఢిల్లీలో తమ పుత్రికగా ఒప్పుకొని నాకు రాసిన పత్రికలు నీకు తెలియవు. అధిక ప్రసంగం మాని, చూడాలనుకుంటే చూడు! లేకపోతే ఊరుకో!" అని మందలించాడు.

వసుంధరుని కథ

మందారవల్లి విద్యావిశేషాల గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటూంటే, ఈర్ష్యకొద్దీ కళానిలయ ఒకరోజు తన పదేళ్ల కూతురైన కళావతిని వెంట పెట్టుకుని ఆమె వద్దకు వెళ్లింది.

ఆమె రాక విన్న మందారవల్లి, ఆమె కెదురేగి, ఆదరపూర్వకంగా కౌగలించుకుంది. ఇద్దర్నీ ఉచితాసనాలమీద కూర్చోపెట్టి గౌరవించింది. ఇద్దరూ ఒకర్నొకరు ఎంతో ప్రశంసించుకున్నారు.

అప్పుడు కళానిలయ "ఈ బాల పేరు కళావతి. కావ్యనాటకాది గ్రంథాలు చాలా చదివింది. తనంతటి వారు లేరని గర్వపడుతోంది. నీచేత పరీక్షింప జేద్దామని తీసుకొచ్చాను" అంటూ, తాను రచించుకొచ్చిన పథకం ప్రకారం కళావతి ప్రస్తావన తెచ్చింది.

మందారవల్లికి అటువంటి ఆలోచన లేమీలేవు. అంత చిన్నపిల్లని తాను పరీక్షించడమెందుకని, తనపుత్రుని "వసుంధరా! ఏం చేస్తున్నావ్? ఒకసారి ఇటురా!" అని పిల్చింది. పన్నెండేళ్ల బాలుడక్కడికొచ్చాడు. చాలా అందంగా ఉన్నాడు. ఆ బాలికని పరీక్షించమన్నదామె.

అతడు కాళిదాసు కవిత్వంలోని తప్పులు ఎత్తిచూసేసరికి, ఆ పిల్లవాడి పాండిత్యం ముందు కళావతి నిలవలేకపోయింది. అప్పుడామె తల్లి వంక చూడగా, కళానిలయ కల్పించుకొని "ఏమి బాలకా! నీ సాహసం? రామలింగకవి పుత్రునివి కనుక, ఆ మహాకవుల కల్పనల్ని ఆక్షేపిస్తున్నట్లున్నావే! ఆ తప్పు కాళిదాసుదికాదు. మూలం వ్యాసునిది. ఆ తప్పులు ఏవైనా ఉంటే మూల గ్రంథ కర్తకు చెందాలి!" అంది.

"పురాణాలలో అలా ఉంది. వ్యాసుడు పురాణాలు విభజించి ఎత్తిరాశాడే కాని, వాటికి కర్తకాడు. అదల ఉంచితే, సరిగ్గా అటువంటి కథాంశాలనే ఏరుకుని కాళిదాసుని ఈ నాటకాలు రాయమని బ్రతిమాలిందెవరు? మంచి కథలే ఎన్నుకోవచ్చుకదా!" అన్నాడు వసుంధరుడు.

"అమ్మా! ఆమె ఎవరు? నన్ను ప్రశ్నిస్తున్న ఆమె, అసందర్భాల్ని సమర్థించుకో చూస్తోంది?" అని అడిగేశాడు వసుంధరుడు.

"రాయలవారి భార్య కళానిలయ" అంది తల్లి.

"ఓహో! దుర్మార్గురాలైన భార్యకు ఉదాహరణగా మనం ఈమె గురించేకదా అనుకున్నాం!" అని చెప్పున అమాయకంగా అనేశాడా పన్నెండేళ్ల కుర్రాడు.

"ఏమిటేమిటీ? నేను 'సతి' పదానికి తగనిదాన్నా? నన్ను మీ అమ్మ అంత మాటన్నదా?" అని రోషపడింది కళానిలయ.

"సందేహం దేనికి? నువ్వు 'సతి'వే అయితే, భర్తనే చంపాలని సాహసిస్తావా ఏం? నీ దగ్గర అనకపోయినంత మాత్రాన లోకులు చెప్పుకోరా ఏమి?" అన్నాడు వసుంధరుడు.

"ఓహో! మీ తల్లి కంటే నేనేం ఎక్కువకాదులే! కొన్నాళ్లు వేశ్యయై తిరిగి, బాగా డబ్బు సంపాదించి, ఎందర్నో పతులుగా వరించాక, చివరికి ఇల్లాలిగా కూర్చొన్నంత మాత్రాన తెలీదనుకున్నావా?"అని మాట మీరింది. దానికి మందారవల్లి రెచ్చిపోకుండా "పోన్లే అమ్మా! నేను రంకులాడినే! ఏదో పిల్లాడన్నదానికి, ఇంత రభస దేనికిలే! ఎవరి సతీత్వం ఎంతన్నది ఆ పరమాత్ముడికి ఎరుకయే గదా!" అంది

"వీడు పిల్లాడా? రాజుతో చెప్పి వీడ్నేంచేయిస్తానో చూడు!"

అని బుసకొట్టింది కళానిలయ

"అప్పుడు చూద్దాంలే! దయచెయ్ తల్లీ!" అంది మందారవల్లి.

"అవునవును! మర్యాద – మన్నన తెలీని నీచులదగ్గరికి రావడంలో తప్పు నాదే" అనుకుంటూ, కూతుర్ని తీసుకుని విసవిస అక్కడ్నించి వెళ్లిపోయిందా కళానిలయ. చివరికి అది ఆమెపాలిట ఈ రీతిగా పరాభవంగా ముగిసింది. ఆ అవమానం వల్ల, ఈర్ష్యాసూయలతో దుఃఖిస్తూ కోపగృహానికి వెళ్లి పడుకుంది. ప్రతీకారం ఎలా తీర్చుకోవాలా? అని ఆలోచిస్తూన్నది. తన భర్త అయిన రాయలవారితో చెప్పినా ప్రయోజనం ఉండదు.

అందువల్ల, ఆమె తన బాల్యస్నేహితురాలైన పల్లవికను రప్పించుకొని, అవమాన భారం వల్ల తానెంత దుఃఖిస్తున్నదీ చెప్పుకుంది.

పల్లవిక ఆమె బాధను అర్థం చేసుకుంది.

"దేవీ! నువ్వు అక్కడికి ఒంటరిగా ఎందుకు వెళ్లావు? ఆమెను అవమానించబోతే, దైవం నీకే అవమానం కలగచేశాడు. సర్లే! ఎలాగోలాగ ఆ కుర్రాడ్ని కడతేర్చేస్తే దాని గర్వం అణుగుతుంది. నిన్ను పరాభవించినందుకు ఫలితం వాడు కూడా అనుభవిస్తాడు" అంది పల్లవిక.

"ఆభారం అంతా నీదే!" అంది కళానిలయ.

పల్లవిక అటువంటి క్రూర కృత్యాల్లో నేర్పరే! ఆనాటి నుంచే ఆ కుర్రవాడి మీద పగబట్టి, చంపడానికి అవకాశం కోసం ఎదురుచూడసాగింది. అయితే - ఆ కుర్రవాడెన్నడూ తల్లినొదిలి బయటకు రాడు. విహారానికి ఉద్యానవనంలోనికే వెళ్లడు. ఇక ఆ బాలుడ్ని చూడటానికైనా పల్లవికకు అవకాశం చిక్కలేదు.

ఇలా కొంతకాలం గడిచింది..

కళానిలయది దీర్ఘకాల కోపం. సజ్జనుల కోపం అయితే క్షణికమే! కాని, భర్తనే కడతేర్చయత్నించిన దుర్మార్గురాలికి దీర్ఘకోపం సహజం కదా!

ఆ రోజు పల్లవికతో "ఏమే! నీకా పని చెప్పి రెండేళ్లు కావస్తోంది. ఇట్టే సాధించేస్తానన్నావు. ఇంత కాలానికైనా నీకు సాధ్యపడనే లేదన్నమాట!" అంటూ ఎత్తిపొడిచింది.

పల్లవిక "అలా అనకు సఖీ! ఆ పిల్లవాడసలు బయటకే రానిదే నేనేం చెయ్యను? దానితో నేనో మార్గం ఆలోచించాను, దక్షిణాది అంతా చుట్టబెట్టి వచ్చిన సోమశేఖరుడనే బ్రాహ్మణ మంత్ర వేత్త మన నగరంలో ప్రస్తుతం విడిది చేసి ఉన్నాడు. మంత్రప్రయోగంతో అతడు ఎలాంటి వారినైనా కడతేర్చగలడు. ఈ బాలుడో లెక్కా? నేను అతడికి విషయం చెప్పి తీసుకొస్తాను. నువ్వే రహస్యంగా మాట్లాడు" అంది. కళానిలయకు కొంత సంతోషమైంది.

పల్లవిక, సోమశేఖరుని దగ్గరకు వెళ్లి, తగిన సమయంచూసి "రాజపత్ని రమ్మని చెప్పమన్నది. నేను ఆమె సఖురాల్ని. మిమ్మల్ని ఏదో విషయమై ప్రశ్నించి తగిన పారితోషికం ఇప్పిస్తుంది" అని చెప్పింది.

సోమశేఖరుడు కళానిలయను సందర్శించాడు. ఆమె ఆ మంత్రవేత్తని సత్కరించి "నన్ను పరాభవించిన శత్రువుకి తగిన ప్రాయశ్చిత్తం మీరే చెయ్యాలి. మీరు కోరిన ధనం ఇస్తాను. మీ ఉపకారం జన్మలో మర్చిపోను" అంది. మంత్రవేత్తలకు అసాధ్యం అంటూ ఉండదని పలికింది.

"అమ్మా! దీనికి నన్నింతగా అడగాలా? నీకు శత్రువైతే, వారు నాకూ శత్రువులే అనుకుంటాను. నన్ను ఆంతరంగికునిగా భావించు! ఆ శత్రువునేం చేయాలో చెప్పు!" అన్నాడు సోమశేఖరుడు.

"శాక్తేయులు. మీకు అదెంతపని? మీకు పదివేల వరహాలు కానుకగా ఇస్తాను. శత్రువుకు మరణమే మీరు జరిగించాల్సిన ప్రక్రియ అంటే - మంత్రంతోనే శత్రువుని అంతం చెయ్యగల సామర్థ్యం మీకు ఉంటే చెప్పండి! రెండో కంటికి తెలీకుండా పని జరిగిపోవాలి" అందా దుష్టరాజపత్ని.

అందుకు అతడు "అమ్మా! నీతో నిజం చెప్తున్నాను.... శాక్తేయులకు డాంబికం అధికం. చెప్పడానికేం - చాలా చెబుతారుగాని, చెప్పేదంతా చెయ్యడం వాళ్ల వల్ల కాదు. ఇందులో అబద్ధాలకు తావులేకుండా సత్యం చెప్పాలి అంటే....నేను దాదాపు దక్షిణ దేశమంతటా తిరిగి ఎనిమిదేళ్లు సాధన చేసి యక్షిణిని ప్రసన్నం చేసుకున్నాను. ఆ దేవత, మనుషుల్ని దూరంగా విసిరేయగలదుగాని చంపలేదు. ఇంత కంటే అధికంగా చేయడం ఎవ్వరి తరమూ కాదు!" అన్నాడు.

అందుకు కొంత విచారపడినా "కానిమ్ము! అదీ కొంత వరకు నాకు ఉపకారమే! యక్షిణితో చెప్పి మహారణ్య మధ్యంలో పడవేయించేలాగ చూడండి! అప్పుడు దేవుడే వాడి పని చూస్తాడు. దీనికి ఏమేమి సంభారాలు

సమకూర్చాలో వ్రాసివ్వండి” అనగా “అమ్మా! ఇవీ నాకు కావలసిన సామగ్రి” అని ఒక కాగితం మీద కావలసినవి రాసి ఇచ్చి “పదో రోజు పొద్దున్న నీ శత్రువు ఎక్కడుంటాడో నువ్వే చూసుకో!” అన్నాడా మంత్రవేత్త. ఆమె సమ్మతించింది. సోమశేఖరుడు మరునాటి నుంచే దీక్ష ప్రారంభించాడు. ప్రారంభించేముందు.

ప్రారంభించేముందు “అమ్మా! ప్రత్యర్థులకు తెలిస్తే ప్రమాదం. ప్రతిక్రియ చేసే అవకాశాలున్నాయి. నేను తొమ్మిదో రోజున నా శిష్యుణ్ణి పంపుతాను. మీ శత్రువు పేరు ఒక చీటిపై వ్రాసి ఇస్తేచాలు!” అన్నాడు ఆ బ్రాహ్మణుడు. అదీ బాగానే ఉందనుకుందావె. మంత్రదీక్ష ముగింపునకొస్తోన్నదనగా మంత్ర వేత్త తొమ్మిదోరోజురాత్రి, తన శిష్యుడిని అంతఃపురానికి పంపి చీటీ తెమ్మన్నాడు.

కళానిలయ ఇచ్చిన చీటిలో ‘మందారవల్లి పుత్రుడు వసుంధరుడు’ అని ఉంది. శిష్యుడది రహస్యం కనుక విప్పిచూడరాదని నిశ్చయించుకొని, ఆ చీటీతో వస్తుండగా – అంతఃపురానికి దగ్గర్లో ఒక చోట రాచసానుల ఆటపాటలు అతడ్ని ఆకట్టుకున్నాయి. ఆ తమకంలోన పడి చేతిలోని చీటీని జార్చుకున్నాడు. కొంతసేపటికి తాను ఎక్కడున్నదీ గుర్తొచ్చి, గురువుగారు ఎదురుచూస్తుంటారనీ గ్రహించుకొని చూడగా, పరిచారికలు అప్పటికే చెత్తఎత్తి ఓమూల పోగుపెట్టేశారు. అది కెలికి, అందులోంచి ఒక చీటీ మడిచి ఉండగా అది చూసి – రాజపత్ని ఇచ్చిన చీటీ అదే అయిఉంటుందని – వడివడిగా బయల్దేరి, ఆ చీటీని గురుదేవునికి అందజేశాడా శిష్యుడు.

దానిలో – ‘కళానిలయ కూతురు కళావతి’ అని రాసి ఉంది మంత్రోచ్చాటనం చేసి, చీటీ ప్రకారం పేరు చదివి యక్షిణిని ప్రసన్నం చేసుకుని, “శత్రువు పేరు ప్రకారం నట్టడవిలో విడిచి రా!” అని ఆజ్ఞ ఇచ్చాడు. హోమం ముగించేశాడు. “కార్యసాఫల్యం జరిగి తీరాలి” అని

అతడు కళానిలయని దర్శించబోగా, కళావతి ఎంత వెదికినా కనిపించడం లేదని తెలియవచ్చింది. "నువ్వు ఎవర్ని ఉద్దేశించి మంత్రించావు" అని అడిగింది పల్లవిక.

"అమ్మా! మా కెవరూ శత్రువులుండరు. మీరు ఏ చీటీ పంపితే, ఆ ప్రకారమే మేము చేస్తాం!" అని చీటీ చూపించాడు. దానిలోపల 'కళావతి' అనే పేరు చూసి గొల్లుమంది పల్లవిక.

"అమ్మో! కొంపమునిగింది. మహాశయా! ఇది మీ దగ్గరికి ఎలా వచ్చింది? మొన్న రాజపుత్రిక ఒంట్లో నలతగా ఉంటే విభూది నిమిత్తం రాజపురోహితుల వారికి పంపిన చీటీ అది"అన్నది కళానిలయ కంగారుగా.

"ముందే చెప్పాను గదమ్మా! నీకు తెలిసి నేనే కపటమూ ఎరుగను, మా శిష్యుడ్నీ విచారించండి! వాడు తెచ్చిన చీటీ అదే" అనేసరికి, ఆయన్నీ రప్పించారు. అతడు వినోదాల్లో పడి చీటీ పారేసుకున్న సంగతీ- పోగు పెట్టిన చెత్తనుంచి దొరికిన చీటీ పట్టుకెళ్లి తమ గురువుగారికి ఇచ్చిన సంగతీ చెప్పాడు.

"ఘనకార్యం చేశావులే" అని నాలుగు చీవాట్లేశాడా గురువు.

అప్పుడేం చేయడానికీ తోచక, "స్వామీ! తెలిసి జరిగింది కాదిది! పిల్లనెలాగైనా రప్పించండి" అంటూ ప్రాధేయపడ్డదా ఇంతి.

సోమశేఖరుడు చేతులెత్తేసి "పల్లవికా! ఇదొక అతి ప్రమాదకరమైన తాంత్రిక ప్రక్రియ. మీరు కోరారని చేశాను. తప్ప దీన్ని ఎప్పుడు పడితే అప్పుడు చేయరాదు. యక్షిణి మళ్లీ ఆరుమాసాల నాటికి గాని నాకు పలకదు. జపం చేసీ ప్రయోజనం శూన్యం! అదీగాక ఆ శక్తికి – దూరానికి విసిరేసే శక్తి ఉంది గాని, ఎక్కడో ఉన్నదాన్ని తీసుకు రాగల శక్తిలేదు. ఆరుమాసాల నాటిగ్గాని ఆ బాల ఎక్కడ పడిందీ తెలుసుకోవడమైనా సాధ్యపడదు. మీకు అవకాశముంటే భటులతో వెతికించుకోండి" అన్నాడు.

పల్లవిక తల్లిడిల్లిపోతూ, వెళ్లి ఆ వృత్తాంతమంతా కళానిలయతో చెప్పింది. ఆమె గుండెలు బాదుకుంటూ దేవుడినీ – మాంత్రికుడినీ తిట్టిపోస్తూ గట్టిగా ఏడవసాగింది. పల్లవిక ఈ 'తంత్రప్రయోగ రహస్యాన్ని' బయటకు పొక్కనీయక జాగ్రత్తపడుతూ "యక్షిణీదేవత ఏదో రాజపుత్రికను ఎత్తుకుపోయింది" అని మాత్రమే రాయలవారికి తెలియజేసింది.

రాయలు అంతఃపురానికొచ్చి, కళానిలయను ఊరడించి, కూతుర్ని వెతకమని భటులకు ఆజ్ఞ ఇచ్చాడు. ఆరుమాసాలు గడిచాక, కళానిలయ సోమశేఖరుడిని రహస్యంగా మరోసారి అంతఃపురానికి రప్పించి, కూతురిజాడ ప్రస్తావించక "ఈసారి శత్రువుని తప్పకుండా అంతర్ధానం చేసి తీరాలి" అంటూ ' మందారవల్లి కొడుకు వసుంధరుడు' అని తానే రాసిచ్చింది – చాలా కానుకలతో అతడ్ని సంతృప్తిపరిచింది. ఆ మాంత్రికుడు దీక్షపూని, ఈ సారి దీక్షావసాన సమయంలో వసుంధరుని అడవి పాల్జేయడంలో కృతకృత్యుడైనాడు. ధన పిశాచంపట్టిన వారికి ఏది చెయ్యదగిన పని – ఏది చెయ్యకూడని పని అనే వివేచన ఉండదు కదా! యక్షిణి వల్ల కార్యం నెరవేరింది.

ఆ యక్షిణి పేరు – విద్యున్మాల. అక్కడ అడవిలో పడిన కొంతసేపటికి తెలివివచ్చిన వసుంధరుడు మొదట కల కాబోలు ననుకున్నాడు. ఎటు చూసినా అరణ్యమే కనిపించడం – రాళ్లమీద పడినందున శరీరానికి నొప్పి తెలియడంతో, కొంతసేపటి వరకూ అయోమయ – ఆశ్చర్యమగ్నుడై ఒక మర్రి చెట్టెక్కి అన్నివైపులా చూశాడు. ఎటువైపు చూసినా అడవే!

"ఏదైతే అది కానీ" అనుకుని చెట్టుదిగి, మెట్లు కట్టబడిన ఓ తామరకొలనులో ముఖం కడిగి, చెట్లకున్న ఫలాలు తిని మెట్లమీద కూర్చున్నాడు.

పరివ్రాజకుని కథ

అలా మెట్లమీద కూర్చొని ఆలోచిస్తూన్న వసుంధరునికి – కొలను అవతలి ఒడ్డున ఓ సన్యాసి స్నానం చేస్తూ కనిపించాడు. "ఇది తపోవనం కాబోలు" అనుకొని, ఆ ఋషి దగ్గరకెళ్లి "మునీంద్రా! శరణు!" అని అతని పాదాలకు నమస్కరించగా, ఆయన జపం పూర్తిచేసుకొనే వరకు ఎవ్వరితోనూ మాట్లాడడుగనుక, చేసైగతో తనను అనుసరించమని ఆ కుర్రవాడ్ని రమ్మన్నాడు. పర్ణశాలలో కూర్చొన్నాడు వసుంధరుడు.

ఆ పరివ్రాజకుడు ఎటో వెళ్లి విధులన్నీ పూర్తిచేసుకుని మధ్యాహ్నానికి తిరిగొచ్చి "నువ్వు ఈ అరణ్యానికెలా వచ్చావు?" అని ఆ బాలుని అడిగాడు. "స్వామీ! నేను కృష్ణదేవరాయల ఆస్థాన కవి అయిన తెనాలి రామకృష్ణుని పుత్రుడిని. నన్ను వసుంధరుడు అంటారు. నేను ఎప్పటిలాగే నిన్నరాత్రి కూడా శాస్త్రాలు పఠించాక పడుకొన్నాను. తెల్లారేసరికి ఇక్కడున్నాను. నేను ఇక్కడికి ఎలా వచ్చానో– ఏ మాయ నన్నిక్కడికి ఎత్తుకొచ్చిందో సర్వజ్ఞులైన మీరే చెప్పగలరు. నాకేమీ తెలీడంలేదు. మీరు చూపే ఆదరానికి కృతజ్ఞుడిని" అన్నాడు. వసుంధరుడు – విద్యవల్ల ఒనగూడిన వినయంతో.

అందుకా యతి సంతోషిస్తూ "బాలుడి వైనా చక్కగా మాట్లాడుతున్నావు. నీ పాండిత్యానికి ఎంతో సంతోషిస్తున్నాను. నువ్వు ఇక్కడికి ఎలా వచ్చావన్నది, యోగ దృష్టితో చూసి తర్వాత చెప్తాను. విచారించకు! నా దగ్గర కొన్ని రోజులుండు. మంచి –మంచి మంత్రాలు చెప్తాను" అంటూ మాటమార్చాడు. అతడి మాటలను బట్టి, వివేకవంతుడైన వసుంధరుడు ఆ పరివ్రాజకుని వద్ద ఏమీ పాండిత్యం లేదని అర్థం చేసుకున్నాడు. అయినప్పటికీ నాలుగు రోజులు ఆగాడు. తర్వాత ఓరోజు "మీ తపస్సుకు లోటేమీరాదనుకుంటే, నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పండి! నన్ను అన్యునిగా తలచవద్దు, మీ పూర్వాశ్రమదేశమేది? మీ అభిధానమేమి? కులశీలాలు ఎటువంటివి? మీరు వక్కాణిస్తే, విని సంతోషిస్తాను" అని అడిగిన వసుంధరుని వాక్చమత్కారానికి ముచ్చటపడి, ఆ యతి తనగుట్టు ఇలా చెప్పసాగాడు....

తుందిలుని కథ

"వత్సా! నా చరిత్ర చాలా గుప్తమైనది. అయినప్పటికీ- సాటిబ్రాహ్మణ పుత్రుడివి కనుక చెప్తున్నాను! నీ పట్లగల అవ్యాజానురాగం వల్ల రహస్యమైన నాకథను నీకు మాత్రమే వెల్లడిస్తాను.

తామ్రపర్ణీ నదీతీరాన గల దేవ నిలయం అనే అగ్రహారంమాది. అక్కడ నివసించే విష్ణుగుప్తుడనే బ్రాహ్మణునికి ఏడో కొడుకుని నేను నన్ను తుందిలుడు అంటారు.

మా ఆరుగురు అన్నలూ వేదశాస్త్రాలు బాగా చదువుకున్నవారు అందరూ కూడా పెక్కు రాజసభల్లో తమ పాండిత్యం ప్రదర్శించి బాగా ధనాన్ని సంపాదించుకున్న వారే! వాళ్లంతా చక్కని కన్యల్ని పెళ్లాడి ప్రస్తుతం గృహస్థ జీవితం గడుపుతున్నారు కూడా!

నేనే మాత్రం ఆకతాయితనంతో బాల్యంలో సైతం పెద్దలమాట వినక, పాఠశాలకు వెళ్లక, గట్టిగా ఒక్కశాస్త్రమైనా పట్టుసాధించేలా చదువుకోక నిరక్షరకుక్షిగా మిగిలాను. అచ్చుబోసి వదలిన ఆబోతులా తిరుగుతూ ఊరిమీద పడి శ్రాద్ధ భోజనాలతో పొట్టనింపుకుంటూ, తుందిల నామధేయం సార్థకమయ్యేలా కుక్షినిండటమే లక్ష్యం అనుకుంటూ గర్విష్ఠినై తిరగసాగాను.

నా తల్లిదండ్రులు నా గురించి విచారపడనిరోజు లేదు. బ్రతికిన న్నాళ్లు వారికి నా చింతయే! నా విద్యాహీనతకు - పొగరుబోతు తనానికి బాధపడుతూనే వాళ్లు కాలధర్మం చెందారు. పిమ్మట నేను నా సోదరుల పంచన చేరాలని చూశాను. ఎవరైనా నాలాంటి అవివేకిని ఎన్నాళ్లు చేరదీస్తారు? నా గర్వానికి జడిసి నన్ను వదిలిపెట్టేశారు.

ఇక-నాలాంటి తిరుగు బోతుకి పిల్లనిచ్చేదెవరు? ఆ ప్రకారం వివాహం లేకుండా తిరుగుతూ, అన్నం పెట్టేవాళ్లులేక, ఆ అగ్రహారాన్ని వదిలి కొన్నాళ్లు దేశాలు పట్టిపోయి తిరిగాను. నేను చూడని అడవులుగాని పట్టణాలుగాని, పుణ్యక్షేత్రాలుగాని లేవు. దాదాపు భూమిని చుట్టివచ్చానే అనుకో! నాకు ఏ విశేషమూ అంతగా ఆకట్టుకొనేది కాదు. విను!....

శతానంద యోగి కథ

ఒకనాడు నేను ఉత్తరకురు భూములలో సంచరిస్తుండగా ఒక అరణ్యంలో, ఇప్పుడు నా మాదిరిగానే పర్ణశాల కట్టుకొని నివశిస్తున్న ఒక యతి దగ్గరకు దైవికంగా వెళ్లాను. ఆయనకు ఓ ఎనభై ఏళ్లుంటాయేమో! రుద్రాక్షమాల తిప్పుతూ ఆటలాడుకుంటూన్న లేడిపిల్లల్ని చూస్తున్నాడు,

నేను ఆయన పాదాలకు నమస్కరించాను. నా వృత్తాంతం దాచకుండా అతనికి చెప్పాను. 'ఆజన్మాంతమూ మీకు శిష్యుడినై ఉండిపోతాను' అని ప్రార్థించాను. ఆయన అనుగ్రహించారు. నేను వారికి సేవలు చేసుకొంటూ అక్కడే గడపసాగాను.

ఒకనాటి రాత్రి....

నాకు మెలకువ వచ్చి చుట్టూ చూడగా, పర్ణశాల అరుగుమీద పడుకొని ఉన్న నాకు, పర్ణశాలలో గాజుదీపాల కాంతి కనిపించింది. వీణానాదం వినిపించింది. లోపలికి నేను తొంగిచూడగా పర్ణశాలలో ఉండవలసిన వాటికి బదులుగా ఇంద్రభవనంలో ఉండదగిన అలంకారాలు అన్నీ ఉన్నాయి. అన్నిటికంటే ఆశ్చర్యకరమైనది – మాగురువుగారు నవయువకులైఉండి, ఆమె తొడమీద తల ఆన్చి సవిలాసంగా పడుకొని ఆ గానం తన్మయులై వింటూవున్నారు. "ఆహా! ఏమి సౌందర్యం? ఏమి విలాసం? అలాటి స్త్రీని పొందిన వానిదే జన్మంటే" అనిపించింది నాకు.

కొంతసేపు చూసి వచ్చి, తిరిగి నిద్రలోకి జారుకున్నాను. మర్నాడుదయం లేచిచూస్తే వర్ణశాల యథావిధిగానే ఉంది. అప్పట్నుంచి ప్రతిరాత్రి గమనించసాగాను. సరిగ్గా ఎనిమిదో నాటిరాత్రి తిరిగి ఆ వింత నా కళ్లపడింది. అప్పుడనుకున్నాను– ' మా అయ్యవారు వారానికో రోజు ఆ దివ్యాంగనతో క్రీడిస్తున్నారు' అని ఆ సుందరి మోహంలోపడి నన్ను నేను మర్చిపోయానంటే నమ్ము! ఒక దశలో ఆ సౌందర్యం తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాను కూడా!

ఆరువారాల పాటు అలా వారి తీరు గమనించాను. తరచు అటు వంటి దృశ్యాన్నే చూస్తూంటే, మదన వికారం జనించకుండా ఉంటుందా? నేను ఆకలికీ - నిద్రకూ దూరమై తిరగడం యతీంద్రులు కనిపెట్టేశారు. "అలా వున్నావేం?" అని అడిగేశారు కూడా!

నేను చూసినదంతా, దాచకుండా నిజం చెప్పేసి "స్వామీ! తప్పో - ఒప్పో నాకంటపడిన దృశ్యమిది. నన్ను క్షమించండి! మీరు నిస్సంగులు కదా! వారానికో రోజు దివ్యకాంతతో సంభోగిస్తున్నారు. ఆమె ఎవరు? ఆమెను చూశాక... నిజం చెప్పేస్తున్నాను - నా మనసు వశం తప్పిన మాట యదార్థం! మీ వంటి పెద్దలకే అటువంటి కోరిక ఉండగా, నావంటి చిన్నవాడికి అలాంటి కోరిక ఉండదా?" అనేశాను.

ఆ జడధారి నవ్వుతూ "వత్సా! అదా సంగతీ? అందుకే అలా వున్నావన్నమాట! సరే - చెప్తున్నాను! విను! ఆమె ఒక యక్షిణీ కాంత. ఒకటా- రెండా? నలభై ఏళ్ల పాటు యక్షిణీ శైలం మీద తపస్సుచేసి, ఆమెని వశపరచుకున్నాను. ఆమె ప్రభావం వల్లనే ఎప్పటికప్పుడు మాత్రమే శృంగార భావాలు జనిస్తాయి. ఆమె నడిగితే ఏదైనా పొందవచ్చు! ఆమె ముందు వృద్ధుడికైనా యవ్వనం ఉదయించాల్సిందే! ఇహలోకంలో ఇలా సుఖపడుతూ, మిగతాకాలంలో పరలోక సౌఖ్యం నిమిత్తం తపస్సాచరిస్తున్నాను" అని వివరించాడు.

అప్పుడు నేనా యతీంద్రునికి చేతులు జోడించి నమస్కరించి "మహాత్మా! ! నాదొక విన్నపం! పుట్టింది మొదలు కష్టాలే తప్ప సుఖం ఎరుగను. ఇక స్త్రీ సుఖం అంటారా? అది అసలు ఎరుగను. రుచి అయినా చూడలేదు. సగం జీవితం అయిపోయింది. ఎక్కడో కొద్దిగా అదృష్టముండి, మీ దర్శనభాగ్యం లభించింది. మీరు నాపట్ల దయచూపి ఆ యక్షిణి వశమయ్యే మంత్రం ఉపదేశించండి! ఆ కొండ దగ్గరకెళ్ళి ఆరాధన ప్రారంభిస్తాను. యక్షిణి ప్రసన్నురాలైందా సరేసరి! లేకపోతే మరణిస్తాను. మీరు మంత్రంగాని ఇప్పుడు ఉపదేశించకుంటే, ఇప్పుడే మీ పాదాలచెంత బతుకు చాలించేస్తాను" అన్నాను.

ఆ యతీంద్రుడు నన్ను లేవనెత్తి "ఆ ఉపాసన అంత తేలిక అనుకుంటున్నావా? యక్షిణుల్లో మూడు తెగలున్నాయి. విద్యున్మాల, చంద్రలేఖ, సులోచన అని మూడు రకాలు. విద్యున్మాలను పదేళ్లు, చంద్రలేఖని ఇరవయ్యేళ్లు, సులోచనని నలభయ్యేళ్లు ఉపాసించాల్సి ఉంటుంది. అన్నిటికంటే ముందు యక్షిణీ శైలానికి పోవడమే కష్టం! యక్షిణీ దేవతలు క్రూరమృగాల్లా వివిధరూపాల్లో వచ్చి, మొదట సాధకుడి ధైర్యాన్ని పరీక్షిస్తారు. ఆ శిఖరాల్ని అంతసులువుగా ఎక్కనివ్వరు. నలభై ఏళ్లపాటు కందమూలాలు తిని, అక్కడ నీలాటి సుఖజీవి ఉపాసనేం చేస్తాడు? పొట్ట పెంచి సుఖంగా ఉండక నీకీ పాట్లు దేనికి? ఇక్కడనే ఉండు!" అన్నారు.

కాని, నేను పట్టువీడలేదు. ఆయన పాదాలు వదలలేదు. అప్పుడా మహనీయుడు క్రూరమృగాలు బాధించకుండా ఉండటానికి దగ్గరుంచుకోవలసిందంటూ ఒక మూలికనిచ్చారు. "ఆ శైలం మీద ఒక చెరువు ఉంటుంది. దానికి దగ్గర్లో ఒక ఆలయం ఉంది. అక్కడుండే ఓ స్ఫటిక స్తంభం మీద ఉపాసనాక్రమం ఉంటుంది? అది చదువుకొని తదేక దీక్షతో ఉపాసించు!" అని శెలవిచ్చాడు.

నేను ఇక్కడికొచ్చి పదిరోజులు తక్కువగా ముప్ఫయ్యేళ్లు కావస్తోంది. ఇంకో పదేళ్ల కాలం ఉపాసిస్తే తప్పనా కోరిక తీరదు" అని ముగించాడా తుందిలుడు.

క్షుద్రమైన స్త్రీ సుఖం కోసం విలువైన జీవితాన్నంతటినీ వృధాచేసుకుంటూన్న వారెంత మూర్ఖులో అనుకుంటూ "ఆ యక్షిణీదేవాలయాన్ని నాకు చూపారు కాదేం?" అని అడిగాడు వసుంధరుడు.

అప్పుడా తుందిలుడు "వసుంధరుడా! నేను ప్రతిరోజూ వేకువజామున అక్కడికేకదా పోయేది. అక్కడ మధ్యాహ్నం వరకూ జపం చేసుకుని, పర్ణశాల కొచ్చి భోజనం చేసి విశ్రమిస్తున్నాను. నీకు ఆ దేవాలయం రేపు చూపిస్తాను" అని చెప్పి, మర్నాడు వసుంధరుణ్ణి ఆలయానికి తీసుకెళ్లాడు.

తుందిలుడు జపం చేసుకుంటూన్నంతసేపూ, వసుంధరుడు అక్కడి విశేషాలు అన్నీ చూస్తూ, శతానందయోగి చెప్పిన స్ఫటిక స్తంభం మీది శిలాఫలకం చదివి, ఆ ఉపాసన రీతిని అతడు గ్రహించాడు.

యక్షిణీదేవి కథ

అందులో సులోచన అనే యక్షిణిని వశపరచుకోడానికి కొన్ని నిబంధనలున్నాయి. అందులో ఒక నిబంధన దగ్గర ఒక గుర్తు పెట్టబడి ఉండటం వసుంధరుడు గమనించాడు. దాని ప్రకారం - ముప్ఫయ్యేళ్లు మంత్రానుష్ఠానం చేసి, పద్నాలుగేళ్లప్రాయంగల బ్రాహ్మణకుమారుని బలిఇవ్వాల్సిఉంది. అలా చేస్తే సులోచన వశమౌతుంది. అయితే అది కనిపించకుండా జాగ్రత్తపడ్డాడా తుందిలుడు. వసుంధరుడు సామాన్యుడా? పసరుపూసి అది చదివేశాడు. తర్వాత యధాప్రకారం తుందిలుడు మట్టిపూసి మరుగు చేసినట్లే - తానూ అది కన్పించనీయక ఉంచి ఏమీ ఎరగని వాడిలా తుందిలుడి దగ్గర కూర్చొని, శ్రద్ధగా అతడ్ని గమనించసాగాడు. దొంగకే దొంగలా వసుంధరుడు అతడ్ని ఒక కంట కనిపెట్టి ఉన్నాడు. అలా తొమ్మిది రోజులు గడిచాయి.

పదోనాడు స్నానం చేసి ఆలయానికి వెళ్లాక "ఓయీ వసుంధరుడా! నీ మీద మాకు వాత్సల్యం కలిగింది. ఇవాళ నీకొక గొప్ప మంత్రం ఉపదేశిస్తాం! దాంతో నీవు మీ దేశానికి పక్షిలా ఎగిరిపోవచ్చును" అన్నాడు తుందిలుడు.

"ఆ మంత్రం మీకు సిద్ధించిందా? అయితే ఓసారి మీరే ఎగిరి ఎందుకు చూపించకూడదూ?" అని అడిగాడు వసుంధరుడు. అతడు ఇలాటి ప్రశ్న వేస్తాడు అని ఊహించని తుందిలుడికి ఏం చెప్పాలో తోచక "బిడ్డా! ఒక మంత్రం అనుష్ఠిస్తున్నప్పుడు, ఇంకొకటి అనుష్ఠేయంకాదు. అందువల్ల మేము దానిని ప్రత్యక్షంగా చూపుటకు వీలుపడదు" అన్నాడు.

"స్వామీ! అదే నిజమైతే, నాకు మంత్రోపదేశం ఎలా చేస్తారు? మీరు అనుష్ఠిస్తున్న మంత్రానికి ఇది అడ్డొచ్చి అతిక్రమించినట్లుకాదా?" అని తిరిగి ప్రశ్నించాడు వసుంధరుడు.

దాంతో కోపం వచ్చిన తుందిలుడు కళ్లెర్ర చేసి "ఓరీ బాలకా!నీతో మేము చనువుగా ఉన్నామనా లేనిపోని తర్కం చేస్తున్నావు. గురువులకు

ఎప్పుడు తోచితే, అప్పుడది చెప్తారు. అందుకే గద! నిత్యం గురువులను అనుసరించి తిరగాలని పెద్దలు చెప్తుంటారు. ఇన్ని మాటలెందుకు? నా దగ్గర ఉపదేశం పొందాలనుకుంటే, కుశంకలు మానేసి నాపాదాలు రెండిటి మీదా నీ శిరస్సు ఉంచి నేను చెప్పేమంత్రం ఉచ్చరిస్తూండు! నువ్వునాకు గురుదక్షిణ కూడా ఇవ్వనక్కర్లేదు".. అని పలికాడు. అది తెలుసుకోలేని మూఢమతి కాడు గనుక వసుంధరుడు "స్వామీ! నేను పుట్టి బుద్ధెరిగాక ఇంత వరకు బోర్లాపడుకొని ఎరుగను. కాని మీరు చెప్పినట్లు చెయ్యాలని ఉంది. ప్రణామ విధి ఎలాగో మీరు ఓపికగా స్వయంగా చేసి చూపించండి! అలాగే నేను చేస్తాను" అన్నాడు.

"ఓహో! ఈసుకుమారుడు పుట్టిన దగ్గర్నుంచి రాజులతో కలిసిమెలసి, సంచరించడం వల్లకాబోలు ఇతరులచేత మొక్కించు కోవడమే తప్ప మొక్కి ఎరుగడు. వీనికి ఆ ప్రణామ విధి చూపించాలి" అనుకుంటూ, వసుంధరుని ఎదుట బోర్లాపడి ప్రణామం ఎలా చెయ్యాలో చూపుతూండగా, ఆ చిన్నవాడు ఛర్రున కత్తిదూసి "ఓరీ దురాత్మా! ఇష్టదేవతని తల్చుకో! నీప్రాణం ఈ కత్తికి బలికాబోతోంది" అన్నాడు వసుంధరుడు - అతని జుట్టును తన చేతిలో ఇరికించుకుని.

అప్పుడా సన్యాసి కదలలేక "హా! వసుంధరా! నన్ను రక్షించు! కాపాడు! చంపవద్దు. నీకు దాసుడినై పడిఉంటాను" అంటూ మొరపెట్టుకున్నాడు. వసుంధరుడికి జాలికలిగి "నీచుడా! నన్ను చంపడానికి నువ్వు ప్రయత్నించావా లేదా? నిజం చెప్పు! నిన్ను వదుల్తాను" అన్నాడు "నిజమే! నిన్ను చంపుదామనే అనుకున్నాను. బుద్ధి గడ్డితిని అలా చేయడానికి సాహసించాను. నన్ను విడువు" అంటూ గిలగిల కొట్టుకుంటూ వేడుకున్నాడు. అంతలో "ఓయీ! రాజపుత్రా! వీడ్ని విడువకు. నాకు బలివ్వు తృటిలో నేనునీకు వశమవుతాను" అని అశరీరవాణి ఒకటి వినిపించింది. అప్పుడు వసుంధరుడు "అమ్మా! వీడింట నేను పది రోజులు ఆహారం స్వీకరించాను. ఆ కృతజ్ఞత నన్ను బాధిస్తోంది. అదీగాక, తుచ్ఛమైన భోగాలకు ఆశపడి బ్రహ్మహత్య చేస్తానా? అవసరమని నీకు అనిపించనపుడు, నాయందు దయ ఉంటే నన్ను కాపాడు! అదే నాకు పది వేలు" అన్నాడు వసుంధరుడు.

అప్పుడు "మేలు! మేలు! నీ కృపాశీలానికి మెచ్చుకున్నాను. అట్లే నీకు భోగలాలసత పట్ల మక్కువలేని వైరాగ్య భావానికీ సంతసించాను. అవసరమైనపుడు నన్ను తల్చుకో! నీ కార్యసాఫల్యం చెందగలడు" అని అశరీరవాణి వరం ఇచ్చింది.

అప్పుడా వసుంధరుడు "దయలేని కపటుడివి! నీకీ జడలూ గట్రా దేనికి?" అని ఆ విప్ర తుందిలుడికి, శిఖ మొదలంటానరికి వదిలిపెట్టాడు. ఆ కుర్రవాడి దయాగుణానికి ఆశ్చర్యపోయి, వెనుదిరిగైనా చూడక తుందిలుడు తన పర్ణశాల వైపు పరుగు లంకించుకున్నాడు.

రాత్రి కావస్తుండగా, వసుంధరుడు అక్కడే ఉండి, నిద్రపోక ఏదో ఆలోచిస్తూంటే, మనోహరమైన గానం వినిపించింది. అతడాలస్యం చేయక విగ్రహం మాటున దాక్కొన్నాడు. అక్కడికి దివ్యకాంతలు యక్షకన్యలు వివిధ అలంకారాలతో వచ్చారు. వాళ్లు పాటలతోను - వాయిద్యాలతోను దేవిని ఆరాధించారు. వారే మూడు రకాల యక్షిణులకు పరిచారికలు అందులో ఒకామె ఇలా అన్నది...

"మనం వస్తున్నపుడు మంటపంలో పడుకొన్నది ఎవరో తెలుసా? మందావల్లి కొడుకు - వసుంధరుడు, సోమశేఖర మాంత్రికుడి ఆజ్ఞవల్ల నేను అలా చెయ్యవలసివచ్చింది. రూపంతోపాటు గుణం కూడా ఉన్న చిన్నవాడు. ఆ ఉపాసకుణ్ణి దయతలచి వదిలేశాడుగాని, లేకుంటే ఇతడికి మనం పరిచారికలమై ఉండేవాళ్లం".

"నిజమేనే విద్యున్మాలా! వీడి సుగుణాలు చూసేకాబోలు మా దేవి, రాకుమార్తెని అడవులపాలు చేసి, ఇతడ్నిక్కడికి తెచ్చింది" అంటూ ఇంకొకామె అన్నది.

"ఇతడికి రాజ్యపట్టాభిషేకం కలుగుగాక" అని ఒకరు "పట్టాభిషేకానంతరం కూడా సుకృతి కలుగు" అని మరొకరూ దీవించారు.

ఆ యక్షిణుల ప్రభావంతో, వసుంధరుడికి అక్కడ్నుంచి బయట పడేమార్గం దానంతటదే తోచింది. అక్కడ్నుంచి ఓ పల్లెమీదుగా అతడు ప్రయాణించాడు. గోపా! తదుపరి కథ తర్వాత మజిలీలో పద!" అని గోపాలునితో కూడ తదుపరి మజిలీ చేరాడు మణిసిద్ధుడు.

కాశీ మజిలీ కథలు

46 వ మజిలీ

"గోపా! వినుము.....

కళానిలయ కూతురు, కళావతి యక్షిణి ప్రభావంతో, దూరదేశాల్లోని ఒక అడవిలోనికి విసిరేయబడింది కదా! ప్రాతఃకాలంలో ఆపిల్ల వీణాసాధన చేస్తుంది కనుక, అందుబాటులో తాను ఉంచుకున్న వీణ కోసం కన్నులు మూసుకొనే చేత్తో వీణకోసం తడుముకోసాగింది.

కళావతి కథ

అది కనబడక, చేతికి రాళ్లూ, రప్పలూ తగిలేసరికి, కళ్లుతెరిచి అన్ని వైపులా చూసి "అయ్యో! నేను ఇక్కడికెలా వచ్చాను? అంతఃపురం ఏమైంది? నా వీణ ఏది? కలకాదు కదా! ఇపుడేం చెయ్యాలి?" అని విచారిస్తూ ఒక చెట్టుకింద కూర్చున్నది.

మిట్ట మధ్యాహ్నపువేళకు ఆ దారంట, సదాచారి అనే బ్రాహ్మణుడొస్తున్నాడు. అతడా చుట్టుప్రక్కలగల గ్రామాల్లో యాయవారం చేసుకొని జీవిస్తూంటాడు. మధ్యాహ్నపు ఎండకు తాళలేక విశ్రమించడానికి, నెత్తిమీది మూటలు దించుకోబోతూ, అటు వైపుచూశాడు. అన్ని రకాల అలంకారాలతో దివినుంచి భువికి దిగిన దేవకన్యలా పన్నెండేళ్ల ప్రాయంతో ఉన్న ఆ బాలికను అక్కడ అలా చూసే సరికి అతడికి ఆశ్చర్యం - భయం ఒక్కసారిగా కమ్ముకొనిరాగా చేష్టలుడిగి అలాగే బిగుసుకుపోయాడు.

అప్పుడా రాజపుత్రి "బ్రాహ్మణుడా! నన్ను చూసి భయపడుతూన్నావేం? నేను భూతాన్నో - దయ్యాన్నో కాను - దగ్గరకి రా!" అని పలకరించేసరికి, అతడికి మరింతగా గుండె ఝల్లుమంది.

"ఇక ఈ రోజుతో నా పని అయిపోయింది. ఈ చెట్టుమీద బ్రహ్మరాక్షసి ఉన్నది కాబోలు! బ్రహ్మరాక్షసి రకరకాల రూపాల్తో వచ్చిదారిన పోయే వారిని ఆహ్వానించి, కవ్వించి, మోసగించి దగ్గరకు రాగానే పట్టుకుని భక్షిస్తారని చెప్పుకుంటూంటారు. ఇది ఆ జాతిదే అయ్యుంటుంది. లేకపోతే ఈ కీకారణ్య మధ్యంలో ఇన్ని నగలూ నాణ్యాల్తో ఒంటరిగా ఎందుకు నివశిస్తుంది. ఇంత సౌందర్యం రాశిపోసినట్లున్న ఈమె నాలాంటి ముప్పి బాపనిని చేరరమ్మని పిలవడం ఏమిటి? ఇది నాపని పట్టడానికే ఈ జగన్మోహిని ఆకారంలో బాల వలె నాకు అగుపించాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు నాకేది దారి? పారిపోదామన్నా, వెంటబడి తరమడం దానికో లెక్కా? చెయ్యిబార జాపితే, వందగజాలైనా సాగగలదు ఇక నా ఆయుర్దాయం తీరిపోయింది కాబోలు! ఇల్లు కదలబోవు సమయానికి మంచి శకునం ఎదురయ్యేసరికి సంతోషించాను. ఈరోజు దొరికినన్ని సంభారాలు ఇంతకు ముందెన్నడూ దొరకలేదు. ఇంతలోనే - వీటిని అనుభవించకుండా చేస్తావా దైవమా? అయ్యో! ఇది గుభేలున లేచినా పీక నొక్కేస్తుంది కాబోలు!..." అనుకొంటూ, ఆ క్షణమే ప్రాణాలు పోయిన వాడిలా కదలక-మెదలక ఉండిపోయాడు.

"వృద్ధుడా! ఎందుకలా భయపడతావ్? నేనేమన్నా పెద్దపులినా?" అంటూ కళావతి రెండడుగులు అతనివైపు వేసింది.

అప్పుడతడు "తల్లీ! నీకొకనమస్కారం! నాజోలికి రాకు! నాకు చాలమంది పిల్లలున్నారు. వాళ్లకి నేనొకడినే దిక్కు" అని కాలిసత్తువ కొద్దీ పరెగెత్తాడు. ఆ పిల్ల నట్టడవిలో మనిషిసాయం దొరికినందుకు ఓ పక్కసంతోషిస్తూ, ఇంకో పక్క అతని భయానికి నవ్వుకుంటూ లేచి అటువైపునకే నడవసాగింది.

అప్పుడతడు కొంచెం దూరం పరుగెత్తి,ఇక పరుగెత్తలేక ఆ చిన్నది తన వెనుకే రావడం చూసి, "ఇక నేను మిగిలి లేను' అని నిశ్చయించుకొని, మూటలు బరువై కాళ్లకు అడ్డం పడుతూండగా కాళ్లు మెలికపడి చతికిల పడిపోయాడు.

కళావతి అక్కడికొచ్చి, తనను చూసి పిరికితనంతో పారిపోతున్నాడని అతని భయం పోగొట్టదలచి, తానే అతని చేతులుపట్టుకొని లేవనెత్తబోయింది. "బాబోయ్! నన్ను బ్రహ్మరాక్షసి చంపేస్తోంది. నాయనోయ్! ఎవరైనా వచ్చి రక్షించండి" అంటూ మొర్రోమని అరవసాగాడు.

'ఓహో! ఇదా ఇతడి భయం!' అనుకొని నవ్వుకుంటూ "నేను బ్రహ్మరాక్షసిని కాను. శ్రీకృష్ణ దేవరాయల కూతురు. కళావతిని! నువ్వేదో సహాయాన్ని నాకు చెయ్యగలవని, నేను నీ దగ్గరకు వస్తూంటే నన్ను చూసి పారిపోతున్నావు దేనికీ? లే!లే! నన్ను మా నగరానికి చేర్చు! నీ దరిద్రం పోగొట్టగల్ను" అని చెప్పేసరికి, అతడికి భయం పోవడానికి బదులు అనుమానం రెట్టింపైంది.

"ఆహా! ఏం వగలు? ఏం నైపుణ్యం? బ్రహ్మరాక్షసి! నీమాట నమ్మడం ఎలా? దారినపోయే వాళ్లని ఇలాగే ఆకర్షించి, ఏవేవో మాటలు చెప్పే వాళ్ల రాక్షసిమాయలూ - మాటలూ కనిపెట్టలేననుకున్నావా? ఇంతమంది ఉండగా నేనే నీకు దొరికానా? విడువు! నీ పేరు చెప్పుకుని బతుకుతా!" అంటూ ఆమె చేతులు విదిలించుకుంటూనే ప్రాధేయ పడసాగాడు.

"అయ్యో! వెర్రి బ్రాహ్మడా! నా మాట నమ్మవేం? నేను నిజంగా బ్రహ్మ రాక్షసినే అయితే, ఇంతవరకు ఆగుతానా? నిన్నీపాటికి మింగేయకపోదునా? చేతికి చిక్కిన నిన్ను బతిమాలుకోవడం దేనికీ? చిక్కకపోతే కదా - బతిమాలు కోవడం! ఈ మాత్రం ఆలోచనైనా నీకు రాలేదా? పోనీలే! భయంవల్ల ఆలోచన రాలేదు కాబోలు! నేను నిజంగానే రాజపుత్రికను దైవంతోడు. నన్ను మా విజయనగరానికి చేర్చు! నీకు మంచి పారితోషికం ఇప్పించగలను" అంటూ రెట్టించి, చేతులు పట్టుకొని నాలుగు సార్లు అదేమాట చెప్పడంతో క్రమంగా భయం వదిలి, వణుకు తగ్గిస్థిమితపడి

కొంత ధైర్యం తెచ్చుకున్నాడు. "సరేగానీ -నువ్వు రాజపుత్రికవైతే ఒక్కర్తెవు ఇక్కడి కెలా వచ్చావు?" అని అడగ్గా-

"అయ్యా! నా వృత్తాంతం వింటే నువ్వు ఇలా జడిసిపోక ఉండేవాడివేమో! నిన్నరాత్రి అంతఃపురంలోనే చాలా పొద్దుపోయేదాకా చదువుకు సంబంధించిన విషయాలే చూసుకుంటూ గ్రంథాలతో గడిపాను. నిద్రపోయి లేచేసరికి అదేం ఇంద్రజాలమో తెలీదు. ఈ ఉదయానికీ అడవిలో తేలాను. ఏమిటి కారణమో అర్థంకాక ఆలోచిస్తూంటే, నువ్వొచ్చి నాకు ధైర్యం కలిగించావనుకుంటూంటే, నన్ను చూసి నువ్వు ధైర్యం కోల్పోవడం వింతగా ఉంది! అడవుల్లో ఇటువంటి నయవంచన చేసే రాక్షసులుంటారు కాబోలు అని విని ఉండటం వల్ల భయపడ్డావేమో! నన్ను అడవిలోకి తీసుకెళ్లమనడం లేదు. నా నివాసం ఎక్కడో చెప్తున్నానుకదా! నన్ను మా నగరానికి చేర్చావనుకో! నీ దరిద్రం తీరిపోయేంత ధనం ఇప్పించగలను. నన్ను నమ్మవయ్యా" అంది వేడుకుంటూ.

అప్పుడతడు గుండెదిటవు చేసుకుని, ధైర్యం తెచ్చుకుని "అయ్యో తల్లీ! నువ్వు రాజపుత్రికవా? తెలీక బ్రహ్మరాక్షసి వేమో అనుకున్నాగదా! క్షమించు! మీ తండ్రి ప్రసిద్ధి జగమంతా ఎరిగినదే! ఆ ప్రభువును గురించి తెలీనిదెవ్వరికి? కాని మీ నగరం ఇక్కడికి చాలా దూరం ఉంది! కానియ్యి! నెమ్మదిగా మీ ఊరు చేర్చగలను. ఇప్పుడు మా ఇంటికి వెళ్లడంమంచిది రా! పోదాం! ఈ నగలూ - నాణ్యాలతో నిన్ను చూస్తే ఎలాటివారైనా దొంగలు అవుతారు. తీసి మూటకట్టు! అవి రహస్యంగా దాచాలి! మా ఇళ్లు మీ రాచనగరుల్లాగ భద్రమైనవి కూడా కావు" అన్నాడు.

కళావతి నగలన్నీ మూటకట్టి, ఆ బ్రాహ్మణుని చేత బెట్టింది. ఆమెను వెంటబెట్టుకుని, సమీపంలో ఉన్న తన గ్రామానికి తీసుకుపోయాడు.

తాటకికి మేనత్త అనాలో, పూతనకు తల్లి అనాలో, శూర్పణఖకు పెద్దకూతురే కావచ్చో, హిడింబికి అక్కో, లంకిణికి చెల్లెలో... ఎలా చుట్టరికం కలిపినా, ఆ రాక్షసీమణులకు ఏమీ తీసిపోదాతని భార్య.

ఇంకా లోపలికైనా అడుగు పెట్టకుండానే, మగడ్ని పట్టుకొని "ఈ పిల్ల నెక్కడ్నుంచి లాక్కొచ్చావు! దీని సంతోషంలో పడి తిరిపెం ఎత్తడాన్ని మానేశావా ఏం? వీళ్లందరి కడుపు ఎలా నింపాలనుకున్నావు? ఈ కాపురం చెయ్యడం నావల్ల కాదు" అంటూ నోటికొచ్చి నట్లల్లా ప్రేలి, కొంతసేపటికి ఆపిందామె. తెచ్చిన మూటలు ఆమె మీదికి విసిరి "లోపలికి పదవే! ఈ బాలికను నిందిస్తావేం? చెప్తా పద!" అని లోపలికి తీసుకెళ్లి" అదెవరు అనుకున్నావ్? రాజపుత్రిక శ్రీకృష్ణదేవ చక్రవర్తిగారి కూతురే! దారి తప్పి అడవిలో తేలింది. ఇదిగో! ఇవన్నీ ఆమె ఒంటి మీది నగలే! ఆమెను తన తండ్రికి అప్పగిస్తే గొప్పబహుమానం ఇప్పిస్తానని ఆమె చెబుతోంది. మేము రేపే రాజధానికి బయల్దేరి వెళ్తాం!" అన్నాడతడు.

ఆ గయ్యాళి గబగబా మూట విప్పి నగలన్నీ లెక్కబెట్టి, అవెంత విలువైనవో అంచనా వేసి, మూటకట్టేసి లోపలదాచి, భర్తతో "చాల్చాల్లే! తెలివితక్కువ పనులు చెయ్యకు! నువ్వు ఈ పిల్లని రాజుకు అప్పగిస్తే, దీని నగలేవీ అని అడక్కపోడు. అప్పుడు మనం జాగ్రత్తగా ఆ నగలన్నీ ఇచ్చేయక తప్పదు కదా! ఇంతాచేసి సలక్షణంగా పిల్లని అప్పగిస్తే, ఈ నగల విలువలో పదో వంతో - పాతిక వంతో పారితోషికం ఇచ్చే సరి సరి బ్రహ్మాండం చేతికి దొరికింది విడవడం వివేకం కాదు. రాబోయేది ఎంతన్నదీ తెలీదు కనుక - దాన్ని తండ్రి దగ్గరకు తీసుకు పోతానని చెప్పి అడవిలోకి ఏ పాడు నూతిలోనో తోసేసి రా! పిదప మనల్ని అడిగే వాళ్లుండరు" అని దుర్బోధచేసింది. అతడికి అది ఎంత మాత్రం ఇష్టంలేకపోయినా, భార్యమీద భయం వల్ల దానికేమీ బదులు చెప్పక తలూపి ఊరుకున్నాడు.

తరువాత, కొన్ని రోజులపాటు నగలమీద ఆశవల్ల కళావతిని ఆ విప్రుని భార్య బాగానే చూసింది. ఒకరోజు "తాతా! మనం మీ ఇంటికి వచ్చి చాలా రోజులైంది. మా నగరానికి ఎప్పుడు తీసుకెళ్తావు? నన్నుచూడక మా వాళ్లెంత విచారిస్తున్నారో!?" అని అడిగింది. అతడు నీళ్లు నములుతూ ఇదిగో - అదిగో అంటూంటే, "ఇతడు భార్యావిధేయుడు - పెళ్లాన్ని అడిగి, ఆమె ఆజ్ఞస్తేగాని ఏమీ చేయడు" అని గ్రహించి, ఆమెనే ప్రసన్నం

చేసుకోదలచి, ఆమెకు నచ్చేలా మాట్లాడేసరికి మర్నాడే వాళ్ల ప్రయాణానికి ఏర్పాట్లు చేసిందా వంచకి. బయల్దేరే ముందు భర్తని పక్కకి పిల్చి ఏం చెయ్యాలో మరీ-మరీ చెప్పింది.

కాని ఆ సదాచారి, పేరుకు తగినట్లు నిజంగానే మంచి హృదయమున్నవాడు - ఆచారవంతుడు కావడం వల్ల, ఆ బాలిక నడవలేనపు డెత్తుకుంటూ, దారి బాగున్న చోట్ల నడిపిస్తూ ప్రయాణం చెయ్యసాగాడు.

భార్యచేసిన దుర్బోధ అప్పుడప్పుడు, అతడి మనస్సులో ముల్లులాగ గుచ్చుకొంటున్నా, ముద్దుల మూటగట్టే ఆ బాలికను చంపడానికి అతనికి చేతులురాక అడవిదారుల పడి నడవసాగాడు. ఆమెను వెంటనిడుకొని.

కొన్ని మాసాలు గడుస్తున్నా, అడవుల్లోనే సంచరిస్తూన్న ఆ విప్రుని చూసి "తాతా! నీకు విజయనగరం దారి తెలీదా? ఊరకే అడవిదారులలోనే నడుస్తున్నావు. చూడు! నీ కాళ్ళు ఎలా వాచుతున్నాయో?! దగ్గరిదారి అనుకోడానికీ అవకాశం లేదు. అలా అయితే ఇన్ని మాసాలకు మనం ఇంకా ఈ చుట్టుప్రక్కలే ఉన్నాం! ఎప్పటికి రాజధాని చేరుతాం? ఎవరినైనా తెలిసినవారిని అడిగి నడుద్దాం!" అనసాగిందామె.

దైవికంగా కొన్ని రోజుల ప్రయాణం తర్వాత వాళ్లు కుముద్వతి అనే నగరానికి చేరుకున్నారు. అక్కడొక సత్రంలో భోజనం చేసి, విశ్రాంతి తీసుకుంటూంటే, ఆ సత్రం గోడమీద ఒక ప్రకటన రాయబడి ఉండటం అతడి కంట పడింది.

ఆ పట్టణపు రాజు కుముద్వంతుడనీ - అతని కూతురు కౌముది అనీ - ఆ పిల్ల చదరంగంలో దిట్ట అనీ, ఆమెను ఓడించిన వారికి పదివేల మాడలు బహుమానమనీ ఆ ప్రకటనలో రాసి ఉంది. అయితే ఓడిపోయిన పురుషుడ్ని వెంటనే ఉరి తీసేస్తారనీ అందులోనే సూచించారు.

ఆ చివరిమాటలు, విప్రునికి కొంత ఊరటనిచ్చాయి.

ఆ ప్రకటనను ఆ పిల్లకు చూపిస్తూ "అమ్మాయీ! నీకు చదరంగంలో నేర్పున్నట్లుగా మాటల సందర్భంలో ఓసారి నాతో అన్నావు- గుర్తుందా? ఇప్పుడు నీ, నేర్పుకి పరీక్ష వచ్చిందనుకో! ఈ దేశపు రాజు కూతురైన కౌముదితో నువ్వు చదరంగం ఆడిగెలవగలవా?" అని అడిగాడు.

రాచపుత్రికదా! ఆ మాటలు ఆమెకు రోషం తెప్పించాయి. "నేను గెలవకపోవడమేమిటి తాతా? ఇప్పుడే వాళ్లతోపోయి చెప్పిరా – నేను ఆడి చూపిస్తా! పదివేల మాడలూ నీ చేతిలో ఉన్నట్లే అనుకో!" అందామె.

'ఆహా! దైవ ప్రయత్నంచేతనే ఒక్కోసారి కార్యాలు సానుకూలం అవుతుంటాయంటారు. ఇదేకాబోలు! నా పెళ్లాం చెప్పినట్టు ఈ పిల్లని కడతేర్చక పోవడమే మంచిదైంది. ఈ బాలిక చదరంగంలో ఓడిపోతే, నా చేత్తో నేను చంపక్కర్లేకుండా, వాళ్లే ఉరితీస్తారు. గెలిచిందా – పదివేల మాడలు బహుమానంగా వస్తాయి. ఎలాగైనా లాభమే! కాని – పాపం! ఈ పిల్ల బహుమతి గెలుస్తానంటూ ఉత్సాహపడుతున్నదే తప్ప, ఓడిపోతే చేటు వస్తుందని బెంగపడటంలేదు. నేను ఆ మాట పదే పదే గుర్తు చేయకపోవడమే మంచిది" అనుకున్నాడు.

"ప్రకటనలో ఉన్నదాన్ని బట్టి ఆమె పురుషులతోనే చదరంగం ఆడేదానిలా ఉంది. కనుక నీకు పురుషవేషం వేస్తాను. నా పుత్రుడివని చెబుతాను. ఆ రాజకుమార్తెతో చదరంగం ఆగి గెలిచావా– నీ మూలాన నాకూ కీర్తి వస్తుంది" అని చెప్పడంతో ఆమె అందుకు అంగీకరించింది.

కళావంతుని కథ

పురుష వేషం దాల్చిన కళావతిని చూసి, ఆ బ్రాహ్మడే ఆ రూప విశేషానికి ఆశ్చర్యపడసాగాడు. అప్పుడామె పదమూడేళ్ల బాలబ్రహ్మచారిలాగ ప్రకాశిస్తూంటే 'కళావంతుడు' అని పేరు మార్చి పిలవసాగాడు.

సదాచారి ఆమెను తీసుకొని, మర్నాడు రాజసభకు వెళ్లి అక్కడి అధికార్లతో "ఈ పుత్రుడు కౌముదితో చదరంగ మాడ వచ్చాడు" అని దర్పంగా చెప్పాడు. ఆ రాజోద్యోగులు ఆ రూప విశేషాలకు అబ్బురపడి "ఓయీ వెర్రిబాపడా? నీవు డబ్బుకు ఆశపడి మన్మధునిలాంటి ఈ కుమారుని ఎందుకు చంపుకుంటావు? కౌముది ఆటను అంత తేలిగ్గా తీసుకున్నావా? కొమ్ములు తిరిగిన వాళ్లే, ఆమె వేసే చదరంగపుటెత్తులు గ్రహించలేక ఓడిపోయారు. ముక్కుపచ్చలారని ఈ బాలుడోక లెక్కా? అవలీలగా చిత్తుచేసెయ్యగలదు. తర్వాత వగచి ప్రయోజనం ఉండదు"... అని ఎన్నో

విధాల చెప్పిచూశారు. "నువ్వింతగా చెప్తున్నందున – ఓడిపోతే ఉరికి సిద్ధమేనంటూ ఒడంబడిక పత్రం రాసివ్వవలసిఉంటుంది" అనీ అన్నారు అతడలాగే రాశాడు. వాళ్లు మళ్లీ–మళ్లీ ఆ బాలుని చూసి ముచ్చటపడుతూ, ఆ బాపడేదో వెర్రిభ్రమపడుతున్నాడని, అబ్బాయి వంక చూస్తూ "నీ తండ్రి డబ్బుకు ఆశపడి, నిన్ను చంపుకొనేలా ఉన్నాడు. కౌముది సంగతి బాగా తెలిసిన వాళ్లం – కనుక చెపుతున్నాం! నువ్వు ఒప్పుకోకు నాయనా!" అంటూ కళావంతునికి బోధించసాగారు. అందరికీ చిరునవ్వే అతని జవాబు.

మూడు రోజులనాడు ఆస్థానం నుంచి పిలుపువచ్చింది. చదరంగ కేళా మందిరంలో అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. కళావంతుని ఇద్దరు సఖులు తీసుకెళ్లి ఆ మందిరంలో ప్రవేశపెట్టారు, వెంటనే సకల ఆభరణాలతో, అలంకారాలతో కౌముది అక్కడికొచ్చింది. అల్లంత దూరంనుంచే కళావంతుని తేజస్సౌందర్య రూపురేఖా విలాసాలు చూసి "ఆహా! సృష్టి విచిత్ర మెంతటిదో కదా! ఇంతటి నవమన్మథాకారుని ఆ పేద బాపడింట పుట్టించాడు! అయ్యో! ఇంత కుర్రవాడు నాతో చదరంగం ఆడి గెలవగలడా? ఇతడ్ని చూస్తే జాలివేస్తోంది. కారణం తెలీడం లేదు. వీడోడిపోతే చంపించడానికి చేతులురావడం లేదు" అనుకుంటూ, ఒక చీటీ రాసి సఖిచేత పంపించింది.

"బ్రాహ్మణ యువకుడా! నీరూపం ఎంతో దర్శనీయం. చూసేకొద్దీ వేడుక అవుతోంది. నాతో చదరంగపుఎత్తులు సామాన్యమైనవికావు. నీ మీద జాలికలుగుతోంది. ఆట ప్రారంభంకాలేదు కనుక – ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నా శపథం దారుణమైందని నీవెరిగిననదే! ఒడంబడిక అయిపోయిందని విచారించకు. దాన్ని రద్దు చేయగల అధికారం నాదే! ఇకనైనా వెనక్కు వెళ్తానంటే, నేను సంతోషంగా అంగీకరించగలను. సందేహించకు" అని ఉన్నదా పత్రికలో.

అది చదువుకొని, చిర్నవ్వుతో కళావంతుడిలా రాశాడు .... "తరుణీ! దయాదాక్షిణ్యాలు జన్మతః కలగ వలసిన లక్షణాలు. అవి మధ్యలో ఊరకరావు –పోవు. నీ హృదయంలో కనికరం లేదన్నది స్పష్టం! ఉన్నదానివే

అయితే, ఇలాంటి వ్రతం చేపట్టవు. నిపుణురాలు ఎప్పుడూ ఇలా అనదు. చాల్చాలు! నీవు నన్ను చూసి జాలిపడక్కర్లేదు! నువ్వు గెల్చిన పిమ్మట కదా! నీవి మూడాటలు వరసగా త్రోసిరాజు అనకపోతానా? అప్పుడు విడవవచ్చు!" అని అపారమైన ఆత్మ విశ్వాసంతో ఉంది అందులో.

ఆ ధైర్యానికి ఆశ్చర్యపోతూ, అతడికి అభిముఖంగా రత్న పీఠం మీదకి వెళ్లి కూర్చుంది కౌముది. సఖులు వచ్చి చదరంగపు బల్లపరిచి, మణిమయమైన చదరం బలగాన్ని ప్రవేశ పెట్టారాబల్ల మీద. చుట్టూ కూర్చొని వాళ్లంతా కుతూహలంగా ఆట చూడసాగారు.

అవలీలగా మూడు ఆటలను గెలిచి కళావంతుడు విజేతగా నిలువగా, ఓడినందుకు చిన్నబోయిన ముఖంతో 'ఇతడు ఈ ఆటలో మాత్రమే ఎక్కువగా కృషిచేసినట్లు కనిపిస్తోంది' అనుకుంది కౌముది ఆమె ఊహ సరికాదనిపిస్తూ ఇతర విద్యల్లోనూ తన ప్రతిభ చూపాడతడు. నిర్ణీత పారితోషికం పంపబడుతుందని చెప్పిలేచి వెళ్లిపోయింది.

రాజ సభలో అందరూ అతడ్ని ప్రశంసించేవారే! "నాయనా! నీవల్ల నాకు చాలాకీర్తి కలిగింది. నేను ధన్యుణ్ణి అయాను" అంటూ సదాచారి మహదానంద పడ్డాడు. తదుపరి బహుమానం అందుకొని, కళావంతునితో కలసి తిరిగి సత్రానికి వచ్చేశాడు సదాచారి.

అప్పటికే - కళావంతుడే విజేత అన్నవార్త పట్టణమంతా ప్రాకినందున, అందరూ సత్రానికి వచ్చిన కళావంతుని చుట్టూ మూగి, ఆ బాలకుని చాలా ప్రశంసించి "ఇంత చిన్నవాడు, అంతటి చదరంగపు ప్రజ్ఞాశాలిని ఓడించాడా? ఎంత వింత? ఎంత బుద్ధిచాతుర్యం? ఏమి పాటవం?" అంటూ ఒకటే స్తోత్రాలు చేయసాగారు.

అప్పుడక్కడ చేరిన హరిశర్మ అనే బ్రాహ్మణుడు "విప్రులారా! మీరీ బాలుడు, కౌముదిని చదరంగంలో గెలిచినందుకే ఇంతాశ్చర్యపోతున్నారు. ఇతడికంటె కేవలం రెండు మూడేళ్లు మాత్రం పెద్ద వాడైన విష్ణుగుప్తుని కొడుకు దేవగుప్తుడున్నాడు. అతడీ మధ్య కృష్ణదేవరాయల ఆస్థాన పండితులతో ప్రసంగించాడంటే, అతని విద్యాపాటవం ఎంత ప్రశంసించాల్సిందో కదా! ఆ వృత్తాంతం చెప్తాను - వినండి!......

దేవగుప్తుని కథ

పాండ్యదేశ ప్రభువైన మలయధ్వజుడు పండిత ప్రియుడని-లోకానికి తెలిసిందే! ఈ మధ్య రాయల వారి ఆస్థానకవులైన పెద్దనాదులు రామలింగకవితో కూడా దిగ్విజయ పాండిత్యయాత్ర చేస్తూ, పాండ్యరాజధాని మధురాపురికి విచ్చేశారు.

రాజు వారితో ప్రసంగించడానికి, విష్ణుగుప్తుడనే తన ఆస్థాన పండితునికి ఆ వార్త తెలియచేశాడు. అతడు పదహారేళ్ల ప్రాయంగల తన పుత్రుని - యువకుడైన దేవగుప్తుడనే వాడిని పంపించాడు. పల్లకీ ఎక్కి ఆ విప్రకుమారుడొచ్చినాడు. అతడంతకు ముందెన్నడూ ఇల్లుకదలి వచ్చినవాడు కాడట! పండితులతో ఢీకొనడం కూడా అతడికదే ప్రధమమట! అట్టి వాడు ప్రతివాదిగా దిగ్గజాలకు ఎదుట ఒక పీఠం మీద కూర్చున్నాడు. తనతో వాదించదలచిన వారిని గురించి అడగ్గా, ఒక శిష్యుడు లేచి అష్టదిగ్గజాలనిలా పరిచయం చేశాడా సభలో

సీ. రామలింగ కవీంద్ర ం రాజరత్న మితండి
తండాంధ్ర కవియ పింతామహుండు
పెద్దనామాత్యుండుంముద్దుపల్కుల ముక్కు
తిమ్మన కవి యీ సుధీ వరుండు
అయ్యలరాజ వంంశాబ్ధి సోముడు రామ
భద్రుండు కవితా సంముద్రుడితడు
మల్లన కవిరాజుంతల్లజుండతడు ధూ
ర్జటి పాదరతుడు ధూంర్జటియతడు

గీ. సకల రాజాధిరాజ సంంస్థాన కలిత
భూరిత కీర్తి పింగళంసూరి యాత
డాశు కవితా దురంధరుండతడు రామ
రాజ భూషణ కవిరాజుంరాజ మౌళి.

దేవగుప్తుని కథ

దేవగుప్తుడు అలా చెప్పగానే, నవ్వుతూ వసుంధరుడు "ఓహో! వీరా? తెలిసింది. తెలిసింది. వీరిని దిగ్గజాలంటారు. వీరి చరిత్రలు లింతకుముందే నాకు తెలుసు" అని ఎకసెక్కెంగా పలికాడు.

పాండ్యరాజు మందలించబోగా, "రాజా! వీరు మందారవల్లి అనే మహావిద్వాంసురాలితో ప్రసంగించిన వైనం గమనించి ఉంటే, వీరుగురించి మీరేమీ ఆందోళన చెంది ఉండేవారుకాదు. వీరప్రజ్ఞా పాటవాలు ఏపాటివన్నది. అప్పుడే తెలిసిపోయింది"– అన్నాడు.

'ఆ రహస్యం ఇతడికెలా తెలిసిందో' అని దిగ్గజాలు సిగ్గు - ఆశ్చర్యాలు ప్రకటించారు. కాని అతనికి జవాబు చెప్పడానికి సాహసించలేకపోయారు.

"పెద్దనగారూ! తాము అరవయ్యేళ్లవారు. ఒక్క 'మనుచరిత్ర' తప్ప తమరేం రాసినట్టులేదు. అంటే ఏడాదికో పది పద్యాలా? ఇక - రాజశేఖర చరిత్రమనే చిన్న గ్రంథం రాసిన మల్లనకూడా దిగ్గజమే కాబోలు" ఇలా సాగిందా హేళన ధోరణి.

"రామలింగ కవి గారూ! మందార వల్లిని తాము జయించిన రీతి మేమెరుగుదుము, మీరు పూజ్యులు! దేవనాగరలిపి కాదని మరేదో నాగరలిపి అన్నారు. ఆ భాషాగ్రంథాలు మీతో ఏమన్నా తీసుకొచ్చారా? నాకా భాషవచ్చు! మీ గ్రంథాల్లో పద్యానికి నూరేసి తప్పులు పట్టగలను. ఏ శాస్త్రంలో వాదిస్తారు? సిద్ధాంతమా? పూర్వపక్షమా? ఎంపిక కూడా మీకే వదిలేస్తున్నాను" అనేసరికి – సింహధ్వని విని మదగజాలు బిక్కచచ్చిపోయినట్లుగా పండిత దిగ్గజాలు పెదవైనా కదపక చూడసాగారు.

అప్పటికి కాలాన్ని ముగిస్తున్నట్లు ఘంటారావం వినిపించడంతో రామలింగకవి లేచి "సభ్యులారా! నేటికి వేళమించింది గనుక, ఈతని ప్రశ్నలకు రేపు ప్రత్యుత్తరం ఇవ్వబడుతుంది" అంటూ ముగించాడా సభను.

మర్నాడు ఆ దిగ్గజాల జాడైనాలేదు. కాని ఒక పత్రిక ఆ రాజుగారికి చేరింది. అందులో "పాండ్యరాజా! మీ ఆస్థాన పండితులకు ఇటువంటి ఉద్దండ పిండంలాంటి కొడుకున్నాడని మేము ఎరుగం! మేము నిజమైన దిగ్గజాలముకాము. అతడు మాకు జ్ఞాతి అవుతాడు కనుక. అతడినిలా

బెదిరిద్దామనుకున్నాం. దేవగుప్తునితో మేము ప్రసంగించడం వట్టిది. అది కట్టిపెడుతున్నాం" అని మాత్రం ఉంది.

దీనితో సభులందరూ దేవగుప్తుని గొప్పదనాన్ని శ్లాఘించారు.

అయితే పాండ్యరాజు అంతటితో ఈ ఘటనను వదిలిపెట్టలేదు. ఆయన శ్రీకృష్ణదేవరాయలకు ఒక లేఖ రాయించి పంపాడు. అందులో "కృష్ణదేవరాయా! దిగ్గజాలుగా ఖ్యాతి పొందిన మీ ఆస్థానకవి పండితులిటీవల మా నగరానికొచ్చి, మా ఆస్థాన కవి విష్ణుగుప్త పుత్రులైన దేవ గుప్తునితో ప్రసంగించలేక, ఓడి, పారిపోయారు. వారి లేఖను దీనితో జతపరచుచున్నాను. ఇందులో నిజానిజాలు తెలియడంలేదు. ఏది ఏమైనా ఇప్పుడు ఈ బాల పండితునితో ఏ శాస్త్రంలో అయినా గెలిచిన వారిని మూడు గ్రామాలు పారితోషికంగా ఇవ్వగలను. తాము నిజమైన పండితుల్ని సత్వరమే పంపగలరు" అని ఉంది.

అప్పుడు నేను అక్కడ ఉన్నాను గనుక, ఆ విశేషాలు చూశాను" అని ముగించాడు హరిశర్మ.

సత్రంలోని బ్రాహ్మణులంతా కుతూహలంగా "అయితే - తరువాత రాయలవారి ఆస్థానం నుంచి పండితులెవరైనా వచ్చారా?" అని అడిగితే "ఆ తర్వాతేం జరిగిందో నాకు తెలీదు. నేనక్కడలేను" అన్నాడు హరిశర్మ.

ఇదంతా కళావంతుడు, సదాచారి వింటున్నారు.

కౌముదిని గెల్చినట్లే, దేవగుప్తుని కూడా కళావతి గెలిస్తే తనకి మూడు గ్రామాలు లాభిస్తాయని ఆశపడి సదాచారి ఆమెను అదే వేషంలో మధురానగరానికి తీసుకువెళ్లాడు. అక్కడ కళావంతుడు - తాను దేవగుప్తుని ఓడించడానికి వచ్చిన పండితుడినని చెప్పగా, పాండ్యరాజు విష్ణు గుప్తుని వద్దకు పంపాడు.

"అయ్యో! దేవగుప్తుడు గ్రామాంతరం వెళ్లాడే! ఇప్పుడెలా! సరే - విడిదిలో బసచేయండి! పదిరోజుల్లో అతడ్ని నేనే తీసుకొస్తాను" అని విష్ణుగుప్తుడే బయలుదేరి, కుముద్వతీ నగరానికి వెళ్లాడు. అక్కడ ఒక గృహస్తుడ్ని కలసి "అయ్యా! దేవగుప్తుడు అనే బ్రాహ్మణకుమారుడు ఈ పట్నానికి వచ్చాడా?" అంటూ అడిగి, అతడి గుర్తులు చెప్పేసరికి "అతడిరాక సంగతి తెలీదుగాని, మొన్నరాజపుత్రి కౌముదిని మాత్రం బ్రతికించింది అతడే" అంటూ ఆ కథ వివరించాడు.

మదపుటేనుగు కథ

మా రాజుగారికి లేకలేక ఒక్కర్తే కూతురు జన్మించింది. ఆమె పేరు కౌముది. మొన్న ఉదయం పల్లకి ఎక్కి ఉద్యానవనంలో విహరిస్తుంటే, మదమెక్కిన పట్టపుటేనుగు కట్టు గొలుసులు తెంచుకుని, పిచ్చెక్కినట్లు మావటిని చంపి, చెట్లు పడద్రోస్తూ ప్రజలను భయభ్రాంతుల్ని చేయసాగింది. అది అలా రావడం చూసి 'రాజకుమార్తె పల్లకీని మోసేవాళ్లు' పట్టణం వైపు పరుగులు తీశారు. అయినప్పటికీ గజబలం ముందు ఆ బోయీలు ఆగగలరా? ఏనుగు వారికి దగ్గరగా వచ్చేయడంతో చటుక్కున పల్లకీని అలాగే దించేసి, ప్రాణరక్షణకోసం వాళ్లు తలో దిక్కు పరుగెత్తారు.

ఏనుగు ఆ పల్లకీని వదల్లేదు. తల్లక్రిందులు చేసేసరికి, రాకుమార్తె నేల మీదికి దూకి పరుగెత్తింది. అది అమ్మాయి కౌముది వైపు వెళ్తూంటే "అయిపోయిందిక - రాకుమార్తె మనకి లేదు" అంటూ అరిచేవారే అంతా. అంతేగాని ఒక్కరూ ప్రాణాలకూ తెగించి అడ్డుపడలేకపోయారు. అంతలో ఎక్కడ్నుంచి వచ్చాడోగాని, పదహారేళ్ల పడుచువాడు పేరు - దేవగుప్తుడనే జ్ఞాపకం... విప్రకుమారుడేనట! కాని చాలా వేగంగా అక్కడికొచ్చాడు. ఎడం చేత్తో కౌముదిని పట్టుకుని, కుడిచేత్తో ఏనుగుతొండాన్ని అదిమిపట్టి నిలువరించాడు.

ఎంత చిత్రం!? అంత భీభత్సం సృష్టించిన మదపుటేనుగు మంత్రించిన దానిలా నిలబడిపోయింది. రాజకుమార్తె భయంతో అతడ్ని కౌగిలించుకొని వొణికిపోతోంది. అప్పుడా విప్రకుమారుడు "భయపడకు! దీని మీద కూర్చో! నేనూ వస్తాను. మీ ఇంటికి చేరుస్తాను" అన్నాడు కాని, ఆమెకు ఏనుగెక్కడానికి ధైర్యం చాలింది కాదు. అప్పుడా యువకిశోరుడు ఒక చేత్తో తొండాన్ని పట్టుకుని, ఇంకో చేత్తో కౌముది పొదివి పట్టుకుని ఆమెను నడిపించసాగాడు.

మదగజాన్ని అదుపుచెయ్యమని రాజు వందలాది భటులను, పంపగా, అక్కడకు చేరుకున్న వారికి ప్రశాంతంగా ఏనుగుతోపాటు నడుస్తున్న

వాళ్లిద్దరూ కనిపించేసరికి, 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు. భటులను పంపినా, కూతురికోసం ఆందోళనగా రాజు కూడా అక్కడకు చేరుకుని, ఆ విప్రకుమారుని వల్లనే తన కూతురు రక్షించబడిందని విని, అతడ్ని "భగవంతుడిలా వచ్చి కాపాడావు" అంటూ స్తుతించాడు.

కౌముదిని రథంమీద అంతఃపురానికి పంపించి, ఏనుగును గొలుసుల్తో బంధించమని మావటి వాళ్లకు చెప్పి, ఆ విప్రకుమారుడ్ని ఘనంగా పల్లకిలో ఊరేగించాడు. అతడికొక విహారసౌధాన్ని, సేవకు చాలా మంది పరిచారికలను ఇచ్చాడు" అని చెప్పాడా గృహస్థు.

అదంతా విన్న విష్ణుగుప్తుడు, ఆ విహార సౌధానికి వెళ్లి విచారించగా, "అయ్యా! నిన్నటివరకూ వారు ఇక్కడే వున్నారు. మా రాజకుమార్తెకు కౌముదిని చదరంగంలో ఓడించిన కళావంతుడు, మలయధ్వజుడనే పాండ్యరాజు ఆస్థాన విద్యాంసులవారి పుత్రుని ప్రతిభని ఆతనితో వాదించడానికి వెళ్లాడని తెలిసి, దేవగుప్తులవారు కూడా బయలుదేరారు".. అని విన్నవించారు.

విష్ణుగుప్తుడు తనలో "అయితే, అబ్బాయి ఈసరికి అక్కడికి చేరుకుని ఉంటాడు. నేనిటురాగా - వాడు వెళ్లాడన్నమాట! బాగానే ఉందీ దాగుడుమూతలాట" అనుకుంటూ తిరిగి తన రాజ్యానికి వెళ్లేసరికి, అప్పటికి ఓరోజు ముందుగానే వారిద్దరూ (కళావంతుడు దేవగుప్తుడు) హోరాహోరీ పండిత సభలో వాదోపవాదాలు చేశారని గెలుపు తన పుత్రునిదే అయిందని తెలిసి సంతోషించాడు. 'కళావంతుడు నిరంతరం దేవగుప్తునే అంటి పెట్టుకు తిరిగాడని - ఇద్దరూ కుశలవుల్లా అన్పించారని' తెలిసినవాళ్లు చెప్పగా విష్ణుగుప్తుడు మహదానందంతో వేగంగా తన ఇల్లు చేరుకున్నాడు.

అంతవరకు కథ చెప్పిన మణిసిద్ధుడు, అనంతరగాథని ఆ తరువాత మజిలీలో ఇలా చెప్పసాగాడు....

కాశీ మజిలీ కథలు

47 వ మజిలీ

కౌముది కథ

గోపా! వినుము....

ఇలా ఉండగా – ఒకనాడు కుముద్వంతుని కూతురైన కౌముది తన అంతఃపుర సఖులతో ముచ్చటిస్తూ, కళావంతునికి ఉత్తరం ఇచ్చావా అంటూ ఒక చెలికత్తెను అడిగింది. ఆమె ఇచ్చాననగా, ఇంకొక సఖి "ఓహో! కళావంతుని ప్రేమించావు కాబోలు! అందుకే ఆటలో ఓడిపోయావు" అని మేలమాడింది. "తన కంటె చిన్నవాడు కాడా? నీకు బుద్ధుందా? చాల్లే పరిహాసాలు" అంది ఇంకో చెలికత్తె ఆమె వేళాకోళాన్ని ఖండిస్తూ,

"అయితే?! సీత రాముడికంటే పెద్దది కాదా?" అంది కౌముది తన మనోరథాన్ని చూచాయగా చెప్తూన్నట్లు.

"అయితే?... కాదు! నీ ఊహకు అడ్డుపడే వదంతి నాకు చెవులపడింది. నిన్నా ఏనుగుబారి నుంచి తప్పించిన విప్రకుమారునితో నీకు పెళ్లి జరిపించాలనుకుంటున్నారట" మొదటి సఖి అన్నది.

"చాల్చాల్లే! బ్రాహ్మణులకు ఏ భూములో, మాన్యాల్లో అగ్రహారాలో ఇస్తారుగాని, అంత మాత్రానికే నన్నిచ్చి పెళ్లి చేసేస్తారా?" అంది కౌముది.

"పోనీ! కళావంతునిలో ఏం చూసి వరించావో చెప్పు!" ఇంకోసఖి ప్రశ్నించింది.

"అతడి విద్య – రూపం ఇవి చాలవా?" కౌముది ప్రశ్న అది.

ఇంతలో అక్కడికి ఇంకో చెలికత్తె రాగా, మొదటి సఖితో ఆమె సంభాషణ మొదలెట్టింది.

"కళావంతుడు చక్కనివాడా? దేవగుప్తుడా?"

"కళావంతుడు రూపంలో ఎన్నదగిన వాడేగాని, కొంచెం స్త్రీ పోలికలున్నాయి. నడకలో ఏదో వయ్యారం ఉంది. కాని – దేవగుప్తుడంటావా? పురుషసింహమే! ఏం ఠీవి? ఏం దర్పం?

"కాని మన రాజపుత్రి కౌముదీ దేవిగారు, కళావంతునే పెళ్లాడతానంటూన్నది"

"అదేమిటే – ప్రభువులవారు దేవగుప్తునికి పెళ్లి శుభలేఖల నిమిత్తం వార్త కూడా పంపేశారు"

అది విని కౌముది అదిరిపడింది.

"ఏమిటే? మా తండ్రి ఏకంగా, నాతో మాట మాత్రమైనా చెప్పక పెళ్లి ప్రయత్నాలే చేసేస్తున్నారా? మీరిందరుండి ఏం లాభం!? దేవ గుప్తుడొచ్చేలోగానే, అంతకు ముందుగా కళావంతుడు ఇక్కడి కొచ్చేలా చూడండే! మీకు పుణ్యముంటుంది. నేను మా తండ్రిగార్ని ఏదోలా చేసి ఒప్పిస్తాను" ఆశ్చర్యానందాలతో అంది కౌముది.

"కళావంతుడి తండ్రి ఎలాగైనా ఇక్కడికి రావలసినవాడే! మనం ప్రకటించిన బహుమతి పుచ్చుకోవడానికి రావాలిగదా!" అంది ఒక సఖి.

"అలాక్కాదు. ప్రత్యేకంగా ఈ విషయమే వివరిస్తూ తెలియ జేశారంటే, తప్పక వస్తారు" అంది కౌముది. సఖురాళ్లు తలూపి వెళ్లారు.

రెండ్రోజుల్లో - ఇటు రాజుగారు దేవదత్తునికి పంపిన శుభవర్తమానం, అటు కళావంతునికి కౌముది తన మనోరథాన్ని తెలుపుతూ రాయించిన ఉత్తరం చెరోభటుడు ఒకేవేళకు తీసుకొచ్చి కళావంత-దేవగుప్తులు ఒకచోట ఉండగా అందజేశారు. ఇద్దరూ ఎవరికి ఏ సమాచారం అందిందో, అది చదువుకున్నా - ఉత్తరాలు మార్చుకొని చదివి నవ్వుకున్నారు. అప్పుడు దేవగుప్తుడు "ఒకరి ఉద్దేశం ఇంకొకరికి తేలీక ఇలా రాశారనుకుంటాను. ముందుగా కన్యచేత వరించబడిన వాడివి నువ్వు. నీకే బలం ఎక్కువ ఉంటుంది. వేగంగా వెళ్లి ఆమెని పెళ్లాడు" అని చెప్పాడు.

"అది కాదు! 'కన్యాదానం' అన్నారు. అంటే దానంగా ఇవ్వబడేది ఏదైతే ఉంటుందో ఆమె మీద కన్యాదాతకే అధికారం ఉంటుంది. ఆ ప్రకారం నువ్వు రాజుగారికి - అంటే కన్యాదాతకు ఇష్టుడవైనందున నువ్వే ఆమెను వివాహం చేసుకోవాలి" అన్నాడు కళావంతుడు.

న్యాయాన్యాయాలు విచారిస్తూ వారిద్దరూ తర్కవితర్కాలు చేస్తూండగా విచారపు మొహం పెట్టుకొని అక్కడకొచ్చాడు సదాచారి. అతడితో మాట్లాడ్డానికి పక్కకెళ్లాడు కళావంతుడు.

"చేతికి దొరికిన సొమ్ముని వదిలి, పేరాశ కొద్దీ కష్టాలు పడుతూన్నాను. నీకు గుర్తుందా? ఆ వేళ మనం కౌముదిని గెలిచాక సత్రంలో హరిశర్మ ఊరించేసరికి దేవగుప్తుని గెలవాలన్న ఆకాంక్షతో మనం వెంటనే బయల్దేరిపోయాం! రాజుగారు పంపిన మాడలు, మనం సత్రంలో లేకపోయేసరికి, అవి తిరిగి వెనక్కు వెళ్లిపోయాయట! నేను కౌముది చెలికత్తెను కలసి, ఆ సొమ్ము ఇప్పించమని అడిగితే - వారు నిన్ను తీసుకురమ్మంటున్నారు. నేను పెళ్లాం బిడ్డల్ని వదిలి ఎన్నాళ్లిలా తిరగను!?

స్వయంగా నువ్వే వచ్చి సొమ్మిప్పిస్తావా? లేక నా దారిన నేను పోవాలా?" అని బిగ్గరగా అరవసాగాడు సదాచారి.

"కాస్త మెల్లగా మాట్లాడు! నేనొచ్చి సొమ్మిప్పిస్తాలే!.... పద! ఇప్పుడే ప్రయాణ మవుతున్నా" అన్నాడు కళావంతుడు.

వారి సంభాషణ రేఖా మాత్రంగా విన్నాడు దేవగుప్తుడు.

"మనం జంటకవుల్లా ఇక్కడ అంటి పెట్టుకు తిరిగితే ఏంప్రయోజనం? మన మెలాగైనా కుముద్వతీ నగరానికి వెళ్లాలి. ఆ చమత్కార మేమిటో చూడాలి!" అనుకున్నారు ఇద్దరూ,

విష్ణుగుప్తుని కథ

మరునాడు విష్ణుగుప్తుడు పరుగెత్తుకొచ్చి "దేవగుప్తా! నువ్వు మా పాలిట దైవంలా నిలబడి, ఆపదలను తొలగిస్తున్నావు. నిన్ను నా పుత్రుడని చెప్పుకోవడంతో, మలయధ్వజుడు ఎప్పటికప్పుడు వర్తమానం పంపుతున్నాడు. ఏం చేయాలో తెలీడం లేదు. ఎన్ని సార్లు నిన్ను శ్రమపెట్టగలను! ఇదుగో! ఇది నిన్న వచ్చిన లేఖ" అంటూ పాండ్యప్రభువు పంపిన లేఖకు, జతపరచిన శ్రీకృష్ణ దేవరాయల పత్రిక కూడా ఉంది.

దేవదత్తుడు మొదట ఆ పత్రిక తీసి చదువుకున్నాడు. అందులో " మా పండితులీ మధ్య దిగ్విజయ యాత్రలకై దేశాటన వెళ్లిన మాట నిజమేగాని, మీ పట్నానికి వెళ్లలేదని చెప్తున్నారు. ఏదేమైనా మీ బాల పండితుని పాండిత్య ప్రకర్షచూడాలని మాకూ వేడుకగా ఉంది. తిరిగి - తిరిగి అలసి వచ్చిన మా పండితుల్ని ఇంత సత్వరమే మళ్లీ ప్రయాణం చెయ్యమని చెప్పలేకపోతున్నాను. మీరు అన్యధా భావించక మీ బాల పండితుడ్ని ఇక్కడికి

ఒక్కసారి పంపవలసిందిగా కోరుతూ, వారి రాకపోకల నిమిత్తం అయ్యే విత్తం సమర్పిస్తున్నాను. ఇట్లు కృష్ణదేవరాయలు" అని ఉంది.

దానికి జతగా"ఆస్థానపండితులు విష్ణుగుప్తులవారికి - పాండ్య రాజ్యాధీశులు మలయధ్వజుల ఆనతి - తాము, తమ పుత్రుని రాయలవారి వద్దకు పంపాలి గనుక, తక్షణం వారినిక్కడ ఉండేలా చూడండి" అని ఉన్నదొక లేఖ ఆ రెండూ చదివాక "మంచిది. నేను ఇప్పుడు కుముద్వతీ నగరానికి పండితులతో ప్రసంగిస్తానని చెప్పవలసింది. మలయధ్వజునికి నా మాటగా ఈ విషయం తెలిపితే చాలు!" అన్నాడు దేవగుప్తుడు.

ఆ మాటలు విన్న కళావంతుడు "నువ్వు విష్ణుగుప్తుడి కుమారునివి కావని తెలిసింది. మారువేషంలో ఎందుకు తిరుగుతూన్నావు? ఆ వృత్తాంతమేమిటో చెప్పు! నేను నీకు మిత్రుడినీ - శిష్యుడినీ - అన్నీ కనుక నిజం తెలుసుకునే అర్హత నాకుంది" అన్నాడు.

అప్పుడు దేవదత్తుడు నవ్వుతూ "మిత్రమా! నువ్వు సదాచారి కొడుకువు కావని నాకూ తెలిసింది. ముందు నీకథ చెప్పు! తరువాత నా కథ చెబుతాను" అన్నాడు.

"నువ్వు మందారవల్లి కొడుకువుకాదా? అవునంటే నా వృత్తాంతం సాంతం చెప్తాను" అన్నాడు కళావంతుడు నవ్వుతూ.

"నువ్వు కళావంతుడని పురుషవేషంలో తిరుగుతున్నా, నువ్వు స్త్రీవని నాకు తెలుసు! నువ్వు కళానిలయ కూతురివైతే, నేను మందారవల్లి కొడుకును కాకుండా ఎలా ఉంటాను? నీ కథంతా చెప్పు" అని కోరాడు దేవదత్తుడు.

"నువ్వు వసుంధరుడివి అని అప్పుడే అనుకున్నాలే! అందుకే నేను నిన్నాశ్రయించి తిరుగుతున్నాను. దైవం నా కోరిక తీర్చింది" అంటూ తాను

విష్ణు గుప్తుని కథ

అడవిలో పడింది మొదలు అంతవరకూ జరిగిన కథంతా చెప్పింది కళావంతుడిగా చెలామణీ అవుతూన్న కళావతి.

"నేను తుందిలుడనే కపటుడి చేత చిక్కినా, యక్షకన్యల వల్ల 'నువ్వు అడవిలో పడ్డ కళావతివే' అని తెలిసి, నిన్ను నాతో తిరగనిచ్చాను. నా వృత్తాంతం ఇదీ..." అంటూ తాను జడధారిని శిఖ ఖండించి వదిలి పెట్టినంతవరకు తన వృత్తాంతం వినిపించాడు వసుంధరుడు.

ఇక - ఆతర్వాత జరిగిన గాథ కూడా విను!....

దేవీ కటాక్షం వల్ల నేనా యక్షిణీ శైలం నుంచి, జనపదాల్లోకి వచ్చి, ఒకనాటి మధ్యాహ్నానికి మహేశ్వరాగ్రహారాన్ని చేరాను. అక్కడ విష్ణు గుప్తునికి అతిథిగా ఉన్నాను. ఒకరోజు దంపతులు దేనికో భోజనాలు మానేసి మరీ విచారంగా ఉండడంతో, వారెందుకు అలా ఉన్నారని ఒక సేవకుడిని అడిగాను. "ఈ విష్ణుగుప్తుడు పండితుడు. పాండ్యరాజు ఆస్థాన విద్వాంసుడు. కాని నిన్నరాయలవారి ఆస్థాన పండితులట - అష్టదిగ్గజాలట- వచ్చి నిండుసభలో సవాల్ విసిరారట! వారితో ప్రసంగించడానికి రమ్మని ఆ ప్రభువులవారు ఆజ్ఞ జారీ చేసినప్పట్నుంచీ, ఈయన ఇట్లా దిగులుతో భోజనం మానేసి మరీ విచారిస్తున్నాడు. అన్నిటికంటే ఆయన బాధ ఏమిటంటే-రాయలవారి పండితులతో విష్ణుగుప్తుడు ఓడిపోతే, ఇంతకాలం తన ఆస్థాన పండితుడిగా అగ్రహారాది సన్మానాలు అందుకుంటూన్న వీరి సొత్తునంతట్నీ పాండ్యరాజు తిరిగి లాక్కుంటానని షరతుపెట్టాడు. 'అటుచూడబోతే అష్టదిగ్గజకవులు. వారితో తలపడగలనా?' అని వీరి సంశయం" అని వివరించాడా సేవకుడు.

విష్ణు గుప్తుని కథ

విష్ణుగుప్తునికి ఆ అగ్రహారంలో మంచిపేరే ఉంది. అందువల్ల ఆయన్ని కాపాడుదామనుకున్నాను. అతని దగ్గరకు వెళ్లి "అయ్యా! రాయల వారి పండితులకు వెరచి భోజనం మానేస్తారా? లేవండి - భోంచేయండి! మీ బదులు నేను వెళ్లి వారిని పరాజితుల్ని చేయగలను. కాశీ విద్యాపీఠంలోనే సకల శాస్త్రాలు చదివి ఇప్పుడే వస్తున్నవాడిని! విద్వత్ ప్రసంగాలకోసం పరితపిస్తున్నాను. మీ అగ్రహారాలు చేజారకుండా నిలుపుతాను" అని నేను చెప్పేసరికి, ఆయనెంతో పొంగిపోయాడు.

అంతవరకు నన్ను ఒక అతిథిగానే చూసిన ఆ పండితుడు "నువ్వు చూస్తే బాలుడివి! ఆ ప్రౌఢ పండితులతో ప్రసంగించగలవా? వారు సామాన్యులనుకుంటున్నావా?" అన్నాడు.

"నాపేరు దేవగుప్తుడు. నా జన్మభూమి మలయాళ దేశంలోని ఒక కుగ్రామం. ఆ పండితుల సంగతి నాకు తెలుసు! నేను వారిని తప్పకుండా గెలవగలను. మీరు నిశ్చింతగా భోంచెయ్యండి" అన్నాను నేను.

"నువ్వు అంతటివాడివి లాగానే కనిపిస్తున్నావు. కాని-నీ విజయం వలన నాకు ప్రయోజనమేమిటి?" అన్నాడతడు.

"నేను మీ పుత్రుడినని చెప్పాననుకోండి! అప్పుడు నాకు లభించే ఖ్యాతి అంతా మీదే కదా!" అనేసరికి మరింత పొంగిపోయి నన్ను అసాధారణంగా పొగిడి, ఆనక సుష్టుగా భోంచేశాడు.

ఆ మరునాడు మలయధ్వజుడు పంపించిన పల్లకీ మీద ఎక్కి దర్పంగా పోయి, వారిని పరాజితులను చేశాను. ఆ కథంతా నీకు తెలిసిందే కదా!" అన్నాడు వసుంధరుడు.

కళావతీ వసుంధరుల కథ

"అయ్యా! నీ ఔదార్యం, దయాదాక్షిణ్యం, నీ సౌశీల్యం నిజంగా ప్రశంసించ తగినదే! సామ్రాజ్యాన్ని గవ్వగా ఎంచి, సన్యాసిని కరుణించి విడిచిపెట్టావు. పుత్రుడినని చెప్పుకొని విష్ణుగుప్తుని రక్షించావు. ఇంతకంటే నీ సద్గుణాలకు నిదర్శనాలేం కావాలి? కాని నాకొక్క సందేహం! ఆ మదపుటేనుగు ఎవరికీ లొంగనిది, నీవు పట్టుకొని ఆపేసరికి ఎలా లొంగింది?" అని అడిగింది కళావతి.

''అదా?! నేను అప్పుడు యక్షిణిని తలుచుకున్నాను. ఆపత్సమయాలలో తాను అండదండలుగా ఉంటానని వరమిచ్చిందికదా!" అని చెప్పాడు వసుంధరుడు. ఆమె పురుషవేషాన్ని పరికించిచూస్తూ.

"కళావతీ! నీ వేషం చాలా వింతగా ఉంది. అది చూసి ఆ కౌముది, తండ్రిమాటనైనా వినకుండా, నీకు నేరుగా ఉత్తరం రాసింది. త్వరగా వెళ్లి ఆమెని పెళ్లాడి –రా!" అని పరిహాసమాడాడు వసుంధరుడు. అందుకు కళావతి కూడా నవ్వేసింది.

"అది కాదు వసుంధరుడా! ఆమె ఏనుగు భయంచేత, నిన్ను తిన్నగా చూడలేదేమో అని నా అనుమానం! సరిగ్గా చూసి ఉన్నట్లయితే ఆమె నీకు తప్పక దాసోహమని ఉండేది" అంటూనే, కళావతి తన క్రీగంటిచూపుల్ని ఆ సుందరాకారుని మీదికి ప్రసరించింది. ఆమె మనస్సును గ్రహించిన వాడిలా, అతని హృదయంలో కూడ మదనుడు సందడి చేయసాగాడు. అయితే –సాటిలేని చక్కదనం, అన్ని విద్యల్లోను నేర్పరితనం, ఒకే చోట నివసించే అవకాశం ఉన్న యువతీయువకులు ఒకర్నొకరు వలచారంటే అందులో వింతేముంది?

కాని, తన హృదయంలో జనించిన మన్మథ భావాలను అతడు బయటకు తెలియనివ్వక "బాలా! మనం కుముద్వతీ నగరానికి ఇలాగే ఇదే వేషాలలో వెళదాం. మన అసలు చరిత్రలుగాని – అసలు రూపాలుగాని

వెల్లడి చేయకుండా, ఆ చంచలాక్షి ఎవర్ని వరిస్తుందో చూద్దాం! ఆ రాజు ఆమెను ఎవరికి ఇచ్చి పెళ్లి చేస్తాడో, ఏయే వింతలు జరుగుతాయో,వెళ్తేనే కాని తెలీదు కదా!" అనేసరికి కళావతి కూడ అంగీకరించింది.

సదాచారి వారి వెంట అనుసరించిరాగా, ఆ ఇద్దరూ కూడా కుముద్వతీ నగరాన్ని చేరుకుని, తమ రాకను దూతలచేత తెలిపారు. ఆ కుముద్వంతుడు ఆ వార్త విని, వారికి అత్యద్భుతమైన మేడలో విడిది ఏర్పాటు చేయించి, ఉపచారాల నిమిత్తం చాలా మంది పరిచారికల్ని నియమించాడు.

ఊరు చేరింది మొదలు కళావంతుని వేధిస్తూ "నా సొమ్ము ఎప్పుడు ఇప్పిస్తావు?" అంటూ సదాచారి అడుగుతూంటే, దేవదత్తుడు "తాతా! నువ్వెక్కడికి వెళ్తావు? నువ్వు రాజుతో వియ్యమంద వలసివుందిప్పుడు.నీ కుమారునికి రాజపుత్రిక కౌముదినిచ్చి వివాహం చేస్తారట! వస్తువులు అవీ పెట్టాలి. సొమ్మేమైనాదాచావా? తీసుకురా!" అని ఎదురుదాడి మొదలెట్టేసరికి, అతడు తేలు కుట్టిన దొంగలాగ అవతలకు జారుకున్నాడు.

ఆ రాత్రి వసుంధరుడు, కళావతి ఆ నగరంలో తిరుగుతూండగా పౌరుల మాటలు కొన్ని వాళ్ల చెవుల్లో పడ్డాయి.

"మిత్రమా! కౌముది విషయమేమి? ఆమె తనను చదరంగంలో జయించిన వాణ్ణి పెళ్లిచేసుకుంటానన్నదిట కదా!"

"ప్రకటనలో ఆ మాట ఎక్కడా లేదే! బహుమానం మాట మాత్రమే అందులో ఉంది"

"నిజమే! కాని, ఆమె అందులో ఆ మాట రాయించకున్నా, తన హృదయంలో అనుకున్నదట"

"అయితే, కళావంతుని ఆమె పెండ్లాడవచ్చుకదా!"

"కాని, ఈ మధ్య ఓ పట్టపుటేనుగు, ఆమెని మట్టగించబోగా ఓ వీరుడు విష్ణుదత్తుని పుత్రుడట.... అతడు రక్షించాడు. భయంతో ఆమె అతడ్ని కౌగలించు కున్నది కనుక - అతడే ఆమెకు న్యాయంగా భర్త".

"కాని, తాను వలచిన చిన్నవాడికి ఆమె ఉత్తరం రాసిందట కదా!"

"అందుకే కదా –రాజుగారు ధర్మసంకటంలో పడ్డారు. పండితులను పిలిచి సభ చేసింది దేనికీ? ధర్మశాస్త్ర ప్రకారం ఆ కన్యను ఎవరికి ఇచ్చి పెళ్లి చేయాలన్నది నిర్ణయించడానికే!"

"ఏం నిర్ణయించారు?"

"ఏదీ తేలనేలేదు. రెండు రకాల వాదాలు బయల్దేరాయి".

"కథ ఎక్కడున్నది అక్కడే ఉన్నదన్నమాట!"

"ఆ ! రాచకన్యలకు శాస్త్రం స్వయంవరాన్ని నిర్దేశించింది. కనుక తనకు నచ్చినవాడ్ని ఆమె పెళ్లాడవచ్చునని ఒక వర్గం అభిప్రాయం"

"బాగానే ఉంది. రెండో వర్గం వారేమన్నారు?"

"ప్రకటనలో ఆ విషయం ఎక్కడా ప్రస్తావించలేదు. కనుక ఆమెకు తండ్రి నిర్ణయించిన వాడే వరుడు కావడం శ్రేష్ఠం అన్నారు"

"నీకే అధికారమిస్తే నువ్వేం చెబుతావు?"

"ఆమె ఇద్దర్నీ పెళ్లాడేస్తే సరి!"

"బాగానే చెప్పావులే! అదీ నీకు అధికారమిచ్చినపుడు..."

ఆ సంవాదమంతా విని, వారిలో వారు నవ్వుకొంటూ, ఆరాత్రి బసలోకిపోయి నిద్రించారు.

మర్నాడుదయం రాజు సభ చేసి, ఇద్దర్నీ సభకు రప్పించి, వారిని ఉన్నతాసనాల మీద కూర్చోబెట్టి "మీరిద్దరూ పండితులు, బాగా తెలిసినవారు కౌముది విషయమే ఈ చర్చకు కారణము. మీకు తెలియని విషయం కాదు కనుక, మళ్లీ - మళ్లీ చెప్పను. మా పండితులు భిన్నాభిప్రాయాలు ప్రకటించారు. మీలో ఎవరికిచ్చి చేయాలో మీరే చెప్పండి" అని ఆ భారం వారిపైనే ఉంచాడు కుముద్వంతుడు.

"నాకే ఆ కన్యను ఇచ్చి పెళ్లి చెయ్యడం యుక్తమని నా అభిప్రాయం" అన్నాడు కళావంతుడు.

"ఏ విధంగా చూసినా, ఆ సుందరి నాకు దక్కవలసిందే! అన్ని విధాలా నేనే అర్హుడిని" అన్నాడు దేవదత్తుడు.

తిరిగి చేతులు జోడించారు- కుముద్వంతుడు.

"నరేంద్రా! ఇప్పటి రాజుల్లో చాలామంది పండితులనేగాక, అష్టదిగ్గజాలను ఆదరించి పోషిస్తూన్నవాడు శ్రీకృష్ణదేవరాయలు ఈ అంశాలన్నీ పత్రికలో రాసి ఆ రాజుకు పంపిస్తే, మేము కూడా అక్కడికి వెళ్లి మా వాదాలను వినిపించి వస్తాం! వాళ్లేది నిర్ధారిస్తే అది చేస్తాం! దానికి మేమిద్దరం ఒడబడుతున్నాం!" అనేసరికి, ఆ ప్రభువు సంతోషంతో ఆ వైనం అంతా రాయించి, ఆ ఉత్తరంతో కూడ ఆ ఇద్దర్నీ రాయలవారి ఆస్థానానికి పంపాడు.

శ్రీకృష్ణదేవరాయల సన్నిధిన దేవగుప్తునితో తమకు వాదం వచ్చిందనే వార్త, అష్టదిగ్గజాలను కలవరపరచింది. ఆ వాదసభను ఎలాగైనా తప్పించుకోవాలని, ఆ రాత్రి బాగా పొద్దుపోయాక అష్టదిగ్గజ పండితులందరూ గుమిగూడి దేవగుప్తుడున్న తోటలోని మేడవైపు వెళ్లసాగారు. అప్పుడప్పుడు మారువేషంలో సంచరించే అలవాటున్న శ్రీకృష్ణదేవరాయలు, వేరే వేషంతో ఆ పండితుల్ని అనుసరించసాగాడు.

పండితులు అందరూ తోటకు చేరుకుని, తమ రాక దేవదత్తునికి తెలిపారు రాయలు వారికంటె ముందే వెళ్లి ఒక కిటికీ వెనుక నక్కి కూర్చున్నాడు.

వసుంధరుడు, కళావతి దేవదత్త - కళావంతుని రూపాలతో మాట్లాడుకొన్న మాటలను బట్టి, వారెవ్వరో ప్రభువుకు ఆ క్షణమే తెలిసిపోయినా, తర్వాతేం, జరుగుతుందో చూడాలని అక్కడ్నించి కదల్లేదు.

ఇంతలో లోపలికి పండితులు రాగా, దేవదత్తుడు వారందరికీ

మర్యాదచేసి కూర్చోపెట్టాడు. వచ్చినపనేమిటో చెప్పమన్నాడు. "నీవు మాకు పుత్ర సమానుడవు కనుక, నిన్ను ఆశీర్వదిస్తున్నాం!" అన్నారు. సంతోషించాడతడు.

"నాయనా! నిన్నొక కోరిక కోరుదామని అడగవచ్చాం! అడగమంటావా?" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

"ఇప్పుడే మీరు దీవించి నన్ను పుత్రసమానుడన్నారు కదా!" అని చురక అంటించాడు - ఆ చురుకైన చిన్నవాడు.

"మేము చిరకాలంగా ఈ దివాణాన్ని ఆశ్రయించి, కాలక్షేపం చేస్తున్నాం! నువ్వు మంచి పరువంలో ఉన్న పండితుడివి. నీతో మేము ఓడిపోతే, మాకు భుక్తికే లోటు - చేటు దాపురిస్తాయి. కనుక రేపు వాద సభ జరగక, ఈ వివాద మింతటితో ముగించమని వేడుకోడానికే వచ్చాం! ఆ నాడు మలయధ్వజుని ఆస్థానానికి మేము వచ్చామా- లేదా అని కూడా ప్రశ్నించవద్దు! ఇదే మా విన్నపం" అన్నారు అందరూ.

అప్పటివరకూ ప్రచ్ఛన్నంగా అక్కడే నక్కి ఉన్న రాయలు తటాలున ఇవతలికొచ్చి, ఆ బాలుని కౌగలించుకుని సంతోషం పట్టలేక "ఓహో! పండితులంతా కట్టగట్టుకొని వచ్చింది ఇందుకన్నమాట! ఈ దేవదత్తుడెవరనుకుంటున్నారు? మన రామలింగకవి కుమారుడైన వసుంధరుడే!" అని రహస్య భేదనం చేసేశాడు.

అప్పుడా దిగ్గజకవుల్లోంచి, రామలింగడు బాగా కళ్ళు విప్పార్చి చూసి, ఆనందబాష్పాలు కారుస్తూ "నాయనా నీవేనా? మీ తల్లి నీకై చింతిస్తూ మంచం పట్టింది. ఉన్నట్టుండి నువ్వు ఎలా అంతర్ధానమైనావు? ఆ నాడే, పాండ్యరాజు వద్ద నిన్ను చూసి ముఖం పోలికలుండ వచ్చుననుకున్నానే కాని నువ్వే అనుకో లేకపోయాను" అన్నాడు.

అప్పుడు వసుంధరుడు అందర్నీ కూర్చోబెట్టి, ప్రారంభం నుంచీ ఆ క్షణం వరకూ జరిగిన కథ యావత్తూ చెప్పి, కళానిలయ చేసిన కుతంత్రం వల్ల ఆమె తన కుమార్తెనీ - తననూ ఎలా అందరికీ కాకుండా చేసిందో


వెల్లడించేశాడు. రాయలు పరమానందభరితుడై పుత్రికను చూసుకొని, వియోగదుఃఖాన్ని తీర్చుకునేలా కూతుర్ని శిరస్సున ముద్దిడి, కౌగలించుకున్నాడు.

ఆ వెంటనే ఆ ఇద్దరి పాణిగ్రహణానికీ ముహూర్తం నిర్ణయింపజేసి, పురవీధుల్లో చాటింపిచ్చి, కుముద్వంతునికీ వసుంధరుని వృత్తాంతం అంతా రహస్యంగా రాయించి పంపి, ఆతని పుత్రిక కౌముదిని కూడ వసుంధరునికిచ్చి వివాహం చేసేలా చూశాడు.

ఆ ప్రకారం రామలింగ కవి పుత్రుడు ఇద్దరు భార్యలతోను సుఖిస్తూ చాలాకాలం ఆ మహాసామ్రాజ్యాన్ని ఏలాడు.

"గోపా! ఈ కథ వల్ల ఎవరు విద్వాంసురాలో నీకు ఈ సరికే తెలిసి ఉంటుంది" అని కథ ముగించాడు.

తరువాత - వాడు కావడి ఎత్తుకొని నడుస్తూంటే, తదుపరి మజిలీ చేరుకున్నారా గోపకుడు - మణిసిద్ధుడూ



మంగళ మహాశ్రీ వృత్తము

స్వస్తియగుగాత బుధ జాతమున కెప్పుడు ప్రజావితతి భూపతతి ధర్మన్యస్తమతిఁ బ్రోవుత - ఘనంబుగ ఘనంబులు చితావసరమందు న సు వృష్టుల్ నిస్తులముగాగ విభునించుత ధరాస్థలి ఫలించుత సుమంగళ మహాశ్రీ విస్తృత గతిన్నభివృద్ధి మనుగాత సురభివ్రజము వత్సవములతోడన్.

గీ. హవ్య వాహన గుణ వారణాంబు జారి
సంఖ్య నొప్పారు వర శాలిశకమునందు
దనరు చుండ విరోధి కృ ద్వత్సరమున
దీని రచయించి ప్రకటించితిని ధరిత్రి.



కాశీ మజిలీ కథలు
12 భాగముల ప్రణాళిక

1వ భాగము	వరప్రసాదుల కథ
2వ భాగము	అదృష్టదీపుని కథ
3వ భాగము	మందారవల్లి కథ
4వ భాగము	విజయభాస్కరుని కథ
5వ భాగము	శంకరాచార్య కథ
	కాదంబరీ మహాశ్వేతల కథ
6వ భాగము	భోజుని కథ
7వ భాగము	విభీషణుని కథ
8వ భాగము	దత్తకాదుల కథ
	(సప్తమిత్ర చరిత్రము)
9వ భాగము	విక్రమార్కుని కథ
10వ భాగము	నారదుని కథ
11వ భాగము	ప్రహ్లాదుని కథ
12వ భాగము	పుండరీకుని కథ

కాశీ మజిలీ కథలు ఆంధ్రదేశాన్ని ఓ ఊపు ఊపుతున్న రోజుల్లోనే (20వ శతాబ్ది తొలినాళ్లలో) ఈ కథా పరంపరపై వచ్చిన ప్రశంసలూ ప్రముఖుల అభిప్రాయాలూ

(యథాతథంగా)

బ్రహ్మశ్రీ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారి అభిప్రాయము

నా సహాధ్యాయి మధిర సుబన్న దీక్షితకవి సర్వవిధముల ధన్యుడని వ్రాయుటకు మిగుల సంతసించుచున్నాను. అతడు నాతో మును మున్ను కొన్ని గ్రంధములు గౌతమీ మాహాత్మ్యములో నగునవి వ్రాసియుండియు, నిపుడు కాలానుసారముగా గథలు వ్రాయుటను బ్రారంభించినాడు. చిన్న తనములో నుబుసుపోకకు జెప్పుకొను కథలను బుచ్చుకొని **"కాశీమజిలీకథలు"** అను పేరుతో జమత్కరించి కథా సంవిధానముం జతపఱచి మొదటి భాగమచ్చొత్తించి ప్రకటించినాడు. అది ప్రజల మదుల నాకర్షించినది. ద్వితీయ తృతీయాది భాగములు వ్రాయుటకు బ్రోత్సాహము గలిగించినది. ఇప్పటికి పన్నెండు భాగములైనవి. నేనీ కథలను పూర్ణముగ జదువలేదు గాని యే భాగములోనో యొకటి రెండు కతలు మాత్రము చదివితిని. అది చదివినప్పుడు నాలో నాకే

పరమాశ్చర్యము గలిగినది. నా సహాధ్యాయి విషయము నేను జెప్పుట కొంతవరకు దగదేమోకాని పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయ కథకుంబోలె మనోహరత్వముం గలిగించినది. ఇట్లు నాబోట్లు వ్రాయుటకుంబూని కృత కృత్యులు గాలేరనియే నా నిశ్చయాభిప్రాయము. ఒక్కొక్క పురుషున కొక్కొక్క దానిలో బ్రావీణ్యము గలుగుననుట నిశ్చయము. వాని కథలు, ఉపకథలతో గూడి యొక పెద్ద గొలుసువలె మనోహరములై యుండును. ఆ కథలలో ననేక నీతులు, ధర్మములు, ఆచారములు, శృంగారాదిరసములు, ఆధ్యాత్మావబోధక ప్రదర్శనములెన్నో యుండును. ఇవి సర్వజనాదర పాత్రము లగుటయే నా చెప్పిన మాటలు సత్యము లనుటకు దార్కాణమగు చున్నవి. గద్యశైలియు సుబోధమై పండితపామర హృద్యంబగు చున్నయది. ఈ కథలు బృహత్కథాదులవలె జగద్విఖ్యాతి గాంచుగాకయని కోరుచున్నాను.

ఇట్లు,

శ్రీ పాద కృష్ణమూర్తిశాస్త్రి



బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారి అభిప్రాయము

కొలది దినములనాడు దయాపూర్వకముగ నొసంగిన కాశీమజిలీలు అను పేరుగల భవద్వి రచిత గ్రంథము నాకొసగుచు వీనిని జదివి యభిప్రాయమును దెలుప వలయునని సెలవిచ్చి యున్నారు. తదేకదృష్టితో దమ గ్రంథము నందలి కొన్ని కథలను జదివితిని. ఇవి కేవలము కథల వంటివేకాక వ్యాకరణాదిశాస్త్ర సాంప్రదాయము నందేమి యలంకారాదుల యందేమి మన ప్రాచీన కావ్యముల కించుకయు దీసిపోక పాఠకులకు మంచి సాహిత్యజ్ఞాన మలవఱుచుటకు గడుంగడు దగియున్నట్లు గ్రహింపగల్గితిని

ఇట్లు,

శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి

బ్రహ్మశ్రీ చెలికాని లచ్చారావుగారి అభిప్రాయము

బ్రహ్మశ్రీ పండిత మధిర సుబ్బన్న దీక్షిత కవిగారిచే రచియింపబడిన కాశీమజిలీ కథలు చదివి యానందించితిని. మృదుమధుర శైలిగలిగి నీతి బోధక ములగు పద్యములతో నొప్పుచు బండిత పామర జన మనోహరమైన తగు నీ కథల విషయమై యభిప్రాయ మీయ మేమనర్హులమయ్యు దత్కథా పఠన సంజాత హర్షాతిశయమే యిట్లు వ్రాయుటకు బ్రోత్సాహపరచినది.

ఈ కథలు తరువాత నెంత పనిలోనున్నను చివరవరకు చదివినంగాని విడువకపోవుటయే యిందలి రసాధిక్యము ప్రఖ్యాతమగుచున్నది. ఇందులకు లోకమే ప్రమాణము. వీని కథలని సామాన్యముగా దలంపరాదు. శంకరాచార్యాది మహాపురుషుల చరిత్రములిందు వర్ణింపబడుటచే నిదియొక పురాణా గాధా కోశమని చెప్పుట సమంజసము. ఈ కథ లాంధ్రభాషకు నూత్నభూషా విశేషములై యొప్పుచున్నవని రూఢిగా చెప్పుచున్నాను.

ఇట్లు,

కావ్యనిధి శ్రీచెలికాని లచ్చారావు

బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారి అభిప్రాయము

"కథావినోదమేయని మహర్షులు దాని జతుష్షష్టీ విద్యలలో బరిగణించి యనుశాసించి అభివృద్ధి పరచిరి. ఇట్టి కథావినోదము వినోదయాత్ర ఫలజనకముగా ధర్మాసాధనోపాయ మహత్తరం బగుట సర్వజనవేద్యమే.

కాశీమజిలీ కథా నిబంధనము సర్వజన చిత్తాకర్షకంబనుటకును సందియములేదు. దీనిలో రసభావ పుష్టియు గధాసంవిధాన కౌశల మట్లుండ జతుర్విధ పురుషార్థ కంబులగు మహాకవి వాఙ్మయములోని నవరత్నములు సాధారణ కథా కథనధోరణిలో వెదజల్లబడి యుండుటచే నివి పండితుల కును, గావ్యకర్తలకును గూడ బ్రతిభోన్మేషణ క్షమంబులని నిస్సంశయముగా జెప్పవచ్చును. ఇందు బారమార్థికులకు దప్ప సామాన్యులకు రుచింపని శంకరాచార్య చరిత్రము లతిరసవంతములుగా బరమార్థబోధకంబులుగ కథాధోరణిగా గూర్పబడినవి."

విశ్రాంతి చింతావినోదులకు జన్మజీవన తరణో పాయంబగు తీయనియౌషధంబువలె నుండు నీ గ్రంధరాజమెంత పెద్దదిగానున్నను విసుగులేక యుత్తరోత్తర సంపుటముల కెల్లరును వేచియుందురని నిస్సంశయముగా జెప్పవచ్చును.

ఇట్లు,

మానవల్లి రామకృష్ణ కవి

బ్రహ్మశ్రీ శ్రీమాన్ యమ్. కృష్ణమాచారిగారి అభిప్రాయము

"శ్రీమత్పండిత మధిర సుబ్బన్న దీక్షితుల వారిచే రచింపబడిన "కాశీ మజిలీకథ" లను పేర నొప్పు కథాసమూహ మింత కాంధ్ర దేశమంతయు జక్కగా నెఱింగినదే కావున నేను బ్రశంసింపవలసిన యావశ్యకత లేదు. ఆ గ్రంథముల కిడిన కేవలనామము సహితము మనకు బవిత్రమైన భావమును హృదయంబున నుత్పాదింప జేయుటయేకాక పూర్వకాలమున రాకపోకలకు మనకువలె సౌలభ్యములు లేకుండియు, గ్లేశపడియైన మన పెద్దలు కాలినడకతో పుణ్యపట్టణమైన కాశీని దర్శించి రాగలంత భక్తిశ్రద్ధలు వహించి యుండిరను నాశ్చర్యము గలిగించుచున్నవి జనసమూహముల నాహ్లాదింపజేయుటకు గధాకథనము మన హిందూదేశములో నతిప్రాచీన విద్యయే దానికి రెండువిధముల ప్రయోజనము గలదు. ఈ కథలు ధర్మపరాక్రమముల తత్త్వ ప్రభావముల నుపదేశించుటయేగాక అప్పటి దీర్ఘకాల మార్గాయాన సమయమును యాత్రిక సంక్లేశమును దొలగించుచుండును. మతవిషయమునను ఆధ్యాత్మిక విషయమునను విశ్వాసములేక శంకాలకంకితమగు నేటికాలమున స్వభాషలో సులభశైలితో వ్రాయబడిన యీ కథలు హిందూ దేశమున నాదియగు వేదశాస్త్ర పురాణాది విద్యా ప్రపంచము ననేదియేది శ్రేష్ఠమో శాశ్వత స్మరణీయమో దానినెల్ల దప్పక బునరుజ్జీవనము చేయుచున్నవి. ఇవి యువనయామినీ వినోదకథలలోని చమత్కృతి ప్రభావము చూపుచున్నను శబ్దరచనయందును, భావముల యందును అశ్లీలధ్మసాంకర్యాది దోషములు లేక భాసిల్లుచున్నవి కథలకిచ్చిన పేరును, సంవిధాన ధోరణియు సమస్త విషయ సంగ్రాహకమగుటచే యట్లే కొనసాగుచుండిన యెడల నిది తప్పక హిందూ పురాణ గాధాకోశమై సర్వవాఙ్మయమున కాదర్శమై యొప్పుననుట యసాధ్యముగాదు.

ఇట్లు,

బ్రహ్మ శ్రీ శ్రీమాన్ యమ్. కృష్ణమాచారి.





మీరు తీరని సమస్యలతో బాధ పడుతున్నారా?

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే

- వివాహం
- ఉద్యోగం
- ప్రమోషన్
- ఋణబాధలు
- చాలీ చాలని ఆదాయం
- విద్యలో వెనుకబాటు
- శత్రు భయం
- వ్యాధి పీడ
- సంతాన లేమి

..... ఒకటీ - రెండూ కూడా కాదు! అనంతంగా ఉన్న జాబితా ఇది.

★ సమస్యలు లేనివాళ్ళంటూ యెవరూ లేరు. ఏ విధమైన బాధా లేనట్టి వాళ్ళున్నారని చెప్తే నమ్మడాని కెవరూ సిద్ధంగా లేరు. ఇది ముమ్మాటికీ నిజం! ఎందుకంటే?

ఇది కలియుగం!
సమస్యల వలయం ఈ జగం!
దైవ సంకల్పిత సమస్యలు సగం
స్వయంగా సృష్టించుకున్నవి మిగతా సగం!

మరి - వీటికి నివారణోపాయాలు లేవా? ఉన్నాయ్?

శ్రీ ఎలిశెట్టి త్రిలోకనాథ్ అద్భుత సృష్టి

కలియుగ బాధలు - నివారణోపాయాలు

ఏడు అధ్యాయల అపురూప రెమిడీల అపూర్వ గ్రంథం

- అన్నీ నిరూపితమైన రెమెడీలే!
- తెలుగులో దీనికి సాటి రాగల నివారణోపాయాల గ్రంథం మరొకటి లేదు.
- జపాలూ - హోమాలూ చేయలేనివారికి సైతం, నిత్యం యింట్లో వాడే వస్తువులతోనే సులభసాధ్యములైన నివారణ ప్రక్రియలెన్నో వివరించబడినవి.

ఈ ప్రామాణిక గ్రంథాన్ని మీకు అందజేస్తున్నవారు ప్రచురణారంగంలో
80 ఏళ్ళ విశిష్ట చరిత్ర కలిగిన

పబ్లిషింగ్ రంగంలో & ఆధ్యాత్మిక పుస్తక రంగంలో తొలి ISO సర్టిఫికెట్ అందుకున్న మా "గొల్లపూడి" సంస్థ

ISO 9001 : 2015 Certificate No. Q9186414519

Scan this QR Code for APP

Download bhaktipustakalu App. for free From Play store

Visit : www.bhaktipustakalu.in

పబ్లిషింగ్ రంగంలో తొలి తెలుగు భక్తి పుస్తకాలు యాప్ మీ చేతిలో

చరవాణిలో ప్రాచీన గ్రంథాలు

like us : www.Facebook.com/bhaktipustakalu

Follow us : www.twitter.com/bhaktipustakalu

అంతర్జాలంలో (INTERNET) ఆధ్యాత్మిక గ్రంథాలు

Since 1926

గొల్లపూడి వీరాస్వామి సన్

కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533 101. ☎ 0883 - 2465253

e-mail : gollapudibooks1920@gmail.com